# చరకసంహిత - విమానస్థానము

(మూలము మరియు చక్రపాణి వ్యాఖ్యలకు తెలుగు అనువాదము)


డా॥ పి. హేమసాగర చంద్రమూర్తి, ఎమ్. డి. (ఆయు)

లెక్చరర్, డా॥ నోరి రామశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల,

విజయవాడ



ఆం.ప్ర. ఆయుర్వేదిక్ లిటరేచర్ ఇంప్రూవ్‌మెంట్ ట్రస్ట్

హైదరాబాద్

# ముందుమాట

దేశీయ వైద్యశాఖ అధ్వర్యంలో మూడు ఆయుర్వేద కళాశాలలు మరియు తిరుమల తిరుపతి దేవస్థానము అధ్వర్యంలో ఒక ఆయుర్వేద కళాశాల నడుపబడు చున్నవి. ఈ కళాశాలలన్నియు ఆరోగ్య విశ్వవిద్యాలయమునకు(యు. హెచ్.యస్.) అనుబంధము చేయబడియున్నది. ఈ కళాశాలలో సి.సి.ఐ.యమ్. న్యూ ఢిల్లీవారు సూచించిన పాఠ్యక్రమమును బోధించుచున్నారు. ఆ పాఠ్యక్రమములో చరకసంహిత ఒకటి. తెలుగులో చరకసంహిత ముద్రణ చాలా రోజులనుండి జరుగలేదు. ఇపుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమువారు రచయితలను ప్రోత్సహించి, వారికి పారితోషికము యిచ్చి తెలుగులో అనువాదము చేయించినారు. ఆ గ్రంథముల ముద్రణను ఆంధ్ర ప్రదేశ్ ఆయుర్వేద లిటరేచర్ ఇంప్రూవ్‌మెంటు ట్రస్టు చేపట్టినది. అట్టివాటిలో చరక సంహిత ఒకటి. అందులో 8 స్థానములను విడివిడిగా ముద్రణ గావించు చున్నాము.

ఈ గ్రంథమును అనువాదము చేసిన రచయిత డా. పి. హిమసాగర చంద్ర మూర్తిగారికి నా ధన్యవాదములు. నాతో సహకరించి, అతిత్వరలో ముద్రణకు తోడ్పడిన ఇతర ట్రస్టు మెంబర్లకు కూడా నా ధన్యవాదములు.

బి. ఆర్. ఆనందరెడ్డి

సంచాలకులు
భారతీయ వైద్యం మరియు హోమియోపతి శాఖ
ఆం. ప్ర. ప్రభుత్వం
చైర్మన్,
ఆయుర్వేదిక్ లిటరేచర్ ఇంప్రూవ్‌మెంటు ట్రస్టు.

హైద్రాబాదు,
తేది : 24-1-1992.

# ఉపోద్ఘాతము

సర్వజన హితమగునట్టి ఆయుర్వేదమును గ్రంథస్థము చేసిన చరక సుశ్రుత వాగ్భటాదులు మనకు పరమ పూజ్యులైనారు. వీరు రచించిన వాటిలో చరకసంహిత వైద్య లోకానికి అగ్రానుసరణీయమై శోభిల్లుతోందనడంలో అతిశయోక్తి లేదు. ఆయుర్వేదాన్నంతటినీ ప్రతిబింబించే చరకసంహితలో ఆయుర్వేదాన్ని సారరూపంగా మనకు ప్రసాదించేది విమానస్థానం. "చరకస్తు చికిత్సితే" అనే ఆర్యోక్తిని మనం గమనించినప్పటికీ విమానస్థానంలో చెప్పబడినట్లు రస ద్రవ్య దోష వికారాదుల విశేషజ్ఞానం విమానస్థానం ద్వారానే మనకు లభిస్తుంది. (విశేషేణ మీయతే, జ్ఞాయతే ఇతి విమానమ్). చికిత్స కొరకు ఎంతో ఉపయోగపడడం వలన, ఇట్టి విజ్ఞానాన్ని ప్రతి వైద్యుడూ తప్పక పొంది తీరవలసియుంటుంది.

విమానస్థానం మొత్తం ఎనిమిది అధ్యాయాలుగా విభజింపబడి ఉంది. మొదటి అధ్యాయం రసవిమానమని పేరు పెట్టబడింది. దీనిలో రసము- ద్రవ్యము, దోషము-వ్యాధి వీని పరస్పర సంబంధము అనేక రీతులలో వర్ణింపబడింది. వికృతి విషయ సమవాయ వర్ణన ఇచట చేయబడింది. చక్రపాణి తన వ్యాఖ్యలో వికృతి విషయ సమవాయ-ప్రకృతి సమ సమవాయాలను విశదపరచడం జరిగింది. ద్రవ్య ప్రభావాన్ని ఏ విధంగా అంచనా వేయాలో కూడా ఈ అధ్యాయంలో తెలుపబడింది. వాతపిత్త కఫాల్ని శమింపజేయడానికి తైల ఘృత మధులను క్రమంగా ప్రయోగించడానికి కారణం, వాటిలో ఉండే గుణాలతో సహా చెప్పబడింది. పిప్పళ్ళు, క్షారము, లవణములను అధికంగా సేవించడం వలన వచ్చే నష్టాల్ని పేర్కొనడం జరిగింది. వీటిని సాత్మ్యముగా సేవించేవారిని అసాత్మ్యత నుండి క్రమంగా తప్పించాలంటూ సాత్మ్య నిరుక్తి భేదములు కూడా ఇచట వర్ణింపబడ్డాయి. అటుపైన ఆహార విధియందు ఉపయోగపడు ఎనిమిది విశేషాయతనాలు వర్ణింపబడ్డవి. ఈ ఎనిమిదింటి యొక్క హితాహితరూపములు కూడా చెప్పబడినవి. ఇంకా ఆహార విధివిధానము స్పష్టంగా వర్ణింపబడింది. చివరగా వైద్యుడు తెలిసికోవలసిన ముఖ్యమైన అంశములను-రస-ద్రవ్య-దోష-వికారముల ప్రభావములకు దేశము-కాలము-శరీరములను వర్ణించడం జరిగింది. రెండవ అధ్యాయం త్రివిధకుక్షీయమని పేరు పెట్టబడింది. క్రిందటి అధ్యాయంలో చెప్పబడిన ఎనిమిది ఆహార విధి విశేషాయతనములలో ఒకటగు రాశిని వివరించుచూ కుక్షియందు మూడు అవకాశాంశములనేర్పరచి ఒకటి మూర్త ద్రవ్యములకు, రెండవది ద్రవద్రవ్యములకు, మూడవది ఖాళీగా నుంచుటకును నిర్దేశింపబడినవి. ఇందువలన కలుగు లాభము (సుఖముగా జీర్ణమగుట) వివరింపబడినది. ఆహారరాశి తగు మాత్రలో

నుండుట వలన కలుగు సత్ఫలితములు తగు మాత్రలో లేనందువలన కలుగు దుష్ఫలితములు ఆమదోషము యొక్క విసూచికా అలసిక భేదములు వాని లక్షణములు పేర్కొనబడినవి. చికిత్సకు సాధ్యపడు ఆమదోషమునందు చేయదగు చికిత్సలు చెప్పబడినవి.

మూడవ అధ్యాయము జనపదోద్ధ్వంసనీయ విమానమని పిలువబడుతుంది. ఆత్రేయ భగవానుడు తన శిష్యులగు అగ్నివేశాదులతో కలసి సంచరించిన ప్రదేశముల నామ నిర్దేశమిచ్చుట చేయబడినది. (పంచాలక్షేత్రే....) ఈ అధ్యాయమునందు ఔషధములను భూమ్యాదులు విరసీ భావము నొందకముందే గ్రహింపవలెనని నిర్దేశింపబడినది. చక్రపాణి తన వ్యాఖ్యయందు ఆత్రేయునికి గల ఆప్తత్వమును చక్కగా స్థాపించుట జరిగినది. జన పదోద్ధ్వంసములకు వాత జల దేశకాలములు కారణమని పేర్కొనుచూ వాని దుష్టికి కారణములు లక్షణములు వివరింపబడినవి. జనపదోద్ధంసములు వచ్చునపుడు చేయవలసిన చికిత్సలునూ ఇచట వివరింపబడినది. అధర్మము అన్ని వికృతులకునూ కారణమని చెప్పబడినది. ఆయుష్షు నియతముగానుండునా లేదా యను విమర్శ చేయబడినది. ఈ విషయమునందు చక్రపాణి తన విశదవ్యాఖ్యలో ఆత్రేయుని పక్షమును బలపరచుచూ నిది దైవము (పూర్వ జన్మ కర్మఫలము) పురుష ప్రయత్నము (ఈ జన్మయందలి కర్మ)ల బలాబలములపై ఆధారపడి యుండునని పేర్కొనుట జరిగినది. కాలాకాలమృత్యువులకు సంబంధించిన ఆత్రేయుని వివరణము ఉదాహరణల ద్వారా పొందుపరచబడినది. ఉష్ణజలము నివ్వదగిన సమయము ఇవ్వరాదని సమయములు వివరింపబడినవి అపతర్పణ చికిత్సా త్రైవిధ్యమగు లంఘనము, లంఘన పాచనము, దోషావసేచనములీ అధ్యాయమునందే వివరింపబడినవి. పై విషయములను దృష్టియందుంచు కొని అశుభ కర్మలను చేయుట నిషిద్ధమని నిర్దేశింపబడినది. త్రైవిధ్యమగు జాంగల, అనూప సాధారణము లిచ్చట స్పష్టముగా వర్ణింపబడినవి.

నాల్గవ అధ్యాయము త్రివిధరోగ విశేష విజ్ఞానీయమని పేరు పెట్టబడినది. ఇందు రోగ విశేషములను తెలిసికొను పాయములగు ఆప్తోపదేశ ప్రత్యక్ష అనుమానములు తెలుపబడినవి. వీని ద్వారా రోగియందు రోగమునందునూ తెలిసికొనవలసిన అంశములు పేర్కొనబడినవి.

ఐదవ అధ్యాయము నందు స్రోతస్సుల వివరణ ముఖ్యముగా నుండుటచే నిది స్రోతో విమానమని పేరు పెట్టబడినది. స్రోతో శబ్దమునకు అర్థము పర్యాయపదములు పేర్కొనబడినవి. స్రోతస్సుల సంఖ్య-పేర్లు వివరింపబడినవి. స్రోతావ

హృది పదమూడు స్రోతస్సుల మూలములు అవి దుష్టినొందినప్పుడు కలుగు లక్షణములు వాని చికిత్సలును ఇచట వివరించబడినవి. చక్రపాణి తన వ్యాఖ్య యందు స్రోతస్సుల ప్రాధాన్యతకు చక్కని వివరణము నిచ్చుట జరిగినది. సాధారణముగా అన్ని స్రోతస్సులకు కలుగు అతి ప్రవృత్తి, సంగము, సిరాగ్రంథి, విమార్గగమనము అను నాల్గు విధములైన దుష్టి లక్షణములు చెప్పబడినవి. రోగ సమూహములందలి వివిధ ప్రకారములను తెలుపుటకు రోగానీక మనునది ఆరవ అధ్యాయము పేర్కొనబడినది. ప్రభావ-బల-అధిష్ఠాన-నిమిత్త-ఆశయ భేదముల వలన రెండేసి భేదములుగా వ్యాధులు వర్గీకరించబడినవి. రోగములను వర్గీకరించుటకు ఇంకను ఆవశ్యకతను బట్టి అవకాశమున్నదని ఇచట చెప్పబడినది. రోగ ప్రకోపణమునకు కారణములగు అసాత్మ్యేంద్రియార్థాదులు కూడ సూత్రరూపముగా నిర్దేశించబడినవి. శారీర మానస రోగములకు గల పరస్పర అనుబంధము దోష ధాతువులకు గల అనుబంధము, వ్యాధుల అనుబంధత్వ, అనుబంధత్వములు వివరించబడినవి. ఈ అధ్యాయమునందే కాయాగ్ని భేదములు, వాని లక్షణములు చెప్పబడినవి. శారీరక ప్రకృతి వివరణ ఈ అధ్యాయమునందే చేయబడినది. దోషానుసారముగా రోగులు మూడు విధములు అని చెప్పి వారికి ప్రత్యేకముగా చేయదగు చికిత్సలు వివరముగా చెప్పబడినవి. చివరగా ఈ అధ్యాయము నందు ఆరోగ్యవంతుని కుండవలసిన లక్షణములు సూత్రప్రాయముగా చెప్పబడినవి.

వ్యాధిత రూపీయమను ఏడవ అధ్యాయము నందు గురువ్యాధితో బాధ పడుచున్నవారు, లఘువ్యాధితో బాధపడుచున్నవారు అను రెండు భేదములను పేర్కొని వారిని సరిగా గుర్తించక వ్యాధిబలమును అనగా గురువ్యాధితుని, లఘువ్యాధితునిగను, లఘువ్యాధితుని గురువ్యాధితునిగను గుర్తించి చికిత్స చేయుట వలన కలుగు నష్టములను పేర్కొనుట జరిగినది. ఈ అధ్యాయము నందు క్రిముల వర్గీకరణ వానియొక్క పుట్టుక ఆకృతి అవి ఉండు ప్రదేశము వానికి చేయవలసిన చికిత్సలు సవివరముగా చెప్పబడినవి. వ్యాధిని పూర్తిగా తెలిసికొనవలసిన ఆవశ్యకతను నగమే తెలిసికొనుట వలన కలుగు ముఖ్యలక్షణములు ఈ అధ్యాయము నందు పేర్కొనబడినవి. క్రిమిరోగ చికిత్సయందు చేయదగు చికిత్సా విధానము ఇతర రోగములందును అవలంబింపబడవచ్చుననియును తెలుపబడినది.

విమానస్థానములోని అన్ని అధ్యాయములకంటె పెద్దదగు రోగభిషగ్జితీయ విమానమను ఎనిమిదవ అధ్యాయము ఆయుర్వేదాధ్యయనము నందు అగ్రానుసరణీయము. ఇందు శాస్త్ర పరీక్ష, ఆచార్య పరీక్ష, అధ్యయన అధ్యాపన సంభాషా విధానము

శిష్యుడనుసరించవలసిన విధులు, తద్విద్య సంభాషా విధి, పరిషత్తు భేదములు, వాద మార్గములు, వైద్య లక్షణములు, కారణాది దశ భావములు, ప్రకృతి-వికృతి పరీక్షలు, సార - సంహనన పరీక్షలు, ప్రమాణ పరీక్ష, సాత్మ్య పరీక్ష, సత్త్వ పరీక్ష, ఆహార శక్తి-వ్యాయామశక్తి-వయస్సు వీని పరీక్షలు ఋతుచర్యా విధానములు మొదలగు వివరములన్నియూ పొందుపరచబడినవి. చివరన వమన విరేచన ఆస్థాపన ద్రవ్యములు మధురాది స్కంధములు వివరింపబడినవి.


ఈ విధముగా విమానస్థానము నందు ఆయుర్వేదమునకు సంబంధించిన అన్ని మౌలికమైన విషయములు క్షుణ్ణముగా చర్చించబడినవి. ఒక విధంగా ఆయుర్వేదాధ్యయనంలో ముందుగా విమానస్థానమును పూర్తిగా అధ్యయనం చేసిన తరువాతనే మిగిలిన శాస్త్రం చదవడం వల్ల శాస్త్రం చక్కగా బోధపడుతుందనుటలో సందేహం లేదు.

చరకసంహితను తెలుగులోకి అనువదించటం నల్లేరుపై బండినడక మాత్రం కాదు. ముఖ్యంగా చక్రపాణిని అనువదించడం చాలా కష్టసాధ్యమైన పని. ఇంతకు ముందు వచ్చిన అనువాద గ్రంథాలన్నింటినీ పరిశీలించి విద్యార్థులకు చక్కగా అవగతమయే విధంగా ఉండాలని సంకల్పించడం జరిగింది. ఈ ప్రయత్నంలో ఎంత వరకూ కృతకృత్యుడనయాననేది పాఠక లోకానికే తెలుస్తుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వపు భారతీయ వైద్యశాఖకు అప్పటి సంచాలకులు శ్రీ ఎన్. వి. హెచ్. శాస్త్రిగారి ప్రోత్సాహం వలననే ఈ పనిని చేపట్టడం జరిగింది. వారి కెప్పుడూ ఋణపడే ఉంటాను. ప్రస్తుతపు సంచాలకులు శ్రీ బి. అరవిందరెడ్డిగారు, అదనపు సంచాలకులు శ్రీ డా॥ పి. శేషిరెడ్డిగారు ఎప్పటికప్పుడు ఈ పనిని పర్యవేక్షిస్తూ త్వరగా పూర్తయేందుకు తోడ్పడినారు. వారికి నా హృదయ పూర్వక ధన్యవాదములు. ఈ పని ఎప్పటికప్పుడు చురుకుగా కొనసాగడానికీ, శాస్త్ర చర్చకూ, మానసిక ఉత్తేజానికీ తోడ్పడ్డ గురుతుల్యులు శ్రీ ఎమ్. వీరభద్రంగారు, నా అనుంగు మిత్రులు కె. నిష్టేశ్వర్, ఎమ్. ఎల్. నాయుడుగార్లకు నా కృతజ్ఞతలు. వ్రాతప్రతిని ఎంతో శ్రద్ధతో వ్రాసిన నా విద్యార్థి మిత్రుడు ఎస్. జోసాకు నా శుభాశీస్సులు. ఈ పనికి తగు సౌకర్యాలను కలుగజేసి నా నైతిక బలాన్ని పెంచిన నా కుటుంబ సభ్యులకు నా కృతజ్ఞతలు. ఈ పుస్తకం తయారవడానికి అచ్చు-ప్రకాశనం ఎంతో అవసరం. ఆ విషయంలో ఎంతో కృషి చేసిన శ్రీ జి. బాబూరావుగారు, శ్రీ డా॥ వై కృష్ణమనోహర్‌గార్కి నా ధన్యవాదములు.

ఎందరో మహానుభావులు అందరికీ వందనములు.

—పా. హిమసాగర చంద్రమూర్తి

# గ్రంథకర్త పరిచయం



పాపులూరి
హిమసాగర చంద్రమూర్తి

జననం : 1951 కూచిపూడి
కృష్ణాజిల్లా

స్వస్థలం : కమ్మున్నంగి, గుంటూరు జిల్లా

తల్లిదండ్రులు :

శ్రీమతి నాగమాంబ, శ్రీ శేషగిరిశర్మ గారలు

విద్య :

సాధారణవిద్య - పి. యు. సి.
సాంకేతిక విద్య - ఎమ్. డి. (ఆయుర్వేదము) (జామ్‌నగర్)

ఉద్యోగము :

1) అసిస్టెంట్ ప్రొఫెసర్, వి. హెచ్. ఆయుర్వేద మహా విద్యాలయం లోధ్ర, గుజరాత్. 29-1-79 నుండి 6-3-79 వరకు

2) మెడికల్ ఆఫీసర్ & హెల్త్ కో ఆర్డినేటర్, రాయలసీమ డెవలప్‌మెంట్ ట్రస్ట్ అనంతపురం, ఆంధ్రప్రదేశ్. 22-3-79 నుండి 4-8-80 వరకు

3) లెక్చరర్, ఆయుర్వేద కాలేజ్, పతంజలిపురి, కోయంబత్తూర్ 18-8-80 నుండి 4-9-85 వరకు

4) ప్రిన్సిపాల్ - ఇన్-ఛార్జ్, ఆయుర్వేద కాలేజ్, పతంజలిపురి, కోయంబత్తూర్. 5-9-85 నుండి 22-3-86 వరకు

5) మెడికల్ ఆఫీసర్, గవర్నమెంట్ ఆయుర్వేదిక్ డిస్పెన్సరీ కోపల్లె, గుంటూరు జిల్లా, 25-3-86 నుండి 15-9-89 వరకు

6) లెక్చరర్ - ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల, విజయవాడ 15-9-89 నుండి

పరిశోధనా వ్యాసములు :

రస పతంగముపై ఎమ్. డి. థీసిస్

రస పతంగముపై చికిత్సాలయమునందు రోగులపై పరిశోధన

రస పతంగమును తయారుచేయు విధానముపై పరిశోధన

మల్లభస్మము కాశీస భస్మములను శ్వాస రోగముపై ప్రయోగించి ఆ ప్రభావమును తులనాత్మక పరిశీలన

బసవరాజీయ గ్రంథమున మహాస్రోతస్సునకు సంబంధించిన వ్యాధులకు చెప్పబడిన రసౌషధములు

ఆయుర్వేద విద్యాబోధనలో అవసరమైన పద్ధతులు

ఔషధ నిర్మాణాలల వికేంద్రీకరణము

గ్రామీణ ఆరోగ్య విధానంలో ఆయుర్వేదం యొక్క పాత్ర - మొదలైనవి.

ఉపన్యాసములు :

1) ఆరోగ్యమునకు ఆయుర్వేద సూత్రములు (రాయపెల్లూర్)
2) ఆయుర్వేదమునందు దార్శనికతత్వము (ఉడుమలైపేట)
3) ఫ్రెంచి వారికి ఆయుర్వేద పరిచయోపన్యాసములు (కోయంబత్తూర్)
4) ఆయుర్వేదంలో ధాతు విజ్ఞానము (బెంగుళూరు)
మొదలైనవి మరియు రేడియో ఉపన్యాసములు

పరిశోధనలు :

1) అపస్మారమునందు ఆయుర్వేద ఔషధముల ప్రభావము (డి. ఎస్. టి. న్యూఢిల్లీ)
2) ఆయుర్వేదౌషధముల నాణ్యతను నిర్ణయించుట (డి. ఎస్. టి. న్యూఢిల్లీ)
3) గ్రామీణ వైద్యములో ఆయుర్వేదమునుచేర్చి ప్రచారము చేయుట (యు. ఎస్. ఎయిడ్/ఐ.సి.ఎమ్.ఆర్. న్యూఢిల్లీ)

హాబీలు :

పాటలు పాడటం, హిందుస్తానీ సంగీతం వినడం, సితార్ వాయించడం.

ప్రస్తుతపు చిరునామా :

డా॥ పి. హిమసాగర చంద్రమూర్తి
ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల
విజయవాడ - 520 002 (ఆం. ప్ర.)

# చరకసంహిత - విమానస్థానము

## విషయసూచిక


| విషయము | పుటసంఖ్య |
|---|---|
| 1. ప్రథమాధ్యాయము రసవిమానము | |
| — విమానస్థానము యొక్క నిరుక్తి మరియు ప్రయోజనము | 1 |
| — విమానస్థానము నుపదేశించుటకు గల కారణము | 1 |
| — రసముల సంఖ్య మరియు వాటి సామాన్య కృత్యములు | 2 |
| — దోషముల సంఖ్య వాటి సామాన్య కృత్యములు | 3 |
| — రసములకు దోషములకు గల సంబంధము | 4 |
| — ద్రవ్యము మరియు వ్యాధి-వీని ప్రభావములను తెలిసికొను విధము | 6 |
| — వికృతి విషమ సమవాయము-ప్రకృతి సమసమవాయము | 7 |
| — ద్రవ్య ప్రభావము | 12 |
| — నూనె, నెయ్యి, తేనెలను ఎల్లప్పుడు ఉపయోగించుటవలన వాతపిత్త శ్లేష్మములను క్రమముగా శమింపచేయుట | 13 |
| — పిప్పళ్ళు-క్షారము-లవణముల అధిక సేవనము వర్జనీయము | 15 |
| — పిప్పళ్ళను అధికముగా సేవింపరాదనుటకు కారణము | 15 |
| — క్షారగుణములు-దానినెక్కువగా సేవించుటవలన కలుగు దుష్ఫలితములు | 17 |
| — ఉప్పు గుణములు-దానినెక్కువగా సేవించుటవలన కలుగు దుష్ఫలితములు | 17 |
| — సాత్మ్యముగా గ్రహించు పదార్థములను విడచు విధానము | 19 |
| — సాత్మ్యము యొక్క నిరుక్తి భేదములు | 19 |
| — ఎనిమిది ఆహారవిధి విశేషాయతనములు | 21 |
| — ప్రకృతి | 21 |
| — కరణము | 22 |
| — సంయోగము | 24 |
| — రాశి | 24 |
| — దేశము | 25 |
| — కాలము | 26 |
| — ఉపయోగ నియమము | 27 |
| — ఉపయోగించువాడు | 27 |

విషయము — పుటసంఖ్య

— ఆహార విధి విశేషాయతనములను తెలిసికొనుటవలన కలుగు ఫలితము 27
— హితతమమగు ఆహార విధి విధానము 28
— ఉష్ణభోజనము వలన కలుగు సద్గుణములు 29
— స్నిగ్ధ భోజనము వలన కలుగు సద్గుణములు 30
— సరియగు మోతాదులో ఆహారమును భుజించుటవలన కలుగు సద్గుణములు 30
— మొదట తినిన ఆహారము జీర్ణమైన తరువాతనే భుజింపవలెననుట 31
— వీర్యవిరుద్ధత్వము లేని ఆహారమును భుజింపవలెననుట 32
— ఇష్టమైన ప్రదేశమునందు ఇష్ట ఉపకరణములతో కూడి భుజించుట వలన కల్గు ఫలితములు 32
— మిక్కిలి వేగముగా భుజించుట వలన కల్గు దుష్ఫలితములు 33
— అతి నెమ్మదిగా భుజించుటవలన కల్గు దుష్ఫలితములు 34
— మాట్లాడక, నవ్వకయూ భుజింపవలెననుట 34
— తన్ను తాను తెలిసికొని భుజింపవలెననుట 34
— వైద్యుడు తెలిసికొనవలసిన విషయములు 35
— అధ్యాయ సంగ్రహము 35

## 2. ద్వితీయాధ్యాయము త్రివిధకుక్షీయ విమానము

— కుక్షియందు మూడు విధములైన అవకాశాంశముల నేర్పరచుట 37
— ఆహారరాశి మాత్ర-అమాత్రయని రెండు విధములుగా నుండుట 39
— సరియగు మాత్ర (మోతాదు)లో నున్న ఆహార సేవన వలన కల్గు గుణములు 39
— అమాత్రా ద్వైవిధ్యము-హీనమాత్ర-అధికమాత్ర-వీనివలన కలుగు ఫలితములు 40
— ఆమప్రదోషమును కల్గించుటకు అతిమాత్రయేకాక ఇతర కారణములు 42
— ఆమప్రదోషము రెండు విధములనుట 43
— విసూచికా లక్షణము 43
— అలసక లక్షణము 43
— చికిత్సా సాధ్యములగు ఆమాశయమునందు చేయవగు క్రియలు 45

| విషయము | పుటసంఖ్య |
|---|---|


— ఆహారము పచనము నొందు స్థలము (శరీరావయవము) 47
— అధ్యాయ సంగ్రహము 48

**3. తృతీయాధ్యాయము - జనపదోద్ధ్వంసనీయ విమానము**

— ఓషధులను గ్రహింపవలసిన సమయము 50
— అసమానములగు ప్రకృతి మొదలగునవి గలవారికందరికి ఒకేసారి జనపదోద్ధ్వంసములగు వ్యాధులు ఎందువలన కలుగును అను ప్రశ్న 52
— ఆత్రేయ భగవానుని ఉత్తరము 52
— దుష్టవాత లక్షణములు 53
— దుష్ట ఉదక లక్షణములు 53
— దుష్ట దేశ లక్షణములు 54
— వైగుణ్యము నొందిన కాలము యొక్క లక్షణములు 55
— వాతాదులు వైగుణ్యము నొందినప్పుడు సరియగు చికిత్సతో వ్యాధుల నరికట్టుట 55
— వైగుణ్యము నొందిన వాతాదులు క్రమముగా నొకదానికంటె నొకటి ఎక్కువ బలము కల్గియుండుట 56
— జనపదోద్ధ్వంసములు వచ్చినప్పుడు చేయవలసిన చికిత్సలు 57
— వాయువు మొదలగునవి వైగుణ్యము నొందుటకు కారణము 59
— శస్త్రములతో (యుద్ధము చేయుట) కలుగు జనపదోద్ధ్వంసములకు అధర్మమే కారణము 61
— అధర్మము అభిశాపజన్యజనపదోద్ధ్వంసములకు కారణమగుట 61
— అభిశాపజన్య జనపదోద్ధ్వంసములకు అధర్మము కారణమగుట 62
— అధర్మము ఆయుర్హ్రాసమునకు కారణమగుట 63
— ప్రాణుల ఆయుష్షు క్షీణించుటకు అధర్మమే కారణమగుట 65
— ఆయుఃప్రమాణము నియతమా ? కాదా ? అను అగ్నివేశుని ప్రశ్న 66
— ఆత్రేయుని సమాధానము 66
— ఆయువు నియతానియతముగా నుండుటకు కారణము 67
— కాలమృత్యువు-అకాల మృత్యువుల విషయమున అగ్నివేశుని ప్రశ్న 73
— ఆత్రేయుని సమాధానము 73

| విషయము | పుట సంఖ్య |
| --- | --- |
| — జ్వరితునకు ఉష్ణోదక పానము చేయించుటకు కారణము అట్లు చేయించకూడని సమయములు | 76 |
| — ఉష్ణజన్య రోగములకు శీతోపచారము | 77 |
| — శీతజన్య రోగములకు ఉష్ణోపచారము | |
| — నిదాన విపరీత చికిత్స | 77 |
| — అపతర్పణము మూడు విధములనుట | 77 |
| — లంఘనము - లంఘన పాచనము | 77 |
| — దోషావసేచనము | 79 |
| — అశుభ కర్మ నిషేధము - దేశత్రైవిధ్యము | 80 |
| — అధ్యాయ సంగ్రహము | 80 |
| 4. చతుర్థాధ్యాయము - త్రివిధరోగ విశేష విజ్ఞానీయ విమానము | |
| — రోగ విశేషములను తెలిసికొను ఉపాయము | 82 |
| — పరీక్ష ద్వైవిధ్య - త్రైవిధ్యములు | 83 |
| — ఆప్తోపదేశముద్వారా తెలియదగు విషయములు | 86 |
| — ప్రత్యక్షముద్వారా తెలియదగు విషయము | 86 |
| — అనుమానముచేత తెలియదగు విషయములు | 88 |
| — త్రివిధ పరీక్షలనుపయోగించి వ్యాధులను తెలుసుకొనుటవలన కలుగు శుభఫలితము | 91 |
| — అధ్యాయ సంగ్రహము | 92 |
| 5. పంచమాధ్యాయము - స్రోతో విమానము | |
| — స్రోతస్సుల ప్రకారములు - స్రోతో శబ్దమునకు అర్థము | 94 |
| — పురుషుడు స్రోతోమయుడనుట | 96 |
| — స్థూల స్రోతస్సుల సంఖ్య - వాటిపేర్లు | 97 |
| — ప్రాణవహాది స్రోతస్సుల మూలములు మరియు దుష్టి లక్షణములు | 98 |
| — స్రోతో పర్యాయనామములు | 102 |
| — స్రోతో దుష్టికి కారణములు | 103 |
| — స్రోతస్సులను దూషింపజేయు ఆహారవిహారములు | 105 |
| — స్రోతో దుష్టి లక్షణము | 106 |
| — స్రోతస్సుల వర్ణము - ఆకారములు | 106 |
| — స్రోతోదుష్టియందు చేయవలసిన చికిత్సలు | 107 |
| — అధ్యాయ సంగ్రహము | 107 |

| విషయము | పుట సంఖ్య |
|---|---|


6. షష్ఠాధ్యాయము - రోగానీక విమానము

— రోగ సమూహమందలి వివిధ ప్రకారములు 109
— దోష ప్రకోపణ కారణములు - అసాత్మ్యేన్ద్రియార్థాదులు 114
— శారీరక మానసిక రోగముల పరస్పర అనుబంధము 116
— రజస్సు - తమస్సులకు నియతాను బంధముండుట 116
— వ్యాధులయొక్క అనుబంధ్య - అనుబంధత్వములు 117
— కాయాగ్నియొక్క భేదములు - వాని లక్షణము 118
— శారీరక ప్రకృతి 120
— రోగములను చికిత్సించుటయందు అగ్నియొక్క ప్రాధాన్యత 122
— రోగులు దోషానుసారము మూడు విధములుగా నుందురు 123
— వాతల రోగులు వారికి చేయదగు చికిత్సలు 123
— పిత్తల రోగులు వారికి చేయదగు చికిత్సలు 124
— శ్లేష్మల రోగులు వారికి చేయదగు చికిత్సలు 126
— రాజవైద్యుని లక్షణము 127
— అధ్యాయ సంగ్రహము 128

7. సప్తమాధ్యాయము - వ్యాధిత రూపీయ విమానము

— వ్యాధిత పురుష ద్వైవిధ్యము-లఘువ్యాధితులు-గురువ్యాధితులు 129
— సంపూర్ణజ్ఞానముయొక్క అవశ్యకత 130
— క్రిమి సంబంధమగు ప్రశ్న 132
— క్రిమి సంబంధము వివరము 133
— బాహ్య మలజ క్రిములు 134
— రక్తజ క్రిములు 134
— శ్లేష్మజ క్రిములు 135
— పురీషజ క్రిములు 136
— క్రిమిరోగ చికిత్సా సూత్రము 137
— క్రిమి చికిత్స 138
— మూలకాది యోగము 139
— విడంగ కషాయ ప్రయోగము 141
— శీర్షాద క్రిమి చికిత్స 142
— క్రిమిరోగి కివ్వవలసిన ఆహారము 142

| విషయము | పుట సంఖ్య |
|---|---|
| — అశ్వ శకృత్ (గుఱ్ఱపు లద్దె) ప్రయోగము | 144 |
| — భల్లాతకాస్థి తైలప్రయోగము | 145 |
| — విడంగ కషాయముతో భావనచేసిన నువ్వులప్రయోగము | 145 |
| — తిల్వకోద్దాలకాది తైలము | 146 |
| — సర్వరోగ చికిత్సా సూత్రము | 148 |
| — అధ్యాయ సంగ్రహము | 149 |
| 8. అష్టమాధ్యాయము రోగభిషగ్జితీయ విమానము | |
| — శాస్త్రపరీక్ష | 150 |
| — ఆచార్య పరీక్ష | 153 |
| — గురువును సేవించు విధము | 154 |
| — అధ్యయన విధి | 154 |
| — అధ్యాపన విధి | 156 |
| — శిష్యుడు అనుసరింప వలసిన నియమములు | 159 |
| — సంభాషా విధి | 164 |
| — సంభాషా ద్వైవిధ్యము | 164 |
| — సంధాయ సంభాషావిధి | 165 |
| — విగృహ్య సంభాషావిధి | 166 |
| — పరిషత్తు భేదములు | 167 |
| — వాదమర్యాదా లక్షణము | 173 |
| — వాద మార్గములు | 173 |
| — వాద లక్షణము | 174 |
| — ద్రవ్యగుణ కర్మ సామాన్య విశేష సముదాయములు | 175 |
| — ప్రతిజ్ఞ | 175 |
| — స్థాపన | 175 |
| — ప్రతిస్థాపన | 176 |
| — హేతువు | 177 |
| — దృష్టాంతము | 177 |
| — ఉపనయ-నిగమనములు | 178 |
| — ఉత్తరము | 178 |
| — సిద్ధాంతము | 179 |
| — శబ్దము | 181 |

| విషయము | పుటసంఖ్య |
|---|---|
| — ప్రత్యక్షము | 183 |
| — అనుమానము | 183 |
| — ఔపమ్యము (ఉపమానము) | 184 |
| — సంశయము | 185 |
| — ప్రయోజనము | 186 |
| — సవ్యభిచారము | 186 |
| — జిజ్ఞాస | 186 |
| — వ్యవసాయము | 187 |
| — అర్థప్రాప్తి | 187 |
| — సంభవము | 188 |
| — అనుయోజ్యము | 188 |
| — అననుయోజ్యము | 189 |
| — ప్రత్యనుయోగము | 189 |
| — వాక్యదోషము | 190 |
| — వాక్య ప్రశంస | 191 |
| — ఛలము | 193 |
| — అహేతువు | 194 |
| — అతీతకాలము | 196 |
| — ఉపాలంభము | 197 |
| — పరిహారము | 197 |
| — ప్రతిజ్ఞాహాని | 197 |
| — అభ్యనుజ్ఞ | 198 |
| — హేత్వంతరము | 198 |
| — అర్థాంతరము | 198 |
| — నిగ్రహస్థానము | 199 |
| — వాదవిధానము | 200 |
| — దశవిధ ప్రకరణములు (పరీక్ష్య విషయములు) | 201 |
| — కారణము | 201 |
| — కరణము | 202 |
| — కార్యయోని | 203 |
| — కార్యము, కార్యఫలము | 203 |

| విషయము | పుటసంఖ్య |
|---|---|
| — అనుబంధము | 203 |
| — దేశము | 204 |
| — కాలము | 204 |
| — ప్రవృత్తి | 204 |
| — ఉపాయము | 204 |
| — ప్రశ్నించు విధానము | 206 |
| — సమాధానమిచ్చు విధానము | 207 |
| — పరీక్ష రెండు విధములు-ప్రత్యక్ష, అనుమానములు ఆప్తోప దేశముతో కలిపి మూడు విధములు | 208 |
| — వైద్య లక్షణము | 210 |
| — భేషజ లక్షణములు | 212 |
| — కార్యయోని-ధాతువైషమ్య లక్షణము | 214 |
| — కార్యము ధాతుసామ్య లక్షణము | 215 |
| — కార్యఫలము-సుఖావాప్తి లక్షణము | 215 |
| — అనుబంధము-ఆయుపు యొక్క లక్షణము | 215 |
| — దేశద్వైవిధ్యము | 216 |
| — రోగి పరీక్ష | 217 |
| — ప్రకృతి పరీక్ష | 220 |
| — శ్లేష్మ ప్రకృతి కల మనుజుని లక్షణములు | 221 |
| — పిత్త ప్రకృతి కల మనుజుని లక్షణములు | 222 |
| — వాత ప్రకృతి కల మనుజుని లక్షణములు | 223 |
| — వికృతి పరీక్ష | 225 |
| — సార పరీక్ష | 226 |
| — త్వక్సారము | 226 |
| — రక్తసారము | 226 |
| — మాంస సారము | 227 |
| — మేదోసారము | 227 |
| — అస్థి సారము | 228 |
| — మజ్జా సారము | 228 |
| — శుక్ర సారము | 228 |
| — సత్త్వసారము | 229 |

| విషయము | పుటసంఖ్య |
|---|---|
| — సర్వసార పురుష లక్షణము | 229 |
| — సారపరీక్ష యొక్క అవశ్యకత | 230 |
| — సంహనన పరీక్ష | 231 |
| — ప్రమాణ పరీక్ష | 232 |
| — సాత్మ్య పరీక్ష | 235 |
| — సత్త్వ పరీక్ష | 236 |
| — ఆహారశక్తి పరీక్ష | 237 |
| — వ్యాయామశక్తి పరీక్ష | 237 |
| — వయః పరీక్ష | 238 |
| — కాలము | 241 |
| — ఋతుచర్య | 243 |
| — రోగి యొక్క వివిధ అవస్థలు | 246 |
| — ప్రవృత్తి | 247 |
| — ఉపాయము | 247 |
| — పరీక్ష వలన కలుగు ప్రయోజనము | 248 |
| — వమన ద్రవ్యములు - వాని కల్పనములు | 249 |
| — విరేచన ద్రవ్యములు - వాని వివిధ కల్పనములు | 251 |
| — ఆస్థాపన ద్రవ్యస్కంధము | 253 |
| — ఆస్థాపనమునకుపయోగపడు మధుర స్కంధము | 255 |
| — ఆస్థాపనమునకుపయోగపడు అమ్ల స్కంధము | 257 |
| — ఆస్థాపనమునకుపయోగపడు లవణ స్కంధము | 258 |
| — ఆస్థాపనమునకుపయోగపడు కటు స్కంధము | 258 |
| — ఆస్థాపనమునకుపయోగపడు తిక్త స్కంధము | 259 |
| — ఆస్థాపనమునకుపయోగపడు కషాయ స్కంధము | 260 |
| — పై చెప్పిన షడ్వర్గములందలి ద్రవ్యములకు అవసరమును బట్టి మార్పులకు చేర్పులకు చేయుట | 263 |
| — అనువాసన ద్రవ్యములు | 265 |
| — శిరో విరేచన ద్రవ్యములు | 266 |
| — అధ్యాయ సంగ్రహము | 268 |

# తప్పొప్పుల పట్టిక

చదువరులు ముందుగా ఈ పట్టికననుసరించి గ్రంథమును సరిచేసుకొని చదువుకొనగలరు.

| పుటసంఖ్య | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 16 | 6 | ఘేదము | భేదము |
| 17 | 3 | క్లీదయత్యతో | శ్లేపయత్యతో |
| 17 | 6 | పాణ్ణ్య | షాణ్ఢ్య |
| 17 | 8 | క్షీరంచాత్యుపయుజ్జ్యేత | క్షీరం నాత్యుపయుజ్జ్యేత |
| 19 | 19వ శ్లోకము యొక్క తాత్పర్యమునకు చేర్చవలసినది— క్రమముగా తప్పింపబడిన సాత్మ్యము వలన దోషములు కలుగవు. కలిగిననూ, అవి అల్పముగా నుండును. | | |
| 21 | 16 | మాషముగ్దయోః | మాషముద్గయోః |
| 22 | 11 | చక్రపాణి | ఆయుర్వేద దీపిక |
| 22 | 18 | ప్రస్తుతః స్విన్నః | ప్రసృతః స్విన్నః |
| 27 | 13 | మోహాసాత్మ్యమ్ | మోకసాత్మ్యమ్ |
| 34 | 12 | ఏదాతిద్రుతయశ్నతః | ఏవాతిద్రుతమశ్నతః |
| 37 | 16 | కిఞ్చిదశుఖం | కిఞ్చిదసుఖం |
| 40 | 11 | మాత్రమాత్రోమాహార రాశిం | మాత్రమాహారరాశిం |
| 43 | 22 | బహిర్ముఖీభవతి | బహిర్ముఖీ భవతి |
| 45 | 17 | అపిచామదోరాపాషధ | అపిచామదోషాహారౌషధ |
| 50 | 11 | చాస్మానను కాజాన్తి | చాస్మానసుఖాన్తి |
| 50 | 11 | వయమను కాచామః | వయమసుఖాగామః |
| 81 | 2 | నిమిత్తయే | నిమిత్తియే |
| 88 | 21 | ప్రియమపత్రపదేన | హ్రియమపత్రపదేన |
| 94 | 10 | శబ్దమునకు | శబ్దమునకు |
| 96 | 1 | పురుషులు | పురుషులు |

| పుటసంఖ్య | వ్య_క్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 98 | 9 | స్రౌకస్సుల | స్రోతస్సుల |
| 111 | 14 | ఫేదప్రకృత్యా న్తరీయేషు | ఫేదప్రకృత్య న్తరీయేషు |
| 123 | 5 | ప్రామేణ | ప్రాయేణ |
| 123 | 10 | విధాయుక్తా | విధియుక్తా |
| 129 | 11 | లఘువ్యాధిములు, గురుత్యాధితులు | లఘువ్యాధితులు గురుత్యాధితులు |
| 130 | 23 | క్వదచిపి | క్వచిదపి |
| 134 | 24 | కేశదః, లోమదాః | కేశాదాః, లోమాదాః. |
| 137 | 14 | అనివేలమనగా | అతివేలమనగా |
| 159 | 23 | శిష్యుడా | శిష్యుడు |
| 164 | 8 | పై రదశ్యామపి | పై శారద్యమపి |
| 185 | 7 | శీఘఖడ్గాశ్చిర.... | శ్రేఘఖడ్గాశ్చిర.... |
| 187 | 12 | నిశిభో క్తహ్యామితి | నిశిభో క్తవ్యమితి |

# చరకసంహిత - విమానస్థానము

## ప్రథమాధ్యాయము

### రస విమానము

1. అథాతో రస విమానం వ్యాఖ్యాస్యామః

2. ఇతి హ స్మాహ భగవానాత్రేయః

**తాత్పర్యము :-** "ఇక ఇపుడు రస విమానమును గూర్చి చెప్పబోవుచున్నాము" అని ఆత్రేయ భగవానుడు చెప్పియుండెను.

### విమానస్థానము యొక్క నిరుక్తి మరియు ప్రయోజనము

**ఆయుర్వేద దీపిక :** నిదానస్థానమునందు తెలియజేయబడిన హేతువు మొదలగు అన్నిటియొక్క చికిత్సోపయోగముగా నుండునట్లు దోష భేషజాదుల విశేష జ్ఞానము రావలసియున్నది. ఇందువలన చెప్పబోవుచున్న దోషభేషజాదులను గూర్చి విశేషముగా తెలియజేయు విమానస్థానము చెప్పబడుచున్నది. అదియునూ దోషభేషజముల రెండింటియొక్క ప్రాధాన్యత వలన వానిని గూర్చి విశేషముగా తెలియజేయు రస విమానము మొదట చెప్పుట జరుగుచున్నది. దీని యొక్క స్థాన సంబంధమును స్వయముగనే తెలుపగలదు. దోషభేషజాదులను గూర్చి విశేషముగా తెలియజేయు (జ్ఞానమును కలిగించు)న దగుటవలన విమానమని పేరు పెట్టబడినది. దోషభేషజాదులయొక్క ప్రభావము మొదలైన విశేషములని అర్థము. ఇట్లున్న విమానము పేరు ఎచ్చట నుండునో అది విమాన స్థానము. రస విమానము నాధారముగ చేసికొనబడిన అధ్యాయము రస విమానము.

### విమానస్థానమునుపదేశించుటకు గల కారణము

3. ఇహ ఖలు వ్యాధీనాం నిమిత్తపూర్వరూపరూపోపశయసంఖ్యాప్రాధాన్య విధి వికల్ప బలకాల విశేషాననుప్రవిశ్యానన్తరం దోషభేషజ దేశకాల బల శరీర సారాహార సాత్మ్య సత్త్వ ప్రకృతి వయసాం మాన మవహిత మనసా యథావజ్జ్ఞేయం భవతి భిషజా, దోషాదిమానజ్ఞానాయత్తత్వాత్ క్రియాయాః. న హ్యమానజ్ఞో దోషాదీనాం భిషగ్ వ్యాధినిగ్రహ సమర్థో భవతి. తస్మా-దోషాది మాన జ్ఞానార్థం విమానాన్యుపదేక్ష్యామోఽగ్నివేశ !

**తాత్పర్యము :** వ్యాధుల యొక్క కారణము, పూర్వరూపము, రూపము, ఉపశయము, సంఖ్యా, ప్రాధాన్యము, విధి, వికల్పము, బలము, కాలముల విశేషము లను తెలిసికొనిన తరువాత వైద్యులకు దోష - ఔషధ - దేశ - కాల - బల - శరీర - ఆహార - సాత్మ్య - సత్త్వ - ప్రకృతి అనువాని యొక్క మానమును (ప్రమాణమును) స్థిరమైన చిత్తముతో ఉన్నదున్నట్లుగా తెలిసికొనుట అవసరము. చికిత్స యనునది దోషము మొదలగువాని మానజ్ఞానము పైన ఆధారపడియుండును. కావున దోషాదుల మానముమ గురించి తెలియని వైద్యుడు వ్యాధులను చికిత్సింపజాలడు. అందువలన ఓ అగ్నివేశుడా! దోషాదుల యొక్క పరిమాణ జ్ఞానము కొరకు విమాన స్థానమును ఉపదేశింపబోవు చున్నాము.

**ఆయుర్వేద దీపిక :** "ఇహ ఖలు" అను మొదలగువాని వలన స్థాన సంబంధమును చెప్పుచున్నాడు. ఇచట సంప్రాప్తి యొక్క భేదములగు సంఖ్యా ప్రాధాన్యము మొదలగువానిని గ్రహించుటచేతనే సంప్రాప్తి అంతయూ చెప్పబడి యున్నదని చూపుచున్నాడు. నిమిత్తము మొదలగువానికి మాత్రము ఎట్టి భేదముచేత అవియును ఇచట చెప్పబడుచున్నవో అటువంటి భేదము అల్పసూత్రమున (గ్రంథ మున) చెప్పరాని దగుటచే సామాన్యముగనే చెప్పబడినవి. 'అనుప్రవిశ్య' అనగా తెలిసికొని అని అర్థము. దోషాదులు సూత్రస్థానము నందే వివరింపబడినవి. "మానమ్" అనగా ప్రభావాది విశేషము. "దోషాది" అను మొదలగువాని ద్వారా ఈ జ్ఞానమునందలి కారణమును చెప్పుచున్నాడు. "క్రియార్థః" అనగా చికిత్స కొరకు.

## రసముల సంఖ్య మరియు వాటి సామాన్య కృత్యములు

4. తత్రాదౌ రసద్రవ్యదోషవికారప్రభావాన్ వక్ష్యామః
రసాస్తావత్ షట్-మధురామ్లలవణకటుతిక్తకషాయాః
తే సమ్యగుపయుజ్యమానాః శరీరం యాపయన్తి, మిథ్యోపయుజ్య
మానాస్తు ఖలు దోషప్రకోపాయోపకల్పన్తే.

**తాత్పర్యము :-** అందు తొలుత రస-ద్రవ్య-దోష-వికారముల ప్రభా వములను చెప్పబోవుచున్నాము. రసములు ఆరు - మధుర, ఆమ్ల, లవణ, కటు, తి...

కషాయములని ఆరు విధములు. ఇవి సరిగా ఉపయోగింపబడుచున్నచో శరీరమును సమస్థితిలో నుంచును. సరిగా ఉపయోగింపబడకున్న యెడల దోష ప్రకోప కారణములు కాగలవు.

ఆయుర్వేద దీపిక :- "తత్రాదౌ" అను మొదలగునవి అధ్యాయము యొక్క విషయమును తెలుపుటకు చెప్పబడినవని తెలియవలెను. "దోష భేషజ" అను మొదలగువాని యందు (పై సూత్రములోనిది) భేషజమునకు దోషాపేక్షత్వ ముండుటచే దోషము ముందుగా పేర్కొనబడినప్పటికీ ఇచట రోగప్రశమన కర్తృత్వము రస ద్రవ్య రూపమగు భేషజమునకు అపేక్షితమై యుండుటవలన, మరియు దోషమునకు కూడ రస-ద్రవ్యములు రెండే కారణములగుటం జేసి భేషజ శబ్దమును సూచించిన దానియందు రస-ద్రవ్యములు రెందే మొదట వ్రాయబడినవి. తరువాతనే దోష గ్రహణమువలన దోష-వికారములు గ్రహింపబడినవి. ప్రకృష్ట భావము ప్రభావ మనబడును. అనగా శక్తి అని అర్థము. అదియును ఇచట చింత్యము అచింత్య మనియు గ్రహింపనగును. ఇందువలన "తత్ర ఖల్వనేకరసేషు" అను మొదలగు వాని వలన ద్రవ్య వికారముల రెండింటియొక్క రసము వలన మరియు దోషము వలనను చింత్యమగునని చెప్పబోవుచున్నాడు. "యాపయన్తి" అనగా సామ్యతను స్థిరపరచును. మిథ్యా శబ్దము ఇచట అయోగ, అతియోగ, మిథ్యాయోగములందు వర్తించును.

## దోషముల సంఖ్య మరియు వాటి కృత్యములు

5. దోషాః పునస్త్రయో వాతపిత్తశ్లేష్మాణః తే ప్రకృతిభూతాః శరీరోపకారకా భవన్తి, వికృతిమాపన్నాస్తు ఖలు నానావిధైర్వికారైః శరీరముపతాపయన్తి.

తాత్పర్యము :- దోషములు వాతపిత్త శ్లేష్మములని మూడు విధములు. అవి ప్రాకృతములుగా నున్నపుడు (వాటి వాటి నిర్ణీత స్థితిలో నున్నపుడు) శరీరమునకు ఉపయోగకరములుగా నుండును. వికృతి చెందినపుడు (ప్రకోపము మొదలైన వికృతావస్థలలో) అనేక రోగములకు కారణములై శరీరమును బాధించును.

ఆయుర్వేద దీపిక :- "దోషాః" అనగా శరీర దోషములు. "పునః" శబ్దము మానస దోషమును మినహాయించును.

## రసములకు దోషములకు గల సంబంధము

6. తత్ర దోషమేకైకం త్రయస్త్రయో రసా జనయన్తి, త్రయస్త్రయశ్చోపశమయన్తి. తద్యథా-కటుతిక్తకషాయా వాతం జనయన్తి, మధురామ్లలవణాస్త్వేనం శమయన్తి; కట్వమ్లలవణాః పిత్తం జనయన్తి, మధురతిక్తకషాయాస్త్వేనచ్ఛమయన్తి; మధురామ్లలవణాః శ్లేష్మాణం జనయన్తి, కటుతిక్తకషాయాస్త్వేనం శమయన్తి.

**తాత్పర్యము :-** అందు మూడేసి రసములు ఒక్కొక్క దోషమును కలుగజేయును. మిగిలిన మూడు రసములునూ ఆ దోషమును శమింపజేయును. ఎట్లనగా కటు తిక్త కషాయ రసములు వాతమును కలుగజేయును. మధురామ్ల లవణ రసములు దీనిని శమింపజేయును. కటు-అమ్ల-లవణ రసములు పిత్తమును జనింపజేయును. మధుర తిక్త కషాయరసములు దీనిని శమింపజేయును. మధుర అమ్ల లవణ రసములు శ్లేష్మమును జనియింపజేయును. కటుతిక్త కషాయములు దీనిని శమింపజేయును.

**ఆయుర్వేద దీపిక :-** "తత్ర" అను మొదలగువాని ద్వారా అసంసృష్టములగు రసములయొక్క కర్మలను చెప్పుచున్నాడు. ఈ రసకర్మలను తెలుపుట వలన దోషములకును ఆయా రసములచే నుత్పత్తియగుట, ఆయా రసములచే ఉపశమనమును పొందుట అనునదియును చెప్పబడియున్నది. కటుతిక్త కషాయములు వాతమును కలుగజేయును. అనగా అట్లు జరుగని యెడల తద్వ్యతిరేకమగునని తెలియవలెను. అందువలన తిక్తరసముగలవియైనను బిల్లేడు, అగురు, తిప్పతీగె మొదలగునవి వాతమును కలుగజేయకపోవుటయందు దోషములేదు. అచటనే ఉష్ణవీర్యత్వము వ్యతిరేకమైనదిగా కన్పట్టుచున్నది. అందువలన అవి వాతమును కలిగించుటలేదు అను మొదలగునవి తెలిసికొనవలయును. "ఏనమ్" అను పదము వలన కటురసము మొదలగువానివలన కలిగిన వాతమేదిగలదో దానినే, అన్నింటను వ్యతిరేకమగు గుణవిశేషములను కలిగియుండుటంజేసి మధురరసము మొదలైనవి శమింపజేయును అని చూపుచున్నాడు. జాగరణము మొదలగువాని వలన కలిగిన వాతమునందు జాగరణాదులకు వ్యతిరేకములగు నిద్ర మొదలగునవి విశేషముగా పథ్యములు, ఇటులనే పిత్తశ్లేష్మములకును [illegible], ఏనం అను [illegible]
[illegible] . . . . . .

7. రసదోషసన్నిపాతే తు యే రసా యైర్దోషైః సమానగుణాః సమానగుణభూయిష్ఠా వా భవన్తి తే తానభివర్ధయన్తి విపరీతగుణా విపరీతగుణభూయిష్ఠా వా శమయన్త్యభ్యస్యమానా ఇతి.ఏతద్వ్యవస్థాహేతోః షట్త్వముపదిశ్యతే రసానాం పరస్పరేణాసంసృష్టానాం,త్రిత్వం చ దోషాణామ్.

తాత్పర్యము :- రస దోష సన్నిపాతమునందు ఏ రసములు ఏ దోషములతో సమాన గుణములు కలిగియుండునో లేక సమాన గుణ భూయిష్ఠములై యుండునో అవి వానిని అభివృద్ధి చేయును. వ్యతిరేకగుణములు లేదా వ్యతిరేకగుణ భూయిష్ఠతను కలిగియున్నవి మాత్రము శమింపచేయును. ఇది అభ్యసింపబడుచున్న రసములవలన కలుగును. ఈ వ్యవస్థ కొరకు పరస్పరము అసంసృష్టములైన రసములకు షట్త్వము, దోషములకు త్రిత్వము చెప్పబడుచున్నది. (అసంసృష్టములైన రసములు ఆరు, అసంసృష్టములైన దోషములు మూడు అని చెప్పబడినది).

ఆయుర్వేద దీపిక :- ఇక ఏ యుక్తివలన రసములు దోషములను జనింపజేయునో మరియు శమింపజేయునో "రసదోష" అను మొదలగువానిద్వారా చెప్పుచున్నాడు. "తు"శబ్దము విశేషార్థమునందు ప్రయోగింపబడినది. అందువలన వ్యతిరేక గుణములే విశేషముగా వ్యతిరేక గుణభూయిష్ఠతగల వానికంటె శమింప జేయును అని సూచించుచున్నాడు.

రసములకు మాత్రము ఉపచారముచేత ఎట్లు గుణములు కలుగునో ఆ విషయము సూత్రస్థానమునందు "గుణాగుణాశ్రయానోక్తా" (సూత్రస్థానము. 26వ అధ్యాయము) అను మొదలగువాని ద్వారా పేర్కొనబడినది. "అభ్యస్యమానాః" అనగా ఒకేసారి సేవించుట వలన కాదు అని అర్థము. "ఇత్యేతద్" అను మొదలగు వాని ద్వారా - ఇక ఎందువలన రసముల యొక్క మరియు దోషముల యొక్క అధిక సంఖ్యను వదలి రసములు ఆరు అనియు దోషములు మూడు అనియు చెప్ప బడుచున్నదో - ఆ విషయమును చెప్పుచున్నాడు. "వ్యవస్థా" అనగా రసదోషముల సంసర్గము యొక్క సంక్షిప్త వివరణ. "పరస్పరేణాసంసృష్టానామ్" అను పదము దోషములకును అనియు వర్తింపజేయవలెను.

8. సంసర్గ వికల్ప విస్తరో హ్యేషామపరిసంఖ్యేయో భవతి, వికల్ప భేదాపరి సంఖ్యేయత్వాత్.

**తాత్పర్యము :-** వికల్పభేదము లెక్కకు మించినదగుట వలన వీని యొక్క (రసములు దోషముల యొక్క) సంసర్గ వికల్ప విస్తారము లెక్కకు మించినదగును.

**ఆయుర్వేద దీపిక :-** "సంసర్గ" అను మొదలగువానిద్వారా రసదోష సంసర్గమును వివరింపకపోవుట యందు కారణమును చెప్పుచున్నాడు. సంసర్గభేద విస్తారము లెక్కకు మించినదగుట చేత రసముల సంఖ్య ఆరుగా నుండుట మరియు దోషముల సంఖ్య మూడుగా నుండుట చెప్పబడుచున్నది. "వికల్ప భేదాపరి సంఖ్యేయత్వాత్" అనగా సంసర్గ వికల్పము యొక్క భేదము అనునది విజాతీయ ప్రకారము. అట్టిది లెక్కకు మించినదగుట వలన. ఇందువలన ఏ విధముగా రస ముల యొక్క అవాంతరవ్యక్తిభేదమునందునూ మధురత్వము మొదలగు సామాన్యయోగము వలన మధుర రసము మొదలగునవి చెప్పుట వలన అవి ఆరుగా చెప్పబడినవో, అదే విధముగా మధురామ్ల, మధురలవణ మొదలగు సంసర్గము నందునూ అవాంతర భేదమున్నప్పటికినీ అందు సామాన్యముగా సంగ్రహముచేసి అరువదిమూడు అను సంఖ్యా నియమము కలుగనున్నదని అట్టిసంఖ్య నిరసింపబడు చున్నది. ఏలయనగా మధురామ్లాది సంసర్గమునందునూ విజాతీయము మధురతర మధురత మాది భేదముండుటంజేసి అట్టి భేదము లెక్కకు మించినదగును. సూత్ర స్థానమునందు "రసాస్తరతమాభ్యాం తాం సంఖ్యామతిపతన్తి హి". అని చెప్ప బడియేయున్నది (సూ. 26). (తరతమ భేదములచేత రసములు లెక్కకు మించి పోవుచున్నవి).

## ద్రవ్యము మరియు వ్యాధి వీని ప్రభావములను తెలిసికొను విధము

9. తత్ర ఖల్వనేకరసేషు ద్రవ్యేష్వనేకదోషాత్మకేషు చ వికారేషు రసదోష-ప్రభావమేకైకశ్యేనాభిసమీక్ష్య తతో ద్రవ్యవికారయోః ప్రభావతత్త్వం వ్యవస్యేత్.

**తాత్పర్యము :-** అందు నిజముగా అనేక రసములుకల ద్రవ్యములందు మరియు అనేక దోషములున్న వ్యాధులయందుసు ఒక్కొక్క రసము దోషముల యొక్క ప్రభావమును ప్రత్యేకముగా పరిశీలించి అటుపైన ద్రవ్య వికారముల రెండింటి యొక్క ప్రభావతత్త్వమును నిర్ణయింపవలెను.

**ఆయుర్వేద దీపిక :** ఇక అట్లైనచో సంసృష్టములైన రసములు మరియు దోషముల యొక్క ప్రభావమును ఎట్లు తెలియవలెనో - "తత్ర/ఖలు" అను మొదలగు వానిద్వారా చెప్పుచున్నాడు.

అచట అనేక రసములతో కూడిన ద్రవ్యము యొక్కయూ అనేక దోషములతో కూడిన వికారము యొక్కయూ ప్రభావమును వానియందలి ఒక్కొక్క రసము దోషముల యొక్క ప్రభావముల కలయిక ద్వారా చెప్పుచూ రస సంసర్గము దోష సంసర్గముల రెండింటికీ అటువంటి ప్రభావమునే చెప్పుచున్నాడు. ఎందువలననగా రస - దోషముల సంసర్గ ప్రభావములు రెండునూ ఇక్కడ ద్రవ్యము వికారముల నాశ్రయించియుండుట వలన రస దోషముల ప్రభావము ద్రవ్య వికారముల ప్రభావముగానే చెప్పబడుచున్నది. ఈ న్యాయము వలన ప్రత్యక్షముగా చెప్పబడక పోయిననూ అసంసృష్టములగు రస దోషముల ప్రభావమును చెప్పుటవలన ఏకరసయుక్త ద్రవ్యము ఏకదోషజ వికారముల రెండింటి ప్రభావమును చెప్పినట్లుగనే తెలియవలెను. "ఏకైకశ్యేనాభిసమీక్ష్య" అనగా రసాదుల కొక్కొక్కదానికి ప్రత్యేకముగా చెప్పబడిన ప్రభావము వలన అనేక రసములతో కూడిన ద్రవ్యమునకు అనేక దోషములతో కూడిన వికారమునకునూ క్రొత్తగా వచ్చిన ప్రభావమును పరిశీలించి (సమీక్షించి) అని అర్థము.

## వికృతి విషమ సమవాయము - ప్రకృతి సమ సమవాయము

10. న త్వేవం ఖలు సర్వత్ర-న హి వికృతివిషమసమవేతానాం నానాత్మకానాం పరస్పరేణ చోపహతానామన్యైశ్చ వికల్పనైర్వికల్పితానామవయవప్రభావానుమానేనైవ సముదాయప్రభావతత్త్వమధ్యవసాతుం శక్యమ్.

**తాత్పర్యము :** నిజముగా అన్నిచోట్లను ఈ విధముగా జరుగదు (రసముల ప్రత్యేక ప్రభావముచేత ద్రవ్యము యొక్క ప్రభావమును దోషముల ప్రత్యేక

ప్రభావముచేత రోగము యొక్క ప్రభావమును తెలిసికొనుట అన్నిచోట్లను సాధ్య పడదు). వికృతి విషమ సమవేతములు, నానాత్మకములు, ద్రవ్యమునందలి రసములు వికారమునందలి దోషములు ఒకదానిచే నొకటి బాధింపబడినవి. ఇతర వికల్పములచే విశిష్ట కల్పములచే కల్పింపబడినవియును అగు ద్రవ్య - వికారములకు వాటి అవ యవ (రస - దోషముల) ప్రభావముచేతనే సముదాయ ప్రభావత్త్వమును అవ గాహన చేసికొనుట శక్యముగాదు.

ఆయుర్వేద దీపిక : "న త్వేవం ఖలు సర్వత్ర". అనగా - ఈ విధముగా రస - దోష ప్రభావము ద్వారా ద్రవ్య - వికార ప్రభావమును నిర్ణయిం చుట అన్నింటను ద్రవ్యమునందు మరియు వికారమునందు సాధ్యపడదని చెప్పు చున్నాడు. ఇచటనే "నహి" మొదలుకొని "శక్యమ్" అనువరకు కారణమును చెప్పుచున్నాడు. "వికృతివిషమ సమవేతానామ్" అనగా వికృతి సమవేతములకు మరియు విషమ సమవేతములకు అనునది వికృతి విషమ సమవేతములకు అని అర్థము. "సమవేతానామ్" అనగా కలసియున్న రసములకు మరియు దోషములకు అని అర్థము. అచట రసము యొక్క వికృతి సమవాయ మెట్లనగా — మధుర రసముగల తండులీయకమునందు; మధురరసము ప్రకృతివలన స్నిగ్ధత్వమును వృషత్వమును చేయునది. తండులీయకము (ముళ్ళ తోటకూర) నందు మాత్రము వికృతి సమవేతత్వమువలన అవృష్యత్వమును స్నిగ్ధత్వమును అది కలుగజేయదు. తిలయందు (నువ్వుగింజ యందు) కషాయ కటు తిక్త మధురములు విషమ సమ వేతములై యున్నవి. ఒకవేళ ఈ రసములే సమపాళ్ళలో నున్నచో అపుడు తిల యును పిత్త శ్లేష్మహరముగాని త్రిదోషహరముగాని అయియుండవలెను. కాని ఇది మాత్రము పిత్త కఫకరము. అందువలన ఇచట రసముల యొక్క కొంచెము కర్తృత్వము అకర్తృత్వము కొంచెమును అని విషమత్వము ఊహింపబడుచున్నది. "నానాత్మకానామ్" అను మొదలగు మూడు హేతువులు మాత్రము వికృతి సమవాయ విషమ సమవాయములకు రెండింటికీ ఆధారము. అందువలన నానాత్మకత్వము మొద లైన వానిచే వికృతి సమవాయము విషమ సమవాయములు రెండునూ కలుగుచున్నవి. "నానాత్మకానామ్" అనగా నానారూపములైన హేతువులవలన కలిగిన వానికి. అందు వలన హేతుభేద బలముచేతనే రసదోషముల రెండింటి యొక్క సమ్మేళనము వికృతముగానీ విషమముగానీ అగునని అర్థము. లేదా, "నానాత్మకానామ్" అనగా నానా ప్రమాణములున్నవానికి ఇట్టిదియు నానా ప్రమాణత్వము విషమ సమవాయము

నందు హేతువు. "పరస్పరేణ చోపహతానామ్" అనగా ఒకదానినొకటి నశింపజేయు గుణములకు అని అర్థము. పరస్పర గుణోపఘాతమనునది ఒకవేళ దోషములకు మాత్రము సామాన్యముగా రేనేలేనప్పటికీ అదృష్టవశమున కొంచెము అట్లు జరుగు నని తెలియవలెను. రసములకు మాత్రము ఎక్కువ బలము కలవాటివలన ఇతర (అల్పబలముకల) రసములకు ఉపఘాతము తప్పకకలుగును. "అన్యైశ్చ వికల్పనైః" అనగా ఇతరములగు భేదకములచే (విభేదించువానిచే). అచట రసము యొక్క భేదకములు స్వరసము, కల్కము మొదలగునవి; ఒకే ద్రవ్యమునకే కల్పనా విశేషముచే గుణాంతరములు కలుగుచున్నవి. దోషమునకు మాత్రము దూష్యాంతరములే (వివిధములైన దూష్యములే) గుణాంతర యోగముచేత భేదకములగును. సూత్రస్థానమునందు "స ఏవ కుపితో దోషః సముత్థానవిశేషతః. స్థానాన్తరగతశ్చైవ వికారాన్ కురుతే బహూన్" (సూ. 18) అని చెప్పబడినది. ఈ వ్యాఖ్యానమునందు రసములకు దోషములకును ఉత్కర్ష అపకర్షముల వలన కలుగు ఏ విషమ సమవాయము విడిగా చెప్పబడుచున్నదో అది యుక్తముగాదు. ఏలయనగా విషమ సమవాయమునందునూ ఉత్కృష్టముగానున్న రసమునకు మరియు దోషమునకును ఉత్కృష్టములగు గుణములు అపకృష్టములగువానికి (బలహీనముగానున్న రస దోషములకు అపకృష్ట గుణములు కలుగుననుటంచేసి అవయవప్రభావముల ననుమానింపకయే సముదాయ ప్రభావము ననుమానించుట శక్యమగును. ఇక ఇట్లు చెప్పబడవలెను - రసము యొక్క మరియు దోషము యొక్కయూ విషమ సమ్మేళనమునందు అవియే గుణములు ఎక్కువగాని తక్కువగాని కావు కానీ ఇతర గుణము కలుగును. హన్త! అట్లైనచో వ్యతిరేక కార్యకారణత్వములవలన ఈ సమవాయము వికృతమేయగును. అది ఇట్లు దోషస్థారితముగా నుండుటచే వేరొక విధముగా వ్యాఖ్యానింపబడుచున్నది. అది ఎట్లనగా రసములకు దోషములకు రెండు విధములగు సమ్మేళనము జరుగును - ప్రకృతికి అనుగుణమైనది మరియు ప్రకృతికి అననుగుణమైనది (వికృతమైనది). అచట ఏ సమ్మేళనము ప్రాకృతిక గుణములను నశింపజేయక యుండునో అది ప్రకృతి సమసమవాయ శబ్దముద్వారా చెప్పబడుచున్నది. ఏదైతే ప్రాకృత గుణములను నశింపజేయుటవలన కలుగునో అది వికృతి విషమ సమవాయమని పేర్కొనబడుచున్నది. వికృతమైన హేతువులవలన విషమమైనది ప్రకృతికి అననుగుణమైనది (వ్యతిరేకమైనది) వికృతి విషమ సమవాయము అని అర్థము. ఇచటనే వికృతి విషమ సమవాయమునందు నానాత్మకాది మూడు హేతువులను వివరించినట్లుగనే అనుసరింపవలెను. వికృతి సమవాయము విషమ

సమవాయములను వేర్వేరుగనే చెప్పువారు విషమ సముదాయము యొక్క వైషమ్య తారతమ్యముచేత అధిక వివరణముండుట వలన, విషమమైన అవయవ ముల గుణముల ననుమానించుట దుఃసాధ్యమగుటంజేసి అదియును ద్రవ్య వికార ప్రభావము ద్వారానే చెప్పుదురు.

11. తథాయుక్తే హి సముదాయే సముదాయప్రభావతత్త్వమేవమేవోపలభ్య తతో ద్రవ్యవికారప్రభావతత్త్వం వ్యవస్యేత్.

**తాత్పర్యము :** ఆ విధముగా (విషమముగా) కలసియున్న సముదాయము నందు సముదాయ ప్రభావతత్త్వమునే ఈ విధముగా (పై విధముగా) తెలిసికొని దాని నాధారముగా జేసికొని ఆపైన ద్రవ్య - వికారముల ప్రభావతత్త్వము తెలియ వలెను.

**ఆయుర్వేద దీపిక :** ఇక అట్లైనచో వికృతి విషమ సమవాయ జ్ఞాన మెట్లు కలుగునో "తథాయుక్తే" - అను మొదలగువాని ద్వారా చెప్పుచున్నాడు. "తథాయుక్తే సముదయ" అనగా వికృతి విషమ సమవాయమునందు అని అర్థము. "సముదాయప్రభావతత్త్వమ్" అనగా సమ్మిళిత ప్రభావతత్త్వము అని అర్థము. సమానముగా గ్రహింపబడిన తేనె నెయ్యిలయందు లేదా సూర్యావర్తమనబడు వ్యాధి యందలి దోష సముదాయమునందు తీసుకొనబడిన తేనె నెయ్యిల యందుండి గుణ- ములనుండి క్రమముగా వచ్చినదికాని మారకత్వము మరియు వాతాది దోష ప్రభావ గతముకాని సూర్యుని వృద్ధి ననుసరించి వృద్ధి పొందుట అనునవి సంయోగ మహిమ వలన కలిగినవే (కాని ఆ ద్రవ్యములందలి సహజ గుణములు లేదా ఆ దోషముల యందలి సహజ ప్రభావములుకావు) అని అర్థము. దోషము మరియు రసముల సమ్మేళనగతులు రెండింటి వలన ప్రకృతి సమ సమవాయ రూపమగు సన్నిపాత మును జ్వరనిదానమునందు దోషలక్షణముల సమ్మేళనము ద్వారా చెప్పుచున్నాడు. "పృథగుక్త లక్షణసంసర్గాద్వాన్ద్వికమన్యతమం సాన్నిపాతికం వా జ్వరం విద్యాత్." (నిదానస్థానము 1వ అధ్యాయము - దోషములకు వేర్వేరుగా చెప్పబడిన లక్షణముల సంసర్గము (రెండు దోషముల లక్షణముల కలయిక) వలన ద్వంద్వజ్వరమును లేదా అన్ని దోషముల లక్షణముల కలయిక వలన సన్నిపాత జ్వరమును తెలియవలెను). /వికృతి విషమ సమవేతమగు త్రిదోషములచే కలిగిన జ్వరమేది కలదో దానికి

చికిత్సాస్థానమునందు "క్షతే దాహః క్షతే శీతః" (చికిత్సా స్థానము 3 వ అధ్యాయము) అను మొదలగువానిద్వారా చెప్పబడినది/ అచట చెప్పబడిన శ్యావర్త కోశాతక్యాది మొదలైనవి వాతాదిజ్వరమునందు వేసేవేపు/ ఇటులనే రసమునందును ఆమ్రాతకము (అడవి మామిడి) నందు ప్రకృతి సమ సమవేతమైయున్నపుడు ఆ మాత్రము మధుర మనిమాత్రమే చెప్పబడినది.' అందువలన దానికి మధుర రసమునకు సామాన్యముగా వచ్చిన వాతపిత్త హరత్వ గుణముకూడ తెలిసియేయున్నది. వార్తాకము నందు కటుతిక్త రసముల వలన వాతకరత్వము ఉన్నప్పటికీ అచట ఆచార్యునిచే "వార్తాకం వాతఘ్నం" /అని సూత్రస్థానము నందలి 27వ అధ్యాయమున చెప్పబడియేయున్నది. "ఏవమ్" అను మొదలగునవి శాస్త్రమునందు వెలువరించబడిన ఆయా ఉదాహరణ మును అనుసరింపవలసినది. ప్రకృతి సమ సమవాయముగా నున్న రస-దోషముల గుణములద్వారా తెలిసియున్నప్పటికీ ద్రవ్యము యొక్క గుణము వ్యాధి యొక్క లక్షణము ఏది చెప్పబడుచున్నదో అది ఎక్కువగానూ స్పష్టత కొరకునూ అని తెలిసికొనవలెను.

12. తస్మాద్రసప్రభావతశ్చ ద్రవ్యప్రభావతశ్చ దోషప్రభావతశ్చ వికారప్రభావ తశ్చ తత్త్వముపదేక్ష్యామః

**తాత్పర్యము :-** కావున రసప్రభావమువలనను, ద్రవ్యప్రభావము వల నను, దోషప్రభావము వలనను, వికార ప్రభావము వలనను యథార్థమును ఉపదేశించ గలము. (తత్త్వమునుపదేశింపగలము.)

**ఆయుర్వేద దీపిక :** తస్మాత్ అను మొదలగువాని ద్వారా (పై విషయ మును) ఉపసంహరించుచున్నారు. తత్త్వమనగా రసాదుల ప్రభావతత్త్వము. ఇంతకు ముందు "తత్రాదౌ రసద్రవ్య దోషవికార ప్రభావానుపదేక్ష్యామః" అనుటవలన రసా దుల ప్రభావమును వ్యాఖ్యానించుటకు చేసిన ప్రతిజ్ఞ ఏది కలదో, అది రస ప్రభా వము ననుమానించుటచే ద్రవ్య ప్రభావమును చెప్పుట వలన మరియు దోష ప్రభా వము వలన వికార ప్రభావమును చెప్పుట వలననూ నిర్వర్తించబడినది. ఇచట మాత్రము వికృతి విషమ సమవాయాత్మకమగు ద్రవ్యము నందు లేదా వ్యాధియందు రసదోష ప్రభావముల ననుమానించుట ద్వారా ద్రవ్య వికార ప్రభావములను తెలిసి కొనుట యనునది లేకపోవటంచేసి వేరువేరుగా రసాది ప్రభావ తత్త్వములను చెప్పుకొనుట యను ప్రతిజ్ఞ పునరుక్తి కానేరదు. ఇచట ద్రవ్యములకు దివ్య ప్రభా

వము విపాక ప్రభావము అను రెండునూ ద్రవ్యప్రభావమునందు లేదా రసప్రభావము నందు అంతర్భాగములని భావించవలసియున్నవి. అచట రసమునకు అనుగుణమైన వీర్యవిపాక ప్రభావములు రెండు. ఏవి కలవో అవి రస ప్రభావమునందును,రసక్రమ మునకు చెప్పబడిన వీర్యవిపాకములకు రెంటింటికి విపరీతములగు వీర్యవిపాక ప్రభావ ములు రెండు ఏవికలవో అవి ద్రవ్య ప్రభావమునందునూ ఉండునని తెలియవలసి యున్నవి. "ఉపదేక్ష్యామః" అనగా తంత్రము సంతతి ద్వారా రసాది ప్రభావతత్త్వ మును వేరుగా చెప్పగలము అని అర్థము. రసాదుల ప్రభావము వివరముగా మొత్తము తంత్రమునందే చెప్పవలసియున్నది.

## ద్రవ్య ప్రభావము

**13.** తత్రైష రసప్రభావ ఉపదిష్టో భవతి. ద్రవ్యప్రభావం పునరుపదేక్ష్యామః. తైలసర్పిర్మధూని వాతపిత్తశ్లేష్మప్రశమనార్థాని ద్రవ్యాణి భవన్తి.

**తాత్పర్యము :-** అచట ఇట్లు రసప్రభావము ఉపదేశింపబడినది. ద్రవ్య ప్రభావమును మరల ఉపదేశింపబోవుచున్నాము. నూనె నెయ్యి తేనె అనునవి (క్రమ ముగా) వాతపిత్తశ్లేష్మములను శమింపచేయు ద్రవములు.

**ఆయుర్వేద దీపిక :-** ఇదియే సంక్షేపముగా చెప్పబడినది అని చూపుచూ "తత్రైష" అను మొదలగువానిద్వారా చెప్పుచున్నాడు. "ఏష" అనగా "రసాఃషట్" అని మొదలుకొని "తత్త్వముపదేక్ష్యామః" అనువరకు గల సూత్రము ద్వారా చెప్పబడినదని అర్థము. "ఉపదిష్టోభవతి" అనగా సంక్షేపముగా చెప్పబడి యున్నది. ఇతరులు మాత్రము "తత్రైష రసప్రభావ ఉద్దిష్టోభవతి" అని చదివెదరు. ఈ పక్షమునందు ఏ ద్రవ్యదోష వికారముల ప్రభావము కూడ ఇచట చెప్పబడి ఉన్నదో అదియును రసము ద్వారా (చెప్పబడియున్నది). అందువలన కేవలము రసముయొక్క వివరణమును పేర్కొనుట వలన దానిని పేర్కొనుటయే ఉప సంహరించుచున్నాడు కాని ద్రవ్యాదులను కాదని తెలియవలెను. "ద్రవ్యప్రభావమ్" అను మొదలగువాని యందు "పునః" అనగా సామాన్యముగా ద్రవ్యప్రభావమును చెప్పుటవలన మరల సంపూర్ణముగా తైలాది ద్రవ్యముల ప్రభావమును చెప్పబోవు చున్నాముఅని అర్థము. "ప్రశమనార్థాని" అనగా ప్రశమనము కొరకు అని అర్థము.

## నూనె నెయ్యి తేనెలను ఎల్లప్పుడు ఉపయోగించుట వలన వాతపిత్త శ్లేష్మములను క్రమముగా శమింపజేయుట

14. తత్ర తైలం స్నేహౌష్ణ్యగౌరవోపపన్నత్వాద్వాతం జయతి సతతమభ్యస్య-
మానమ్, వాతో హి రౌక్ష్యశైత్యలాఘవోపపన్నో విరుద్ధగుణో భవతి,
విరుద్ధగుణసన్నిపాతే హి భూయసాఽల్పమవజీయతే, తస్మాత్తైలం వాతం
జయతి సతతమభ్యస్యమానమ్, సర్పిః ఖల్వేవమేవ పిత్తం జయతి,మాధుర్యా-
చ్ఛైత్యాన్మందత్వాచ్చ; పిత్తం హ్యమధురముష్ణం తీక్ష్ణం చ. మధు చ
శ్లేష్మాణం జయతి, రౌక్ష్యాత్తైక్ష్ణ్యాత్ కషాయత్వాచ్చ, శ్లేష్మా హి స్నిగ్ధో
మన్దో మధురశ్చ. యచ్చాన్యదపి కించిద్ద్రవ్యమేవం వాతపిత్తకఫేభ్యో గుణతో
విపరీతం స్యాత్తచ్చైనాఞ్జయత్యభ్యస్యమానమ్.

తాత్పర్యము : అచట తైలము స్నిగ్ధ, ఉష్ణ, గురు గుణములచే కూడి యుండుటచేత ఎల్లప్పుడు సేవించుటవలన వాతమును జయించును. వాతము రూక్ష, శీత, లఘుగుణములు కలిగి తైల గుణములకు విరుద్ధ గుణములు కలదిగానగుచున్నది. విరుద్ధ గుణముల కలయిక యందు ఎక్కువగా నున్నవానిచే అల్పముగా నున్నవి ఓడింపబడుచున్నవి. అందువలన ఎల్లప్పుడును అభ్యసించుట వలన తైలము వాతమును జయించును. ఘృతము ఇటులనే మధురత్వము, శీతగుణము, మందగుణముల వలన పిత్తమును జయించును. పిత్తము అమధురము, ఉష్ణము, తీక్ష్ణములను కలిగి యున్నది. తేనెయును రూక్షత్వము వలన, తీక్ష్ణత్వము వలన, కషాయరసమును కలిగియుండుట వలనను శ్లేష్మమును జయించును. శ్లేష్మము స్నిగ్ధము, మందము, మధురమునై యున్నది. ఇతర ద్రవ్యమేదైననూ ఈ విధముగా వాత పిత్త కఫముల కంటె గుణము వలన వ్యతిరేకముగా నున్నచో దానిని అభ్యసించుట వలన ఆయా దోషములను జయించును.

ఆయుర్వేద దీపిక : "సతత మభ్యస్యమానమ్" అనగా ఎడతెగక ఉపయోగింపబడుచున్న అని అర్థము. "విరుద్ధగుణః" అనగా తైలము యొక్క గుణము కంటె వ్యతిరేకమైన, "విరుద్ధ గుణ సన్నిపాతే" అనగా విరుద్ధ గుణముల సమ్మేళనమునందు. గుణమునకు విరుద్ధగుణముల మధ్యను ఎక్కువగానున్న వానిచేత అల్పము జయింపబడుచున్నది గదా, అది ఎట్లు తైలము వాతమును జయించును? వానికి వాతమునకు [illegible] గుణములు [illegible] కాదు? అని [illegible] "సతత

మభ్యస్యమానమ్" అనుట ద్వారా చెప్పుచున్నాడు. సతతము ఉపయోగించుట వలననే తైలము వాతము కంటే ఎక్కువగును, అందువలన వాతమును జయించునని అర్థము. "సర్పిః ఖల్వేవమేవ" అనగా ఘృతము కూడా సతతము ఉపయోగించుచున్నట్టిది అని అర్థము "అమధురమ్" అనగా మధుర రస గుణములకు వ్యతిరేక గుణములను రూక్ష, లఘు, అవృష్యత్వములు కల కటు రసము అని అర్థము. ఇచటయును ప్రభావశబ్దము వలన సామాన్యముగా ద్రవ్యశక్తి చెప్పబడుచున్నది కాని అచింత్య శక్తి కాదు: అందువలన తైలాదులకు వాతాదులను శమింపజేయుట యనునది స్నిగ్ధ ఉష్ణ గుణాదుల వలన నైనను ద్రవ్య ప్రభావము వలననే కలుగును. ఘృతమునందును మధురరసము పిత్తప్రశమము నందు ఉపయోగపడుచున్నప్పటికీ మాధుర్య శైత్య మందత్వముల వలన పిత్తమును శమింప జేయుట యనునది ఘృతము యొక్క కార్యమే యగును. అందువలన అది ద్రవ్య ప్రభావమనియే చెప్పబడుచున్నది. ఎప్పుడైతే రసము ద్వారా ద్రవ్యము యొక్క కార్యము చింతింపబడుచున్నదో, అపుడు రసప్రభావము అని చెప్పుట జరుగును. ఇటులనే కషాయాను రసమునందు తేనె యొక్కయు సమాధానము చెప్పవలసి యుండును. కొందరు ఇట్లు చెప్పుదురు - తైలాదులకు వాతాదులను శమింపజేయుట యను దానికి అచింత్య ప్రభావమే ఇది అని చెప్పబడుచున్నది. అచటయును తైలము మరియు వాతము-ఈ రెండింటి యొక్క విరుద్ధ గుణముల యొక్క సమ్మేళనమునందు తైలమే వాతమును జయించును కాని వాతము తైలమును మాత్రము కాదు అనునది తైలము యొక్క అచింత్య ప్రభావము. ఇట్లే ఘృతము తేనెలకును పిత్త శ్లేష్మహారణము నందు ప్రభావము వలన తెలియవలసి యున్నది. దీనిని కొందరు అంగీకరింపరు. ఎందువలననగా తైలాదులకు "సతతమభ్యస్యమానమ్" (ఎల్లప్పుడు అభ్యసింపబడు చున్న) అను పదము వలన ఈ అధిక్యమే వాతాదులను జయించుటకు కారణముగా చెప్పబడినది. మరియు (ఇంకేదైనప్పటికీ కొంచెము ద్రవ్యము) "యత్స్వాన్యదపి కించిద్ద్రవ్యమ" అను మొదలగు సూత్రము వలన ద్రవ్యము యొక్క అచింత్య ప్రభావమును వదలి సామాన్యముగా గుణవ్యతిరేకతయే అభ్యాసము వలన వాతాదులను జయించుటకు కారణముగా చెప్పబడుచున్నది.

## పిప్పళ్ళు - క్షారము - లవణముల అధిక సేవనము వర్జనీయము

15. అథ ఖలు త్రీణి ద్రవ్యాణి నాత్యుపయుఞ్జీతాధికమన్యేభ్యో ద్రవ్యేభ్యః తద్యథా-పిప్పలీక్షారః లవణమితి.

**తాత్పర్యము :** పిప్పళ్ళు, క్షారము, లవణము అను ఈ మూడు ద్రవ్యములను ఇతర ద్రవ్యములకంటె ఎక్కువగా ఉపయోగించరాదు.

**ఆయుర్వేద దీపిక :** అభ్యసింపవలసిన ద్రవ్యమును ప్రభావ ఉదాహరణముగా పేర్కొన అభ్యసింపకూడని ద్రవ్యములను పేర్కొనుటకు "అథ" అను మొదలగునవి చెప్పుచున్నాడు. "అధికమన్యేభ్యః" అను వచనముచేత ఇతరము లైనను చిత్రకము భల్లాతకము మొదలగు ఇటువంటి జాతికి చెందిన వానిని అతిగా నుపయోగింపరాదు, పిప్పలీ మొదలగు ద్రవ్యములు మాత్రము ఇతరముల కంటె కూడ అధికముగా అతిగా ఉపయోగించుట వర్జింపవలసినది అని చూపుచున్నాడు.

## పిప్పళ్ళను అధికముగా సేవింపరాదనుటకు గల కారణములు

16. పిప్పల్యో హి కటుకాః సత్యో మధుర విపాకా గుర్వ్యో న చాత్యర్థం స్నిగ్ధోష్ణాః ప్రక్లేదిన్యో భేషజాభిమతాశ్చ తాః సద్యః, శుభాశుభకారిణ్యో భవన్తి: ఆపాత భద్రాః. ప్రయోగసమసాద్గుణ్యాత్: దోషసఞ్చయానుబన్ధాః, సతత ముపయుజ్యమానా హి గురు ప్రక్లేదిత్వాచ్ఛ్లేష్మాణముత్క్లేశయన్తి, ఔష్ణ్యాత్ పిత్తం, న చ వాతప్రశమనాయోపకల్పన్తేఽల్పస్నేహోష్ణ భావాత్: యోగవాహిన్యస్తు ఖలు భవన్తి. తస్మాత్పిప్పలీర్నాత్యుపయుఞ్జీత.

**తాత్పర్యము :** పిప్పళ్ళు కటురసము కలవై యుండి మధుర విపాకము గురుగుణము గలవగును. ఎక్కువగా స్నిగ్ధ, ఉష్ణములు లేక యుండును. క్లేదమును (తేమను) ఎక్కువగా కలిగించును. ఇవి ఔషధమువలె వాడిన వెంటనే శుభ ఫలితముల నిచ్చునవగును. అధికముగా వాడినచో అశుభఫలితముల నిచ్చును. సరిగా ప్రయోగించుటచే మంచి గుణములనిచ్చి, అప్పటి తప్పును మంచిని చేయును. ఎల్లప్పుడు ఉపయోగించుటవలన దోష సంచయమునకు కారణములగును. గురుత్వమువలన అధికముగా క్లేదనమును కలిగించుటవలన శ్లేష్మమునకు ఉత్క్లేశమును కలుగజేయును. ఉష్ణత్వమువలన పిత్తమును పెంచును. అల్ప స్నేహోష్ణములవలన వాతప్రశమనమునకును ఉపయోగపడవు. ఇవి యోగవాహులై యుండును. అందుచేత పిప్పళ్ళను అధికముగా ఉపయోగింపరాదు.

ఆయుర్వేద దీపిక : "కటుకాః సత్యో మధురవిపాకాః" అను మొదలగు పిప్పలియొక్క గుణములను చెప్పుట అలవాటుగా కాకుండా (తప్పవగా తప్పవకాలము) ప్రయోగింపబడుటవలన, దోషమై సరీత్యమువలన దోషప్రకోపమును చూపుటకొరకు: మరియు అతిగా అభ్యసించుటయందు "గురుప్రక్లేదిత్వాచ్ఛ్లేష్మాణ ముత్క్లేదయంతి" అను మొదలగు సూత్రమున చెప్పవలసిన దోషమును కలుగజేయు గుణమును చూపించుటకును చెప్పబడినవి. "భేషజాభిమతాశ్చ సద్యః" అని భేదము. "సద్యః" అనగా అభ్యాసము కాకుండుట యందు (కొంచెముగా ఉపయోగించి నప్పుడు). "శుభా శుభ కారిణ్యో భవన్తి". అనగా కొంచెముప్రయోగించుటయందు శుభము నిచ్చునవి, అతిగా అభ్యసించుటయందు అశుభకరములు. ఇదియే శుభాశుభకరత్వమును "ఆపాతభద్రాః" అను మొదలగు వానిద్వారా చూపుచున్నాడు. "ప్రయోగ సమసాద్గుణ్యాత్" అనగా సమ మైన ప్రయోగముయొక్క సద్గుణత్వమువలన సమయమునందు అనగా అల్ప కాలమందు మరియు అల్పమాత్రయందును పిప్పల్యాది ప్రయోగమునందు సద్గుణములు కలుగునని అర్థము. దోషసంచయానుబంధమనగా వేని ఉపయోగము అతిగా నుండునో అవి దోష సంచయమునకు కారణము లగును. ఇదియే దోషసంచయానుబంధమును "సతతమ్" అను మొదలగువానిద్వారా వివరించుచున్నాడు. పిప్పలి యొక్క ధర్మమును చెప్పు ప్రస్తావన వలన 'యోగ వాహిన్యస్తు' అను మొదలగు ఇతర గుణములను చెప్పుచున్నాడు.\ యోగవాహిత్వమువలన కటు రసము గలవై నప్పటికీ పిప్పళ్ళను వృష్యయోగముగా ప్రయోగింపబడుట గలదు. మరియు జ్వర, గుల్మ, కుష్ఠహర, మొదలగు ప్రయోగములయందు జ్వరాదులను పిప్పళ్ళు నశింప చేయుచున్నది.( ఈ పిప్పలియొక్క అతియోగమును నిషేధించుట, యనునది అపవాదమును వదలి అని అర్థము. అందువలన పిప్పలీ రసాయన ప్రయోగము మరియు గుల్మాదులయందు పిప్పలీ వర్ధమానక ప్రయోగము విరోధమును పొందవు. చెప్ప బడిన విషయమునందీ యుక్తివిధానము వలన పిప్పళ్ళు నిర్దోషములగునని యుక్తి వచనముచేత సూచింప బడుచున్నది. కొందరు మాత్రము అన్న సంస్కారణము నందు పిప్పళ్ళ ప్రయోగము నిషేధింతురు. స్వతంత్రముగా ప్రయోగించుట నిషేధము చేసిరి అందురు. "సతత ముపయుజ్యమాన" అనగా ఎక్కువ కాలము మరియు ఎక్కువ ప్రయోగమువలన అనియు గ్రహింపవలెను.

## క్షార గుణములు - దాని నెక్కువ సేవించుటవలన కలుగు దుష్ఫలితములు

17. క్షారః పునరౌష్ణ్య తైక్ష్ణ్య లాఘవోపపన్నః క్లేదయత్యగ్రే పశ్చాద్విశోషయతి, స పచన దహన భేదనార్థముపయుజ్యతే; సోఽతిప్రయుజ్యమానః కేశాక్షిహృదయపుంస్త్వోపఘాతకరః సంపద్యతే. యే హ్యేనం గ్రామ-నగరనిగమజనపదాః సతతముపయుఞ్జతే త ఆన్ధ్య షాణ్ఢ్య ఖాలిత్యపాలిత్య భాజో హృదయాపకర్తినశ్చ భవన్తి, తద్యథా - ప్రాచ్యాశ్చీనాశ్చ; తస్మాత్ క్షారం నాత్యుపయుఞ్జీత.

**తాత్పర్యము :** క్షారము ఉష్ణ తీక్ష్ణ లఘుగుణములు కలిగి మొదట క్లేదనమును కలిగించి అటు పిమ్మట ఎక్కువగా శోషింపజేయును. అది పచన దహన భేదనార్థము ఉపయోగింపబడును. అది ఎక్కువగా ప్రయోగింప బడుచుండుటచే వెంట్రుకలు, కన్నులు, హృదయము పురుషత్వములకు హాని కలిగించునదగును. దీనిని ఎల్లప్పుడు ఉపయోగించు గ్రామ, నగర, జనపద వాసులు, ఉదాహరణమునకు ప్రాచ్య దేశస్థులు మరియు చైనీయులు, గ్రుడ్డితనము, నపుంసకత్వము, బట్టతల, వెంట్రుకలు నెరయుట అను వ్యాధుల పాలగుదురు. ఇంకను వీరికి హృదయమున కత్తిరించుచున్నట్లు బాధ కలుగును. అందువలన క్షారమును అధికముగా ఉపయోగింపరాదు.

**ఆయుర్వేద దీపిక :** "హృదయాపకర్తినః" అనగా హృదయము కత్తిరించుచున్నట్టి వేదన గలవారు అని అర్థము.

## ఉప్పు గుణములు దానినెక్కువగా ఉపయోగించుట వలన కల్గు దుష్ఫలితములు

18. లవణం పునరౌష్ణ్య తైక్ష్ణ్యోపపన్నమ్, అనతిగురు, అనతి స్నిగ్ధమ్, ఉపక్లేది, విస్రంసన సమర్థమ్, అన్నద్రవ్యరుచికరమ్, ఆపాతభద్రం ప్రయోగసమసాద్గుణ్యాత్, దోషసంచయానుబన్ధం, తద్రోచనపాచనోపక్లేదనవిస్రంసనార్థ-ముపయుజ్యతే తదత్యర్థముపయుజ్యమానం గ్లానిశైథిల్యదౌర్బల్యాభి-

నిర్వృత్తికరం శరీరస్య భవతి. యే హ్యేతద్గ్రామనగరనిగమజనపదాః సతతము పయుఞ్జతే, తే భూయిష్ఠం గ్లాస్నవః శిథిలమాంసశోణితా అపరిక్లేశసహాశ్చ భవన్తి. తద్యథా - బాహ్లీకసౌరాష్ట్రికసైన్ధవసౌవీరకాః; తే హి పయసాఽపి సహ లవణమశ్నన్తి. యేఽపీహ భూమేరత్యూషరా దేశాస్తేష్వోషధివీరుద్వనస్పతివానస్పత్యా న జాయన్తేఽల్పతేజసో వా భవన్తి, లవణోపహతత్వాత్. తస్మాల్లవణం నాత్యుపయుఞ్జీత. యే హ్యతిలవణసాత్మ్యాః పురుషాస్తేషామపి ఖాలిత్యపాలిత్యాని వలయశ్చాకాలే భవన్తి.

**తాత్పర్యము :** ఉప్పు ఉష్ణ తీక్ష్ణగుణములు కలిగి ఎక్కువ గురుగుణము లేక, ఎక్కువ స్నిగ్ధగుణము లేకయుండును. కొంచెము క్లేదమును కలిగించును. మలములను సడలించి బయటకు వెడలింపజేయుటకు సమర్థమైనది. అన్నద్రవ్యము లతో దీనిని చేర్చిన వీటికి రుచి పుట్టించును. సరిగా ఉపయోగించినచో మంచి గుణముల నిచ్చును. దోష సంచయమునకు కారణమగును. అది రుచిని, అన్నపాచనమును, ఉపక్లేదనమును, మలవిస్రంసనమును కలిగించుట కొరకు ఉపయోగింపబడును. అది ఎక్కువగా ఉపయోగింపబడుచున్నపుడు శరీరమునకు గ్లాని (సంతోషము లేకుండుట), శిథిలత్వము, దుర్బలత్వములను కలుగజేయునదగును. దీని నెక్కువగా ఏ గ్రామ నిగమనగర జనపదములందు నివసించు వారుపయోగింతురో, ఉదాహరణమునకు-బాహ్లీక, సౌరాష్ట్ర, సింధు, సౌవీర దేశస్థులు, వారు ఎక్కువ గ్లానిని కలిగియుందురు. వారికి మాంస రక్తములు శిథిలమైయుండును, వ్యాధి క్షమత్వశక్తి లేకయుండును. వారు పాలతో కూడా లవణమును చేర్చి భుజింతురు. ఇచటి భూములను అతి ఊషరములో కూడి (చవుడు) అందు ఓషధులు వీరుత్తులు వనస్పతి వానస్పత్యములు జనించవు. ఒక వేళ జనించినను భూముల లవణముచే బలహీనపడి యుండుటవలన అల్పమైన శక్తిని మాత్రమే కలిగియుంటవి. అందువలన లవణమును అతిగా ఉపయోగింపరాదు. ఎక్కువగా లవణమును తిను అలవాటున్న వారికికూడా బట్టతల, వెంట్రుకలు నెరయుట శరీరమున ముడతలు అకాలమున వచ్చుట జరుగును.

**ఆయుర్వేద దీపిక :** గ్లాని యనగా మాంసము క్షీణించుట [illegible] సంతోషము లేకుండుట. లవణము నధికముగా సేవించుట మాత్రమే శరీరమునకు గ్లాని కలిగించుటయేగాక లవణమధికముగానున్న భూమికూడా హానికలిగించును. "యేఽపీహ" అను మొదలగువానిద్వారా చెప్పుచున్నారు. ఊషరా అనగా లవణ ప్రధానమైనవి (చౌడుభూములు). "లవణం నాత్యుపయుఞ్జీత" అనగా ఎక్కువ

మోతాదులో ఎల్లప్పుడును లవణము నుపయోగింపరాదు అని అర్థము అన్నద్రవ్యము లను సంస్కరింపబడు లవణము మాత్రము అల్పమాత్రముగా అభ్యసించుట వలననూ ఉపయోగింపదగినదే. బాహ్లీకాదులే కాకుండా ఇతర దేశములందు ఎవరు లవణమును ఎక్కువగా భుజింతురో వారికిని దోషములను "యే హి" అను మొదలగు వాని ద్వారా చెప్పుచున్నాడు. ఇందువలననూ ఇతరచోట్ల కూడా అతిమాత్రమున లవణ ముపయోగించు అలవాటు ఉన్నవారికి శైథిల్యాది దోషములు లవణమును అతిగా సేవించుట వలననే కలుగునని ఊహింపబడుచున్నది. ఇది దేశ స్వభావము వలన కాదు.

## సాత్మ్యముగా గ్రహించు పదార్థములను విడచు విధానము

19. తస్మాత్తేషాం తత్సాత్మ్యతః క్రమేణాపగమనం శ్రేయః. సాత్మ్యమపి హి క్రమేణోపనివర్త్యమానమదోషమల్పదోషం వా భవతి.

తాత్పర్యము : అందువలన వారికి (లవణమును అతిగా సేవించు అల వాటున్నవారికి) ఆ సాత్మ్యత నుండి (అలవాటు నుండి) క్రమముగా తప్పించుట మంచిది.

ఆయుర్వేద దీపిక ; "తేషామ్" అనగా అతిగా క్షార లవణములను అలవాటుగా ఉపయోగించువారికి, "తత్సాత్మ్యతః" అనగా ఎక్కువ మోతాదులో క్షార మును ఎక్కువ మోతాదులో లవణమును ఉపయోగించు అలవాటునుండి అని అర్థము. ఇచట సాత్మ్యశబ్దము వలన ఓకసాత్మ్యము అని అభిప్రాయము (ఓక సాత్మ్యమనగా అభ్యాస సాత్మ్యము). "అల్పదోషమదోషం వా" అనగా రెండు పక్ష ములయందు అతిసాత్మ్యము అల్పదోషమగును. ఇతరము అదోషము అని వ్యవస్థ కలదు.

## సాత్మ్యముయొక్క నిరుక్తి - భేదములు

20. సాత్మ్యం నామ తద్ యదాత్మన్యుపశేతే; సాత్మ్యార్థో హ్యుపశయార్థః. తత్త్రివిధం ప్రవరావరమధ్యవిభాగేన; సప్తవిధం తు రసైకైకత్వేన సర్వర- సోపయోగాచ్చ. తత్ర సర్వరసం ప్రవరమ్, అవరమేకరసం, మధ్యం తు ప్రవరావరమధ్యస్థమ్. తత్రావరమధ్యాభ్యాం సాత్మ్యాభ్యాం క్రమేణైవ ప్రవర-

ముపపాదయేత్ సాత్మ్యమ్. సర్వరసమపి చ సాత్మ్యముపసన్నః ప్రకృత్యా-ద్యుపయోక్త్రష్టమాని సర్వాణ్యాహారవిధివిశేషాయతనాన్యభిసమీక్ష్య హితమే-వానురుధ్యేత.

**తాత్పర్యము :** సాత్మ్యమనునది - ఆత్మకు ఉపశయమునేది కలిగించునో అది సాత్మ్యము. సాత్మ్యమునే ఉపశయముగా పేర్కొనవచ్చును. అది మూడు విధములు — ప్రవర - అవర - మధ్యములు. ఒక్కొక్కరసము మరియు అన్ని రసముల కలిపియును ఏడువిధములుగా నున్నది. అచట సర్వరస సాత్మ్యము ప్రవరము. ఏకరస సాత్మ్యము అవరము. మధ్యమ సాత్మ్యమనునది ప్రవరావరము-లకు మధ్యనున్నది. అచ్చట అవర మధ్యసాత్మ్యము గలవారిని క్రమముగనే ప్రవర సాత్మ్యమునకు తేవలెను. సర్వరస సాత్మ్యమునకు వచ్చినప్పుడు కూడ ప్రకృతి మొదలైన ఎనిమిది ఆహార విధివిశేషాయతనములను అభిసమీక్షించి హితమునే (హితమైన దానినే) సేవింపవలెను.

**ఆయుర్వేద దీపిక :** "సాత్మ్యం నామ" అనగా ఓకసాత్మ్యమనగా అని అర్థము. ('ఓకాత్' అనగా అభ్యాసమువలన) "ఉపశయార్థః" అనగా ఉపశయ శబ్దమును పేర్కొనవలెనని అర్థము. "తత్" అనగా ఓకసాత్మ్యము "త్రివిధమ్" అనగా ప్రవర అవర మధ్య భేదములవలన (మూడువిధములు). సప్త విధం— ఒక్కొక్క రసమువలన ఆరు, రసముల సంసృష్టము వలన ఒకటి ఇట్లు ఏడు విధములు. సంసృష్ట శబ్దమువలన రెండు రసములు మొదలుకొని ఆరురసముల వరకు తీసుకొనబడుచున్నవి. ప్రవరావర మధ్యస్థమనునది రెండు రసములు మొదలు కొని ఐదురసముల వరకు (వర్తించును). అవర మధ్యమములచే లక్షితుడైన పురుషుడు. "ప్రవరమ్" అనగా అన్ని రసములు కూడినది. "సాత్మ్యముపపాదయేత్" అనగా అభ్యసింపజేయవలెనని అర్థము. "క్రమేణ" అనగా చెప్పబడిన అభ్యాస క్రమముచేత. "సర్వరసమ్" అను మొదలగువాని వలన అభ్యసించిన సర్వరస సాత్మ్యము వలన కూడా తీసుకొను ఆహారము ప్రశస్తములగు ప్రకృతి మొదలగు ఎనిమిది ఆహార విధి విశేషాయతనములతో సంపన్నమైనదానినే తీసుకొనవలెనని చెప్పుచున్నాడు. "అభిసమీక్ష్య" అనగా హితాహితత్వము వలన విచారించి "హిత-మేవ" అను పదమువలన ఏది ప్రకృతి మొదలగు ఉపయోక్త్ర [illegible] పరీక్షింపగా [illegible] షము హితముగానుండునో దానినే— "అనురుధ్యేత" సేవింపవలెను అని అర్థము.

## ఎనిమది ఆహారవిధి విశేషాయతనములు

21. తత్ర ఖల్విమాన్యష్టావాహారవిధివిశేషాయతనాని భవన్తి: తద్యథా – ప్రకృతి-కరణసంయోగరాశిదేశకాలోపయోగసంస్థోపయోక్త్రష్టమాని (భవన్తి).

**తాత్పర్యము :** ఈ క్రింది ఎనిమిది ఆహార విధి విశేషాయతనములగు చున్నవి. అవి ఏవనగా (ఆహారవిధికి విశేషకారణములు) – ప్రకృతి, కరణము, సంయోగము, రాశి, దేశము, కాలము, ఉపయోగసంస్థా మరియు ఎనిమిదవది ఉపయోక్త.

**ఆయుర్వేద దీపిక :** ఆహారము యొక్క విధి, ప్రకారము లేదా విధానము అనునది ఆహారవిధి. దానియొక్క విశేషము హితముగా నుండుట మరియు అహితముగానుండుట, దానియొక్క ఆయతనములనగా హేతువులు అనునవి ఆహార విధి విశేషాయతనములు. ఆహార ప్రకారముయొక్క హితత్వము మరియు అహితత్వమునకు ప్రకృతి మొదలైనవి హేతువులని అర్థము. వేనికి ఉపయోక్త ఎనిమిదవగానుండునో అవి ఉపయోక్త్రష్టమములు.

## ప్రకృతి

1. తత్ర ప్రకృతిరుచ్యతే స్వభావో యః, స పునరాహారౌషధద్రవ్యాణాం స్వాభావికో గుర్వాదిగుణయోగః: తద్యథా-, మాషముద్గయోః, శూకరైణయోశ్చ.

**తాత్పర్యము :** అచట స్వభావమేది కలదో అది ప్రకృతి యనబడుచున్నది. అది మరల ఆహార ఔషధ ద్రవ్యములకు స్వభావ సిద్ధముగానుండు గురు, లఘు మొదలగు గుణముల యోగము. అది ఎట్లనగా మినుములకు గురుగుణము పెసలకు లఘు గుణము, పందికి గురుగుణము, లేడికి లఘు గుణము (స్వభావముగనే యున్నట్లు).

**ఆయుర్వేద దీపిక :** "తత్ర" అను మొదలగు వాని వలన చెప్పబడిన ప్రకృతి మొదలగునవి విభజింపబడుచున్నవి. "స్వాభావికః" అనగా సంస్కారము చేత కలసి (ఆద్రవ్యమునందు) యున్నవి. "మాషముద్గయోః" అనగా ప్రాకృతికముగా మినుమునందు గురుత్వము మరియు పెసలయందు లఘుత్వము, పందియందు గురుత్వము లేడియందు లఘుత్వము ఉన్నవి అని అర్థము.

## కరణము

2. కరణం పునః స్వాభావికానాం ద్రవ్యాణామభిసంస్కారః సంస్కారో హి గుణాన్తరాధానముచ్యతే. తే గుణాస్తోయాగ్ని సన్నికర్ష శౌచ మన్థన దేశకాల వాసన భావనాదిభిః కాల ప్రకర్ష భాజనాదిభిశ్చాధీయన్తే.

**తాత్పర్యము :** కరణమనునది స్వాభావికములగు ద్రవ్యములకు చేయు సంస్కారము. సంస్కారమే ఇతరగుణములను తెచ్చునదనబడుచున్నది. జల - అగ్ని సన్నికర్షము, శౌచము (శుభ్రపరచుట) మన్థనము (చిలుకుట), దేశము, కాలము, ఊరబెట్టుట, భావన చేయుట మొదలగువానివలన కొంతకాలమువరకు నిలువ యుంచుట, వివిధపాత్రల నుపయోగించుట మొదలగువానివలన కూడా ఆ గుణములు వచ్చునట్లు చేయబడుచున్నవి.

**చక్రపాణి :** "ద్రవ్యాణామ్" అని చెప్పుటయందు "స్వాభావికానామ్" అని చేసి చెప్పుటవలన ఉత్పత్తికాలమునందు అవి కలుగుటకు కారణమైనవానిచే స్వగుణములు ఆరోపింపబడుట. సంస్కారమనునది ఉత్పన్నమైనట్టిదానికే జలము మొదలగువానివలన గుణములను తెచ్చుట అని చూపుచున్నారు. అదియును ప్రాకృత గుణములను బలహీనపరచుట చేతనే చేయబడును. ఎట్లనగా :- జలము, అగ్ని సన్నికర్షము, శుభ్రపరచుటల వలన బియ్యమునందున్న గురుత్వమును నశింపచేసి (బలహీనపరచి), అన్నమునందు లఘుత్వము వచ్చునట్లు చేయబడుచున్నది. ఈ విషయమునే సూత్రస్థానమున "సుధౌతః ప్రస్రుతః స్విన్నః సంతప్తశ్చౌదనో లఘుః." (27వ అధ్యాయము - సూత్రస్థానము) అని చెప్పబడినది. మరియు రక్తశాలి మొదలగువానికి లఘుత్వమున్నటికీ అగ్ని సంయోగము మొదలగువానివలన లఘుత్వము వృద్ధి చేయబడుచున్నది. మంథనము వలన గుణాధానమునకు ఉదాహరణము "శోథకృద్దధి శోథఘ్నం సస్నేహమపి మన్థనాత్." - అనగా పెరుగు (దధి) శోథ రోగమును కలిగించునదైనను చిలుకుటవలన స్నేహముతో కూడి శోథను నశింపచేయును. దేశమువలన గుణాంతరధాన మెట్లనగా "భస్మరాశేరధః స్థాపయేత్" (చికిత్సాస్థానము 1వ అధ్యాయము 3వ పాదము), అనగా భస్మరాశిక్రింద స్థాపించవలెను మొదలనవి (ఇట్లు చేయుటవలన ఆ ద్రవ్యమునందు వేరుగుణమును తీసికొని రావచ్చును.) వాసనమువలన (ఊరబెట్టుట). గుణాంతరాధాన మెట్లనగా నీటియందు కలువలు మున్నగువానిని వాసనము చేయుటవలన నీటికి సుగంధమును

కల్పించుట మొదలగునవి. భావనవలనను - స్వరసము మున్నగువానిచే ఆమలకము (ఉసిరి) మున్నగువానికి ముందు ఉన్న గుణములను పెంచుటయను గుణాంతరాధానము జరుగును. కాలప్రకర్షమువలన గుణాంతరాధానము జరుగుట కుదాహరణ - "పక్షాజ్జాతరసం పిబేత్" - (చికిత్సా స్థానము 15వ అధ్యాయము). అనగా ఒక పక్షమునకు వచ్చిన ద్రవమును త్రాగవలెను. (ద్రవ్యములను యోగోక్త ప్రకారముగా ఆసవారిష్ట కల్పనావిధానములో కొంతకాలము నిలువయుంచి తరువాత ద్రవద్రవ్యమును తీసికొని వాడుదురు). పాత్ర వలన గుణాంతరము వచ్చుటకుదాహరణ - "త్రైఫలేనాయసం పాత్రం కల్కేనాలేపయేత్" (చికిత్సాస్థానము - 1వ అధ్యాయము 3వ పాదము) (ఇనుప పాత్రను త్రిఫలా కల్కముతో లేపనము చేయవలెను) అను మొదలగునవి. "ఆది" అను శబ్దమును గ్రహించుటవలన పేషణము, అగ్నిమంత్రిణము మొదలగునవి గ్రహించబడుచున్నవి. నిజమునకు సంస్కారమువలన వచ్చినగుణము వలన ఎట్లు (ద్రవ్యము యొక్క) స్వభావ సిద్ధమగు గుణము నశింపబడుచున్నది, ఏలయనగా స్వభావము నశింప జేయలేనిదిగదా! ఒకవేళ సంస్కారము వలననే స్వాభావికమగు గురుత్వము బలహీనపర్చబడు చున్నదో అపుడు "స్వభావము ప్రతిక్రియకు వీలుకానిది" అనుటెట్లు? అందులకు వివరణము - స్వభావో నిష్ప్రతిక్రియః. అనుట స్వభావము భావముల (ద్రవ్యముల) ఉత్పత్తియందే స్వభావముండునో దానిని మార్చివేయుట కష్టము. అందువలన మినుములు మొదలగువానికి పుట్టుకతో వచ్చిన గురుత్వమును వాని ఉత్పత్తియందు నశింపజేయుటకు తరముగాదు. సంస్కారము వలన మాత్రము దానిని ప్రత్యక్షముగా చూచుచుండుటవలన మార్చుటకు వీలు పడును. ద్రవ్యములకుండు ఒకానొకగుణము సంస్కారాదులవలనను వేరుగా మార్చుటకు వీలుపడదు. ఉదాహరణకు —

అగ్నియొక్క ఉష్ణత్వము, వాయువునకుగల చలత్వము తైలమునకు స్నేహగుణము ఈ మొదలగునవి. ఈ గుణములు మాత్రము ద్రవ్యమున్నంతవరకు ఉండును. పురాణధాన్యము మొదలగు వానియందు గురుత్వము మొదలగు గుణములు మాత్రము అదృశ్యమైపోవుట మనము చూచుటవలన అవి ద్రవ్యముండునంతవరకు ఉండునవి కావు. "గుణో ద్రవ్య వినాశాద్వా వినాశముపగచ్ఛతి, గుణాన్తరాధానాద్వా" అని చెప్పబడియేయున్నది. అనగా - ఒక ద్రవ్యమలందలి గుణము ఆ ద్రవ్యము నశించుటచే గానీ అదే ద్రవ్యమునకు వేరుగుణమును తెచ్చుటవలనగానీ వినాశము నొందును - అని అర్థము ధ్యానమును సంస్కరించుట వలన లాజగా (పేలాలుగా) అగుట ద్రవ్యమార్పిడియే అగును. అచట వేరుగుణము యొక్క ఉత్పత్తి సరియైనదే.

## సంయోగము

3. సంయోగః పునర్ద్వయోర్బహూనాం వా ద్రవ్యాణాం సంహతీభావః స విశేష-
మారభతే, యం పునర్నైకైకశో ద్రవ్యాణ్యారభన్తే, తద్యథా-మధుసర్పిషోః,
మధుమత్స్య పయసాం చ సంయోగః.

**తాత్పర్యము :** సంయోగమనగా రెండుగానీ ఎక్కువగానీ ద్రవ్యముల కలయిక. ఇట్టి సంయోగముచే విశిష్టద్రవ్యమేర్పడును. ఆ విశేషత్వమునకు ఈ ద్రవ్యముల కలయికకు ముందువానిలో వేర్వేరుగా కనబడదు. అదియెట్లనగా - తేనె నెయ్యిల సంయోగము, చేపలు, పాలు వీని సంయోగము.

**చక్రపాణి :** "సంయోగస్తు" అను మొదలగువానిద్వారా సంయోగమును చెప్పుచున్నాడు. "స విశేషమారభత" అనగా సంయోగింపబడుచున్న ద్రవ్యములందు విడిగా కనబడని కార్యమును ననింపజేయును అని అర్థము. "యం నైకైకశ" అనగా ఏ విశేషమును ఈ ద్రవ్యములు కలుపకుండగ యున్నప్పుడు జనింపజేయవో- అని అర్థము. విడివిడిగా మారకములు కాని తేనె-నెయ్యిలను రెండింటినీ కలిపినపుడు (ఆ మిశ్రణము) మారకమగును, పాలు చేపలు ఈ మొదలగువాని సంయోగము కూడ కుష్టము మొదలగువానిని కలిగించునదగును. సంయోగము మాత్రము ఇచట ప్రాధాన్యమువలననే లభించు ద్రవ్యముల కలయిక అని వివక్ష చేయబడినది. అందు వలన భావనాదుల యందును సంయోగమున్నప్పటికీ అచట భావనాద్రవ్యములకు ప్రాధాన్యత లేకుండుట వలన అది సంయోగముగా గ్రహింపరాదు.

## రాశి

4. రాశిస్తు సర్వగ్రహ పరిగ్రహౌ మాత్రామాత్ర ఫలవినిశ్చయార్థః తత్ర సర్వ-
స్యాహారస్య ప్రమాణగ్రహణమేకపిండేన సర్వగ్రహః, పరిగ్రహః పునః
ప్రమాణగ్రహణమేకైకశ్యేనాహారద్రవ్యాణామ్ సర్వస్య హి గ్రహః సర్వ-
గ్రహః, సర్వతశ్చ గ్రహః పరిగ్రహ ఉచ్యతే.

**తాత్పర్యము :** రాశి సర్వగ్రహ పరిగ్రహములని రెండు విధములు. అది సరియగు మోతాదు (మాత్ర) సరిగాలేని మోతాదు (అమాత్ర) వలన కలుగు ఫలితములను నిర్ణయించుటకు (ఉపయోగపడును). అచట ఆహారమునంతటికీ ఒకే

ముద్దగా ప్రమాణముగా గ్రహించుట సర్వగ్రహమనబడును. ఒక్కొక్క ఆహార ద్రవ్యము యొక్క ప్రత్యేకముగా ప్రమాణమును గ్రహించుట పరిగ్రహమనబడును. అంతయును గ్రహించుట సర్వగ్రహము అన్నింటిని గ్రహించుట పరిగ్రహము అనియు చెప్పబడును.

**ఆయుర్వేద దీపిక :** రాశి యనగా ప్రమాణము. "మాత్రామాత్రఫలవినిశ్చయార్థః" అనగా సరియగు మోతాదులో నున్న ఆహారము మరియు ఔషధమునకు కలుగు ఫలితము శుభము, అమాత్రలో నున్న-తక్కువ లేక ఎక్కువ ప్రమాణములో నున్న ఆహారము మరియు ఔషధము యొక్క ఫలితము అశుభము అని అర్థము. "తస్య జ్ఞానార్థముచితప్రమాణమనుచితప్రమాణం చ రాశిసంజ్ఞం భవతి" అని చెప్పబడియున్నది. "తత్ర" అను మొదలగువాని ద్వారా సర్వగ్రహమును వివరించుచున్నాడు. "సర్వస్య" అనగా మిశ్రణము చేసియున్న అన్నము మాంసము పప్పు మొదలగువానికి ఒకే పిండముగా గ్రహించి కొలచుట. "పరిగ్రహః పునః" అను మొదలగు వానిద్వారా పరిగ్రహమును వివరించుచున్నాడు. "ఏకైకశ్యేన" అనగా ఒక కుడవము అన్నము, ఒక పలము సూపము, రెండు పలములు మాంసము అను మొదలైన ఆహారము నందల అంశముల కొలతతో కూడిన అన్నింటిని కలిపిన కొలత. సర్వగ్రహమునందు ఒక్కొక్క పదార్థము (అవయవము)నకు ఒక నియమమైన కొలత లేదు. అందువలన ఒక్కొక్కదానికి నియమిత ప్రమాణము లేని ఏదో ఒక ఆహారము వలన సంపూర్ణ (మొత్తము) ఆహారము యొక్క మాత్రను నియమించుట (నిశ్చయించుట) సర్వగ్రహము. ఈ శబ్దము యొక్క ఉత్పత్తినే "సర్వస్య హి" అను మొదలగువానిద్వారా చూపుచున్నాడు. "సర్వతః" అనగా ఆహారమునందలి ఒక్కొక్క పదార్థము ద్వారా అని అర్థము.

## దేశము

5. దేశః పునః స్థానం: స ద్రవ్యాణాముత్పత్తిప్రచారౌ దేశసాత్మ్యం చాచష్టే.

**తాత్పర్యము :** దేశమనగా స్థానము. అది ద్రవ్యముల ఉత్పత్తి ఆహారమును భుజించు వారి ప్రచారము, దేశసాత్మ్యమును కూడ తెలుపును.

ఆయుర్వేద దీపిక : "దేశః" అను మొదలగువాని ద్వారా దేశము విభజింపబడుచున్నది (విడమరచి చెప్పబడుచున్నది). స్థానమును గ్రహించుట వలన ఆహార ద్రవ్యము యొక్క మరియు దానిని భుజించు వారి యొక్క ఆయా స్థానమును చూపుచున్నాడు. "అచష్టే" అనగా ద్రవ్యము యొక్క ఉత్పత్తి ప్రచారములచే కలుగు గుణములను తెలిసికొనుటకు కారణమగుచున్నది. అచట ఉత్పత్తి వలన- హిమవత్పర్వతమునందు పుట్టిన ద్రవ్యము గుణవంతమగును. మరుస్థలము లందు పుట్టినది లఘుగుణములు గలదగును. అను మొదలగు (ఉదాహరణములను తీసికొనవచ్చును.) ప్రచారము వలన - అల్పముగా భుజించు ప్రాణులకు మరియు జాంగల దేశమున సంచరించువాటికి ఇంకను అధికశ్రమ చేయువాటికి లఘుత్వము ఉండును వ్యతిరేకముగా నుండు ప్రాణులకు గురుగుణముండును అని గ్రహించబడుచున్నది. దేశ సాత్మ్యము వలన ఆయా దేశమునను విపరీత గుణములను సాత్మ్యముగా గ్రహించబడుచున్నది. ఉదాహరణమునకు అనుపదేశమునందు ఉష్ణ రూక్ష గుణములు (కలద్రవ్యములు) జాంగలదేశమున శీత స్నిగ్ధ గుణములు - సాత్మ్యముగా గ్రహించబడును. ఓకసాత్మ్యము మాత్రము ఉపయోక్తను గ్రహించుట వలన గ్రహించబడినది.

## కాలము

6. కాలో హి నిత్యగశ్చావస్థికశ్చ; తత్రావస్థికో వికారమపేక్షతే, నిత్యగస్తు ఋతుసాత్మ్యాపేక్షః.

**తాత్పర్యము :** కాలము నిత్యగము మరియు అవస్థికము అని రెండు విధములు. అవస్థికకాలము వ్యాధితుని యొక్క వయస్సును అపేక్షించి యుండును. నిత్యగమనునది ఋతుసాత్మ్యము నపేక్షించి యుండును.

ఆయుర్వేద దీపిక : "నిత్యగః" అనగా - అహోరాత్రాది రూపమగు కాలము. "అవస్థికః" అనగా రోగి యొక్క బాల్యాది అవస్థా విశేషములతో కూడి యున్నది అని అర్థము. "వికారమపేక్షతే" అనగా బాల్యావస్థాదుల యందు శ్లేష్మ వికారములు కలుగుట, జ్వరాదులయందు ఆమాద్యవస్థల ననుసరించి ఆహార నియమములుండుట-అని అర్థము. "ఋతుసాత్మ్యాపేక్షః" అనగా ఋతుసాత్మ్యము- ఋతువు నపేక్షించి యుండునని అర్థము.

## ఉపయోగనియమము

7. ఉపయోగసంస్థా తూపయోగనియమః; స జీర్ణలక్షణాపేక్షః

**తాత్పర్యము** : ఉపయోగ సంస్థయనగా ఉపయోగ నియమము. అది జీర్ణ లక్షణము నపేక్షించి యుండును.

**ఆయుర్వేద దీపిక** : ఉపయోగ నియమమనగా ఈ విధముగా ఆహారము నుపయోగింపవలెను, ఈ విధముగా ఉపయోగించరాదు అను నియమము. "స జీర్ణ లక్షణాపేక్షః" అని ప్రాధాన్యముగా చెప్పబడినది. అందువలన ఇచట "అజల్పన్నహసన్నాతి ద్రుతం నాతి విలంబితమ్" (వాదులాడక, నవ్వక, వేగిరపడక, ఆలస్యము చేయక) అను మొదలగు ఉపయోగ నియమమును అపేక్షించియే యుండును. అజీర్ణ భోజనమునందు మాత్రము తీవ్రమైన త్రిదోష కోప లక్షణములతో కూడిన దోషము గలుగుట వలన ఇదియే ఉదహరింపబడినది.

## ఉపయోగించువాడు

22. ఉపయోక్తా పునర్యస్తమాహారముపయుఙ్క్తే, యదాయత్తమోకసాత్మ్యమ్.
ఇత్యష్టావాహారవిధివిశేషాయతనాని వ్యాఖ్యాతాని భవన్తి.

**తాత్పర్యము** : ఆహారము నుపయోగించువాడు ఉపయోక్త యనబడును. ఇతని నపేక్షించియే ఓకసాత్మ్యముండును. అని ఎనిమిది ఆహారవిధి విశేషాయతనములు వ్యాఖ్యానించబడినవగుచున్నవి.

**ఆయుర్వేద దీపిక** : "యదాయత్తమోకసాత్మ్యమ్" అనగా అభ్యాస సాత్మ్యమనునది భుజించువాని నపేక్షించి యుండును అని అర్థము. కొందరికి తిన దగిన లేదా తినదగని పదార్థము కొంచెము అభ్యాసము చేతనే సాత్మ్యమగును.

## ఆహారవిధి, విశేషాయతనములను తెలిసికొనుట వలన కలుగు ఫలితము

23. ఏషాం విశేషాః శుభాశుభఫలాః పరస్పరోపకారకాః భవన్తి; తాన్ బుభుత్సేత,
బుద్ధ్వా చ హితేప్సురేవ స్యాత్; న చ మోహాత్, ప్రమాదాద్వా ప్రియ-
మహితమసుఖోదర్కముపసేవ్యమాహారజాతమన్యద్వా కించిత్,

**తాత్పర్యము :** ఈ విశేషములు (ఎనిమిది ఆహారవిధి విశేషాయతన ములు) శుభాశుభ ఫలముల నిచ్చునవగుచు పరస్పరోపకారకములుగ నుండును. వీనిని తెలిసికొనాలనే కాంక్ష కలిగి ఉండవలెను. తెలిసికొనియు హితమైనవానినే కోరవలెను. మోహముచేత గానీ, ప్రమాదవశమునగానీ ఇష్టమైననూ అహితకరము లైనవి తరువాతి కాలమున శరీరమునకు దుఃఖమును కలిగించు ఆహార, ఔషధ, విహారములను సేవింపరాదు.

**ఆయుర్వేద దీపిక :** "ఏషామ్" అను మొదలగు వానియందు శుభఫల ములు విశేషములు మరియు అశుభ ఫలములు పరస్పరోపకారములు అగుచున్నవని తెలిసికొనవలెను. అచట ప్రకృతి వలన లఘు మొదలైనవి శుభఫలము మరియు గురు మొదలైనవి అశుభఫలము. కరణాదులపై ఆధారపడియున్నప్పటికీ శాస్త్రము నందు చెప్పబడిన విశేషము శుభఫలము శాస్త్రనిషిద్ధము అశుభఫలములు (ఇచ్చు చున్నవి). దేశసాత్మ్యము - నిందితమైన దేశమునందు (మరుభూమి మొదలగువాని యందు) పుట్టుట మొదలైనవి ద్రవ్యమునకు అశుభఫలము (కలుగజేయును). ఇట్లే కాలమునకు అసాత్మ్యమైన అశుభఫలితము అజీర్ణ భోజనము మొదలైనవి (అని తెలియ వలెను). అటులనే ఓకసాత్మ్యము వలన కూడ శుభాశుభ ఫలము అని తెలియవలెను. (ఇందు) వ్యతిరేకమైనది అశుభఫలము (నిచ్చును). "మోహాత్" అనగా అజ్ఞానము వలన, "ప్రమాదాత్" అనగా తెలిసియున్నను దానిపై నున్న అనురాగము వలన అని అర్థము. "ప్రియమ్" అనగా ఆ సమయమున మాత్రమే ప్రియమగునది అని అర్థము. "అసుఖోదర్కమ్" అని "అహితమ్" అని దాని యొక్క వివరణము (ఇవ్వబడుచున్నది). అసుఖమనగా దుఃఖరూపమైనది. ఉదర్కమనగా తరువాతి కాలము నందు కలుగు ఫలము దేనికి కలుగునో, అది అటుల (అసుఖోదర్కము అగును). "అన్యద్వా" అనగా ఔషధ, విహారాదులు.

## హితతమమగు ఆహారవిధి విధానము

24. తత్రేదమాహారవిధివిధానమరోగాణామాతురాణాం చాపి కేషాంచిత్ కాలే ప్రకృత్యైవ హితతమం భుఞ్జానానాం భవతి - ఉష్ణం, స్నిగ్ధం, మాత్రావత్, జీర్ణే వీర్యావిరుద్ధమ్, ఇష్టే దేశే, ఇష్టసర్వోపకరణం, నాతిద్రుతం. నాతి- విలమ్బితమ్, అజల్పన్, అహసన్, తన్మనాభుఞ్జీత, ఆత్మానమభిసమీక్ష్య సమ్యక్.

**తాత్పర్యము :** అచట చెప్పబోవుచున్న ఆహార విధివిధానము ఆహారమును స్వస్థులకు, కొందరు రోగులకు ఒక్కొక్క సమయమునందు స్వభావముచేతనే హితతమమగును. ఆ విధానము ఎట్టిదనగా-ఉష్ణము, స్నిగ్ధము, తగిన ప్రమాణములో నున్నదీ, జీర్ణమైన ఆహారము యొక్క వీర్యమునకు విరుద్ధముకానిది, ఇష్టమైన ప్రదేశమునందు, ఇష్టమైన సర్వ ఉపకరణముల (పదార్థముల)తో కూడియున్న (ఆహారమును) వేగిరపడక, అతి ఆలస్యము చేయక, మాటలాడక, నవ్వక, మనస్సును లగ్నముచేసి తన్నుతాను (అగ్ని, బలాబలములను) సమీక్షించి సరిగా భుజింపవలెను.

**ఆయుర్వేద దీపిక :** "తత్ర" అను మొదలగుదానియందు "ఇదమ్" అనగా చెప్పబోవుచున్న అని అర్థము. చెప్పబోవుచున్న ఏ ఉష్ణ స్నిగ్ధాదుల వలన ఆహారవిధి విధింపబడుచున్నదో అది ఆహార విధివిధానము. "ఆతురాణాం చ కేషాంచిత్" అను పదము వలన రక్తపిత్త రోగులకు శీతగుణముకలవి, కఫరోగులకు రూక్షగుణములు కలవియగు ఆహారద్రవ్యములే హితముగానుండునను మొదలగు వ్యతిరేకతను చూపుచున్నాడు. కొందరు భుజించువారలకు ఈ ఆహార విధివిధానము హితతమమగునని యోజన (సంబంధము/సంయోగము). ప్రకృత్యైవ అనగా స్వభావము చేతనే హితతమము హితతమని చెప్పబడినది. అందువలన ఏది స్వభావము చేతనే హితముగా నుండును అట్టిది ఎప్పుడో ఒకప్పుడు ఎవడో ఒక పురుషునకు పూర్తిగా అహితముగా నుండును. అదియును కదాచిత్కము (ఎప్పుడో ఒకప్పుడు) అగుటచేత లెక్కపెట్టనవసరము లేదు. అందువలన ప్రాయికత్వముచేత (సాధారణత్వముచేత) హితతమమును చెప్పబోవుచున్నాము అని భావము. "ఉష్ణమ్" అను మొదలగు వానియందు "సమ్యక్" అని భేదము. (సమ్యక ఉష్ణమ్, సమ్యక్ స్నిగ్ధమ్" ఈ విధమగు సంబంధమును అన్వయించుకొనవలెను).

## ఉష్ణ భోజనమువలన కలుగు సద్గుణములు

1. తస్య సాద్గుణ్యముపదేక్ష్యామః - ఉష్ణమశ్నీయాత్, ఉష్ణం హి భుజ్యమానం స్వదతే, భుక్తం చాగ్నిమౌదర్యముదీరయతి, క్షిప్రం జరాం గచ్ఛతి, వాతమనులోమయతి, శ్లేష్మాణం చ పరిహ్రాసయతి, తస్మాదుష్ణమశ్నీయాత్.

## స్నిగ్ధభోజనము వలన కలుగు సద్గుణములు

2\. స్నిగ్ధమశ్నీయాత్, స్నిగ్ధం హి భుజ్యమానం స్వదతే, భుక్తంచాను దీర్ణమగ్నిము- దీరయతి, క్షిప్రంజరాంగచ్ఛతి, వాతమనులోమయతి, శరీరముపచినోతి, దృఢీ- కరోతన్ద్రియాణి, బలాభివృద్ధిముపజనయతి, వర్ణప్రసాదం చాభినిర్వర్తయతి, తస్మాత్ స్నిగ్ధమశ్నీయాత.

**తాత్పర్యము :** పై చెప్పిన ఉష్ణము మొదలగు గుణములతో కూడిన ఆహారము యొక్క సాద్గుణ్యమును చెప్పబోవుచున్నాము- ఉష్ణమైన (వేడిగనుండు) ఆహారమును భుజింపవలెను. అయ్యది నోటికి రుచిగనుండును. భుజించిన వెంటనే అగ్నిని ప్రేరేపించి జీర్ణమగును. వాతమునకు అనులోమనమును కలిగించును. కఫము యొక్క చిక్కదనము పోవునట్లు చేయును. అందువలన ఉష్ణమగు ఆహారమును తినవలెను.

స్నిగ్ధమైన ఆహారమును భుజింపవలెను. స్నిగ్ధమున నున్న ఆహారమును భుజించుచున్న యది నోటికి రుచిగానుండును. అనుదీర్ణమగు అగ్నిని ప్రేరేపించును, వెంటనే జీర్ణమగుటకు సిద్ధపడును. వాతమును అనులోమగతిని పోవునట్లు చేయును. శరీరమును వృద్ధిపరచును, ఇంద్రియములను దృఢముగానగునట్లు చేయును, బలాభి వృద్ధిని కలిగించును. వర్ణమును ప్రసన్నతను కల్గించును. అందుచేత స్నిగ్ధముగా ఆహారమును భుజింపవలెను.

**ఆయుర్వేద దీపిక :** "తస్య" అనగా ఉష్ణము మొదలగు గుణములతో కూడిన అన్నము యొక్క అని అర్థము. "సాద్గుణ్యమ్" అనగా ప్రశస్తమైన గుణములతో కూడియుండుట అని అర్థము. "పరిహ్రాసయతి" అనగా సంఘాతమును భిన్నము చేయును అని అర్థము.

## సరియగు మోతాదులో ఆహారమును భుజించుట వలన కల్గు సద్గుణములు

3\. మాత్రావదశ్నీయాత్, మాత్రావద్ధి భుక్తం వాతపిత్తకఫానపీడయదాయురేవ వివర్ధయతి కేవలం, సుఖం గుదమనుపర్యేతి, నచోష్మాణముపహన్తి, అవ్యథం చ పరిపాకమేతి; తస్మాన్మాత్రావదశ్నీయాత్.

తాత్పర్యము : సరియగు ప్రశస్తమైన ప్రమాణము (మోతాదు)లో నున్న ఆహారమును భుజింపవలెను. సరియగు మోతాదులోనున్న ఆహారము మాత్రమే భుజింపబడిన అది వాతపిత్తకఫములను పీడింపక (వానికి ప్రకోపము కలుగనీయక) కేవలము ఆయుష్షునే పెంపొందించును. సుఖముగా పరిణమించి గుదము వరకు ప్రసరించును. అగ్నిని నశింపజేయదు. వ్యథ లేకుండా పరిపాకమునొందును. అందుచేత సరియగు ప్రమాణములోనున్న ఆహారమును భుజింపవలెను.

ఆయుర్వేద దీపిక : "మాత్రావత్" అనునది ప్రశంసయందు "మతుప్" ప్రయోగము; అందువలన ప్రశస్తమైనది మాత్రము అని అర్థము. "అపీడయత్" అనగా ఎక్కువ మోతాదులో లేనందువలన స్వస్థానములోనున్న సరియైన వాతాదులను ఆ స్థానములను పీడింపకుండుటచే ప్రకోపము కలిగించకుండగ అని అర్థము. "గుదమనుపర్యేతి" సరిగా పరిణామము నొంది గుదమువరకు ప్రసరించును అని అర్థము. ఊష్మాణం అనగా అగ్నిని అని అర్థము.

## మొదట తినిన ఆహారము జీర్ణమైన తరువాతనే భుజింపవలెననుట

4. జీర్ణేఽశ్నీయాత్, అజీర్ణే హి భుక్తస్యాభ్యవహృతమాహారజాతం పూర్వస్యాహారస్య రసమపరిణతముత్తరేణాహారరసేనోపసృజత్ సర్వాన్ దోషాన్ ప్రకోపయత్యాశు, జీర్ణే తు భుక్తస్య స్వస్థానస్థేషు దోషేష్వగ్నౌ చోదీర్ణే జాతాయాం చ బుభుక్షాయాం వివృతేషు చ స్రోతసాం ముఖేషు విశుద్ధే చోద్గారే హృదయే విశుద్ధే వాతానులోమ్యే విసృష్టేషు చ వాతమూత్ర-పురీషవేగేష్వభ్యవహృతమాహారజాతం సర్వశరీరధాతూనప్రదూషయదాయు-రేవాభివర్ధయతి కేవలం, తస్మాజ్జీర్ణేఽశ్నీయాత్.

తాత్పర్యము : మొదట భుజించిన ఆహారము జీర్ణమైన తరువాత భుజింపవలయును. జీర్ణము కాకుండ భుజించువానికి భుజించిన ఆహార ద్రవ్యముల వలన సరిగా పరిణామము నొందని పూర్వపు ఆహారము యొక్క రసము తరువాత భుజింపబడిన ఆహారముతో కలసి వెంటనే సమస్తదోషములను ప్రకోపింపజేయును. // జీర్ణమైన తరువాత దోషములు స్వస్థానమునందుండును. అగ్నిదీప్తి కలుగును. ఆకలి కలుగును, స్రోతముఖములు వికసించియుండును. త్రేన్పులు శుద్ధముగ (పులుపు లేకుండ) యుండును. హృదయము పరిశుద్ధముగ **(బరువు లేకుండ)**

యుండును. వాతానులోమనమువలన (శరీరమునందు) బాధ లేకుండుగ వాత మూత్ర పురీష వేగములు కలుగుచుండును. ఇట్టి స్థితి యందు ఆహార ద్రవ్యములను భుజించి నచో సర్వశరీర ధాతువులను పోషింపజేయక కేవలము ఆయుష్షునే అభివృద్ధి చేయును. అందువలన మొదట భుజించిన ఆహారము జీర్ణమైన తరువాత ఆహార మును భుజింపవలెను.

**ఆయుర్వేద దీపిక :** పూర్వస్య అనగా క్రిందటి రోజున తీసికొనినట్టి అని అర్థము. "అపరిణతమ్" అనగా సరిగా తయారు కానటువంటి అని అర్థము. "ఆహారరసేన" అనగా ఆహార పరిణామములోనున్న మధురాది రసముల వలన లేదా, ఆహారము నుండి పుట్టిన రసమువలన "స్వస్థానస్థేషు దోషేషు" అను మొద లగునవి ఆహారము జీర్ణమైనపుడు కలుగు లక్షణములు.

## వీర్య విరుద్ధత్వము లేని ఆహారమును భుజింపవలెననుట

5. వీర్యావిరుద్ధమశ్నీయాత్; అవిరుద్ధవీర్యమశ్నన్ హి విరుద్ధాహారజైర్వికారై-
ర్నోపసృజ్యతే; తస్మాద్వీర్యావిరుద్ధమశ్నీయాత్.

**తాత్పర్యము :** విరుద్ధ వీర్యముకాని ఆహారమును తినవలెను. అవిరుద్ధ మైన వీర్యములు కల ఆహారమును తినుటవలననే విరుద్ధాహారము వలన కలుగు వికారములు కలుగనేరవు. అందుచేత వీర్యమునకు విరుద్ధము కాని ఆహారమును (విరుద్ధ వీర్యములు కల వివిధ పదార్థములను కలిపి భుజించుట.) భుజింపరాదు.

**ఆయుర్వేద దీపిక :** "విరుద్ధాహారజైః" అనగా ఆత్రేయ భద్రకాప్యీ- యాధ్యాయమునందు చెప్పబడిన కుష్ఠము, అంధత్వము విసర్పము మొదలైన రోగము లచే - అని అర్థము.

## ఇష్టమైన ప్రదేశమునందు - ఇష్ట ఉపకరణములతో కూడి భుజించుట వలన కల్గు గుణములు

6. ఇష్టే దేశే ఇష్టసర్వోపకరణం చాశ్నీయాత్; ఇష్టే హి దేశే భుఞ్జానో నానిష్ట-
దేశజైర్మనోవిఘాతకరైర్భావైర్మనోవిఘాతం ప్రాప్నోతి, తథైవేష్టైః
సర్వోపకరణైః, తస్మాదిష్టే దేశే తథేష్ట సర్వోపకరణం చాశ్నీయాత్.

**తాత్పర్యము :** ఇష్టమైన ప్రదేశమందు ఇష్టమైన అన్ని ఉపకరణము లను భుజింపవలెను. ఇష్టమైన దేశమునందు భుజించువానికి ఇష్టము లేని దేశము నందు భుజించుట వలన కలుగు మనోవిఘాతకర భావములచే మనోవిఘాతము కలుగదు. అట్లే ఇష్టమైన సర్వ ఉపకరణములతోసూ తినుట వలన అట్టి ఫలితముకే కలుగును. అందుచేత ఇష్టమైన దేశమునందు మరియు ఇష్టమైన అన్ని ఉపకరణము లతోడను భుజింపవలెను.

**ఆయుర్వేద దీపిక :** "మనో విఘాతకరైర్భావైః" అనగా త్రివిధకుక్షీ యము (విమానస్థానము-రెండవ అధ్యాయము)న చెప్పబోవుచున్న కామము మొద లగు చిత్తమునకు ఉపతాపము కలిగించు చిత్తవికారములచే అని అర్థము. అట్లే ఇష్టములైన సర్వోపకరణములతో భుజించువాడు మనోవిఘాతమును పొందడు అని అన్వయము. అయిష్టమైన భోజనాదుల వలన మనో విఘాతము కలుగును.

## మిక్కిలి వేగముగా భుజించుట వలన కల్గు దుష్ఫలితములు

7. నాతి ద్రుతమశ్నీయాత్: అతిద్రుతం హి భుఞ్జానస్యోత్స్నేహనమవసాదనం భోజనస్యాప్రతిష్ఠానం చ, భోజ్యదోషసాద్గుణ్యయోపలబ్ధిశ్చ న నియతా: తస్మాన్నాతిద్రుతమశ్నీయాత్.

**తాత్పర్యము :** అతివేగముగా భుజింపరాదు. అతి వేగముగా భుజించు టచే భుజించువానికి ఉత్స్నేహనము, అవసాదనము, భోజనము నిలకడగా కోష్ఠమును చేరకపోవుట, నియమపూర్వకముగా భోజ్య వస్తువు యొక్క దోషము గుణములు తెలియకపోవుట అనునవి కలుగును. అందుచేత అతి తొందరగా భుజింపరాదు.

**ఆయుర్వేద దీపిక :** ఉత్స్నేహనమనగా పోవలసిన మార్గమున కాకుండా వ్యతిరేక మార్గగమనమగుట (ఉదా - వాంతి యగుట మొ॥) అదిమిపెట్టి నట్లుండుట అవసాదనమనబడును. అప్రతిష్ఠానం అనగా ఈ ఆహారము హృదయమునకు దగ్గరగా నుండుటవలన కోష్ఠమున ప్రవేశింపకపోవుట. భోజ్యగత దోషములు అనగా వెంట్రుకలు మొదలగునవి ఆహారము నందు కలిసియుండుట సద్గుణములు అనగా ఆహారము రుచిగా నుండుట మొదలగునవి: వీనియొక్క ఉపలబ్ధి నియమ పూర్వకముగా నుండదు - ఒక్కొక్కప్పుడు గుణదోషములు తెలియును-ఒకప్పుడు తెలియకుండును.

## అతి నెమ్మదిగా భుజించుట వలన కల్గు దుష్ఫలితములు

8. నాతివిలంబితమశ్నీయాత్: అతి విలమ్బితం హి భుఞ్జానో న తృప్తిమధిగచ్ఛతి,- బహుభుఙ్క్తే శీతీభవత్యాహారజాతం, విషమం చ పచ్యతే. తస్మాన్నాతివిలమ్బిత- మశ్నీయాత్.

తాత్పర్యము : అతి నెమ్మదిగా భుజింపరాదు. అతి నెమ్మదిగా భుజించు వాడు తృప్తిని పొందడు. అధికముగా తినును. ఆహారద్రవ్యములు చల్లగానగును. విషమముగా పచనమగును. అందుచేత అతి నెమ్మదిగా భుజింపరాదు.

ఆయుర్వేద దీపిక : విషమంచపచ్యత "అనగా చిరకాల భోజనము వలన అగ్ని సంబంధమునకు గలుగు వైషమ్యము వలన" అని భావము.

## మాట్లాడక, నవ్వకయూ భుజింపవలెననుట

9. అజల్పన్నహసన్ తన్మనా భుఞ్జీత: జల్పతో హసతోఽన్యమనసో వా భుఞ్జానస్య, త ఏవ హి దోషా భవన్తి య ఏవాతిద్రుతయశ్నతః: తస్మాద- జల్పన్నహసం స్తన్మనా భుఞ్జీత.

తాత్పర్యము: : మాటలాడక, నవ్వక, మనస్సును లగ్నము చేసి ఆహార మును భుజింపవలెను. వాదులాడుచు, నవ్వుచు, లేదా అన్యమనస్కుడై భుజించు వానికి అతి వేగముగా భుజించుటచే కలుగు దోషములు ఏవి కలవో ఆదోషములే కలుగును. అందుచేత వాదులాడక (మాట్లాడక), నవ్వక, మనస్సును లగ్నముచేసి భుజింపవలెను.

ఆయుర్వేద దీపిక : "య ఏవాతిద్రుతమశ్నతో దోషాః" అనగా ఉత్స్నేహనాదులు అని అర్థము.

## తన్నుతాను తెలిసికొని భుజింపవలెననుట

25. ఆత్మానమభిసమీక్ష్య భుఞ్జీత సమ్యక్: ఇదం మమోపశేతే ఇదం నోపశేత ఇత్యేవం విదితం హ్యస్యాత్మన ఆత్మసాత్మ్యం భవతి; తస్మాదాత్మానమభి- సమీక్ష్య భుఞ్జీత సమ్యగితి.

**తాత్పర్యము :** తన్నుతాను అభిసమీక్షించుకొని (అవగాహన చేసుకొని) సరిగా భుజింపవలెను. "ఇది నాకు సరిపడును", "ఇది సరిపడదు" అని ఇట్లు తెలిసికొనినదియే తనకు ఆత్మసాత్మ్యమగును.

**ఆయుర్వేద దీపిక :** "నోపశేత ఇతి" అనుచోట సాత్మ్యాసాత్మ్యములను సూచించును "ఇతి" శబ్దము వలన విహార ఫలమగు ఓకసాత్మ్య సేవనమును సూచించుచున్నాడు. "ఆత్మాన" అను పదము వలన స్వయముగనే తనయొక్క సాత్మ్యము (ఆత్మసాత్మ్యము)ను ప్రతివ్యక్తి తెలియవలసియున్నది. కాని శాస్త్రోపదేశము వలనకాదని చూపుచున్నాడు.

## వైద్యుడు తెలిసికొనవలసిన విషయములు

భవతి చాత్ర—

26. రసాన్ ద్రవ్యాణి దోషాంశ్చ వికారాంశ్చ ప్రభావతః,
వేద యో దేశకాలౌ చ శరీరం చ స నో భిషక్.

**తాత్పర్యము :** రసములు, ద్రవ్యములు, దోషములను, మరియు వికారములను వాని ప్రభావము వలననూ, దేశ కాలములను, శరీరములను (ఇచట నున్న వానిని-ఈ అధ్యాయమునందు చెప్పబడిన వానిని) ఎవడు తెలుసుకొనునో అట్టివాడు మనకు వైద్యుడు.

**ఆయుర్వేద దీపిక :** "రసాన్" అను మొదలగువాని ద్వారా అధ్యాయమునందు చెప్పబడిన రసము ప్రభావము మొదలగువాని జ్ఞానమును స్తుతించుచున్నాడు. "స నో భిషక్" అనగా అతడు "నో ఽ స్మాకం" (మనకు) సమ్మతమగు వైద్యుడు అని అర్థము.

## అధ్యాయ సంగ్రహము

తత్రశ్లోకౌ—

27. విమానార్థో రసద్రవ్య దోషరోగాః ప్రభావతః,
ద్రవ్యాణి నాతిసేవ్యాని త్రివిధం సాత్మ్యమేవ చ.

28. ఆహారాయతనాన్యష్టౌ భోజ్యసాద్గుణ్యమేవ చ,
విమానే రససంఖ్యాతే సర్వమేతత్ ప్రకాశితమ్.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే విమానస్థానే రసవిమానం నామ ప్రథమోఽధ్యాయః.

**తాత్పర్యము :** విమాన శబ్దము యొక్క అర్థము రసద్రవ్య దోషరోగ ముల ప్రభావములు, అతిగా సేవింపకూడని ద్రవ్యములు, త్రివిధ సాత్మ్యములున్నూ, ఎనిమిది ఆహారాయతనములు, తినదగిన ఆహారము యొక్క సౌద్గుణ్యము ఇవి అన్నియు రసమను పేరుగల విమాన స్థానమునందు వివరింపబడినవి.

అని శ్రీ అగ్నివేశునిచే రచింపబడి చరకునిచే ప్రతిసంస్కరింపబడిన తంత్ర మందలి విమాన స్థానమున రసవిమానము అను ప్రథమాధ్యాయము సమాప్తము.

**ఆయుర్వేద దీపిక :** దోష వికారములు రెండునూ త్రివిధకుక్షీయ విమా నము (విమానస్థానమున రెండవ అధ్యాయము) నందు వాని ప్రభావ విస్తారమున చెప్ప వలసియున్నవి. అయినప్పటికీ ఇచట సంక్షేపముగా చెప్పబడియే యున్నవి. అందు వలన దోష వికారముల ప్రభావములు రెండును చెప్పబడినవి అన అధ్యాయసంగ్రహ మున చెప్పబడినది సరియైనదే. తైలము మొదలగు ద్రవ్యములను గురించి చెప్ప టయు ద్రవ్యము యొక్క ప్రభావముగా తీసికొని చెప్పుటచే ఆ విషయము విడిగా అధ్యాయ సంగ్రహము నందు చెప్పబడలేదు.

అని శ్రీ చక్రపాణిదత్త విరచితమైన ఆయుర్వేద దీపిక యను చరక తాత్పర్యటీక యందు విమానస్థానమునందలి రసవిమానమను ప్రథమాధ్యాయము సమాప్తము.

# త్రివిధ కుక్షీయ విమానము

## ద్వితీయాధ్యాయము

1. అథాతస్త్రివిధకుక్షీయం విమానం వ్యాఖ్యాస్యామః

**తాత్పర్యము :** ఇకపై త్రివిధ కుక్షీయమను విమానమును చెప్పబోవు చున్నాము.

2. ఇతి హ స్మాహ భగవానాత్రేయః

**తాత్పర్యము :** అని ఆత్రేయ భగవానుడు చెప్పియుండెను.

**ఆయుర్వేద దీపిక :** రస విమానాధ్యాయమునందు రాశి చెప్పబడినది. ఆ రాశియొక్క సరియైన మోతాదు, సరిగాలేని మోతాదుల వలన కలుగు ఫలితము యొక్క వివరము, మరియు తద్వారా కలుగు దోషములు వ్యాధుల యొక్క వివరము లను చూపుటకు త్రివిధ కుక్షీయాధ్యాయము పేర్కొనబడుచున్నది.

### కుక్షియందు మూడు విధములైన అవకాశాంశముల నేర్పరచుట

3. త్రివిధం కుక్షౌ స్థాపయేదవకాశాంశమాహారస్యాహార ముపయుఞ్జానః: తద్యథా- ఏకమవకాశాంశం మూర్తానామాహార వికారాణామ్, ఏకం ద్రవాణామ్, ఏకం పునర్వాతపిత్తశ్లేష్మణామ్; **ఏతావతీం** హ్యాహారమాత్రముపయుఞ్జానో నామాత్రాహారజం కిఞ్చిదశుభం ప్రాప్నోతి.

**తాత్పర్యము :** ఆహారము నుపయోగించువాడు కుక్షియందు ఆహారము నకు మూడు ప్రకారముల **అవకాశ అంశములను** ఏర్పరుచుకొనవలెను. అది యెట్ల నగా - ఒక **అవకాశాంశము** మూర్తరూపమగు (ఘనరూపమగు) వివిధ ఆహార పదార్థములకు, ఒకటి ద్రవములకు ఒకటి వాతపిత్త శ్లేష్మములకు (ఖాళీగా) ఉంచ వలెను. ఇటువంటిదేయైన ఆహారపుమాత్ర (మోతాదు)ను ఉపయోగించువాడు అమాత్ర (సరియగు మోతాదులో లేనట్టి) ఆహారము వలన కలుగు అశుభ ఫలితమును కొంచెముగూడ పొందడు.

**ఆయుర్వేద దీపిక :** "త్రివిధమ్" అనగా మూడు ప్రకారములు. "అవకాశాంశమ్" అనగా కోష్ఠమునందలి ఖాళీగానున్న భాగము. "ఆహారస్య"

అనగా ఆహారము కొరకు అని అర్థము. అందువలన రెండు అవకాశములు ఆహారమునకు చెప్పబడవలెను. ఒకటి మాత్రము దోషములకు అని చెప్పబోవుచున్న మూడు విధములు. దోషములకు అవకాశమును ఏర్పరచుట ఆహారమునకు ఉపకరించున దగుటచేతనే, ఆహారమునకు అని చెప్పబడుచున్నది. దోషములకు అవకాశము నేర్పరచక పోవుటయందు ఆహారము దోషములచేత దూషింపబడుచున్నది అని చెప్పవలసియుండును. లేదా, ఆహారమునకు ఆమాశయ రూపమగు కుక్షియందు చెప్పబోవు విధానమున అవకాశాంశమును ఏర్పరచవలెనని అర్థము. "తద్యథా" అను మొదలగువానిద్వారా కుక్షియందు అంశ విభాగము నెట్లు చేయవలెనో చెప్పుచున్నాడు. "మూర్తానామ్" అనగా నోటిచే తినదగినవానికి: "ద్రవాణామ్" అనగా లేహ్యములు (నాలుకతో నాకదగినవి), త్రాగదగినవి అనువానికి అని అర్థము. ఇచట "అంశ" శబ్దము సమముగా విభజించుటయందు కాదు, కాని కావలసినంత భాగమునందు అని తెలియవలెను: అందువలన మూర్త ద్రవ్యములకు (ఘన ద్రవ్యములకు) ఎక్కువ భాగము ఉండునని తెలియవలెను. వాత పిత్త శ్లేష్మములకు భిన్నములగు స్థానములున్ననూ ఘనాహారము మొదలగువాని భాగము కంటె కలసియున్న వాటికి కొంచెము స్థానముండునని ఒకటిగనే ఎంచి ఇచట ఒక భాగము అని చెప్పబడినది. "నామాత్రజాహారమ్" అను మొదలగువానిద్వారా కుక్షియొక్క అంశ విభాగము వలన తీసికొనిన ఆహారమునందునూ, ప్రకృతి, గుర్వాది గుణములు, దుష్టద్రవ్యముల వలన కలుగు దోషము అనువానిని చూడవలెనని చెప్పుచున్నాడు: ప్రకృతి మొదలగువాని యందలి దోషముల వలన కలుగు దుష్ఫలితము తప్పక కలుగునని అర్థము.

4. న చ కేవలం మాత్రావత్త్వాదేవాహారస్య కృత్స్నమాహారఫలసౌష్ఠవమవాప్తుం శక్యం, ప్రకృత్యాదీనామష్టానామాహారవిధివిశేషాయతనానాం ప్రత్యేక - ఫలత్వాత్.

**తాత్పర్యము :** ప్రకృతి మొదలైన ఎనిమిది ఆహార విధి విశేషాయతనములకు వేరుగా ఫలముండుటచేత, కేవలము మాత్రావత్త్వము (సరియైన మోతాదులో నుండుట) చేతనే ఆహారమునకు మొత్తము ఆహారము యొక్క సత్ఫలితములను పొందుట శక్యముగాదు.

**ఆయుర్వేద దీపిక :** "న చ" అను మొదలగువానిద్వారా అదియే స్ఫురింప జేయుచున్నాడు. "సౌష్ఠవమ్" అనగా సుష్ఠుత్వము, మంచిని చేయుట యను గుణము అని అర్థము. "ప్రవిభక్త ఫలత్వాత్" అనగా వేరు ఫలితము లుండుటచేత అని అర్థము.

## ఆహారరాశి మాత్ర అమాత్రయని రెండు విధములుగా నుండుట

5. తత్రాయం తావదాహారరాశిమధికృత్య మాత్రమాత్రఫలవినిశ్చయార్థః ప్రకృతః ఏతావానేవ హ్యాహారరాశివిధివికల్పో యావన్మాత్రావత్త్వమమాత్రావత్త్వం చ

## సరియగు మాత్ర (మోతాదు)లోనున్న ఆహార సేవనవలన కల్గు గుణములు

6. తత్ర మాత్రావత్త్వం పూర్వముద్దిష్టం కుక్ష్యంశవిభాగేన, తద్భూయో విస్తరేణానువ్యాఖ్యాస్యామః. తద్యథా — కుక్షేరప్రపీడనమాహారేణ, హృదయస్యానవరోధః, పార్శ్వయోరవిపాటనమ్, అనతిగౌరవముదరస్య, ప్రీణనమిన్ద్రియాణాం, క్షుత్పిపాసోపరమః, స్థానాసనశయనగమనోచ్ఛ్వాసప్రశ్వాసహాస్యసఙ్కథాసు సుఖానువృత్తిః, సాయం ప్రాతశ్చ సుఖేన పరిణమనం, బలవర్ణోపచయకరత్వం చ; ఇతి మాత్రావతో లక్షణమాహారస్యభవతి.

**తాత్పర్యము :** ఆహారరాశిపై నాధారపడి మాత్రామాత్రఫలమును నిశ్చయించుట ప్రస్తుతము (చేయవలసియున్నది). ఇదియే ఆహారరాశి విధి వికల్పము మాత్రావత్త్వము మరియు అమాత్రావత్త్వము అని రెండు విధములు.

అచట మాత్రావత్త్వము పూర్వము కుక్ష్యంశ విభాగము వలన చెప్పబడినది. దానిని మరల విస్తారముగా చెప్పబోవుచున్నాము. అది ఎట్లనగా - ఆహారముచేత కుక్షి పీడింపబడకుండుట, హృదయమునకు అవరోధము లేకుండుట, ప్రక్కలు విపాటనము (పగులుచున్నట్లుండుట) లేకుండుట, ఉదరమునందు అతిగా బరువు లేకుండుట, ఇంద్రియములకు సంతోషము గలుగుట, ఆకలిదప్పులు శాంతించుట, నిలచుట - కూర్చొనుట - పడుకొనుట - నడచుట - ఉచ్ఛ్వాస ప్రశ్వాసలు చేయుట-నవ్వుట - మాట్లాడుటలయందు సుఖముగా నుండుట, సాయంత్రము, ఉదయము ఆహార పరిణామము సుఖముగా నుండుట, బలము వర్ణము వృద్ధిని చేయుటయును అనునవి సరియగు మోతాదులోనున్న ఆహారము యొక్క లక్షణమగును.

**ఆయుర్వేద దీపిక :** "కుక్ష్యంశ విభాగేన" అనగా ఒక అవకాశాంశము మూర్తరూప ఆహారమునకు - ఈ మొదలగువాని వలన అని అర్థము. "ఉద్దిష్టమ్" అనగా సంక్షేపముగా చెప్పబడినది. "సాయం ప్రాతశ్చ" అను వచనముచేత సాయంత్రము భోజనము చేసినచో ఒకవేళ ప్రాతఃకాలము, ప్రాతఃకాలమున భుజించినచో ఒకవేళ సాయంత్రము సుఖముగా పరిణమించుచున్నచో మరియు నిలచుట కూర్చుండుట మొదలగువానియందు సుఖము కలుగుచున్నచో అప్పుడు ఇతనిచే మాత్రావంతమైన భోజన మితనిచే చేయబడినదని తెలియవలెను.

## అమాత్రావత్త్వద్వైవిధ్యము - హీనమాత్ర - అతిమాత్ర - వీనివలన కల్గు ఫలితములు

7. ఆమాత్రావత్త్వం పునర్ద్వివిధమాచక్షతే - హీనమ్, అధికం చ. తత్రహీన - మాత్రమాత్రోమాహారరాశిం బలవర్ణోపచయక్షయకరమతృప్తికరముదావర్త - కరమనాయుష్యమవృష్యమనౌజస్యం శరీరమనోబుద్ధీంద్రియోపఘాతకరం సారవిధమనమలక్ష్మ్యావహమశీతేశ్చ వాతవికారాణామాయతనమాచక్షతే, అతి- మాత్రం పునః సర్వదోషప్రకోపణమిచ్ఛన్తి కుశలాః యో హి మూర్తానా- మాహారజాతానాం సౌహిత్యం గత్వా ద్రవైస్తృప్తిమాపద్యతే భూయస్త- స్యామాశయగతా వాతపిత్తశ్లేష్మాణోఽభ్యవహారేణాతిమాత్రేణాతిప్రపీడ్య- మానాః సర్వే యుగపత్ ప్రకోపమాపద్యన్తే, తే ప్రకుపితాస్తమేవాహార- రాశిమపరిణతమావిశ్య కుక్ష్యేకదేశమన్నాశ్రితా విష్టమ్భయన్తః సహసావాఽ- ప్యుత్తరాధరాభ్యాం మార్గాభ్యాం ప్రచ్యావయన్తః పృథక్ పృథగిమాన్ వికారానభినిర్వర్తయన్త్యతిమాత్రభోక్తుః. తత్ర వాతః శూలానాహాఙ్గమర్ద- ముఖశోషమూర్చ్ఛాభ్రమాగ్నివైషమ్యపార్శ్వపృష్ఠకటిగ్రహసిరాకుఞ్చనస్తమ్భ - నాని కరోతి, పిత్తం పునర్జ్వరాతీసారాన్తర్దాహతృష్ణామదభ్రమప్రలాపాని, శ్లేష్మా తు ఛర్ద్యరోచకావిపాకశీతజ్వరాలస్యగాత్రగౌరవాణి.

**తాత్పర్యము :** అమాత్రావత్త్వము హీనము మరియు అధికము అని రెండు విధములుగా చెప్పబడుచున్నది. అందు తక్కువమోతాదులో నున్న (హీనమాత్రలో నున్న) ఆహారరాశిని బల - వర్ణ - ఉపచయములను తగ్గించునది. తృప్తిని కలుగజేయనిది, ఉదావర్తమును కలుగజేయునది, వృష్యశక్తిని తగ్గించునది,

ఆయుష్కరము కానిది, ఓజస్సును నష్టపరచునది, శరీరము - మనస్సు - బుద్ధి - ఇంద్రియములకు విఘాతమును కల్గించునది, సారములను నష్టపరచునది, దారిద్ర్యమును కలుగజేయునది మరియు ఎనుబది వాత వికారములకు కారణమగునదిగను చెప్పబడుచున్నది.

అతి మాత్రను (ఎక్కువగా నున్న ఆహారరాశిని) మరల, సర్వదోష ప్రకోపకముగా కుశలత గలవారు పేర్కొందురు. ఎవడు ఘన ఆహారమును తృప్తిగా భుజించి ఆ పై ద్రవములచే తృప్తిని పొందునో, వానికి ఆమాశయమందున్న వాతపిత్త శ్లేష్మములు అతిమాత్రలో తినిన ఆహారమువలన ఎక్కువగా పీడింపబడుచుండును. అందువలన అవి ప్రకోపమును పొందుచున్నవి. అట్లు ప్రకోపించిన ఆ దోషములు పరిణామము నొందని అదే ఆహారరాశిని జేరును. కుక్షియందలి ఆహారమును చేరియుండి విష్టంభమును కలిగించును. ఒక్కసారిగా గాని ఊర్ధ్వ - అధో మార్గముల గుండా ప్రసరించును. (అటుపై) అతిమాత్ర భోజనము చేయువానికి వేర్వేరుగా ఈ క్రింద చెప్పబడుచున్న వికారములను కలుగజేయును. అచట వాతము - శూల - ఆనాహ (కడుపుబ్బరించుట) అంగమర్ద (ఒడలు నొప్పులు) - ముఖ శోష (నోరు ఎండి పోవుట) - మూర్ఛ - భ్రమము - అగ్నియొక్క వైషమ్యము పార్శ్వ పృష్ఠ-కటిగ్రహములు సిరా కుంచనము - స్తంభనములను కలుగజేయును. పిత్తము మరల జ్వర - అతిసార - అంతర్దాహ - తృష్ణా - మద - భ్రమ - ప్రలాపములను కలుగజేయును. శ్లేష్మము మాత్రము ఛర్ది - అరోచకము - విపాకము నొందకుండుట - శీతజ్వరము - అలసత్వము - శరీర గురుత్వములను కలుగజేయును.

ఆయుర్వేద దీపిక : "సార విధమనమ్" అనగా రోగభిషగ్జితీయాధ్యాయమునందు (విమానస్థానము - ఎనిమిదవ అధ్యాయము) చెప్పబోవుచున్న త్వక్ సారము మొదలగువానిని నష్టపరచుట. "ఆహార - వికారాణామ్" చేయుటయందు హితకరముగా నుండుట వలన నిది షష్ఠీవిభక్తి. "ద్రవైస్తృప్తిమ్" అనగా భూయః అను పద విశేషణముచేత అతి తృప్తి అని అర్థము. ఆమాశయగతాః" అను వచనముచేత అగ్నికి సహాయము చేయు వాయువు (సమానవాయువు) నకే ప్రకోపము కలుగును. పక్వాశయము నందున్న వాయువునకు కాదు అని చూపుచున్నాడు. కుక్ష్యేకదేశమన్నాశ్రితాః అనగా పోషింపబడిన ఆహారముతో కూడి అని అర్థము.

LEGE

**ఆమ దోషమును కల్గించుటకు అతిమాత్రయేకాక ఇతర కారణములు**

8. న చ ఖలు కేవల మతిమాత్రమేవాహారరాశి మామప్రదోషకరమిచ్ఛన్తి, అపి తు ఖలు గురురూక్షశీత శుష్కద్విష్టవిష్టమ్భివిదాహ్యశుచివిరుద్ధానామకాలే చాన్న పాకానాముపసేవనం, కామక్రోధలోభ మోహేర్ష్యాహ్రీశోకమానోద్వేగ భయోపతప్తమనసా వా యదన్నపానముపయుజ్యతే, తదప్యామమేవ ప్రదూషయతి.

భవతి చాత్ర —

9. మాత్రయాప్యవహృతం పథ్యం చాన్నం న జీర్యతి,
చిన్తాశోకభయక్రోధదుఃఖశయ్యాప్రజాగరైః ।

**తాత్పర్యము :** నిజమునకు కేవలము అతి మాత్రలోనున్న ఆహారరాశియే ఆమప్రదోషకరము గాదు. ఇంకను గురు - రూక్ష - శీత - శుష్క - ద్వేషించ బడిన - విష్టంభమును కలిగించు, విదాహమును కలిగించు, విరుద్ధ గుణములు కలసి యున్న, అకాలమునందుఅను అన్న పానాదులను సేవించుట, లేదా కామక్రోధలోభ మోహ ఈర్ష్యా లజ్జా శోక అభిమాన ఉద్వేగ భయములచే బాధింపబడిన మనస్సుతో గానీ ఏ ఆహారమును ఉపయోగింపబడునో, అదియును ఆమమునే ప్రదూషింప జేయును.

ఇంకను పథ్యమగు ఆహారము సరియగు మాత్రలో భుజించిననూ, చింతా - శోకము - భయము - క్రోధము - దుఃఖము - అధిక నిద్ర - అధిక జాగరణముల చేత జీర్ణముకాదు.

**ఆయుర్వేద దీపిక :** "న చ ఖలు" అను మొదలగువాని ద్వారా అతి మాత్ర యందున్న ఆహారమును భుజించుటవలన ఆమ ప్రదోషము కలుగుటను చెప్పుటయందు ఇతరములైన ఏ యే కారణములవలనగూడ ఆమ ప్రదోషము కలుగునో వానిని చెప్పుచున్నాడు. కామాదులచే కలుగు మానస ఉపఘాత ప్రభావము చేతనే అన్నమును దూషించును. ఇట్లే అశుచిగా నున్న అన్నము అశుచిగా నుండుటను తెలియబడిన మనస్సు ఉపఘాతము నొందుటచే ఆమ దూషకమగును. అపక్వాహారము యొక్క ప్రదోషము ఆమదూషకమగును. ఆమమే ప్రదూషణమును

నని ఇచటకర్మకు కర్తృత్వము నాపాదించుట యందు "అచ్" ప్రయోగము జరిగినది. అందుచే దుష్టమగునని అర్థము. లేదా, అపరిపక్వమగు ఆమము దుష్టములైన దోషముల సంపర్కముచేత శరీరమును దూషింపజేయును అని తెలియవలెను.

## ఆమ దోషము రెండు విధములనుట

10. తం ద్వివిధ మామ ప్రదోష మా చక్షతే భిషజః - విసూచికామ్, అలసకం చ.

## విసూచికా లక్షణము

11. తత్ర విసూచికా మూర్ధ్వం చా ధశ్చ ప్రవృత్తామదోషాం యథోక్త రూపాం విద్యాత్.

**తాత్పర్యము :** అట్టి ఆమప్రదోషమును వైద్యులు విసూచిక, అలసక మని రెండు విధములుగా చెప్పుదురు.

అచట విసూచికను యథోక్త రూపమగు ఆమ దోషము ఊర్ధ్వ అధోరూప మున వెడలునదిగా తెలియవలెను. (వాంతిగను విరేచనముగను బయటపడునదిగా తెలియ వలెను.)

**ఆయుర్వేద దీపిక :** "ద్వివిధమ్" అను మొదలగువానియందు అలస కము నందే దండాలసకము ఆమ పదార్థములకు అవరోధము కలిగించునదిగా తెలియ వలెను. ఆ రెండింటికినీ మాత్రమే దోషము అప్రవృత్తముగా (బయటకు వెడల కుండునదిగా) నుండుట వలన అలసీభూతముగనే అగునని అర్థము.

## అలసక లక్షణము

12. అలసక ముపదేక్ష్యామః - దుర్బలస్యాల్పాగ్నేర్బహుశ్లేష్మణో వాతమూత్ర పురీష వేగధారిణః స్థిర గురు బహురూక్ష శీత శుష్కాన్న సేవిన స్తదన్న పాన మనిల ప్రపీడితం శ్లేష్మణా చ విబద్ధ మార్గమతి మాత్ర ప్రలీనమల- సత్వాన్న బహిర్ముఖీభవతి, తతశ్ఛర్ద్యతీసారవర్జ్యాన్యామప్రదోషలిఙ్గాన్యభిదర్శ- యత్యతిమాత్రాణి. అతిమాత్రప్రదుష్టాశ్చ దోషాః ప్రదుష్టామబద్ధమార్గాస్తిర్య- గ్గచ్ఛన్తః కదాచిదేవ కేవలమస్య శరీరం దండవత్ స్తమ్భయంతి, తత స్తం

దణ్డాలసకమసాధ్యం బ్రువతే. విరుద్ధాధ్యశనాజీర్ణాశన శీలినః పునరామదోష-మామవిషమిత్యాచక్షతే భిషజః విషసదృశలిఙ్గత్వాత్; తత్ పరమసాధ్యమ్, ఆశుకారిత్వాద్విరుద్ధోపక్రమత్వాచ్చేతి.

**తాత్పర్యము :** అలసకమును గూర్చి ఉపదేశించబోవుచున్నాము-దుర్బలుడు, అల్పమైన అగ్ని గలవాడు, అధికశ్లేష్మము గలవాడు, వాతమూత్ర పురీష వేగములను ధరించినవాడు, (ఆ వేగములను వెలువరింపక ఆపి యున్నవాడు) స్థిర-గురు-బహు-రూక్ష-శీత-శుష్కమగు అన్నమును పానములను సేవించినవాడు వాతముచే పీడింపబడినవాడును అగువానికి శ్లేష్మముచేత మార్గము విబద్ధమై మిక్కిలి కలసిపోయి అలసత్వముచేత (ఆమము) బయల్వెడలదు. అంతట ఛర్ది అతిసారము దప్ప మిగిలిన ఆమప్రదోష లక్షణములు అతిగా చూపించును. దోషములను అతిగా దూషింపబడుట వలన బాగా దూషించియున్న ఆమముచే మార్గములు బంధింపబడి తిర్యగ్గమనము చేయును. ఎప్పుడో ఒకప్పుడు మాత్రము అట్టివాని మొత్తము శరీరము దండమువలె స్తంభించును. అపుడు దానిని వైద్యులు అసాధ్యమగు దండాలసకమని చెప్పుదురు. విరుద్ధాహారమును సేవించువారికి, అధ్యశనము చేయువారికి, క్రితము తినిన ఆహారము జీర్ణము కాకముందే తిరిగి భుజించువారికిని మరల ఆమ దోషమును ఆమ విషము అని వైద్యులు పిలుతురు. ఇది విష సదృశమైన లక్షణములు కలిగియుండుట చేత (ఆమ విషమని) పిలుతురు. అది ఆశుకారిత్వము (శీఘ్రముగా చంపు గుణము) కలిగియుండుట చేతను విరుద్ధ చికిత్స గలదగుట (చికిత్స వలన వ్యాధి ఉపశమింపక ఎక్కువగుచుండుట) చేత చాల అసాధ్యముగా నుండును.

**ఆయుర్వేద దీపిక :** "అలసకముపదేక్ష్యామః" అను మొదలగువాని ద్వారా మరల విశేష హేతువు-సాధారణముగా ఆ వ్యాధిని అభినిర్వర్తింపచేయు హేతువు - చెప్పబడుచున్నది. అతిమాత్రాహార రూపమగు హేతువు సామాన్యముగా చెప్పబడియే యున్నదని తెలియవలెను. "అనిలప్రపీడితం శ్లేష్మణా చ విబద్ధమార్గమ్" అని రెండు దోషముల కార్యములనే చెప్పుట వలన అలసకమునందు వాతము మరియు శ్లేష్మముల ప్రాధాన్యము చెప్పబడుచున్నది. పిత్తము మాత్రము సామాన్యమగుట వలన సిద్ధించినట్లు అప్రధానమే అయియున్నది. దానికి తృష్ణా-మద-భ్రమాది లక్షణములని తెలియవలెను. "ప్రదుష్టామబద్ధమార్గః" అనగా ఇచట అపక్వమగు ఆహారము లేదా అన్నరసము అపక్వముగా నున్నది ఆమమనబడుచున్నది. "కేవలమ్" అనగా అంతయు అని అర్థము. "విరుద్ధాధ్యశనాజీర్ణాశన శీలినః" అనగా విరు

ద్యాశనము, అధ్యశనము, మరియు అజీర్ణాశనము చేయువానికి: "అజీర్ణస్య"- పచన ముగాకుండగ "అశనమ్"-భుజించుట అజీర్ణాశన మనబడును. అజీర్ణమునందు భోజనము యొక్క అధ్యశనము జరిగియుండునని తెలియుచున్నది. "ఆమనోషమామవిష మాచక్షత" అనుచోట విషసదృశ లక్షణమే ఆమప్రదోషమని అభిప్రాయపడుట జరిగినది. అందువలననే "విషసదృశ లింగత్వాత్" అని చెప్పడడినది. "విరుద్ధోపక్రమత్వాత్" అనగా ఆమమునకు ఉష్ణ చికిత్స చేయబడిన యెడల అది విషమునకు విరుద్ధమగును. విషమునకు శీత చికిత్స చేసిన యెడలనూ అది ఆమ విరుద్ధమగును. విష సాదృశ్యము కూడ ఆమమునకు విశేష ప్రభావముచేత ఆమమును పుట్టించు హేతువు కలుగును. మధు ఘృతముల సంయోగముల వంటి విషత్వ మిచట కలుగును.

## చికిత్సా సాధ్యమగు ఆమావస్థయందు చేయదగు క్రియలు

13. తత్ర సాధ్యమామం ప్రదుష్టమలసీభూతముల్లేఖయేదాదౌ పాయయిత్వా సలవణముష్ణం వారి, తతః స్వేదనవర్తిప్రణిధానాభ్యాముపాచరేదుపవాసయేచ్చైనమ్. విసూచికాయాం తు లఙ్ఘనమేవాగ్రే విరిక్తవచ్చానుపూర్వీ. ఆమప్రదోషేషు త్వన్నకాలే జీర్ణాహారం పునర్దోషావలిప్తామాశయం స్తిమితగురుకోష్ఠమనన్నాభిలాషిణమభిసమీక్ష్య పాయయేద్దోషశేషపాచనార్థమౌషధమగ్నిసంధుక్షణార్థం చ, నత్వేవాజీర్ణాశనమ్; ఆమప్రదోషదుర్బలో హ్యగ్నిర్న యుగపద్దోషమౌషధమాహారజాతం చ శక్తః పక్తుమ్. అపి చామదోషౌషధవిభ్రమోఽతిబలత్వాదుపరతకాయాగ్నిం సహసైవాతురమబలమతిపాతయేత్. ఆమప్రదోషజానాం పునర్వికారాణామపతర్పణేనైవోపరమో భవతి, సతి త్వనుబన్ధే కృతాపతర్పణానాం వ్యాధీనాం నిగ్రహే నిమిత్తవిపరీతమపాస్యౌషధమాతఙ్కవిపరీతమేవావచారయేద్యథాస్వమ్. సర్వవికారాణామపి చ నిగ్రహే హేతువ్యాధివిపరీతమౌషధమిచ్ఛన్తి కుశలాః, తదర్థకారి వా. విముక్తామప్రదోషస్య పునః పరిపక్వదోషస్య దీప్తే చాగ్నావభ్యఙ్గాస్థాపనానువాసనం విధివత్ స్నేహపానం చ యుక్త్యా ప్రయోజ్యం ప్రసమీక్ష్య దోషభేషజదేశకాలబలశరీరాహారసాత్మ్యసత్త్వప్రకృతివయసామవస్థాన్తరాణి వికారాంశ్చ సమ్యగితి.

**తాత్పర్యము :** అచట సాధ్యమగు ఆమమును (ఆమదోషమును) బాగుగా దూషింపబడినదానిని అలసక రూపముగా (బయటికి వెడలక ఆమాశయమునందే) యున్నదానిని మొదట ఉప్పు కలిపిన వేడి నీటిని త్రాగించి ఉల్లేఖనము చేయించ

వలెను. అటుపైన స్వేదనము వర్తిప్రణిధానములను చేసి రోగిని ఉపవాసముంచవలెను. విసూచిక యందు మాత్రము మొదట లంఘనమునే చేయించవలెను. పేయాదిక్రమమునననుసరించి విరేచనమును చేయించవలెను. ఆమ ప్రదోషముల యందు మాత్రము ఆహార మివ్వదగినకాలమునందు ఆహారము జీర్ణమై, దోషములచే లేపనము చేసియున్నట్లున్న ఆమాశయముతో, స్తంభించిన గురువుగా నున్నకోష్ఠము కలిగియుండి, అన్నమునందభిలాష లేక యున్నవానిని బాగుగా పరిశీలించి శేష దోషముల పాచనము కొరకు అగ్నిదీప్తి కొరకును ఔషధమును త్రాగించవలెను. అజీర్ణముగా నున్నపుడు ఆహారము నివ్వనే కూడదు. ఆమప్రదోషముచే దుర్బలమైన అగ్ని ఒక్కసారిగా దోషము, ఔషధము మరియు ఆహారపదార్థములను పచింప జాలదు. ఇంకనూ ఆమప్రదోషము, ఆహారము, ఔషధము లొకటిగా జేరి బలవంతమై కాయాగ్ని బాగుగా తగ్గినట్టియు, బలహీనుడై యున్నట్టియు రోగిని ఒక్కసారిగా క్రిందపడవేయును. మరల ఆమప్రదోషము వలన కలుగు వ్యాధులకు అపతర్పణము వలననే శమనము కలుగును। అనుబంధమునందు (జ్వరము మొదలగునవి కూడి యున్నపుడు) అపతర్పణము చేసిన వ్యాధులకు హేతువిపరీతమగు చికిత్సను చేయక వ్యాధి విపరీతమగు చికిత్సనే యథావిధిన చేయవలెను। అన్ని వ్యాధులకును హేతు వ్యాధి విపరీతమగు ఔషధమివ్వవలెనని లేదా తదర్థకారి నివ్వవలెనని చికిత్సా కౌశలము గలవారి అభిప్రాయము. ఆమదోషము పోయినపుడు మరల పరిపక్వమైన దోషములున్నపుడు అగ్నిదీప్తి కలిగియున్న సమయమునందు అభ్యంగ - ఆస్థాపన - అనువాసనములను విధిప్రకారము మరియు యుక్తి యుక్తము స్నేహపానమును - ప్రయోగింపవలసిన దానిని దోష-భేషజ-దేశ-కాల-బల-శరీర-ఆహార-సాత్మ్య-సత్త్వ-ప్రకృతి-వయస్సు-వీనియొక్క ఇతర అవస్థలను వికారములను సరిగా సమీక్షించి ప్రయోగింపవలెను.

ఆయుర్వేద దీపిక : "వర్తి" అనగా ఫలవర్తి అని అర్థము. "ఆనుపూర్వ్యా" అనగా పేయాది క్రమము అని అర్థము. "జీర్ణాహారమ్" అని విసూచికా-అలసకముల యందున్న ఆహారమే జీర్ణమగుటను చూపుచున్నాడు. "దోషావలిప్తామాశయస్తిమిత గురుకోష్ఠ" ఆమాశయము దోషములచే అవలిప్తమైయుండుట, కోష్ఠము స్తిమితముగను బరువుగను నుండుట పురుషునికి (రోగికి) విశేషణములుగా చెప్పబడినప్పటికీ లక్షణముగా (రోగలక్షణముగా) తెలియవలెను. "నత్వాజీర్ణాశనమ్" అని మరల నిషేధించుటవలన అజీర్ణముగా నున్నపుడు భుజించుటయందు ప్రమాదము

చేత కలుగు అజీర్ణమును శమింపజేయుటయను అభిప్రాయముతో చేయబోపు చికిత్స యొక్క గొప్ప అవసరమును "దోషదుర్బలోహ్యగ్నిః" అను మొదలగు అని చెప్పబోవుచున్న వానిద్వారా చూపుచున్నాడు. "కృతాపతర్పణమ్" అనుట వలన దోషములకు ఆమక్షయత్వమును సూచించుచున్నారు. సరిగా చేయబడిన అపతర్పణము నందు ఆమముయొక్క అనుబంధము ఉండదు. అటుపైన విసూచిక-అలసకము లుండగా నిరామమగు దోషముల వలన కలుగు శూల, జ్వరము మున్నగువానియందు వ్యాధి విపరీతమగునట్టి నిరామశూల-జ్వరాదులను హరించునట్టియు చికిత్సయే ఉపయోగింపబడుచున్నది. "యథాస్వమ్" అనగా శూల మొదలగువానికి వ్యాధి విపరీత చికిత్సచే ఏది కలదో దానినచట చేయవలెనని అర్థము. "ఆతంక విపరీత" శబ్దము వలన తదర్థకారి కూడ తీసికొనబడినదని అనుకొనవలెను. అందువలననే తరువాతిచోట సర్వవ్యాధుల భేషజమును చెప్పునపుడు "తదర్థకారి వా" అని వచ్చి యున్నది. లేని యెడల ఇచట చెప్పబడని అప్రస్తుతమగు తదర్థకారి అచట ఏల చెప్పబడుచున్నది ? "విముక్తామప్రదోషస్య" అను మొదలగు వానివలన అభ్యంగము మొదలైనవానిని చేయుట (విధించుట) అనునది వ్యాధి వలన కలిగిన అతి దౌర్బల్యము మొదలగు దోషములను శమింపజేయుట కొరకు అని గ్రహించవలెను.

భవతి చాత్ర—

14. ఆహారవిధ్యాయతనాని చాష్టౌసమ్యక్ పరీక్ష్యాత్మహితం విదధ్యాత్.
అన్యశ్చకశ్చిదిహాస్తి మార్గోహితోపయోగీషు భజేత తం చ.

**తాత్పర్యము :** ఎనిమిది ఆహారవిధి ఆయతనములను సరిగా పరీక్షించి తనకు హితమగుదానిని ఉపయోగించవలెను. హితోపయోగములందింకేదైననూ మార్గమున్నచో దానిని కూడ అనుసరింపవలెను.

**ఆయుర్వేద దీపిక :** "అన్యశ్చ" అను మొదలగువానిని ఇచట చెప్ప బడని విధిని గ్రహించుట కొరకు చెప్పుచున్నాడు. "అన్యశ్చ" అనగా గ్రహణీ, అతిసారములకు చెప్పబోవుచున్న ఆమదోషహరములగు చికిత్సారూపమగు మార్గము ఇచట ఆమప్రదోషమునందు హితమగునని సంబంధము.

## ఆహారము పచనము నొందు స్థలము (శరీరావయవము)

15. అశితం ఖాదితం పీతం లీఢం చ క్వ విపచ్యతే,ఏతత్వాం ధీర!పృచ్ఛామ స్తన్న ఆచక్ష్వ బుద్ధిమన్.

16. ఇత్యాగ్నివేశప్రముఖైః శిష్యైః పృష్టః పునర్వసుః,ఆచచక్షే తత స్తేభ్యో యత్రాశితో విపచ్యతే.

17. నాభి స్తనా న్తరం జన్తోరామాశయ ఇతి స్మృతంః, అశితం ఖాదితం పీతం లీఢం చాత్ర విపచ్యతే.

18. ఆమాశయగతః పాకమాహారః ప్రాప్య కేవలమ్, పక్వః సర్వాశయం పశ్చాద్ధమనీభిః ప్రపద్యతే.

## తత్రశ్లోకః - అధ్యాయ సంగ్రహము

19. తస్య మాత్రావతో లిఙ్గం ఫలం చోక్తం యథాయథమ్, అమాత్రస్య తథా లిఙ్గం ఫలం చోక్తం విభాగశః.

ఇత్యగ్నివేశకృత్ తన్త్రే చరకప్రతిసంస్కృతే విమానస్థానే త్రివిధకుక్షీయ-విమానం నామ ద్వితయోఽధ్యాయః.

**తాత్పర్యము :** నమలబడిన, మ్రింగబడిన, త్రాగబడిన, నాలుకతో నాకబడిన ఆహార ద్రవ్యములెక్కడ పాకము చెందును అని ధీరుడగు మిమ్ముల నడుగుచున్నాము. ఓ బుద్ధిమంతుడా ఆ విషయమును మాకు చెప్పుము.

ఇట్లు అగ్నివేశాది ప్రముఖ శిష్యులచే ప్రశ్నింపబడిన పునర్వసు ఆత్రేయుడు అటుపైన వారికి ఆహారము ఎచట పచనమగునో చెప్పుచున్నాడు.

ప్రాణులకు నాభి స్తనములకు మధ్యనున్నది ఆమాశయమనబడును. ఇచట అశిత, ఖాదిత, పీత, లీఢ ఆహారము పచనము చేయబడుచున్నది.

ఆమాశయమును చేరిన ఆహారము పాకమునొంది, తరువాత ధమనుల ద్వారా సర్వ శరీరమును చేరును.

ఇచ్చట తగు ప్రమాణములో ఆహారమును భుజించుట వలన కలుగు లక్షణములు, దాని ఫలితములు, ప్రమాణము సరిలేక హెచ్చు తగ్గులుగానున్న ఆహారమును సేవించుటవలన కల్గు లక్షణములున్నూ, దాని ఫలితములు విడివిడిగా చెప్పబడినవి.

ఇది అగ్నివేశునిచే రచింపబడి, చరకునిచే ప్రతిసంస్కరింపబడిన తంత్ర మందలి విమానస్థానములోని త్రివిధ కుక్షీయవిమానమను రెండవ అధ్యాయము.

**ఆయుర్వేద దీపిక :** ఆమాశయ ప్రమాణమును చూపుటకు గురువును ప్రశ్నించుట దానికాతడు సమాధానమిచ్చుటకు "అశితమ్" అను శ్లోకమును చెప్పు చున్నాడు. సర్వాశ్రయమనగా సర్వ శరీరమని అర్థము.

ఇది శ్రీ చక్రపాణి దత్తునిచే రచింపబడిన ఆయుర్వేద దీపికయను చరక తాత్పర్య టీకయందలి విమానస్థానమున త్రివిధ కుక్షీయ విమానమను రెండవ అధ్యాయము.

# జనపదోద్ధ్వంసనీయ విమానము

## తృతీయాధ్యాయము

1. అథాతో జనపదోద్ధ్వంసనీయం విమానం వ్యాఖ్యాస్యామః.

2. ఇతి హ స్మాహ భగవానాత్రేయః.

**తాత్పర్యము :** ఇక ఇప్పుడు జనపదోద్ధ్వంసనీయ విమానమును చెప్పబోవుచున్నాము.

అని ఆత్రేయ భగవానుడు చెప్పియుండెను.

**ఆయుర్వేద దీపిక :** ప్రాణులకు వ్యాధిని కలిగించు హేతువు సాధారణము అసాధారణము అని రెండు విధములు. అచట ప్రతి పురుషునికి నియతముగా నుండునట్టియు, వాతాదులను జనింపజేయునట్టియు, సాధారణ హేతువగు ఆహారాద్యమును పేర్కొని, ఎక్కువ జనులకు సాధారణముగావచ్చు వాత-జల-దేశ-కాల రూపమగు సాధారణ రోగ కారణమును పేర్కొనుటకు జనపదోద్ధ్వంసనీయము పేర్కొనబడుచున్నది.

3. జనపదమణ్డలే పఞ్చాలదేశే ద్విజాతివరాధ్యుషితే కామ్పిల్యరాజధాన్యాం భగవాన్ పునర్వసురాత్రేయోఽన్తేవాసిగణపరివృతః పశ్చిమే ఘర్మమాసే గఙ్గాతీరే వనవిచారమనువిచరఞ్ఛిష్యమగ్నివేశమబ్రవీత్.

**తాత్పర్యము :** పంచాల దేశము నందలి గ్రామసమూహమున బ్రాహ్మణ శ్రేష్ఠులు నివసించుచున్న కాంపిల్య రాజధానియందు జ్యేష్ఠమాసమున గంగాతీరమున వనాంతరములందు సంచరించుచు శిష్యుడగు అగ్నివేశునితో పునర్వసు ఆత్రేయ భగవానుడిట్లు చెప్పెను.

**ఆయుర్వేద దీపిక :** జనపద నివాసమునకు కావలసిన లక్షణములతో కూడిన మండలము జనపద మండలము. దానికి విశేషణము పఞ్చాలక్షేత్రము "ద్విజాతివరాధ్యుషితే" అను వచనము వలన మహాజనులచే సేవింపబడినప్పటికీ

అధర్మవశమున చెప్పబోవుచున్న జనపదోద్ధ్వంసము కలుగునని చూపుచున్నాడు. "పశ్చిమే ఘర్మమాసే" అనగా జ్యేష్ఠమాసమునందు అని అర్థము. "వనవిచారమనువిచరన్" అనగా వనమును తిరిగి తిరిగి తరువాత మరల తిరుగుచున్న అని అర్థము.

## ఔషధులను గ్రహింపవలసిన సమయము

4. దృశ్యన్తే హి ఖలు సౌమ్య ! నక్షత్రగ్రహగణచన్ద్రసూర్యానిలానలానాం దిశాం చాప్రకృతిభూతానామృతువైకారికా భావాః, అచిరాదితో భూరపి చ న యథావద్రసవీర్యవిపాకప్రభావమోషధీనాం ప్రతివిధాస్యతి, తద్వియోగాచ్చాతఙ్కప్రాయతా నియతా. తస్మాత్ ప్రాగుద్ధ్వంసాత్ ప్రాక్ చ భూమేర్విరసీభావాదుద్ధరధ్వం సౌమ్య ! భైషజ్యాని యావన్నోపహతరసవీర్యవిపాకప్రభావాణి భవన్తి. వయం చైషాం రసవీర్యవిపాకప్రభావానుపయోక్ష్యామహే యే చాస్మాననుకాఙ్క్షన్తి, యాంశ్చ వయమనుకాఙ్క్షామః న హి సముద్ధృతేషు సౌమ్య ! భైషజ్యేషు సమ్యగ్విహితేషు సమ్యక్ చావచారితేషు జనపదోద్ధ్వంసకరాణాం వికారాణాం కించిత్ ప్రతీకారగౌరవం భవతి.

**తాత్పర్యము :** ఓ సౌమ్యులారా నక్షత్రములు, గ్రహములు, చంద్రుడు, సూర్యుడు, వాయువు, అగ్ని, దిక్కులు-ఇవి వికృతములైయున్నపుడు ఋతువిపరీతములగు భావములు కలిగి దానివలన కొలదికాలములోనే భూమికూడ ఔషధులకు సరియగు రసవీర్యవిపాక ప్రభావములను జనింపజేయదు. రసాదులు సరిగా లేనందున రోగములు కలుగుట సహజమగుట చూచుచున్నాము గదా ! అందువలన ఓ సౌమ్యులారా జనపదములకు ఉద్ధ్వంసము రాకముందు, భూమి విరసీభావము చెందక ముందునూ, ఉపహతములు కానట్టి రసవీర్యవిపాక ప్రభావములు కలిగిన ఔషధులను తీసికొనుడు. (ఏవి) ఎవరు మనలను (చికిత్సచేయ) గోరుచున్నారో ఎవరిని (వేనిని) మనము (చికిత్సింప) గోరుచున్నారో అట్టివారికి (అట్టి రోగములకు) మనము ఇటువంటి రసవీర్యవిపాకప్రభావములను (గల ఔషధులను) ఉపయోగించెదము. ఓ సౌమ్యులారా సరిగా ఉద్ధరింపబడిన ఓషధములను సరిగా తయారింపబడిన ఔషధములయు జనపదోద్ధ్వంసకరరోగములకు ప్రతీకారము చేయుటయందు కొంచెమునూ గొప్పతనము లేదు (అవి సామాన్యముగనే జనపదోద్ధ్వంసకర భావములకు లోను కల్గింపబడిన

ఔషధము

**ఆయుర్వేద దీపిక :** ఋతువులకు వికారమును కలిగించుటకుగాను కలిగినవి ఋతువైకారికములు. ఋతువికారము అనునది ఉపలక్షణము. అందువలన జలము, దేశము, వాతములకు వికారములను కల్గించుటకు గాను కలిగినవి అని అనుకొనవలెను; ఎందువలననగా భూమ్యాదులకును వికృతిని చెప్పబోవుచున్నాడు. లేదా, ఋతువునకు వ్యతిరేకములైనవి ఋతువైకారికములు. అందువల్ల ఋతువునకు అనురూపము గాని లక్షణమే నక్షత్రాదులకు వికృతి అని చెప్పబడియున్నది. గ్రీష్మకాలమునందు నక్షత్రములు నిర్మలముగా నుండును. ఒకవేళ అవి గ్రీష్మమునందు తుషారముచే కప్పబడి యున్నచో అపుడు వికృతములుగా నున్నవని తెలిసికొనవలెను. "భూరపి చ" అను వచనము చేత జలము వాయువులను కూడ గ్రహించుచున్నాడు; అందువలన భూమి యే ఔషధులకు ప్రధాన కారణము, అది రసాదులను జనింపజేయదు; జలము, వాయువు ఈ రెండునూ ఔషధులకు రసాదులను జనింపజేయవని చెప్పబడియున్నది.॥ "ప్రతివిధాస్యతి" అనగా జనింపజేయగలదు. అని అర్థము. "ఉద్ధరధ్వమ్" అను బహువచనము అనేక శిష్యులతో (మిత్రులతో) నున్న అగ్నివేశునికి చెప్పబడినది; అగ్నివేశుడు మాత్రము ప్రధాన శిష్యుడగుట వలన "అగ్నివేశా" అను పదముచేత మరియు "సౌమ్యా" అను పదముచేత సంబోధింపబడుచున్నాడు. భేషజములను గ్రహించుట (భూమినుండి తీయుట) అనునది అనేకమందిచే చేయబడవలసిన కార్యమగుట యను అభిప్రాయము వలన బహువచనముగా ప్రయోగింపబడినది. ప్రధానుడగు వ్యక్తిని సంబోధించి సమూహముచే చేయదగిన క్రియను చేయమని చెప్పుట యుండనేయున్నది. ఎట్లనగా సేనాపతిని యుద్ధము చేయుమని ఆజ్ఞాపించుట అను మొదలగునవి. కొందరు "సౌమ్య" అను పదమును భేషజమునకు విశేషణముగా చేయుదురు. "యేవాస్మాననుకాఙ్క్షన్తి" అనగా ఏవి మనలను - వైద్యులను కోరుచున్నవో అని అర్థము. "యాంశ్చవయమనుకాఙ్క్షామ" అనునది చికిత్స వలన అని అర్థము. ఇందువలన ఏవి వైద్యుని కోరుచున్నవో అవి వైద్య ప్రియములగుటవలన సాధ్యములు. అసాధ్యములు వైద్యులు ద్వేషించునవని చెప్పబడినవి. వైద్యులును వేనిని కోరుచున్నారో అవి సాధ్యరోగములే. అసాధ్యములను వైద్యులు చికిత్సజేయ నిచ్చగించరు. ఇందువలన ఇతరములైన భేషజ సాధ్యములగు రోగములు ఏవి కలవో వానికి ఈ ఔషధముల యొక్క రసాదులను ఉపయోగింపబోవుచున్నారని అర్థము. ఒకవేళ, ఏవి మనవద్ద నున్నవో వేనిని మనము ప్రయోజనవశమున వచ్చుచుకున్నామో వానికి ఉపయోగింపకలము - అని వ్యాఖ్యానము చేసినచో

ఆత్రేయుని పక్షపాత బుద్ధివలన ఇచట ఆప్తోపదేశము సిద్ధింపదు. "సర్వప్రజానాం పితృవచ్ఛరణ్యః" (చికిత్సా స్థానము 5 వ అధ్యాయము) అను వచనము వలన ఆత్రేయునికి అనురాగము (ఏ ఒక్కరిపైననూ) లేదని చెప్పబడినది.

## అసమానమగు ప్రకృతి మొదలగునవి గలవారికి అందరికీ ఒకేమారు జనపదోద్ధ్వంసములగు వ్యాధులు ఎందువలన కలుగును అను ప్రశ్న

5. ఏవంవాదినం భగవన్తమాత్రేయమగ్నివేశ ఉవాచ - ఉద్ధృతాని ఖలు భగవన్! భైషజ్యాని, సమ్యగ్విహితాని, సమ్యగవచారితాని చ; అపి తు ఖలు జనపదోద్ధ్వంసనమేకేనైవ వ్యాధినా యుగపదసమానప్రకృత్యాహారదేహబల-సాత్మ్యసత్త్వవయసాం మనుష్యాణాం కస్మాద్భవతీతి.

**తాత్పర్యము :** ఇట్లు చెప్పుచున్న ఆత్రేయ భగవానునితో అగ్నివేశు డిట్లనెను - ఓ భగవానుడా ! ఔషధములు సరిగా తీసికొనబడినవి బాగుగా తయారు చేయబడినవి. కానీ జనపదోద్ధ్వంసకమైన ఒకేవ్యాధి వేర్వేరు ప్రకృతి, ఆహారపు-టలవాట్లు, దేహ నిర్మాణము, బలము, సాత్మ్యము, సత్త్వము, వయస్సులు కలిగిన మనుష్యులకు ఒకే సమయమున ఎట్లు కలుగును.

**ఆయుర్వేద దీపిక :** "ఉద్ధృతాని" అను వచనము ఇంకను జరుగకున్నను జరిగినదానికివలె ననియు ప్రయోగముచేత తెలిసికొనవలెను. ఉదాహరణము నకు - కొద్దికాలములో చేయదోవుచున్న పనిని చేసినట్లుగా చెప్పుదురు; చెప్పుచున్న సమయమున ఓషధులను వెలికితీయుట జరుగలేదు అని భావము. "ఏకేన" అనగా ఒకే రకమయిన అని అర్థము. అసమానమగు ప్రకృత్యాదులు గలవారలకు సమాన కారణము లేకపోవుటచే ఒకే రూపముగనున్న వ్యాధి కలుగజాలదు అని ప్రశ్నార్థము.

## ఆత్రేయ భగవానుని ఉత్తరము

6. తమువాచ భగవానాత్రేయః - ఏవమసామాన్యావతామప్యేభిరగ్నివేశ! ప్రకృత్యా-దిభిర్భావైర్మనుష్యాణాం యేఽన్యే భావాః సామాన్యాస్తద్వైగుణ్యాత్ సమానకాలాః సమానలిఙ్గాశ్చ వ్యాధయోఽభినిర్వర్తమానా జనపదముద్ధ్వంస-యన్తి తే తు ఖల్విమే భావాః సామాన్యా జనపదేషు భవన్తి; తద్యథా - వాయుః, ఉదకం, దేశః, కాల ఇతి.

**తాత్పర్యము ;** అతనితో ఆత్రేయ భగవానుడిట్లనెను. ఇట్లు అసామాన్యములైనప్పటికీ, ఓ అగ్నివేశుడా ! ఈ ప్రకృతి మొదలగువానిచేత మనుషులకు ఇతరములగు ఏ సామాన్య గుణములుండునో వాటికి వైగుణ్యము కలుగుటవలన సమానకాలమునుగల సమాన లక్షణములుగల వ్యాధులు వచ్చుచు జనపదములను ధ్వంసము చేయును. అవి నిజముగా ఈ (క్రిందచెప్పబోవు) భావములు అందరకు సామాన్యముగా జనపదములందుండును. అవి ఏవనగా - వాయువు - ఉదకము - దేశము - కాలము అనునవి.

**ఆయుర్వేద దీపిక :** "సమానలిఙ్గాః" అనగా తుల్యమైన (సమానమైన) లక్షణములు కలవి.

## దుష్టవాత లక్షణములు

1. తత్ర వాతమేవంవిధమనారోగ్యకరం విద్యాత్; తద్యథాయథర్తువిషమమతి-స్తిమితమతిచలమతిపరుషమతిశీతమత్యుష్ణమతిరూక్షమత్యభిష్యన్దినమతిభైరవారావమతిప్రతిహతపరస్పరగతిమతికుణ్డలినమసాత్మ్యగన్ధబాష్పసికతాపాంశు-ధూమోపహతమితి.

**అర్థము :** అచట ఈ క్రింద చెప్పబోవునటువంటి వాయువు అనారోగ్యమును కలిగించునదిగా తెలియవలెను. - ఋతువుననుసరించి యుండక విషమముగా నుండునది, కదలక యుండునది, ఎక్కువ చంచలత్వము కలిగియున్నది, అతి పరుషముగా నుండునది, అతి శీతలముగా నుండునది, అతి ఉష్ణముగా నుండునది, అతి రూక్షమైయున్నది, అతి అభిష్యందము (జిగట)గా నుండునది, అతి ఉగ్రమైన శబ్దములతో కూడినది, వేర్వేరు దిక్కులనుండి వీచుచు పరస్పరము అతిగా ప్రతిహతమగునది, అతిగా సుడులు తిరుగుచున్నది అసాత్మ్యములగు వాసన, ఆవిరి, ఇసుక, దుమ్ము, పొగ - వీనిచే ప్రతిహతమైనది - ఇట్టి లక్షణములు గలది (అనారోగ్యకరమని తెలియవలెను).

## దుష్ట ఉదక లక్షణములు

2. ఉదకం తు ఖల్వత్యర్థవికృతగన్ధవర్ణరసస్పర్శం క్లేదబహులమపక్రాన్తజల-చరవిహఙ్గముపక్షీణజలేశయమప్రీతికరమపగతగుణం విద్యాత్.

తాత్పర్యము : ఉదకము (జలము) మాత్రము నిజమునకు బాగా వికృతి పొందిన గంధ - వర్ణ - రస - స్పర్శలను కలిగినదానిని, అధికమగు క్లేదము కల దానిని, జలచరములు పక్షులతో కూడియున్నది బలహీనములుగానున్న జలమునందు నివసించు జంతువులు గలది ప్రీతిని కలుగజేయునది సద్గుణములు లేనిది అగుదానిని (అనారోగ్యము కలిగించు జలముగా) తెలియవలెను.

## దుష్ట దేశ లక్షణములు

3. దేశం పునః ప్రకృతివికృతివర్ణగన్ధరసస్పర్శం క్లేదబహులముపసృష్టం సరీసృపవ్యాలమశకశలభమక్షికామూషకోలూకశ్మశానికశకునిజమ్బూకాదిభిస్తృణోలూపోలవనవన్తం ప్రతానాదిబహులమపూర్వవదవపతితశుష్కనష్టశస్యం ధూమ్రమపవనం ప్రధ్మాతపతత్రిగణముత్క్రుష్టనష్టధర్మసత్యలజ్జాచారశీలగుణజనపదం శశ్వత్క్షుభితోదీర్ణసలిలాశయం ప్రతతోల్కాపాతనిర్ఘాతభూమికమ్పమతిభయారావరూపం రూక్షతామ్రారుణసితాభ్రజాలసంవృతార్కచంద్రతారకమభీక్ష్ణం ససంభ్రమోద్వేగమివ సత్రాసరుదితమివ సతమస్కమివ గుహ్యకాచరితమివాక్రన్దితశబ్దబహులం చాహితం విద్యాత్.

తాత్పర్యము : ప్రకృతముగా నుండవలసిన వర్ణగంధ రస స్పర్శలు వికృతముగా నున్నదియు, తేమ అధికముగానున్నది, సర్పములు, క్రూరమృగములు, దోమలు, మిడుతలు, ఈగలు, ఎలుకలు, గుడ్లగూబలు, శకుని పక్షులు, నక్కలు మొదలగువానిచే నిండియున్నది, గడ్డి, రెల్లు (ఉలూపము) పొదలతో కూడినది, తీగలు మొదలగునవి ఎక్కువగానున్నవి, ముందెన్నడూ లేని విధముగా పడిపోయి, ఎండి, నష్టపడియున్న పంటలు గలదియును దుమ్ము (పొగ)తో కూడిన గాలి కలది, అరచుచున్న పక్షి సమూహములు, అరచుచున్న కుక్కలు బెదరిపోయి బాధపడు చున్న వివిధములైన మృగములు, పక్షులునూ కల్గియున్నదియు, విడువబడి నష్టపడిన ధర్మము-సత్యము-లజ్జ-ఆచారము-శీలము-గుణములు కల మనుష్యులున్నది, మాటి మాటికి సంచలనము నొంది కలతబారుచున్న జలాశయములు కలది, ఎల్లప్పుడును ఉల్కాపాతముచే గుంటలుపడి, భూకంపముకల్గి, అతి భయంకరమగు శబ్దములు కలది, [సూర్యుడు-చంద్రుడు-నక్షత్రాదికములు-రూక్షముగా తామ్ర అరుణ శ్వేతము లగు మేఘములచే ఆవరింపబడినట్లున్నది] భీకరముగానున్నది, సంభ్రమోద్వేగము

లతో కూడియున్నట్లు, భయము ఏడుపులతో కూడియున్నట్లు, చీకట్లు కమ్మినట్లు దుహ్యాకాపిశాచములు తిరుగుచున్నట్లును ఏడుపులతో కూడిన శబ్దము అధికముగా నున్నదియును అగు దేశము అహితమైనదిగా తెలిసికొనవలెను.

## వైగుణ్యము నొందిన కాలము యొక్క లక్షణములు

4. కాలం తు ఖలు యథర్తులిఙ్గాద్విపరీతలిఙ్గమతిలిఙ్గం, హీనలిఙ్గం చాహితం వ్యవస్యేత్.

**తాత్పర్యము :** కాలము నిజముగా ఋతువు ననుసరించిన లక్షణములతో నుండక తద్వ్యతిరేక లక్షణములను కలిగియుండునది, ఋతువుననుసరించియే యున్నను-అతిగానున్న లక్షణములు కలది, హీనలక్షణములు కలదియునూ అహిత మని తెలియవలెను.

7. ఇమానేవందోషయుక్తాశ్చతురో భావాఞ్జనపదోద్ధ్వంసకరాన్ వదన్తి కుశలాః; అతోఽన్యథాభూతాంస్తు హితానాచక్షతే.

**తాత్పర్యము :** ఈ విధముగా దోషయుక్తములుగానున్న ఈ నాలుగు (వాయువు, జలము, దేశము, కాలము) భావములు జనపదోద్ధ్వంసములను కలిగించు నని నేర్పరులు అందురు. పై చెప్పిన లక్షణములు లేకయున్నచోనివి హితకరము లని చెప్పబడుచున్నవి.

## వాతాదులు వైగుణ్యము నొందినపుడు సరియగు చికిత్సతో వ్యాధుల నరికట్టుట

8. విగుణేష్వపి ఖల్వేతేషు జనపదోద్ధ్వంసకరేషు భావేషు భేషజేనోపపాద్యమానానామభయం భవతి రోగేభ్య ఇతి.

**తాత్పర్యము :** వ్యతిరేక గుణములు కలిగి జనపదోద్ధ్వంసమును చేయు ఈ భావములయందు ఔషధమును సేవించువారికి (చికిత్స చేయించుకొనువారికి) రోగములవలన భయముండదు.

**ఆయుర్వేద దీపిక :** "యథర్తువిషమమ్" అనగా ఋతువునకు అను రూపముకానట్టి అని అర్థము. "అపగతగుణమ్" అనగా జలమునందుండవలసిన

జీవనము, పిపాసాహరత్వము (బ్రతికించుట, దప్పికను హరింపజేయుట) అను గుణములు లేకుండుట. ప్రాకృతముగా నుండవలసిన వర్ణము మొదలగునవి వికృతి చెందియుండుట ఏ దేశమునకుండునో ఆ దేశమును ప్రకృతి వికృత-వర్ణగన్ధరస స్పర్శమ్" (అందురు). "శ్మాశానిక శకునిః" అనగా గ్రద్ద. "అపూర్వవత్" అనగా ఇంతకు పూర్వము పరిచయమైయున్ననూ ఉపహతమైయున్నందున ఇంతకుముందు లేనట్లు కన్పించును. విడువబడిన, నష్టపడిపోయిన ధర్మము, సత్యము, లజ్జ, సద్గుణములుకల జనులెక్కడ నుందురో ఆ దేశము అట్లు పిలువబడును. అచట ఎవరు ధర్మాదులతో కూడి యుందురో వారు ధర్మాదులను విడచిపెట్టెదరు. ఎవరు ఎల్లెడలను అజ్ఞానముచేత ధర్మాదులను ఆచరింపరో వారికి ధర్మము మొదలగునవి నష్టపడిపోయినట్లే అనుకొనవలెను. గుహ్యక (అను పిశాచము)చేత ఆక్రమింపబడిన దేశము ఎట్లు ఏడ్పులతో కూడియుండునో ఆ విధముగా నుండునది "గుహ్యకాచరిత మివాక్రన్దితశబ్ద బహులం" అనబడును.

## వైగుణ్యము నొందిన వాతాదులు క్రమముగా నొకదానికంటె నొకటి ఎక్కువ బలము కలిగియుండును

భవన్తి చాత్ర—

9. వైగుణ్యముపన్నానాం దేశకాలానిలామ్భసామ్,గరీయస్త్వం విశేషేణ హేతుమత్ సంప్రవక్ష్యతే.

10½. వాతాజ్జలం జలాద్దేశం దేశాత్ కాలం స్వభావతః,విద్యాద్దుష్పరిహార్యత్వాద్గరీయస్తరమర్థవిత్.

11. వాయ్వాదిషు యథోక్తానాం దోషాణాం తు విశేషవిత్,ప్రతీకారస్య సౌకర్యే విద్యాల్లాఘవలక్షణమ్.

**తాత్పర్యము :** విపరీత గుణములను పొందిన దేశ కాలవాయు జలముల యొక్క గరీయత (దీనికంటనేది ఎక్కువ యనుట) సహేతుకముగా చెప్పబడ నున్నది.

వాతము కంటె జలము జలము కంటె దేశము దేశము కంటె కాలము ప్రతిక్రియను చేయలేనందున ఒకదానికంటె నొకటి బలవంతములై యుండునని విషయము తెలిసినవారు అందురు,

వాయువు మొదలగు వానియందు యథావిధిగా చెప్పబడిన దోషముల యొక్క ప్రతీకార సౌకర్యమునందు విశేషవిదుడు లాఘవ (తక్కువగానుండు) లక్షణములను తెలిసికొనవలెను.

**ఆయుర్వేద దీపిక :** "వైగుణ్యమ్" అను మొదలగువాని ద్వారా దూషింపబడిన వాతాదులకు దేనికి ఏ ఉత్కర్షము ఏ కారణమువలన కలుగునో ఆ విషయమును చెప్పుచున్నాడు. స్వభావముచేత "దుష్పరిహార్యత్వాత్" అనగా స్వభావము చేతనే వాతముకంటె జలము దుశ్చికిత్స్యమగుతుంది. జలము కంటెను దేశము: దేశముకంటెనూ కాలము దుష్టపరిహార్యములగును. వాతమును నివాత స్థానమున నుండుటవలన పరిహరింపవచ్చును. జలమట్లు గాదు. దానిని దేహప్రవృత్తి కొరకు తప్పక సేవింపవలసియున్నది. జలమునుకూడ గొప్ప ప్రయత్నముచేత విడువబడ జేయవచ్చును. దేశము మాత్రము దానిని వదలి నివసించుట కష్టమగుటచే జలముకంటె దుష్పరిహారమగును. దేశమునుగూడ ఒకవేళ ఇతరదేశమునకు పోవుట వలన విడువబడుచున్ననూ కాలము మాత్రము అన్ని విధముల విడుచుట అశక్య మగుటచేత ఇది అన్నిటికంటె ఎక్కువైనది. 'గరీయః పరమ్' అను పాఠమునందు ఒకదానికంటె నింకొకదాని ఎక్కువ అని తెలియవలెనని యోజన. దీనికి వ్యతిరేకము లాఘవమును 'వాయ్వాదిషు' అను మొదలగువాని ద్వారా చెప్పుచున్నాడు. "ప్రతీకారస్య సౌకర్యే" అనగా యథోక్త విధిద్వారా వాతాదులను త్యజించుటకు సౌకర్యమువలన అని అర్థము.

## జనపదోద్ధ్వంసములు వచ్చునప్పుడు చేయవలసిన చికిత్సలు

12. చతుర్ష్వపి తు దుష్టేషు కాలాన్తేషు యదా నరాః,
భేషజేనోప పాద్యన్తే న భవన్త్యాతురా స్తదా.

13. యేషాం న మృత్యు సామాన్యం సామాన్యం న చ కర్మణామ్,
కర్మ పంచవిధం తేషాం భేషజం పరముచ్యతే.

14. రసాయనానాం విధివచ్చోపయోగః ప్రశస్యతే,
శస్యతే దేహవృత్తిశ్చ భేషజైః పూర్వ ముద్ధృతైః,

15. సత్యం భూతే దయా దానం బలయో దేవతార్చనమ్
సద్వృత్తస్యాను వృత్తిశ్చ ప్రశమో గు ప్తిరాత్మనః.

16. హితం జనపదానాం చ శివానాముపసేవనమ్,
సేవనం బ్రహ్మచర్యస్య తథైవ బ్రహ్మచారిణామ్.
17. సంకథా ధర్మశాస్త్రాణాం మహర్షీణాం జితాత్మనామ్,
ధార్మికైః సాత్త్వికైర్నిత్యం సహాస్యా వృద్ధ సంమతైః.
18. ఇత్యేతద్భేషజం ప్రోక్త మాయుషః పరిపాలనమ్,
యేషామనియతో మృత్యుస్తస్మిన్ కాలే సుదారుణే.

**తాత్పర్యము :** వాయువు, జలము, దేశము, కాలము అను నాల్గును దుష్టములైన సమయమునందు నరులు భేషజముతో చికిత్స పొందినతో వారు రోగముచే పీడింపబడరు. ఎవరికి మృత్యువు సమానముగా నుండదో, వారి కర్మలను సమానముగా నుండవో, అట్టివారికి పంచవిధ కర్మల రూపమగు భేషజము బాగుగా నుండును.

విధి పూర్వకముగా రసాయనముల యొక్క ప్రయోగము శ్రేష్టముగానుండును. భూమి వికృతి నొందకముందే గ్రహింపబడిన ఓషధులచే చికిత్స చేయుట ప్రశస్తముగా నుండును.

సత్యవాక్పరిపాలనము, భూతముల యెడ దయాగుణము, దానము, బలులు అర్పించుట, దేవతార్చనము చేయుట, సద్వృత్తమును అనుసరించుట, మంత్రాదులచే, రక్షలచేతను వ్యాధులను చికిత్సించుటలను చేయవలెను.

జనపదములకు మేలైనవి, మంగళప్రదమైనవి అగువానిని చేయవలెను. బ్రహ్మచర్యము సేవలంబించవలెను. అట్లే బ్రహ్మచారులను సేవింపవలెను.

ధర్మశాస్త్రములను గూర్చి, మహర్షులను గూర్చియు, మహాత్ములను గూర్చి, ధార్మికులు, సాత్త్వికులు, హాస్యముతో కూడి, వృద్ధులకు సమ్మతమగువారి చేత కథలను చెప్పించుకొనవలయును.

దారుణమగు జనపదోద్ధ్వంసనకాలమునందు అనియతమగు మృత్యువు కలుగు అవకాశమున్నవారికి పై చెప్పిన వన్నియు చికిత్సలుగా చేయవలెను. దీనివలన ఆయుః పరిపాలనము జరుగును.

**ఆయుర్వేద దీపిక :** "యేషాం న మృత్యుసామాన్యమ్" అనగా మృత్యువును కలిగించు విధిలిఖితము సమానముగా నుండదో అని అర్థము. "సామా

న్యం న చ కర్మణామ్" అనగా మృత్యువును కలిగించు కర్మలును ఎవరికి సామాన్యముగ నుండవో అని అర్థము. కొందరు క్రిందటి జన్మయందు గ్రామములను తగుల బెట్టుట మొదలగు కర్మలను చేసియుందురు, ఆ కర్మబలము వలన వీరు మృతులగుచున్నారు. లేదా వేరుగా మృత్యువును కలిగించు కర్మ చేసిన వారికినీ దానియొక్క కర్మవిపాకము ఏకకాలమందు జరుగును. వారును (పైవారితో కలిసి) సమకాలమునందు మృతులగుదురు. అచట "న మృత్యుసామాన్యమ్" అనుటవలన అరిష్టములతో కూడి యుండుటచే కొందరికి అసాధ్యము అగునని చూపుచున్నాడు. "న కర్మ సామాన్యమ్" అనుటవలన కొందరికి అరిష్టములు కలిగినప్పటికీ మారకమగు కర్మ వశము చేత అసాధ్యమగుచున్నది అని చూపుచున్నాడు. లేదా "న మృత్యు సామాన్యమ్" అనుటవలన మారకమగు వ్యాధి సాధారణముగా నుండునని చెప్పబడుచున్నది. "న కర్మసామాన్యమ్" అనుటవలన మారకవ్యాధిని జనింపజేయు కర్మ అని చెప్పబడుచున్నది. "పూర్వముద్ధృతైః" అనగా విపత్తు రాకమునుపు గ్రహింపబడిన వాటిచేత అని అర్థము. "గుప్తిః" అనగా మంత్రాదులచేత రక్షా విధానము. "అనియతః" అనువచనముచేత దుర్బలమగు కర్మచే కలుగు మృత్యువే తప్పింపవీలగును, అట్టిదానిని యిక్కడ చెప్పిన విధముగా పరిహరింప (ప్రయత్నింప) వలెనని సూచించుచున్నాడు.

## వాయువు మొదలైనవి వైగుణ్యము పొందుటకు కారణము

19. ఇతి శ్రుత్వా జనపదోద్ధ్వంసనే కారణాని పునరపి భగవన్తమాత్రేయమగ్నివేశ ఉవాచ-అథ ఖలు భగవన్! కుతోమూలమేషాం వాయ్వాదీనాం వైగుణ్య-ముత్పద్యతే? యేనోపపన్నా జనపదముద్ధ్వంసయతీతి.

20. తమువాచ భగవానాత్రేయః-సర్వేషామప్యగ్నివేశ! వాయ్వాదీనాం యద్వై-గుణ్యముత్పద్యతే తస్య మూలమధర్మః, తన్మూలం వాఽసత్కర్మ పూర్వ-కృతం; తయోర్యోనిః ప్రజ్ఞాపరాధ ఏవ. తద్యథా-యదా వై దేశనగరనిగమ-జనపదప్రధానాః ధర్మముత్క్రమ్యాధర్మేణ ప్రజాం వర్తయన్తి, తదాశ్రితో-పాశ్రితాః పౌరజనపదా వ్యవహారోపజీవినశ్చ తమధర్మమభివర్ధయన్తి, తతః సోఽధర్మః ప్రసభం ధర్మమన్తర్ధత్తే, తతస్తేఽన్తర్హితధర్మాణో దేవతాభిరపి త్యజ్యన్తే; తేషా తథాఽన్తర్హితధర్మణామధర్మప్రధానానామపక్రాన్తదేవతానా-మృతవో వ్యాపద్యన్తే; తేన నాపో యథాకాలం దేవో వర్షతి న వా వర్షతి

వికృతం వా వర్షతి. వాతా న సమ్యగభివాన్తి, క్షితిర్వ్యాపద్యతే, సలిలాన్యుపశుష్యన్తి, ఓషధయః స్వభావం పరిహాయాపద్యన్తే వికృతిం: తత ఉద్ధ్వంసన్తే జనపదాః స్పృశ్యాభ్యవహార్యదోషాత్.

తాత్పర్యము : అన విని అగ్నివేశుడు ఆత్రేయ భగవానుని మరల జనపదోద్ధ్వసనమునందు కారణములను - ఓ భగవానుడా! ఏ వైగుణ్యమును పొందిన వాయ్వాదులు జనపదములను ధ్వంసము చేయునో అట్టి వైగుణ్యమునకు మూలమేది. అని అడుగుచున్నాడు.

అతనితో నాత్రేయ భగవానుడిట్లనెను – ఓ అగ్నివేశుడా వాయ్వాదులన్నింటికినీ ఏ వైగుణ్యము కలుగునో దానియొక్క మూలము అధర్మము. పూర్వజన్మయందు చేయబడిన అసత్కర్మయును దీనికి మూలము కావచ్చును. ఈ రెండింటికినీ ప్రజ్ఞాపరాధము మూలకారణ మగుచున్నది. అది యెట్లనగా - దేశ నగర నిగమ - జనపదములయందలి ప్రధానులు (అధ్యక్షులు) ఎప్పుడైతే ధర్మమును వీడి అధర్మమార్గమున ప్రజలయెడ ప్రవర్తింతురో అపుడు వారి నాశ్రయించియున్న వారు, పురములందు జనపదములందును నివసించువారు మరియు వ్యవహారములను నడిపించుటపై ఆధారపడి జీవించువారును అట్టి అధర్మమును వృద్ధిపరచెదరు. అటుపైన ఆ అధర్మము ధర్మమును మాయముచేయును. అట్లు ధర్మమును వీడిన వారిని దేవతలుకూడ త్యజింతురు. అట్లు ధర్మమును వీడి అధర్మమును ప్రధానముగా అవలంబించునట్టియు దేవతలచే త్యజింపబడినట్టియు వారియెడ ఋతువులు విపత్తును కలిగియుండును. అందువలన వరుణదేవుడు కాలానుసారముగా వర్షింపడు, లేదా అసలు వర్షింపడు. లేదా వికృతముగానైననూ వర్షించును. వాయువులు సరిగా వీచవు భూమి విపత్తును పొందును, జలాశయము లెండిపోవును. ఓషధులు తమ స్వభావమును వీడి వికృతిని పొందును./ అటుపైన స్పర్శద్వారానూ భోజన పదార్థములద్వారానూ దోషములు ఒకరి నుండి మరియొకరికి వ్యాపించుటచేత (ప్రజలు రోగగ్రస్తులై) జనపదములు నశించును//

**ఆయుర్వేద దీపిక :** "కుతోమూలమ్" అనగా మూలమేది అని అర్థము. "తస్యమూలమధర్మః" అని ఐహికమగు (ఇహలోక సంబంధమగు) అధర్మమును చూపుచున్నాడు. "తన్మూలం వా" అనగా ఆ వాతాదుల వైగుణ్యమునకు మూలము పూర్వజన్మ కృతమగు కారణమైననూ కావచ్చునని అర్థము. అందువలన

ఐహికమగు అధర్మముగాని, జన్మాంతరకృతమగు అధర్మముగానీ వాతాదుల వైగుణ్యమునకు కారణమని చెప్పబడుచున్నది. అది దేశము అను మొదలగువానిద్వారా చెప్పబోవుచున్న ఐహికమగు అధర్మముగానీ ఏది కారణముగా చెప్పబడబోవుచున్నదో అది ప్రత్యక్షముగా ప్రస్ఫుటమైన సిద్ధాంతముకొరకేగానీ వేరుజన్మమునందు చేసిన అధర్మము కారణము కాకపోవుట వలన కాదు అని తెలియవలెను. "తయోః" అనగా ఐహికము మరియు జన్మాంతర కృతము అను అధర్మముల రెండింటికీ - అని అర్థము. "యోనిః" అనగా కారణము. "స్పృశ్యాభ్యవహార్యదోషాత్" అనగా స్పర్శ లేదా జలాదులను త్రాగుట (లేక తినుట) వలన వానియందున్న పూర్తి దోషముచేత అని అర్థము. ఇదియునూ ప్రాధాన్యముగా అని తెలిసికొనవలెను. అందువలన దుష్ట వాతముయొక్క గంధమునుకూడా (ఇందుకు కారణముగా) తెలియవలెను. దుష్టవాతము నందు అసాత్మ్యగంధము కూడా (ఉండునని) చెప్పబడినది.

## శస్త్రముల (తో యుద్ధము చేయుట) వలన కలుగు జనపదోద్ధ్వంసమునకునూ అధర్మమే కారణమగుట

21. తథా శస్త్రప్రభవస్యాపి జనపదోద్ధ్వంసస్యాధర్మ ఏవ హేతుర్భవతి. యేఽతిప్రవృద్ధలోభక్రోధమోహమానాస్తే దుర్బలానవమత్యాత్మస్వజనపరోపఘాతాయ శస్త్రేణపరస్పరమభిక్రామన్తి, పరాన్ వాఽభిక్రామన్తి, పరైర్వాఽభిక్రామ్యన్తే.

**తాత్పర్యము :** లోభ క్రోధ మోహములను ఎక్కువగా కలిగియున్నవారు దుర్బలులను అవమానించి తాము, స్వజనులు పరులను హింసించుటకు శస్త్రముతో పరస్పరము యుద్ధము చేయుదురు, లేదా ఇతరులపై దండెత్తుదురు లేదా ఇతరులచే ఆక్రమింపబడుదురు.

**ఆయుర్వేద దీపిక :** శస్త్రముల వలన కలుగు జనపదోద్ధ్వంసమునకును అనగా ఎక్కువమంది నశింపజేయు యుద్ధాదులకును అని అర్థము. ఆత్మ స్వజన పరోపఘాతము అనగా తమను, స్వజనులకును ఇతరులకు కూడా నష్టపరచుదురని అర్థము.

## అధర్మము అపచారజన్య జనపదోద్ధ్వంసములకు కారణమనుట

22. రక్షోగణాదిభిర్వా వివిధైర్భూతసంఘైస్తమధర్మమన్యద్వాప్యపచారాన్తరము. ఉపలభ్యాభిహన్యన్తే.

**తాత్పర్యము :** ఆ అధర్మము చేత లేదా అశౌచము మొదలైన అపచారముల కారణమున జనపదములు రాక్షసులచే, భూత ప్రేతాదులచే నశింపబడుదురు. (పీడింపబడి నశింపబడుదురు).

**ఆయుర్వేద దీపిక :** రాక్షసగణముల చేత - అనుటచేత జనులు చేయు అధర్మ కారణముననే రాక్షసులు విజృంభించి జనపదములను నశింప చేయుదురని భావము. ఇతరములైన అపచారముల వలన అనడం అధర్మమునకు కారణములైన అశౌచాదులను సూచిస్తుంది.

## అభిశాపజన్యజనపదోద్ధ్వంసములకు అధర్మము కారణమనుట

23. తథాఽభిశాపప్రభవస్యాప్యధర్మ ఏవ హేతుర్భవతి. యే లుప్త ధర్మాణో ధర్మాదపేతాస్తే గురువృద్ధసిద్ధర్షిపూజ్యానవమత్యాహితాన్యాచరన్తి: తతస్తాః ప్రజాగుర్వాదిభిరభిశప్తా భస్మతాముపయాన్తి ప్రాగేవానేకపురుషకులవినా-శాయ, నియతప్రత్యయోపలమ్భాదనియతాశ్చాపరే.

**తాత్పర్యము :** ఇంకనూ అభిశాపముల వలన కలుగు జనపదోద్ధ్వంసములకు అధర్మము వలననే కలుగుచుండును. ధర్మము లోపించినవారు, ధర్మహీనులు గురువులను, పెద్దవారిని, సిద్ధులను, ఋషులను, పూజింపదగిన వారిని అవమానించి వారికి యిష్టములేని పనులను చేయుదురు. అప్పుడా ప్రజలు గురువులు మొదలగు వారిచే కులనాశనమగునట్లు శపింపబడి ముందుగనే నశింతురు. ఈ విషయమున దోషులు నశింతురు. దోషము చేయనివారు నశింపరని సిద్ధాంతము.

**ఆయుర్వేద దీపిక :** ముందుగనే అనగా వెంటనే, ఎక్కువమంది పురుషులు లేక సమూహము నశించుటకు శాపము పొంది నశింతురు అని అర్థము. అధర్మము వలన గురువు మొదలైనవారిని అవమానించిన వారు నశింతురు. మిగతా వారు నశింపరనుట సిద్ధాంతము. అనియతాశ్చాపరే అని వారు (గురువులను దూషించుట మొదలు లేనివారు) ప్రతినియతి పురుషాది శాపము వలన అంత అవమానించినవారే నశింతురు. అందరును కాదు అని అర్థము.

## అధర్మము అశుభమునకు కారణమనుట

24. ప్రాగపి చాధర్మాదృతే నాశుభోత్పత్తిరన్యతోఽభావాత్. ఆదికాలే హ్యదితిసుతసమౌజసోఽతివిమలవిపులప్రభావాః, ప్రత్యక్షదేవదేవర్షిధర్మయజ్ఞవిధివిధానాః-శైలసారసంహతస్థిరశరీరాః, ప్రసన్న వర్ణేంద్రియాః పవనసమబలజవపరా-క్రమాశ్చారుస్ఫిచోఽభిరూపప్రమాణాకృతిప్రసాదోపచయవన్తః సత్యార్జవానృశంస్యదానదమనియమతపఉపవాసబ్రహ్మచర్యవ్రతపరా వ్యపగతభయ-రాగద్వేషమోహలోభక్రోధశోకమానరోగనిద్రాతంద్రాశ్రమక్లమాలస్యపరిగ్ర-హాశ్చ పురుషా బభూవురమితాయుషః. తేషాదాముదారసత్త్వగుణకర్మణామ-చింత్యరసవీర్యవిపాకప్రభావగుణసముదితాని ప్రాదుర్బభూవుః. శస్యాని సర్వగుణసముదితత్వాత్ పృథివ్యాదీనాం కృతయుగస్యాదౌ. భ్రశ్యతి తు కృతయుగే కేషాంచిదత్యాదానాత్ సాంపన్నికానాం సత్త్వానాం శరీరగౌరవమా-సీత్, శరీరగౌరవాచ్ఛ్రమః, శ్రమాదాలస్యం, ఆలస్యాత్ సంచయః, సంచ-యాత్ పరిగ్రహః, పరిగ్రహాల్లోభః ప్రాదురాసీత్ కృతే. తతస్త్రేతాయాం లోభాదభిద్రోహః, అభిద్రోహాదనృతవచనమ్, అనృతవచనాత్ కామక్రోధ-మానద్వేషపారుష్యాభిఘాతభయతాపశోకచింతోద్వేగాదయః ప్రవృత్తాః. తత-స్త్రేతాయం ధర్మపాదోఽన్తర్ధానమగమత్. తస్యాన్తర్ధానాత్ యుగవర్షప్రమా-ణస్యపాదహ్రాసః పృథివ్యాదేశ్చ గుణపాదప్రమాణశోఽభూత్. తత్ప్ర-మాణశకృతశ్చ శస్యానాం స్నేహవైమల్యరసవీర్యవిపాకప్రభావగుణపాద-భ్రంశః. తతస్తాని ప్రజాశరీరాణి హీయమానగుణపాదైరాహారవిహారైరయథా-పూర్వము పష్టభ్యమానాగ్నిమారుతషరాని ప్రాగ్వ్యాధిభిర్జ్వరాదిభిరాక్రాన్తాని. అతః ప్రాణినో హ్రాసమవాపురాయుషః క్రమశ ఇతి.

**తాత్పర్యము :** మొదటకూడా అధర్మమువలననే అశుభములు కలుగుచుండెడివి. ఆదికాలమునందు మానవులు సూర్యునివంటి ఓజస్సు, అత్యంత నిర్మలమైన ప్రభావముకలిగి దేవతలు, దేవఋషులు - ధర్మము, యజ్ఞము వీటియందు వేదోక్తముగా ప్రవర్తించు పర్వతములవలె దృఢ సంఘటిత శరీరము గల్గి ప్రసన్నమైన వర్ణము, ఇంద్రియములు, (చూడచక్కని రంగు, తీర్చిన కనుముక్కుతీరు) కలిగి, వాయు సమానమైన బలము, వేగము, పరాక్రమము, చక్కని పిరుదులతో, రూపము, ఎత్తునకు తగిన శరీర ప్రమాణము కలిగి, సత్యమార్గముననే ధనార్జన చేయుచూ, ఋజుమార్గము కల్గి దాన - దమ - నియమ - తపస్సు, ఉపవాసము,

బ్రహ్మచర్యము నవలంబించుచూ భయము, రాగము, ద్వేషము - మోహము - లోభము - క్రోధము - శోకము - అభిమానము - రోగము - నిద్రా - తంద్ర - శ్రమ- క్లమ - అలసత్వము - మమకారములు లేక అమితమైన ఆయుష్షును కలిగియుండెడి వారు. వారియొక్క ఉదారమైన బుద్ధివలన భూములు, సర్వసుగుణములు కలిగి యుండుటవలన పంటలు, వృక్షాదులు చాలా మంచి రస, గుణ, వీర్య, విపాక ప్రభావ ములను కలిగియుండెడివి. ఇది కృతయుగమున మొదటి కాలపుమాట. కృతయుగము కొంత గడచిన తరువాత కొందరికి అతి సంపాదన వలన సంపదలు పెరిగి శరీరమున గురుత్వము కలిగినది. శరీర గురుత్వము వలన శ్రమ, శ్రమ వలన అలసత్వము (ప్రాతిపదిక), దానివలన సంచయము (శరీర, ధనవృద్ధి), సంచయమువలన మమ కారము, మమకారము వలన లోభము కలిగినవి. కృతయుగాంతము వరకిట్లు జరిగినది. దానివలన త్రేతాయుగమునందు లోభముచే అభిద్రోహము (ఒకరి కొకరు ద్రోహము తలపెట్టుట), అభిద్రోహము వలన అసత్యములాడుటచే కామ - క్రోధ - అభిమాన - ద్వేష - పారుష్య (మనసునకు కష్టము కలిగించు పనులు) - అభిఘాత (కొట్లాటలు)- భయ - తాప - శోక - చింత - ఉద్వేగ (మానసిక వేదన) లు మనుష్యుల యందు చోటు చేసుకున్నవి. అందుచేత త్రేతాయుగమున ధర్మమునందు నాల్గవవంతు క్షీణించి నది. తదనుసారముగా ఆయుష్షునందుకూడా నాల్గవవంతు క్షీణించినది. అది క్షీణించుట వలన పృథివ్యాదులయందును గుణములు నాల్గవవంతు నశించినవి. ఇదే నిష్పత్తి యందు పంటలయొక్క స్నిగ్ధత్వము, నిర్మలత్వము, రస - వీర్య - విపాక - ప్రభావ గుణములు నశించినవి. దీనివలన పాదాంశము (నాల్గవ వంతు) క్షీణించిన గుణములు కల ఆహార విహారములను సేవించుట వలన మనుష్యులు పూర్వము ధాతు సామ్యము వలన నియమ ప్రకారముగా అగ్ని వాయువుల చేతను, జ్వరాది వ్యాధులచేతను మొదట పీడింపబడిన శరీరము కలవారైరి. అపుడు క్రమముగా ప్రాణులయొక్క ఆయువు క్షీణించుట ప్రారంభమైనది.

ఆయుర్వేద దీపిక : మొదట కూడా ఈ మొదలైన వాక్యముల వలన మొదటపుట్టిన రోగములకుకూడా అధర్మమే కారణమని చెప్పబడినది. యజ్ఞము, యజ్ఞదేవత, విధి యనగా యజ్ఞ విధిని చెప్పు శాస్త్రము. విధానము యజ్ఞకర్మ. జవ మనగా వేగము. పరిగ్రహము - మమకారము. అమితాయుష్కులు అనగా లెక్క లేనంత ఆయుష్షు ఎవరికి వుండునో వారు. సత్యయుగమున ఆయుష్షు నాలుగువందల సంవత్సరములు. వ్యాస భగవానుడు చెప్పినట్లు కృతయుగమునందు సర్వకార్యసిద్ధివి

పొందగోరిన పురుషులు (మనుష్యులు) నాలుగువందల ఏండ్లు ఆయుష్షు కలిగి యుండిరి. సంపన్నులు - ఐశ్వర్యవంతులు. కృతే అనగా మిగిలిన కృతయుగము నందు అని గ్రహించవలెను. గుణమునందు నాల్గవవంతు క్షీణించు చున్నటువంటి అనగా - త్రేతాయుగము క్రమముగా క్షయముపొందుచున్నపుడు ఆహార విహారముల గుణము లందును అదేక్రమమున నాల్గవవంతు క్షయము జరుగునని సూచించబడినది. అధర్మలకు విహారముకూడా గుణము లోపించియుండును. దాని వలన శరీరము యొక్క పెరుగుదల జరుగదు. ఉపష్టభ్యమానాని అనగా ధాతువుల సమముగానుండుట వలన వృద్ధిపొందుచున్న యని అర్థము.

## ప్రాణులకు ఆయువు క్షీణించుటకు ధర్మక్షీణమే కారణమనుట

భవతిశ్చాత్ర

25. యుగే యుగే ధర్మపాదః క్రమేణానేన హీయతే,
గుణపాదశ్చ భూతానామేవం లోకః ప్రలీయతే.

26. సంవత్సరశతే పూర్ణే యాతి సంవత్సరః క్షయమ్,
దేహినామాయుషః కాలే యత్ర యన్మానమిష్యతే.

27. ఇతి వికారాణాం ప్రాగుత్పత్తిహేతురుక్తో భవతి.

**తాత్పర్యము :** ఒక్కొక్క యుగమునందును ధర్మము క్రమముగా ఒక్కొక్క పాదము (నాల్గవవంతు) క్షీణించును. ఇదే విధముగా పంచభూతముల యొక్క ఈ గుణములు (ప్రాణులయందలి గుణములు) క్రమముగా క్షీణించుటచేత చివరకు లోకమునందు ప్రళయము సంభవించును. ఒక్కొక్క యుగమునందు ప్రాణులకు చెప్పబడిన ఆయుఃప్రమాణమునందు, ఆ యుగపు నూరవవంతు గడచు నప్పటికి ఒక సంవత్సరము తగ్గిపోవును. ఈ విధముగా వ్యాధులయొక్క మొట్ట మొదటి పుట్టుకకు కారణము చెప్పబడియున్నది.

**ఆయుర్వేద దీపిక :** నూరు సంవత్సరములు పూర్తియగుసరికి అనగా యుగమునందలి నూరవ అంశము పూర్తియగు వరకు అని యర్థము. ఎక్కడ ఏ ప్రమాణము వుండునో అనగా ఆయుగమునందు చెప్పబడిన ఆయుఃప్రమాణము అని

అర్థము. ఆ యుగమునందు నూరవ అంశము సంపూర్ణమగునప్పటికి ఒక సంవత్సరము ఆయువు క్షీణించును. అందువలన కలియుగమునందున్న ఆయుః ప్రమాణము వంద సంవత్సరములకు ఒక సంవత్సరము తగ్గినచో తొంబది తొమ్మిది సంవత్సరములు పూర్ణాయుష్షుగా పరిగణించవలెను.

## ఆయుఃప్రమాణము నియతమా? కాదా? అని అగ్నివేశుని ప్రశ్న

28. ఏవం వాదినం భగవంతమగ్నివేశ ఉవాచ—కిన్ను ఖలు భగవన్ ! నియతకాలప్రమాణమాయుః సర్వం న వేతి.

తాత్పర్యము : ఈ విధముగా చెప్పుచున్న ఆత్రేయ భగవానుని అగ్నివేశుడిట్లు ప్రశ్నించెను. ఓ భగవానుడా! అన్ని ప్రాణులకును ఆయుష్షు నియతకాల ప్రమాణానుసారము ఉండునా ? ఉండదా ?

## ఆత్రేయుని సమాధానము

తం భగవానువాచ—

29. ఇహాగ్నివేశ ! భూతానామాయుర్యుక్తిమపేక్షతే,
దైవే పురుషకారే చ స్థితం హ్యస్య బలాబలమ్.

30. దైవమాత్మకృతం విద్యాత్ కర్మ యత్ పౌర్వదైహికమ్,
స్మృతః పురుషకారస్తు క్రియతే యదిహాపరమ్.

31. బలాబలవిశేషోఽస్తి తయోరపి చ కర్మణోః, దృష్టం హి త్రివిధం కర్మ హీనం మధ్యమముత్తమమ్.

తాత్పర్యము : ఆయనతో ఆత్రేయ భగవానుడిట్లనెను. ఓ అగ్నివేశా! ఈ లోకమునందు ప్రాణులయొక్క ఆయుః ప్రమాణము దైవము, పురుష ప్రయత్నముల యొక్క యోగము (యుక్తి) ననుసరించి యుండును. వీనియొక్క బలాబలములపై ఆధారపడి యుండును. దైవమనగా పూర్వజన్మమునందు చేసిన కర్మయని తెలుసుకొనవలెను. పురుషకారము అనగా ఈ జన్మలో చేసిన పని. ఈ రెండు కర్మలకును బలాబల విశేషము గలదు. కర్మము హీనము, మధ్యమము, ఉత్తమము అని మూడు విధములుగా చెప్పనగును.

**ఆయుర్వేద దీపిక :** యుక్తి ననుసరించి యుండును అనగా నియతత్వ, అనియతత్వములు (ఆయుపు సంపూర్ణముగా నుండుట, సంపూర్ణముగా నుండక పోవుట అనునవి). దైవము పురుష ప్రయత్నముల యోగము ననుసరించి యుండు నని అర్థము. బలాబలములు అనగా బలము మరియు బలహీనత. ఆయుష్షు నియత ముగా (సంపూర్ణముగా) నుండుట బలము, అనియతముగా నుండుట బలహీనతయని తెలియనగును. పూర్వజన్మయందు చేసినకర్మ కనపడనప్పటికినీ దానివలన కలిగిన ఫలితము తెలియుచున్నందు వలన ఆ కర్మ (పూర్వజన్మకర్మ) ఈ జన్మయందును కారణమగుచునే యున్నది. పురుషకారమనగా ఈ జన్మయందు చేసినకర్మయని సామాన్యముగా చెప్పబడుతుంది. అదృష్టముగా వచ్చిన ఫలితములందు బలి, మంగళ పూజ మొదలైనవి ఉపయోగపడును. రసరక్తాది ధాతువుల వికృతియందు ఔషధ ప్రయోగము జరుగును.

## ఆయువు నియతానియతముగా నుండుటకు కారణము

32. తయోర్యుదారయోర్యుక్తిర్దీర్ఘస్య చ సుఖస్య చ, నియతస్యాయుషో హేతుర్విపరీతస్య చేతరా

33. మధ్యమా మధ్యమస్యేష్టా కారణం శృణు చాపరం, దైవం పురుషకారేణ దుర్బలం హ్యుపహన్యతే.

34. దైవేన చేతరత్కర్మ విశిష్టేనోపహన్యతే, దృష్ట్వా యదేకే మన్యన్తే నియతు మానమాయుషః

35. కర్మ కించిత్ క్వచిత్ కాలే విపాకే నియతం మహత్ కించిత్త్వకాలనియతం ప్రత్యయైః ప్రతిబోధ్యతే.

**తాత్పర్యము :** ఈ రెండింటి యొక్క శ్రేష్ఠమైన యోగము దీర్ఘాయువు నకు, సుఖాయువునకునూ కారణమై నియతపూర్వకముగా నుండును. తద్విపరీత మైనది అనియతమగును. మధ్యమ (కర్మ) మధ్యమ ఫలము (మధ్యమమైన ఆయువు) నకు కారణమగును. ఆయువుయొక్క నియతత్వ అనియతత్వమునకు ఇంకను కార ణములను చెప్పెదను వినుము. బలవంతమైన పురుష ప్రయత్నము దైవమును బల హీన పరచును. దీనివలన మనుజులు ఆయువుయొక్క ప్రమాణము నియతమని తలచెదరు. కొన్ని కర్మలయొక్క పరిపాక కాలము నిశ్చితముగా నుండును. కొన్నిం టికి అనిశ్చితముగా నుండును. కారణములచేత కర్మలు పరిపాకమునకు దారితీయును.

ఆయుర్వేద దీపిక : ఉదారయోః అనగా ప్రశస్తి చేత గొప్పవి. దీర్ఘమైన అనగా రసాయనాదుల ప్రయోగము వలన నూరు సంవత్సరముల కంటెను అధికమైన సుఖవంతమైన అనగా రోగములు లేకున్న, నియతపూర్వకమైన అనగా యుగానుసారముగా ప్రమాణము ననుసరించియున్న ఆయుష్షు. కలియుగమునందు నూరు సంవత్సరముల ఆయుఃప్రమాణ ముండుట. నూరు సంవత్సరముల కంటె తక్కువగా నుండుట నియతమైనప్పటికీ అదియును నియత శబ్దముచేత గ్రహింపనగును. అందువలన విధి - పురుష ప్రయత్నముల ఫలము తగ్గదు. అయినప్పటికీ తక్కువ ప్రభావముగల విధి - పురుష ప్రయత్నముల వలననే ఆయుః ప్రమాణము యొక్క నియతత్వము నిర్ణయింపబడుట వలన అవియే కారణముగా చెప్పబడుచున్నది.//ఆయువు అనియతముగా నున్నవారికి రసాయనాది ప్రయోగముల అవసరము కలుగుచున్నది. నియతమైన ఆయువు కలిగినవారికి రసాయనముల యొక్క ఉపయోగమే లేదు. అనియతమైన ఆయువునందు రసాయనాది ప్రయోగము గొప్పదనుట వలన ఇదియును విధి - పురుష ప్రయత్నములకు చెందినదే అనియనుట యుక్తమే. లేదా రసాయనాదుల వలన దీర్ఘాయువు కలుగుచుండుటచే అదియును నియత ఆయువునకు కారణమని సిద్ధాంతీకరించవచ్చును.// అందువలన (కలి) యుగానుసారము ఆయుష్షు నూరు సంవత్సరములు. దానికంటె ఎక్కువ ఆయుష్షు కలిగియుండుట గొప్ప కర్మను చేయుటవలననే కలుగును. ఆ గొప్ప కర్మ వ్యాధులను తగ్గించుటకు పురుష ప్రయత్నముగా చేయబడుచున్నది. ముసలితనమును పోగొట్టుటకు కూడా రసాయన ప్రయోగాదులు జరుగుచున్నది. తద్విపరీతమైన అనియత ఆయువు దుఃఖము వలననూ వ్యాధుల వలననూ కలుగుచున్నవి. ఇతరములు అనగా హీనములైన విధి - పురుష ప్రయత్నములని అర్థము. మధ్యమమైన విధి - పురుష ప్రయత్నములు మధ్యమ ఆయువుగను దీర్ఘాయువు - అదీర్ఘాయువులు అనియత ఆయువులుగను పరిగణించబడినవి. మరియు సుఖ దుఃఖముల వలన ఆయువు యొక్క అనియతత్వము మధ్యమమైన విధి - పురుష ప్రయత్నముల సంయోగము అని అర్థము. కారణమనగా విధి - పురుష ప్రయత్నములు ఒకదానినొకటి బాధించుట వలన అనియతత్వమునకు కారణమగుట సూచింపబడినది. విధి ననుసరించు దుర్బలమైన ఆయుష్షు బలవంతమైన అపథ్య భోజనము మొదలైన హానికర క్రియలచే యింకనూ నష్టమగుచున్నవి. విశిష్టేన అనగా బలవంతమైన కార్యము పురుష ప్రయత్నము అని పిలువబడుచున్నది. ఉపహన్యతే అనగా ఓడింపబడుచున్నది.

విధి వలన పురుష ప్రయత్నము బలహీన పరచబడడం వలన ఆయువు విధియుతము గనే కొందరు చెప్పుచున్నారు. ఒకవేళ పురుష ప్రయత్నమే ఆయువునకు కారణమైనచో మంచి ఔషధముల ప్రయోగము వలన మరణమును నిరోధించవచ్చును. అందువలననే మంచి చికిత్స చేసిననూ కర్మవశాత్తు మరణము సంభవించవచ్చును. చికిత్స వలన జీవనము (మృత్యువును నిరోధించుట) కలుగునని తలంచినప్పటికీ కర్మయే జీవనమునకు (బ్రతికియుండుటకు) కారణమగుట వలన పై చెప్పిన ఆయువు విధి నియతమను లోకోక్తి వినవచ్చుచున్నదని భావము. కర్మకించిత్.... అను వాక్యము వలన విధి పురుష ప్రయత్నములు రెండునూ ఒకదాని కొకటి బాధించుట వలన ఒక విధముగా ఆయువు యొక్క నియతత్వము నిరాకరింపబడినది. కర్మను నిరాకరించుట సాధ్యముగాదు. అందువలననే "వందకోట్ల కల్పములైనను కర్మము క్షీణింపదు. దాని యొక్క ఫలితమును మంచిదైననూ, చెడుదైననూ అనుభవించియే తీరవలెను" అని చెప్పబడినది. కించిత్త్వ కాల నియతం.... అనగా ఉదాహరణకు ఈ మృత్యుకారకమైన కర్మ కొంచెము కాలము - ఇరువది అయిదు సంవత్సరములకు తక్కువకానిది. అందువలన ఏ కాలమునందు కర్మకు అనుగుణమైన పురుష ప్రయత్నము జరుగునో ఆ విధి - పురుష ప్రయత్నముల పరస్పర సహకారము వలన విధి (కర్మ) బలీయమై మృత్యువు సంభవించును. ఎప్పుడైతే పురుష ప్రయత్నము కర్మకు వ్యతిరేకముగా (అపథ్యసేవన మొదలైనవి జరుగకుండుట) ఉండునో అట్టితరి మృత్యువు సంభవింపదు. కారణములచేత తెలియనగును అనగా మనకు కనిపించు కారణముల (పురుష ప్రయత్నము) వలన విధియొక్క బలము పెరుగునని భావము. ఎవరైతే ఒకానొక కర్మ కాలానుగుణముగా పరిపక్వము చెందునో ఆ కాలముననే పాకమునొందుట కాల నియమము. విపాక నియమము అనునది ఫలానా కర్మ పరిపాకము నొందినదే పరిపాకము నొందుచున్నదని కాదు. కాల విపాక నియతము అనగా ఫలానాకర్మ ఫలానా కాలమునందు పరిపాకము నొందుట. ఇట్టి స్థితి కాలము- కర్మ విపాకముల నియతత్వముచేత బలవత్తరమైనదని చెప్పబడుచున్నవి. ఇది పురుష ప్రయత్నముచేత బాధింపబడదు" అని ఎవరు చెప్పుదురో వారి మతానుసారము — అనుభవింపక పోయిననూ బలహీనమైన కర్మఫలమును ప్రాయశ్చిత్తాదుల ద్వారా క్షీణింపచేయవచ్చును. కానీ యిక్కడ వ్యతిరేకమైనప్పటికీ ఒకానొక కర్మ కాలనియతము కాదు అను వచనముచేత కర్మ యొక్క కాల నియతత్త్వము కూడా పరపక్షమున సూచింపబడుచున్నది.

36. తస్మాదుభయదృష్టత్వాదేకాన్తగ్రహణమసాధు. నిదర్శనమపి చాత్రోదాహరిష్యామః-యది హి నియతకాలప్రమాణమాయుః సర్వం స్యాత్ తదాఽఽయుష్కామాణాం న మన్త్రౌషధిమణిమంగలబల్యుపహారహోమనియమప్రాయశ్చిత్తోపవాసస్వస్త్యయనప్రణిపాతగమనద్యాః క్రియా యిష్టయశ్చ ప్రయోక్ష్యేరన్; నోద్భ్రాంతచండచపలగోగజోష్ట్రఖరతురగమహిషాదయః పవనాదయశ్చ దుష్టాః పరిహార్యాస్స్యుః నప్రపాతగిరివిషమదుర్గాంబువేగాః తథా న ప్రమత్తోన్మత్తోద్భ్రాంతచణ్డచపలమోహలోభాకులమతయః నారయః న ప్రవృద్ధోఽగ్నిః చ వివిధవిషాశ్రయాః సరీసృపోరగాదయః న సాహసం నాదేశకాలచర్యా, న నరేంద్రప్రకోప ఇతి, ఏవమాదయో హి భావా నాభావకరాః స్యుః ఆయుషః సర్వస్యనియతకాలప్రమాణత్వాత్. న చానభ్యస్తాకాలమరణభయనివారకాణామకాలమరణభయమాగచ్ఛేత్ ప్రాణినాం,వ్యర్థాశ్చారంభకథాప్రయోగబుద్ధయః స్యుర్మహర్షీణాం రసాయనాధికారే, నాపీన్ద్రో నియతాయుషం శత్రుం వజ్రేణాభిహన్యాత్, నాశ్వినావార్తం భేషజేనోపపాదయేతాం, న మహర్షయో యథేష్టమాయుస్తపసా ప్రాప్నుయుః, న చ విదితవేదితవ్యా మహర్షయః స సురేశాః సమ్యక్ పశ్యేయురుపదిశేయురాచరేయుర్వా. అపి చ సర్వచక్షుషామేతత్ పరం యదైన్ద్రం చక్షుః ఇదం నాప్యస్మాకం తేన ప్రత్యక్షం; యథాపురుషసహస్రాణాముత్థాయోత్థాయావహం కుర్వతామకుర్వతాం చాతుల్యాయుష్ట్వం, తథా జాతమాత్రాణామప్రతీకారాత్ ప్రతీకారశ్చ అవిషవిషప్రాశినాం చాప్యతుల్యాయుష్ట్వమేవ, న చ తుల్యో యోగక్షేమ ఉదపానఘటానాం చిత్రఘటానాం చోత్సీదతాం; తస్మాద్ధితోపచారమూలమ్ జీవితమ్, అతోవిపర్యయాన్మృత్యుః, అపి చ దేశకాలాత్మాగుణవిపరీతానాం కర్మణామాహారవిహారాణాం చ క్రమోపయోగః సమ్యక్ త్యాగః సర్వస్య చాతియోగాయోగమిథ్యాయోగానాం సర్వాతియోగసంధారణమ్, అసంధారణముదీర్ణానాం చ గతిమతాం సాహసానాం చ వర్జనమ్, ఆరోగ్యానువృత్తౌ హేతుముపలభామహే సమ్యగుపదిశామః సమ్యక్పశ్యామశ్చేతి.

**తాత్పర్యము :** కాబట్టి రెండు విధములు గానూ అవకాశముండుట వలన ఒకే పద్ధతిని అంగీకరించడము సరికాదు. దానికి నిదర్శనములను కూడా ఇక్కడ ఉదహరించుకొందము. ఒకవేళ ప్రాణుల ఆయువు యొక్క కాల ప్రమాణము

ముందుగనే నిర్ణయింపబడినట్లయితే (నియతమైనదైతే) ఆయువును పెంచుకొనుటకు మనుష్యులు మంత్రములు, ఔషధములు, మణిధారణము, మంగళపూజలు, బలి సమర్పణము, హోమము, కొన్ని నియమము (వ్రతము)ల నాచరించుట, ప్రాయశ్చిత్తము, ఉపవాసము, స్వస్తి, గురువు మొదలగువారి పాదసేవ, తీర్థయాత్రలు, యజ్ఞయాగాదులను చేయరు. ఆవులు, ఏనుగులు, ఒంటెలు, గాడిదలు, గుఱ్ఱములు, మతిచెడి భయంకరమైన వేగము కలిగి యుండవు. వాయువు మొదలైనవి చెడు గుణములను పొందవు. పర్వతములు విరిగిపడవు. జలాశయములు అతివేగముగా ప్రవహింపవు. మరియు ప్రమత్తులై మతిచెడి, భ్రాంతి కలిగి, దురుసుతనముతోకూడి చపలత్వము కలిగి మోహలోభములచే నిండిన మనస్సు కల మనుష్యుల నుండి దూరముగా నుండవలసిన అవసరము లేదు. అగ్నిప్రకోపము, విషములను పొంది యున్న సరీసృపములు పెద్ద పాములనుండి రక్షించుకొనవలసియుండదు. సాహసము వుండదు. దేశ కాలములకు విపరీతమైన కర్మ వలన ఇబ్బందులుండవు. రాజులు కోపించరు. ఈ మొదలైన అంశములు అన్నియు నిరర్థకములైనవే. ఆయువు కాలానుసారము నియతమగుట వలన వీటియొక్క ప్రభావము లేదని అర్థము. అకాల మరణ భయమును నివారించుటకు చేయు క్రియలను చేయనివారికి అకాల మరణ భయము వుండదు. మహర్షులచే రసాయనాధికరణమునందు చెప్పబడిన ఆయుర్వృద్ధికర యోగములు, కథాప్రసంగములు, రసాయనాది ప్రయోగములు వ్యర్థములు అగును. ఇంద్రుడు తన వజ్రాయుధముతో నియతమైన ఆయుష్షు కలవారిని సంహరింపలేడు. అశ్వనీ దేవతలు రోగులకు ఔషధముల నివ్వరు. మహర్షులు తపస్సుచేత ఇచ్ఛానుసారము ఆయుష్షును పెంపొందించుకొనలేరు. మహర్షులు, రాజులును ఆరోగ్య శాస్త్రముల గురించి, ఔషధములను గూర్చియు తెలిసికొనరు. ఉపదేశింపరు. అనుసరింపరు కూడా. మరియు అన్ని చక్షువుల కంటెను ఇంద్ర చక్షువు (దివ్యజ్ఞానము) గొప్పది. దానివలన మనకు యుద్ధము చేయువారికి, చేయనివారికి, ఆయువునందు వ్యత్యాసము తెలియును. అదే విధముగా చికిత్స చేసిన రోగులకు చేయని రోగులకు, విషము లేని ఆహారము సేవించువారికి, విషయుక్త ఆహారమును సేవించువారికిని ఆయువునందు గల వ్యత్యాసము తెలియవచ్చుచున్నది. జలమునుత్రాగుటకు వాడు కుండయును చిత్రమునందు గీయబడిన కుండకును యోగ క్షేమములు ఒక మాదిరిగా యుండునట్లు పై విషయములందుకూడా ఆయువుయొక్క నియతత్వమును గ్రహించవలెను. అందుచేత హితోపచారములను సేవించుట, జీవితమును (ఆయుర్వృద్ధిని) తద్విపరీతమైన ప్రవర్తన మృత్యువునకు కారణములగుచున్నవి. అంతేగాక దేశము,

కాలము, ఋతు గుణములకు వ్యతిరేకమైన కర్మలు ఆహార విహారముల సరియైన ఉపయోగము అతియోగ అయోగ మిథ్యాయోగముల వివర్జనము, అన్ని వేగములను అతిగా ప్రవర్తింప చేయకుండుట, ఉద్యుక్త వేగములను ప్రవర్తింపచేయుట, సాహసముల వర్జనము - ఈ క్రియలు అనారోగ్యమును కల్గించుటకు కారణములుగా మనము తెలుసుకొని, ఉపదేశించి చూచుచున్నాము.

ఆయుర్వేద దీపిక : తస్మాత్....అనుట ద్వారా సమాధానమును ఉపసంహరించుచున్నాడు. రెండును చూడబడుటచేత అనగా విధియనునది పురుష ప్రయత్నము. విధిచేతను బాధింపబడుట యనునది చూడబడుటచేత, ఒకే సిద్ధాంతమును అంగీకరించుట అనగా ఆయువు నియతము మరియు ఆయువు అనియతము. ఈ రెంటిలో ఒకే వాక్యమును అంగీకరించుట. రెంటినీ అంగీకరించవలెనని భావము. అభిప్రాయమును ఉదాహరణ ద్వారా చూపించుట నిదర్శనమనబడును. ఇది యుక్తి. ఇచ్చట అనగా అనైకాంతిక పక్షమునందు (ఆయువుయొక్క నియతత్వానియతత్వములను రెండింటినీ అంగీకరించుట యందు). యది .... ఈ వాక్యము వలన జనులందరూ అంగీకరించిన ఆయుర్వృద్ధికి కారణములైన వాటినిఉపయోగించుట ఆయువు నశించుటకు కారణములైనవాటియొక్క వర్జనమునుగూర్చి సూచించబడినది. ఈ విధమైన సేవనము ఒకవేళ ఆయువు నియతమైనదైతే వృథాయగును. అనియతమైనపుడు ఉపయోగకరమగును. కావున ఆయువు అనియతమనికూడా చెప్పనగునని భావము. ఎల్లెడలా అదృష్టము (విధి) యే కారణముగాదు. దృష్టము భౌతికమైనది ఏమీ చేయలేదని చెప్పుటవలన దృష్టమైన (చూడబడుచున్న) దైనప్పటికినీ త్రివృత్ (తెగడ యను ద్రవ్యము) విరేచనమును కల్గించుట వ్యక్తమే. అదృష్టము దృష్టము ద్వారా కార్యము నెరవేర్చునని తెలుసుకొనవలెను. దానివలన కన్పడుచున్న కారణము నందే కన్పడని (అదృష్టము యొక్క) కారణత్వము కలదని తెలియవలెను. అంతేగాని దృష్ట కారణమును ఛేదించుటకు సంకల్పమునకూడా సాధ్యము కాదు. ఇష్టయః అనగా యజ్ఞములు. అత్యధిక వేగముగా పాకెడి పాములను సరీసృపోరగములు అందురు. ఆచరింపరు అనుచోట ఔషధమును అని అన్వయించు కొనవలెను. అన్ని చక్షువులకును గొప్పదైన అనుట దాని యొక్క అభ్రాంతతత్వము (స్థిరమైన గుణము)ను సూచించుచున్నది. సమానమైన ఆయుఃప్రమాణము లేనివారు - అనగా యుద్ధము చేసెడివారు శస్త్రముల వలన మరణింతురు. యుద్ధము చేయనివారు సాధారణముగా శస్త్రముల వలన మరణము పొందరు. ఇక్కడ ప్రతి

క్రియ అప్రతి క్రియలవలన నీరి ఆయువు ఒకే మాదిరిగా యుండదని సిద్ధాంతము. నీరు త్రాగుటకు వాడు కుండ చిత్రము నందలి కుండయును సమానము కాదనుటచేత- చిత్రమునందు గీయబడిన కుండ చిత్రించినట్లుగనే యుండును. అది నీటిని తెచ్చుట, త్రాగుట మొదలగు నశింపజేయు కారణములైన పనులకు ఉపయోగింపకుండుటచేత నశింపకుండ అట్లేయుండును. కానీ నీటికి వాడు కుండ నీటితో నింపుట, నీటిని తెచ్చునపుడు,క్రిందపడుట మొదలైన పనులకు ఉపయోగించుటచేత త్వరగా నశించును. హితోపచారములవలన జీవనము (ఆయుర్వృద్ధి) అనుటవలన హితోపచారము వలన కూడా ఆయుర్వృద్ధి కలుగునని భావము. క్రమోపయోగము అనగా సరియైన ఉప యోగము. ఇదియే సరియైన పద్ధతి అని సిద్ధాంతము. అన్ని వేగములను అతిగా ప్రవర్తింపకుండ జేయుట అనగా అన్ని అతియోగములను వర్జించుట.

## కాలమృత్యువు-అకాల మృత్యువు ఎట్లు సంభవించునని అగ్నివేశుని ప్రశ్న

37. అతః పరమగ్నివేశ ఉవాచ - ఏవం సత్యనియతకాల ప్రమాణాయుషాం భగవన్! కథం కాల మృత్యు రకాల మృత్యుర్వా భవతీతి.

**తాత్పర్యము :** అటుపైన అగ్నివేశ డిట్లనెను. ఓ భగవానుడా! ఆయుష్షునకు కాల ప్రమాణము నియతము కాకపోయినపుడు కాలమృత్యువు, అకాలమృత్యువు ఎట్లు సంభవించును?

**ఆయుర్వేద దీపిక :** ఆయువు కాల నియమానుసారముగా వున్నవారికి అకాలమందు మరణము సంభవింపకుండుటవలన అకాల మృత్యువులేదు. ఆయువు కాల నియమానుసారము గానపుడు అనియతత్త్వము వలన కాల మృత్యువుగానీ అకాల మృత్యువుగానీ ఎట్లు సంభవించును? అనియతమైన ఆయుః ప్రమాణమునందు కాల నియమము వుండదు. నియతకాలమునకు ముందుగా మరణము సంభవించిన అది అకాల మృత్యువగునా యని సందేహమును వెలిబుచ్చుచున్నాడు.

## ఆత్రేయుని సమాధానము

38. తమువాచ భగవానాత్రేయః — శ్రూయతామగ్నివేశ యదా యాన సమాయుక్తోఽక్షః ప్రకృత్యైవాక్షగుణైరుపేతః స చ సర్వగుణ సంపన్నో

వాహ్యమానో యథాకాలం స్వప్రమాణ క్షయా దేవావసానం గచ్ఛేత్, తథా ఒఒయుః శరీరోపగతం బలవత్ప్రకృత్యా యథావదుపచర్యమాణం స్వప్రమాణ క్షయా దేవావసానం గచ్ఛతి: స మృత్యుః కాలే. యథా చ ఏవాక్షో ఒతి భారాధిష్ఠితత్వాద్విషమపథాదపథాదక్షచక్రభంగాద్వాహ్యవాహకదోషాదణి-మోక్షాదనుపాంగాత్ పర్యసానా చ్చాంతరాఒవసాన మాపద్యతే,

తథా ఒఒయురప్య యథా బలమారంభాదయథాగ్న్యభ్యవహరణాద్విషమాభ్యవహరణా ద్విషమశరీర న్యాసాదతి మైథునాదత్సం శ్రయాదుదీర్ణ వేగ వినిగ్రహాద్విధార్య వేగ.విధారణాభూతవిషవాయ్యగ్నుపతాపారభిఘాతా దాహార ప్రతీకార వివర్జనాచ్చాంతరాఒవసాన మాపద్యతే, స మృత్యురకాలే: తథా జ్వరాదీనాప్యాతం కాన్మిథ్యోపచరితానకాలమృత్యూన్ పశ్యామ ఇతి.

**తాత్పర్యము :** ఆత్రేయ భగవానుడిట్లు సమాధానమిచ్చెను. ఓ అగ్నివేశుడా! వినుము. బండియొక్క అక్షము (ఇరుసు) అన్ని మంచి గుణములతో కూడి యున్ననూ, (బలమైనది, గట్టి లోహముతో చేసినది యైననూ) బండిని ఉపయోగించుట వలన కాలక్రమమున అరిగిపోయి నశించును, ఇదే విధముగా శరీరమునందలి ప్రాకృతికమైన బలము చేత ఆయుష్షు విధి యుక్తమైన ఆహార విహారాదుల సేవనము కలిగియున్నను సహజముగనే కొంతకాలమునకు స్వప్రమాణ సహజ బలము ననుసరించి ఉండవలసిన ఆయుః కాల ప్రమాణ క్షయము చేత అంతమగును. ఇట్టి అవసానము కాల మృత్యువు అనబడును. ఇంకనూ బండి యిరుసు బండిపైన అధికమైన బరువును వేయుట, ఎగుడు దిగుడు త్రోవల గుండా పోవుట, ఎప్పుడూ మార్గములేని చోట్ల నడుపుట, ఇరుసుకున్న చక్రము విరిగి పోవుట, బండి నడుపువాడు, బండిని లాగు ఎద్దులు మొదలైనవి సరిగా లేకుండుట, ఇరుసుకున్న చీల ఊడిపోవుట, కందెన వేయకపోవుట, పడిపోవుట మొదలగువాటి వలన నశించును. ఇదే విధముగా బలమును మించిన పనులు చేయుట, అగ్నిని గమనించకుండా ఆహారమును సేవించుట, విషమముగా (అకాలముగా మోతాదును మించి లేదా బాగా తగ్గించి) ఆహారమును సేవించుట, విషమమైన శరీర వ్యాయామము లేదా శారీరక శ్రమ చేయుట, ఎక్కువగా సంభోగించుట, చెడు సహవాసము, వెడలించవలసిన వేగములను నిరోధించుట, నిరోధించవలసిన వేగములను వెడలించుట, భూత-విష-వాయు-అగ్ని వీటిచేత బాధింపబడుట, దెబ్బలు తగులుట, ఆహారమునకు (ఆహార

జనిత వ్యాధులకు) చికిత్స చేయకుండుట మొదలైన కారణముల వలన ఆయువు అంతమొందును. ఇది అకాల మృత్యువనబడును. మరియు జ్వరము మొదలగు రోగముల యందు మిథ్యోపచారములు (ఆ వ్యాధికి సరిపడని క్రియలు) చేయుట కూడా అకాల మృత్యువునకు హేతువగుట చూచుచున్నాము.

**ఆయుర్వేద దీపిక :** కాలానుసారము అనగా దానియొక్క సహజ బలమునకు వ్యతిరేకమైన ప్రతిక్రియ జరుగునపుడు బలము ప్రకారము ఎంత కాలము నడచునో అంతకాలము తరువాత క్షయము పొందును అని అర్థము. స్వప్రమాణ క్షయము అనగా యుగము ననుసరించి యుండవలసిన ఆయుః ప్రమాణము క్షయించుట వలన అని అర్థము. అపథము-అనగా మార్గము లేని చోటు. అణిమోక్షము అన చీల విరుగుట, ఊడిపోవుట. అనుపాంగాత్ - అనగా కందెన (చక్రము తగిలించు చోట అరిగిపోకుండా నారపీచును చుట్టి ఆముదము మొదలైనవాటిని పూయుట) వేయకపోవుట, పడిపోవుట (పర్యసానాత్) అనగా ఎగుడు దిగుడు మార్గములందు బండిని నడిపించుట వలన క్రింద పడిపోవుట, మిథ్యోపచారము చేసిన వ్యాధులు అనగా సరిగా చికిత్సింపబడని వ్యాధులు. అకాల మృత్యూన్ - అనగా అకాల మృత్యువును కలిగింపజేయునవి.

39. అథాగ్నివేశః ప్రపచ్ఛ-కిన్ను ఖలు భగవన్ జ్వరితేభ్యః పానీయముష్ణం ప్రయచ్ఛన్తి భిషజో భూయిష్ఠం న తథా శీతమ్, అస్తి చ శీతసాధ్యోఽపి ధాతుర్జ్వరకర ఇతి.

**తాత్పర్యము :** అపుడగ్నివేశుడిట్లు ప్రశ్నించెను. ఓ భగవానుడా! జ్వరమును కలిగించు ధాతువు (పిత్తము) శీతోపచారములచేత శమించునప్పటికీ జ్వరమునందు వైద్యులు ఎక్కువగా ఉష్ణజలమునే ప్రయోగించుదురు. ఇది ఏ విధముగా సమంజసము ?

**ఆయుర్వేద దీపిక :** రోగములు మిథ్యోపచారములచే వికటించి మృత్యువు సంభవించును. (అకాల మరణము కలుగును) అను సందర్భమున జ్వరమును కలిగించు పిత్తము దాని గుణములకు వ్యతిరేక గుణములు కలిగిన శీతోపచారములచే శమించును. అట్లుగాక వైద్యులు జ్వరమునందు ఉష్ణోదకము నిచ్చుట

మిథ్యోపచారము కాదా అను సందేహమును వెలిబుచ్చుచున్నాడు. శీత సాధ్యమైన ధాతువు అనగా పిత్తము. ఉష్ణగుణము కలదని అర్థము. అన్ని జ్వరములందు పానీయము ఇవ్వబడును కాబట్టి పానీయమును గురించియే ప్రశ్నించుట జరిగినది.

## జ్వరితునకు ఉష్ణోదక పానము చేయించుటకు కారణము. అట్లు చేయించకూడని సందర్భములు

40. తమువాచ భగవానాత్రేయః-జ్వరితస్యకాయ సముత్థాన దేశకాలానభి సమీక్ష్య పాచనార్థం పానీయముష్ణం ప్రయచ్ఛన్తి భిషజః జ్వరోహ్యామాశయసముత్థః ప్రాయోభేషజాని చామాశయ సముత్థానాం వికారాణాం పాచనవమనాపతర్పణ సమర్థాని భవన్తి. పాచనార్థం చ పానీయ ముష్ణం తస్మాదేతజ్జ్వరితేభ్యః ప్రయచ్ఛన్తి భిషజో భూయిష్ఠమ్. తద్ధి తేషాం పీతం వాతమనులోమయతి, అగ్నించోదీర్యముదరీయతి, క్షిప్రం జరాంగచ్ఛతి. శ్లేష్మాణం పరిశోషయతి, స్వల్పమపిచపీతం తృష్ణా ప్రశమనాయోపకల్పతే: తథాయుక్తమపి చైతన్నా-త్యర్థోత్పన్నపిత్తే జ్వరే సదాహభ్రమప్రలాపాతిసారే వా ప్రదేయమ్ ఉష్ణేన హి దాహభ్రమప్రలాపాతిసారా భూయోభివర్ధన్తే, శీతేన చోపశామ్యన్తీతి.

**తాత్పర్యము :** ఆత్రేయ భగవానుడతనితో యిట్లు చెప్పెను— జ్వరితుని యొక్క శరీరమునందని బలదేశ కాలములను దృష్టిలో ఉంచుకొని పాచనము కొరకు ఉష్ణ పానీయమును వైద్యులు ఉపయోగింతురు. జ్వరము ఆమాశయము నందుత్పన్నమగును. సాధారణముగా ఆమాశయమున కల్గు వ్యాధులకు పాచన,వమన,అపతర్పణ చికిత్సలను చేసి శమింపజేయవచ్చును. ఉష్ణపానీయము పాచనము కొరకు ఉపయోగపడును. కాబట్టి దీనిని వైద్యులు ఎక్కువగా జ్వరితులకు యిచ్చెదరు. ఉష్ణపానీయము జ్వరితులకు త్రాగించినచో వాతము అనులోమ గతిని బొందును (వాయువు సరిగా వెడలును). అగ్ని ఎక్కువగా ప్రజ్వలించును. వెంటనే జీర్ణమగును. శ్లేష్మమును ఎండించును. కొంచెముగా త్రాగినను దాహమును శమింపజేయుటకు పనికివచ్చును. పిత్తము అధికముగా నుండు జ్వరము నందు, దాహము, భ్రమ, ప్రలాపము-అతిసారములతో కూడిన జ్వరమునందునూ ఉష్ణజలము నివ్వరాదు. ఉష్ణము వలన (ఉష్ణపానీయ సేవన వలన) దాహ భ్రమ ప్రలాప అతిసారములు బాగా ఎక్కువగును. శీతోపచారముల వలన యివి శమించును.

**ఆయుర్వేద దీపిక :** ఉత్పన్న పిత్తే అనగా వృద్ధి చెందిన పిత్తము నందు.

భవతి చాత్ర

## ఉష్ణజన్య రోగములకు శీతోపచారము - శీతజన్య రోగములకు ఉష్ణోపచారము

41. శీతేనోష్ణకృతాన్ రోగాఞ్ఛమయన్తి భిషగ్విదః
యే తు శీతకృతా రోగాస్తేషాం చోష్ణం భిషగ్జితమ్.

**తాత్పర్యము :** ఉష్ణము వలన కలిగిన రోగములను శీతోపచారములచేత వైద్యవిదులు చికిత్సింతురు. అట్లే శీతము వలన కలుగు రోగములందు ఉష్ణోపచారములను ప్రయోగింతురు.

ఆయుర్వేద దీపిక : కేవలము జర్వమునందు మాత్రమే ఉష్ణశీత కారణములకు శీత-ఉష్ణ ఉపచారములను చేయక అన్ని వ్యాధులందునూ ఇట్టి చికిత్సలను చేయనగునని చెప్పుచున్నాడు. వైద్యులలో జ్ఞానవంతులు కూడా అయినవారిని వైద్యవిదులు (భిషగ్విదులు) అందురు.

## నిదానవిపరీత చికిత్స

42. ఏవమితరేషామపి వ్యాధీనాం నిదానవిపరీతం భేషజం భవతి-యథా- అపతర్పణ నిమిత్తానాం వ్యాధీనాం నాన్తరేణ పూరణమస్తి శాన్తిః తథా పూరణ-నిమిత్తానాం వ్యాధీనాం నాన్తరేణాపతర్పణం.

## అపతర్పణము మూడు విధములనుట

43. అపతర్పణమపి చ త్రివిధం లఙ్ఘనం, లఙ్ఘనపాచనం దోషావసేచనం చేతి.

## లంఘనము - లంఘనపాచనము

44. తత్ర లఙ్ఘనమల్పబలదోషాణాం, లఙ్ఘనేన హి అగ్నిమారుతవృద్ధ్యా వాతాతపపరీతమివాల్ప ముదకమల్పో దోషః ప్రశోషమాపద్యతే. లఙ్ఘనపాచనే తు మధ్యబలదోషాణామ్. లఙ్ఘనపాచనాభ్యాం హి సూర్యసంతాపమారు

తాభ్యాం పాంశుభస్మావకిరణైరివ చానతి బహూదకం మధ్యబలో దోషః ప్రశోషమాపద్యతే.

బహుదోషాణాం పునర్దోషావసేచనమేవ కార్యం, నహ్యభిన్నే కేదారసేతౌ పల్వలా ప్రసేకోఽస్తి, తద్వద్దోషావసేచనమ్.

**తాత్పర్యము :** ఇక్లే ఇతర వ్యాధులకు కూడా ఆ వ్యాధుల కారణములకు వ్యతిరేకమైనవి చికిత్సగా అగుచున్నవి. ఎట్లైతే అపతర్పణము వలన వచ్చు వ్యాధులకు సంతర్పణము తప్ప యితర చికిత్స లేదో అటులనే సంతర్పణము వలన కలుగు వ్యాధులకు అపతర్పణము తప్ప వేరు పద్ధతుల వలన చికిత్స జరుగదు.

అపతర్పణము కూడా మూడు విధములు. అవి లంఘనము, లంఘనపాచనము మరియు దోషావసేచనము.

అల్పబలము కలిగిన దోషముల చికిత్స యందు లంఘనము చేయించవలెను. లంఘనము చేత అగ్ని, వాతము వృద్ధి చెంది ఎండ గాలి వలన ఎండిపోవు అల్ప జలాశయము వలె దోషము శోషించును.

మధ్యమ బలము కలిగిన దోషముల యందు లంఘన పాచనముల రెండింటిని చేయవలెను. లంఘన పాచనములచేతనే సూర్యుని వేడిమి, గాలిచేత దుమ్ము, ఎక్కువ నీరులేని చెరువు నందలి నీరు ఎండిపోయినట్లు మధ్యమ బలము కలిగిన దోషములు శోషింపబడును.

అధిక బలము కల దోషములున్నపుడు వాటిని వమన విరేచనాదుల ద్వారా బయటికి వెడలించుట (అవశేచనము) ద్వారానే పోగొట్టవలెను. బాగు చేయని పొలము నందలి నీరు ఇంకనట్లు దోషములను పోగొట్టకుండా చికిత్స సాధ్యపడదు.

**ఆయుర్వేద దీపిక :** శీతోష్ణముల వలన కలిగిన వ్యాధులకు మాత్రమే హేతు విపరీత చికిత్స చేయుట యనికాక అపతర్పణము- మొదలగువాటి వలన కలుగు వ్యాధులు కూడా హేతు విపరీత చికిత్సను చేయవలెనని చెప్పడమైనది. అపతర్పణము, సంతర్పణము ఈ రెండింటి వలననే చికిత్స యంతయును చెప్పబడినది. చికిత్స చేయుటకు అపతర్పణ సంతర్పణములు తక్క వేరొండు పద్ధతి లేదు. అందు వలన అన్ని చికిత్సా విధానములను అపతర్పణ-సంతర్పణ భేదము లేయని గ్రహింప వలెను. అందువలననే విశేష జ్ఞానము కొరకు అపతర్పణ భేదములను ఇక్కడ

చెప్పియున్నాడు. లంఘన పాచనములు వలన పాచనము జరుగునపుడు కొంచెము లంఘనము చేయుట కూడా అవసరము. పాచన కాలము నందు బృంహణము చేయుట వలన బృంహణము అగ్నికి వ్యతిరేకమై పాచనము జరుగదు. 'అవకిరన్నివ' అను చోట 'ఇవ' శబ్దము 'అనతి బహూదకమివ' అని అన్వయించు కొనవలెను.

## దోషావసేచనము

15. దోషావసేచనం తు ఖలు అన్యద్వా భేషజం ప్రాప్తకాల మప్యాతురస్య నైవం విధస్య కుర్యాత్. తద్యథా - అనపవాద ప్రతీకార స్యాధనస్యా పరిచారికస్య వైద్యమానినశ్చండస్యాసూయకస్య తీవ్రధర్మారుచేరతిక్షీణబలమాంసశోణి-తస్య అసాధ్యరోగోపహతస్య ముమూర్షులింగాన్వితస్య చేతి ఏవం విధం హ్యాతురముపచరన్ భిషక్ పాపీయసాఽయశసా యోగమృచ్ఛతీతి.

**తాత్పర్యము :** తగిన సమయము వచ్చినను దోషావసేచనము లేదా లంఘన బృంహణ చికిత్సలను ఈ క్రిందివారికి చేయరాదు. హితవచనములను గౌరవించనివాడు, ధర్మహీనుడు, ధనహీనుడు, పరిచారకులు లేనివాడు, తన్ను తాను వైద్యునిగా పరిగణించుకొనువాడు, కోపిష్ఠి, అసూయాపరుడు, అధర్మమునందు ఎక్కువ యిష్టము కలవాడు, బలము, మాంసము, రక్తము ఇవి బాగా క్షీణించినవాడు, అసాధ్యరోగముచే కృశించినవాడు మరియు ఆసన్న మృత్యు లక్షణములు కలవాడు. ఇట్టి రోగులకు చికిత్స చేయబూనుట వలన వైద్యునికి పాపము - అపకీర్తి కలుగును.

**ఆయుర్వేదదీపిక :** "అన్యద్వా" అనగా లంఘన బృంహణముల వలనైననూ అని అర్థము. హితవచనములను గౌరవించనివాడు అనగా చెప్పిన మాటను విననివాడు. ధనములేనివానికి తగిన ఉపకరణములను కూర్చుకొనుట సాధ్యపడనందున చికిత్స కష్టతరమగునని భావము. తన్ను తాను వైద్యునిగా పరిగణించుకొనువాడు వైద్యుని సలహామేరకు నడచుకొనడు. అధర్మము నందెక్కువ మక్కువ గలవానికి చికిత్సయందు అధర్మము చేయవలసి వచ్చును. ధర్మవిరోధము వలన చికిత్స సిద్ధించదు. ఆసన్న మృత్యు లక్షణములనగా అరిష్ట లక్షణములు. "పాపీయసా"- అనగా పాపము కారణమగుటచే - పాపము వలన అపకీర్తి కలుగుట (చికిత్స సిద్ధించనిచో గూడ అపకీర్తి కలుగుట సాధారణముగా చూడనగును).

## అశుభకర్మ నిషేధము - దేశ త్రైవిధ్యము

భవతిచాత్ర—

46. తదాత్వే చానుబంధే వా యస్యస్యాదశుభం ఫలమ్,
కర్మణ స్తన్నకర్తవ్యమేతద్ బుద్ధిమతాం మతమ్.

47. అల్పోదకో ద్రుమో యస్తం ప్రవాతః ప్రచురాతపః,
జ్ఞేయం స జాఙ్గలో దేశః స్వల్పరోగతమోఽపిచ.

48. ప్రచురోదకవృక్షో యో నివాతో దుర్లభాతపః,
అనూపో బహుదోషశ్చ సమః సాధారణోమతః.

**తాత్పర్యము :** అప్పటికప్పుడు గాని, తరువాతి కాలము నందుగాని అశుభ ఫలితముల నిచ్చు కర్మలను చేయరాదని బుద్ధిమంతుల అభిప్రాయము.

తక్కువ నీరు తక్కువ చెట్లు కలిగి, ఎక్కువ గాలి, ఎండ కలిగియున్న ప్రదేశమును జాంగల దేశమందురు. ఇక్కడ రోగము తక్కువగా వుండవు. ఎక్కువ నీరు, ఎక్కువ వృక్షములు కలిగి గాలి ఎండ తక్కువగా నున్న ప్రదేశము అనూపదేశము అనబడును. ఇచ్చట దోషములధికముగా నుండును. అన్ని (నీరు, చెట్లు, గాలి, ఎండ) సమముగానున్నది సాధారణ దేశము అనబడును.

**ఆయుర్వేద దీపిక :** అనుబంధే వా - అనగా తరువాత కాలమునందు గానీ - తక్కువ నీరు, తక్కువ చెట్లు - అనునది జాంగలము. మొదలైన (జాంగల - అనూప - సాధారణ) దేశములను గూర్చి చెప్పుచున్నారు.

## అధ్యాయ సంగ్రహము

తత్రశ్లోకాః—

49. పూర్వరూపాణి సామాన్యా హేతవః సస్వలక్షణాః
దేశోద్ధ్వంసస్య భైషజ్యం హేతూనాం మూలమేవ చ

50. ప్రాగ్వికారసముత్పత్తిరాయుషశ్చ క్షయక్రమః,
మరణం ప్రతి భూతానాం కాలాకాలవినిశ్చయః.

51. యథా చాకాలమరణం యథా యుక్తం చ భేషజమ్,
సిద్ధిం యాత్యౌషధం యేషాం న కుర్యాద్యేన హేతునా.

52. తదగ్నివేశాయాత్రేయో నిఖిలం సర్వముక్తవాన్,
దేశోద్ధ్వంస నిమిత్తయే విమానే మునిసత్తమః
ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే విమానస్థానే జనపదోద్ధ్వంస-
నీయవిమానంనామ తీయోఽధ్యాయః

**తాత్పర్యము :** జనపదోద్ధ్వంస వ్యాధులకు పూర్వ రూపములు, సామాన్య కారణములు, లక్షణములు; వాటి చికిత్స, జనపదోద్ధ్వంసములకు మూల కారణము. రోగముల ప్రాదుర్భావము ఆయువు క్షీణించు క్రమము, ప్రాణులు మరణించుట యందు కాలాకాల నిర్ణయము, అకాలమృత్యువు, ఔషధముల సంగ్రహణ కాలము (ఉపయోగింపదగిన ఔషధముల నిర్ణయము) చికిత్స చేయదగినవారు - ఈ విషయ ములను గురించి అగ్నివేశునకు ఆత్రేయ మునిసత్తముడు సవివరముగా దేశోద్ధ్వంస నీయ విమానము నందు చెప్పియున్నాడు.

ఇది అగ్నివేశునిచే రచింపబడి చరకునిచే ప్రతి సంస్కరింపబడిన తంత్రము లోని విమానస్థానము నందలి జనపదోద్ధ్వంసనీయమను మూడవ అధ్యాయము.

**ఆయుర్వేద దీపిక :** అధ్యాయమున వివరింపబడిన విషయము సంగ్ర హముగా ఇక్కడ చెప్పబడినది. "పూర్వరూపాణి" అనగా జనపదోద్ధ్వంసములు కలుగుటకు ముందు నక్షత్ర గ్రహాదుల యందు వికారములు జనించుట. స్వల్ప లక్షణ ములతో కూడిన అనగా తమ యొక్క వికృతి లక్షణములతో కూడిన. ఈ విధముగా వాతము ప్రకోపించి అనినచోట ఆయా లక్షణములు చెప్పబడినవి. యథావిధిగా ఇవ్వబడిన ఔషధముల వలన చికిత్సా ఫలితములు (సత్ఫలితములు) లభించును. జ్వరమునందు ఉష్ణ పానీయము నిచ్చుట అనువాని ద్వారా సర్వమును గ్రహింపబడి నది.

ఇది శ్రీ చక్రపాణిదత్తునిచే రచింపబడిన ఆయుర్వేద దీపిక యన చరక తాత్పర్య టీక యందలి విమానస్థానమున జనపదోద్ధ్వంసనీయ విమానమను మూడవ అధ్యాయము.

# త్రివిధ రోగ విశేష విజ్ఞానీయ విమానము

## చతుర్థాధ్యాయము

1. అథాతస్త్రివిధరోగ విశేషవిజ్ఞానీయం విమానం వ్యాఖ్యాస్యామః.
2. ఇతి హ స్మాహ భగవానాత్రేయః.

**తాత్పర్యము :** ఇపుడు మూడు విధములుగా రోగ విశేషములను తెలుపువాటిని గురించి చెప్పుకొందము అని ఆత్రేయ భగవానుడు చెప్పెను.

**ఆయుర్వేద దీపిక :** జనపదోద్ధ్వంసనీయాధ్యాయమునందు సంగ్రహముగా అన్ని వ్యాధులును చెప్పబడినవి. వాటియొక్క విశేషములను ఏ విధముగా తెలుసుకొనవలెనో ఆ విధమును గురించి ఉపదేశించుటకు త్రివిధ రోగ విశేష విజ్ఞానీయము చెప్పబడినది.

### రోగ విశేషమును తెలిసికొను ఉపాయములు

3. త్రివిధం ఖలు రోగవిశేషవిజ్ఞానం భవతి, తద్యథా - ఆప్తోపదేశః, ప్రత్యక్షం అనుమానం చేతి.

**తాత్పర్యము :** రోగ విశేషములను మూడు విధానములద్వారా తెలుసుకొనవచ్చును. అవి ఆప్తోపదేశము, ప్రత్యక్షము మరియు అనుమానము.

**ఆయుర్వేద దీపిక :** రోగముల విశేషములను ఎట్లు తెలుసుకొనవలెనో అని చెప్పుటకు రోగ విశేష విజ్ఞానము కొరకు ఆప్తోపదేశ, ప్రత్యక్ష, అనుమానములని మూడు ప్రమాణములు చెప్పబడినవి. ఇచ్చట యుక్తి అనునది అనుమానమునందు అంతర్గతమైనది కాబట్టి దానిని ప్రత్యేకముగా చెప్పలేదు. ఈ మూడు ప్రమాణములు కొన్ని రోగములందు మూడు కలసిననే ఆ రోగమును తెలుసుకొన వీలగును. కొన్ని రోగములను రెండు ప్రమాణముల ద్వారాను, ఇంకొన్నిటిని ఒకే ప్రమాణము వలనను తెలుసుకొనవచ్చును. అగ్నిమాంద్యమునందు ప్రత్యక్షము తప్పనిసరిగా ఉపయోగించును.

## ఆప్తోపదేశము

4. తత్రాప్తోపదేశో నామాప్తవచనమ్. ఆప్తా హ్యవితర్క స్మృతి విభాగవిదో నిష్ప్రీత్యుపతాప దర్శినశ్చ. తేషామేవంగుణయోగాద్యద్వచనమ్ తత్ప్రమాణమ్. అప్రమాణం పునర్మత్తోన్మత్తమూర్ఖరక్తదుష్టాదుష్టవచనమితి. ప్రత్యక్షం తు ఖలు స్వయమిన్ద్రియైర్మనసా చోపలభ్యతే. అనుమానం ఖలు తర్కో యుక్త్యపేక్షః.

**తాత్పర్యము :** ఆప్తోపదేశమనగా ఆప్తవచనము (పెద్దలమాట). ఆప్తులు తర్కించుటకు వీలులేని జ్ఞానము, చక్కని స్మరణశక్తి కలిగి సంపూర్ణముగా విషయము నెరిగి పక్షపాత బుద్ధిలేనివారై యుందురు. ఈ గుణములవలన వీరి వాక్యము ప్రమాణముగా నంగీకరింపబడును. మదముతోకూడి, మతిచెడి, మూర్ఖత్వముతో కూడినవారి మాట మంచిదైననూ చెడుదైననూ ప్రమాణముగా నంగీకరింపబడదు. ప్రత్యక్షమనునది ఇంద్రియములచేతనూ మనస్సుచేతనూ స్వయముగా లభించునది. అనుమానము యుక్తి నపేక్షించి యుండు తర్కము.

**ఆయుర్వేద దీపిక :** సూత్రస్థానమందలి తిస్రైషణీయాధ్యాయము (పదవ అధ్యాయము)నందు మొదట అనుమానము మొదలైన ప్రమాణముల లక్షణములను గురించి ప్రకరణమునందు వచ్చియున్నది కాపున చెప్పబడుచున్నది. ప్రకరణమునందు వచ్చిన విషయములను వివరించకపోయినచో అది న్యూనమగును. (అందువలన ఇక్కడ కూడా ఆప్తోపదేశాదులనుగూర్చి వివరించడం జరుగుచున్నదని భావము). "అవితర్క" - మొదలైన శబ్దములలో — విశేషముగా తర్కించుట అనిశ్చితమైన దానినిగురించి చెప్పుచున్నట్లు — స్మృతి స్మరణ జ్ఞానము; విభాగము ఏక పక్షముననే అంగీకరింపదగినది. దీనికి విరుద్ధముగా నిశ్చయమైన అనుభవముతో సంపూర్ణముగా విషయమును తెలుసుకొనినవారు అవితర్క స్మృతి విభాగవిదులు అనబడుదురు. ప్రతిపాదించిన వస్తువు (విషయము) యొక్క సంపూర్ణ జ్ఞానము లేనందున వితర్కము మొదలైనవానితో కూడియున్నవారు ఆప్తులు కాజాలరు. స్మృతి జ్ఞానముకూడా ప్రమాణమునకు మూలమైన దైనప్పటికీ అప్పటి కప్పుడు స్మృతి జ్ఞానమువలన వచ్చిన విషయమే అవశ్యముగాపున స్మృతి జ్ఞానము ప్రమాణము కాదని భావము. లేదా స్మృతి జ్ఞానమనగా స్మృతి శాస్త్రమువలన వచ్చిన జ్ఞానము. గణిత జ్ఞానము. ఈ రెండు జ్ఞానములవలన విషయబోధన సరిగా జరుగక

పోవడంవలన కూడా స్మృతి జ్ఞానమును ప్రమాణముగా నంగీకరించుటకు వీలులేదు. పక్షపాతబుద్ధి లేకపోవుట ఆప్త లక్షణముగా చెప్పబడుట వలన కొండొకచో సరియైన జ్ఞానము కలవారును, రాగద్వేషములవలన, పక్షపాతబుద్ధి కలిగియుండుటవలన వీరి వాక్యము ఆప్తోపదేశము కాజాలదని గ్రహింపవలెను. ఆ వస్తువుయందు యిష్టాయిష్టములు లేకుండా చూచుట వలననే జ్ఞానము కలుగుననియు భావము. ఇందువలన యథార్థమును చూచువాడు దోషము లేనివాడును, ఆప్తుడగునని చెప్పబడినది. ఈ విధమైన ఆప్తత్వము బ్రహ్మాదులకు ఎల్లెడలనూ వుండును (వారెప్పుడు ఎక్కడ చెప్పిననూ సత్యమునే చెప్పుదురు). ఈ లోకమునందు వితర్కాదులు లేనట్టిదియే ఉపదేశము. అదియే ప్రమాణము అని తెలుసుకొనవలెను. అప్రమాణమనగా రాగాది దోషములవలన ప్రమాణముగా గ్రహింపనిది. దుష్టాదుష్టమనగా దుష్టత్వము కలిగి యున్ననూ ఒకానొకచోట అది అదృష్టముగానే గ్రహింపవలెను. దీనివలన తండ్రి దుష్టుడైననూ కుమారునికి ఆప్తుడేయగును. లేదా దుష్టుడనగా వంచకుడని అర్థము గూడా తీసికొనవచ్చును. స్వయముగా ఇంద్రియములతో మనస్సుతోనూ ............ అను వాక్యమువలన ఆత్మ చక్షురాది ఇంద్రియములచేత రూపాదులను గ్రహించుట ప్రత్యక్షము. యిది బాహ్య ప్రత్యక్షముగా తీసుకొనబడుతోంది. మనస్సుతోనూ, అనుటవలన ఆత్మ మనస్సుల సంయోగము వలన నేర్పడు ప్రత్యక్షము సుఖాదులు అనునవి మానస ప్రత్యక్షముగా గ్రహింప నగును. ఇచట తర్కము అప్రత్యక్ష జ్ఞానము. యుక్తి యనగా అవినాభావ సంబంధమని యర్థము. కాబట్టి యుక్తి - తర్కముల వలన కలుగు పరోక్ష జ్ఞానము అనుమానము అని యర్థము.

## పరీక్షా ద్వైవిధ్య త్రైవిధ్యములు

5. త్రివిధేన ఖల్వనేన జ్ఞానసముదాయేన పూర్వం పరీక్ష్య రోగం సర్వథా సర్వమథోత్తరకాలమధ్యవసానమదోషం భవతి, న హి జ్ఞానావయవేన కృత్స్నే జ్ఞేయే జ్ఞానముత్పద్యతే. త్రివిధే త్వస్మిన్ జ్ఞానసముదయే పూర్వమాప్తోపదేశాజ్ఞానం తతః ప్రత్యక్షానుమానాభ్యాం పరీక్ష్యోపపద్యతే విద్యాత్. తస్మాత్ ద్వివిధా పరీక్షా జ్ఞానవతాం ప్రత్యక్షమ్ అనుమానం చ, త్రివిధా వా సహోపదేశేన.

**తాత్పర్యము :** ఈ మూడు విధములైన రోగములను గురించి తెల్పు జ్ఞానసాధనముల వలన రోగమును ముందుగానూ, పిమ్మట కాలమునందును ఉత్తరకాలము

నందునూ పరీక్షించినచో చికిత్స సఫలమగును. మూడింటిద్వారా పరీక్షింపవలసిన చోట ఒకే సాధనము వలననే పరీక్ష చేసినచో సరియగు జ్ఞానోత్పత్తి కాజాలదు. ఈ మూడు జ్ఞాన సాధనములయందును మొదట ఆప్తోపదేశము ద్వారానూ, అటు పిమ్మట ప్రత్యక్ష అనుమానములద్వారానూ జ్ఞానము సంభవించును. మొదట ఆప్తోపదేశము జరుగునపుడు ప్రత్యక్షానుమానముల ద్వారా దేనిని పరీక్షింపవలెను ? అందుచేత జ్ఞానవంతులకు ప్రత్యక్షము, అనుమానము అను రెండు పరీక్షా సాధనములుండును. లేదా (ఉపదేశము) ఆప్తోప దేశముతో కలిపి యివి మూడు.

**ఆయుర్వేద దీపిక :** జ్ఞాన సముదాయముచేత....జ్ఞానసముదాయము - ప్రమాణముల సముదాయము. దానివలన - ఈ సముదాయము వలన ఇది ఫలానా రోగము అను నిశ్చయమైన జ్ఞానము కలుగును. తెలియజెప్పునది కావున యిది జ్ఞానమని చెప్పబడినది. ఇది ప్రమాణము. మొదట ఆప్తోపదేశము వ్యాధిని గూర్చి తెలియజేయును. తరువాత ఆ వ్యాధిని ప్రత్యక్షము, అనుమానము - ఈ రెండిటి వలన ఆ యా వ్యాధుల లక్షణమును పరీక్షించి రోగ నిర్ణయము చేయబడును. కింహ్యనుపదిష్టమ్ .... అనుటవలన ఆప్తోపదేశము ద్వారా ముందుగా తెలియని వ్యాధి గురించి ప్రత్యక్షానుమానములద్వారా అవైద్యునివలె తెలుసుకొనుట జరుగదు. ఈ క్రింది విధములుగా చాలామంది ఉద్దేశ్యపడుదురు. వ్యాధి విశేషములను తెలుసుకొనుట చాల కష్టము. ఆప్తోపదేశము లేకుండా వాటిని గ్రహింప శక్యముగాదు. వైద్య శాస్త్రమును అభ్యసించినవారు వ్యాధి విశేషములను తప్పక ప్రకటింతురు. కాబట్టి ఆగమములయందు వ్యాధి యొక్క హేతువు మొదలైన విశేషములు ప్రతిపాదింపబడియుండును. వాటికి రోగులయందు ప్రత్యక్ష, అనుమానములచేత గ్రహించి వ్యాధి నిశ్చయము చేయుట జరుగును. ఆ యా విశేషములను గూర్చి ముందుగా ఉపదేశింపబడనివాడు ఆ లక్షణములను ప్రత్యక్షానుమానముల ద్వారా గ్రహించినప్పటికీ, రత్నములను ప్రత్యక్షముగా చూచుచూ దానిని గురించి యిది ఫలానా రత్నమని తెలియనివాలె వ్యాధి విశేషమును (వ్యాధి యొక్క పేరు) తెలిసికొనజాలడు. జ్ఞానవంతులకు అనగా ఆప్తోపదేశము పొందినవారు అని అర్థము. మూడు విధములు అనగా వ్యాధిని పరీక్షించు సమయమున గ్రహణీ మార్దవము, స్వప్న దర్శనము, దోషముల స్థాన-సంశ్రయము మరియు కోష్ఠము యొక్క మృదుత్వ దారుణత్వాదులు రోగియొక్క కథనము అను ఆప్తోపదేశము ద్వారా తెలిసికొనుట వలన ఆప్తోపదేశమును మూడవ విధముగా లెక్కించుట జరిగినది.

## ఆప్తోపదేశము ద్వారా తెలియదగు అంశములు

6. తత్రేదముపదిశన్తి బుద్ధిమన్తః-రోగమేకైకమేవం ప్రకోపమేవం యోనిమేవముత్థానమేవమాత్మానమేవమధిష్ఠానమేవం వేదనమేవం సంస్థానమేవం శబ్దస్పర్శరూపరసగన్ధమేవముపద్రవమేవం వృద్ధిస్థానక్షయ-సమన్వితమేవముదర్కమేవం నామానమేవం యోగం విద్యాత్.తస్మిన్నియం ప్రతీకారార్థా ప్రవృత్తిరథవా నివృత్తిరిత్యుపదేశాజ్జ్ఞాయతే.

**తాత్పర్యము :** బుద్ధిమంతులైన వైద్యులు రోగములను సాంగో పాంగముగ వివరించి చెప్పుదురు. వారి ఉపదేశముల వలన (ఆప్తోపదేశము వలన) ప్రతిరోగము యొక్క ప్రకోప లక్షణములు, మూలము, కారణము, స్వభావము, ఉపద్రవములు, వృద్ధిస్థానక్షయములు ముందు రాబోవు లక్షణములు, నామధేయము, యోగము - వీటిని తెలుసుకొనవచ్చును. మరియు అట్టి రోగమునకు ఇది సేవింప దగినది లేదా యిది వర్జనీయము అనునవి కూడా తెలియనగును.

ఆయుర్వేద దీపిక : "తత్ర" అను మొదలగువాని ద్వారా ఆప్తోపదేశము ద్వారా తెలిసికొనవలసిన వానిని చెప్పుచున్నాడు. ప్రకోపణము అనునది వాయువునకు రూక్షత్వము మొదలగునవి ప్రకోపణహేతువులగును. వాతాదులు యోనియగును. "ఆత్మ" అనగా స్వభావము ఉదాహరణమునకు రోహిణీ(కార్తె)కు దారుణత్వము, సన్యాసమునకు శీఘ్ర చికిత్స చేయవలసియుండుట ఈ మొదలగునవి స్వభావము అని తెలిసికొనవలెను. అధిష్ఠానము అనగా శరీరము, అవయవములు మరియు మనస్సు. ఇది ప్రతీకారము కొరకు చేయు ప్రవృత్తి అనుటకు ఉదాహరణము— జ్వరమునందు లంఘన పాచనాదులకొరకు చేయు ప్రక్రియ. ప్రతీకారము కొరకు (అనుసరింపవలసిన) నివృత్తికి ఉదాహరణము—నవజ్వరమునందు దివాస్వప్నము స్నానము మొదలగువానిని నివృత్తి చేయుట (వర్జించుట) మొదలగునవి అని తెలిసికొనవలెను.

## ప్రత్యక్షము ద్వారా తెలియదగు విషయములు

7. ప్రత్యక్షతస్తుఖలు రోగతత్త్వం బుభుత్సుః సర్వైరింద్రియైః సర్వానింద్రియార్థా-నాతురశరీరగతాన్ పరీక్షేతాన్యత్రరసజ్ఞానాత్ తద్యథా-అంత్రకూజనం, సంధి-స్ఫుటనమంగులీపర్వణాంచ స్వరవిశేషాంశ్చ మేచాఽన్యేపి కేచిచ్ఛరీరోపగతాః

శబ్దాః స్యుశ్శ్రోత్రేణ పరీక్షేత; వర్ణసంస్థానప్రమాణచ్ఛాయాః శరీరప్రకృతి వికారౌచక్షుర్వైషయికాణి యానిచాన్యాన్యనుక్తాని తానిచక్షుషా పరీక్షేత; రసం తు ఖల్వాతురశరీరగతమింద్రియవైషయిక మప్యనుమానాదవగచ్ఛేత్; నహ్యస్యప్రత్యక్షేణ గ్రహణముపపద్యతే తస్మాదాతురపరిప్రశ్నేనైవాతురముఖరసం విద్యాత్ యూకాపసర్పణేనతస్య శరీరవైరస్యం మక్షికోపసర్పణేన శరీర మాధుర్యంలోహితపిత్త సందేహే తు కిం ధారి లోహితం లోహితపిత్తంవేతి శ్వకాకభక్షణాద్ధారిలోహితమభక్షణాల్లోహితపిత్తమిత్యనుమాతవ్యమ్, ఏవమన్యానప్యాతురశరీరగతాన్ రసాననుమిమీత గన్ధాంస్తుఖలు సర్వశరీరగతా నాతురస్య ప్రకృతివైకారికాన్ ఘ్రాణేనపరీక్షేతస్పర్శంచ పాణినాప్రకృతి వికృతియుక్తమ్. ఇతిప్రత్యక్షతోఽనుమానాదు పదేశతశ్చ పరీక్షణ ముక్తమ్.

తాత్పర్యము : రోగతత్త్వమును తెలుసుకొనదలచినవారు ప్రత్యక్షము వలన అన్ని యింద్రియముల చేత రోగి శరీరమందున్న ఇంద్రియార్థములను పరీక్షింపవలెను. రసమును మాత్రము ఇతర పద్ధతులద్వారా ఆంత్ర కూజనము (ప్రేవులు అరచుట), సంధుల యందు వ్రేళ్ళ కణుపుల యందును కలుగు స్ఫుటనము (మెటికలు విరుచునపుడు కలుగు శబ్దము) మరియు శరీరము నందు కలుగు ఇతర శబ్దములను గూడా గ్రహింప వచ్చును. శరీర వర్ణము, సంస్థానము, మెరుపు, శరీర ప్రకృతి మొదలైన చక్షురింద్రియ విషయాలను, ఇంకను ఈ సంబంధముగా చెప్పబడని ఇతర విషయములను కూడా చక్షురింద్రియము ద్వారా గ్రహింపనగును. రోగి శరీరము నందలి ద్రవ్యముల రసమును మాత్రము ఇంద్రియ (రసనేంద్రియ) విషయమైనప్పటికీ అనుమానము చేతనే దానిని తెలుసుకొనవలెను. దీనిని ప్రత్యక్షముగా తెలియుట సాధ్యపడదు. కాబట్టి రోగిని ప్రశ్నించి తద్వారా రోగి ముఖమునందు గల రుచిని తెలుసుకొనవలెను. యూకలు (పేలు) శరీరముపై నుండుట వలన వైరస్యము, ఈగలు వాలటం వలన మధుర రసము - ఇవి ఉన్నట్లు తెలుసుకొనవలెను. రక్తపిత్తమునకు సంబంధించిన ఇది జీవరక్తమా లేక రక్తపిత్తమా అను సంశయము కలిగినపుడు కుక్క, కాకి ఇవి ఆ రక్తమును భక్షించినచో అది జీవ రక్తమనియూ, మూచూడక వదలినచో రక్తపిత్తమనీ తెలియవలెను. ఇదేవిధముగా రోగి శరీరమందలి ఇతర ద్రవ్యముల రసములను అనుమానము ద్వారా గ్రహించవలెను. రోగి వద్ద నుండు గంధములను (వాసనలను) ఘ్రాణేంద్రియము ద్వారా గ్రహింపవలెను. ప్రకృత వికృత స్పర్శలను చేతి స్పర్శతో గ్రహింపవలెను. ఈ విధము ప్రత్యక్ష అనుమాన ఆప్తోప దేశముల ద్వారా రోగి పరీక్షను గురించి చెప్పబడినది.

ఆయుర్వేద దీపిక : ప్రేళ్ళ కణుపులకు కూడా స్ఫుటనము వర్తించును. ఇతర శబ్దములు అనగా దగ్గు ఎక్కిళ్లు మొదలైనవి. చక్షువ ప్రత్యక్ష విషయములలో ఇంకనూ చెప్పబడనివి ఆనుట వలస లక్షణము కాంతి మొదలైన వానిని గ్రహింప నగును. పేలు శరీరమునందు ప్రాకుట వలన శరీర విరసత్వమున్నట్లు తెలుసుకొన వలెను. విరసత్వము వలననే యూకలు (పేలు) పడును. అటులనే యూకలు ప్రాక నిచో శరీరము నందు విరసత్వము లేదని అనుమానము ద్వారా గ్రహింపనగును. ధారి లోహితమనగా జీవరక్తము. పిత్తము చేత దూషింపబడని కారణమున రక్తము (జీవరక్తము) రసమునందు మార్పు చెందకుండుట చేతనూ కుక్క, కాకి మొదలైన జంతువులు భక్షించుటకు అనువుగా నుండును. రక్తపిత్తము నందు రక్తము పిత్తముచే దూషింపబడుట వలన కుక్కలు, కాకులు భక్షింప యోగ్యముగా నుండదు. శబ్ద స్పర్శరూప రస గంధముల పరీక్షను చేయవలెనని ఉపదేశించి శబ్ద గ్రహణము తరువాత చక్షురింద్రియ విషయమును వివరించి, శబ్దాది లక్షణ పరీక్ష యందు క్రమ నియమము లేదనుట సూచింపబడినది.

## అనుమానము చేత తెలియదగు విషయములు

8. ఇమే తు ఖల్వన్యేకాప్యేవమేవ భూయోఽనుమానజ్ఞేయా భవన్తి భావాః. తద్యథా అగ్నిం జరణశక్త్యా పరీక్షేత, బలం వ్యాయామశక్త్యా, శ్రోత్రాదీని శబ్దాద్యర్థ గ్రహణేన, మనోఽర్థావ్యభిచరణేన, విజ్ఞానం వ్యవసాయేన, రజః సంగేన, మోహమవిజ్ఞానేన, క్రోధమభిద్రోహేణ, శోకం దైన్యేన, హర్షమామోదేన, ప్రీతిం తోషేణ, భయం విషాదేన, ధైర్యమవిషాదేన, వీర్యముత్థానేన, అవస్థానమవిభ్రమేణ, శ్రద్ధామభిప్రాయేణ, మేధాం గ్రహణేన సంజ్ఞాం నామగ్రహణేన, స్మృతిం స్మరణేన, హ్రియమపత్రపణేన, శీలమనుశీలనేన, ద్వేషం ప్రతిషేధేన, ఉపధిమనుబంధేన, ధృతమలౌల్యేన, వశ్యతాం విధేయతయా, వయోభక్తిసాత్మ్యవ్యాధిసముత్థానాని కాల దేశోపశయావేదనా విశేషేణ, గూఢలింగమ్ వ్యాధిముపశయానుపశయాభ్యాం, దోష ప్రమాణ విశేషమపచార విశేషేణ, ఆయుషః క్షయమరిష్టైః, ఉపస్థిత శ్రేయస్త్వం కల్యాణాభినివేశేన, అమలం సత్వమవికారేణ, గ్రహణ్యాస్తు మృదుదారుణత్వం స్వప్నదర్శనమభిప్రాయం ద్విష్టేష్ట సుఖదుఃఖాని చాతురపరిప్రశ్నేనైవ విద్యాదితి.

తాత్పర్యము : ఇంకా ఇతరములైన ఈ క్రింది భావములను అనుమానము చేత గ్రహింపనగును. ఆహార పాచన శక్తి చేత అగ్నిని, వ్యాయామ శక్తి చేత బలమును, శ్రోత్రాదులను శబ్దాది అర్థములను గ్రహించు సామర్థ్యము చేతను, అర్థములనుండి వ్యాకులత చెందకుండుట. ఇదే విధముగా ఈ క్రింద నుదహరించిన కొన్ని విషయములను ఎక్కువగా అనుమానము ద్వారా గ్రహింపనగును. అవి ఏవి యనగా జీర్ణశక్తివలన అగ్ని (పాచకాగ్ని)ని, శబ్దములను వినుట మొదలైన వాటి వలన శ్రోత్రము (చెవి) మొదలగు ఇంద్రియములను, విషయముల నుండి వ్యాకులత చెందకుండుట వలన మనస్సును (మనోశక్తి) చేయు పనిని బట్టి విజ్ఞానమును, స్త్రీ సహవాసము చేత రజస్సును, విజ్ఞాన లోపము వలన మోహము, ఇతరులకు కీడు తలపెట్టుట వలన క్రోధమును, దైన్యము వలన శోకమును, సంతోషము వలన హర్షము, సంతృప్తి వలన ప్రీతిని, విషాదము వలన భయమును, విషాదము లేకుండుట వలన ధైర్యమును, పని చేయుటకు తలపెట్టుట వలన వీర్యమును, బెదరకుండుట వలన స్థిరబుద్ధిని, ఇష్టమును కోరిక వలన, మేధస్సును గ్రహణశక్తి వలన, సంజ్ఞను పేర్కొనుట వలన, స్మరణమును బట్టి స్మృతిని, తొణకుట వలన సిగ్గును, వస్తువుల యందిష్టమును సేవించు అలవాటును బట్టియు వదలుటను బట్టి ద్వేషమును, తరువాత చేయు పనిని బట్టి గుప్త వేషమును, చలింప కుండుటను బట్టి ధృతిని, విధేయతను బట్టి అణకువను (ఉపశయ అనుపశయము వలన బయటకు కనిపించని లక్షణములు గల రోగమును, చేసిన తప్పును బట్టి దోష ప్రమాణమును, అరిష్టముల వలన ఆయుః క్షయమును) వయస్సు, భోజనము సాత్మ్యము, వ్యాధి, ప్రదేశములను క్రమముగా కాల, దేశ, ఉపశయ, వేదనా విశేషముల వలనను మంచిని కోరుట వలన మంచి కీర్తిని వికారము నొందకుండుట వలన శుద్ధ సత్త్వము (మనస్సు)ను తెలియవచ్చును. గ్రహణి యొక్క మృదు దారుణత్వములు, స్వప్న దర్శనమునకు సంబంధించిన విషయములు, వస్తువుల యందు ఇచ్ఛా ద్వేషములు, సుఖ దుఃఖములు-వీటిని మాత్రము రోగిని ప్రశ్నించియే తెలుసుకొన వీలగును.

ఆయుర్వేద దీపిక : ఎక్కువగా అనుమానము వలన గ్రహింప వీలగును అని చెప్పుట వలన అనుమానము చేత తెలియనగు అగ్నిబలము మొదలగు కొన్నింటిని రోగి చెప్పేదాన్ని బట్టి కూడా తెలియవచ్చునని సూచించుచున్నాడు. అర్థముల నుండి వ్యాకులత చెందకుండుట వలన మనస్సును తెలియుట అనగా— అన్ని ఇన్ద్రియములు తమ తమ అర్థములతో సంబంధము పెట్టుకొని యున్నప్పుడు

యిది ఏదో ఒక శబ్దము అని శ్రోత్రము ద్వారా గ్రహించుచూ తరువాత విడిగా ఇది ఏదో ఒక రసమనియు, ఇట్లు అన్ని ఇన్ద్రియార్థములను అన్నింటిని ఒకేసారి కాకుండా ఒకదాని తరువాత ఇంకొక దానిని గ్రహించుట జరుగును. కాబట్టియే ఇంద్రియములకు తమ అర్థములతో సంయోగ మేర్పడిన తరువాత వానిని గ్రహించునది మనస్సు అని అనుమానము ద్వారా గ్రహింపబడును. జ్ఞానమును వ్యవసాయము ద్వారా అనుట యందు వ్యవసాయమనగా ప్రవృత్తి: త్రాగు నీటిని త్రాగుటకే ఉపయోగించు ప్రవృత్తి ద్వారా జలము యొక్క జ్ఞానము వున్నది అని తెలుసుకొనవలెను. లేనిచో ఆ పనిని ఎట్లు చేయును? స్త్రీలతో సహవాసము చేత రజస్సు ఎక్కువ యని తెలియవలెను, స్త్రీ సహవాసము రజస్సు వలననే యగుట వలన. అభిద్రోహమనగా ఇతరులను పీడించు ప్రవృత్తి. దైన్యము అనగా ఏడ్చుట, దీనముగా నుండుట మొదలైనవి. ఆమోదమనగా నృత్య గీతాదులచే సంబరము చేసికొనుట. సంతోషము (తోషము) ముఖ ప్రసన్నత వలన తెలియునది. అందువలన ప్రీతి యనునది సంతోషము ద్వారా ప్రకటిత మగునది. హర్షమనునది ప్రీతియొక్క విశేషము. ఇది మనస్సును ఉద్రేక పెట్టునది అని చెప్పబడినది. ధైర్యమనగా విపత్తునందును మనస్సు కలవరపడకుండుట. వీర్యమనునది - ఆరంభించిన దుష్కరమైన పనిని వదలకుండా మనస్సు లగ్నము చేసి యుంచుట. ఉత్థానము - పనిని ప్రారంభించుట. అవస్థానము స్థిరచిత్తము కలిగి యుండుట అవిభ్రమము- భ్రాంతి నొందక యుండుట. శ్రద్ధ యనునది-ఇష్టము-స్మృతి యనగా స్మరణశక్తిని కలిగించు సంస్కారము. స్మరణశక్తి కలిగి యుండుటకు కారణము ఆ స్మృతియనెడి సంస్కారమే. హ్రీ యనగా సిగ్గు. అపత్రపణ-సిగ్గుతో కుంచించుకు పోయినట్లుండుట వలన - శీలమనగా వస్తువుల యందు సహజమైన యిష్టము అను శీలనము అనగా ఎల్లప్పుడు సేవించుట. దాని వలన ఏ వస్తువును ఎల్లప్పుడూ సేవించుచుండునో ఆ వస్తువుపై యిష్టము కలదని గ్రహింపవచ్చును. ప్రతిషేధేన అనగా వదలిపెట్టుట వలన, సేవించక పోవుట వలన ఉపధి యనగా గుప్త వేషము, మారు వేషము (ఉపేత్య ధీయతే ఇతి ఉపధిః). దీనిని అనుబంధము వలన అనగా చేసిన పని వలన, సోదరులను చంపిన తరువాత, ఈ పిచ్చివాని వేషములో నున్నవాడు చంద్రగుప్తుడు అని తెలుసుకొనుట - విధేయత వలన అనగా అణకువగా నడచుకొనుట వలన, వయస్సు మొదలుకొని వ్యాధి సముత్థానము వరకు ఈ నాలిగింటి వలన తెలియనగును. కాలము చేత పదునారు సంవత్సరముల వరకు బాల్యము-ఈ మొదలైన వర్గీకరణమును గ్రహింపవచ్చును. దేశము వలన భోజనమునందు యిష్టా

యిష్టములను తెలియవచ్చును. ఉదాహరణకు ఇతడు మధ్య ప్రాంతమునుండి వచ్చిన వాడగుట చేత గోధుమలను, మినుములను ఎక్కువగా భుజించుననెడి అనుమాన జ్ఞానము కలుగుట - ఈ పదార్థము ఇతనికి సరిపడుట వలన ఇతనికిది సాత్మ్యము అని గ్రహించుట - సంతాప ముండుట వలన జ్వరమున్నదని గ్రహించుటచే, బాధను బట్టి వ్యాధిని తెలియుట. పూర్తిగా కనపడని లక్షణములు కలవ్యాధిని ఉపశయ అనుపశయముల ద్వారా తెలియవలెనను‌ట చేత స్పష్టముగా తెలియుచున్న లక్షణ ములు గల వ్యాధియందు ఉపశయానుపశయముల ప్రయోగము అనవసరమని తెలియ వలెను. అపచార విశేషము అనగా పెద్ద అపచారముచే అధిక దోషము, కొద్ది అప చారము చేత స్వల్పదోషము కలుగును. మంచిని కోరుట యనగా మంచి మార్గము నవలంబించుట, దీని వలననే అచిరకాలము నందు మంచి కీర్తి కలుగును. సత్త్వము అనగా సత్త్వగుణమును ఎక్కువగా కలిగి యుండుట. అవికారము (వికారము చెంద కుండుట) అనగా రాగద్వేషములు లేకుండుట, రోగిని ప్రశ్నించుట ద్వారా-అనుట చేత గృహాణి యొక్క మృదుత్వము మొదలైనవి అనుమానము ద్వారా గ్రహింప దగినవైననూ అనుమానజ్ఞానము ఎక్కువ కష్టముతో కూడి యుండుటచేత రోగిని ప్రశ్నించియే ఈ విషయములను తెలుసుకొనవలెనని తెల్పబడినది. అభిప్రాయము, భోజనాదుల యందు ఇచ్ఛ, ద్వేషము, ఇష్టము అనుట వలన వస్తువుల యందు కలి గెడు ఇష్టాయిష్టములను తెలిసికొనుట యని గ్రహింపవలెను.

## త్రివిధ పరీక్షలనుపయోగించి వ్యాధులను తెలిసికొనుట వలన కలుగు శుభఫలితము.

భవన్తి చాత్ర

9. ఆప్తతశ్చోపదేశేన ప్రత్యక్షకరణేన చ,
అనుమానేన చ వ్యాధీన్ సమ్యగ్విద్యాద్విచక్షణః

10. సర్వదా సర్వమాలోచ్య యథాసంభవమర్థవిత్,
అథాధ్యవస్యేత్తత్త్వే చ కార్యే చ తదనన్తరమ్,

11. కార్యతత్త్వ విశేషజ్ఞః ప్రతిపత్తౌ న ముహ్యతి
అమూఢః ఫల మాప్నోతి యదమోహనిమిత్తజమ్.

12. జ్ఞానబుద్ధి ప్రదీపేన యో నావిశతి తత్త్వవిత్,
ఆతురస్యాన్తరాత్మానం న స రోగాంచికిత్సతి.

## అధ్యాయసంగ్రహము

తత్రశ్లోకౌ :

13. సర్వరోగ విశేషాణాం త్రివిధం జ్ఞానసంగ్రహం,
యథా చోపదిశన్త్యాప్తాః ప్రత్యక్షం గృహ్యతే యథా.

14. యే యథా చానుమానేన జ్ఞేయాస్తాంశ్చాప్యుదారధీః,
భావాంస్త్రిరోగవిజ్ఞానే విమానే మునిరుక్తవాన్.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే విమానస్థానే త్రివిధరోగ విశేష విజ్ఞానీయం విమానం నామ చతుర్థోఽధ్యాయః.

**తాత్పర్యము :** వివేకవంతుడైనవాడు వ్యాధులను ఆప్తోపదేశ, ప్రత్యక్ష అనుమానములచేత సరిగా తెలిసికొనవలెను. పీలైనంతవరకు అన్ని విధములుగను వ్యాధి తత్త్వమును పరీక్షించి తెలిసికొని ఆపై చేయదగిన కార్యము (చికిత్స)ను అధ్యయనము చేయవలెను. కార్య తత్త్వ విశేషమును తెలిసి కొనినవాడు ఫలము నందు అపజయము పొందడు. మోహరహితుడు మోహము లేకపోవుట వలన కలుగు జ్ఞానమును పొందును. జ్ఞానబుద్ధి యనెడు ప్రకాశము చేత రోగి యొక్క అంతరాత్మను (శరీరము నందలి పరిస్థితిని) చూడలేనివాడు రోగములను చికిత్సింప జాలడు.

అన్ని రోగములను తెలిసికొనుటకు సంగ్రహముగా మూడు మార్గములు న్నవి. అవి ఆప్తోపదేశము, ప్రత్యక్షము మరియు అనుమానము. రోగ విజ్ఞానమును కలిగించు భావములను మునిసత్తముడు త్రిరోగ విజ్ఞాన విమానమునందు వివ రించెను.

ఇది అగ్నివేశునిచే రచింపబడి చరకునిచే ప్రతి సంస్కరింపబడిన విమాన స్థానము నందలి త్రివిధరోగ విశేష విజ్ఞానీయ విమాన మనెడి నాల్గవ అధ్యాయము.

ఆయుర్వేద దీపిక : పీలైనంత వరకు అనుట చేత అన్ని చోట్లను, అన్ని ప్రమాణముల చేతను పరీక్ష చేయుట సాధ్యపడదనుట సూచింపబడుచున్నవి. అథః....ప్రతియొక్క శబ్దము యొక్క విషయమును పరీక్ష చేసిన తరువాత తత్త్వము నందు అనగా వ్యాధి తత్త్వము నందు మరియు పని యందును సాధ్యమైన వ్యాధి

యందు చేయదగిన కర్తవ్యము నందును తదుపరి విచక్షణను చేయవలెను. చెప్పబడిన తత్త్వము (వ్యాధితత్త్వము) తదనుగుణమైన కర్తవ్యము నందును పరిశీలన చేసి నిశ్చయము చేయవలెనని అర్థము. అనన్తరమనగా తేడా తెలియని అని అర్థము. కార్యతత్త్వ విశేష వివేచన వలన కలుగు ఫలమును కార్యే .... — అను వాక్యము ద్వారా చెప్పుచున్నాడు ప్రతిపత్తియనగా పనులను వాటి అర్హతను బట్టి చేయుట. అమూఢుడు అనగా ప్రతిపత్తి యందు మోహరహితుడు అజ్ఞానరహితుడు అని అర్థము. జ్ఞానము-శాస్త్రము దాని వలన వచ్చు బుద్ధి జ్ఞానబుద్ధి. అవిశతి అనగా బుద్ధి చేత గ్రహించును అని అర్థము. అంతరాత్మను అనగా రోగి యొక్క అంతః శరీరము.

ఇది శ్రీ చక్రపాణి దత్తునిచే రచింపబడిన ఆయుర్వేద దీపికయను చరక తాత్పర్యటీకలోని విమాన స్థానమందలి త్రివిధరోగ విశేష విజ్ఞానీయమనెడి నాల్గవ అధ్యాయము.

—o—

# స్రోతో విమానము

## పంచమాధ్యాయము

1. అథాతః స్రోతసాం విమానం వ్యాఖ్యాస్యామః.
2. ఇతి హ స్మాహ భగవానాత్రేయః.

**తాత్పర్యము :** ఇక స్రోతో విమానమును గురించి చెప్పుకొందము- అని ఆత్రేయ భగవానుడు వచించెను.

**చక్రపాణి :** క్రిందటి అధ్యాయము నందు పరీక్షా విధములను తెలిపి ఆ విధానములచే పరీక్షింపవలసిన శరీరము నందలి స్రోతస్సుల యొక్క సమస్థితి వికృత స్థితులను వివరించుటకు స్రోతో విమానమును చెప్పుచున్నాడు.

### స్రోతస్సుల ప్రకారములు - స్రోతో శబ్దమునకు అర్థము

3. యావన్తః పురుషే మూర్తిమన్తో భావవిశేషాస్తావన్త ఏవాస్మిన్ స్రోతసాం ప్రకారవిశేషాః సర్వే హి భావా పురుషే నాన్తరేణ స్రోతాంస్యభినిర్వర్తన్తే, క్షయం వాఽప్యభిగచ్ఛన్తి. స్రోతాంసి ఖలు పరిణామమాపద్యమానానాం ధాతూనామభివాహీని భవన్త్యయనార్థేన.

**తాత్పర్యము :** పురుషుని యందు ఎన్ని మూర్తిమంత భావరూప వస్తువు లున్నవో అన్ని ప్రకారముల స్రోతస్సులు వున్నవి. పురుషునిలోని భావములన్నియు స్రోతస్సుల వలననే ఉద్భవించుట లేదా క్షీణించుట జరుగును. అసలు స్రోతస్సులు పరిణామము చెందుచున్న ధాతువులను ఒక చోటు నుండి మరియొక చోటికి తీసుకొని పెళ్ళునట్టివి. ఇవి వహన వాహనమునకు పనికి వచ్చునట్టివి.

**ఆయుర్వేద దీపిక :** మూర్తి మంత మనగా - అన్ని చోట్లను లేని (నిర్దిష్ట స్థానము కలిగిన) ద్రవ్యరూపములైన ఆకారములు అని అర్థము. ఎందుచేత ననగా ద్రవ్యపరిణామము గల ఆకారములు సర్వప్రదేశములను వ్యాపించియుండక నిర్దిష్టమైన స్థానమునందే యుండునవి. భావ విశేషములనగా ఉత్పత్తి మైన వస్తు విశేషములు. సర్వే....అను వాక్యము వలన దీనికి హేతువు చెప్పబడుచున్నది. అభి

నిర్వర్తన్తే....అనగా పుట్టించుచున్నవి. ఇది సంతాన న్యాయమును సూచించును. ఖలు శబ్దము హేతువును వక్కాణించుచున్నది. పరిణామమును పొందుచున్న అనగా తమ పూర్వ రూపములైన రసము మొదలైన స్థితులను వదలి ఉత్తరోత్తరగతా జనించు రక్తాది స్థితులను పొందుచున్న ధాతువులు యని అర్థము.అయనార్థేన.. అనుటచే స్థిరములైన ధాతువులను స్రోతస్సులు తమ యందు ప్రవహింప జేయవు. కాని వేరొక ప్రదేశమునకు ధాతువులను తీసుకొని వెళ్ళుపనిని అవి చేయును. రక్త రూపముగా పరిణమించిన రసము కలియుట వలన రక్తము యొక్క వృద్ధి యగునని అనుకొందము. అట్టి తరి వేరు స్థానము నందున్న రసమును తెచ్చి రక్తము నందు కలుపు గమన మార్గమును కూడ స్రోతస్సనియే వ్యవహరింతురు. ఇక్కడ ఒక ముఖ్య విషయము గలదు — స్రోతస్సులందు ఎక్కువగా ఉత్తర ధాతుపోషక భాగము యొక్క పరిణామమే రక్తాది ధాతువులుగా మారుచున్నది. అదియును ఉత్తర ధాతుపోషణమనునది స్రోతస్సుల వలననే జరుగును. రక్తధాతు పరిణామము నందు ఏ విధమైన న్యాయమున్నదో అదియే ఇతర ధాతువులకును వర్తించును. అంతేగాని ఇతరములైన స్రోతస్సులద్వారా ఇతర ధాతువుల పరిణామము జరగదు. (అనగా మేదోవహస్రోతస్సుల ద్వారా రక్త ధాతు లేదా మాంస ధాతు పరిణామము జరుగకపోవుట మొదలైనవి) ఆయా ధాతువుల స్థానములు భిన్నమైన వగుట చేత యిది జరుగదు. ఒక ప్రదేశము నందున్న చెట్లకు మరియొక చోటనున్న స్రోతస్సు ద్వారా సేచనము జరుగదు. మనస్సు నిత్యమైన దగుట వలన పోషణ అనునది దీనికి లేకపోయినప్పటికీ ఇంద్రియములున్న చోట్లకు ప్రవేశించుటకు ఇది స్రోతస్సులున్నవనియే అనుకొనవలెను.//మనస్సు మొదలైన అతీంద్రియములకు శరీరమంతయును స్రోతోరూపమై యుండును.// (అనగా ఇవి శరీరము నందెచటికైననూ వ్యాపించగలవు) దోషములకు సర్వ శరీర వ్యాపకత్వముండుటచే వాటికి ప్రత్యేక స్రోతస్సులను చెప్పకపోయినప్పటికీ అన్ని స్రోతస్సులనూ దోష వహాకములుగానే పనిచేయునని తెలియవలెను. సూక్ష్మ పరిశీలన వలన వాతాదులకును ప్రత్యేక ధమనులను గుర్తించుట జరిగినది. సుశ్రుత శరీరములోని 7వ అధ్యాయమున - తాసాం వాత వాహిన్యోదశ.... అని చెప్పి దోషములకు ప్రత్యేక ధమనులను గుర్తించుట జరిగినది. చరకము నందు సుశ్రుత సంహితలో వలె ధమనీ సిరా స్రోతస్సుల వివిధ భేదములు చెప్పబడి యుండలేదు.

## పురుషులు స్రోతోమయుడనుట

4. అపి చైకే స్రోతసామేవ సముదయం పురుషమిచ్ఛన్తి, సర్వగతత్వాత్ సర్వసరత్వాచ్చ దోషప్రకోపణ ప్రశమనానాం న త్వేతదేవం, యస్య హి స్రోతాంసి, యచ్చ వహన్తి, యచ్చావహన్తి, యత్ర చావస్థితాని, సర్వం తదన్యత్తేభ్యః, అతిబహుత్వాత్ ఖలు కేచిదపరిసంఖ్యేయాన్యాచక్షతే స్రోతాంసి, పరిసంఖ్యేయాని పునరన్యే.

**తాత్పర్యము :** కొందరు స్రోతస్సుల సముదాయమే పురుషుడని యందురు. స్రోతస్సులు సర్వశరీరమందునను వ్యాపించియుండుట వలన దోష ప్రకోపక-దోషశామిక పదార్థములను సర్వశరీరమునందును ప్రసరింపజేయుట వలన ఇట్లను కొందురు. కానీ ఇది సరికాదు. ఎందుచేతననగా ఈ స్రోతస్సులు ఎవరికి సంబంధించినవో (దేనిచే నిర్మించబడినవో) దేనిని ఇవి ప్రవహింపజేయునో, ఎవనిని ఆక్రమించియుండునో, ఎక్కడ ఇవి స్థిరముగా నుండునో అది అంతయును స్రోతస్సులకు భిన్నమైన దగుట చేత పురుషునకు, స్రోతస్సులును ఒకటిగా తలంపరాదు. ఇవి ఎక్కువగా నుండుట వలన లెక్కించుటకు మిక్కుటముగా నున్నవని కొందరందురు. వీటికి నిర్ణీతమైన సంఖ్య కలదని కొందరి యభిప్రాయము.

**ఆయుర్వేద దీపిక :** అంతటా వ్యాపించి యుండుటచే అనగా శరీరము నందలి అన్ని అవయవముల యందును వ్యాపించి యుండుటచే అని అర్థము. అన్నింటినీ ప్రవహింపజేయుట యనుట తరువాత వాక్యమునకు అన్వయించును. అపథ్యము దోష ప్రకోపమును, పథ్యము దోష శమనమును కల్గించును. సర్వశరీరము నందును దోషము ప్రసరించునట్లే భేషజమును ప్రసరించును. కావున అన్ని చోట్లనూ స్రోతస్సులున్నట్లు తెలియుచున్నది. అందుచేత పురుషుడు స్రోతోమయుడై యున్నాడనుట పూర్వ పక్షము నందు స్థాపింపబడుచున్నది. న త్వేతదేవం....అనుట వలన ఈ వాదమును ఖండించుచున్నాడు.

ఈ స్రోతస్సులు దేనివలన నిర్మింపబడినవో (ఎవరికి చెందినవో) దేనిని వహించుచున్నవో అనగా ఏ రసము మొదలైన వానిని ప్రవహింప జేయుచున్నవో, దేనిని అవహించుచున్నవో అనగా దేనికి పుష్టిని కలుగజేయుచున్నవో అని యర్థము. ఎక్కడ వున్నవో అనగా ఏ మాంసము మొదలైనవాటితో బంధింపబడి స్థిరముగా నున్నవో అని యర్థము. ఇవి అన్నియును స్రోతస్సులు కావు. కాబట్టి పురుషుడు స్రోతస్సుల సముదాయము మాత్రమే యనుట సరికాదు.

## స్థూల స్రోతస్సుల సంఖ్య - వాటి పేర్లు

5, 6, 7. తేషాం తు ఖలు స్రోతసాం యథాస్థూలం కతిచిత్ప్రకారాన్మూలతశ్చ ప్రకోపవిజ్ఞానతశ్చాఽనువ్యాఖ్యాస్యామః, య భవిష్యన్త్యలమనుక్తార్థజ్ఞానాయ జ్ఞానవతాం, విజ్ఞానాయ చాఽజ్ఞానవతామ్ తద్యథా - ప్రాణోదకాన్నరసరుధిరమాంసమేదోఽస్థిమజ్జశుక్రమూత్రపురీషస్వేదవహానీతి. వాతపిత్తశ్లేష్మణాం పునః సర్వశరీరచరాణాం సర్వస్రోతాంస్యయనభూతాని, తద్వదతీన్ద్రియాణాం పునః సత్త్వాదీనాం కేవలం చేతనావచ్ఛరీరమయనభూతమధిష్ఠానభూతం చ తదేతత్స్రోతసాం ప్రకృతిభూతత్వాన్న వికారైరుపసృజ్యతే శరీరమ్.

తాత్పర్యము : ఈ స్రోతస్సుల యొక్క వివిధ భేదములను వాటి మూలమును బట్టి వాటి ప్రకోప విశేషమును బట్టియు వివరముగా తెలుసుకొందుము. ఇది జ్ఞాన సంపన్నులైన వైద్యులు స్రోతో విషయమును తెలియకుండుటచేత వారి జ్ఞానాభివృద్ధికిని, ఏమియు తెలియని వారికి విజ్ఞానము కొరకును ఉపయోగపడును. స్రోతస్సులు 1) ప్రాణవహములు, 2) ఉదకవహములు, 3) అన్నవహములు, 4) రసవహములు, 5) రక్తవహములు, 6) మాంసవహములు, 7) మేదోవహములు, 7) అస్థివహములు, 9) మజ్జావహములు, 10) శుక్రవహములు, 11) మూత్రవహములు, 12) పురీష వహములు, 13) స్వేదవహములు. (ఇవి ప్రాణవహ స్రోతస్సులు, ఉదకవహ స్రోతస్సులు.... ఈ విధముగా పిలువబడును) అనునవి. అటుపైన వాత పిత్త శ్లేష్మములు సర్వ శరీరమునందు సంచరించునవి. ఇవి అన్ని స్రోతస్సుల ద్వారానూ పయనించునట్టివి. అదేవిధముగా అతీంద్రియములైన సత్వము (మనస్సు) మొదలైనవి చేతనావంతమైన శరీరమునందే యుండుట, దానియందే తమ గమనము కలిగియుండుట జరుగుచున్నది. ఇట్టి స్రోతస్సులు శరీరమునందు ప్రాకృతికముగా యుండుటవలన శరీరమున కెట్టి వికారమున్నూ కలుగదు.

ఆయుర్వేద దీపిక : ప్రకోప విశేషమునుబట్టి అనగా స్రోతస్సులకు ప్రకోపమును ఏ విధముగా తెలుసుకొందుమో ఆ విధముగా అని అర్థము. తెలియని విషయమును తెలుసుకొనుటకు అనగా స్రోతస్సులను గురించి ఇంతకు పూర్వము తెలియనివారో వాటిని గురించి తెలుసుకొనుటకు అని యర్థము. జ్ఞానవంతులకు అనగా

చెప్పబడని విషయములను గురించి తెలుసుకొన గలిగినవారు. జ్ఞానవంతులు ఈ చెప్ప బోవు లక్షణములను బట్టి స్రోతస్సులను అనుమానము ద్వారా తెలిసికొందురు. తెలి యనివారికి తెలియబరచుటకు చెప్పినంతవరకే తెలిసికొనుటకు, మందబుద్ధి గలవారికి అదేవిధముగా అనగా సర్వ శరీరమునందు సంచరించు వానికి ఉద్దేశించబడినది. చేతనావంతమైన శరీరము అనగా అచేతనములైన కేశనఖాది ప్రదేశములందు సత్త్వము మొదలైనవాని ప్రవేశమును నిషేధించుచున్నాడు. దోషములు మాత్రము అక్కడకు కూడా వెళ్ళునని అర్థము. అయనభూతము (వహించునది) అనగా మార్గ మైనట్టిది. అధిష్ఠాన భూతమనగా స్థానమైనట్టిది.

## ప్రాణవహాది స్రోతస్సుల మూలములు మరియు దుష్టి లక్షణములు

8. తత్ర ప్రాణవహానాం స్రోతసాం హృదయం మూలం మహాస్రోతశ్చ. ప్రదుష్టానాం తు ఖల్వేషామిదం విశేషజ్ఞానం భవతి: తద్యథా-అతిసృష్టమతి-బద్ధం కుపితమల్పాల్పమభీక్ష్ణం వా సశబ్దశూలముచ్ఛ్వసన్తం దృష్ట్వా ప్రాణవహాన్యస్య స్రోతాంసి ప్రదుష్టానీతి విద్యాత్.

ఉదకవహానాం స్రోతసాం తాలుమూలం క్లోమ చ. ప్రదుష్టానాం తు ఖల్వేషామిదం విశేషవిజ్ఞానం భవతి: తద్యథా-జిహ్వాతాల్వోష్ఠకణ్ఠక్లోమశోషం పిపాసాం చాతిప్రవృద్ధాం దృష్ట్వోదకవహాన్యస్య స్రోతాంసి ప్రదుష్టానీతి విద్యాత్.

అన్నవహానాం స్రోతసామామాశయో మూలం వామం చ పార్శ్వమ్. ప్రదుష్టానాం తు ఖల్వేషాం ఇదం విశేషజ్ఞానం భవతి. తద్యథా అనన్నాభిలషణ-మరోచకావిపాకౌ ఛర్దిం చ దృష్ట్వాన్నవహాన్యస్య స్రోతాంసి ప్రదుష్టానీతి విద్యాత్.

రసవహానాం స్రోతసాం హృదయం మూలం దశ చ ధమన్యః శోణితవహా-నాం స్రోతసాం యకృన్మూలం ప్లీహా చ. మాంసవహానాం చ స్రోతసాం స్నాయు మూలం త్వక్ చ. మేదోవహానాం స్రోతసాం వృక్కౌ మూలం వపావహనం చ. అస్థివహానాం స్రోతసాం మేదో మూలం జఘనం చ. మజ్జావహానాం స్రోతసామస్థీని మూలం సన్ధయశ్చ-శుక్రవహానాం స్రోతసాం వృషణౌ మూలం శేఫశ్చ.... ప్రదుష్టానాం తు ఖల్వేషాం రసాదివహా-స్రోతసాం విజ్ఞానాన్యుక్తాని వివిధాశితపీతీయేఽధ్యాయే - యాన్యేవ హి

ధాతూనాం ప్రదోషవిజ్ఞానాని తాన్యేవ యథాస్వం ప్రదుష్టానాం ధాతుస్రోతసామ్. మూత్రవహానాం స్రోతసాం బస్తిర్మూలం వఙ్క్షణౌ చ, ప్రదృష్టానాం తు ఖల్వేషామిదం విశేషవిజ్ఞానం భవతి. తద్యథా అతిసృష్టమతిబద్ధమ్ కుపిత-మల్పాల్పమభీక్ష్ణం వా బహులం సశూలం మూత్రయన్తం దృష్ట్వా మూత్ర-వహాన్యస్య స్రోతాంసి ప్రదృష్టానీతి విద్యాత్....

పురీషవహానాం స్రోతసాం పక్వాశయో మూలం స్థూలగుదం చ పదృష్టానాం ఖల్వేషా మిదం విశేషవిజ్ఞానం భవతి. తద్యథా-కృచ్ఛ్రేణాల్పాల్పం సశూలమతిద్రవ-మతిగ్రథితమతిబహు చోపవిశన్తం దృష్ట్వా పురీష-వహాస్యస్య స్రోతాంసి ప్రదృష్టానీతి విద్యాత్.

స్వేదవహానాం స్రోతసాం మేదో మూలం రోమకూపశ్చ.ప్రదృష్టానాం తు ఖల్వేషా మిదం విశేషవిజ్ఞానం భవతి తద్యథా-అస్వేదనమతిస్వేదనం పారుష్యమతిశ్లక్ష్ణతామఙ్గస్య పరిదాహం లోమహర్షంచ దృష్ట్వా స్వేదవహా-న్యస్వ స్రోతాంసి ప్రదృష్ట్యానీతి విద్యాత్.

**తాత్పర్యము :** వీటియందు ప్రాణవహ స్రోతస్సులకు మూలము హృదయము మరియు మహాస్రోతస్సు. ఈ క్రింది లక్షణముల వలన ప్రాణవహ స్రోతస్సులు ప్రదృష్టములైనవని గ్రహింపనగును. ఎక్కువగా ప్రవహించుట, బంధింపబడియుండుట, కోపించినట్లుండుట, కొంచెము కొంచెముగా గాలిని వదలుట, మాటిమాటికినీ నొప్పితో శబ్దముతో గాలిని పీల్చి వదలువానిని చూచి అతని ప్రాణవహ స్రోతస్సులు దూషింపబడినవని యెరుంగవలెను.

ఉదకవహ స్రోతస్సుల మూలము తాలుపు మరియు క్లోమము. నాలుక, అంగిలి (తాలుపు) పెదవులు, కంఠము మరియు క్లోమనలికా ఇవి యన్నియునూ ఎండిపోయినట్లుండి అతిగా దప్పికను కలిగియున్న పురుషునికి అతనికి ఉదకవహ స్రోతస్సులు దూషింపబడియున్నవని గ్రహింపవలెను.

అన్నవహ స్రోతస్సులకు ఆమాశయము మరియు వామ పార్శ్వము మూలము. అన్నమునందిచ్ఛ లేకుండుట, అరుచి, అజీర్ణము, వాంతి కల్గుట ఈ లక్షణములున్న వ్యక్తి యొక్క అన్నవహ స్రోతస్సులు దూషితములైనవని గ్రహింపవలెను.

రసవహ స్రోతస్సులకు హృదయము మరియు పది ధమనులు మూలముగా నున్నవి. రక్తవహ స్రోతస్సులకు మూలము యకృత్తు మరియు ప్లీహ. మాంసవహ స్రోతస్సులకు స్నాయువు మరియు చర్మము మూలములైయున్నవి. మేదోవహ స్రోతస్సులకు వృక్కలు మరియు వపావహనము మూలము. అస్థివహ స్రోతస్సులకు మేదస్సు మరియు జఘనము మూలము. మజ్జవహ స్రోతస్సుల మూలము అస్థులు మరియు సంధులు. శుక్రవహ స్రోతస్సులకు వృషణములు మరియు మేఢ్రము మూలమైయున్నవి. ఈ రసాది ధాతువులు ప్రదృష్టములైనప్పుడు కలుగు లక్షణములు సూత్రస్థానమునందలి వివిధాశితపీతీయాధ్యాయము (చ.సూ. 28) నందు పొందు పరచబడినవి. ధాతువులకు ఒక్కొక్కదానికి దూషిలక్షణములు ఏవైతే చెప్పబడి యున్నవో అవియే ఆ యా ధాతువహ స్రోతస్సుల దూషిత లక్షణములుగా గ్రహింప వలెను.

మూత్రవహ స్రోతస్సులకు మూలము వస్తి మరియు వంక్షణములు, (గజ్జలు). మూత్రమును అధికముగా స్రావము చేయుచున్నను, అసలు స్రావము చేయకున్ననూ, ప్రకోపించి, కొంచెము కొంచెముగా, మాటిమాటికిని, ఎక్కువగా నొప్పితో కూడి స్రావము చేయుచున్నవాని యొక్క మూత్రవహ స్రోతస్సులు ప్రదూషితములైనవని గ్రహింపనగును. పురీషవహ స్రోతస్సుల మూలము పక్వాశయము మరియు స్థూల గుదము. కష్టముగా కొంచెము కొంచెముగా శబ్దము బాధతో కూడి అతిద్రవ మూర్తముగను, కఠినముగను (గట్టిగను) ఎక్కువ పరిమాణములో పురీషమును వదలు వానిని జూచి అతని పురీషవహ స్రోతస్సులు దోషింపబడినవని గ్రహింప నగును. స్వేదవహ స్రోతస్సులకు మేదస్సు మరియు రోమ కూపములు మూలము. చెమట పట్టకుండుట, అతిగా చెమట పట్టుట, చర్మము కఠినముగను, దిద్దుగా, మంటతో కూడియుండుట గగుర్పాటు కలుగుట, ఈ లక్షణములున్నవాని యొక్క స్వేదవహ స్రోతస్సులు దూషితములైనవని తెలియవలెను.

ఆయుర్వేద దీపిక : ప్రాణవహములు అనగా ప్రాణసంజ్ఞకమైన వాయువును వహించునవి. ఇది ముఖ్యముగా ప్రాణమను పేరుగల వాయువును వహించు ప్రత్యేకమైన స్రోతస్సు. సామాన్యముగా వాయువునకు అన్ని ధమనులును వాహకములని చెప్పుటకు అభ్యంతరము లేదు. మూలమునగా పుట్టువోటు. అతిసూక్ష్మ అతి[illegible]ములు విచ్ఛిన్నముచేత గ్రహింపబడ[illegible] ఈ రెండును ఒకే సమయమున

సంభవింపవు. గావున వీటిని వేరు వేరు పరిస్థితులుగానే తెలియవలెను. అల్పముగా మరియు తీక్ష్ణముగా అనునవి కూడా వేర్వేరుగనే గ్రహింపవలెను. క్లోమము హృదయమునందలి పిపాసాస్థానము. వపా యనగా ఉదరమునందలి స్నిగ్ధమైన వర్తివంటిది. దానినే జనులు తైలవర్తికా యందురు. సుశ్రుతమునందు మేదోవహ స్రోతస్సులకు వృక్కలు మరియు కటిస్థానములు మూలముగా చెప్పబడినవి. ఇది అతీంద్రియజ్ఞానము ద్వారా తెలుసుకొను విషయమగుటచే ఇది ఇదమిత్థముగా చెప్ప నలవికాదు. అస్థిధాతువు కూడా ద్రవరూపమున ఉన్నప్పుడు స్రోతస్సుల ద్వారానే ప్రసరింపబడునది గావున అస్థివహ స్రోతస్సులు కూడా పేర్కొనబడినవి. వివిధాశిత పీతీయాధ్యాయమునందు రసాది ధాతువుల దుష్టి లక్షణములు చెప్పబడినవి. తద్వాహకములైన స్రోతస్సులను గురించి చెప్పి యుండలేదు. అయినప్పటికీ రసాది వహస్రోతస్సుల విజ్ఞానముల గురించి చెప్పబడిన దనుటలో రసాది ధాతువుల వైకృతము తద్వాహక స్రోతస్సుల వైకృతముగా సామాన్యార్థమునందు చెప్పబడినది. రసాది వాహక ధమనులయొక్క వైకృతము ఆయా ధాతువుల వైకృతము రెండునూ ఒకటిగా చెప్పువారు వేర్వేరుగా ధాతుస్రోతోదృష్టి లక్షణములను చెప్పి యుండలేదు. ఇంకను ధమనులు దూషింపబడుట వలన ఆ యా ధాతువులును ఆ యా ప్రకోపస్థానములనుబట్టి దూషింపబడుటచేత రెండింటి దుష్టిని అభిన్నముగా చూచెదరు. ధమనులు దూషింపబడుటవలన ఆ యా ధాతువులును దృష్టి చెందుటచేసి ధాతుదుష్టి లక్షణములే ఆ యా ధమనుల దృష్టి లక్షణములుగా చెప్పబడినవి. రక్త ధాతు దుష్టి లక్షణములు చెప్పక ఆ ధమనీ దుష్టిని గురించి చెప్పినప్పుడు అతి ప్రవృత్తి మొదలగు రక్తదుష్టి లక్షణములే చెప్పబడినవి. అస్వేదనము మొదలైన స్వేదవహ స్రోతస్సుల దుష్టి లక్షణములు కుష్ఠరోగమునకు పూర్వ రూపములుగా కూడా చెప్పబడియున్నవి. దీనివలన కుష్ఠరోగమునకు చెప్పబడిన ఇతర పూర్వ రూపములతోబాటు అస్వేదనాదులుండుట వలన కుష్ఠ పూర్వ రూపములను నిశ్చ యించవలెను. ఈ లక్షణముల వలననే స్వేదోవహ స్రోతస్సుల దుష్టిని నిర్ణయించ వలెను. ధమనులయొక్క మూలమును తెలుసుకొనుటవలన ప్రయోజనము చెప్పబడి యుండకపోయిననూ మొదలునరికిన చెట్టువలె ధమనులునూ మూలమువద్ద దెబ్బ తిన్నప్పుడు నశించును అని తెలియవలెను. అందువలననే సుశ్రుతమునందు స్రోతో మూలములవద్ద శస్త్రములచే పొడిచినపుడు కలుగు లక్షణములు వివరింపబడినవి.

## స్రోతోపర్యాయ నామములు

9. స్రోతాంసి సిరా ధమన్యో రసాయన్యో నాడ్యః పన్థానో మార్గాః శరీరచ్ఛిద్రాణి సంవృతాసంవృతాని స్థానాని ఆశయాః నికేతాశ్చేతి శరీరధాత్వవకాశానాం లక్ష్యాలక్ష్యాణాం నామాని భవన్తి. తేషాం ప్రకోపాత్ స్థానాస్థానస్థాశ్చైవ శరీర ధాతవః ప్రకోపమాపద్యన్తే. ఇతరేషాం చ ప్రకోపాది తరాణి. స్రోతాంసి స్రోతాంస్యేవ, ధాతవశ్చ ధాతూనేవ ప్రదూషయన్తి ప్రదుష్టాః. తేషాం సర్వేషామేవ వాత పిత్త శ్లేష్మాణో ప్రదుష్టా దూషయితారో భవన్తి దోష స్వభావాదితి.

**తాత్పర్యము :** స్రోతస్సులు, సిరలు, ధమనులు, రసాయనులు, రస వాహినులు, నాడులు, పంథానములు, మార్గములు, శరీర ఛిద్రములు, సంవృతా సంవృతములు, స్థానములు, ఆశయములు, నికేతములు — ఇవి ధాతువుల యొక్క కనిపించు మరియు కనిపించని శూన్యస్థానముల (అవకాశముల పేర్లు). వీటి ప్రకోపమువలన, వీటియందే యుండుటవలన, వీటియందే సంచరించుటవలనను శరీర ధాతువులను ప్రకోపించును. ఇతర స్రోతస్సు ధాతువులనుకూడా ప్రకోపింప జేయును. ప్రకుపితములైన స్రోతస్సులు ఇతర స్రోతస్సులనే ప్రకోపింపజేయును. అట్లే ప్రకుపితములైన ధాతువులు యితర ధాతువులనే ప్రకోపింపజేయును. ఈ ధాతు స్రోతస్సులను దూషింప జేయునవి దుష్టములైన వాత పిత్త శ్లేష్మములే. దూషింప జేయు స్వభావము కేవలము ఈ మూడింటికే యుండుట వలన అట్లు జరుగుచున్నది.

**ఆయుర్వేద దీపిక :** స్రోతస్సులకు వ్యవహారార్థము స్రోతాంసి (స్రోత స్సులు) మొదలైన పర్యాయములు చెప్పబడినవి. సంవృతా సంవృతములు అనునది ఒక పేరు. ఇది చివరల యందు సంవృతములు (ఒకదాని నొకటి పెనవేసుకుని యుండునవి) మూలమునందు అసంవృతములు (ఒక్కటిగనే యుండునవి). స్థానము మొదలైన (స్థానము, ఆశయము, నికేతము) పర్యాయములు ధమనీ మూలము యొక్క పర్యాయములుగా చెప్పుదురు. ధమనులున్నూ రసము మొదలగువాటికి స్థానమై యున్నందున మరికొందరు ఈ పేర్లను కూడా ధమనులకు పర్యాయములుగా వ్యవహరింతురు. స్థానము నందున్నవి అనగా ఆశయము నందున్నవి అని అర్థము. మార్గమునందు వెళ్ళునవి అనగా ధమనులలో ప్రవహించునవి. ఇతరేషాం అను వాక్యార్థమును స్రోతాంసి చ.... .... .... అను వాక్యము ద్వారా వివరించడం

జరిగినది. స్రోతస్సులు. ధాతువులు దూషింపబడి అటుపై తమ సమీపమున గల స్రోతస్సులు, ధాతువులను, స్వదోషమును సంక్రమింపజేసి దూషింపజేయును అని అర్థము. దోష స్వభావము అనగా దూషింపజేయు స్వభావము. ఇది దోషములకే (త్రిదోషములకు మాత్రమే) యున్నది. ధాతువుల కీ గుణము లేదు. కావున ధాతువు చేత దూషింపబడుట ధాతుదుష్టి. ఇది ధాతువునందున్న దోషము వలననే ఆ సంజ్ఞ ఇవ్వబడినదని గ్రహింపనగును.

## స్రోతోదుష్టికి కారణములు

భవన్తి చాత్ర

10. క్షయాత్సంధారణా ద్రౌక్ష్యా ద్వ్యాయామాత్ క్షుధితస్య చ
ప్రాణవాహీని దుష్యన్తి స్రోతాంస్యన్యైశ్చ దారుణైః.

11. ఔష్ణ్యాదామాద్భయాత్పానాదతి శుష్కాన్న సేవనాత్,
అమ్బువాహీని దుష్యన్తి తృష్ణాయాశ్చాతి పీడనాత్.

12. అతిమాత్రస్య చాऽకాలే చాహితస్య చ భోజనాత్,
అన్నవాహీని దుష్యన్తి వైగుణ్యాత్పావకస్య చ.

13 గురుశీత మతిస్నిగ్ధమతిమాత్రం సమశ్నతామ్,
రసవాహీని దుష్యన్తి చిన్త్యానాం చాతి చిన్తనాత్.

14. విదాహీన్యన్నపానాని స్నిగ్ధోష్ణాని ద్రవాణి చ,
రక్తవాహీని దుష్యన్తి భజతాం చాతపానలే,

15. అభిష్యన్దీని భోజ్యాని స్థూలాని చ గురూణి చ.
మాంస వాహీని దుష్యన్తి భుక్త్వా చ స్వపతాం దివా.

16. అవ్యాయామాద్దివా స్వప్నాత్ మేధ్యానాం చాతి భక్షణాత్,
మేదో వాహీని దుష్యన్తి వారుణ్యాశ్చాతి సేవనాత్.

17. వ్యాయామాదతి సంక్షోభా దస్థ్నామతి విఘట్టనాత్,
అస్థి వాహీని దుష్యన్తి వాతలానాం చ సేవనాత్.

18. ఉత్పేషాదత్యభిష్యన్దాదభిఘాతాత్ప్రపీడనాత్,
మజ్జావాహీని దుష్యన్తి విరుద్ధానాం చ సేవనాత్.

19. అకాల యోని గమనాత్ నిగ్రహాదతిమైథునాత్,
శుక్రవాహీని దుష్యన్తి శస్త్రక్షారాగ్నిభిస్తథా.
20. మూత్రితోదకభక్ష్య స్త్రీసేవనాత్ మూత్రనిగ్రహాత్,
మూత్రవాహీని దుష్యన్తి క్షీణస్యాఽభిక్షతస్య చ.
21. విధారణాదత్యశనాత్ అజీర్ణాఽధ్యశనాత్తథా,
వర్చో వాహీని దుష్యన్తి దుర్బలాగ్నేః కృశస్య చ,
22. వ్యాయామాదతి సన్తాపాత్ శీతోష్ణాక్రమసేవనాత్,
స్వేదవాహీని దుష్యన్తి క్రోధ శోక భయైస్తథా.

ధాతుక్షయము, వేగసంధారణము, రూక్ష ఆహారవిహార సేవనము, వ్యాయామము, అధికముగా ఆకలిని కలిగియుండుట మొదలైన దారుణమైన కారణముల వలన ప్రాణవహ స్రోతస్సులు దూషింపబడును. ఉష్ణ పదార్థముల సేవనము, ఆమము, భయము, మద్యపానము అతి శుష్కములైన ఆహారపదార్థముల సేవనము, తృష్ణ, అతిగా శరీరము పీడింపజేయుట - వీనివలన ఉదకవహ స్రోతస్సులు దూషింపబడుతాయి. అధికమైన ఆహార సేవనము, అకాలమునందు ఆహారము సేవించుట, అహితకరమైన ఆహారమును సేవించుట; పాచకాగ్ని వైగుణ్యము నొందుట ఈ కారణముల వలన అన్నవహ స్రోతస్సులు దూషితములగును. గురు శీత అతిస్నిగ్ధ ఉష్ణ గుణములు గలిగినదియునగు ఆహార పదార్థములను అతిగా సేవించుట వలన, అధికముగా చింతించుట వలననూ రసవహ స్రోతస్సులు దూషింపబడును. తాపమును కలిగించునవి, స్నిగ్ధ, ఉష్ణ గుణములు కలిగినదియునగు ఆహార పదార్థముల సేవన వలననూ, ఎండ గాలి యందు సంచరించుట వలననూ రక్తవహ స్రోతస్సులు వికృతి నొందును. అభిష్యందములైనవి, పెద్ద ఆకారములోనున్నవి (పెద్ద పెద్ద ముక్కలు) గురుగుణము గలవి యగు ఆహారపదార్థములను సేవించుట పగటిపూట భుజించిన వెంటనే నిదురించుట - ఈ పనుల వలన మాంసవహ స్రోతస్సులు దూషింపబడును వ్యాయామము చేయకుండుట, అతి సంక్షోభము ననుభవించుట, ఎముకలకు దెబ్బతగులునట్లు ప్రవర్తించుట మరియు వాతవృద్ధికర ఆహారములను సేవించుటచేత అస్థివహ స్రోతస్సులు దూషింపబడును. బాగుగా మర్దింపబడుట (శరీరము) అభిష్యంది పదార్థ సేవనము, అభిఘాతము (దెబ్బతగులుట) పీడనము (శరీరపీడనము) విరుద్ధాన్న సేవనముల వలన మజ్జావహ స్రోతస్సులు దుష్టి నొందును. అకాల మైథునము, అయోని మైథునము (దుష్ట మైథునము లేదా గుద

మైథునము మొదలగునవి), శుక్ర వేగమును నిగ్రహించుట, అతిగా మైథునము చేయుట, శస్త్రములచే గాయములగుట (ప్రజననాంగములయందు) క్షారములను అతిగా సేవించుట, అగ్నివలన (అగ్నివద్ద ఎక్కువకాలము పనిచేయుట) ఈ పనుల వలన శుక్రవహ స్రోతస్సులు దూషింపబడును. మూత్ర వేగమును నిరోధించుట వలన, బలక్షయమునందు, మూత్రవహ స్రోతస్సునందలి అవయవములకు అభిఘాతము తగులుట వలననూ మూత్రవహ స్రోతస్సులు దుష్టముచెందును. మలవేగమును నిరోధించుట, అధికముగా భుజించుట, అజీర్ణము కలుగుట, మొదట తిన్నది జీర్ణము కాక ముందే తిరిగి భుజించుట, అగ్నిమాంద్యము కలుగుట, కృశత్వము — వీటి వలన మలవహ స్రోతస్సులు చెడును. వ్యాయామము, అతి సంతాపము (ఎండలో తిరుగుట) క్రమము లేకుండా శీతోష్ణ వస్తుసేవనము, క్రోధము, శోకము, భయముల వలన స్వేదవహ స్రోతస్సులు దూషింపబడును.

ఆయుర్వేద దీపిక : "క్షయాత్" — మొదలైన వాక్యములద్వారా క్రమముగా స్రోతస్సులు దూషింపబడుటకు కారణము చెప్పబడుచున్నది. దారుణములైన అనుభోట కర్మలచేత అనికూడ అన్వయించు కొనవలెను. గురు పదార్థములు సేవించుట యనునది క్రితము చెప్పినదానికి సంబంధము కలిగియున్నది. మేద్యము లనగా మేదస్సును పెంచునవి (క్రొవ్వును పెంచునవి). అకాల యోని గమనమనగా తగిన సమయము కానప్పుడు మైథునము చేయుట మరియు ఉచితముకాని యోనియందు మైథునము చేయుటవలన అని అర్థము. నిగ్రహమనగా శుక్రవేగమును నిగ్రహించుట (ఇది రతియందు ఉపసంహార మనబడును). మూత్రిత మొదలైన వానియందు మూత్ర వేగము కలిగియున్నప్పుడు ఉదకము మొదలగువానిని సేవించుటయని తెలియవలెను.

## స్రోతస్సులను దూషింపజేయు ఆహార విహారములు

23. ఆహారశ్చవిహారశ్చ యః స్యాద్దోషగుణైః సమః ధాతుభిర్విగుణశ్చాపి స్రోతసాం స ప్రదూషకః

తాత్పర్యము : దోషముల యొక్క గుణములకు సమానగుణము కలిగి ధాతువులకు వ్యతిరేక గుణములు కలిగియున్న ఆహార విహారములు స్రోతస్సులను దూషింపజేయును.

ఆయుర్వేద దీపిక : సామాన్యముగా స్రోతో దుష్టిని గురించి ఆహారము వలన అను వాక్యముద్వారా చెప్పుచున్నాడు. దోషముల యొక్క గుణములతో సమానమైన అనుటచేత దోషములను అతిగా వృద్ధిచెందుట చూపబడుచున్నది. క్షీణమైన దోషములు ఇతరములైన వాటిని దూషింప చేయజాలవు. కానీ స్వయముగనే తమ లక్షణములను కోల్పోయి యుండునని యర్థము. ధాతువులకు విగుణమైన అనగా ధాతువులకు విరోధ స్వభావము కలిగిన యని యర్థము. అంతేగాని ధాతు వ్యతిరేక గుణము విగుణము అని చెప్పరాదు. దినమునందు నిద్రించుట మేదో వర్థకములైన ఆహార పదార్థముల సేవన మొదలైన మేదో గుణమునకు సమాన గుణములే మేదస్సును దూషించునని చెప్పబడినది.

## స్రోతో దుష్టి లక్షణము

24 అతిప్రవృత్తిః సంగో వా సిరాణాం గ్రన్థయోఽపి వా, విమార్గగమనం చాపి స్రోతసాం దుష్టిలక్షణమ్.

**తాత్పర్యము :** ఎక్కువగా ప్రవహించు లేదా బంధించుట లేక స్రోతస్సులయందు గ్రంధులు పుట్టుట, మార్గమును వీడి వేరు మార్గమును (తిరోగమనము మొదలైనవి) పొందుటయు స్రోతో దుష్టలక్షణములు.

**ఆయుర్వేద దీపిక :** సామాన్యముగా వచ్చు స్రోతో దుష్టి లక్షణములు 'అతిప్రవృత్తి' అనువాని ద్వారా చెప్పబడుచున్నవి. అతి ప్రవృత్తి యనునది స్రోతస్సులయందు ప్రవహించెడు రసము మొదలగువాని యొక్క అతిప్రవృత్తియని గ్రహించవలెను. అట్లే సంగము కూడా రసాదులకు సంబంధించినదే. విమార్గ గమన మనగా మలమూత్ర మార్గమున వెడలుట మొదలైనవాటిద్వారా వేరుదారిన వెళ్ళుటను తెలియవలెను.

## స్రోతస్సుల వర్ణము - ఆకారములు

23. స్వధాతు సమవర్ణాని వృత్తస్థూలాన్యణూని చ,
స్రోతాంసి దీర్ఘాణ్యాకృత్యా ప్రతానసదృశాని చ.

**తాత్పర్యము :** స్రోతస్సులు తాము వహించు ధాతువుయొక్క రంగు కలిగియుండి గుండ్రముగా పెద్దవిగా, సూక్ష్మమైనవిగా పొడవుగను మరియు లతల వలె అల్లుకొనియు యుండును,

**ఆయుర్వేద దీపిక :** స్వధాతు సమవర్ణము కలిగిన అనగా తాము వహించు ధాతువు ఏ రంగులో వుండునో ఆ రంగును కలిగియుండుట. ప్రతానము అనగా తీగలవలె అల్లుకొని యుండుట.

## స్రోతో దుష్టియందు చేయవలసిన చికిత్సలు

26. ప్రాణోదకాన్నవహానాం దుష్టానాం శ్వాసికీ క్రియా,
కార్యా తృష్ణోపశమనీ తథైవామ ప్రదోషికీ.

27. వివిధాశిత పీతీయే రసాదీనాం యదౌషధమ్,
రసాది స్రోతసాం కుర్యాత్ తద్యథా స్వముపక్రమమ్.

28. మూత్రవిట్ స్వేదవహానాం చికిత్సా మౌత్ర కృచ్ఛ్రికీ,
తథాతిసారికీ కార్యా తథా జ్వరచికిత్సికీ.

**తాత్పర్యము :** ప్రాణ, ఉదక, అన్నవహ స్రోతస్సులు దూషింపబడి నప్పుడు క్రమముగా శ్వాస, తృష్ణోపశమన, ఆమనాశక చికిత్సలను చేయవలెను. వివిధాశిత పీతీయ (సూత్రస్థానము 28వ) అధ్యాయమునందు చెప్పబడిన ఔషధము లను రసాది స్రోతో దుష్టియందు ఆ యా లక్షణానుసారముగా నివ్వవలెను. మూత్ర పురీష, స్వేద వహ స్రోతో దుష్టియందు క్రమముగా మూత్ర కృచ్ఛ్ర, అతిసార మరియు జ్వర రోగములందు చేయు చికిత్సలను చేయవలెను.

**ఆయుర్వేద దీపిక :** ప్రాణ, ఉదకా మొదలైన చికిత్సలు చెప్పబడు చున్నవి. ప్రాణవహ స్రోతస్సులకు శ్వాస సంబంధమైన చికిత్స, ఉదకవహ స్రోతస్సులకు తృష్ణోపశమన చికిత్స మరియు అన్నవహ స్రోతస్సులకు ఆమ ప్రదోషము నందు చేయు చికిత్సను చేయవలెనని గ్రహించవలెను. మూత్రవహ పురీషవహ మరియు స్వేదవహ, ఈ మూడు స్రోతస్సులకుగూడ క్రమముగా మూత్ర కృచ్ఛ్ర, అతీసార జ్వరములందు చేయుచికిత్సను క్రమముగా చేయవలెయని తెలుసు కొనవలెను.

## అధ్యాయ సంగ్రహము

తత్ర శ్లోకాః

29. త్రయోదశానాం మూలాని స్రోతసాం దుష్టి లక్షణమ్,
సామాన్యం నామపర్యాయాః కోపనాని పరస్పరమ్,

30. దోషహేతుః పృథక్త్వేన భేషజోద్దేశ ఏవ చ,
స్రోతో విమానే నిర్దిష్టస్తథా చాహ వినిశ్చయః.

31. కేవలం విదితం యస్య శరీరం సర్వభావతః,
శరీరాః సర్వరోగాశ్చ స కర్మసు న ముహ్యతి.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే విమానస్థానే స్రోతో విమానం నామ పంచమోఽధ్యాయః

**తాత్పర్యము :** పదమూడు స్రోతస్సులయొక్క మూలము దూషిత లక్షణము పర్యాయనామములు, పరస్పర ప్రకోపకారణములు, విడివిడిగా అవి దూషింపబడుటకు కారణములు, దూషిత స్రోతస్సుల చికిత్సలు మరియు పురుషుడు స్రోతోమయుడను మొదట చెప్పిన సిద్ధాంత వినిశ్చయము స్రోతో విమానమునందు చెప్పబడినవి. ఎవడైతే అన్ని విధములా శరీరమును సంపూర్ణముగా తెలుసుకొనునో అట్టివాడు శారీరకములైన అన్ని రోగములయందును తప్పుచేయడు.

ఇది అగ్నివేశునిచే రచింపబడి చరకునిచే ప్రతి సంస్కరింపబడిన తంత్రము నందలి విమానస్థానములోని స్రోతోవిమానమను ఐదవ అధ్యాయము.

**ఆయుర్వేద దీపిక :** సామాన్యముగా దుష్టి లక్షణమనగా వాతాది వికల్పము లేక సంగ్రహముగా చెప్పబడిన దుష్టి లక్షణము అని అర్థము. ఇక్కడ స్రోతో దుష్టి లక్షణములు వాతాది దోషముల భేదము ద్వారా చెప్పబడలేదని గ్రహింపనగును. గ్రంథవిస్తరభీతిచే దోషములననుసరించి చెప్పబడలేదు. అందువలన వాతాది దోషముల విశేష లక్షణముల ననుసరించి స్రోతోదుష్టిని దోషానుసారముగా వర్గీకరణము చేయవలసి యున్నది. మొదట దాని వినిశ్చయము అనగా అధ్యాయము మొదట చెప్పబడిన "పురుషుడు స్రోతోమయుడ"న్న వాదమును నిర్ణయించుట అని యర్థము. కేవలము........అనుటవలన ఇక్కడ చెప్పబడిన ధమనుల వివరమును తెలిసికొనుట శరీర సంబంధమైన జ్ఞానమున కెంతవరకు తోడ్పడునో చెప్పబడినది.

ఇది శ్రీ చక్రపాణి దత్తునిచే విరచింపబడిన చరక తాత్పర్యటీకయగు ఆయుర్వేదదీపిక యందలి విమానస్థానమున స్రోతోవిమానమను ఐదవ అధ్యాయము.

# రోగానీక విమానము

## షష్ఠాధ్యాయము

1. అథాతో రోగానీకం విమానం వ్యాఖ్యాస్యామః.

2. ఇతి హ స్మాహ భగవానాత్రేయః.

**తాత్పర్యము :** ఇక ఇప్పుడు రోగానీకమను విమానమును గూర్చి చెప్పు కొందము అని ఆత్రేయ భగవానుడు చెప్పెను.

**ఆయుర్వేద దీపిక :** పూర్వాధ్యాయమునందు స్రోతస్సులను అధిష్ఠానముగా చేసికొని వచ్చు రోగములను గురించి వివరించి, ఆపైన ప్రభావభేదముచే రోగములను గురించి చెప్పుటకు రోగానీక విమానము వివరింపబడుచున్నది. రోగానీక మనగా రోగ సమూహము.

### రోగ సమూహమునందలి వివిధ ప్రకారములు

3. ద్వే రోగానీకే భవతః ప్రభావభేదేన. సాధ్యంచాసాధ్యం చ. ద్వే రోగానీకే బలభేదేన మృదు చ దారుణం చ; ద్వే రోగానీకే అధిష్ఠానభేదేన - మనోఽధిష్ఠానం శరీరాధిష్ఠానం చ; ద్వే రోగానీకే నిమిత్తభేదేన - స్వధాతు వైషమ్య నిమిత్తం చాగన్తునిమిత్తం చ; ద్వే రోగానీకే ఆశయభేదేన - ఆమాశయ సముత్థం చ పక్వాశయ సముత్థం చేతి. ఏవమేతత్ప్రభావబలాధిష్ఠాన నిమిత్తాశయభేదాత్ ద్వైధం సద్భేదప్రకృత్యాన్తరేణ విద్యమానమథవాఽపి సన్భిద్యమానం స్యాదేకత్వం వా బహుత్వం వా ఏకత్వం తావదేకమేవ రోగానీకం దుఃఖసామాన్యాత్; బహుత్వం తు దశరోగానీకాని ప్రభావభేదాదినా భవన్తి. బహుత్వమపి సంఖ్యేయం స్యాదసంఖ్యేయం వా స్యాత్. తత్ర సంఖ్యేయం తావద్యథోక్తమష్టోదరీయే అపరి సంఖ్యేయం పునర్యథా - మహారోగాధ్యాయే రుగ్వర్ణసముత్థానాదీనాం సంఖ్యేయత్వాత్.

**తాత్పర్యము :** రోగ సముదాయమును ప్రభావ భేదమువలన రెండు విధములుగా విభజింపవచ్చును. ఒకటి సాధ్యరోగములు, రెండు అసాధ్యరోగములు. బలమునను సరించి రోగములు మృదు - దారుణములని రెండు విధములు. అధిష్ఠానము

(స్థానము) ననుసరించి మనోధిష్టానములు, శరీరాధిష్టానములు అని రెండు రకములు. రోగ కారణము ననుసరించి వాటిని స్వధాతు వైషమ్యమువలన కలిగినవి. ఆగంతుక కారణముల వలన కలిగినవి అని రెండు విధములుగా విభజించవచ్చును. ఆశయము (రోగములు ఆశ్రయించియున్న శరీర అవయవము) ననుసరించి ఆమాశయము నందు పుట్టినవి, పక్వాశయమునందు పుట్టినవి అని రెండు విధములు. ఈ విధముగా ప్రభావ, బల, అధిష్టాన, నిమిత్త, ఆశయ భేదములవలన ఒక్కొక్కదాని ననుసరించి రెండేసి విధములై యున్నవి. ॥వర్గీకరించుటకు ఇతరములైన కారణములద్వారా అనేకములుగను, ఏకీకరించు కారణములద్వారా ఒక్కటిగను రోగములు వర్గీకరింప బడుచున్నవి.॥రోగ సమూహములో సామాన్యముగా నుండు బాధించు గుణము వలన అవియన్నియును ఒక్కటిగనే వర్గీకరింపబడుచున్నవి. అనేకములుగా రోగములను ప్రభావము, బలము మొదలైనవాటివలన పదిగా ఎంచబడుచున్నవి. బహుత్వముకూడా లెక్కింపదగినవన్ని, లెక్కకు మించినవన్నిగను విభజించవచ్చును. లెక్కించదగిన రోగములను అష్టోదరీయాధ్యాయము (సూత్రస్థానము 19వ అధ్యాయము), లెక్కకు మించిన రోగములను మహారోగాధ్యాయము (సూత్రస్థానము 20వ అధ్యాయము) లందు వివరించడమైనది. బాధ (రుజా) వర్ణము (లక్షణములు) సముత్థానము (కారణము) మొదలైనవి అసంఖ్యేయము లైనందువలన మహారోగాధ్యాయమునందు రోగములు అసంఖ్యేయములుగా చెప్పబడినవి.

ఆయుర్వేద దీపిక : ఇక్కడ బలభేదము వలన మృదు అనగా అల్ప బలము దారుణమనగా అధిక బలము అని యెరుంగవలెను. దారుణత్వము కలిగిన రోగము కొంతకాలము గడచినంతనే బలము పెరిగి మనుజుని నశింపజేయును. సూత్రస్థానము నందలి 18వ అధ్యాయమునందు చెప్పబడినట్లుగా — కొన్ని దారుణ రోగములైనను సాధ్యములై యున్నవి. అవి చికిత్సింపక పోయినను లేదా క్రమ పద్ధతి లేకుండా చికిత్సించినను మనుజుని అంతమొందించును (సంతి హ్యేవం విధా రోగాః సాధ్య దారుణ సంమితాః, యే హ్యాసు రనుపక్రాంతా మిథ్యారంభేణ వా పునః చ. సూ. 18/37) ఆమాశయ సముత్థములుగా అచట ఆశ్రయించుకొనియున్న కఫ పిత్తములవలన కలిగిన రోగములన్నింటినీ తీసికొనవలెను. ఈ విధముగా రోగము లన్నింటియొక్క ఆశయ భేదముచేత ద్వివిధములుగా తెలుసుకొనవలెను. ద్వివిధము కలదు అనగా విభేదించుటకు గల కారణాంతరమువలన లేదా సంధీకరింప బడు చున్నట్టియు, — అనగా ఏకీకరింపబడుచున్నట్టియు ఒకే లక్షణముచేత తెలిసి

కొన దగిన ధర్మము కలిగినట్టియు అని తెలియనగును. దుఃఖ సామాన్యత్వమువలన అనగా బాధను కలిగించుట అను లక్షణము. సాధారణముగా అన్ని రోగముల యందును ఉండుటవలన రోగములన్నియు ఒకటిగనే ఎంచబడును. అనేకములుగా కూడా అనుటవలన పై చెప్పబడిన ప్రభావాది భేదముచే అనేకములుగాకూడ రోగము లను విభజించవచ్చును. లెక్కింపదగిన రోగములను అష్టోదరీయాధ్యాయములో 48 విధములైన రోగాధికరణములీ ప్రకరణమునందు సంగ్రహముగా చెప్పబడినవి. (చ. సూ. 19) (అష్టచత్వారింశద్రోగాధికరణా న్యస్మిన్ సంగ్రహే చ.సూ. 19/3). ఈ విధముగా సంఖ్యేయ రోగములగురించి చెప్పబడినది. రోగములను లెక్కించలేని తనము (అపరిసంఖ్యేయత్వము)ను గురించి మహారోగాధ్యాయము మరియు త్రిశోఫీయాధ్యాయమునందు "రోగములు - బాధ - లక్షణము - కారణము - స్థానము - ఆశయము - నామధేయములవలన అపరిసంఖ్యేయములుగా విభజింపబడును". (త ఏవాపరిసంఖ్యేయా భిద్యమానా భవన్తి హి, రుజావర్ణ సముత్థానస్థానసంస్థాన నామభిః - చ. సూ. 18) అను సూత్రముద్వారా చెప్పబడినది.

4. న చ సంఖ్యేయాగ్రేషు భేదప్రకృత్యాన్తరీయేషు విగీతిరిత్యతో దోషవతీ స్యాదత్ర కాచిత్ప్రతిజ్ఞా న చావిగీతిరిత్యతః స్యాదదోషావతీ. భేత్తా హి భేద్యమాన్యథా భినత్తి, అన్యథా పురస్తాద్భిన్నం భేదప్రకృత్యన్తరేణ భిన్దన్ భేదసంఖ్యావిశేషమాపాదయత్యన్‌కథా: న చ పూర్వభేదాగ్రముపహన్తి- సమానాయామపి ఖలు భేదప్రకృతౌ ప్రకృతానుప్రయోగాన్తరమపేక్ష్యమ్.సన్తి హ్యర్థాన్తరాణి పర్యాయశబ్దాభిహితాని.సమానో హి రోగశబ్దో దోషేషు వాధిషు చ దోషాహ్యపి రోగశబ్దమాతఙ్కశబ్దం యక్ష్మశబ్దం దోషప్రకృతి శబ్దం వికారశబ్దం చ లభన్తే. వ్యాధయశ్చ రోగశబ్దమాతఙ్కశబ్దం దోష ప్రకృతిశబ్దం వికారశబ్దం చ లభన్తే. తత్రదోషేషు చైవవ్యాధిషు చ రోగ-శబ్దం సమానః శేషేషు తు విశేషవాన్.

**తాత్పర్యము :** భేదములు గల వివిధ కారణములచే ఉత్పన్నమైన లెక్కించదగిన రోగములను అసంఖ్యేయములనుట తప్పు. ఇంతకుముందు రోగము లను సంఖ్యేయములుగా ప్రకటించుటయూ తప్పుకాదు. పైగా లెక్కయందు తప్పే మియునూ లేదు. రోగములను విభజించు పురుషుడు రోగముల విభజనము భిన్నము లైన దూషణము, ప్రకారముల వలన చేయుటచే యిది తప్పుకాదు. విద్వాంసులైన వారు మొదట విభజించిన రోగములను ఇంకను భిన్నమైన కారణములచేత మరి

కొంత విభజించి చెప్పుటవలన మొదటి విభజనను ఖండించినట్లు కాదు. మరియు విభజించుటకు గల కారణములు సమాన సంఖ్యయందున్నప్పటికీ కారణ విశేషము వలన భేదముండును. ఒకే శబ్దమునకు అనేకార్థములును, అనేక శబ్దములకు ఒకే అర్థమును వుండుట చూచుచున్నాము. రోగశబ్దము దోషములకు వ్యాధులకునూ వర్తించును. దోషములునూ రోగ - ఆతంక - యక్ష్మ - దోషప్రకృతి - వికార శబ్దములచే గుర్తింపబడుచున్నవి. వ్యాధులును రోగ - ఆతంక - యక్ష్మ దోష ప్రకృతి - వికార శబ్దములచే పిలువబడుచున్నవి. అయినచో రోగశబ్దము దోషములు-వ్యాధులకు సమానముగా వర్తించును. మిగిలిన వాటియందు సూత్రము విశేష (భిన్న) మగును.

ఆయుర్వేద దీపిక : న చ.... యిత్యాది వాక్యముల వలన లెక్కించ దగిన, లెక్కించదగని అనునవి పరస్పర ధర్మములు. అట్లే ఏకత్వ అనేకత్వము లును విరుద్ధములు. అయినచో విరుద్ధమైన ధర్మములు ఒకే రోగమునందెట్లు కలిసి యుండునో వివరింపబడుచున్నది. సంఖ్యాయాగ్రము.... అనగా సంఖ్యయు పరి మాణమునందు, అగ్రశబ్దము పరిమాణమును సూచించును. ఎట్లనగా— ఒక్కొక్క భేదాగ్రము (విభజన పరిమాణము) లెక్కకు మించినదిగా నుండును. విభజన సంఖ్యా రూపము యిచట పరిమాణమని అర్థము. భేద, ప్రకృతి అంతరములందు అనగా భేదముల కారణాంతరములయందు విరుద్ధముగా చెప్పుట వికృతి. ఎట్లనగా ఒకదాని గురించి చెప్పునపుడు ఇది ఏకము మరియు అనేకమున్నూ అనిచెప్పుట: అందు వలన అనగా పై చెప్పబడిన విరుద్ధ కథనము వలన మొదట చేసిన ప్రతిజ్ఞయందు తప్పులేదనుట. ఎట్లనగా ఏక - అనేక విభాజ్య లక్షణము యిచట చెప్పబడినదనుట సిద్ధాంతము. విరుద్ధముగా చెప్పకుండుట తప్పునుండలో విరుద్ధ కథనము తప్పని చెప్పి భేదకారణమునందు చెప్పబడని విరుద్ధ కథనమును దోష పూరితమని చెప్పబడు చున్నది. బాధయనునది సామాన్య లక్షణముండుట వలన రోగసమూహమంతయు ఒక్కటేయని పేర్కొని, మరల ప్రభావ భేదము వలన రోగములన్నియు ఒక్కటే యని, విరుద్ధముకాని, ఏకత్వమునకు పేరును అవిరుద్ధత్వము కలుగని కథనము చేసి నట్లయితే అది పరస్పర విరుద్ధమే యగును. దీనివలన ప్రభావముచేత ఏకత్వముగాక రోగములు రెండు విధములేయని భావము తెలియనగును. "భేత్తా హి" అనుట యొకయ విరుద్ధ కథనమునందు దోషము లేకుండుటకు కారణము వివరించబడినది. భేదించు వాడు (విభజించువాడు) పురుషుడు. విభజింపబడినది రోగము లేదా రెండుగా విభ

జింపబడినది. లేక మొదట ఒకటిగానే వర్గీకరింపబడినది కూడా యితర కారణాదు లచే తిరిగి విభజింపబడినది. భేదప్రకృత్యంతరేణ ... అను వాక్యము ద్వారా పై అర్థము వివరించుట జరిగినది. అనేకములుగా అనగా రెండు రకములైన రోగ సమూహములు మరియు పదిరకములైన రోగానీకములు మొదలైనవి. అంతేగాక మొదట చెప్పిన విభజన పరిమాణమును ఖండించుట లేదు. ఏ ధర్మము వలన ఏకత్వము చెప్పబడినదో అదే ధర్మము యొక్క యోగమువలన రోగములు అనేకము లని చెప్పుట పరస్పర విరుద్ధ కథనము.

ఒకే ధర్మము ఏకత్వము మరియు అనేకత్వములకు కారణము కాదు. ఎప్పు డైతే వేరొక ధర్మ వివక్ష చేత బహుత్వము కూడా కలదని చెప్పబడినదో అది విరు ద్ధము కాదు. బహుత్వమును గురించి చెప్పునపుడు రోగ ధర్మములున్నూ అనేకము లుగా చూపబడినందున విరుద్ధము కాదు. అందువలన రోగముల ఏకత్వము, ఏక ధర్మ విషయము నందును, రోగముల బహుత్వము బహుధర్మ విషయము నందును అంగీకరించుట యందు విరోధము లేదు. ఎచట భేద కారణము సమానము కాదో అచట కారణాంతరములచే పై చెప్పబడిన న్యాయము వలన విరుద్ధ కథనము సరిగా నుండును. ఎటనైతే ప్రభావాది ద్వైవిధ్యము వలన రోగము పదిగా చెప్పబడి నవో అచట రోగ సమూహము రెండు అని ద్విత్వమును సూచించు ద్వైవిధ్యమును పేర్కొని మరలా ద్విత్వాది భేదము వలన పదిగా నెట్లు చెప్పదగును ? "సమాన మైన వాటి యందును...." అనుట ద్వారా ఈ ద్వి శబ్దము రోగముల ద్విత్వము నందు దశత్వము నందును సమానమైన హేతువని చెప్పబడుచున్నది. సమాన శబ్ద మును పేర్కొనుటచే కల్గిన సమానత్వము వలన ప్రతిభా సమానములైన వాటి యందు (వెలుగొందు వాటి యందు) అని అర్థము కలుగుచున్నది. ఇకపై ప్రయో గాంతరమును అపేక్షించునది అనగా ఇప్పుడు సమాన శబ్దముచే పేర్కొనబడిన భేదము తదుపరి ప్రయోగాంతరము విరుద్ధ కథనము తీసివేయుటకు అపేక్షించునది యని యర్థము. దీనినీ విధముగా చూపుట జరుగుచున్నది — ద్విశబ్దము రోగ ప్రభావము మరియు రోగ బలము మొదలగు వాని యందు సమానమైనప్పటికీ ఒక చోట "ప్రభావ భేదము వలన" అనెడు ప్రయోగాంతరమును అపేక్షించి ప్రభావ ద్వైవిధ్యమును తెలియజేయుచున్నది. మరియు బల భేదము వలన అనెడి ప్రయో గాంతరమును అపేక్షించి ద్విశబ్దము బల ద్వైవిధ్యమును సూచించుచున్నది. కాబట్టి

వివిధార్థములను తెలుపునట్టి వివిధ ద్విశబ్ద ప్రయోగముల చేత దశత్వము కూడా ఉపపన్నమైనది మరియు ద్విత్వము కూడ యని భావము. సంతిహి.... అను వాక్యములో దృష్టాంతకొరకు ఒకే శబ్దము చేత అనేక అర్థములను పేర్కొనుటను గురించి చెప్పబడినది. అర్థాంతరములు (వివిధార్థములు) పర్యాయ శబ్దములచే పేర్కొనబడిన అర్థములు. సమానో హి.... అను వాక్యమునందు దీనికి ఉదాహరణము చెప్పబడినది. దోషముల యందు, వ్యాధి యందును రోగ శబ్దము ఉభయవాచకత్వముచే సమానము. దీని వలన రోగ-దోష సమానముచే దానికి పర్యాయ పదములుగా రోగ-ఆతంక-యక్ష్మాది శబ్దములను ఎల్లెడలను గ్రహించనగును. మిగిలిన వాని యందు అనగా హేతువు మొదలగు వానియందు విశేషమైనది అనగా పేర్కొనుటకు విశేషమైనది (భిన్నమైనది) యని అర్థము.

5. తత్ర వ్యాధయోఽపరిసంఖ్యేయా భవన్తి అతిబహుత్వాత్; దోషాస్తు ఖలు పరిసంఖ్యేయా భవన్త్యనతిబహుత్వాత్. తస్మాద్యథాచిత్రం వికారానుదాహరణార్థ మనవశేషేణ చ దోషా వ్యాఖ్యాస్యన్తే. రజస్తమశ్చ మానసౌ దోషౌ, తయోర్వికారాః కామక్రోధలోభమోహేర్ష్యామానమదశోకచి(ంతో)త్త్రోద్వేగభయహర్షాదయః. వాతపిత్తశ్లేష్మాణస్తు ఖలు శరీరా దోషాః. తేషామపి చ వికారా జ్వరాతీసారశోఫశోషశ్వాసమేహకుష్ఠాదయః. ఇతి దోషాశ్చ కేవలా వ్యాఖ్యాతాః వికారైకదేశశ్చ.

## దోష ప్రకోపణ కారణములు - అసాత్మ్యేంద్రియార్థాదులు

6. తత్ర ఖల్వేషాం ద్వయానామపి దోషాణాం త్రివిధం ప్రకోపణమ్. తద్యథా అసాత్మ్యేంద్రియార్థసంయోగాః ప్రజ్ఞాపరాధః పరిణామశ్చేతి

**తాత్పర్యము :** వ్యాధులు బహుత్వము వలన లెక్కించలేనన్ని గలవు. దోషములు మాత్రము ఎక్కువగా లేనందున లెక్కించగలిగినన్ని యున్నవి. కాబట్టి బాహుళ్యమును బట్టి ఉదాహరణము కొరకు రోగములను, దోషములన్నింటి యును చెప్పుకొందుము. రజస్సు మరియు తమస్సులు రెండును మానస దోషములు. వాని వలన కలుగు వికారములు కామ, క్రోధ, లోభ, మోహ, ఈర్ష్యా, మాన, మద, శోక, చింతా, ఉద్వేగ, భయ, హర్షాదులు. వాత పిత్త శ్లేష్మములు శారీర దోషములు. వీనికిని వికారములు జ్వర, అతీసార, శోఫ, శోష, శ్వాస, మేహ, కుష్ఠాదులు. ఈ విధముగా కేవలము దోషములు, వాని వికారములలో కలిపి చెప్పబడినవి. ఈ రెండు

రకములైన దోషములకు మూడు విధములుగా ప్రకోపము జరుగును. అవి అసాత్మేన్ద్రియార్థ సంయోగము, ప్రజ్ఞాపరాధము, మరియు పరిణామము.

**ఆయుర్వేద దీపిక :** తత్ర.... అను వాక్యమువలన - అచటను రోగ శబ్దమును, రోగమును మరియు దోషమును సూచించుటకు, పేర్కొనుటచేత లెక్కించ గల్గుట, లెక్కించలేకపోవుట యను విరుద్ధ వాక్యమునందు దోషము భేదనెడి అభిప్రాయము వ్యక్తపరచడమైనది. ఒకే దోషము వలన అనేక వికారములు కలుగు ననెడి యభిప్రాయముచేత వికారముల కంటె దోషములు తక్కువయని తెలియ నగును. చిత్రానుసారముగా అనగా లక్షణానుసారము. ఇందువలన పూర్వాచార్యులు అధికముగా యున్నవని ఏ వ్యాధులను గూర్చి చెప్పియుండిరో వానిని గురించియే చెప్పుకొందుము. పిలుపడక పోవుటవలన అన్నింటిని గురించికాదు అని యర్థము. లేక తగురీతిని అనుపాఠము కూడా తీసికొనవచ్చును. దోషములను పూర్తిగా యనుట వలన దోషములు తక్కువసంఖ్యలో నుండుటవలన వాటి అన్నింటిని గురించి (ఒక్క దానిని గూడా విడువక) పేర్కొనుట పిలుపడుసను విషయము వివరించబడినది. ఇక్కడ మానస దోష వికారములు అనల్పములగుట చేత పరిమాణము చెప్ప బడినది.

7. ప్రకుపితాస్తు ఖలు తే ప్రకోపణవిశేషాద్దూష్యవిశేషాచ్చ వికారవిశేషానభి-
నిర్వర్తయ న్త్యపరిసంఖ్యేయాన్.

**తాత్పర్యము :** దోషములు ప్రకోపించినవై, ప్రకోపణ విశేషముచేతన దూష్య (ధాత్వాది) విశేషము చేతను అపరి సంఖ్యేయములను వ్యాధులను కల్గించును.

**ఆయుర్వేద దీపిక :** ప్రకుపితాస్తు.... అను వాక్యమునందు పరిమితము లైన వ్యాధి కారణములగు దోషములు అపరిమితములైన వ్యాధులను ఎట్లు కలిగించునో వివరించుట జరిగినది. ఒకానొక హేతు విశేషముచే దుష్టమైన దోషము దూష్యము నందలి విభిన్నమైన వ్యాధి కారకశక్తి యోగముచేత బహువిధములైన వికారములను కల్గించుననుట యుక్తమే. కోపించిన దోషమే సముత్థాన విశేషముచేత ఇతర స్థానములకు ప్రవేశించి అచటి విశేషముచేత వివిధ రోగములను కలుగజేయు నని సూత్ర స్థానమున చెప్పబడియున్నది.

(స ఏవ కుపితో దోషః సముత్థాన విశేషతః స్థానాంతరగతశ్చైవ వికారాన్ కురుతే బహూన్ సూ. స్థా. 18. అ.)

## శారీరక మానసిక రోగముల పరస్పర అనుబంధము

8. తే చ వికారాః పరస్పరమనువర్తమానాః కదాచిదనుబధ్నంతి. కామాదయో జ్వరాదయశ్చ.

**తాత్పర్యము :** ఆ వికారములు - కామము మొదలైన మానసిక వికారములు జ్వరము మొదలైన శరీర వికారములను చిరకాలము కలసి వుండుటచేత అప్పుడప్పుడు ఒకదానితో నొకటి కలసిపోవుట జరుగును.

**ఆయుర్వేద దీపిక :** "తే చ వికారాః" — అను వాక్యమునందు శారీరక, మానసిక దోషములకు గల పరస్పర సంసర్గత్వమును వివరించుట జరిగినది. చిరకాలము కలిసి యుండుటచేత అనుటచేత జ్వరము మొదలైన రోగములు లేదా కామము మొదలైన మానసిక రోగములు ఎక్కువ కాలము బలము కలిగి మనుజుని బాధించుటచేత అప్పుడవి పరస్పరము కలిసిపోవును. తక్కువ కాలము వుండుటచేత వీని సంసర్గము కలుగదు అని తెలియనగును. లేదా చిరకాలము కలిసి యుండుటచేత ఒకదాని నొకటి వృద్ధి నొందించును. ఇచట పరస్పర శబ్దముచేత శారీరక వ్యాధులకు శారీరక వ్యాధులచేతనూ మానసిక వ్యాధులకు మానసిక వ్యాధుల చేతను, మానసిక వ్యాధులకు శారీరక వ్యాధులచేతను అనుబంధముండునని తెలియవలెను.

## రజస్సు తమస్సులకు నియతానుబంధముండుట

9. నియతస్త్వనుబంధో రజస్తమసోః పరస్పరం, న హ్యరజస్కం తమః ప్రవర్తతే,

**తాత్పర్యము :** రజస్సు మరియు తమస్సులు ఎప్పుడూ కలిసియుండును. రజోగుణ అనుబంధము లేకుండా తమోగుణము ప్రకోపించదు (ప్రవర్తించదు).

**ఆయుర్వేద దీపిక :** వికారానుబంధమును గూర్చి మొదట తెలిపి ఇక్కడ దోషానుబంధమును గూర్చి చెప్పబడినది.

10. (ప్రాయః) శరీరదోషాణామేకాధిష్ఠానీయానాం సన్నిపాతః సంసర్గో వా సమానగుణత్వాత్.దోషా హి ... సమానాః

**తాత్పర్యము :** సాధారణముగా ఒకే స్థానమునందున్న దోషములు సమాన గుణములు కలిగి యుండుటవలన అన్నియు కలిసియుండుట (సన్నిపాతము) లేదా ఒకదానితో మరియొకటి కలిసియుండుట (సంసర్గము) జరుగును. దూషించు కారణములచేత దోషములు సమానమగును.

## వ్యాధులయొక్క అనుబంధ్య - అనుబంధత్వములు

11. తత్రానుబంధ్యానుబన్ధకృతో విశేషః—స్వతంత్రో వ్యక్తలింగో యథోక్తసముత్థాన-ప్రశమో భవత్యానుబంధ్యః. తద్విపరీతలక్షణ స్త్వనుబంధః. అనుబంధ్య-లక్షణసమన్వితా స్తత్ర యది దోషా భవన్తి తత్త్రికం సన్నిపాతమాచక్షతే ద్వయం వా సంసర్గమ్.అనుబంధ్యానుబంధవిశేషకృతస్తు బహువిధో దోషభేదః ఏవం ఏష సంజ్ఞా ప్రకృతో భిషజాం దోషేషు వ్యాధిషు చ నానా-ప్రకృతివిశేషవ్యూహః

**తాత్పర్యము :** దోషముల అనుబంధ్య అనుబంధముల వలన కలుగు విశేషము. అనుబంధ్యములు స్వతంత్రములు. వీని లక్షణములు స్పుటముగా తెలియును. స్వకారణములచేతనే ఉద్భవించి, ఆ చికిత్సలచేతనే శమించును. అనుబంధ దోషములు దీనికి వ్యతిరేక లక్షణములను కలిగియుండును. దోషములు అనుబంధ్య లక్షణములు కలిగియుండు మూడును కలిసియున్నచో సన్నిపాతమనబడును. లేక అట్టి రెండు దోషములు కలిసియున్నచో యది సంసర్గమనబడును. అనుబంధ్య అనుబంధ విశేషముచేత దోషభేదములు బహువిధములుగా నుండును. ఈ పద్ధతిని వైద్యులు అనుబంధ్య అనుబంధముచే సన్నిపాత సంసర్గ జన్య జ్వర అతిసారాదుల యందు, దోషముల యందును నానాకారణ జన్య భిన్నత్వమును తెలిసికొందురు.

**ఆయుర్వేద దీపిక :** దోషాను బంధమును అనుబంధ్య అనుబంధ భేదముద్వారా తెలియజేయుటకు దోష వికారముల అనుబంధన—అనుబంధ లక్షణము లిక్కడ తెలియజేయబడినవి. అనుబంధ్యము యొక్కయు అనుబంధము యొక్కయు విశేషము అనుబంధ్యానుబంధ విశేషము. వ్యక్త లక్షణములు గలదియే స్వతంత్ర మనబడును. యథోక్త సముత్థాన ప్రశమనమనగా స్వకారణములచే జనించి, స్వచికిత్స చేతనే శమించునది. (ఉదాహరణమునకు వాతము తదనుకూల కారణములచే వృద్ధి నొంది తద్భామక చికిత్సచే శమించుట) లేదా స్వతంత్రమనుటచే గూఢ

వికారములను కలిగించుటయందు యితరములైన వాటిపై ఆధారపడక ప్రాధాన్యము అని పిలువబడును. స్వతంత్ర దోషము మాత్రమే తన ప్రకోపకాలమందు వికారములను కలుగజేయును. అస్వతంత్ర దోషము మాత్రము స్వతంత్ర దోషము ప్రకోపించినపుడు దానిని అనుసరించి వ్యాధులను కలుగజేయును. తద్వ్యతిరేక లక్షణములు కలిగిన అనగా లక్షణములు ప్రస్ఫుటముగా లేనిది స్వకారణములచేతగాక ఇతర (స్వతంత్ర) దోష ప్రకోపక కారణములచే ప్రకోపించునది. మరియు ఇతర (స్వతంత్ర) దోష చికిత్సచే ప్రశమించునది. అనుబంధమనునది బలము లేనిదై యుండి లక్షణములను వ్యక్తపరచదు. మరియు ఇతర ప్రకోపకారణములచేత దాని కనుగుణముగా కొంచెము ప్రకోపించి ఇతర దోషమును చికిత్సించుటచే, ఆ చికిత్స దీని కనుగుణముగా నుండుటచే శమించును. ఉదాహరణకు శరత్కాలమునందు పిత్త హేతువైన జలము మొదలగువాని అమ్లవిపాకముచేత శ్లేష్మము వృద్ధి పొందును. అదియే పిత్తశామకములైన తిక్త సర్పి మొదలైనవాని వలన కఫశామకత్వమునకు అనుగుణముగా నుండుటచేత శమించును (ఇచట పిత్తము అనుబంధ్యము లేదా ప్రధానమనబడును. శ్లేష్మము అనుబంధము లేదా అప్రధానము) అనుబంధ్యములు రెండు వున్నపుడైనను అది సంసర్గ మనబడుననుట రివాజు. వ్యక్తలక్షణములు కలిగి యుండుట మొదలైన ధర్మములు కలిగియున్న దోషమునకు అనుబంధ్య శబ్దము వర్తించును. ఇందువలన అప్రధానములైనవి సన్నిపాతము నందు అనుబంధ్య అనుబంధ రూప సంసర్గ విశేషముచేత అనుబంధము లేకున్ననూ అనుబంధ లక్షణములు తప్పక యుండును. సంజ్ఞచేత అనగా అనుబంధ్య అనుబంధ సన్నిపాత సంసర్గములైన జ్వరాతిసారాది సంజ్ఞచేత యని యర్థము. నానాకారణ జన్య భిన్నత్వము యొక్క సమూహము అనగా యథోక్తములైన వివిధ కారణ విశేషములచే కలిగిన జ్వరాతిసారాది వ్యాధుల యొక్కయు మరియు దోషముల యొక్కయు సమూహము అని యర్థము. వైద్యులకు అనుభవలన వైద్యులకు మాత్రమే ఈ అనుభవ (కాలానుగత) సిద్ధ అనుబంధ్యాది సంజ్ఞలు ఉపయుక్తములని చూపబడుచున్నది.

## కాయాగ్ని యొక్క భేదములు-వాని లక్షణము

12. అగ్నిషు తు శారీరేషు చతుర్విధో విశేషో బలభేదేన భవతి తద్యథా - తీక్ష్ణో మన్దః సమో విషమశ్చేతి. తత్ర తీక్ష్ణోఽగ్నిః సర్వాపచారసహః తద్విపరీత లక్షణస్తు మన్దః, సమస్తు ఖల్వపచారతో వికృతి మాపద్యతేఽనపచారతస్తు ప్రకృతావవతిష్ఠతే, సమలక్షణ విపరీతలక్షణస్తు విషమ ఇతి. యిత్యేతే చతుర్విధా భవన్త్యగ్నయశ్చతుర్విధానామేవ పురుషాణామ్,

తత్ర సమవాత పిత్తశ్లేష్మాణాం ప్రకృతిస్థానాం సమా భవన్త్యగ్నయః, వాతలానాం తు వాతాభిభూతేఽగ్న్యధిష్ఠానే విషమాభవన్త్యగ్నయః, పిత్తలానాం తు పిత్తాభిభూతే హ్యగ్న్యధిష్ఠానే తీక్ష్ణాభవన్త్యగ్నయః, శ్లేష్మలానాం తు శ్లేష్మాభిభూతే హ్యగ్న్యధిష్ఠానే మన్దాభవన్త్యగ్నయః.

**తాత్పర్యము :** శరీరములందున్న అగ్నిని బలమును బట్టి నాలుగు విధములుగా విభజించడం జరిగినది. అవి తీక్ష్ణ, మంద, సమ మరియు విషమాగ్నులు, తీక్ష్ణాగ్ని, ఎట్టి అపచారమునైననూ సహించునదై యుండును. (అనగా విషమ-విరుద్ధ గురు మొదలైన ఆహారసేవనచేత ఎట్టి వికారము నొందక ఎట్టి ఆహారమునైననూ జీర్ణింపజేయునది) మందాగ్నికి పై లక్షణములకు వ్యతిరేకమైన లక్షణము లుండును. (అనగా భోజనమునందుండు గురు విషమాది పదార్థములను అది జీర్ణింపజేయ జాలదు). ఇది ఎట్టి అపచారమును సహింపదు. సమాగ్ని అపచారము వలన వికృతి నొందును. అపచారము చేయకుండుట వలన (కాల, మాత్రాది విధి ననుసరించి సరియగు ఆహార సేవనము వలన) ప్రకృతావస్థలో నుండును. సమాగ్ని లక్షణములకు వ్యతిరేక లక్షణములు గలది విషమాగ్ని యనబడును. (ఇందొకొక్కపరి ఎట్టి ఆహారమునైననూ జీర్ణింపజేయుట, ఒకొక్క పర్యాయము మందముగ నుండుట జరుగుచుండును.) చతుర్విధములైన పురుషులకు అగ్నులు ఈ విధముగా చతుర్విధములై యుండును. వాతపిత్త శ్లేష్మములు సమముగా నున్నచో, తమ తమ స్వగుణములతో కూడియున్నచో అగ్నికూడా సమముగ నుండును. వాత ప్రకృతి గలవారికి వాతము అగ్నిస్థానమున ఉండి విషమాగ్నిని కలుగజేయును. పిత్తప్రకృతి గల వారికి పిత్తము అగ్నిస్థానమును ఆశ్రయించియుండి తీక్ష్ణాగ్నిని కలుగజేయును. శ్లేష్మ ప్రకృతిగలవారికి అగ్ని యధిష్ఠానమును శ్లేష్మము ఆశ్రయించి యుండి మందాగ్నిని కలుగజేయును.

**ఆయుర్వేద దీపిక :** దోషముల యొక్క, వికారముల యొక్కయు వివిధ భేదములను వివరించి శరీరమున ప్రధాన కారణమై యుండు అగ్నియొక్క భేదములు వివరింపబడుచున్నవి. శరీరములందు అను సామాన్య వచనముచేత మనుజులందరి శరీరమునందున్న అగ్నిని గ్రహించడమైనది. తీక్ష్ణాగ్ని సర్వాపచారములను సహించునదిగా నుండును అని జఠరాగ్ని యొక్క చాతుర్విధ్యమును తెలియజేయుచూ తీక్ష్ణత్వాదులకు జఠరాగ్నియే మూలమైయుండి ఆ ప్రభావము త్వగగ్ని (చర్మమునందుండు అగ్ని)కిని గలదని తెలియజేయడమైనది. చికిత్సా

స్థానమునందు అగ్నులు జఠరాగ్నినే ఆశ్రయించుకొని యుండును. జఠరాగ్ని వృద్ధి యైనప్పుడు వృద్ధి పొంది క్షీణించినపుడు క్షీణించును అని చెప్పబడినది.

(తస్మాలాస్తేహి తద్వృద్ధిక్షయ వృద్ధిక్షయాత్మకాః....చి. స్థా. 15 అధ్యాయము) సమాగ్ని అన్నిటికంటె శ్రేష్ఠమైన దగుటవలన ముందుగా చెప్పదగినప్పటికీ అందరూ ఒప్పుకొన్నట్లు తీక్ష్ణాగ్నియే ప్రాధాన్యమగుటను చూపుటకిచ్చట దానిని ముందుగా పేర్కొనడమైనది. వికారము లేవియూ లేనప్పుడు మాత్రమే సమాగ్నికి ప్రాధాన్యమివ్వవచ్చును. కానీ సర్వాపచారములను సహింపగలుగుటచేత తీక్ష్ణాగ్నియే ప్రధానమైనది. తద్వ్యతిరేకమైన లక్షణములు కలది అనగా కొంచెము అపచారము (గురు-విషమాది ఆహార సేవనము)ను కూడా సహించలేనట్టిది. అది మందాగ్ని అని తెలియవలెను. సమాగ్ని లక్షణములకు వ్యతిరేక లక్షణములు కలది విషమాగ్ని యనుట వలన విషమోపచారములచేత ఒక్కొక్కప్పుడు వికారము చెందుచూ స్థిరత్వము (సమత్వము) లేనిది విషమాగ్నియని గ్రహింపవలెను. వాతపిత్త శ్లేష్మములు సమములుగా ఉన్నప్పుడు అని ప్రకృతి స్థానామ్ అని కూడా అనుట వలన (నిర్ణీత పరిమాణములో స్వగుణములతోనున్న అనుటవలన) ఈ మూడును సమముగా వృద్ధి చెందుట కూడా మంచిది కాదని తెలియజేయబడినది. ప్రకృతి శబ్దమునకున్న కారణము మొదలగు అనేకార్థములు తీసివేయుటకు సమవాత పిత్త శ్లేష్మములనెడి పదము ఉపయోగించబడినది. వాతముచేత అగ్నియొక్క అధిష్ఠానము దూషింపబడినప్పుడు అనుటవలన వాత ప్రకృతిగల వారికి వాతము అగ్న్యధిష్ఠానము చేరి వికృతి కలిగించినపుడు మాత్రమే అగ్నివైషమ్యమును పొంది విషమాగ్ని యగును అని తెలియనగును. ఇదే విధముగా పిత్తాభిభూత శ్లేష్మాభిభూత శబ్దములను అన్వయించుకొనవలెను.

## శారీరక ప్రకృతి

13. తత్ర కేచిదాహుః-న సమానవాతపిత్తశ్లేష్మణో జన్తవః సన్తి,విషమాహారోపయోగిత్వాన్మనుష్యాణామ్, తస్మాచ్చ వాతప్రకృతయః కేచిత్, కేచిత్ పిత్తప్రకృతయః,కేచిత్ పునః శ్లేష్మప్రకృతయో భవన్తీతి.తచ్చానుపపన్నమ్, కస్మాత్కారణాత్?సమవాతపిత్తశ్లేష్మాణం హ్యారోగమిచ్ఛంతి భిషజః,యతః ప్రకృతిశ్చారోగ్యమ్ ఆరోగ్యార్థా చ భేషజప్రవృత్తిః, సా చేష్టరూపా,తస్మాత్ సన్తి సమవాతపిత్తశ్లేష్మాణః న తు ఖలు సన్తి వాతప్రకృతయః పిత్త

ప్రకృతయః శ్లేష్మప్రకృతయో వా తస్య తస్య కిల దోషస్య హి ఆధిక్య భావాత్సా సా దోషప్రకృతిరుచ్యతే మనుష్యాణామ్, న చ వికృతేషు దోషేషు ప్రకృతిస్థత్వముపపద్యతే, తస్మాన్నైతాః ప్రకృతయః సన్తి, సన్తితు ఖలు వాతలాః పిత్తలాః శ్లేష్మలాశ్చ,అప్రకృతిస్థాస్తు తే జ్ఞేయాః.

**తాత్పర్యము :** ఈ సందర్భమున కొందరు ఏ ప్రాణియును సమవాత పిత్త కఫ ప్రకృతి గలవాడై యుండవని యందురు. ఇది ఎందువలననగా ఏ మనుష్యునకు ఆహారము సమముగా సేవించుట జరుగదు. అందుచేత కొందరు వాత ప్రకృతి, కొందరు పిత్త ప్రకృతి, మరికొందరు శ్లేష్మ ప్రకృతి కలిగి యుందురు అని వీరి అభిప్రాయము. కానీ ఇది సరికాదు. ఎందువలననగా ఎవరికి వాతపిత్త కఫములు సమముగానున్న ప్రకృతి యుండునో వారికి అనారోగ్యము కలుగదని వైద్యులందురు. ప్రకృతి స్థితియే ఆరోగ్యము. ఆరోగ్యము కొరకే ఔషధము నుపయోగించెదరు. ఇదే సర్వులకు ఇష్టమైనది. అందువలననే మనుజులు సమ వాత పిత్త శ్లేష్మము కలవారై యుందురు. ఎవరునూ వాత ప్రకృతి లేదా పిత్త ప్రకృతి లేదా కఫ ప్రకృతి కలిగియుండరు. ఆయా దోషముల ఆధిక్యానుసారము మనుజు లను ఆయా దోషప్రకృతి కలవారుగా విభజించి పిలుతురు. దోషములు వికృతి చెంది యున్నప్పుడది ప్రకృతి యనబడదు. కాబట్టి ఇట్టి ప్రకృతులుండవు. కానీ మనుజులు వాతాధిక్యము, పిత్తాధిక్యము, కఫాధిక్యము కలిగియుండుట కద్దు. వీరిని ప్రకృతావస్థలోనున్న వారుగా కాక అప్రకృతావస్థలో నున్నవారుగా గుర్తింపదగును.

**ఆయుర్వేద దీపిక :** విషమాహారమునుపయోగించుటచేత అనగా మను జుడు ఒక పద్ధతి ప్రకారము సరియగు ప్రమాణములో (తులాభారమునందు తుంచి నట్లుగా) ఆహారము తీసుకొనడు. దీనివలన వాతాది దోషములు తప్పక వికారము నొందునని భావము. సమవాతపిత్త శ్లేష్మము మొదలైన వాక్యము అనుటచేత దోష ములు సమముగా నున్నంతవరకు మనుజునియందు ఆరోగ్యముండుననునది వైద్య వ్యవహార సిద్ధము. అందుచేత ఎటుల ఈ దోషములు కాలానుసారము పొందు వైషమ్యము వికారము లేనట్టిదై సామ్యమనబడునో అటులనే ప్రకృతి యవస్థలో నున్నదియును సామ్యములని భావము. కొందరు చెప్పుకోదగిన రోగము కల్గించ నందున ఈ వైషమ్యమును గుర్తింపరు. దోష ప్రకృతి యనగా దుష్టములైన దోష ములచే కలిగిన ప్రకృతియని అర్థము.

## రోగములను చికిత్సించుటయందు అగ్నియొక్క ప్రాధాన్యత

14. తేషాం తు ఖలు చతుర్విధానాం పురుషాణాం చత్వార్యనుప్రణిధానాని శ్రేయస్కరాణి భవన్తి. తత్ర సమసర్వధాతూనాం సర్వాకారసమమ్, అధికదోషాణామ్ తు త్రయాణాం యథాస్వం దోషాధిక్యమభిసమీక్ష్య దోషప్రతికూలయోగీని త్రీణ్యనుప్రణిధానాని శ్రేయస్కరాణి భవన్తి, యావదగ్నేః సమీభావాత్, సమే తు సమమేవ కార్యమ్: ఏవం చేష్టా భేషజప్రయోగాశ్చాపరే. తాన్ విస్తరేణానువ్యాఖ్యాస్యామః

**తాత్పర్యము :** ఇట్టి నాల్గు విధములైన ప్రకృతి గల పురుషులకు నాల్గు విధములైన అనుసరించవలసిన కర్తవ్యము లున్నవి. అన్ని ధాతువులను సమముగా నున్న విధానము ననుసరించవలెను. ఏదేని ఒక దోషము అధికముగా నున్నచో దానిని బాగుగా సమీక్షించి ఆ యధిక దోషమునకు ప్రతికూలమైన చర్యలను తీసి కొనుట మంచిది. ఇదియును అగ్ని సమస్థితికి వచ్చువరకు చేయవలెను. అగ్ని సమ ముగా నున్నచో తదనుసారముగా సమముగనే క్రియలు (ఆహార ఔషధాదులు) ప్రయోగించవలెను. ఇతర స్థితులయందును అట్లే ఔషధాది ప్రయోగమును చేయ వలెను. వాటిని గురించి వివరంగా చెప్పుకొందము.

**ఆయుర్వేద దీపిక :** దోషాధిక్యమునందు వాటికి వ్యతిరేకమైన యోగ ములు దోష వ్యతిరేక యోగములు మూడు విధములైన అనగా వాత పిత్త శ్లేష్మ ములు మూడింటికి వ్యతిరేకమైన సమమునందు అనగా అగ్ని సమత్వమును పొందియున్న సమయమునందు - యథోచితముగా సమత్వము నిలిపియుంచునట్టి ప్రక్రియలనే చేయవలెను. ఇట్లే యనుటలో ఈ విధముగనే వాతాది ప్రకృతులయందు విహారము మరియు ఔషధమును కూడా ప్రయోగించవలెనని యర్థము. ఇట్లే యను టను నాల్గువిధములైన ప్రకారములందును యనువారు - సమ ప్రకృతి గలవారికి సమత్వమును నిలిపియుంచు వ్యాయామము (విహారము) మొదలైన చేష్ట మరియు ఔషధమును, ఋతుచర్యకు అనుకూలమైన వమనాదులను చేయుటను సూచింపబడిన దని వ్యాఖ్యానింతురు.

## రోగులు దోషానుసారము మూడు విధములుగా నుందురు

15. త్రయస్తు పురుషా భవన్త్యాతురాః,తే త్వనాతురా స్తంత్రాంతరీయాణాం భిషజామ్.తద్యథా-వాతలః,పిత్తలః,శ్లేష్మలశ్చేతి.తేషామిదం విశేషవిజ్ఞానం- వాతలస్య వాతనిమిత్తాః, పిత్తలస్య పిత్తనిమిత్తాః, శ్లేష్మలస్య శ్లేష్మనిమిత్తా వ్యాధయః ప్రాయేణ బలవంతశ్చ భవన్తి.

## వాతల రోగులు — వారికి చేయదగు చికిత్సలు

16. తత్ర వాతలస్య వాతప్రకోపణోక్తాన్యాసేవమానస్య క్షిప్రం వాతః ప్రకోపమాపద్యతే, న తథేతరౌ దోషౌ,స తస్య ప్రకోపమాపన్నో యథో- క్తైర్వికారైః శరీరముపతపతి బలవర్ణసుఖాయుషాముపఘాతాయ.తస్యావ- జయనం-స్నేహస్వేదౌ విధాయుక్తౌ మృదూని చ సంశోధనాని స్నేహోష్ణ- మధురామ్లలవణయుక్తాని,తద్వదభ్యవహార్యాణి, అభ్యఙ్గోపనాహోద్వేష్టనోన్మ- ర్దనపరిషేకావగాహనసంవాహనావపీడనవిత్రాసనవిస్మాపనవిస్మారణాని, సురా- సవవిధానం, స్నేహాశ్చానేకయోనయో దీపనీయపాచనీయోపహితాః తథా శతపాకాః సహస్రపాకాః సర్వశశ్చప్రయోగార్థాః, బస్తయః, బస్తినియమః సుఖశీలతా చేతి.

**తాత్పర్యము :** మూడు విధములైన పురుషులు వ్యాధిగ్రస్తులగుదురు. గ్రంథాంతరమునందు ఆరోగ్యవంతులు మూడు విధములని చెప్పబడినది. వారు — వాతాధిక్యము గలవారు, పిత్తాధిక్యము గలవారు మరియు శ్లేషాధిక్యము గలవారు. అందు వాతాధిక్యము గలవారికి వాతవ్యాధులు, పిత్తాధిక్యము గలవారికి పిత్త సంబంధ మైనవి మరియు శ్లేష్మాధిక్యము గలవారికి శ్లేష్మసంబంధములైనవియును బలవంత మైన వ్యాధులు సాధారణముగా వచ్చుచుండును. వాత ప్రధానమైన వారికి వాతవృద్ధి కరములను సేవించుటచే వెంటనే వాతము ప్రకోపించునేగాని, ఇతరములైన పిత్త కఫములు ప్రకోపించవు. ఆ విధముగా ప్రకోపించిన వాతము ఆ పురుషుని శరీర మును వాత వ్యాధులచే పీడించి బలవర్ణ సుఖాయుష్షులను నశింపజేయును. ఇట్లు ప్రకోపించిన వాతమును ఈ క్రింద చెప్పబడిన ప్రక్రియలచే జయించవలెను. (చికి త్సించవలెను) విధియుక్తములైన స్నేహ స్వేదములు, స్నేహ ఉష్ణ మధుర ఆమ్ల లవణములతో కూడిన మృదు సంశోధ నౌషధములు మరియు ఆహార పదార్థములు,

అభ్యంగ, ఉపనాహ, ఉద్వేష్టన, ఉన్మర్దన, పరిషేక, అవగాహన, సంవాహన, అవపీడన విత్రాసన - విస్మాపన - విస్మారణములు -సుర-అవసేవనము. అనేకరకములైన స్నేహనములను, దీపనీయ, పాచనీయ, వాతహర విరేచనీయ ద్రవ్యములచే సంస్కరించి ప్రయోగించుట మరియు వానినే శతపాక, సహస్రపాక విధిని నిర్మాణము చేసి అన్నింటను ప్రయోగించుట వస్తిని తన్నియమానుసారము సేవించుట మరియు ఎల్లప్పుడును సుఖకరమైన భావముల సేవనము.

ఆయుర్వేద దీపిక : ఇతరములైన కఫ పిత్తములు రెండును అనగా వాతకర హేతుసేవనము వలన వాతమే వృద్ధి చెందునుగాని మిగిలిన రెండు దోషములును వృద్ధి చెందవని భావము. భయపెట్టుట (విత్రాసనము) వాత వృద్ధికరమైనను వాతము వలన జనించిన ఉన్మాదమును నశింపజేయునదగుట వలన ఇచట చెప్పబడినది. ఉన్మాదమునందు భయపెట్టుట మొదలైన చికిత్సలు సేర్కొనబడినవి. "విత్రాసనము వలన మనస్సు విప్లుతమై (బాగుగా కలచబడినదై) ఉన్మాదము శమించును. (తేన యాతి శమం తస్య సర్వతో విప్లుతం మనః. చికిత్సా స్థానము - 9 వ అధ్యాయము). అన్నింటను ప్రయోగించుటకు అనగా పాన అభ్యంగ వస్తి మొదలైన వాటి యందన్నింటి యందును ప్రయోగించుటకు అని అర్థము. వస్తి నియమము అనగా వస్తి ప్రయోగమునందు దాని నియమమునుసరించి ప్రయోగించుట అని యర్థము లేదా - వస్తి నియమమనగా మంచి ఫలితము కొరకు కర్మ - కాల - యోగ విధుల యందున్న వస్తి సంఖ్యా నియమానుసారము వస్తి ప్రయోగించుట సూచించును. చరకసిద్ధ స్థానమునందు చెప్పబడినట్లు కర్మవస్తి ముప్పది - కాలవస్తి పదునారు - యోగవస్తి ఎనిమిది - ఈ సంఖ్యను అనుసరించవలెను.

(త్రింశన్మతాః కర్మసు బస్తియోగాః, కాలస్తతోఽర్ధేన తతశ్చయోగః.
చ. సి. 1)

సుఖశీలత యనగా ఎల్లప్పుడును సుఖకరమైన భావములనే సేవించుట.

## పిత్తల రోగులు వారికి చేయదగు చికిత్సలు

17. పిత్తలస్యాపి పిత్తప్రకోపణోక్తాన్యాసేవమానస్య క్షిప్రం పిత్తం ప్రకోపమాపద్యతే, న తథేతరౌ దోషౌ, తదస్య ప్రకోపమాపన్నం యథోక్తైర్వికారైః శరీరముపతపతి బలవర్ణసుఖాయుషాముపఘాతాయ. తస్యావజయనమ్-సర్పి

ష్వాసం,సర్పిషా చ స్నేహనం,అథశ్చ దోషహరణం,మధురతిక్తకషాయ-
శీతానాం చౌషధానభ్యవహార్యాణాం ఉపయోగః, మృదుమధుర సురభిశీత-
హృద్యానాం గన్ధానాం చోపసేవా, ముక్తామణిహారావళీనాం చ పరమశిశిర-
వారిసంస్థితానాం ధారణమురసా,క్షణే క్షణే అగ్ర్యచన్దనప్రియఙ్గుకాలీయ-
మృణాలశీతవాతవారిభిః ఉత్పలకుముదకోకనదసౌగన్ధికపద్మానుగతైశ్చ వారి-
భిరభిప్రోక్షణమ్,శ్రుతిసుఖమృదుమధురమనోఽనుగానాం చ గీతవాదిత్రాణాం
శ్రవణమ్, శ్రవణం చాభ్యుదయానామ్ సుహృద్భిస్సంయోగః,సంయోగశ్చ
ఇష్టాభిః స్త్రీభిః శీతోపహితాంశుకస్రగ్ధారిణీభిః,నిశాకరాంశుశీతలప్రవాతహర్మ్య-
వాసః,శైలాన్తరపులినశిశిరసదనవసనవ్యజనపవనసేవనమ్, రమ్యాణాంచోప-
వనానాంసుఖశిశిరసురభిమారుతోపహితానాముపసేవనమ్,సేవనం చ పద్మో-
త్పలనలినకుముదసౌగన్ధికపుణ్డరీకశతపత్రహస్తానాం (హృద్యానాం) సౌమ్యా-
నాం చ సర్వభావానామితి.

**తాత్పర్యము :** పిత్తాధిక్యము గలవారు ఎక్కువగా పిత్త ప్రకోపమును కలుగజేయువానిని సేవించుచున్నచో వెంటనే పిత్తము ప్రకోపించును. వాత కఫ ములు ప్రకోపింపవు. ఇట్లు ప్రకోపము చెందిన పిత్తము తత్ప్రకోపము వలన కలుగు వ్యాధులను కలిగించి బలము, వర్ణము, సుఖమును నశింపజేయుటకు శరీరమును బాధించును. ఇట్టి పిత్తమును జయించుటకు ఈ క్రింది ప్రక్రియలను చేయవలెను. ఘృతపానము ఘృతాభ్యంగనము, విరేచనము ద్వారా దోష నిర్మూలనము, మధుర తిక్త కషాయరసము శీత గుణము కలిగిన ఔషధ ఆహారముల సేవనము, మృదు మధుర సుగంధ భరిత హృద్యములైన వాసనలను చూచుట, అతి చల్లనినీటిలో నుంచిన ముత్యములు మణుల హారములను ఛాతీపై ధరించుట, మాటిమాటికి — శ్వేత చందన, ప్రియంగు, పీతచందన, తామరతూడులు (వీని నరగదీసి శరీరముపై లేపనము చేసికొనుట) శీతల జలము, వాయువులున్నచోట పుట్టిన నల్లకలువ తామర, సుగంధ కమలములను నీటిలోనుంచి ఆ నీటిని గుడ్డతో శరీరముపై ప్రోక్షణము చేసికొనుట, చెవుల కింపైన మృదుమధుర మనోజ్ఞ గీతవాద్యములను వినుట, అభ్యున్నతిని కలుగజేయువానిని వినుట, స్నేహితులతో కలసియుండుట, చంద్రకిరణములచే చల్లని గాలులు వీచు భవనములందు నివాసము, పర్వత గుహాలయందు చల్లని ఆహ్లాదకరమైన గృహములయందు నివసించుచు శీతల వస్త్రధారణము, శీతల ఆహార సేవనము, శీతల పవనములు సేవించుట, రమ్యమైన ఉపవనములలో సుఖకరమైనచల్లని

సుగంధ భరితమైన గాలులమధ్య యుండుట, నల్లకలువ, తామర, కలువ, సుగంధ కలువ, తెల్లకలువ, గులాబి వంటి పుష్పముల కలాపములు నాస్వాదించుట మరియు అన్నింటి సౌమ్యములైన భావములను సేవించుట.

**ఆయుర్వేద దీపిక :** యథోక్తములైన అనగా మహారోగాధ్యాయము నందు చెప్పబడిన అపోమార్గమున దోషములను హరించుటయనగా విరేచనము చేయించుట ద్వారా అని యర్థము. అగ్రుచందనము, శ్వేత చందనము, హస్తానాం అనగా కలాపములను (ఈ పుష్పములను ధరించుట, ప్రక్కపై పరచుట మొదలైన అన్ని కలాపములను)

## శ్లేష్మల రోగులు-వారికి చేయవలసిన చికిత్సలు

18. శ్లేష్మలస్యాపి శ్లేష్మప్రకోపణో క్తాన్యాసేవమానస్య క్షిప్రం శ్లేష్మప్రకోపముపపద్యతే, న తథేతరౌ దోషౌ,స తస్య ప్రకోపమాపన్నో యథోక్తైర్వికారైః శరీరముపతపతి బలవర్ణసుఖాయుషముపఘాతాయ. తస్యావజయనమ్-విధియుక్తాని తీక్ష్ణోష్ణాని సంశోధనాని రూక్షప్రాయాణి చాభ్యవహార్యాణి కటుకతిక్తకషాయోపహితాని, తథైవ ధావనలంఘనప్లవనపరిసరణజాగరణనియుద్ధ వ్యవాయవ్యాయామోన్మర్దన స్నానోత్సదనాని,విశేషత స్తీక్ష్ణానాం దీర్ఘకాలస్థితానాం చ మద్యానాముపయోగః ధూమపానః సర్వశశ్చోపవాసః తథోష్ణంవానః సుఖప్రతిషేధశ్చ సుఖార్థమేవేతి.

**తాత్పర్యము :** శ్లేష్మాధిక్యము కలవారికిని, శ్లేష్మమును ప్రకోపింపజేయు భావములను సేవించుటచేత వెంటనే శ్లేష్మము ప్రకోపించును. వాత పిత్తములు ప్రకోపించవు. ఇట్లు ప్రకోపించిన శ్లేష్మము యథోక్తవ్యాధులచేత బలము, వర్ణము, సుఖము, ఆయుష్షులను నశింపజేయుటకు శరీరమును బాధించును. ప్రకోపించిన శ్లేష్మమును జయించుటకు ఈ క్రింది ప్రక్రియలను చేయవలెను. విధి పూర్వకముగా చేయబడిన తీక్ష్ణ, ఉష్ణ, సంశోధన క్రియలు-రూక్షగుణము కొంచెము అధికముగా నున్న కటు తిక్త కషాయ రసములు గల ఆహారపదార్థముల సేవనము, అటులనే పరుగెత్తుట, ఎగురుట, గంతులు వేయుట, గుండ్రముగా తిరుగుట, రాత్రి మేల్కొని యుండుట, యుద్ధము చేయుట, మైథునము చేయుట వ్యాయామము చేయుట, శరీరమును మర్ధించుకొనుట, స్నానము, శరీరమును

పీడింపజేయుట తీక్ష్ణములై చిరకాలము సంధానము చేయబడియున్న మద్యముల నుపయోగించుట, ధూమపానము, పూర్తిగా ఉపవాసముండుట, ఉష్ణప్రదేశము నందుం డుట, ఉష్ణమును పుట్టించు వస్త్రములను ధరించుట, సుఖముకొరకు (ఆరోగ్యము కొరకు) సుఖకరమైన భావములను (శ్లేష్మ వృద్ధికరములైన భావములను) విసర్జిం చుట.

**ఆయుర్వేద దీపిక :** శ్లేష్మమును జయించుటకు రూక్ష గుణము హితమై నందున రూక్ష గుణముగల వస్తువులనే వాడవలెననుచూ రూక్ష ప్రాయములవి చెప్పుట వలన (కొంచెము రూక్షగుణము అధికముగా గల వస్తువులని చెప్పుటవలన) అత్యధిక రూక్షాహారమువలన వానిని (అత్యధిక పదార్థములను) సేవింపరాదనుట సూచింపబడినది. రస విమానాధ్యాయమునందు "స్నిగ్ధ పదార్థములు భుజించుటకు అనువుగా నుండి అగ్నిని రగిలింపజేయుట వలన వాటినే సేవింపవలెనని చెప్పబడినది.

(స్నిగ్ధమశ్నీయాత్ స్నిగ్ధం హి భుక్తం స్వదతే భుక్తమౌవర్యమగ్నిముదీర యతి. విమానస్థానము 1వ అధ్యాయము)

పూర్తిగా ఉపవాసముండుట, యనగా అన్ని విధముల లంఘనములను సేవిం చుట, సూత్రస్థానమునందు చెప్పబడినట్లు చతుష్ప్రకారములైన సంశుద్ధులలో ఉపవాస మొకటి (చతుష్ప్రకారా సంశుద్ధిః పిపాసా మారుతా తపౌ పాచనాన్యుపవాసశ్చ వ్యాయామశ్చేతి లంఘనమ్. చ. సూ. 22) ఇక్కడ ఉపవాస శబ్దము లంఘనము నకు వర్తించును. సుఖముకొరకు అనగా రాబోవు సుఖముకొరకు (ఆరోగ్యము కొరకు) సుఖమును వివర్జించుటవలన శ్లేష్మ క్షయము సంభవించి శ్లేష్మ వికార ములు లేని సుఖము (ఆరోగ్యము) కలుగును.

## రాజవైద్యుని లక్షణము

భవతిచాత్ర—

19 సర్వరోగ విశేషజ్ఞః సర్వకార్యవిశేషవిత్,
సర్వభేషజతత్త్వజ్ఞో రాజ్ఞః ప్రాణపతిర్భవేత్. ఇతి

**తాత్పర్యము :** సకల రోగ విశేషములను వాటి చికిత్సా ప్రక్రియలను మరియు సకలములైన ఔషధ తత్త్వములను ఎరిగినవాడు రాజుయొక్క ప్రాణ రక్ష కుడు కాగలడు (పైె చెప్పిన త్రివిధ దోష ప్రకోపములయందు చేయు కార్యములు రాజులకే సాధ్యపడియున్న సందర్భమున రాజవైద్యుని లక్షణము క్లుప్తముగా నిచట చెప్పబడినది).

**ఆయుర్వేద దీపిక :** యథోక్త అధ్యాయ జ్ఞానము వలననే సర్వరోగ జ్ఞానము కలుగునని చెప్పబడినది. ప్రాణములను రక్షించువాడు ప్రాణపతి.

(ప్రాణాన్ పాతి రక్షతీతి ప్రాణపతిః)

## అధ్యాయ సంగ్రహము

తత్రశ్లోకాః

20. ప్రకృత్యంతరభేదేన రోగానీకవికల్పనమ్,
పరస్పరావిరోధశ్చ సామాన్యం రోగదోషయోః.

21. దోషసంఖ్యా వికారాణామేకదేశ ప్రకోపణమ్,
జరణం ప్రతి చింతా చ కాయాగ్నేర్థుక్షణాని చ,

22. నరాణాం వాతలాదీనాం ప్రకృతిస్థాపనాని చ,
రోగానీకే విమానేఽస్మిన్ వ్యాఖ్యాతాని మహర్షిణా.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరక ప్రతిసంస్కృతే విమానస్థానే రోగానీక విమానం నామ షష్ఠోఽధ్యాయః

**తాత్పర్యము :** కారణాంతరము వలన రోగ సముదాయము సందలి భేదములు, ఈ వివిధ భేదములలో పరస్పరము విరోధము లేకుండుట, రోగము, దోషముల సమానత్వము, దోషముల సంఖ్య, వికారములు, దోషముల ప్రకోపకారములు. అగ్నికి సంబంధించిన ఆలోచన, కాయాగ్ని రక్షణోపాయములు, వాతాధిక్యము గల నరులను ఆరోగ్యావస్థను చేయుటచ్చు వివిధ ప్రక్రియలు. ఇవన్నియును విమాన స్థానమందలి రోగానీకాధ్యాయమున మహర్షి యగు ఆత్రేయునిచే వివరింపబడినవి.

ఇది అగ్నివేశునిచే రచింపబడి, చరకునిచే ప్రతిసంస్కరింపబడిన తంత్రములోని విమానస్థానమందలి రోగానీక విమానమను ఆరవ అధ్యాయము.

**ఆయుర్వేద దీపిక :** సంగ్రహముగా జీర్ణింపజేయునది జరణము అనగా అగ్ని. దీనిని గురించిన ఆలోచన "అగ్నిషు...." మొదలైన శ్లోకములందు చేయబడినది. ప్రకృతి స్థానములు అనగా ఔషధములు. (శరీరమును సహజ స్థితికి తెచ్చునవి).

ఇది శ్రీ చక్రపాణి దత్తునిచే రచింపబడిన చరక తాత్పర్య టీకయగు ఆయుర్వేద దీపిక యందలి విమాన స్థానమున రోగానీక విమానమను ఆరవ అధ్యాయము.

# వ్యాధితరూపీయ విమానము

## సప్తమాధ్యాయము

1. అథాతో వ్యాధితరూపీయం విమానం వ్యాఖ్యాస్యామః.
2. ఇతి హ స్మాహ భగవానాత్రేయః.

**తాత్పర్యము :** ఇక ఇప్పుడు వ్యాధిత రూపీయమను విమానమును గురించి చెప్పుకొందము అని ఆత్రేయ భగవానుడనెను.

**ఆయుర్వేద దీపిక :** పూర్వాధ్యాయమున వ్యాధిని గురించి ప్రతిపాదించి యిప్పుడు వ్యాధిత పురుషుని (రోగి) యొక్క భేదములను ప్రతిపాదించుటకున్నూ సందర్భవశమున కృములను గురించివి వర్ణించుటకున్నూ వ్యాధిత పురుషీయాధ్యాయము పేర్కొనబడుచున్నదీ.

### వ్యాధిత పురుష ద్వైవిధ్యము-లఘువ్యాధిములు, గురువ్యాధితులు

3. ఇహ ఖలు ద్వౌ పురుషౌ వ్యాధితరూపౌ భవతః, గురువ్యాధితః లఘువ్యాధితశ్చ. తత్ర గురువ్యాధిత ఏకః సత్వబలశరీరసంపదుపేతత్వాల్లఘు వ్యాధిత ఇవ దృశ్యతే, లఘువ్యాధితోఽపరః సత్త్వాదీనామధమత్వాద్గురు వ్యాధిత ఇవ దృశ్యతే. తయోరకుశలాః కేవలం చక్షుషైవ రూపం దృష్ట్వాఽధ్యవస్యన్తో వ్యాధితగురులాఘవే విప్రతిపద్యన్తే.

**తాత్పర్యము :** వ్యాధిచే పీడింపబడువారు (రోగులు) ముఖ్యముగా రెండు విధములుగా నుందురు- గురు వ్యాధి పీడితులు మరియు లఘువ్యాధి పీడితులు. గురు వ్యాధితుడగు వాడు సత్యము, బలము, శరీరసంపద - ఇవి అధికముగా నుండుటచే లఘు వ్యాధితునివలె కన్పడును. లఘు వ్యాధితుడు సత్వాదులు హీనముగా నుండుటచే గురువ్యాధితుని వలె అగపడును. సరియగు జ్ఞానము లేనివారు కేవలము దృష్టివలన రూపమును చూచి గురులాఘవ వ్యాధితులను వ్యతిరేకముగా నిర్ణయింతురు.

**ఆయుర్వేద దీపిక :** వ్యాధిని కలిగియున్నవాడు వ్యాధితుడు. వాని (వ్యాధితుని)వలె రూపము గలవాడు వ్యాధితరూపుడు- వ్యాధితునివలె నున్నవాడని

యర్థము. దీనివలన వ్యాధిత రూపులు అనుట వలన గురు, లఘు వ్యాధులచే పీడింప బడుచున్నవారి వలెనున్నవారు అని గ్రహింపవలెను. గురు వ్యాధి వలన పీడింపబడు చున్నవాడు సత్త్వాదుల ఆధిక్యము వలన లఘు వ్యాధితుని వలె కన్పట్టును. ఇతడు గురు వ్యాధితుడే గానీ లఘు వ్యాధిచే పీడింపబడుచున్న వాడనుకొనరాదు. అట్టివాడు గురు వ్యాధి (పెద్దవ్యాధి) చేతనే పీడింపబడుచూ గురువ్యాధిని గుర్తింపలేని వారికి లఘు వ్యాధితునిగా అగుపించును. ఇట్లే లఘు వ్యాధితునికి సంబంధించిన విషయ మును కూడా అన్వయించుకొనవలయును. అధమత్వము వలన అనగా అవరత్వము (హీనత్వము) వలన అని యర్థము. చక్షుషైవ అనుట వలన ఇతర ఇంద్రియములచే తెలియదగిన లక్షణమును చక్షురింద్రియము ద్వారానే గ్రహించుట. అందుచేత స్పర్శా దులచే గూడా విశేష జ్ఞాన సాధనములచేతను అని తెలియవలెను. రూపమనగా వ్యతి రేకరూపము. 'అధ్యవస్యన్త' అనగా నిశ్చయము చేయుదురు. గురు లాఘవములను వ్యతిరేకముగా ప్రతిపాదింతురు. అనగా గురుత్వ లఘుత్వములను సరిగా ప్రతిపాదిం పరు.

## సంపూర్ణ జ్ఞానము యొక్క ఆవశ్యకత

4. న హి జ్ఞానావయవేన కృత్స్నే జ్ఞేయే జ్ఞానముత్పద్యతే. విప్రతిపన్నాస్తు ఖలు రోగజ్ఞానే ఉపక్రమ యుక్తిజ్ఞానే చాపి విప్రతి పద్యన్తే. తే యదా గురువ్యాధితం లఘువ్యాధిత రూప మాపాదయన్తి, తదా తమల్పదోషం మత్వా సంశోధన కాలేఽస్మై మృదుసంశోధనం ప్రయచ్ఛన్తో భూయ ఏవాస్య దోషానుదీర యన్తి.యదా తు లఘు వ్యాధితం గురువ్యాధితరూపమాపాదయన్తి, తదా తం మహాదోషం మత్వా సంశోధనకాలేఽస్మై తీక్ష్ణం సంశోధనం ప్రయచ్ఛ-న్తో దోషానతి నిర్హృత్య శరీరమస్య క్షిణ్వన్తి. ఏవమవయవేనేన జ్ఞానస్య కృత్స్నే జ్ఞేయే జ్ఞానమభిమన్యమానాః పరిస్ఖలన్తి.విదితవేదితవ్యాస్తు భిషజః సర్వం సర్వథా యథా సంభవం పరీక్ష్యం పరీక్ష్యాధ్యవస్యన్తో న క్వచిదపి విప్రతి పద్యన్తే యథేష్టమర్థమభినిర్వర్తయన్తి చేతి.

తాత్పర్యము : సంపూర్ణముగా జ్ఞానము పొందదగు విషయములను ఏదో ఒక అంశము చేత జ్ఞానము కలుగదు. వ్యతిరేక ప్రతిపాదన చేయువారు (సంపూర్ణ జ్ఞానము లేకపోవుటచే) రోగ నిర్ణయము నందు, చికిత్సా విషయము నందును వ్యతిరేక ప్రతిపాదనలను చేయుదురు (తప్పు నిర్ణయము తీసుకొందురు).

వారు గురు వ్యాధితుని లఘు వ్యాధితునిగా నిర్ణయించినపుడు వానిని అల్పదోషము కలవానిగా గుర్తించి సంశోధనము చేయునపుడు తేలికగనే సంశోధనము గావించి దోషముల నింకనూ ప్రకోపింపజేయుదురు. లఘు వ్యాధితుని గురు వ్యాధితునిగా గుర్తించినపుడు వానిని అధిక దోషము కల వానిని గుర్తించి సంశోధనము చేయునప్పుడు, తీక్ష్ణ సంశోధనములను ప్రయోగించుటచే దోషములను అధికముగా బయలు వెడలించి, తద్వారా అతని శరీరమును క్షీణింప జేయుదురు. ఈ విధముగా అంశ మాత్ర జ్ఞానము చేత సంపూర్ణ జ్ఞానము కలుగునని భావించు వైద్యులు ఈ విషయమున తప్పు దోవపడుదురు (నిదాన చికిత్సలను సరిగా చేయరు). తెలిసి కొనవలసిన విషయము లన్నింటిని క్షుణ్ణముగా తెలిసికొనిన వైద్యుడు అన్నింటిని అన్ని విధముల వీలైనంత వరకు పరీక్షించవలసిన వాటిని పరీక్షించి సరియగు నిర్ణయము తీసికొనును. ఎట్టి పరిస్థితులలోనూ తప్పుడు ప్రతిపాదనలను చేయడు. తన యిష్ట ప్రకారము కార్యములను నిర్వర్తింపడు.

ఆయుర్వేద దీపిక : ఇచ్చటనే వ్యతిరేక ప్రతిపాదనలకు కారణము చెప్పబడుచున్నది. జ్ఞానావయవేన అనగా ఏకదేశ జ్ఞానము వలన (సంపూర్ణముగా కాక జ్ఞానము యొక్క ఒకఅంశము వలన) వ్యతిరేక ప్రతిపాదనము వలన కలుగు ఫలితమును "విప్రతి పన్నాస్తు" అను వాక్యము నందు చెప్పబడినది. ఉపక్రమము యొక్క అనగా ఔషధ ప్రయోగము వికారమునకు సరిపడునట్లు ఔషధ ప్రయోగము చేయుట ఉపక్రమ యుక్తి అనబడును (చికిత్సాయుక్తి యనబడును).

ఈ యుక్తిని తెలియుట యందు వ్యతిరేక ప్రతిపాదనలు చేయుదురు. దీనినే "తే యదా........" అను వాక్యమున సోదాహరణముగా వివరించడమైనది. ఆసాద యంతి అనగా తెలిసికొందురు. గుర్తించెదరు. ఉదీరయంతి అనగా ప్రకోపింపజేయు దురు. అంతేగాని అల్ప బలము చేత తగ్గింతురనుట సరికాదు. అతిగా వెడలించుట యనగా దోషములను (వెడలించవలసిన) పరిమాణమునకు మించి వెడలింతురు. జ్ఞానము యొక్క అనగా జ్ఞాన సాధనము యొక్క యథా సంభవమనగా జ్ఞాన సాధనము లేచట నుండునో అచట వాని వానిని అని యర్థము. పరీక్షించవలసినవి సత్త్వాదులు. ఎట్టి పరిస్థితులలోనూ అనగా గురు-లఘువుల యందు.

భవన్తి చాత్ర—

5. సత్త్వాదీనాం వికల్పేన వ్యాధిరూపమథాతురే,
దృష్ట్వా విప్రతిపద్యన్తే బాలా వ్యాధిబలాబలే.

6. తే భేషజమయోగేన కుర్వన్త్యజ్ఞానమోహితాః,
వ్యాధితానాం వినాశాయ క్లేశాయ మహతేఽపివా.

7. ప్రాజ్ఞాస్తు సర్వమాజ్ఞాయ పరీక్ష్యమిహ సర్వథా,
న స్ఖలన్తి ప్రయోగేషు భేషజానాం కదాచన.

**తాత్పర్యము :** అల్పజ్ఞులైన వైద్యులు సత్త్వాదుల భేదము చేత రోగి యొక్క రోగమును చూచి వ్యాధి బలాబలములను తప్పుగా నిర్ణయింతురు. వారు అజ్ఞానమోహము చేత అయోగమగు (సరిపడని) ఔషధమును ప్రయోగించి రోగిని అంతమొందించుట లేదా రోగమును పెంచుట చేయుదురు. ప్రాజ్ఞులు సర్వము తెలిసి కొని అన్ని విధములుగను పరీక్షించి భేషజ ప్రయోగము నందు ఎప్పుడును తప్పు చేయరు.

ఆయుర్వేద దీపిక : పై విషయమునే తేలికగా అర్థము చేసికొనుటకు శ్లోక రూపమున చెప్పడమైనది. వ్యాధి రూపమనగా వ్యాధి యొక్క సరళ తీరు. ఇచ్చట "వ్యాధిత రూపమను"ట సరియగు పాఠమగును. బాలురనగా అల్పజ్ఞులు. అతి యోగము చేత యనగా అసమ్యగ్యోగము చేత-దీని వలన అతియోగమిథ్యా యోగము లను తీసుకొనదగును.

## క్రిమి సంబంధమగు ప్రశ్న

8. ఇతివ్యాధిత రూపాధికారే వ్యాధితరూప సంఖ్యాగ్ర సంభవం వ్యాధిత రూప హేతు విప్రతి పత్తౌ కారణం సాపవాదం సంప్రతిపత్తి కారణం చానపవాదం నిశమ్య-భగవన్తమాత్రేయ మగ్నివేశోఽతః పరం సర్వక్రిమీణాం పురుష సంశ్రయాణాం సముత్థాన సంస్థాన వర్ణనామ ప్రభావ చికిత్సిత విశేషాన్ పప్రచ్ఛోప సంగృహ్యాపాదౌ,,

**తాత్పర్యము :** ఈ విధముగా వ్యాధితరూపుని విషయమున వ్యాధితరూప సంఖ్యా (గురు-లఘు భేదముచేత రెండు విధములనుట) వ్యాధితరూప పరిణామము, తన్నైయన్న, వ్యతిరేక ప్రతిపాదనకు అప వాదముతో కూడిన కారణము, సరియగు

ప్రతిపాదనకు అపవాదము లేకుండా కారణమును చక్కగా విని అగ్నివేశుడు ఆత్రేయ భగవానుని పాదములకు నమస్కరించి పురీషమునందు ఆశ్రయించు కొనియుండు అన్ని విధములైన క్రిముల యొక్క సముత్థాన-స్థాన-సంస్థాన-వర్ణ-నామ-ప్రభావ-చికిత్సా విశేషములను గూర్చి తెల్పుమని యడిగెను.

**ఆయుర్వేద దీపిక :** సామాన్య జ్ఞానముచేత తెలిసికొనదగిన (దుర్జ్ఞేయమైన) వ్యాధి గురు లాఘవత్వమును గూర్చి చర్చించు సందర్భమున దుర్జ్ఞేయమైనట్టి క్రిములను గూర్చిన ప్రకరణము ప్రారంభింపబడుచున్నది. సంఖ్యాగ్ర సంభవమనగా సంఖ్యా ప్రమాణ సంభవమని యర్థము. అగ్రశబ్దము పరిమాణ వాచకము. వ్యాధిత రూపునికి హేతువు సత్త్వము మొదలగు వాని బలా బలములందు కలుగు విప్రతిపత్తి వ్యాధిత రూప హేతువునకు విప్రతిపత్తి యగును. దీనికి కారణము ఏకదేశ జ్ఞానము (అసంపూర్ణ జ్ఞానము). అపవాదముతో కూడి యనగా దోష యుక్తము. సరియైన ప్రతిపత్తి సంప్రతిపత్తి.

## క్రిమి సంబంధమగు వివరము

9. అథాస్మై ప్రోవాచ భగవానాత్రేయః—ఇహ ఖల్వగ్నివేశ ! వింశతివిధాః క్రిమయః పూర్వముద్దిష్టా నానావిధేన ప్రవిభాగేనాన్యత్ర సహజేభ్యః, తే పునః ప్రకృతిభిర్విభజ్యమానాశ్చతుర్విధాభవన్తి. తద్యథా-పురీషజాః, శ్లేష్మజాః, శోణితజా, మలజాశ్చేతి.,

**తాత్పర్యము :** అప్పుడాయనతో ఆత్రేయ భగవాను డిట్లనెను. ఓ అగ్నివేశుడా ! క్రిములలో సహజ క్రిములను వదలి మిగిలిన అనేక ప్రకారములైన వాటి యందు ఇరువది విధములైన క్రిములను పూర్వము అష్టోదరీయాధ్యాయమున వివరించబడమైనది. ఇవి తిరిగి వాటి కారణముల వలన నాల్గు విధములుగా విభజింపబడు చున్నవి. అవి ఏవనగా పురీషజములు, శ్లేష్మజములు, శోణితజములు మరియు మలజములు.

**ఆయుర్వేద దీపిక :** పూర్వము చెప్పబడినవి అనగా అష్టోదరీయాధ్యాయమున సూత్రప్రాయముగా చెప్పబడినవి. ఇతరములైన సహజ క్రిములను అనుటచే శరీరమునందు సహజముగా నుండు క్రిములు శరీరమును బాధింపవు. ఇవి ఇరువది కంటెను అధికముగ నుండును. ప్రకృతిచేత అనగా కారణములచేత, మలజములనగా బాహ్యమలమున పుట్టినవి.

## బాహ్య మలజన్య క్రిములు

10. తత్ర మలో బాహ్యశ్చాభ్యంతరశ్చ తత్ర బాహ్యమలజాతాన్ మలజాన్ సంచక్ష్మహే. తేషాం సముత్థానం-మృజావర్జనమ్; స్థానమ్ కేశశ్మశ్రులోమపక్ష్మవాసాంసి; సంస్థానమ్ - అణవస్తిలాకృతయో బహుపాదాశ్చ; వర్ణః కృష్ణః శుక్లశ్చ; నామాని - యూకాః, పిపీలికాశ్చ, ప్రభావః - కణ్డూజననం కోఠపిడకాభినిర్వర్తనం చ, చికిత్సితం తు ఖల్వేషామపకర్షణం. మలోపఘాతః మలకరణాం చ భావానుమనుపసేవనమితి.

**తాత్పర్యము :** మలము బాహ్యాభ్యంతర భేదముచే రెండు విధములు. బాహ్య మలజన్య క్రిములనే మలజములని అందురు (అందుము). పరిశుభ్రత లేని యెడల ఇవి యుత్పన్నములగును. వీని స్థానము కేశములు-మీసములు, గడ్డములు, నీచరోమములు, కనురెప్పల వెంట్రుకలు. ఇవి అణు (చిన్న) రూపము గలిగి నువ్వులవలె, ఎక్కువ కాళ్ళు కలిగియుండును. ఇవి శ్వేత మరియు కృష్ణ వర్ణములో నుండును. యూకలు మరియు పిపీలికములు అనునవి వీటి పేర్లు....దురదను కల్గించుట, కోఠము పిడకలు వీని ప్రభావమున కలుగును. ముఖ్యముగా సీటిని తీసి వేయుట మలమును నశింపజేయుట మలము కలిగించునట్టి భావములను సేవింప కుండుట వీని చికిత్సా పద్ధతులు.

**ఆయుర్వేద దీపిక :** పిపీలికములను లిక్షలు అని కొందరందురు. క్రిములకు ఆ పేరు మన శాస్త్రము నందును, దేశాంతరము నందును ప్రసిద్ధమైనదని తెలియనగును. ప్రభావమనగా స్వశక్తిచే సాధించునది (స్వశక్తి సంపాద్యము) అని అర్థము.

## రక్తజ క్రిములు

11. శోణితజానాం తు ఖలు కుష్ఠైః సమానం సముత్థానం, స్థానం-రక్తవాహిన్యో ధమన్యః;సంస్థానమ్-అణవో వృత్తాశ్చాపాదాశ్చ,సూక్ష్మత్వాచ్చైకే భవన్త్యదృశ్యాః వర్ణః-తామ్రః ;నామాని-కేశాదాః; లోమదాః లోమద్వీపాః, సౌరసాః, ఔదుమ్బరాః, జన్తుమాతరశ్చేతి; ప్రభావః-కేశశ్మశ్రునఖలోమపక్ష్మాపధ్వంసః, వ్రణగతానాం చ హర్షకణ్డూతోదసంసర్పణాని, అతివృద్ధానాం చ త్వక్సిరాస్నాయుమాంసతరుణాస్థిభక్షణమితి; చికిత్సితమప్యేషాం కుష్ఠైః సమానమ్, తదుత్తరకాలముపదేక్ష్యామః.

**తాత్పర్యము :** శోణితజములైన క్రిములకు హేతువు కుష్ఠరోగమునకు చెప్పబడిన హేతువు రెండును సమానమే. (అనగా కుష్ఠును కల్గించు హేతువులే శోణితక్రిములను కూడా కల్గించునని అర్థము). రక్తమును వహించు ధమనులు వీనికి స్థానములు. ఇవి చిన్నవిగానుండి గుండ్రముగాను, పాదములు లేకయు నుండును. అతిసూక్ష్మములగుటచేత వీనిలో కొన్ని కంటికి కనుపింపవు. ఇవి తామ్ర వర్ణములో నుండును. కేశాదులు, లోమాదులు, లోమద్వీపములు సౌరసములు, ఔదుంబరములు, జంతుమాతలు అనునవి వీటికి పేర్లు. కేశశ్మశ్రు నఖలోమ పక్ష్మములను నశింప జేయుట, వ్రణగతములైనపుడు అచట గగుర్పాటు, దురద, నొప్పి, ప్రాకు చున్నట్లుండుట, అతిగా వృద్ధి చెందినవి చర్మము-సిరలు-స్నాయువులు-తరుణాస్థులు-వీనిని భక్షించుట వీని ప్రభావము. వీని చికిత్సయును కుష్ఠరోగ చికిత్సవలెనే చేయ వలెను. చికిత్స గురించి తరువాత చెప్పుకొందము.

**ఆయుర్వేద దీపిక :** గగుర్పాటు, దురద యనునవి వ్రణమున్న ప్రదేశము నందే కలుగునని గ్రహింపవలెను.

## శ్లేష్మజ క్రిములు

12. శ్లేష్మజాః క్షీరగుడతిలమత్స్యానూపమాంసపిష్టాన్నపరమాన్నకుసుంభ స్నేహాజీర్ణపూతిక్లిన్నసంకీర్ణవిరుద్ధాసాత్మ్యభోజనసముత్థానః తేషామామా శయః స్థానమ్, తే ప్రవర్ధమానాస్తూర్ధ్వమధో వా విసర్పన్త్యుభయతో వా సంస్థాన వర్ణవిశేషస్తు శ్వేతాః పృథుబ్రధ్నసంస్థానాః కేచిత్, కేచిద్వృత్తపరిణాహా గణ్డూ-పదకృతయః శ్వేతాః తామ్రావభాసాశ్చ, కేచిదణవో దీర్ఘాస్తన్త్వాకృతయః శ్వేతాః తేషాం త్రివిధానాం శ్లేష్మనిమిత్తానాం క్రిమిణాం నామాని-ఉదరాదాః, అంత్రాదా, హృదయచరాశ్చురవో, దర్భపుష్పాః, సౌగంధికాః, మహాగుదా-శ్చేతి: ప్రభావః-హృల్లాస, ఆస్యసంస్రవణమరోచకావిపాకౌ జ్వరో మూర్ఛా జృంభా, క్షవథురానాహో ఽఙ్గమర్దశ్ఛర్దిః కార్శ్యపారుష్యమితి.

**తాత్పర్యము :** శ్లేష్మజ క్రిములు పాలు, బెల్లము, నువ్వులు, చేపలు, నీటియందెక్కువగా తిరుగువాని మాంసము, పిష్టాన్నము, పరమాన్నము కుసుంభ తైలము, అజీర్ణముగా నున్నపుడు చేయు భోజనము, చద్ది అన్నము, క్లేదయుక్తమైన అన్నము, సంకీర్ణ భోజనము, విరుద్ధాన్నము, సరిపడని ఆహారము - వీనిని

అధికముగా సేవించుట శ్లేష్మజ క్రిములకు కారణము. వీని స్థానము ఆమాశయము. ఇవి బాగా వృద్ధి చెందినపుడు శరీరమున పైభాగమునగాని, అధోభాగమునగాని రెండు భాగములయందుగాని వ్యాపించును (ఉభయభాగములందు వ్యాపించును). ఇవి శ్వేత వర్ణమునుండి, ఆకారమున కొన్ని పెదల్పుగను, పట్టీలవలె, కొన్ని గుండ్రము గను, గండూపదాకృతిలోను ఉండును. శ్వేతవర్ణముతో తామ్ర వర్ణపు ఛాయతోను వుండును కొన్ని చిన్నవిగను తెల్లని పొడపైన దారములవలెనూ వుండును. మూడు విధములైన (శరీరమున ఊర్ధ్వ, మధ్య, అధోభాగములందు సంచరించుటచే మూడు విధములైన శ్లేష్మజక్రిములు ఉదరాదములు, అంత్రాదములు, హృదయాచరములు (హృద దాదములు) చురులు, దర్భ పుష్పములు, సౌగంధికములు, మహాగుదములు అను పేర్లచే పిలువబడును. వీని ప్రభావముచేత హృల్లాసము, నోటియందు నీరూరుట, అరుచి, అజీర్ణము, జ్వరము, మూర్ఛ, ఆవులింత, తుమ్ములు, పొట్ట ఉబ్బరము, శరీరమునందు నొప్పులు, వాంతులు, కృశత్వము మరియు పరుషత్వము కలుగును.

**ఆయుర్వేద దీపిక :** పరమాన్నము - పాయసము, సంకీర్ణ భోజన మనగా జుగుప్సాకరమైన మలము మొదలగువానితో కలసిన భోజనము. బ్రహ్మము లనగా మాంస పేశీలు లేదా చర్మ లతలు.

## పురీషజ క్రిములు

13. పురీషజాస్తుల్యసముత్థానాః శ్లేష్మజైః; తేషాం స్థానమ్ పక్వాశయః, తేప్రవర్ధ మానా స్త్వధోవిసర్పన్తి, యస్య పునరామాశయాభిముఖాః స్యుర్యద న్తరమ్ తద న్తరమ్ తస్యోద్గారనిశ్వాసాః పురీషగన్ధినః స్యుః; సంస్థానవర్ణవిశేషాస్తు సూక్ష్మవృత్తపరిణాహాః శ్వేతా దీర్ఘా ఊర్ణాంశుసంకాశాః కేచిత్, కేచిత్ పునః స్థూలవృత్తపరిణాహాః శ్యావనీలహరితపీతాః; తేషాం నామాని కకేరుకా మకేరుకాః లేలిహాః, సశూలకాః సౌసురాదాశ్చేతి; ప్రభావః-పురీషభేదః, కార్శ్య పారుష్యం లోమహర్షాభినిర్వర్తనం చ, త ఏవ చాస్య గుదముఖమ్ పరితు- దన్తః కణ్డూ చోపజనయన్తోగుదముఖం పర్యాసతే, త ఏవ జాతహర్షా గుద- నిష్క్రమణమతివేలా కుర్వన్తి; యిత్యేష శ్లేష్మజానాం పురీషజానాం చ క్రిమీణాంసముత్థానాది విశేషః.

**తాత్పర్యము :** పురీషజ క్రిములు, శ్లేష్మజ క్రిములు కలుగుటకు కారణము లైన భావముల వలననే జనించును. వీని స్థానము పక్వాశయము. ఇవి ఎక్కువైన

నపుడు అధోముఖముగా (గుదము వైపునకు) వ్యాపించును. ఇవి తిరిగి ఆమాశయము వైపునకు వ్యాపించినపుడు ఆ రోగియొక్క (పురీషజ క్రిములు ఆమాశయగతమై యున్న రోగియొక్క) ఉద్గార నిశ్వాసములు పురీష గంధమును కలిగియుండును. వీనిలో కొన్ని సూక్ష్మములై గుండ్రముగను శ్యావనీల, హరిత, పీత వర్ణములోనూ వుండును. వీనికి కశేరుకములు మకేరుకములు, లేలిహములు, సశూలకములు మరియు సౌసురాదములు అని పేర్లు. వీని ప్రభావము వలన పురీషమధికముగా వెడలుట కృశత్వము, పరుషత్వము, లోమహర్షము (గగుర్పాటు). ఇవి రోగియొక్క గుద ముఖమును కొరుచుచూ దురదను పుట్టించుచూ అచటనే తిరుగుచుండును. అచట గగుర్పాటును కలిగించి మాట మాటికిని గుదమునుండి బయటకు వచ్చుచుండును. ఇక్కడ చెప్పబడినది శ్లేష్మజ, పురీషజ క్రిముల యొక్క సముత్థానము మొదలైన వాని వర్ణనము.

**ఆయుర్వేద దీపిక :** యదంతరమనగా ఏ సమయమున; తదనంతరం- ఆ సమయముననే. పర్యానత అనగా చేరును లేదా గుదమును ఆవరించియుండును అని యర్థము. అనిపేలమనగా మాటి మాటికిని.

## క్రిమిరోగ చికిత్సా సూత్రము

14. చికిత్సితం తు ఖల్వేషాం సమాసేనోపదిశ్య పశ్చాద్విస్తరేణోపదేక్ష్యామః. తత్ర సర్వక్రిమిణామపకర్షణమేవాదితః కార్యం తతః ప్రకృతివిఘాతః, అనన్తరమ్ నిదానోక్తానాం భావానామనుపసేవనమితి.

15. తత్రాపకర్షణం హస్తేనాభిగృహ్య విమృశ్యోపకరణవతా ఽపనయన మనుపకరణేన వా; స్థానగతానాం తు క్రిమిణాం భేషజేనాపకర్షణమ్, న్యాయతః, తచ్చతుర్విధమ్; తద్యథా-శిరోవిరోచనమ్, వమనం, విరేచనమ్, ఆస్థాపనం చ; యిత్యపకర్షణవిధిః

ప్రకృతివిఘాతస్త్వేషాం కటుతిక్తకషాయక్షారోష్ణానాం ద్రవ్యాణాముపయోగః యచ్చాన్యదపి కించిత్ శ్లేష్మపురీషప్రత్యనీకభూతమ్ తత్ స్యాదితి ప్రకృతి- విఘాతః. అనన్తరం నిదానోక్తానాం భావానామనుప సేవనమితి-యదుక్తం నిదానవిధౌ తస్య వివర్జనం, తథాప్రాయాణాం చాపరేషాం ద్రవ్యాణామ్. ఇతి లక్షణతశ్చికిత్సితమను వ్యాఖ్యాతమ్. ఏతదేవ పునర్విస్తరేణోపదేక్ష్యతే.

**తాత్పర్యము :** ఈ క్రిముల యొక్క చికిత్సను ఇచట సంక్షేపముగా చెప్పి తరువాత విస్తారముగా చెప్పుకొందము. అన్ని క్రిములకును వాటిని తీసివేయుటయే మొదట చేయవలసిన పని. తదుపరి క్రిములను కల్గించు కారణములను నశింపజేయుట. ఆ పైన నిదానములుగా చెప్పబడిన భావములను సేవింపకుండుట. ఇవి సంక్షేప క్రియలు. అపకర్షణము - చేతితో ఉపకరణముల సహాయమున లేదా ఉపకరణములు లేకుండగనే తీసివేయవలెను. స్థానగతములైన క్రిములను ఔషధములచేతనే తీసివేయవలెను. ఈ పద్ధతి నాల్గు విధములు - శిరో విరేచనము (నస్యము), వమనము, విరేచనము మరియు ఆస్థాపనము (వస్తి). ఇవి కల్గు కారణములను నష్టపరచుటకు కటు, తిక్త, కషాయ, క్షార, ఉష్ణద్రవ్యముల నుపయోగించుట. ఇంకను పురీష శ్లేష్మములకు వ్యతిరేక ప్రయోగము లున్నచో వాని నుపయోగించుట చేయవలెను. దీని వలన క్రిమి కారణములను నశింపజేయవచ్చును. తదుపరి నిదానమునందు చెప్పబడిన భావములను సేవింపకుండుట. ఇట్లు సంక్షేపముగా చికిత్స చేయవలెను. దీనినే ఇంకనూ వివరింతము.

**ఆయుర్వేద దీపిక :** అపకర్షణము నందు హస్తాది ప్రయోగముచే సంశోధనము చెప్పడమైనది. శ్లేష్మాదులకు కారణమైన వాటిని నశింపజేయుట ప్రకృతి విఘాతమని యర్థము. ఉపకరణములతో కూడి - సందంశము మొదలగు ఉపకరణములతో కూడిన. తత్స్యాత్ - అనగా విఘాతము కల్గించుటకు (శ్లేష్మ పురీషములకు వ్యతిరేకమైన దానినుపయోగించుట) నిదానోక్త భావములను సేవింపకుండుట యని నిదానము (కారణము) లైన వాటిని దూరముగా నుంచుటను సూచించడమైనది. మరియు ప్రాయాణాం అనగా శ్లేష్మ పురీషజ క్రిమి నిదానముల వంటివి అని యర్థము. లక్షణతః అనగా సంక్షేపముగా; విస్తారముగా చెప్పిన దానిని గ్రహించుటకు సంక్షేపమే లక్షణము.

## క్రిమి చికిత్స

16. అథైనం క్రిమికోష్ఠమాతురమగ్రే షడ్రాత్రం సప్తరాత్రం వా స్నేహస్వేదాభ్యాముపపాద్య శ్వోభూతే ఏనం సంశోధనం పాయయితాస్మీతి క్షీరదధిగుడతిలమత్స్యానూపమాంసపిష్టాన్నపరమాన్నకుసుంభస్నేహసంప్రయుక్తైర్భోజ్యైః సాయం ప్రాతశ్చోపపాదయేత్ సముదీరణార్థం క్రిమీణాం కోష్ఠాభి-

సారణార్థం చ భిషక్. అథ వ్యుష్టాయాం రజన్యాం సుఖోషితం సుప్రజీర్ణ-భక్తం చ విజ్ఞాయాస్థాపనవమనవిరేచనైః ప్రదహారేవోపపాదయేత్ ఉపపాద-నీయశ్చేత్స్యాత్ సర్వాన్ పరీక్ష్యవిశేషాన్ పరీక్ష్య సమ్యక్.

**తాత్పర్యము :** కోష్ఠము క్రిములచే నావరింపబడియున్న రోగికి ముందుగా ఆరు లేక ఏడురోజులు స్నేహ స్వేదములు చేసి ఒకరోజు వదలి మరునాడు క్రిము లన్నియు శరీరము నందలి ఇతర స్థానముల నుండి కోష్ఠమును చేరుటకు ఉదయము సాయంత్రము పాలు, బెల్లము, పెరుగు, నువ్వులు, చేపలు, అనూప మాంసము, పిష్టాన్నము, పాయసము, కుసుంభ స్నేహములతో కూడిన భోజనము చేయించ వలెను. ఆ రాత్రి రోగిని సుఖశయ్యపై నుంచి మరుసటి దినము అతడు భుజించిన ఆహారము బాగుగా జీర్ణమైనదని తెలిసికొని పరీక్షించదగిన అన్ని విశేషములను పరీక్షించి (రోగి సంశోధనమునకు శారీరక మానసికముగా సిద్ధముగా నున్నాడా లేదా యనునది పరీక్షించి) అతడు సంశోధనమునకు తగియున్న వాడైనచో ఆస్థాపన, వమన విరేచనముల నన్నింటిని అదే రోజున ప్రయోగించవలెను.

**ఆయుర్వేద దీపిక :** కోష్ఠాభిసారణార్థ మనగా పాలు, బెల్లము మొద లగువాటిపై వ్యామోహము చేత క్రిములు శరీరము నందలి అన్యభాగములను వదలి కోష్ఠము వైపునకు వచ్చుట కొరకు. అదే దినము అనగా ఒకే దినము నందు: ఒకే దినమున ఎక్కువ క్రియలను చేయుట వ్యాధి ప్రభావము వలన గ్రహింపవగును. ఒకే దినమున అన్ని క్రియలను చేయుట అనునది రోగి బలముతో కూడిన వాడై నపుడు ఈ పద్ధతియే ఉత్తమము. వేరొక పద్ధతి దీనిని మించినది లేదు. ఈ విషయ మునసే "ఉపపాదనీయశ్చేత్ స్యాత్" అను వాక్యము ద్వారా సూచించడమైనది.

## మూలకాది యోగము

**17.** అథాహరేత్ బ్రూయాత్-మూలక సర్షపలశునకరఞ్జ శిగ్రుమధుశిగ్రు ఖర పుష్పాభూస్తృణసుముఖసురసకుఠేరకగణ్డీరకకాలమాలకపర్ణాసక్షవక ఫణిజ్ఝ కాని సర్వాణ్యథవా యథాలాభం; తాన్యాహృత్యాభిసమీక్ష్య ఖణ్డ శశ్ఛేదయిత్వా ప్రక్షాళ్య పానీయేన సుప్రక్షాళితాయాం స్థాల్యాం సమావాప్య గోమూత్రేణార్ధోదకేనాసిచ్య సాధయేత్ సతతమవఘట్టయన్ దర్వ్యా, తముప యుక్తభూయిష్ఠేమ్భసి గతరసేష్వౌషధేషు స్థాలీమవతార్య సుపరిపూతం కషాయం సుఖోష్ణం మదనఫలపిప్పలీవిడంగ కల్కైరోపహితం స్వర్జికాల

వణితమభ్యాసిచ్య బస్తౌ విధివదాస్థాపయేదేనమ్: తథాఽర్కాఽలర్కకుట జాఢకీ కుష్టకైడర్యకషాయేణ వా, తథా శిగ్రుసీలుకుస్తుమ్బురు కటుకాసర్షప కషాయేణ, తథామలకశృఙ్గవేరదారుహరిద్రాపిచుమర్దకషాయేణ మదనఫలాది సంయోగసంపాదితేన, త్రివారంన ప్తరాత్రం వాఽఽస్థాపయేత్.

తాత్పర్యము : అటు పిమ్మట ఈ ద్రవ్యములను తీసికొని రమ్మని చెప్ప వలెను. అవి- ముల్లంగి, ఆవాలు, వెల్లుల్లి, కానుగు, మునగ, ఎఱ్ఱమునగ, వావింట, చిప్పకసవు, ఎఱ్ఱ అవాలు, సర్మాక్షి,నల్ల తులసి, కిక్కిస గడ్డి, నల్ల ఆవాలు, తెల్ల తులసి,దుష్టపాకు, మరువము- వీటి నన్నింటినైననూ, దొరికినంతవరకైననూ మంచి విగా తెచ్చి ముక్కలుగా నరికి, నీటితో కడిగి శుభ్రమైన పాత్రలో వుంచి దానిలో ఒక భాగము గో మూత్రము సగభాగము నీరును కలిపి పొయ్యిపై నుంచి గరిటెతో బాగుగ్గా కలయ బెట్టుచూ ఔషధ ద్రవ్యములలోని గుణములు ద్రవములోనికి వచ్చు వరకు పాకము చేయవలెను. తరువాత పాత్రను పొయ్యిపై నుండి దింపి కషాయ మును వడగట్టి అది గోరు వెచ్చగా నున్నపుడు దానియందు మ్రంగకాయి, పిపళ్ళ, వాయు విడంగములు- వీని కల్కము, తైలము, సర్జక్షారము, సైంధవ లవణములను చేర్చి విధి ప్రకారము అస్థాపన వస్తిని చేయవలెను. మరియు జిల్లేడు, తెల్లజిల్లేడు కొడిశపాల,కందులు, చెంగల్వకోష్టు,కరివేప (కైడర్యము) దీని కషాయ మందుగాని, మునగ,వరగోగు, ధనియాలు (తుంబురులు), కటుక రోహిణి, అవాలు-వీని కషాయ మందుగాని, ఉశిరిక, శుంఠి, మ్రాని పసుపు, వేము (పిచుమర్ద) దీని కషాయము నందుగాని పై చెప్పిన కల్క తైల క్షార లవణములను చేర్చి మూడు పర్యాయములు లేదా ఏడు రాత్రులు ఆస్థాపనవస్తిని చేయవలెను.

ఆయుర్వేద దీపిక : మధు శిగ్రు యనగా శోభాంజనము (ఎఱ్ఱమునగ). క్వాథ ద్రవ్యమునకు జలమును చేర్చవలసిన ప్రమాణము మొదలైనవి పరిభాష ననుసరించి (క్వాథ పరిభాషననుసరించి) చేయవలెను. నీరు తగినంత వున్నపుడు అనగా బాగా తగ్గిపోయి ఉన్నప్పుడు అని అర్థము. ఔషధములు గతరసములై యుండుట యనగా ఔషధముల రస గుణాదులు జలము లోనికి సంక్రమించుట. ఈ కషాయ సిద్ధి లక్షణము ననుసరించి ఎంత జలము నందు ఔషధములను వేసి ఎంత సమయము పాకము చేసినచో అవి గత రసములగునో అంత ప్రమాణము వరకును జలమును పోసి అంత సమయము వరకును పాకము చేయవలెను (ఇది ద్రవ్యముల మృదు కాఠిన్యములను బట్టి యుండునది). అందువలన అన్ని చోట్లను పరిభాషను

తెక్కలోనికి తీసుకొననవసరము లేదు. సుపూరితమనగా వస్త్రగాలితము చేయబడినది. వస్తియందు కషాయాదుల ప్రమాణము సిద్ధిస్థానము నందు చెప్పబడినది. అలక్కమనగా మస్తారము.

18. ప్రత్యాగతే చ పశ్చిమే బస్తౌ ప్రత్యాశ్వస్తం తదహరేవోభయతో భాగహరం సంశోధనం పాయయేద్యుక్త్యా; తస్య విధిరుపదేక్ష్యతే-మదనఫలపిప్పలీకషాయస్యార్ధాంజలిమాత్రేణ త్రివృత్కల్కాక్షమాత్రమాలోడ్య పాతుమస్మై ప్రయచ్ఛేత్, తదస్య దోషముభయతో నిర్హరతి సాధు,ఏవమేవ కల్పోక్తాని వమనవిరేచనాని ప్రతిసంసృజ్య పాయయేదేనం బుద్ధ్యా సర్వవిశేషానవేక్ష-మాణో భిషక్.

## విడంగ కషాయ ప్రయోగము

19. అథైనం సమ్యగ్విరిక్తం విజ్ఞాయాపరాహ్ణే శైఖరికకషాయేణ సుఖోష్ణేన పరిషేచయేత్, తేనైవ చ కషాయేణ బాహ్యాభ్యన్తరాన్ సర్వోదకార్థాన్ కారయేచ్ఛశ్వత్. తదభావే కటుతిక్తకషాయాణామౌషధానాం క్వాథైర్మూత్ర-క్షారైర్వాపరిషేచయేత్. పరిషిక్తం చైనం నివాతమాగారమనుప్రవేశ్య పిప్పలీపిప్పలీమూలచవ్యచిత్రకశృంగవేరసిద్ధేన యవాగ్వాదినా క్రమేణోపాచరేత్, విలేపీక్రమాగతం చైనమనువాసయేద్విడంగతైలేనైకాన్తరంద్విస్త్రిర్వా.

తాత్పర్యము : చివరి వస్తి పూర్తియైన పిదప రోగికి సేదదీరనిచ్చి అదే దినమున ఊర్ధ్వాధో మార్గమున దోషములను హరించుటకు సంశోధనౌషధమును త్రాగించవలెను. సంశోధనౌషధమును తయారుచేయు విధి : మంగకాయ, పిప్పళ్ళు వీని కషాయము అర్ధాంజలి ప్రమాణమున తీసికొని దానిలో తెగడ కల్కము ఒక తానికాయ ప్రమాణము కలిపి త్రాగించవలెను. ఇందువలన రోగికి దోషములు, ఊర్ధ్వాధో భాగమున సరియైన పద్ధతిలో వెడలును. ఇదే విధముగా కల్పస్థానము నందు చెప్పబడిన వమన విరేచనౌషధములను కలిపి యివ్వవలెను. ఈ విధిని చేయునపుడు వైద్యుడు రోగియొక్క విశేషముల నన్నింటిని (ఔషధ విశేషములనూ) పరీక్షించి చేయవలెను. తదుపరి ఆ రోగికి బాగుగా విరేచనము అయినదని తెలిసికొని అపరాహ్ణమునందు గోరువెచ్చని శైఖరిక (విషఘ్న) కషాయము చేత స్నానము చేయించవలెను. ఆదే కషాయమును బాహ్యాభ్యంతర ప్రయోగమునకు యివ్వవలెను.

(త్రాగుటకు, కడుగుటకు), ఇది లేనప్పుడు కటు తిక్త కషాయ రసములు కలిగిన ద్రవ్యముల క్వాథములు లేదా మూత్రములు క్షారములచేత స్నానాదులు చేయించవలెను. అటు పిమ్మట రోగిని గాలిచొరని గదియందుంచి పిప్పళ్ళు, మోడి, చవ్యము, చిత్రమూలము, శొంఠి - వీనితో తయారైన యవాగు మొదలగువానిని యిచ్చుచుండవలెను. యవాగు విలేపి, ప్రమథ్య మొదలగువాని నిచ్చి తదుపరి విడంగ తైలముతో రెండు లేక మూడు పర్యాయములు అనువాసన వస్తి రోజు విడచి రోజు చేయవలెను.

**ఆయుర్వేద దీపిక :** పశ్చిమ అనగా మూడవ యామము, సంసృజ్య అనగా మిశ్రమము చేసి, శైఖరిక కషాయమనగా విడంగ కషాయము, విడంగ కషాయమే వైద్య వ్యవహారమున శైఖరిక కషాయమనబడును. విశేషాః క్రమాగతము అనగా కృత యవాగు మొదలగుదాని క్రమమున....

## శీర్షాద క్రిమి చికిత్స

20. యది పునరస్యాతిప్రవృద్ధాన్ శీర్షాదాన్ క్రిమీన్ మన్యేత శిరస్యేవాభిసర్పతః కాంశ్చిత్తతః స్నేహస్వేదాభ్యామస్య శిర ఉపపాద్య విరేచయేదపామార్గతణ్డు-లాదినా శిరోవిరేచనేన....

**తాత్పర్యము :** ఒకవేళ ఆ రోగికి యింకను శీర్షాదములను క్రిములు శిరోగతమై యున్నవని తోచినయెడల అప్పుడా రోగి శిరస్సునకు స్నేహస్వేదములను చేసి అపామార్గ తండూలములు మొదలైన వాటిద్వారా శిరో విరేచనము (నశ్యము) చేయవలెను.

**ఆయుర్వేద దీపిక :** అపామార్గ తండులములు మొదలగువాటితో అనగా అపామార్గ తండులీయాధ్యాయమున చెప్పినవాటితో అని యర్థము.

## క్రిమిరోగి కివ్వవలసిన ఆహారము

21 యస్త్వభ్యవహార్యవిధిః ప్రకృతివిఘాతాయోక్తః క్రిమీణాం సోఽనువ్యాఖ్యా-స్యతే మూలకపర్ణీ సమూలాగ్రప్రతానామాహృత్య ఖణ్డశశ్ఛేదయిత్వా ఉలూఖలే క్షోదయిత్వా పాణిభ్యాం పీడయిత్వా రసం గృహ్ణీయాత్; తేన రసేన లోహిత-శాలితణ్డులపిష్టం సమాలోడ్య పూపలికాం కృత్వా విధూమేష్వఙ్గారేషూపకుడ్య విడఙ్గతైలలవణోపహితాం క్రిమికోష్ఠాయ భక్షయితుం ప్రయచ్ఛేత్,

అనన్తరం చామ్లకాఞ్జికముదశ్విద్వా పిప్పల్యాదిపంచవర్గసంసృష్టం సలవణ-మనుపాయయేత్.

అనేన కల్పేన మార్క-వార్క-సహచరనీపనిర్గుణ్డీసుముఖసురసకుఠేరకగణ్డీర-కాలమూలకపర్ణాసక్షవకఫణిజ్ఝకవకుళకుటజసువర్ణక్షీరిస్వరసానామన్యతమస్మిన్ కారయేత్ పూపలికాః, తథా కిణిహీకిరాతతిక్తకసువహామలకహారీతకీవిభీతక-స్వరసేషు కారయేత్ పూపలికా, స్వరసాం శ్చైతేషామేకైకశో ద్వన్ద్వశః సర్వశో వా మధువిలులితాన్ ప్రాతరనన్నాయ పాతుం ప్రయచ్ఛేత్.

**తాత్పర్యము :** క్రిముల ఉత్పత్తికి కారణములైన వాటిని నివారించుటకు ఆహారవిధిని చెప్పుకొందము. ఎలుక చెవిచెట్టు (మధుశ్రిగు)ను అమూలాగ్రముగా పెరికి ముక్కలుగా నరికి రోటియందు దంచి చేతులతో పిండి రసమును గ్రహించవలెను. ఆ రసముతో రక్తశాలి ధాన్యముయొక్క బియ్యపు పిండితో కలిపి పలుచని రొట్టెలుగాచేసి పొగలేని నిప్పులపై కాల్చి విడంగతైలము లవణములతో చేర్చి క్రిమికోష్ఠునకు ఆహారముగా నివ్వవలెను. అనంతరము పుల్లని కాంజికముతోగానీ, ఉదశ్వితమను (ఒక భాగము పెరుగు సగభాగము నీరు చేర్చిన) మజ్జిగతోగానీ పిప్పళ్ళు, మోడి, చవ్యము, చిత్రమూలము, శొంఠి వీటి చూర్ణమును సైంధవలవణమును కలిపి త్రాగించవలెను. మరియు- గుంటగలగర, జిల్లేడు, ములుగోరింట, కడిమి, నల్ల వావిలి, ఎర్రని ఆవాలచెట్టు, సర్పాక్షీచెట్టు, తెల్లతులసి, గురుజ కూర, నల్లతులసి, దుష్టపుచెట్టు, మరువము, పొగడ, కొడిశపాల, స్వర్ణక్షీరి, ఉత్తరేణి, నేలవేము, చెప్పు తట్టాకుచెట్టు, ఉశిరిక, కరక, అనువాని స్వరసములతో ఏదో ఒకదానిలో పై చెప్పిన ఎఱ్ఱని బియ్యపుపిండిని తడిపి పలుచని రొట్టెలు (పూపలికములు) చేసి కృమికోష్ఠున కివ్వవలెను. మరియు ఈ చెప్పబడిన ద్రవ్యములలో ఒకటిగాని, రెండింటినిగానీ, అన్నింటియొక్క గానీ స్వరసము తేనెతోకలిపి పరగడుపున త్రాగించవలెను.

**ఆయుర్వేద దీపిక :** మూలకపర్ణి యనగా శోభాంజనము. ఉపకుర్యము అనగా పాచనముచేసి "కుచ్-దాహే" అని ధాతువు. పిప్పలీ మొదలైన పంచవర్గము లనగా పేయాది క్రమములో చెప్పిన పంచకోలములు. సహచర - అనగా ఝింటికా (ములుగోరింట) మధువిలులితాన్ అనగా తేనెతో కలగలిపినవి.

## అశ్వశకృత్ (గుఱ్ఱపులద్దె) ప్రయోగము

22. అథాశ్వశకృదాహృత్య మహతి కిలిఞ్జే ప్రస్తీర్యాతపే శోషయిత్వోదూఖలే క్షోదయిత్వా దృషది పునః శ్లక్ష్ణాని చూర్ణాని కారయిత్వా విడఙ్గకషాయేణ త్రిఫలాకషాయేణ వా అష్టకృత్వో దశకృత్వో వా ఆతపే సుపరిభావితాని భావయిత్వా, దృషది పునః సూక్ష్మాణి చూర్ణాని కారయిత్వా నవే కలశే సమావాప్యానుగుప్తం నిధాపయేత్. తేషాం తు ఖలు చూర్ణానాం పాణితలం చూర్ణం యావద్వా సాధు మన్యేత తత్ క్షౌద్రేణ సంసృజ్య క్రిముకోష్ఠాయ- లేఢుం ప్రయచ్ఛేత్.

**తాత్పర్యము :** పిమ్మట గుఱ్ఱపు పేడను తెచ్చి పెద్దదైన బల్లపై పరచి ఎండలో ఎండించి రోటిలోవేసి దంచి దానిని మెత్తటి చూర్ణముగ చేసి వెంటనే త్రిఫలా కషాయముతోగానీ, విడంగ కషాయముతోగానీ ఎనిమిది లేక పది పర్యాయములు తడిపి ఒక్కొక్క పర్యాయము తర్వాత ఎండ నెండించి తిరిగి చూర్ణముగా చేసి క్రొత్త పాత్రయందు పోసి దాచవలెను. ఈ చూర్ణమును క్రిమి కోష్ఠము గల వానికి తగినంత ప్రమాణములో అరచేతిలో వేసి తేనెతో కలిపి నాకించవలెను.

**ఆయుర్వేద దీపిక :** “సుపరిభావితాని భావయిత్వా”— బాగుగా భావనము జరుగునంత వరకును భావన ప్రక్రియను చేయవలెను. దాచవలెననుట గాలి వెలుతురు చొరనిచోట జాగ్రత్తగా నుంచవలెననుటను సూచించుచున్నది.

23. తథా భల్లాతకాస్థీన్యాహృత్య కలశప్రమాణేన సంపోథ్య స్నేహభావితే దృఢే కలశే సూక్ష్మానేకచ్ఛిద్రబ్రధ్నే శరీరముపవేష్ట్య మృదావలిప్తే సమావాప్యో- డుపేన పిధాయ భూమావాకణ్ఠం నిఖాతస్య స్నేహభావితస్యైరుపచిత్య దాహయేత్ స యదా జానీయాత్ సాధు దగ్ధాని గోమయాని విగతస్నేహాని చ భల్లాతకాస్థీనీతి తతస్తం కుమ్భముద్ధరేత్. అథ తస్మాత్ ద్వితీయాత్ కుమ్భాత్స్నేహమాదాయ విడంగతణ్డులచూర్ణైః స్నేహార్ధమాత్రైః ప్రతి- సంసృజ్యాతపే సర్వమహః స్థాపయిత్వా తతోఽస్మై మాత్రాం ప్రయచ్ఛే- త్పానాయ; తేన సాధు విరిచ్యతే, విరిక్తస్య చానుపూర్వీ యథోక్తా. ఏవమేవభద్రదారుసరళకాష్ఠస్నేహానుపకల్ప్య పాతుం ప్రయచ్ఛేత్.

24. అనువాసయేచ్చైనమనువాసనకాలే.

## భల్లాతకాస్థి తైల ప్రయోగము

**తాత్పర్యము :** మరియు నల్లజీడి గింజలను ఒక కలశ ప్రమాణమున తెచ్చి నలుగగొట్టి ఇంతకు ముందు నూనెను వాడిన పాత్రలో క్రింది భాగమున (అడుగున) సన్నని అనేక రంధ్రములను జేసి, దానిచుట్టును గుడ్డలను చుట్టి మట్టితోపూసి దానిలో నలుగగొట్టిన జీడిగింజలను వేసి పైన మూతను మూసి ఉంచవలెను. భూమిలో గొయ్యిని త్రవ్వి ఆ గోతిలో నూనెను వాడిన వేరొక కుండను కంఠము వరకు ఉంచి దానిపై జీడిగింజలున్న పాత్రను అమర్చవలెను. తదుపరి దాని చుట్టును పిడకలను పేర్చి మంట పెట్టవలెను. పిడకలు పూర్తిగా కాలిన తరువాత జీడిగింజల నుండి చమురు దిగినదని గ్రహించి అడుగు పాత్రను తీసి దానినుండి తైలము గ్రహించి దానిలో సగము విడంగ తండుల చూర్ణమును కలిపి ఒక దినమంతయు నెండలో యెండించవలెను. దానిని తగు ప్రమాణములో రోగిచే త్రాగించవలెను. దాని వలన బాగుగా విరేచనమగును. ఆపైన పేయాదుల నివ్వవలెను. ఇదేవిధముగా దేవదారు, సరళదేవదారుల నుండి కూడా తైలమును తీసి ప్రయోగించవలెను. అనువాసనమున కనుకూలమైన సమయమున అనువాసన వస్తి నివ్వవలెను.

**ఆయుర్వేద దీపిక :** బ్రధ్నమనగా గుదము. ఈ సందర్భమున పాత్ర యొక్క అధోభాగమని గ్రహించవలెను. శరీరమును చుట్టి అనగా గుడ్డలచే పాత్రను చుట్టి, ఉడుప అనగా మూత. అతడు (స) అనగా భల్లాతక తైలము తీయువాడు. రెండవదాని నుండి అనగా అడుగునున్న పాత్రనుండి.

## విడంగ కషాయముతో భావన చేసిన నువ్వుల ప్రయోగము

25. అథాహరేతి బ్రూయాత్-శారదాన్నవాం స్తిలాన్ సంపదుపేతాన్; తానాహృత్య సునిష్పూతాన్నిష్పూయ, సుశుద్ధాన్ శోధయిత్వా, విడఙ్గకషాయే సుఖోష్ణే ప్రక్షిప్య నిర్వాపయేదాదోషాగమనాత్, గతదోషానభిసమీక్ష్య సుప్రలూనాన్ ప్రలుంచ్య పునరేవ సునిష్పూతాన్ నిష్పూయ సుశుద్ధాన్ శోధయిత్వా విడఙ్గ-కషాయేణ త్రిస్సప్తకృత్వః సుపరిభావితాన్ భావయిత్వా ఆతపే శోషయిత్వో-లూఖలే సంక్షుద్య దృషది పునః శ్లక్ష్ణపిష్టాన్ కారయిత్వా ద్రోణ్యామభ్యవధాయ విడఙ్గకషాయేణ ముహుర్ముహురవసిఞ్చన్ పాణిమర్దమేవ మర్దయేత్; తస్మిన్ ఖలు ప్రపీడ్యమానే యత్తైలముదియాత్తత్ పాణిభ్యాం పర్యాదాయ శుచౌ దృఢే కలశే సమారోప్యానుగుప్తం నిధాపయేత్.

**తాత్పర్యము :** శరదృతువు నందు ఫలించిన క్రొత్త నువ్వులను బాగుగా నున్నవాటిని తెప్పించి రాళ్ళు మొదలైనవి లేకుండా చెరిగి, కడిగి, గోరు వెచ్చని విడంగ కషాయమును బోసి దోషముపోవునంతవరకు నానిన తరువాత వాటి పొట్టును తీసి మరల చెరిగి విడంగ కషాయమునందు వేసి ఎండించవలెను. ఇట్లు ఇరువది యొక్క మారులు విడంగ కషాయమున భావనచేసి, ఎండలో ఎండించి రోటిలో వేసి దంచి రాతిపై నుంచి మెత్తని పిండిగాచేసి, ఆ పిండిని ఒక పాత్రలోనికి ఎక్కించి, విడంగ కషాయము చేర్చుచూ చేతులతో పిండవలెను. అట్లు పిండగా వచ్చిన తైలమును చేతుల కంటినదానిని శుభ్రమైన పాత్రలో వేసి దాచి యుంచ వలెను.

**ఆయుర్వేద దీపిక :** నిష్పాయ అనగా మృత్తికాది పనికిరానివాటిని తీసివేసి అని యర్థము. శోధయిత్వా అనగా కడిగి, దోషము పోవునంత వరకు అనగా నువ్వుల యందలి దోషము పోవునంతవరకు తిలల-పొట్టు నంటియున్న మలములు పోవునంతవరకు -ప్రతించ్య-పొట్టును తీసి, అభ్యవధాయ-ఎక్కించి చేతులతో తీసి కొని అనగా చేతులతో పిండగా అంటుకొనియున్న తైలమును పాత్రలోనికి తిరిగి తీసుకొనుట.

## తిల్వకోద్దాలకాది తైలము

26. అథాహారేతి బ్రూయాత్-తిల్వకోద్దాలకయోర్ద్వౌ బిల్వమాత్రౌ పిష్ట్వా శ్లక్ష్ణ-పిష్టౌ విడఙ్గకషాయేణ తతర్ధమాత్రౌ శ్యామాత్రివృతయోః అతోఽర్ధమాత్రౌ దన్తీద్రవన్త్యోః అతోఽర్ధమాత్రౌ చ చవ్యచిత్రకయోరితి. ఏతం సంభారం విడఙ్గకషాయస్యార్ధాఢకమాత్రేణ ప్రతిసంసృజ్య తతస్తైలప్రస్థమావాప్య సర్వమాలోడ్య మహతి పర్యాగే సమాసిచ్యాగ్నావధిశ్రిత్యాసనే సుఖోపవిష్టః సర్వతః స్నేహమవలోకయన్నజస్రం మృద్వగ్నినా సాధయేద్దర్వ్యా సతత-మవఘట్టయన్, స యదా జానీయాద్విరమతి శబ్దః ప్రశామ్యతి చ ఫేనః ప్రసాదమాపద్యతే స్నేహో యథాస్వం గన్ధవర్ణరసోత్పత్తిః సంవర్తతే చ భైషజ్య మఙ్గులిభ్యాం మృద్యమానమనతిమృద్వనతిదారుణ మనఙ్గులిగ్రాహి చేతి, స కాలస్తస్యావతారణాయ. తత స్తమవతార్య శీతీభూతమహతేన వాససా పరి - య ుచౌ దృఢే కలశే సమాసిచ్య, పిధానేన పిధాయ, శుక్లేన వస్త్ర ్ట్టేన వచ్ఛాద్య, సూత్రేణ సుబద్ధం సునిగుప్తం సన్నిధాపయేత్. తతోఽస్య

మాత్రాం ప్రయచ్ఛేత్ పానాయ. తేన సాధు విరిచ్యతే; సమ్యగుపహృత-దోషస్య చాస్యానుపూర్వీ యథోక్తా. తతశ్చైన మనువాసయేత్ అనువాసన-కాలే. ఏతేనైవ చ పాకవిధినా సర్షపాతసీకరఞ్జకోశాతకీ స్నేహానుకల్ప్య పాయయేత్ సర్వవిశేషానవేక్షమాణః. తేనాగదో భవతి.

27. ఏవం ద్వయానాం శ్లేష్మపురీషసంభవానాం క్రిమీణాం సముత్థానసంస్థాన వర్ణ నామప్రభావచికిత్సితవిశేషాః వ్యాఖ్యాతాః. సామాన్యతః. విశేషతస్తు స్వల్ప మాత్రామాస్థాపనానువాసనానులోమహరణభూయిష్ఠం తేష్వౌషధేషు పురీష జానాం క్రిమీణాం చికిత్సితం కార్యమితి, మాత్రాధికం పునః శిరోవిరేచన వమనోపశమనభూయిష్ఠం తేష్వౌషధేషు శ్లేష్మజానాం క్రిమీణాం చికిత్సితం కార్యమితి, ఏష క్రిమిఘ్నో భేషజవిధిరనువ్యాఖ్యాతో భవతి. తమనుతిష్ఠతా యథాస్వం హేతువర్జనే ప్రయతితవ్యమ్ యథోద్దేశమేవఽఽదం క్రిమికోష్ఠ చికిత్సితం యథావదనువ్యాఖ్యాతం భవతి.

**తాత్పర్యము :** లొద్దుగ, ఇరుగుడు పట్టలను తెప్పించి బిల్వమంత ప్రమాణమున ఒక్కొక్క పలము మెత్తని ముద్దలుగా నూరి వీటిలో సగము నల్ల తెగడ తెల్ల తెగడల చూర్ణమును, వీనిలో సగము దంతి, ద్రవంతిలను, వీనిలో సగము చవ్యము, చిత్రమూలములను తీసుకొని చూర్ణించి విడంగ కషాయమును చేర్చి కల్కముగా చేసి యుంచవలెను. ఈ కల్కమునకు అష్టాధకము విడంగ కషాయము, ఒక ప్రస్థము పైన చేసిన తైలము (తిలల నుండి తీసినది) లను కలిపి పెద్ద పాత్ర యందుంచి ఆ పాత్రను పొయ్యిపై నెక్కించి మృద్వగ్నితో పాకము చేయ వలెను. గరిటెతో మాటిమాటికిని కలుపుచుండవలెను. నిప్పులలో వేసినప్పుడు శబ్దము లేకుండుట, ఫేనము రాకుండుట, స్నేహమున కుండవలసిన లక్షణములు వుండుట, దానియందు రావలసిన గంధ, వర్ణరసము ఉత్పత్తి యగుట, స్నేహము నందలి కల్కమును చేతితో నలిపినపుడు అతి మృదువుగను, అతి కఠినముగను ఉండక చేతికి అంటకుండుట—ఈ లక్షణములు కలిగినపుడు ఆ స్నేహము తయా రైనదని తెలిసికొని పాత్రను పొయ్యిపైనుంచి చల్లబడిన పిదప పెద్ద వస్త్రముతో వడగట్టి శుచిమైన మట్టి పాత్రలో వేసియుంచి మూతవేసి తెల్లని వస్త్రముతో పైన కట్టి దారముతో బంధించి దాచియుంచవలెను. దీనిని తగు ప్రమాణమునందు క్రిమి కోష్ఠున కివ్వవలెను. అపుడు బాగుగా విరేచనమగును. దోషములు బాగుగా వెడలిన తరువాత పైవిధముగా చేయవలెను. తదుపరి అనువాసనము చేయదగిన కాలమునందు

అనువాసన వస్తి నివ్వవలెను. ఇదే పాకవిధిననుసరించి ఆవాలు-అవిశె-వాసగ-కోశాతకీ వీటి స్నేహములను తయారించి అన్ని విశేషములను పరిచూసుకొని త్రాగించవలెను. దీనివలన రోగము నుండి ముక్తి కలుగును.

ఈ విధముగా శ్లేష్మ పురీషముల యందు సంభవించు క్రిముల యొక్క సముత్థాన-స్థాన-సంస్థాన వర్ణ నామ ప్రభావ చికిత్సా విశేషములను సామాన్యముగా వ్యాఖ్యానించడమైనది. ఇందు విశేషమేమనగా పురీషజ క్రిమి చికిత్సయందు ఆస్థాపనము అనువాసనము అధోమార్గమున (విరేచనము ద్వారా) క్రిములను పోగొట్టుటకు వాడు ఔషధములను ఆయా యోగములందు అధికముగా చేర్చి చికిత్సింపవలెను. శ్లేష్మజ క్రిమి చికిత్సయందు శిరోవిరేచనము (నశ్యము) వమనము, శమనములగు ఔషధముల నధికముగా చేర్చి చికిత్సింపవలెను. యథాస్థితిననుసరించి హేతువర్జనమునకు ప్రయత్నించవలెను. ఈ విధముగా క్రిమి కోష్ఠచికిత్సను వ్యాఖ్యానించడమైనది.

ఆయుర్వేద దీపిక : ఉద్దాలకమనగా బహువారము. బిల్వమాత్రా-పల మాత్రము- పర్యోగము-కటాహము (పెద్దబాణలి) యథాస్వం అనగా ద్రవ్యము ఎంత వరకు తైలమునందు సంస్కరింపబడవచ్చునో దాని కనుగుణముగా వర్ణము మొద లగునవి వచ్చువరకు అని యర్థము. సంవర్తతే అనగా వర్తింపవలెనగును. అల్ప మాత్రమనగా ఆస్థాపన, అనులోమహరణ ద్రవ్యములు గాకుండా ఔషధమును అల్పమాత్రలో ప్రయోగించవలెనని యర్థము.

## సర్వరోగ చికిత్సా సూత్రము

భవంతిచాత్ర

28. అపకర్షణమేవాదౌ క్రిమీణాం భేషజం స్మృతమ్,
తతో విఘాతః ప్రకృతేర్నిదానస్య చ వర్జనమ్.

29. అయమేవ వికారాణాం సర్వేషామపి నిగ్రహః,
విధిర్దృష్టస్త్రిధాయోఽయం క్రిమీనుద్దిశ్య కీర్తితః.

30. సంశోధనం సంశమనం నిదానస్య చ వర్జనమ్,
ఏతావద్భిషజా కార్యం రోగే రోగే యథావిధి.

## అధ్యాయసంగ్రహము

తత్రశ్లోకౌ

31. వ్యాధితౌ పురుషౌ జ్ఞాఽజ్ఞౌ భిషజౌ సప్రయోజనౌ,
వింశతిః క్రిమయస్తేషాం హేత్వాదిస్సప్తకో గణః

32. ఉక్తో వ్యాధితరూపీయే విమానే పరమర్షిణా,
శిష్యసంబోధనార్థం చ వ్యాధిప్రశమనాయ చ.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే,విమానస్థానే వ్యాధిత-
రూపీయవిమానం నామ సప్తమోఽధ్యాయః.

**తాత్పర్యము :** క్రిమిచికిత్సయందు మొదట అపకర్షణమునే చేసి తరువాత కారణనాశనము, ఆపైన నిదానమును వర్జించుట చేయవలెను. ఈ మూడు విధములైన చికిత్సా పద్ధతులే ఇతర రోగము లందును విధి ప్రకారము అనుస రింపజేయదగును. దీనిని శమన, శోధన, నిదాన పరివర్జనమని చెప్పబడినది. రెండు రకముల వ్యాధితులు, జ్ఞానులు, అజ్ఞానులు అయిన వైద్యులు ఈ భేదములుగా తెలుసు కొనుట వలన కలుగు సత్ఫలితములు, తెలియకపోవుట వలన కలుగు దుష్ఫలితములు ఇరువది రకములైన క్రిముల వర్ణనము వానియొక్క హేతువు మొదలైన సప్తగణము వీటన్నింటిని గురించిన వివరమును పరమర్షియైన ఆత్రేయ భగవానుడు శిష్యుల కొరకు, లోకమునందలి రోగుల వ్యాధి ప్రశమనము కొరకును చెప్పెను.

ఇది అగ్నివేశునిచే రచింపబడి చరకునిచే ప్రతిసంస్కరింపబడిన తంత్రము నందలి విమానస్థానమున వ్యాధిత రూపీయమను ఏడవ అధ్యాయము.

**ఆయుర్వేద దీపిక :** అపకర్షణము మొదలైన మూడు పద్ధతులే పేరు మార్పుతో యితర వ్యాధుల యందునూ ఉపయోగించవచ్చును. సంశోధనము-అప హరణము, సంశమనము-ప్రకృతి విఘాతము, నిదాన వర్జనము అదే పేరుతోనూ ఉపయోగింపబడినవి.

ఇది శ్రీచక్రపాణి దత్తునిచే రచింపబడిన ఆయుర్వేద దీపికయను చరక తాత్పర్యటీక యందలి విమానస్థానములోని వ్యాధిత రూపీయ విమానమను ఏడవ అధ్యాయము.

# రోగభిషగ్జితీయ విమానము

## అష్టమాధ్యాయము

1. అథాతో రోగ భిషగ్జితీయం విమానం వ్యాఖ్యాస్యామః.

2. ఇతి హ స్మాహ భగవానాత్రేయః.

**తాత్పర్యము :** ఇక ఇప్పుడు రోగభిషగ్జితీయ విమానమును గూర్చి చెప్పుకొందము అని ఆత్రేయ భగవానుడనెను.

**ఆయుర్వేద దీపిక :** పూర్వాధ్యాయము (వ్యాధితరూపీయాధ్యాయము) నందు రోగిని గురు, లఘు వ్యాధిత విభజన చేయుట యందు సాధారణముగా కల్గు భ్రాంతిని గురించి, తద్వారా వ్యతిరేక ప్రతిపాదన చేయుటను గురించియు చెప్పబడి నది. ఇది బుద్ధి దోషము వలన కలుగునది. అందుచేత విశుద్ధ బుద్ధిని (తప్పులు లేని బుద్ధిని) కలిగించుటకు కారణములైన అధ్యయన, అధ్యాపన, తద్విద్య సంభాషా అనువానిని తెలియజేయుటకు రోగభిషగ్జితీయము పేర్కొనబడుచున్నది. రోగభిష గ్జితమనగా చికిత్సితము. దానిని గురించి చెప్పబడిన అధ్యాయము రోగభిషగ్జితీ యాధ్యాయము. రోగ చికిత్సా విధానమును చికిత్సోపయోగకరమైన అధ్యయన విధి మొదలైనవి. మరియు కరణ కారణాదులును ఇందు పేర్కొనబడుచున్నవి.

### శాస్త్రపరీక్ష

3. బుద్ధిమానాత్మనః కార్యగురులాఘవం కర్మఫలమనుబంధం దేశకాలౌ చ విదిత్వా యుక్తిదర్శనాద్భిషగ్బుభూషుః శాస్త్రమేవాదితః పరీక్షేత. వివిధాని హి శాస్త్రాణి భిషజాం ప్రచరన్తి లోకే, తత్ర యన్మన్యేత సుమహద్యశస్వి-ధీరపురుషాసేవితమర్థబహుళమాప్తజనపూజితం త్రివిధశిష్యబుద్ధిహితమప-గతపునరుక్తదోషమార్షం సుప్రణీతసూత్రభాష్యసంగ్రహక్రమం స్వాధార-మనవపతితశబ్దమకష్టశబ్దం పుష్కలాభిధానం క్రమాగతార్థమర్థతత్త్వనిశ్చ-యప్రధానమ్ సంగతార్థమసంకులప్రకరణమాశుప్రబోధకం లక్షణవచ్చోదా-హరణవచ్చ తదభిప్రపద్యేత శాస్త్రమ్: శాస్త్రం హ్యేవంవిధమమల ఇవాదిత్య-స్తమో విధూయ ప్రకాశయతి సర్వమ్.,

తాత్పర్యము : వైద్యుడు కాదలచుకున్నవాడు బుద్ధిమంతుడై తనను తాను తెలిసికొని చేయబోవు పని (వైద్య విద్యార్జన) యొక్క గురుత్వము, లఘుత్వ ములను (తాను బాగుగా చదవగలడా లేదా యను అంశములను) దాని వలన కలుగు ఫలితములను, అనుబంధమును (తరువాత వచ్చు ఫలితమును) దేశ కాలములను కారణములతో సహా బాగుగా తెలిసికొని మొదట శాస్త్రమునే పరీక్షించవలెను. లోకమునందు వివిధములైన వైద్యశాస్త్రములు ప్రచారములో నున్నవి. వానిలో పెద్దది- కీర్తి కలది (మంచిపేరు కలది), ధీర పురుషులచే సేవింపబడినది. ఎక్కువ అర్థము కలది (దాని ననుసరించుట వలన ధనము ఎక్కువగా ప్రాప్తించుట), ఆప్తు లచే కీర్తింపబడినది, అల్ప, మధ్యమ, ఉత్తమ బుద్ధి కలిగిన మూడు రకములైన శిష్యులకును హితముగా నుండునది, పునరుక్తులు లేనిది, ఋషులచే వ్రాయబడినది, బాగుగా వ్రాయబడిన సూత్రము - భాష్యము - సంగ్రహములు కలది. (మొదట సూత్ర ప్రాయముగా వివరించి దానికి భాష్యమిచ్చి వివరించి మరల అప్పటి వరకు చెప్పిన దానినంతయు సంగ్రహించి వ్రాయుట) ప్రతి సూత్రమునకు వేదాది ప్రమా ణములను ఆధారము చేసుకొనియున్నది. నీచ శబ్దములు, కష్ట శబ్దములు లేనట్టిది, సరియగు అర్థము నిచ్చు వాక్యములు కలది, ఒక క్రమము ననుసరించి అర్థమగునది, అర్థ తత్త్వమును నిశ్చయించుటలో ప్రధానమైనది. ప్రతిపాదించిన విషయములనే వర్ణించునది, సంబంధములేని ప్రకరణముల నొకచోట చేర్చి యుండనిది, చదివిన వెంటనే బోధపడునది, ప్రశస్త లక్షణములు ఉదాహరణలతో కూడియున్నది — ఈ లక్షణములు ఏ శాస్త్రమున కున్నవని గుర్తింపబడినదో అట్టి వైద్య శాస్త్రమును అధ్యయనము చేయుటకు ఆశ్రయించవలెను. ఈ లక్షణములున్న శాస్త్రమే మబ్బులు ఆవరించని సూర్యుడు అంధకారమును పారద్రోలినట్లు అజ్ఞానమును పోగొట్టి సర్వ మును తేటతెల్లము చేయును.

ఆయుర్వేద దీపిక : ఇక్కడ అధ్యయన విధియందు చేయవలసిన కర్తవ్యములలో ఎటువంటి శాస్త్రము నభ్యసించవలెనో అటులనే ఆయుర్వేదార్థి యగు పురుషుడెట్టి వాడై యుండవలనో సూచించబడినది. కార్యము - కర్తవ్యము. గౌరవ మనగా అధిక ప్రయాసము చేత సాధించునది. లాఘవమనగా అల్ప ప్రయాసముచేత సాధించునది. కర్మ ఫలమనగా ఆ పనిని చేయుట వలన కలుగు ఫలితము. ఇది కార్యానంతరము వెంటనే కలుగునది. దేశ కాలము లనగా చేయవలసిన కార్యము నకు అనుగుణములైన దేశము మరియు కాలము అని యర్థము తెలిసికొని,—

ఇదంతయును తెలిసికొని, యుక్తి దర్శనముచేత- ఉపపత్తి దర్శనము చేత (తానీ కార్యమునకు సరిపోయెదనను విషయమును తెలుసుకొని) వైద్యుడగుట కిష్టమున్నచో అప్పుడు మొదటగా శాస్త్రమును పరీక్షించవలెను. ఎవరైతే ఆయుర్వేదాధ్యయనము తన శక్తి ననుసరించి బరువైన కార్యము (తగని పని) అని యనుకొందురో వారు ఆ ప్రయత్నము చేయరు. ఎవరు ఆయుర్వేద జ్ఞానము వలన ఆరోగ్యమును పొంద గోరరో వారునూ, ఇంకను ఎవరికి వయోకాలము ననుసరించి వార్ధక్య లక్షణము లున్నవో వారును - ఆయుర్వేదాధ్యయనమునందశక్తు లగుటచేతనే పై చెప్పబడిన ఉపపత్తిని దర్శించలేక (తాము ఈ పనికి తగుదుమని నిర్ణయించుకొనలేక) వైద్యు లగుటకు యిష్టపడరు. అందువలన వారి కొరకే ఆయుర్వేద శాస్త్ర పరీక్ష చెప్పబడ లేదు. ఎవరు ఇప్పుడు చెప్పబడిన లక్షణములకు వ్యతిరేక లక్షణములు కలిగి యుందురో అట్టివారు ఆయుర్వేదాధ్యయనమునకు సరిపడినవారు అగుటచేత వారు వైద్యులగుటకు సిద్ధపడియుందురు (ఇష్టపడి యుందురు). వారే శాస్త్రమును పరీక్షించునది వివిధములైన అనగా మంచివి కాని (ఉపయోగపడని) గొప్ప యశస్సు కలది, ధీర పురుషులచే సేవింపబడునదియును, లేదా గొప్ప కీర్తిగల ధీర పురుషులచే సేవింపబడునదియును అని విగ్రహ వాక్యము. ఆప్తులచే పూజింపబడినది- అనేకమంది ఆప్తులచేత తగిన విధముగా పూజింపబడినది ఉత్కృష్ట, మధ్యమ, అల్పబుద్ధి గల వారలు త్రివిధ శిష్యులు. పునరుక్తులు లేనిది అనగా ఎక్కడ చేయవలసిన దోష పాతమును చేయుదురో దానివలన, ప్రసంగవశమున ఏది చేయుదురో ఆ పునరుక్తము దోషముగాదు. ప్రసంగవశమున విస్తారము వలన గుణ దోషముల ప్రాప్తియందు అర్థమునకు సంబంధము కలిగియుండుట వలన, ఆ విషయము బాగడుట కొరకును, శిష్యులకు ధారణ శక్తిని పెంపొందించుటకును, విశేషమైన తంత్రకారులచే కొద్ది అంతరముతోనూ చేయబడిన పునరుక్తము వ్యతిరేక గుణముగా, (దోషముగా) పరిగణింపబడదు, అని చెప్పబడియే యున్నది. స్వాధారమనగా మంచి పేరు గలది. అనవపతిత శబ్దమనగా ఉపయోగమునందు లేని (అగ్రామ్య) శబ్దము. అకష్టశబ్దము, ఉచ్చారణకు కష్టముకాని శబ్దము లేదా బాగుగా అలవాటుగా నున్న శబ్దము. పుష్కలాభిధానమనగా సరియగు అర్థము నిచ్చు వాక్యము. క్రమాగతార్థమనగా చదివిన కొలది క్రమముగా అర్థమగునది. సంగతార్థము అనగా ప్రతిపాదించిన అర్థము. అసంకుల ప్రకరణమనగా ప్రకరణములన్నింటినీ ఒకచోట కలిపి యుంచకుండుట- లక్షణములనగా ఆయుర్వేద ప్రధానార్థములైన హేతులింగ ఔషధములనెడి అసాధారణ ధర్మములు. లేదా ప్రశస్తములైన లక్షణములు. ఉదాహరణవత్ అనగా దృష్టాంతము లతో కూడియుండుట.

## ఆచార్య పరీక్ష

4. తతో ఽనంతరమాచార్యం పరీక్షేత, తద్యథా-పర్యవదాతశ్రుతం పరిదృష్ట కర్మాణం దక్షం దక్షిణం శుచిం జితహస్తముపకరణవన్తం సర్వేన్ద్రియోపపన్నం, ప్రకృతిజ్ఞం ప్రతిపత్తిజ్ఞమనుపస్కృతవిద్యమనహంకృతమనసూయకమ-కోపనం క్లేశక్షమం శిష్యవత్సలమధ్యాపకం జ్ఞాపనసమర్థం చేతి. ఏవం గుణో హ్యాచార్యః సుక్షేత్ర మార్తవో మేఘ ఇవ శస్యగుణైః సుశిష్యమాశు వైద్యగుణైః సంపాదయతి.

**తాత్పర్యము :** అటు పిమ్మట ఆచార్యుని (గురువును) పరీక్షించవలెను. అదెట్లనగా గురువు—శాస్త్రమును చక్కగా సంపూర్ణముగా నేర్చుకొనినవాడు, (కర్మ పదాభ్యాసమును) ప్రాత్యక్షిక అనుభవము కలిగినవాడు, కర్మలనేకముగా చేసి చూచిన వాడు, కార్య సమర్థుడు, దయాశీలుడు, సంశుద్ధుడు, హస్తకౌశలము కలవాడు, కావలసిన అన్ని ఉపకరణములు కలిగియున్నవాడు సర్వేంద్రియములును సరిగా కలిగియున్నవాడు, ఇతరుల స్వభావములను తెలిసినవాడు, ఇతరుల జ్ఞాన పరిస్థితిని గమనించినవాడు, ఇతర శాస్త్రములను కూడ నేర్చినసూ ఆయుర్వేదమునకే ప్రాధా న్యత నిచ్చినవాడు, అహంకారము - అసూయ - కోపములు లేనివాడు, కష్టముల కోర్చువాడు, శిష్యులను ప్రేమతో చూచుకొనువాడు, విద్యను నేర్పగలవాడు, బోధ పడునట్లు చెప్పగలవాడును అయివుండవలెను. ఇట్టి గుణములున్న ఆచార్యుడు వర్షా కాలమునందు సుక్షేత్రమున ఫలితముల నిచ్చుటకై వర్షించు మేఘమువలె మంచి శిష్యుని శీఘ్రముగా వైద్య గుణ సంపన్నునిగా చేయును.

**ఆయుర్వేద దీపిక :** అధ్యయనము చేయవలసిన శాస్త్రమును, అది అధ్యయనమునకు ఎందువలన (అధ్యయనము చేయ) తగినదో తెలిసికొని (పరీక్షించి) ఆపైన ఆచార్య పరీక్షను వివరించడమైనది. దక్షుడు అనగా దుర్బుద్ధి లేనివాడు. ఉప కరణములతో కూడినవాడు అనగా ఉపకరణములు లేని గురువు వద్ద చికిత్సావృత్తి కొరవడుటచే ప్రాత్యక్షిక అభ్యాసము అతనివద్ద యుండదు. అనుపస్కృత విద్యగల వాడనగా ఇతర శాస్త్రముల జ్ఞానము వలన ఆయుర్వేద విద్యను నిర్లక్ష్యపరచక ప్రాధాన్యత నిచ్చువాడు. ఆయుర్వేదజ్ఞుడైనప్పటికీ ఇతర శాస్త్రములను కూడ తెలిసి యుండును. అట్టివాడు ఇతర శాస్త్రములను ప్రోత్సహించడు. ఆర్తవమనగా తగిన కాలమునందుండునది. (ఋతువు నందుండునది ఆర్తవము).

## గురువును సేవించు విధము

5. తముపసృత్యారిరాధయిషురుపచరేదగ్నివచ్చ రాజవచ్చ పితృవచ్చ భర్తృవచ్చాప్రమత్తఃతతః తత్ప్రసాదాత్ కృత్స్నం శాస్త్రమధిగమ్య శాస్త్రస్య దృఢతాయామభిధానస్య సౌష్ఠవేఽర్థస్య విజ్ఞానే వచనశక్తౌ చ భూయో భూయః ప్రయతేత సమ్యక్.

**తాత్పర్యము :** పై లక్షణములు కల్గియున్నట్టి యాచార్యుని జేరి యాతని శుశ్రూష చేయదలచిన శిష్యుడు ఆయనను అప్రమత్తుడై, అగ్ని-దేవుడు - రాజు - తండ్రి - యజమాని - వీరిని గౌరవించు విధమున సేవింపవలెను. అటుపైన ఆయన అనుగ్రహము వలన వైద్యశాస్త్రమునంతయు తెలిసికొని శాస్త్రమును దృఢముగా గుర్తుంచుకొనుటకు అర్థవివరణమునకు, విజ్ఞానమునకు విషయముల నితరులకు చెప్పు సామర్థ్యము కొరకు మాటిమాటికిని ప్రయత్నము చేయుచుండవలెను.

**చక్రపాణి :** అగ్ని మొదలగు అనేక దృష్టాంతములను చూపుటచేత అగ్న్యాదులను ఏ ఏ భావములతో సేవింతుమో ఆ యా భావములతోనే గురువును సేవింపవలెనని సూచింపబడినది. దృఢత్వమునందు—స్థిరముగా శాస్త్ర గ్రహణము చేయుటయందు. అభిధానస్యయనగా శాస్త్రాభిధానము కొరకు - వచన శక్తి అనగా అర్థ వివరణ సామర్థ్యమునందు.

6. తత్రోపాయా వ్యాఖ్యాస్యన్తే- అధ్యయన మధ్యాపనం తద్విద్య సంభాషా చేత్యుపాయాః.

## అధ్యయన విధి

7. తత్రాయమధ్యయనవిధిః—కల్యః కృతక్షణః ప్రాతరుత్థాయోపవ్యూషం వా కృత్వాఽఽవశ్యకముపస్పృశ్యోదకం దేవర్షిగోబ్రాహ్మణగురువృద్ధసిద్ధాచార్యేభ్యో నమస్కృత్య సమే శుచౌ దేశే సుఖోపవిష్టో మనఃపురస్సరాభిర్వాగ్భిః సూత్రమనుక్రమాన్ పునః పునరావర్తయేత్ బుద్ధ్వా సమ్యగనుప్రవిశ్యార్థతత్త్వం స్వదోషపరిహారార్థం పరదోషప్రమాణార్థం చ; ఏవం మధ్యందినేఽపరాహ్ణే, రాత్రౌ చ శశ్వదపరిహాపయన్నధ్యయనమభ్యస్యేత్ ఇత్యధ్యయనవిధిః.

**తాత్పర్యము :** దృఢమైన శాస్త్రము అలవడుటకు ఉపాయములను చెప్పు కొందము. అవి అధ్యయనము (తనంతట తాను చదువుట) అధ్యాపనము (తను చదివినదానిని యితరులకు చెప్పుట) తద్విద్యాసంభాషా (ఆ శాస్త్రమును గురించిన చర్చ యితర వైద్యులతో చేయుట).

ఇందు అధ్యయన విధి ఈ విధముగా నుండవలెను. అధ్యయనము చేయు వాడు - ఆరోగ్యవంతుడై, ఇతర వ్యాపకములను పెట్టుకొనక, ఉదయమున గాని ఇంకనూ రాత్రి మిగిలియుండగా (తెల్లవారు ఝామున) గానీ మేల్కొని తత్కాలా-వశ్యకములైన వాటిని (మల విసర్జనాదులను) చేసి స్నానము చేసి, దేవతలు-ఋషులు — గోవులు — బ్రాహ్మణులు — గురువులు - వృద్ధులు - సిద్ధులు - పండితులు-వీరికి నమస్కరించి, పరిశుభ్రమైన సమతలముగా నున్న ప్రదేశమున సుఖమైన రీతిలో కూర్చొని, వాక్కునందు మనస్సు లగ్నము చేసి సూత్రములను క్రమము ప్రకారము మాటిమాటికిని వల్లించుచుండవలెను. అర్థతత్త్వమును బాగుగా తెలుసు కొనుచుండవలెను. ఇందువలన స్వదోషములను పోగొట్టుకొనుట, ఇతరుల దోషము లను గుర్తించుట జరుగును. ఈ విధముగా మధ్యాహ్నము, అపరాహ్ణము, రాత్రి యందు కూడా (మొత్తము నాలుగు పర్యాయములు) ఎడతెగక విడువకుండగను అధ్యయనము అభ్యసించుచుండవలెను.

**ఆయుర్వేద దీపిక :** తత్ర అనగా శాస్త్ర దృఢత్వము మొదలగువానిపై. తద్విద్యసంభాష యనగా ఆదే శాస్త్రమును అధ్యయనము చేయువారితో చేయు సంభాషణము. కల్యుడనగా ఆరోగ్యవంతుడు. కృతక్షణుడనగా ఇతర వ్యాపకములు లేక యుండుటచే ఆ కాలమును చదువు (ఆయుర్వేదాధ్యయనము) కొరకే వెచ్చించు వాడు. ప్రాతఃకాలమునగానీ ఇంకనూ రాత్రి మిగిలియుండగా (తెల్లవారుఝామున— బ్రాహ్మ ముహూర్తమున) గానీ లేవవలెననుట ఒక పద్ధతి. ఉపవ్యూషమనగా రాత్రి ఇంకనూ మిగిలియుండగా. మనస్సును ముందుగా నుంచిన అనగా మనస్సును ఏకా గ్రతతో లగ్నము చేసిన, స్వదోష పరిహారమనగా అధ్యయము నందు తన దోషము లను పోగొట్టుకొనుటకు, పరదోష ప్రమాణము అనగా ఇతరుల అధ్యయమునందు దోషములను తెలుసుకొనుట (జ్ఞానము కొరకు). ప్రమాణమనగా జ్ఞానము నిచ్చునది. (ప్రమీయతే అనేన యితి ప్రమాణమ్). జ్ఞానమని కూడా యిచట చెప్పవచ్చును. అర్థ తత్త్వమును సరిగా తెలిసికొనుటచే చదువుచున్నది నిర్దోషముగా నుండును,

సరియగు అధ్యయన జ్ఞానము వలన పరుల అధ్యయన దోషములను గురించి తెలియును. మొదట ప్రతిజ్ఞ చేసినట్లు అధ్యయన విధిని గూర్చి చెప్పి ఉపసంహరించుట జరిగినది. యథావిధిగా చేయబడిన అధ్యయనము మంచిదిగా ఒప్పుకొనబడును. తిథి నక్షత్రాది దృష్టి, అదృష్ట సంపత్తు చేత కొన్ని దినములు వేదాధ్యయనమునకు తగనివి. (వర్జనీయములు)గా చెప్పబడినవి. ఆయుర్వేదాధ్యయనము నందును అట్టివి నిషిద్ధములుగనే తెలియవలెను. ఈ విషయము ప్రత్యేకముగా చెప్పబడలేదు.

## అధ్యాపన విధి

8. అథాఽధ్యాపనవిధిః - అధ్యాపనే కృతబుద్ధిరాచార్యః శిష్యమేవాదితః పరీక్షేత తద్యథా-ప్రశాంతమార్యప్రకృతికమక్షుద్రకర్మాణమృజుచక్షుర్ముఖనాసావంశం తనురక్తవిశదజిహ్వమవికృతదన్తౌష్ఠమమిన్మికినం ధృతిమన్తమనహంకృతం మేధావినం వితర్కస్మృతిసంపన్నముదారసత్త్వం తద్విద్యకులజమథవా తద్విద్యవృత్తం తత్త్వాభినివేశినమవ్యఙ్గమవ్యాపన్నేంద్రియం నిభృతమనుద్ధతమర్థతత్త్వభావకమకోపనమవ్యసనినం శీలశౌచాచారానురాగదాక్ష్యప్రాదక్షిణ్యోపపన్నమధ్యయనాభికామమర్థ విజ్ఞానే కర్మదర్శనే చానన్యకార్యమలుబ్ధమనలసం సర్వభూతహితైషిణమాచార్యసర్వానుశిష్టిప్రతికరమనురక్తం చ ఏవం గుణసముదితమధ్యాప్యమాహుః.

**తాత్పర్యము :** అధ్యాపనము చేయుటకు నిశ్చయించిన ఆచార్యుడు శిష్యునే మొదట పరీక్షింపవలెను. ప్రశాంత చిత్తము గలవాడు (ఆకారము గలవాడు) ఆర్యప్రకృతి గలవాడు చెడ్డపనులు చేయనివాడు నిటారుగా నుండు కన్నులు, నోరు ముక్కు (ముక్కు దూలము) కలవాడు, పలుచని, ఎఱ్ఱని పెదవైన నాలుక గలవాడు, దంతములు పెదవులు వికృతముగా లేనివాడు, నత్తి లేనివాడు, మేధాశక్తి గలవాడు, మంచి చెడులను తర్కించి తెలిసుకొనగలవాడు, ఉదార స్వభావము గలవాడు, ఆయుర్వేదము పరంపరముగానున్న కుటుంబమున జన్మించినవాడు లేదా ఆయుర్వేద విద్యను నేర్చుకొనుట యందు నిమగ్నమైనవాడు, తత్త్వార్థమును తెలుసుకొనుటకు గాఢమైన ఇచ్ఛ గలవాడు, వికృతాంగములు- అంగవైకల్యము లేనివాడు, విశ్వాసపాత్రుడు, ఎడతెగక అర్థతత్త్వమును గురించి ఆలోచించువాడు, కోపము

లేనివాడు, వ్యసనములు లేనివాడు, మంచి గుణము, శుచిత, ఆచారము, అనురాగము, నేర్పు, దయ- ఈ లక్షణములు గలవాడు, అధ్యయనాభిలాష కలవాడు. అర్థజ్ఞానము నందు, ప్రాత్యక్షిక కర్మలను చేసి చూచుట యందును ఇచ్ఛ కలవాడు, ఇతర వ్యాప కములు లేనివాడు, లోభిత్వము లేనివాడు, బద్ధకము లేనివాడు, సర్వభూతముల హితమును కోరువాడు, ఆచార్యునిచే ఆజ్ఞాపింపబడిన అన్ని పనులు చేయువాడు, ప్రీతిపాత్రుడు - ఇట్టి గుణములు గలవానికే ఆచార్యుడు విద్యను నేర్పవలెను.

ఆయుర్వేద దీపిక : ఇచ్చట శిష్యగణము లందు చెప్పబడిన ఋజువగు (తిన్నగానుండు) కన్నులు ముఖము ముక్కు మొదలగు గుణములు సహజలక్ష ణములుగా గ్రహింపవలెను. ఇందుకు వ్యతిరేక లక్షణములున్నవాడు మందుడుగా నుండును. "తద్విద్యవృత్తమ్" అనగా ఆయుర్వేదమును తెలిసి ఆచరించుచున్న వానిని అని అర్థము. "అనురాగ" శబ్దము వలన అధ్యయనమునందు అనురాగము అని చెప్పబడుచున్నది. "అనురక్తమ్" అనుట వలన గురువునందు అనురక్తిని కలిగి యుండుట చెప్పబడుచున్నది. దాక్ష్యమును (నేర్పరితనమును) చూపి "అనలసమ్" అని చేనిని చెప్పుచున్నారో దానివలన దాక్ష్యమువలన ప్రారంభింపబడిన కార్యము ఎక్కువ ప్రయాసవలన సాధ్యపడునప్పటికీ, దానియందు అలసత్వమును చూపని వాడు అని అర్థము. "అనుశిష్టిప్రతికరమ్" అనగా ఆజ్ఞాపించిన పనులను చేయువాడు అని అర్థము.

9. ఏవంవిధమధ్యయనార్థినముపస్థితమారిరాధయిషురాచార్యోఽనుభాషేత-
అథోదగయనే శుక్లపక్షే ప్రశస్తేఽహని తిష్యహస్తశ్రవణాశ్వయుజామన్యతమేన
నక్షత్రేణ యోగముపగతే భగవతి శశిని కల్యాణే కల్యాణే చ కరణే మైత్రే
ముహూర్తే స్నాతః కృతోపవాసో ముణ్డః కాషాయవస్త్రసంపీతః సమిధోఽ-
గ్నిమాజ్యముపలేపనముదకుంభాంశ్చ గన్ధహస్తో మాల్యదామదీపహిరణ్య-
హేమరజతమణిముక్తావిద్రుమక్షౌమపరిధీన్ కుశలాజసర్షపాక్షతాంశ్చ,శుక్లాంశ్చ
సుమనసో గ్రథితాఽగ్రథితాంశ్చ మేధ్యాన్ భక్ష్యాన్ గంధాంశ్చ ఘృష్టానాద
యోపతిష్ఠస్వేతి.

10. అథ సోఽపి తథా కుర్యాత్

తాత్పర్యము : ఇటువంటి గుణములు కలిగిన శిష్యుడు తనవద్దకు వచ్చి నపుడు ఆచార్యుడాతనితో ఉత్తరాయణ శుక్ల పక్షమునందు ఒక రోజున పుష్యమి,

హస్త శ్రవణము, అశ్వనీ వీనిలో నొక నక్షత్రములో చంద్రుడున్న శుభదినమున, శుభకరణము నందు అనుకూలమైన (శుభ) ముహూర్తమున క్షౌరము చేయించుకొని, ఉపవాసముండి స్నానము చేసి కాషాయ వస్త్రములను కట్టుకొని చేతులకు గంధములను పూసుకొని, సమిధలు, అగ్ని, నెయ్యి, ఉపలేపనము, జలముతో నిండిన పాత్రలు, పుష్పమాలలు, దీపము, బంగారము, బంగారు నగలు, వెండి,మణులు, ముత్యములు, పగడములు, పట్టువస్త్రము, పాలాశదండములు, దర్భలు, పేలాలు, ఆవాలు, అక్షతలు, తెల్లని పూలమాలలు, మాలగాకట్టని విడిపూలు, బుద్ధి వర్ధకములైన ఆహార పదార్థములు, అరగదీసిన గంధము, వీటన్నింటిని తీసికొనిరమ్మని చెప్పవలెను. అతడును అట్లే చేయవలెను. పై సంభారములను తీసుకొనిరావలయును.

ఆయుర్వేద దీపిక : తిష్య అనగా పుష్య నక్షత్రము. అశ్వయుక్- అశ్వనీ. చంద్రుడున్న శుభదినమున అనగా పై చెప్పబడిన నక్షత్రముల యందు చంద్రుడు శుభకరమై యుండుటంజేసి అట్టిరోజునే అధ్యయనము చేయవలెను. మైత్రే ముహూర్తమునందనగా అనుకూల ముహూర్తమునందు శివ - భుజగాదులు కూడ శుభ ముహూర్తనామములు. ముండుడు అనగా క్షౌరము చేయించుకొన్నవాడు. అయిదు వ్రేళ్ళకును గంధమును పూసుకొన్నవాడు గంధహస్తుడు. హిరణ్యము - శుద్ధ బంగారము (నగగా మార్చబడనిది). హేమము - నగల రూపములోనున్న బంగారము. పరిధులనగా హస్త ప్రమాణమున నుండి హోమకుండమునకు నాల్గు ప్రక్కలకు ఉంచవలసిన పాలాశ దండములు. ఈ చెప్పబడిన సామాగ్రియంతయు స్వార్జితమై యుండుట, తనే స్వయముగా తెచ్చుట మంచిదని ఋషి వచనము. కాబట్టి యితరులచే తేబడిన గంధాదులు మంచివైనను ఉపయుక్తములు కావు.

11. తముపస్థితమాజ్ఞాయ సమే శుచౌ దేశే ప్రాక్ప్రవణే ఉదక్ప్రవణే వా చతుష్కిష్కుమాత్రం చతురస్రం స్థణ్డిలం గోమయోదకేనపరిలిప్తం కుశాస్తీర్ణం సుపరిహితం పరిధిభిశ్చతుర్దిశం యథోక్తచన్దనోదకుమ్భాక్షతహేమహిరణ్యరజతమణిముక్తావిద్రుమాలంకృతం మేధ్యభక్ష్యగన్ధశుక్లపుష్పలాజసర్షపాక్షతోపశోభితం కృత్వా తత్ర పాలాశీభిరైఙ్గుదీభిరౌదుమ్బరీభిర్మాధుకీభిర్వా సమిద్భిరగ్నిముపసమాధాయ ప్రాఙ్ముఖః శుచిరధ్యయనవిధమనువిధాయ మధుసర్పిర్భ్యాం త్రిస్త్రిర్జుహుయాదగ్నిం ఆశీః సంప్రయుక్తైర్మన్త్రైర్బ్రహ్మాణమగ్నిం ధన్వన్తరిం ప్రజాపతిమశ్వినావింద్రమృషీంశ్చ సూత్రకారానభిమన్త్రయమాణః పూర్వం స్వాహేతి.

12. శిష్యశ్చైనమన్వాలభేత హుత్వా చ ప్రదక్షిణమగ్నిమనుపరిక్రామేత్ పరిక్రమ్య బ్రాహ్మణాన్ స్వస్తి వాచయేత్. భిషజశ్చాభి ప్రపూజయేత్.

**తాత్పర్యము** : అతనిని కూర్చుండ నాజ్ఞాపించి సమతలముగా నుండు శుచియైనట్టియు తూర్పునకుగానీ ఉత్తరమునకు గానీ వాలియున్నట్టియు ప్రదేశమున నాలుగు హస్తముల ప్రమాణము స్థలమున నొక హోమకుండమును జేసి గోమయముతో నలికి దర్భలను పరచి నాల్గు ప్రక్కలను పరిధుల నుంచి ఇదివరకు చెప్పబడిన హిరణ్యాదులచే నలంకరించి మేధ్య భక్ష్యాదులను కూడా నక్కడ యమర్చి మోదుగ, గార, అత్తి, ఇప్పచెట్ల సమిధలతో నగ్నిని ప్రజ్వలింపజేసి తూర్పు ముఖముగ కూర్చొని శుచిగా అధ్యయన విధిని సంకల్పించి తేనె నెయ్యిలతో మూడేసి మారు ఆశీస్సులతో గూడిన బ్రహ్మ, అగ్ని, ధన్వంతరి ప్రజాపతి అశ్వినులిద్దరు, ఇంద్రుడు సూత్రకారులైన ఋషులు వీరి పేర్లను స్వాహాను పూర్వకముగా నుచ్చరించుచూ హోమము చేయవలెను. శిష్యుడును గురువును అనుసరించవలెను. అగ్నికి ప్రదక్షిణము జేసి బ్రాహ్మణులకు ఆపైన ప్రదక్షిణముచేసి స్వస్తివాచనము చేసి వైద్యలను పూజింపవలెను.

**ఆయుర్వేద దీపిక** : కిష్కు అనగా హస్త ప్రమాణము. సుపరిహిత మనగా ఆవరింపబడిన (చుట్టబడిన), ఉపాధేయ (ఉపసమాధేయ) అనగా ఎక్కించి హోమము చేయవలెను. అనగా గురువు హోమము చేయవలెనని యభిప్రాయము. బ్రహ్మాదులను స్వాహాను పూర్వకముగా ఉచ్చరించుట యందు - మంత్రములతో మంత్రించు ఆచార్యుడు మొదట అగ్నికి ఆహుతి నివ్వవలెననుట పద్ధతి. దానివలన బ్రహ్మాదిఋషుల ఆశిస్సులతో కూడి "బ్రహ్మణేస్వాహా" అను మంత్రములతో హోమము చేయవలెను. శిష్యుడు గురువు ననుసరింపవలెను. అనగా శిష్యుడును గురువు హోమము చేసిన తరువాతనే హోమమును చేయవలెనని అర్థము.

## శిష్యుడా అనుసరింపవలసిన నియమములు

13. అగ్నిసకాశే బ్రాహ్మణసకాశే చానుశిష్యాత్ బ్రహ్మచారిణా శ్మశ్రుధారిణా సత్యావాదినామాంసాదేన మేధ్యసేవినా నిర్మత్సరేణాశస్త్రధారిణా చ భవితవ్యమ్, న చ తే మద్వచనాత్ కిఞ్చిదకార్యంస్యాదన్యత్ర రాజద్విష్టాత్ ప్రాణహరాద్విపులాదధర్మాదనర్థసంప్రయుక్తాద్వాఽప్యర్థాత్; మదర్పణేన మత్ప్రధానేన మదధీనేన మత్ప్రియహితానువర్తినా చ శశ్వద్భవితవ్యమ్; పుత్రవద్దా

నవదత్తివచ్చోపచరతాఽనువ స్తవ్యోఽహమ్ అనుశ్ర్వేతేనా ఽవపిరితేనాఽనన్య-మనసా వినీతేనా వేక్ష్యాఽపేక్ష్యకారిణాఽనసూయుకేన చాభ్యనుజ్ఞాతేన ప్రవిచరి-తవ్యమ్,అనుజ్ఞాతేన(చానసుజ్ఞాతేన) ప్రవిచారతా పూర్వం గుర్వర్థోపాహరణే యథాశక్తి ప్రయతితవ్యమ్, కర్మసిద్ధిమర్థసిద్ధిం యశోలాభం ప్రేత్య చ స్వర్గమిచ్ఛతాభిషజా త్వయా గోబ్రాహ్మణమాదౌ కృత్వా సర్వప్రాణభృతాం శర్మాశాసితవ్యమ్ అహరహరుత్తిష్ఠతా చోపవిశతా చ సర్వాత్మనాచాతురాణా మారోగ్యాయ ప్రయతితవ్యమ్,జీవితహేతోరపి చాతురేభ్యోనాభిద్రోగ్ధవ్యమ్, మనసాపి చ పరస్త్రియో నాభిగమనీయాః తథా సర్వమేవ పరస్వమ్ నిభృత-వేశపరిచ్ఛదేన భవితవ్యమ్,అశౌండేనాఽపాపేనాఽపాపసహాయేన చ, శ్లక్ష్ణశుక్ల ధర్మ్యశర్మ్యధన్యసత్యహితమితవచసా దేశకాలవిచారిణా స్మృతిమతా జ్ఞానో-త్థానోపకరణసంపత్సు నిత్యంయత్నవతా చ, న కదాచిద్ రాజద్విష్టానాం వా మహాజనద్విష్టానాం మహాజనద్వేషిణాం వాఽప్యౌషధమనువిధాతవ్యమ్, తథా సర్వేషామత్యర్థవికృతదుష్టదుఃఖశీలాచారోపచారాణామనపవాదప్రతీకారాణాం ముమూర్షూణాం చ తథైవాసన్నిహితేశ్వరాణాం స్త్రీణామనధ్యక్షాణాం వా న చ కదాచిత్ స్త్రీదత్తమామిషమాదాతవ్యమననుజ్ఞాతం భర్త్రాథవాఽధ్యక్షేణ.ఆతుర-కులం చానుప్రవిశతా విదితేనానుమతప్రవేశినా సార్ధం పురుషేణ సుసంవీతేనా-వాక్ఛిరసా స్మృతిమతా స్తిమితానావేక్ష్యావేక్ష్య మనసా సర్వమాచరతా బుద్ధ్యా-సమ్యగనుప్రవేష్టవ్యం, అనుప్రవిశ్య చ వాఙ్మనోబుద్ధీన్ద్రియాణి న క్వచిత్ ప్రణిధాతవ్యాని అన్యత్రాతురాదాతురోపకారార్థాతురగతేష్వన్యేషు వా భావేషు, న చాతురకులప్రవృత్తయోబహిర్నిశ్చారయితవ్యాః,హ్రసితంచాయుషః ప్రమాణమాతురస్య జానతాఽపి త్వయా న వర్ణయితవ్యం తత్ర యత్రోచ్య-మానమాతురస్యాన్యస్య వాఽప్యుపఘాతాయ సంపద్యతేః జ్ఞానవతాపి చ నాత్యర్థమాత్మనో జ్ఞానేన వికత్థితవ్యమ్, ఆప్తాదపి హి వికత్థమానాదత్యర్థ-ముద్విజన్త్యనేకే

**తాత్పర్యము :** ఈ విధముగా హోమమును చేసిన పిదప శిష్యుని అగ్ని బ్రాహ్మణులు వైద్యులు వీరి సమ్ముఖమున ఈ విధముగా నుపదేశింపవలెను. ఇకపై నీవు బ్రహ్మచారిగను శ్మశ్రుధారిగను సత్యమునే పలుకుచు మాంసాహారమును ముట్టక బుద్ధివర్ధకమైన యాహారమును సేవించుచు మాత్సర్యము లేక శస్త్రములను ధరింపక యుండవలెను. నేనుపదేశించిన కార్యములనే నీవు ఆచరింపవలెను. ఇవి తప్ప ఆ పనులవలన రాజద్వేషము, ప్రాణహాని, అధర్మము అనర్థములు కల్గునని

తోచినయెడల మాత్రమే అవి చేయవలదు. నీవు నాకు అర్పణము చేసికొనవలెను
నన్ను ప్రధానముగా స్వీకరింపవలెను. నా యధీనములో నుండవలెను. నాకు ప్రీ
పాత్రులను అనుసరింపవలెను. నీవు నాయందు పుత్రుని వలెను, దాసుని వలెను, అ
తుని వలెను వ్యవహరింపవలెను. నా యాజ్ఞలను గర్వములేక ఉదాసీనత లేక, అన
మనస్కముగా నుండక, వినయముతో మంచి చెడులను చూచి అపాయ లేకుండగ
పాలింపవలెను. నాచే ఆజ్ఞ పొంది, ఆజ్ఞ పొందకయు పనులు చేయునపుడు ముందు
గురువుయొక్క (నాయొక్క) పనులనే ముందుగా చేయ ప్రయత్నించవలెను. అన్ని
వేళలయందును కర్మసిద్ధి అర్థసిద్ధి మోక్షప్రాప్తి ఈ ప్రయత్నములయందు ముందు
గోబ్రాహ్మణుల మంచిని ఎంచి, ఆపైన అన్ని ప్రాణుల మంచిని ఎంచవలయును
సర్వవిధములను రోగుల ఆరోగ్యము కోసమే ప్రయత్నించవలెను. నీ ప్రాణము
కాపాడుకొనుటకైనను రోగులకు ద్రోహము తలపెట్టరాదు. పరస్త్రీలను మనసు
నందైననూ సంభోగింపరాదు. వారి ధనమును గూడ ఆశింపరాదు. వినయముతో
గూడిన సాధారణ వేషమునే ధరించవలెను. మద్యశాలయందు తిరుగక (మద
పానము చేయక) పాప కృత్యములు చేయక, పాపుల స్నేహము చేయక మృదువు
స్వచ్ఛముగ ధర్మసహితముగ సుఖకరముగ ధనము కలిగించునట్టి హితములైన
సత్యములనే మాట్లాడవలెను. దేశ కాల పరిస్థితులను విచారించి స్మృతి జ్ఞానవ
కలిగి జ్ఞానము కల్గించు పనుల మీదనే దృష్టిని నిలిపి యుండవలెను. ఎప్పుడు
రాజుచే ద్వేషింపబడినవారికిని, రాజును ద్వేషించువారికిని గొప్పవారిని ద్వేషిం
వారికి, గొప్పవారిచే ద్వేషింపబడువారికి ఔషధము నివ్వరాదు. మరియు ఎల్లప్పు
అతిగానూ, వికృతముగానూ, చెడుగను, దుఃఖము కలుగజేయు రీతిగను ప్రవర్తిం
వారికి, అపవాద నివృత్తి చేయనివారికిని మృత్యువునకు సమీపముగ నున్నవారికి
అటులనే అనాథలైనవారికి, అనాథలైన స్త్రీలకునూ ఔషధము నివ్వరాదు. ఎప్పుడు
భర్త లేక యింటి పెద్దల అనుమతి లేకుండా స్త్రీలిచ్చు మాంసమును తీసుకొనరా
రోగి యింటియందు ప్రవేశించునపుడు నీకు తెలిసిన వేరొక పురుషునితో కూడి వె
వలయును. ఆ సమయమున శుభ్రమైన వస్త్రములను ధరించి, తలను వం
పూర్వపు సంఘటనలను స్మరించి స్థిరచిత్తముతో అన్ని విషయములను మన
నందు వివశ చేసి సదాచారముతో లోనికి వెళ్ళవలయును. ప్రవేశించిన పిమ్మట
వాక్కు, మనస్సు, బుద్ధి ఇన్ద్రియములను రోగికి రోగ నిర్మూలనము చేయుటయం

లగ్నము చేయవలెను. అంతేగాని రోగికి సంబంధించిన యితర విషయములందు తిల దూర్చరాదు. రోగియొక్క విషయములను యితరులకు చెప్పతగదు. రోగికి ఆయుఃప్రమాణము క్షీణించినదని తెలిసిననూ నీవా విషయమును బయటకు చెప్ప రాదు. ఇట్లు చెప్పుటచేత రోగి బంధువులకు కష్టము కల్గును. విజ్ఞానము కలిగి యున్ననూ నిన్ను నీవు విశేషముగా శ్లాఘించుకొనరాదు. ఆప్తులు కూడా ఈ విధముగా శ్లాఘించుకొనువారిని నిరసింతురు.

ఆయుర్వేద దీపిక : "తే భవితవ్యమ్" అనగా నీ చేత ఈ విధముగా ప్రవర్తింపబడవలెను, నడచుకొనవలెను. అనగా చికిత్సార్థము వ్యవహరింపవలెను. గోబ్రాహ్మణులకు మంచిని ఎంచవలెననుటచే మొదట గోవులు, బ్రాహ్మణుల శుభమును కోరి ఆ పైననే యితర ప్రాణుల శుభమును కోరవలెనని సూచింపబడినది. ఉపవిశతా-అనునది భేదము. శుండమనగా మద్యశాల. యిందు తిరుగువాడు శౌండి యనబడును. అశౌండి యనగా మద్యశాలకు పోనివాడు. శుక్ల శబ్దము స్వచ్ఛతను సూచించును. ప్రయత్నము వలన అట్లుండుమనుట సంబంధమును సూచించును. రాజుచేత ద్వేషింపబడినవాడు రాజద్విష్టుడు. రాజును ద్వేషించువాడు రాజద్వేషి. ఆహారములననుసరించుట ఆహారోపచారము అనబడును. అసత్యక్షణాం వా అనగా పెద్ద దిక్కులేని స్త్రీలను గూడా చికిత్స చేయదగదని భావము. ప్రవృత్తులనగా వార్తలు. శత్ర యనునది వర్ణింప కూడదనుటకు సంబంధించినది. ఇతరుల యొక్క అనగా రోగియొక్క పుత్రులు, తండ్రి మొదలగు వారియొక్క. విశేషముగా చెప్పు కొనరాదు. అనగా పొగుడుకొనరాదు. ఆప్తులు కూడా అనుటవలన ఆప్తులు సత్య వాక్కులనే పలుకుదురు. ఎచటనైననూ సత్యమునే పలుకుదురు. కాని సత్యము నైననూ సరియగు సమయము వచ్చినపుడే పలుకవలెనని యర్థము.

14. న చైవ హ్యస్తి సుతరామాయుర్వేదస్య పారమ్, తస్మాదప్రమత్తః శశ్వదభి-
యోగమస్మిన్ గచ్ఛేత్, ఏతచ్చ కార్యమ్, ఏవమ్భూయశ్చ వృత్తసౌష్ఠవమన
సూయతా పరేభ్యోఽప్యాగమయితవ్యమ్, కృత్స్నో హి లోకో బుద్ధిమతా-
మాచార్యః శత్రుశ్చాబుద్ధిమతామ్, అతశ్చాభిసమీక్ష్య బుద్ధిమతాఽమిత్రస్యాపి
ధన్యం యశస్యమాయుష్యం పౌష్టికం లౌక్యమభ్యుపదిశతో వచః శ్రోతవ్య-
మనువిధాతవ్యం చేతి.

అతః పరమ్ ఇదం బ్రూయాత్ దేవతాగ్నిద్విజగురువృద్ధసిద్ధాచార్యేషు తే

నిత్యం సమ్యగ్వ ర్తితవ్యమ్, తేషు తే సమ్యగ్వ ర్తమానస్యాయమగ్నిః సర్వగన్ధ-రసరత్న బీజాని యథేరితాశ్చ దేవతాఃశివాయ స్యుః అతోఽన్యథా వ ర్తమాన-స్యాశివాయేతి.

ఏవం బ్రువతి చాచార్యే శిష్య స్తథేతి బ్రూయాత్. యథోపదేశం చ కుర్వన్న ధ్యాప్యః,అతోఽన్యథా త్వనధ్యాప్యః అధ్యాప్యమధ్యాపయన్ హ్యాచార్యో యథో క్తైశ్చాధ్యాపనఫలైః యోగమాప్నోత్యన్యైశ్చాను క్తైః శ్రేయస్కరైర్గుణైః శిష్యమాత్మానం చ యునక్తి.ఇత్యుక్తావధ్యయనాధ్యాపనవిధియథావత్.

**తాత్పర్యము :** ఆయుర్వేదమునకు అంతము లేదు. కావున నీవు అప్రమత్తుడవై మాటిమాటికిని పై చెప్పిన విషయములను అనుసరించుచుండవలెను. ఇదియే నీవు చేయవలసిన పని. ఇట్లుండగా మంచి నడవడికను నీవితరుల నుండియూ అసూయ లేక నేర్వవలయును. ఎందువ నన‌గా బుద్ధిమంతునకు లోకమంతయు గురువు వంటిది (అన్నింటనూ మనము నేర్చుకొను భావములెన్నియో గలవని భావము). బుద్ధి లేనివారికి (మూర్ఖులకు) శత్రువు వంటివి. అందువలన బాగుగా సమీక్షించి బుద్ధిమంతుడైన శత్రువు వలనైననూ ధనమును, కీర్తిని, ఆయుష్షును, బలమును, సౌఖ్యమును, వృద్ధి చేయు వాక్యము వినదగినది, ఆచరింపదగినదియును. అటుపై నిట్లు శిష్యునితో చెప్పవలెను. నీవు ప్రతినిత్యము దేవతలు, అగ్ని, బ్రాహ్మణులు, గురువులు, వృద్ధులు, సిద్ధులు మరియు ఆర్యులు వీరి యెడ సక్రమముగా ప్రవర్తింపవలెను. ఇట్లు ప్రవర్తించుటచేత అగ్ని నీకు సర్వ రసములు, గంధములు, రత్నములు, బీజములు వీటిని నీ కోరిక మేరకు యిచ్చును. దేవతలు శుభములనిత్తురు. లేనియెడల అమంగళము జరుగగలదు. ఇట్లు చెప్పుచున్న ఆచార్యునకు శిష్యుడు అట్లేయని చెప్పుచుండవలెను. తాను చెప్పిన రీతిగ నడచుకొను శిష్యునకు ఆచార్యుడు ఆయుర్వేదమును నేర్పవలెను. అట్లు నడచుకొననివానికి నేర్పపగదు. నేర్పతగిన వారికి నేర్పిన ఆచార్యునకు దానికి తగినట్లు సత్ఫలితము నిచ్చును. ఇతరులకు నేర్పుట వలననీ ఫలితములు రావు. ఇట్లు నేర్పుట వలన ఆచార్యుడు శిష్యుడును శ్రేయస్కరములైన గుణముసుపొందెదరు. ఈ విధముగా అధ్యయనాధ్యాపన విధులు యథావిధిగా చెప్పబడినవిల.

**ఆయుర్వేద దీపిక :** ఆయుర్వేదము సామాన్యముగా తెలిసి కొనలేని వారు దాని కొరకై ఉద్యమింపవలసి యుండును. దీనిని అనగా దుస్తరమైన ఆయుర్వేదమును. దీనిని అనగా పై చెప్పిన సద్వృత్త సంబంధమైన దానిని వృత్త

సౌష్ఠవము పై చెప్పిన సద్వృత్తమును పోలినది. వాక్యమనగా లోక సమ్మతమైనది. ఇతి శబ్దము వినవలసిన దానిని సూచించును. ఇందువలన అమిత్రుడు (శత్రువు) చెప్పిన ధన యశస్యాది గుణములతో కూడిన వాక్యములనే విని ఆచరింపవలెను. యథోక్తములైన - ఇతర శాస్త్రముల యందు చెప్పబడిన ఈ శాస్త్రమునందు అధ్యయన ఫలము ఎచ్చటను చెప్పబడి యుండలేదు.

## సంభాషా విధి

15. సంభాషావిధిమత ఊర్ధ్వం వ్యాఖ్యాస్యామః-భిషక్ భిషజా సహ సంభాషేత తద్విద్యసంభాషా హి జ్ఞానాభియోగసంహర్షకరీ భవతి, వైరదశ్యామపి చాభి-నిర్వర్తయతి, వచనశక్తిమపి చాధత్తే. యశశ్చాభిదీపయతి, పూర్వశ్రుతే చ సస్దేహవతః పునః శ్రవణాత్ శ్రుతసంశయమపకర్షతి, శ్రుతే చాసస్దేహవతో భూయోఽధ్యవసాయమభినిర్వర్తయతి, అశ్రుతమపి చ కించిదర్థం శ్రోత్ర విషయమాపాదయతి, యచ్చాచార్యః శిష్యాయ శుశ్రూషవే ప్రసన్నః క్రమేణోపదిశతి గుహ్యాభిమతమర్థజాతమ్, తత్పరస్పరేణ సహ జల్పన్ పిణ్డేన విజిగీషురాహ సంహర్షాత్ తస్మాత్తద్విద్య సంభాషామభిప్రశంసంతి కుశలాః.

## సంభాషా ద్వైవిధ్యము

16. ద్వివిధా తు ఖలు తద్విద్యసంభాషా భవతి — సంధాయసంభాషా, విగృహ్య సంభాషా చ.

**తాత్పర్యము :** ఇక ముందు సంభాషా విధిని వివరింతుము. వైద్యుడు వైద్యులతో సంభాషింపవలెను. తద్విద్యాసంభాష జ్ఞానము కొరకు చేయుస్పర్ధ (పోటీ)ను కలుగచేయును. పాండిత్యమును కల్గించును. వచన శక్తి (మాట్లాడు శక్తి)ని పొందించును. కీర్తిని ప్రకాశింపజేయును. పూర్వము వినిన విషయమున సంశయము కలిగియున్నచో దానిని మరల వినుట వలన ఆ సందేహమును తొలగించును. పూర్వము వినియుండి సందేహము లేకున్ననూ మరల వినుట వలన [illegible] దానిని నిశ్చయముగా తెలిసికొన్నట్లగును. ఇంతకు ముందు వినియుండని విషయములను తెలియజేయును. ఆచార్యుడు శిష్యుల శుశ్రూషలచే ప్రసన్నుడై తహ

స్యములైన విషయములను నేర్పును. దానిని శిష్యులు ఒకరి నొకరు జయించు కోరికతో స్పర్ధ యందు పిండము (సారము)తో వాదించి బయట పెట్టుదురు. అందువలన విజ్ఞులు తద్విద్య సంభాషను కొనియాడుదురు. తద్విద్య సంభాషయనునది సంధాయ సంభాష, విగృహ్యా సంభాషయని రెండు విధములు.

**ఆయుర్వేద దీపిక :** సంహర్షమనగా స్పర్థ (పోటీ). జ్ఞానము కొరకు ఒకరి కొకరికి పోటీని కలుగ జేయునది జ్ఞానాభియోగ సంహర్షకం యనబడును. వైశారద్యమనగా ఇతరులతో విద్యను గూర్చి చర్చించుటమున కలుగు పాండిత్యము. ఇవి సభ యందు అభ్యాసము చేయుటవలన కలుగును. మరల అధ్యవసాయమగుట యనగా దృఢ నిశ్చయము చేయుట. రహస్యముగానున్న విషయమును తెలిసికొనుట. పిండ వాదము వలన వీలుపడునని సూచింపబడినది. పిండవాదము చేత అనగా సారోద్ధారము చేత. రహస్య విషయమును చెప్పుట ఎట్లనగా ఇచట జయించు ఉద్దేశ్యము కలిగి యుండుటచే ఆ విషయమును చెప్పి జయించగలందులకు పిండ (సార) వాదమును ప్రయోగింపవలెనని భావము. సంధాయ సంభాషను సంవాద మందురు. విగృహ్యా సంభాషయనునది జల్ప వితండ వాదములతో కూడి యుండును.

## సంధాయ సంభాషా విధి

17. తత్ర జ్ఞానవిజ్ఞాన వచన ప్రతివచనశక్తిసంపన్నేనాఽకోపనేనానుపస్కృత విద్యేనాననూయకేనానునేయేనానునయకోవిదేన క్లేశక్షమేణ ప్రియసంభాషణేన చ సహ సంధాయసంభాషా విధీయతే. తథావిధేన సహ కథయన్ విస్రబ్ధః కథయేత్ పృచ్ఛేదపి చ విస్రబ్ధః పృచ్ఛతే చాస్మై విస్రబ్ధాయ విశదమర్థం బ్రూయాత్. న చ నిగ్రహభయాదుద్విజేత, నిగృహ్య చైనం న హృష్యేత్, న చ పరేషు వికత్థేత, న చ మోహాదేకాన్తగ్రాహీ స్యాత్, న చావిదితమర్థమనువర్ణయేత్, సమ్యక్ చానునయేనానునయేచ్చ (అనునయేచ్చ పరం) తత్ర చావహితః స్యాత్. యిత్యనులోమ సంభాషావిధిః.

**తాత్పర్యము :** సంధాయ సంభాషా పద్ధతి : జ్ఞాన విజ్ఞాన వచన ప్రతి వచన సంపన్నుడు, కోపము లేనివాడు, మొక్కవోని విద్యగలవాడును, అసూయ లేనివాడును, ఓర్పు గలవాడు, ఓర్పు వహించుటలో దిట్ట, బాధను సహించువాడు,

ప్రియముగా మాట్లాడువాడు - ఇట్టివారితో చేయునది సంధాయ సంభాష యన బడును. అట్టి సమయమున (వీరితో) చేయు సంవాదమునందు జంకు లేకుండా చెప్ప వలెను. వారిని ప్రశ్నించునపుడును జంకరాదు. వారు అడిగినపుడు కూడా జంకకనే అర్థమును (జవాబును) విశదీకరింపవలెను. అంతేగాని ఓటమి నెదుర్కొనవలసి వచ్చునని భయపడరాదు. ఎదుటివాడు ఓడిననూ సంతోష పడకూడదు. ఆ విషయము నితరులకు చెప్పరాదు. అజ్ఞానము చేత తాను చెప్పునదే సరియైనదని భావింపరాదు. (అసంపూర్ణముగా విషయ వివరణము చేసి దానిని సమర్థించు కొనరాదని భావము). తెలియని విషయమును ప్రస్తావింపరాదు. సరిగా అనునయించి ఎదుటివానికి అర్థమగు నట్లు చెప్పవలెను. ఇదియే అనులోమ సంభాషణ విధి (అనుకూలమైన సంవాద మిక్కడ జరుగును గావున యిది అనులోమ సంభాషణ మనబడును. దీనికే సంధాయ సంభాషణ మనిపేరు.)

ఆయుర్వేద దీపిక : సంధాయ సంభాషణమును గూర్చి వివరింపబడు చున్నది. జంకు లేకుండా చెప్పవలెననగా జల్పవితండముల వలన ఓడిపోయెదననెడి భయము లేకుండగా. కథయేత్ అనగా చెప్పవలెను. ఎదుటి వాడిని ఓడించిననూ సంతోషపడరాదనుటచే— అనులోమ రూప సంవాదమునందును చెప్పబడిన నిగ్రహ స్థానములైన హేత్వాభాస, అపసిద్ధాంత, న్యూన, అధికములచే ఎదుటివాడు ఓడినప్ప టికీ హర్షింపరాదని సూచింపబడినది. జల్పోక్త నిగ్రహస్థానము లిక్కడ వర్తింపవు. తెలియని విషయమనగా ప్రతివాదికి తెలియని విషయము. అనునయముగా అను నయింపుమనుట వలన ఛల జాతిని యిచట ప్రయోగింపకూడదని బోధించబడినది. అర్థమగునట్లు చెప్పవలెననగా సరియగు అనునయముతో బోధపరచవలెను.

## విగృహ్య సంభాషా విధి

18. అథ ఊర్ధ్వమితరేణ సహ విగృహ్యసంభాషాయాం జల్పేత్ శ్రేయసా యోగ- మాత్మనం పశ్యన్. ప్రాగేవ చ జల్పాజ్జల్పాన్తరం పరావరాన్తరం పరిషద్వి- శేషాంశ్చ సమ్యక్ పరీక్షేత. సమ్యక్ పరీక్షా హి బుద్ధిమతాం కార్యప్రవృత్తి- నివృత్తికాలౌ శంసతి, తస్మాత్ పరీక్ష్యామభిప్రశంసంతి కుశలాః పరీక్షమాణస్తు ఖలు పరావరాన్తరమిమాన్ జల్పకగుణాన్ శ్రేయస్కరాశ్చ దోషవతశ్చ పరీక్షేత సమ్యక్. తద్యథా-శ్రుతం, విజ్ఞానం, ధారణం ప్రతిభానం వచనశక్తి రితి, ఏతాన్ గుణాన్ శ్రేయస్కరానాహుః ఇమాన్ పునర్దోషవతః తద్యథా- కోపనత్వమవైశారద్యం భీరుత్వమధారణత్వమనవహితత్వమితి. ఏతాన్ గుణాన్ గురులాఘవతః పరస్య చైవాత్మనశ్చ తో (తు) లయేత్.

**తాత్పర్యము :** ఆ పైన ఇతరులతో విగృహ్య సంభాషణమును జరుప వలెను. ఇది చేయునపుడు తనయొక్క శ్రేయో యోగమును గుర్తెరుంగవలెను. మొదటనే తనకును ప్రతివాదికినీ గల వాద ప్రతిభను తెలుసుకొని పరిషత్ (సభ) యొక్క గుణాగుణ విశేషములను బాగుగా పరీక్షించుకొని యుండవలెను. సరియైన పరీక్షయే పనులను చేయుటకును, చేయకుండుటకును ఉపకరించును. అందువలన విజ్ఞులు పరీక్షను కొనియాడుదురు. ముఖ్యముగా తనకును, ప్రతివాదికిని హెచ్చుతగ్గులుగా నుండు వాద పద్ధతులు మంచి చెడులను బాగుగా పరీక్ష చేయవలెను. శాస్త్రజ్ఞానము విజ్ఞానము ధారణ శక్తి ప్రతిభ, వచన శక్తి, ఇవి శ్రేయస్కరములైన గుణములు. కోపించుట, పాండిత్యము లేకపోవుట, అధైర్యము, ధారణ శక్తి లేకుండుట చెప్పినవి వినకుండుట ఇవి చెడు గుణములు. ప్రతివాదికి తనకునూ గల పై గుణా గుణములను తూచి తెలియవలెను.

**ఆయుర్వేద దీపిక :** ఇతరులతో అనగా ముఖ్యులు కానివారితో వాదము అనునది గురువు లేక బ్రహ్మచారి మొదలగు విశేష వ్యక్తులతోనే చేయవలెను. న్యాయ దర్శనమునందు వాదమును శిష్యులు, గురువు బ్రహ్మచారులు, అసూయ పరులు కానివారు అగువారితో ప్రవర్తించవలెను అని చెప్పబడియున్నది. (న్యాయ దర్శనము-4/2/40) సంభాషణము నందు అనగా వాదించు విధానము. జల్పే అనగా జల్పము, వితండము రెండునూ సూచింపబడినవి. పరావరాంతరమనగా ప్రతివాది యొక్కయు, తన యొక్కయు ప్రతిభా మొదలైన విశేషములు. జల్పాంతరమనగా సామయికము, సర్వార్థము మొదలైన విశేషములతో కూడి జల్పక భేదమని అర్థము.

19. తత్ర త్రివిధం పరం సపద్యతే - ప్రవరః ప్రత్యవరః సమోవాగుణవినిక్షేపతః నత్వేవకార్త్స్న్యేన.

## పరిషత్తు - భేదములు

20. పరిషత్తు ఖలు ద్వివిధా-జ్ఞానవతీ మూఢపరిషచ్చ. సైవ ద్వివిధా సతీ త్రివిధా పునరనేన కారణవిభాగేన-సుహృత్పరిషదుదాసీనపరిషత్ ప్రతినివిష్టపరిచ్చేతి. తత్ర ప్రతినివిష్టాయాం పరిషది జ్ఞానవిజ్ఞానవచనప్రతివచనశక్తిసంపన్నా-యాం మూఢాయాం వా న కథంచిత్ కేనచిత్ సహ జల్పో విధీయతే; మూఢా-యాం తు సుహృత్పరిషది ఉదాసీనాయాం వా జ్ఞానవిజ్ఞానవచనప్రతివచనశక్తి-రన్తరేవ్యణాదీప్తయశసా మహాజనవిద్విష్టేనాపి సహ జల్పో విధీయతే. తద్వి-

ద్యేన చ సహ కథయతా ఆవిద్ధదీర్ఘసూత్రసంకులైర్వాక్యదణ్డైః కథయతి-వ్యమ్, అతిహృష్టం ముహుర్ముహురుపహసతా పరం నిరూపయతా చ పర్షదమాకారైర్బ్రువతాశ్చాస్య వాక్యావకాశో న దేయః కష్టశబ్దం చ బ్రువతా వక్తవ్యో-'నోచ్యతే'-అథవా-పునః "హీనా తే ప్రతిజ్ఞా" ఇతి. పునశ్చా-హూయమానః ప్రతివక్తవ్యం :- పరిసంవత్సరో భవాన్ శిక్షస్వ తావత్, న త్వయా గురురుపాసితో నూనమ్, అథవా పర్యాప్తమేతావత్తే: సకృదపి హి పరిక్షేపికం నిహతం నిహతమాహురితి నాస్యయోగః కర్తవ్యః కథఞ్చన. అప్యేవం శ్రేయసా సహ విగృహ్య వక్తవ్యమిత్యాహురేకే: నత్వేవం జ్యాయసా సహ విగ్రహం ప్రశంసంతి కుశలాః.

**తాత్పర్యము :** ప్రతివాది మూడు విధములుగ నుండును. ప్రవరుడు, ప్రత్యవరుడు, అవరుడు. ఈ విభజన ప్రతివాది యందలి శాస్త్ర సంబంధమైన గుణముల ననుసరించి చేయబడినది కానీ అతనియొక్క కులశీలాదులను లెక్కలోనికి తీసుకొనలేదు.

పరిషత్తు అనునది రెండు విధములు— ఒకటి జ్ఞానవతీ పరిషత్తు. రెండవది మూఢ పరిషత్తు. ఇదియే రెండు విధములుగా నున్ననూ ఇక చెప్పబోవు కారణముల వలన సుహృత్ పరిషత్తు, ఉదాసీన పరిషత్తు; ప్రతినిష్ట పరిషత్తు అని మూడు విధములుగా విభజింపబడును. (ఏ సభలో అందరూ మిత్రులే యుందురో అది సుహృత్ పరిషత్తు అనియు, మిత్ర శత్రుత్వము లేనివారున్నది ఉదాసీన పరిషత్తు అనిన్నీ అందరూ శత్రుత్వము కలవారే యున్నది ప్రతినివిష్ట పరిషత్తనియు పిలువబడుతుంది. సభ్యులందరూ ఏ సభయందు జ్ఞానము కలిగి ప్రతివాది గుణ సంపన్నులైయుందురో అది జ్ఞానవతి అనియు, అజ్ఞానులున్నది మూఢ పరిషత్తనియు పేర్కొనబడుచున్నవి.) ఇక ప్రవర ప్రత్యవరసమ విషయము సందు ప్రతివాది తనకంటె జ్ఞానవంతుడైనచో ప్రవరుడనియు తక్కువ జ్ఞానము కలిగి యున్నపుడు ప్రత్యవరుడనియు, తనతో సమాన జ్ఞానము కలిగియున్న యెడల సముడనియు పిలువబడుదురు.) ప్రతినివిష్ట పరిషత్తునందు జ్ఞానవిజ్ఞానాది గుణ సంపన్నులున్ననూ లేదా మూఢులున్ననూ వారితో ఎవ్వరితోనైననూ జల్పవాదము చేయరాదు/ మూఢులున్న సుహృత్ పరిషత్ నందైననూ, ఉదాసీన పరిషత్తునందైననూ, జ్ఞాన విజ్ఞాన గుణములు లేక యశస్సు లేక మహాజనులచే ద్వేషింపబడిన వారితో జల్ప వాదమును చేయవలెను/ అట్టివారితో చర్చను జరుపునపుడు ఒకదానితో నొకటి కలసియున్న దీర్ఘముగానున్న సూత్రము

లున్న వాక్యములతో విషయమును ప్రస్తావించవలెను మిక్కిలి ప్రసన్నవదనుడై మాటిమాటికి హేళనగా నవ్వుచూ సభ్యుల నుద్దేశించి ప్రతివాది దోషములనెత్తి చూపుచూ మాట్లాడునవకాశము నివ్వరాదు. తేలికగా బోధపడని శబ్దములను పలుకుచూ "నీవు దీనికి సమాధానము నివ్వలేకున్నావు నీ ప్రతిజ్ఞ నిలువ లేకపోయినది" అని యనుచుండవలెను. అతడింకను చర్చకు ఆహ్వానించుచున్నచో పై సంవత్సరమునకు ఇంకను అధ్యయనము చేసి నా యొద్దకు రమ్ము, నీవు గురు శుశ్రూష సరిగా చేసియుండలేదు. ఇప్పటికిది నీకు సరిపోయినది అని చెప్పవలెను. సభలో ఒకసారి పరాజయము పొందిననూ అతనిని సభ్యులు పరాజితునిగనే గుర్తింతురు. అట్టి వానితో తిరిగి ఎప్పుడునూ చర్చకు దిగరాదు. తనకంటె ఎక్కువ జ్ఞానవంతునితోనైననూ విగృహ్య సంభాషణ చేయవచ్చునని కొందరందురు. కానీ ఈ విధముగా తనకంటె పెద్దలతో విగ్రహ్య సంభాషణమును చేయరాదు అని విజ్ఞులందురు.

ఆయుర్వేద దీపిక : గుణముల వలన అనగా గుణముల పరిమాణము చేత తనకంటె ఉత్కృష్ట (ఎక్కువ) గుణములు కలిగి యున్నచో ప్రవరుడనబడును. ప్రత్యవరుడనగా తన కంటె హీన గుణములు కలవాడని యర్థము. సమ గుణములు కలవాడనగా తనతో సమానమైన గుణములు కలవాడని భావము. నత్వేవ కార్త్స్న్యేన- అనగా ఈ విధమైన ప్రవరాది నిర్ణయమును చేయునపుడు ప్రతివాది యొక్క మిగిలిన కులము, శీలము, ధర్మము మొదలైన అంశములను పరిగణలోనికి తీసుకొనలేదని భావము. మూఢ పరిషత్తనగా అందరూ జ్ఞానవంతులు లేనిది. ఎవ్వరితోనైననూ అనగా అధమునితోనైననూ, అవిద్ధమనగా వక్రమైన, కథయితవ్యమ్- అనగా చెప్పవలెను. ఉపహసతా అనగా హేళన చేయుచూ, కష్ట శబ్దమనగా వాడుకలో లేనిది. చెప్పలేకున్నావు అనగా నీవు చెప్పలేకున్నావు. కష్ట శబ్దము యొక్క అర్థమును మూఢ పరిషత్తు నందెవరును తెలియజాలరు. అందువలన కష్ట శబ్దము అర్థ కాఠిన్యములచేత దాని సహాయము వలన పరిషత్తు నందు విజయప్రాప్తి సుసాధ్యమగును. అందుచేత కష్ట శబ్దములను పలుకుచు నీ ప్రతిజ్ఞ హీనమైనది అని ప్రతివాదితో చెప్పవలెను. పై సంవత్సరమునకు తిరిగి అధ్యయనము చేసి నీ విజ్ఞానము సరిచేసుకొనుము అనియూ అనవలెను. ఇంతవరకు జరిగినది చాలు అనుటచే ప్రతివాదిని ఖండించినట్లగును. పరిక్షేపికమనగా ప్రతిక్షేపిక శబ్దము అతనితో తిరిగి కలువకూడదు. అనగా ఒక పర్యాయము అపజయము పాలైన వానిని తిరిగి జయించుటకు అతనితో చర్చ చేయరాదు. కొందరి యభిప్రాయ ప్రకారము శ్రేష్టమైన జ్ఞానము కలవారితోను జల్పమునకు దిగవచ్చును. వారితో వాదించరాధనుట ఆత్రేయ భగవానుని మతము.

21. ప్రత్యవరేణ తు సహ సమానాభిమతేన వా విగృహ్య జల్పతా సుహృత్పరిషది కథయితవ్యమ్, అథవాఽప్యుదాసీనపరిషది అవధానశ్రవణజ్ఞానవిజ్ఞానోపధారణవచనప్రతివచనశక్తిసంపన్నాయాం కథయతా చావహితేన పరస్య సాద్గుణ్యదోషబలమవేక్షితవ్యమ్:సమవేక్ష్య చ యత్రైనం శ్రేష్ఠం మన్యేత నాస్య తత్ర జల్పం యోజయేదనావిష్కృతమయోగం కుర్వన్: యత్ర త్వేనమవరం మన్యేత తత్రైవైనమాశునిగృహ్ణీయాత్. తత్ర ఖల్విమే ప్రత్యవరాణామాశునిగ్రహే భవన్త్యుపాయాః: తద్యథా శ్రుతహీనంమహతా సూత్రపాఠేనాభిభవేత్, విజ్ఞానహీనం పునః కష్టశబ్దేన వాక్యేన,వాక్యధారణాహీనమవిద్ధదీర్ఘసూత్రసంకులైర్వాక్యదణ్డకైః ప్రతిభాహీనం పునర్వచనేనైకనిధేనానేకార్థవాచినా, వచనశక్తిహీనమర్ధోక్తస్య వాక్యస్యాక్షేపేణ అవిశారదమపత్రపణేన కోపనమాయాసనేన భీరుం విత్రాసనేన అనవహితం నియమనేనేతి ఏవమేతైరుపాయైః పరమవరమభిభవేచ్ఛీఘ్రమ్.

తత్రశ్లోకా

22. విగృహ్యకథయేద్యుక్త్యా యుక్తం చ న నివారయేత్
విగృహ్య భాషా తీవ్రం హి కేషాంచిద్ద్రోహమావహేత్.

23. నాకార్యమస్తి కృద్ధస్య నావాచ్యమపి విద్యతే,
కుశలా నాభినన్దన్తి కలహం సమితౌ సతామ్.

24. ఏవం ప్రవృత్తే వాదే కుర్యాత్.

**తాత్పర్యము** : సుహృత్పరిషత్తునందు తనకంటె తక్కువ జ్ఞానము కల్గిన ప్రత్యవరునితో గానీ, సమునితోగానీ విగృహ్య సంభాషణము చేయవలెను. లేదా అవధానశక్తి. శ్రవణ శక్తి-జ్ఞానము- విజ్ఞానము-స్మరణశక్తి- వచన- ప్రతివచనశక్తి ఇవి కలిగిన వారున్న-ఉదాసీన పరిషత్తునందు వారు చెప్పునది జాగ్రత్తగా విని ప్రతివాది యొక్క గుణ దోషములను పరీక్షింపవలెను. ఆపైన ప్రతివాది ఏ గుణముల యందు తనకంటె యధికునిగా నున్నాడో ఆ విషయమున వాదము చేయరాదు. ఏ గుణముల యందు తక్కువగా నున్నాడో ఆ విషయమునందు వాదము చేసి యతనిని ఓడింపవలెను. తనకంటె తక్కువ జ్ఞానము ఉన్నవారిని ఓడించుటకు ఈ ఉపాయములు గలవు. అవి శాస్త్రజ్ఞానము లేనివారికి పెద్ద పెద్ద సూత్రములను వినిపించుట ధారణా శక్తి లేనివానికి వక్రములైన పొడవైన ఎక్కువ విషయములతో

కూడిన పెద్ద పెద్ద వాక్యములను చెప్పుట, ప్రతిభ లేనివానికి అనేకార్థములు వచ్చు శబ్దములను ప్రయోగించుట ప్రశ్నించు శక్తి లేనివానికి అసంపూర్ణ వాక్యములను చెప్పుట, పాండిత్యము లేనివానికి అతడు భయపడునట్టి, లేదా వణకునట్టి (సిగ్గుతో) మాటలను చెప్పుట, కోప స్వభావము గలవానికి కోపము తెప్పించుట, భయస్తుని భయపెట్టుట, నియమములు తెలియనివానికి అవి తెలియచేయుట-ఈ ఉపాయములచే ప్రతివాదిని శీఘ్రముగా ఓడింపవలెను.

విగృహ్య సంభాషణమునందు యుక్తి యుక్తముగా వాదమును చేయవలెను. ప్రతివాది చేయు యుక్తి పూర్వక వాదమును గూడా నివారింపరాదు. విగృహ్య సంభాషణమనునది తీవ్రమైనది. అది కొందరికి అపకారము చేయును. కోపముగా నున్నవాడు చేయని పని లేదు (ఏదైననూ చేయును. ఎట్లైననూ మాట్లాడును). బుద్ధి కుశలత గలవారు సమితియందు కలహమును హర్షింపరు. వాదము ప్రారంభమైన పిదప అపజయముపాలు చేయు ఉపాయములను ప్రయోగింపవలెను.

**ఆయుర్వేద దీపిక :** సాద్గుణ్య దోష బలమనగా కనపడుచున్న గుణముల యొక్క మరియు దోషము యొక్కయూ బలము. శ్రేష్ఠుడుగా అనుకొన్నప్పుడు అనగా వాద విషయమున తనకంటె దిట్టగా నున్నాడని తలంచినప్పుడు. అట్టి సమయమున అతని వాదమును సభకు సంబంధించినది కాదని నివర్తింపవలెను. అవసరములేని విషయమున అట్లే వాద నివృత్తి చేయవలెను. అది ఎట్లన ఎవరును ఇది ఎరుంగరు. ఇక్కడ చెప్పలేరు అనవలెను. అచటనే అనగా జ్ఞానాది గుణముల యందు తనకంటె హీనముగా నున్నవానిని అచటనే ఓడింపవలెనని యర్థము. పెద్ద సూత్రములను పఠించుట వలన శాస్త్ర జ్ఞానమును అర్థము చేసికొనలేనివాడు ఆ సూత్ర పాఠమును తిరిగి వర్ణింపజాలడు. విజ్ఞాన హీనుడనగా విషయము తెలియనివాడు. నానార్థములను సూచించు అనగా అనేకార్థములను కలిగియున్న ఒకే విధమైన శబ్దములచేత, ప్రతిభాహీనుడు ఆ శబ్దము ఏ అభిప్రాయముతో అక్కడ చెప్పబడినదో గ్రహింపలేడు. వచన శక్తి హీనుడు సగమే చెప్పిన వాక్యమును పూరించి తెలిసికొనలేడు. పాండిత్యము లేనివాడు అనగా సభానుభవము లేనివాడు. సభను ఎన్నడును ప్రవేశించి యుండనివాడు లజ్జవలన వణుకుచు కొంచెము కూడా ప్రతిపాదించలేడు. వాదమునందు పై ఉపాయములను ప్రయోగింపవలెను.

25. ప్రాగేవ తావదిదం కర్తుం యతేత-సాధ్యాయపరిషదా, అయనభూతమాత్మనః ప్రకరణమాదేశయితవ్యం,యద్వా పరస్య భృశదుర్గం స్యాత్, పక్షమథవా పరస్య భృశం విముఖమానయేత్, పరిషది చోపసంహితాయామశక్యమస్మాభిర్వక్తుమ్,ఏషైవ పరిషద్యథేష్టం యథాయోగం యథాభిప్రాయం వాదం వాదమర్యాదాం చ స్థాపయిష్యతీత్యుక్త్వా తూష్ణీమాసీత్.

**తాత్పర్యము :** వాదమునకు ముందుగా చేయవలసిన పని—వాది ప్రతివాదులకు సంధానము చేయు వారిద్వారా ముందుగా తనకు క్షుణ్ణముగా తెలిసియున్న విషయమును వాద విషయముగా నుండునని ప్రతివాదికి తెలియజేయవలెను. లేదా ప్రతివాదికి కఠినముగా నుండు విషయమునైననూ లేదా అతనికి విముఖతను కలిగించు (ఇష్టములేని) విషయమునైననూ అదియే ఆనాటి వాద విషయముగా నుండునని తెలియజేయవలెను. ఇదంతయు పరిషత్తు కూడక ముందే చేయవలసిన పని. సభికులందరు ఆసీనులైన తరువాత ఇవి చేయుట కష్టము అందుచేత ప్రతివాదికి ఈ సభ మధ్యస్థమైనది. మన ఇష్టప్రకారము సౌకర్యమును, అభిప్రాయమును అనుసరించి వాద విషయమును వాద పద్ధతిని నెలకొల్పగలదు అని చెప్పి ఊరకయుండవలెను.

**ఆయుర్వేద దీపిక :** వాదము జరుగకముందుగా చేయవలసిన పనిని సూచించుచున్నాడు. అయన భూతమనగా అభ్యాసము వలన అలవాటయినది అభ్యసించినది. ఇతరులకు చాలా కష్టమైనది. అనగా ప్రతివాదికి ఆ విషయము తెలియనందువలన కోటవలె అగమ్యమైనది. దానిని ముందుగా సంధానకర్తద్వారా ప్రతివాదికి తెలియజేయవలెను. లేదా అనుట ద్వారా వేరు పక్షమును చెప్పుచున్నాడు. ఇతరుల యొక్క ప్రతివాది యొక్క పక్షము వాదమునకు విముఖతను చూపినపుడు తాను వాదమును ప్రవేశపెట్టవలెను. ఇందువలన పరలోకము లేదు. కర్మఫలము లేదు అని ప్రతివాది చెప్పినపుడు ఇది సహజముగా అతనికి విముఖతను కల్గించునదై ఆ పక్షమును సాధించుట కతడు చేయు ఆధారపూర్వక వాదమునే సభికులు గ్రహింతురు అని అర్థము. 'ఉపసంహితాయాం' అనగా సంధానకునకు చెప్పి ఊరక కూర్చుండవలెననుట యుక్తి. ఉపసంహితాయాం అనగా పరిషత్తులోనివారు పరోక్షముగ తమ యభిప్రాయముతో అన్నింటిని చేయుదురు. అదియే ప్రతివాదిని ఖండించుటకు సరిపోవును (ప్రతివాదికి సరిపోవని కఠినమైన విషయమును ప్రస్తావించినపుడతడే దానికి వ్యతిరేక ప్రతిపాదన చేసితీరును. ఆ ప్రతిపాదన కేవలము వాదము కొరకే చేయునదై యుండి దానియందు సత్యమేమాత్రము యుండదు. దానిని బలపరచుట కతడు వాదమును ప్రవర్తింపజేసినచో సభయే దానిని ఖండించునని భావము).

## వాద మర్యాదా లక్షణము

26. తత్రేదం వాదమర్యాదా లక్షణం భవతి. ఇదం వాచ్యమ్ ఇదమవాచ్యంఏవం సతి పరాజితో భవతీతి.

**తాత్పర్యము :** వాదమునకు ఈ కట్టుబాట్లున్నవి. ఇది మాట్లాడదగినది, యిది మాట్లాడకూడనిది. ఇట్లైనచో యితడు పరాజితుడు. ఇవి వాద మర్యాదా లక్షణములు.

**ఆయుర్వేద దీపిక :** వాద మర్యాద లక్షణములు చెప్పబడుచున్నవి. ఇచట వాద శబ్దము పక్ష, ప్రతిపక్షముల మధ్య జరుగు విగృహ్యమైన వచన ప్రతి వచనమే. సంధాయ సంభాషయందు జరుగు వాదము విషయ పరిజ్ఞానము కొరకు జరుగునది.

## వాదమార్గములు

27. ఇమాని తు ఖలు-పదాని భిషగ్భిః వాదమార్గజ్ఞానార్థమధిగమ్యానిభవన్తి. తద్యథా-వాదో-ద్రవ్యం-గుణాః; కర్మసామాన్యంవిశేషః:సమవాయః, పరీక్షా, స్థాపనాప్రతిష్ఠాపనా, హేతుః,దృష్టాన్తః,ఉపనయః, నిగమనమ్,ఉత్తరమ్,సిద్ధాన్తః, శబ్దః, ప్రత్యక్షమ్,అనుమానమ్, ఐతిహ్యమ్, ఔపమ్యం,సంశయః,ప్రయోజనం, సవ్యభిచారం, జిజ్ఞాసా, వ్యవసాయః, అర్థప్రాప్తిః, సంభవః, అనుయోజ్యం, అననుయోజ్యం, అనుయోగః,ప్రత్యనుయోగో, వాక్యదోషో, వాక్యప్రశంసా,చ్ఛలమ్, అహేతుఃఅతీతకాలమ్ఉపాలమ్భః,పరిహారః,ప్రతిజ్ఞాహానిః, అభ్యనుజ్ఞా,హేత్వన్తరమ్,అర్థాన్తరమ్, నిగ్రహ స్థానమితి.

**తాత్పర్యము :** ఈ చెప్పబోవు పదములు భిషగ్వాద పద్ధతిని తెలుసుకొనుటకు అధ్యయనము చేయవలసినవి అవి. వాదము, ద్రవ్యము, గుణములు, కర్మ, సామాన్యము, విశేషము, సమవాయము, ప్రతిజ్ఞా, స్థాపనా, ప్రతిష్ఠాపనా, హేతు, దృష్టాంతము, ఉపనయము, నిగమనము, ఉత్తరము, సిద్ధాంతము, శబ్దము, ప్రత్యక్షము, అనుమానము, ఐతిహ్యము, ఔపమ్యము, సంశయము, ప్రయోజనము. సవ్యభిచారము, జిజ్ఞాస, వ్యవసాయము, అర్థప్రాప్తి, సంభవము, అనుయోజ్యము. అననుయోజ్యము, అనుయోగము, ప్రత్యనుయోగము, వాక్య దోషము, వాక్య

ప్రశంసా, ఛలము, అహేతు, అతీత కాలము, ఉపాలమ్భము, పరిహారము, ప్రతిజ్ఞా హాని, అభ్యనుజ్ఞా, హేత్వంతరము, అర్థాంతరము, నిగ్రహ స్థానము- అనునవి.

ఆయుర్వేదదీపిక : ప్రస్తుతము వాద పద్ధతిని తెలుసుకొనుటకు వాదము నందు పేర్కొనదగిన ద్రవ్యము, గుణము మొదలైనవాటిని తెలియజేయుచున్నాడు. వైద్యుల వాద పద్ధతి- వైద్య వాదపద్ధతి. వాదము మొదలైనవి ముందు ముందు సూత్రములలో వివరించబడుచున్నందున ఇక్కడ వాటి వివరణ యివ్వబడుట లేదు.

## వాద లక్షణము

28. తత్ర వాదో నామ స యత్ పరస్పరేణ సహ శాస్త్రపూర్వకంవిగృహ్య కథ-యతిస వాదోద్వి విధఃసంగ్రహేణ-జల్పో-వితణ్డాచతత్రపక్షాశ్రితయోర్వచనం జల్పః, జల్పవిపర్యయో-వితణ్డా యథా ఏకస్య పక్షః "పునర్భవోఽస్తీతి", "నాస్తీత్యపరస్య."తౌహి చ తుభిః స్వస్వపక్షం స్థాపయతః పరపక్షముద్భావయతఃఏష జల్పఃజల్పవిపర్యమో-వితణ్డా నామ పరపక్షేదోషవచనమాత్రమేవ.

తాత్పర్యము : ఇతరులతో శాస్త్ర పూర్వకముగా విగృహ్య సంభాషణము చేయునది వాదము అనబడును. సంగ్రహముగా నిది రెండు విధములు. జల్పము మరియు వితండము. తన పక్షమును సమర్థించుకొను వాదము జల్పమనబడును. తద్వ్యతిరేకమైనది వితండ వాదము. ఉదాహరణకు ఒకరు పునర్భవము (పునర్జన్మ) ఉన్నదనియు, రెండవవారు పునర్జన్మ లేదనియు చెప్పి తమ తమ హేతువులచే తమ యొక్క సిద్ధాంతములను స్థాపించుకొందురు. పరపక్షము నందలి దోషములనెత్తి చూపుదురు. దీనికి వ్యతిరేకముగా స్వపక్షము స్థాపించుకొనక కేవలము పరపక్షము నందలి దోషముల నెత్తిచూపుట వితండ వాదమనబడును.

ఆయుర్వేద దీపిక : వాదలక్షణము - ఇక్కడ వాద శబ్దము-విగృహ్య సంభాషణము నందలి వాదమునే సూచించుచున్నది. తత్త్వజ్ఞానార్థము కొరకు చేయు వాదము సంధాయ సంభాషణము నందే చెప్పబడినది. శాస్త్ర పూర్వకమైన అనుటచే కలహ వాదమును నిషేధించుచున్నాడు. వాదమునందు యిది విగృహ్య సంభాషా రూపము కలిగియుండుటచేత ఛలము, జాతి, నిగ్రహస్థానములను ప్రతివాదిని జయించు కోరికతో ప్రయోగించుట జరుగును. పక్షమును ఆశ్రయించి అనగా తమ

పక్షమును స్థాపించి యని యర్థము. ఇందువలన వితండ వాదము నందును పరపక్ష దూషణమున్నది. కాని స్వమతమును స్థాపించుకొనుట, లేకపోవుటచే జల్ప వితండ ములు భిన్నములు. జల్పమునకు ఉదాహరణ ఏకస్య పక్ష....అను వాక్యము నందు యివ్వబడినది. పరపక్షము నందలి దోషములనెత్తి చూపుటయే అనుటచేత స్వపక్ష సాధనము వితండ వాదమున లేదని స్పష్టము చేయబడినది.

## ద్రవ్య-గుణ-కర్మ-సామాన్య-విశేష-సమవాయములు

29. ద్రవ్య-గుణ-కర్మ-సామాన్య-విశేష-సమవాయాః స్వలక్షణైః శ్లోకస్థానేపూర్వ ముక్తాః.

## ప్రతిజ్ఞ

30. అథ ప్రతిజ్ఞా - ప్రతిజ్ఞా నామ సాధ్యవచనం,యథా-నిత్యః పురుషః ఇతి.

**తాత్పర్యము :** ద్రవ్యగుణ కర్మ సామాన్య విశేష సముదాయములను వాటి లక్షణములను సూత్ర స్థానము నందు పూర్వము చెప్పబడినది.

ప్రతిజ్ఞ యనగా సాధింపవలసిన వచనము. ఉదా : పురుషుడు నిత్యుడు.

## స్థాపన

31. అథ స్థాపనా-స్థాపనానామ తస్యా ఏవ ప్రతిజ్ఞాయా హేతుదృష్టాన్తో-పనయనిగమనైః స్థాపనా.పూర్వం హి ప్రతిజ్ఞా పశ్చాత్స్థాపనా,కిం హ్య ప్రతిజ్ఞాతంస్థాపయిష్యతి: తథా నిత్యః పురుష ఇతి ప్రతిజ్ఞా,హేతుః అకృత త్వాదితి. దృష్టాన్తః- యథాఽఽకాశమితి తచ్చ నిత్యమ్, ఉపనయఃయథా చాకృతక మాకాశంతథా పురుషః, నిగమనమ్ తస్మాన్నిత్య ఇతి.

**తాత్పర్యము :** స్థాపనమనగా ప్రతిజ్ఞనే, హేతు-దృష్టాంత-ఉపనయ - నిగమముల చేత స్థాపించుట. మొదటనే ప్రతిజ్ఞ చేసి ఆ పైన దానిని స్థాపించుట జరుగును. ప్రతిజ్ఞచేయక స్థాపించుటకేమి యుండును ? ఏమీ ఉండదు. ఉదాహరణకు, పురుషుడు నిత్యుడు అనునది ప్రతిజ్ఞ. హేతువు— దేని వలననూ కల్పింపబడ నందువలన-దృష్టాంతము-ఆకాశమువలె. ఉపనయనము - ఆకాశమునూ దేనివలన కల్పింపబడలేదు. అది నిత్యమే అయివున్నది. అటులనే పురుషుడును నిగమనము-

అందుచేత పురుషుడు నిత్యుడు. ఇటుల-పురుషుడు నిత్యుడు అను ప్రతిజ్ఞను హేత్వాదులచే స్థాపించుటయే స్థాపన.

**ఆయుర్వేద దీపిక :** ఇదివరకే సిద్ధమైన విషయమును యితరులకు తెలియజెప్పుటకై సాధించునది స్థాపనము (స్థాపయతి సిద్ధమర్థం పరం-ప్రతి సాధయతీతి స్థాపనా). అది ఇతరులకు చెప్పుటకై హేత్వాది నాలుగు మార్గముల ద్వారా సాధింపబడును. ప్రతిజ్ఞమును ఇతరుని విషయమున స్థాపనయగును. ఏలయన పంచావయవా (పరార్థా)ను మానము అగును. ప్రతిజ్ఞా శబ్దము యిచట స్థాపనము. గూర్చి వివరణయందు చెప్పబడకుండుటకు కారణము అది స్థాపింపబడుట యను ధర్మముచేతనే లభించుటయే.

## ప్రతిష్ఠాపన

32. అథప్రతిష్ఠాపనా-ప్రతిష్ఠాపనా నామ యా తస్యా ఏవ పరప్రతిజ్ఞాయాః విపరీతార్థస్థాపనా,యథా-అనిత్యః పురుషః ఇతిప్రతిజ్ఞా;హేతుః-ఇన్ద్రియకత్వాత్ ఇతి,దృష్టాన్తం-యథాఘటః ఇతి,ఉపనయః-యథా ఘటః ఇన్ద్రియకః స చానిత్యః తథా పురుషః,నిగమనమ్-తస్మాదనిత్య ఇతి.

**తాత్పర్యము :** ప్రతిష్ఠాపన - ప్రతిష్ఠాపన యనగా పరుడు (ఇతరుడు) చేసిన ప్రతిజ్ఞకు వ్యతిరేకార్థమును స్థాపించుట, ఉదాహరణ-పురుషుడు అనిత్యుడు అని ప్రతిజ్ఞ చేయుట దానికి హేతువుగా ఇన్ద్రియ గోచరమగుట వలన అని చెప్పుట, దృష్టాంతమున ఘటమువలె అని చెప్పుట, ఉపనయము ఘటమెట్లు ఇంద్రియ గోచరమై అనిత్యమయి యున్నదో అట్లే పురుషుడును నిగమనము కావున పురుషుడు అనిత్యుడు. ఈ విధముగా పరుడు చేసిన ప్రతిజ్ఞకు వ్యతిరేక ప్రతిజ్ఞను చేసి దానిని హేత్వాదులచే స్థాపించుట ప్రతిష్ఠాపన మనబడును.

**ఆయుర్వేద దీపిక :** మొదట యిచ్చిన ప్రతిష్ఠాపన శబ్దము ప్రసంగ వశమున నిచ్చినది. రెండవసారి దాని లక్షణములను విశదీకరించు సమయమునసూ ఇవ్వబడినది. స్థాపన విషయమునసూ యిట్లే గ్రహింపవలెను. ఇది పునరుక్తమను కొనరాదు. "ప్రతిష్ఠాపనా"యను పదమునందలి 'ప్రతి' అను శబ్దమును వ్యతిరేకార్థ స్థాపనయని వ్యాఖ్యానించినాడు. 'ప్రతి' యనగా వ్యతిరేకార్థమని యర్థము. ఈ ప్రతిష్ఠాపనము అనునది అన్వీక్షికుల (నైయాయికుల) ప్రకరణ సమమను హేత్వాభాస.

## హేతువు

33. అథ హేతుః - హేతుర్నామోపలబ్ధికారణమ్, తత్ప్రత్యక్షమనుమానమైతిహ్య-మౌపమ్యమితి, ఏభిర్హేతుభిర్యదుపలభ్యతే తత్తత్త్వమ్.

**తాత్పర్యము :** హేతువు - హేతువు అనగా ఉపలబ్ధి (జ్ఞానోపలబ్ధి) కారణము. అది ప్రత్యక్షము, అనుమానము, ఐతిహ్యము, ఉపమానము అని నాల్గు విధములు. ఈ హేతువుల వలన ఏది లభించునో అది తత్త్వమనబడును.

**చక్రపాణి :** లింగము హేతువులకు అవినాభావ సంబంధమున్నప్పటికీ లింగము (లక్షణము)ను తెలుసుకొనుటకు ప్రత్యక్షాది ప్రమాణములే పై చెప్పిన హేతు మూలములగుట వలన ఇవి హేతువులుగా పేర్కొనబడినవని గ్రహింపవలెను. లేని యెడల తిరిగి ప్రత్యక్షాదులను పేర్కొనుట పునరుక్తమగును. ఉపలబ్ధి కారణము - వ్యాపకమును, సాధ్యమును సాధించుటకు కారణము తత్త్వమనగా ఆ లక్షణము.

## దృష్టాంతము

34. అథ దృష్టాన్తః-దృష్టాన్తో నామ యత్ర మూర్ఖవిదుషాం బుద్ధిసామ్యమ్ యో వర్ణ్యం వర్ణయతి, యథా-అగ్నిరుష్ణో, ద్రవముదకం, స్థిరా పృథ్వీ, ఆదిత్యః ప్రకాశక ఇతి. యథా-ఆదిత్యః ప్రకాశకస్తథా సాంఖ్యజ్ఞానం ప్రకాశకమితి.

**తాత్పర్యము :** దృష్టాంతము - దృష్టాంతమనగా మూర్ఖులు విద్వాంసుల బుద్ధికి సరిపడునట్లు చెప్పబడిన ఉదాహరణము. ఉదా : అగ్ని ఉష్ణత్వమును కలిగియున్నది. ద్రవత్వము ఉదకమందున్నది. పృథ్వి స్థిరమైనది. సూర్యుడు ప్రకాశించువాడు మొదలైనవి. సూర్యుడే విధముగా ప్రకాశమును కలుగజేయునో అట్లే సాంఖ్యజ్ఞానము (అంధకారమును పోగొట్టి) ప్రకాశమును (జ్ఞానమును) కలుగజేయును అని చెప్పుట.

**ఆయుర్వేద దీపిక :** మూర్ఖులు విద్వాంసుల బుద్ధికి తగినట్లు అనగా సామాన్య జనులు పండితులు వీరిరుపురకును వివాదము లేకుండగ నంగీకార యోగ్యముగనుండు విషయము దృష్టాంతమగును. ఇది కేవలము పండితులకు

మాత్రమే వర్తింపనిది. లోకప్రసిద్ధమైన విషయమును చెప్పినను అది ప్రతిపాద్య పురుషునకు (విషయమును తెలిసికొనగోరు పురుషునకు) అవగాహము కానంతవరకు దానిని దృష్టాంతము అనజాలము అని భావము. వారి బుద్ధికి సరిపడునట్లుండుటచేత మాత్రమే దానియందు సాధ్యముతో సమాన ధర్మములుండుట వలన అది దృష్టాంత మగునని ఏ సాధ్యమును సాధించునో అనుట ద్వారా చెప్పుచున్నాడు. ప్రసిద్ధ సాధ్యముచే సాధనము సంబంధము కలిగియుండుట వలన దృష్టాంతము సాధ్యమును సాధింపనగును. అగ్ని మొదలగునవి లోక ప్రసిద్ధములగుటచేత ఇచ్చట ఉదాహరణముగా చెప్పబడినవి. అందువలన ఆదిత్యునివలె అను ఉదాహరణము మాదిరిగా మిగతా రెండేసి వస్తువులలో ఇది దీనివలె (ఉష్ణము అగ్నివలె, ద్రవము ఉదకమువలె, స్థిరత్వము పృథివివలె) అని చూపుచున్నాడు.

## ఉపనయ - నిగమనములు

35. ఉపనయో నిగమనం చోక్తం స్థాపనా ప్రతిష్ఠాపనా వ్యాఖ్యాయామ్.

## ఉత్తరము

36. అథ ఉత్తరమ్-ఉత్తరం నామ సాధర్మ్యోపదిష్టే హేతౌ వైధర్మ్యవచనం వైధర్మ్యోపదిష్టే వా సాధర్మ్యవచనం, యథా-హేతుసధర్మాణో వికారాః, శీతకస్య హి వ్యాధేర్హేతుభిః సాధర్మ్యం,హిమశిశిరవాతసంస్పర్శాః యితి బ్రువతః పరో బ్రూయాత్ హేతువిధర్మాణో వికారాః యథా శరీరవయవానాం దాహౌష్ణ్యకోథప్రపచనే హేతువైధర్మ్యం హిమశిశిరవాతసంస్పర్శా యితి. ఏతత్సవిపర్యయముత్తరమ్.

**తాత్పర్యము :** ఉపనయ నిగమనములను స్థాపనా ప్రతిష్ఠాపనముల వ్యాఖ్యయందు చెప్పుట జరిగినది.

ఉత్తరము - ఉత్తరమనగా కార్యమందు హేతు సాధర్మ్యమును చెప్పినపుడు దానియందే వైధర్మ్యమును చూపుట లేదా వైధర్మ్యమును చెప్పినపుడు సాధర్మ్యమును చూపి దానిని ఖండించుట. ఉదా : రోగములు హేతు ధర్మములను కలిగి యుండును. శీలలత్వమును కలిగించు వ్యాధులకును వాని కారణములైన మంచు, చలిగాలికిని సాధర్మ్యము కలదని యొకరు చెప్పగా మరియొకరు దానిని వ్యాధులు హేతు

ధర్మములను కలిగియుండవు. శరీరమునందు దాహ ఉష్ణ క్రోథ పాచనములు, జరుగు నపుడు మంచు, చలిగాలి యను హేతువులకు అవి విపరీత ధర్మములను కలిగి యుండునని చెప్పి ఖండించుట. ఇది వ్యతిరేక ఉత్తరము అనబడును.

ఆయుర్వేద దీపిక : ఉత్తర శబ్దము చేత నిచట జాత్యుత్తరము యొక్క అభ్యాసము కల్గినది. దీనివలన సాధకముకాని సాధర్మ్యమును ఖండించుటయే ఉత్తర మని బోధపడనున్నది. న్యాయ దర్శనమున సమాన, విశేష (సాధర్మ్య వైధర్మ్య) ధర్మముల ద్వారా వాదిచే స్థాపింపబడిన సాధ్యత్వమును ఖండించుట జాతి యనబడు నని చెప్పబడినది. (సాధర్మ్యవైధర్మ్యాభ్యాం ప్రత్యవ స్థానం జాతిః - న్యాయ - దర్శనము-1/2/18) ఇది సాధర్మ్య వైధర్మ్యమునకు ఉదాహరణము. హేతు-సధర్మాణములనగా హేతు సదృశములు. శీతక-అనగా శీతము (చలి). మంచు చల్లనిగాలి యందలి స్పర్శచేత. శీతమునకు దాని కారణములతో (మంచు, చలి, గాలితో) సమాన ధర్మము కలిగియుండుట యొక వాదము. అందుచేత మంచు మొదలైన హేతువులందుగల శీతస్పర్శ శీతకము నందుగూడ ఉండుటచేత యిచట హేతు-వ్యాధులకు సాధర్మ్యము కలదని చూపబడినది. ఇతరుడు చెప్పవలెను- అనగా ప్రతివాది చెప్పవలెను. దాహౌష్ణ్యక్రోథ ప్రపచనేయనుచోట వికారే అను శబ్దము అన్వయించు కొనవలెను. హేతువైధర్మ్యమనగా హేతువైసాదృశ్యము. హిమాది సంస్పర్శలు అనగా మంచు మొదలగువాని వలన కలిగిన సంస్పర్శలు. శరీరావ యవములందు కలుగు దాహరోగము నందున్న ఉష్ణమునకు సదృశమైనవి (సమాన మైనవి) కావు అని వాక్యార్థము. ఈ విధముగా వైధర్మ్యమునకు చెప్పబడిన హేతువు నందలి వ్యతిరేకత చేత హేతు సామ్యము అనుటచే అది విపర్యయ మగును. ఇట్లు రెండు ఉదాహరణలను సవిపర్యముగా చూసినపుడే యిది ఉత్తమ మగునని యర్థము.

## సిద్ధాంతము

37. అథ సిద్ధాన్తః-సిద్ధాన్తో నామ యః పరీక్షకైర్బహువిధం పరీక్ష్య హేతుభిశ్చ సాధయిత్వా స్థాప్యతే నిర్ణయః,స సిద్ధాన్తః;,స చతుర్విధః సర్వతన్త్రసిద్ధాంతః ప్రతితన్త్రసిద్ధాన్తః అధికరణసిద్ధాన్తః అభ్యుపగమ సిద్ధాన్తశ్చేతి. తత్ర సర్వతన్త్రసిద్ధాన్తో నామ తాస్మింస్తాస్మిన్ సర్వాస్మిన్తంత్రే తత్తత్ ప్రసిద్ధమ్; యథా-సన్తి నిదానాని, సన్తి వ్యాధయః, సన్తి సిధ్యుపాయాః సాధ్యానామితి;

ప్రతితన్త్రసిద్ధాన్తో నామ-తస్మింస్తస్మిన్ తన్త్రే ఏకైకస్మిన్ తన్త్రప్రసిద్ధమ్: యథా-అన్యత్రాష్టౌ రసాః షడత్ర, పంచేంద్రియాణి యథాత్ర, అన్యత్ర షడింద్రియాణి,వాతాదికృతాఃసర్వేవికారాః యథాఽన్యత్ర అత్ర వాతాదికృతా భూతకృతాశ్చ ప్రసిద్ధాః, అధికరణసిద్ధాన్తో నామ-స యస్మిన్నధికరణే ప్రస్తూయమానే సిద్ధాన్యాన్యానపి అధికరణాని భవన్తి, యథా న ముక్తః కర్మానుబంధకం కురుతే నిస్పృహత్వాదితిప్రస్తుతే-సిద్ధాః కర్మఫలమోక్షపురుష ప్రేత్యభావా భవన్తి. అభ్యుపగమ సిద్ధాన్తో నామ సః యమర్థమసిద్ధమపరీక్షిత మనుపదిష్టమహేతుకం వా వాదకాలేనాభ్యుపగచ్ఛన్తి భిషజఃతద్యథా- ద్రవ్యం ప్రధానమితి కృత్వా వక్ష్యామః యిత్యేవమాదిః ఇతి చతుర్విధః సిద్ధాన్తః.

**తాత్పర్యము :** సిద్ధాంతము-సిద్ధాంతమనగా పరీక్షకులచే అనేక విధములుగా పరీక్షింపబడి హేతువులచేతను సాధింపచేసి స్థాపింపబడు నిర్ణయము. ఇదియే; సిద్ధాంతము. ఇది సర్వతన్త్రి సిద్ధాంతము-ప్రతితంత్ర సిద్ధాంతము- అధికరణ సిద్ధాంతము-అభ్యుపగమ సిద్ధాంతము-అని నాల్గు విధములు.

సర్వతంత్ర సిద్ధాంతమనగా ఆయా విషయమునకు సంబంధించిన అన్ని తంత్రములందును ప్రసిద్ధమైనది ఉదా : నిదానములున్నవి. సాధ్యరోగములను చికిత్సించు నుపాయములున్నవి- ఆః ) సిద్ధాంతములు.

ప్రతితంత్ర సిద్ధాంతమనగా ఒకే విషయమునకు సంబంధించిన ఆయా తంత్రములందు ఒకే తంత్రమున ప్రసిద్ధమైనది. ఉదా : ఇతర గ్రంథములలో ఎనిమిది రసములున్నవని చెప్పబడినది. ఇక్కడ రసము లారు అని చెప్పబడినది. ఇచట ఇన్ద్రియములైదు. వేరొక తంత్రమున ఇంద్రియములారు. అన్ని వికారములు వాతాది దోషముల వలన కల్గునని యితర చోట్ల చెప్పబడినది. ఇచట వాతాదులు మరియు భూతములును రోగ కారణములుగా పేర్కొనబడినవి.

అధికరణ సిద్ధాంతమనగా- ఒకానొక అధికరణమునందు సిద్ధించినది వేరొక అధికరణమునకు కూడా వర్తించునట్లుండుట. ఉదా : ముక్తులు (కర్మలను విడచిన వారు) సుఖ దుఃఖములకు అనుబంధము చేయు (కలిగించు) కర్మలను నిష్కామము ఫలన చేయరు. అని ప్రస్తావించినపుడు కర్మఫలములున్నవి, మోక్షము ఉన్నది, పురుషున్నాడు, పరలోకాంతము పునర్జన్మ ఉన్నది అను విషయములు సిద్ధించుట.

అభ్యుపగమ సిద్ధాంతమనగా-పూర్తిగా పరీక్ష చేయనిది. సిద్ధించియుండనిది. ఉపదేశింపబడినది, హేతుయుక్తము కానిదియును, ఇది వైద్యులచే వాదకాలమందు ప్రయోగింపబడినది. ఉదా : ద్రవ్యము ప్రధానముగా చెప్పెదము. గుణము ప్రధానముగా చెప్పెదము. కర్మప్రధానముగాచెప్పెదము. ఈ మొదలైనవి.ఇట్లు సిద్ధాంతము నాలుగు విధములు.

**ఆయుర్వేద దీపిక :** సాధ్యసాధనోదహరణము చేత అనేక విధములుగా పరీక్షింపబడిన హేతువులచే సాధించి స్థాపించుట నిర్ణయము. 'నిర్ణీయతే యితి నిర్ణయమ్'. (నిశ్చయమైన జ్ఞానము నిర్ణయమనబడును). ఈ సిద్ధాంత లక్షణము అభ్యుపగమ సిద్ధాంతమునలేదు. కాబట్టి యిచట సిద్ధాంతత్వము బుద్ధ వ్యవస్థ వలననూ కలుగునని చెప్పబడినది. సిద్ధాంతమును నాల్గు విధములుగా విభజించడమైనది. ప్రతితంత్ర సిద్ధాంతమునందు రసములు ఆరు, రసములు ఎనిమిది అనునది పరస్పర విరుద్ధమైననూ వాదమున స్వయుక్తి వ్యవస్థాపనా బలము వలన సిద్ధాంతత్వము ఇచట సరిపోవునని తెలియువలెను. యస్మిన్....అనుట అధికరణమును ప్రాధాన్యముగా పేర్కొనుట. ఇతరములైనవి కూడా అనగా సాక్షాత్తూ పేర్కొననివి కూడా. అనుబంధకమనగా - పెనవేయునది. ఇతర జన్మకు కూడా సంభవించునది యని యర్థము. ముక్తుడనగా ముక్తిని పొందినవాడు. ముక్తుడెప్పుడునూ అశరీరి యగుట చేత కర్మను చేయడు. లేదా విశేషించి అతడు కర్మలను చేయడని భావము. మోక్షము లేనియెడల ముక్తుడను మాటయే లేదు. అట్లే పురుషుడు లేనిచో బంధమెవరికి ? ఎవరికి మోక్షము ? పునర్జన్మ లేని యెడల కర్మలకు జన్మాంతరానుబంధము ఉండదు. ముక్తుడు అనుబంధమును కలిగించు కర్మలను చేయడు అని చెప్పి సమయమున అధికరణ బలము చేతనే సిద్ధించిన కర్మ ఫలాదులు సిద్ధాంతములుగా స్వీకరింపబడినవి. అభ్యుగమ సిద్ధాంతమును అసిద్ధము -అనుటద్వారా వివరించడమైనది. ఇది పరీక్ష చేయనిది.

## శబ్దము

38. అథ శబ్దః - శబ్దో నామ వర్ణసమామ్నాయః స చతుర్విధః,దృష్టార్థశ్చ, అదృష్టార్థశ్చ, సత్యశ్చ, అనృతశ్చేతి. తత్ర దృష్టార్థో నామ-త్రిభిర్హేతుభిర్దోషాఃప్రకుప్యన్తి, షడ్భిరుపక్రమైశ్చ ప్రశామ్యన్తి;సతి శ్రోత్రాది సద్భావే శబ్దాది - గ్రహణమితి;అదృష్టార్థః పునః అస్తి ప్రేత్యభావోఽస్తి మోక్ష ఇతి. సత్యో నామ యథార్థభూతః, సన్త్యాయుర్వేదోపదేశః సన్తి సిద్ధ్యుపాయాః సాధ్యానామ్ వ్యాధీనామ్ సన్త్యారమ్భఫలానీతి; సత్యవిపర్యయశ్చానృతః.

**తాత్పర్యము :** శబ్దము - శబ్దమనగా అక్షరముల సమూహము. ఇది నాల్గు విధములు. దృష్టార్థము, అదృష్టార్థము, సత్యము, అనృతము అనునవి. అందు దృష్టార్థమనగా మూడు కారణములచే దోషము ప్రకోపించును. (అసాత్మ్యేంద్రియార్థ సంయోగము. ప్రజ్ఞాపరాధము మరియు పరిణామములచే దోషప్రకోపము) ఆరు ప్రక్రియలచే (లంఘన బృంహణ స్నేహన రూక్షణ స్వేదన స్తంభనలచే) ప్రశమించును. శ్రోత్రాదీంద్రియములున్నప్పుడు శబ్దాది అర్థములను గ్రహించుట యుండును. అదృష్టార్థము-పునర్జన్మ కలదు. మోక్షము కలదు అనుట. సత్యము అనగా యథార్థము - ఆయుర్వేదోపదేశములు వున్నవి. సాధ్య వ్యాధులను చికిత్సించు నుపాయములున్నవి. కార్యమునకు ఫలములున్నవి అనునవి సత్యములు. అనృత మనగా సత్యమునకు వ్యతిరేకమైనది. (ఆయుర్వేదోపదేశములు లేవు - సాధ్య వ్యాధులకు చికిత్సోపాయములు లేవు. కార్యమునకు ఫలముండదు అనునవి)

**ఆయుర్వేద దీపిక :** శబ్దమను శబ్దము చేత ఇచట సంకేత బలముచేత అర్థమును తెలియజేయు వర్ణముగా గుర్తించదగినది. ఆప్తోపదేశరూపశబ్దము పరమాప్తుడైన బ్రహ్మాది ప్రణీతము. లౌకికాప్త ప్రణీతము అని రెండు విధములు. ఐతిహ్య శబ్దము వలన పరమాప్త ప్రణీతత్వము లెక్కించబడును. లౌకికాప్త ప్రణీతమును శబ్దము యొక్క ఒకానొక రూపమగును. దీనియందలి ప్రకారములు ఐతిహ్యమున గుర్తింపబడలేదు అని తెలియవలెను. వర్ణ సమామ్నాయమనగా వర్ణముల కలయిక అని యర్థము. ఒకే స్థాయిగల వర్ణములకు కలయిక లేనప్పటికీ ఒక అర్థమును కలిగించునవి లేదా పూర్వానుభవము వలన కలిగిన సంస్కారముతో కూడిన అంత్య వర్ణముల అనుభవ ఆరోహముచేత మేలకత్వము సిద్ధించునని యర్థము. దృష్టార్థమనగా యితర ప్రమాణముల వలన సాధింపబడగలిగిన విషయము. మూడు కారణములచేత అనగా ప్రజ్ఞాపరాధము, పరిణామము, అసాత్మ్యేంద్రి యార్థ సంయోగము అను మూడు కారణములచేత: షగుపక్రమములు లంఘన బృంహణీ యాధ్యాయములో చెప్పబడిన లంఘన, బృంహణ, స్నేహన, రూక్షణ, స్వేదన, స్తంభనములు. ఈ వాక్యముల అర్థమును ప్రత్యక్షముగా చూడబడుటచేత దృష్టార్థము లని ఇవి పిలువబడును. సత్యవ్యతిరేకమనగా సత్యమునందు చెప్పిన దానికి వ్యతిరేకము. ఉదా : ఆయుర్వేదోపదేశములు లేవు - ఇత్యాదులు.

## ప్రత్యక్షము

39. అథ ప్రత్యక్షం - ప్రత్యక్షం నామ తద్యదాత్మనా చేంద్రియైశ్చ స్వయముపలభ్యతే తత్రాత్మప్రత్యక్షాః సుఖదుఃఖేచ్ఛాద్వేషాదయః శబ్దాదయ స్త్వింద్రియప్రత్యక్షాః

**తాత్పర్యము :** ప్రత్యక్షము-ప్రత్యక్షమనగా ఆత్మచేత మరియు పంచేంద్రియముల చేతనూ స్వయముగా అనుభవింపబడునది. సుఖదుఃఖ ఇచ్ఛా ద్వేషాదులు ఆత్మ ప్రత్యక్షములు. శబ్దాదులు ఇంద్రియ ప్రత్యక్షములు.

**ఆయుర్వేద దీపిక :** ఆత్మచేత అనగా మనస్సుచేత, అందుచే సుఖాదులు మానస ప్రత్యక్షములని బోధపడును. ఇంద్రియముల చేతనూ అనుటవలన బాహ్య ప్రత్యక్షమును గ్రహింపవలెను. స్వయముగా లభించును అనగా సాక్షాత్తూ అనుభవింపబడును. అనుమానమునూ యిన్ద్రియ వ్యాపారమై యున్నప్పటికీ సాక్షాత్కారత్వము లేకపోవుటచే ప్రత్యక్షము కాదు అని చెప్పుటకు ఈ పదము - స్వయముపలబ్ధి ప్రయోగింపబడినది.

## అనుమానము

40. అథానుమానమ్- అనుమానం నామ తర్కో యుక్త్యపేక్షః, యథోక్తం అగ్నిం జరణశక్త్యా,బలం వ్యాయమశక్త్యా,శ్రోత్రాదీని శబ్దాదిగ్రహణేనేత్యేవమాది.

41. అథైతిహ్యమ్ - ఐతిహ్యం నామ ఆప్తోపదేశో వేదాదిః.

**తాత్పర్యము :** అనుమానము-అనుమానమనగా యుక్తినపేక్షించి యున్న (యుక్తిపై నాధారపడియున్న) తర్కము. ఉదాహరణకు అగ్నిని పాచనశక్తి ద్వారా, బలమును వ్యాయామ శక్తి ద్వారా, శ్రోత్రాదీంద్రియముల శక్తిని శబ్దాదులను గ్రహించుట చేతను తెలిసికొనుట మొదలైనవి.

ఐతిహ్యమనగా ఆప్తోపదేశము-వేదాదులు ఆప్తోపదేశములు.

**ఆయుర్వేద దీపిక :** యుక్త్యపేక్ష తర్కము అనుమాన లక్షణము. త్రివిధరోగ విజ్ఞాన విమానాధ్యాయమునందే అనుమానము విపులీకరింపబడినది.

జీర్ణశక్తి ద్వారా అగ్నిని, ఈ మొదలైనవి అనుమానమునకుదాహరణములు. ఐతిహ్యము అలౌకిక ఆప్తోపదేశము అని చెప్పుటకు వేదాదులను ఉదాహరణముగా చెప్పుచున్నాడు.

## ఔపమ్యము (ఉపమానము)

42. అథౌపమ్యమ్-ఔపమ్యం నామ యదన్యేనాన్యస్య సాదృశ్యమధికృత్య ప్రకాశనమ్,యథా-దణ్డేన దణ్డకస్య ధనుషా ధనుస్తమ్భస్య యిష్వాసేనాఽఽరోగదస్యేతి.

**తాత్పర్యము :** ఔపమ్యము-ఔపమ్యమనగా ఒక వస్తువునందలి గుణమునకు సమానమైన గుణము వేరొక వస్తువు నందున్నపుడు ఆ రెంటిని గుణ సాదృశ్యముచేత పోల్చి చెప్పుట. ఉదా : దండమును చూపి దండకవాత పీడితుడిట్లుండును. ధనుస్సును చూపి ధనుర్వాతగ్రస్తుడిట్లుండును. మంచి విలుకానిని చూపి మంచి వైద్యుడు యితనివలె లక్ష్యము సాధించును మొదలగు విధముగా పోల్చుట.

**ఆయుర్వేద దీపిక :** ఒకదానితో నింకొకటి అనగా ఒకదానితో - ప్రసిద్ధమైనదానితో ఇంకొకటి - అప్రసిద్ధమైనదానిని సాదృశ్యము నాధారముగా జేసికొని అనగా ప్రతిపాదించవలసిన సంజ్ఞా సంజ్ఞి సంబంధమును సకారణముగా ఆధారము జేసికొని; భట్టనయ విధానమున ఉపమానమును వ్యాఖ్యానించవలసి వచ్చినపుడు సాదృశ్యమును ప్రతిపాదనగా ఆధారము చేసికొని వ్యాఖ్యానించవలెను. ఇచట ప్రతిపత్తి ఉపమానము కొరకున్నది. న్యాయమునందును సంజ్ఞా సంజ్ఞి సంబంధ ప్రతీతి యనునదీ ఉపమాన ఫలము అని ప్రథమ వ్యాఖ్యానమునందు చెప్పబడినది. ప్రసిద్ధ వస్తు సాధర్మ్యము వలన సాధ్యమును సాధించుట యుపమానము. (ప్రసిద్ధ సాధర్మ్యాత్ సాధ్యవచనముపమానమ్-న్యాయ దర్శనము-1/1/6) దండముతో దండకముయొక్క అనగా ప్రసిద్ధమైన దండముతో అప్రసిద్ధమైన దండకవాత రోగియొక్క సాధర్మ్యమును ఆప్తుని వలన విని, కుమ్మరివాని దండమువలె నున్న రోగిని చూచినపుడు యిది దండక వికారమని నిశ్చయింపవలెను. లేదా భట్టనయము ద్వారా (పండితుని ద్వారా) ప్రసిద్ధమైన దండము నందలి గుణమునకు అప్రసిద్ధమైన దండకము అను రోగమునందలి గుణమునకు సాధర్మ్యముండుటచే ఆ సంబంధమును బట్టి పోల్చి తెలుసుకొనవలెను. ఇట్లే ఇతర ఉదాహరణమునందునూ అన్వయించుకొనవలెను. ఇష్వాసేన-అనగా బాణము వదులువానితో, ఎట్లు బాణమును వదులు

వాడు (విలుకాడు) అతి దూరములో లేని లక్ష్యమును తప్పడో (తప్పక బాణముతో కొట్టునో) అట్లే ఆరోగ్యము నిచ్చు వైద్యుడు తన వైద్య గుణము (గుణమనగా బాణమనియు అర్థము)తో రోగిని సాధించును (చికిత్సించును).

## సంశయము

43. అథ సంశయః-సంశయో నామ సందేహలక్షణానుసంధిగ్ధేష్వర్థేషు అనిశ్చయః. యథా-దృష్టా హ్యాయు లక్షణై రుపేతాశ్చానుపేతాశ్చ తథా సక్రియాశ్చాఽక్రియాశ్చాః పురుషాః.శీఘ్రభఙ్గాశ్చిరజీవినశ్చ ఏతదుభయదృష్టత్వాత్ సంశయః-కిమస్తి ఖల్వకాలమృత్యురుతనాస్తీతి.

**తాత్పర్యము :** సంశయము - సంశయమనగా సందేహ లక్షణముతో కూడిన సందిగ్ధ వస్తువులయందు కలుగు అనిశ్చిత జ్ఞానము. ఉదా : ఆయుష్మంతుని లక్షణములు కలిగియుండి చికిత్స పొంది, ఇంత చేసియూ శీఘ్రముగా మరణించు వానిని ఏమియునూ చేయక, ఎక్కువ కాలము జీవించిన వానిని చూచి అసలు అకాల మృత్యువు ఉన్నదా లేదా యను సందేహము కలుగుట.

**ఆయుర్వేద దీపిక :** సందేహ లక్షణముతో కూడిన సందిగ్ధ వస్తువనుట వలన సందేహింపవలసిన విషయమును చూపుచున్నాడు. దీనివలననూ న్యాయ దర్శనోక్తమైన సాధారణ అసాధారణ విషయములు ఒకే వస్తువు నందుండుట వలన అది యా వస్తువా లేక మరియొకటియా యను సందేహము కల్గుట (సమానానేక ధర్మోపపత్తే-న్యాయ దర్శనము - 1-1-23) అను వచనము వలనూ సంశయము యొక్క విషయమును తెలియజేయుచున్నాడు. అనిశ్చయము సంశయము యొక్క లక్షణమని తెలియవలెను. అనిశ్చయమనగా పాక్షికముగా విరుద్ధ ధర్మములును, ఒక వస్తువు నందుండుటవలన కలుగు జ్ఞానము. ఉదాహరణ : 'అది స్థాణువా లేక పురుషుడా' అనుట సంశయోత్పత్తికి గల కారణములను "దృష్ట్వా హి" అను వాక్యమున వివరించుచున్నాడు. ఆయుష్మంతుల లక్షణము కలిగి, చికిత్స పొందక మరణించుట మరియు చికిత్స పొంది ఎక్కువ కాలము జీవించుటలను చూచి అకాలమృత్యువు పున్నదను జ్ఞానము, దీనికి వ్యతిరేక స్థితిని చూచి (ఆయుష్మంతుల లక్షణము లేక చికిత్స పొంది చిరకాలము జీవించువారిని, చికిత్స పొందక శీఘ్రముగా మరణించు వారిని చూచి) అకాల మృత్యువు లేదు అను జ్ఞానము.

## ప్రయోజనము

44. అథ ప్రయోజనమ్-ప్రయోజనం నామ యదర్థమారభ్యన్త ఆరమ్భాః, యథా-యద్యకాలమృత్యురస్తి తతోఽహమాత్మానమాయుష్యైరుపచరిష్యామి అనాయుష్యాణి చ పరిహరిష్యామి కథంమామకాలమృత్యుః ప్రసహేతేతి.

**తాత్పర్యము :** ప్రయోజనము - ప్రయోజనమనగా ఏ ఫలము నాశించి కార్యములు ఆరంభింపబడునో అట్టి ఫలము. ఉదా : అకాల మృత్యువు పున్న యెడల నేను ఆయుష్షును వృద్ధి పొందించువానిని సేవించుచున్నాను. ఆయుఃక్షయమును కల్గించు భావములను వదలి వేయుచున్నాను. అయిన అకాల మృత్యువు నన్నెట్లు చంపును ? (అకాల మృత్యువు వాత పడకుండుట ఇచట ప్రయోజనమై యున్నది.)

**ఆయుర్వేద దీపిక :** దేనికొరకు అనగా ఏ ఫలము నిమిత్తము, ప్రసహేత అనగా చంపును.

## సవ్యభిచారము

45. అథ సవ్యభిచారమ్-సవ్యభిచారమ్ నామ యద్వ్యభిచరణమ్; యథా-భవేదిదమౌషధమస్మిన్ వ్యాధౌ యౌగికమథవా నేతి.

**తాత్పర్యము :** సవ్యభిచారము-సవ్యభిచారమనగా ఒక్క విషయమున నిలకడలేని జ్ఞానమును కల్గించునది. ఉదా : ఈ ఔషధమీ వ్యాధి యందుపయోగపడును లేదా ఉపయోగపడదు అనుట.

**ఆయుర్వేద దీపిక :** సవ్యభిచారమనగా నియతముగా నుండనిది అని యర్థము. లేదా లేదు అనుట, ఉపయోగపడదు అని తెల్పును. అనియతత్వమిక్కడ ఔషధము వ్యాధికి సరిపడుట, సరిపడకపోవుటయను సంశయమును కలిగించునదియే కాబట్టి అనైకాంతికమును సంశయమును నొక్కటియేయని శంకపడరాదు.

## జిజ్ఞాస

46. అథ జిజ్ఞాసా-జిజ్ఞాసా నామ పరీక్షా, యథా-భేషజపరీక్షోత్తరకాలముపదేక్ష్యతే.

**తాత్పర్యము :** జిజ్ఞాసా-జిజ్ఞాసా యనగా పరీక్షించుట. ఉదా : భేషజ పరీక్షను గురించి ముందు ముందు చెప్పబడును.

**ఆయుర్వేద దీపిక :** ఉత్తర కాలమున అనగా ఇచటనే పరీక్ష ప్రకరణ మున లేదా రసాయన ప్రకరణమునందు 'భేషజము రెండు విధములు' మొదలైన సూత్రముల ద్వారా (భేషజమ్ ద్వివిధమ్ - చరక చికిత్సా స్థానము. 1వ అధ్యా. 1వ పాదము) చెప్పబడును.

## వ్యవసాయము

47. అథ వ్యవసాయః- వ్యవసాయో నామ నిశ్చయః, యథా-వాతిక ఏవాయం వ్యాధిః యిదమేవాస్య భేషజం చేతి.

## అర్థప్రాప్తి

48. అథార్థప్రాప్తిః- అర్థప్రాప్తిర్నామ యత్రైకేనార్థేనోక్తేనాపరస్యార్థస్యానుక్తాపి సిద్ధిః యథా-నాయం సంతర్పణ సాధ్యో వ్యాధిరిత్యుక్తే భవత్యర్థప్రాప్తిః అప-తర్పణసాధ్యోఽయమితి;నానేన దివా భోక్తవ్యమిత్యుక్తే భవత్యర్థప్రాప్తిః నిశిభోక్తవ్యమితి.

**తాత్పర్యము :** వ్యవసాయము - వ్యవసాయమనగా నిశ్చయము-ఉదా - ఈ వ్యాధి వాత ప్రధానమైనదే; ఇదియే దీనికి ఔషధము.

అర్థప్రాప్తి - అర్థప్రాప్తి యనగా చెప్పబడిన ఒక విషయము వలన చెప్ప బడకున్నను వేరొక విషయము యొక్క జ్ఞానము కలుగుట. ఉదా : ఇది సంతర్పణ చికిత్సచే సాధ్యమగు వ్యాధి కాదు అనినపుడు ఇది అపతర్పణ సాధ్యవ్యాధి యని అర్థప్రాప్తి యగును. వీడు పగలు భోజనము చేయరాదు అనినపుడు రాత్రి భోజనము చేయవచ్చునని అర్థప్రాప్తి కలుగును.

**ఆయుర్వేద దీపిక :** అర్థప్రాప్తి యన అర్థాపత్తి. ఇచట 'చెప్పబడిన' అను పదముచేత శృతార్థాపత్తియే వివరింపబడినది. దృష్టార్థాపత్తియును దీనికి సమానమనియే తెలియవలెను. ఈ అర్థాపత్తి ఇతర కారణములచేత ప్రమాణము కాదని ప్రమాణ ప్రకరణమున చెప్పబడలేదు. ఏ అర్థాపత్తి దోష రహితమైనదో అది అనుమానాంతర్గతమనియే భావము. అపతర్పణమునకునూ సాధ్యము కానిది అనునపుడు ఇది సంతర్పణ సాధ్యము అను వచనమే అసమర్థత్వమను విశేషణము వలన కాదు అని అర్థాపత్తి కలుగదు అని అభిప్రాయము. రెండు విధముల (సంత

ర్పణ-అపతర్పణలు) అసాధ్యమైనది చెప్పుటకు అసాధ్యః అను పదమును ప్రయోగింపవలెను. అట్లే ఇతర ఉదాహరణములందును.

## సంభవము

49. అథ సంభవః-సంభవో నామ యో యతః సంభవతి స తస్య సంభవఃయథా షడ్ధాతవో గర్భస్య వ్యాధేరహితమ్ హితమారోగ్యస్యేతి.

**తాత్పర్యము :** ఏది, (ఏ వస్తువు) దేనివలన సంభవించునో జనించునో లేక కలుగునో) అది దానియొక్క (ఆ వస్తువు యొక్క) సంభవమగును. ఉదా : గర్భమునకుషడ్ధాతువులు వ్యాధికి అహిత పదార్థ సేవనము. ఆరోగ్యమునకు హిత పదార్థ సేవనము సంభవములు.

**ఆయుర్వేద దీపిక :** సంభవతి విద్యతే అస్మిన్నితి సంభవః దేనివలన కల్గునో అది సంభవము.కారణమే అవ్యక్తము. తననుండి పుట్టునదియున్నైనది కార్యము అనబడును. ఇది సత్కార్యవాదుల కార్యమే. కావున షడ్ధాతువులయందు గర్భమున్నది. యిట్లే అహితములందును వ్యాధి యున్నది. అది తరువాత కాలమున స్వరూపమును ధరించునని సాంఖ్యమతమున చెప్పబడినది. అందువలన ఇతరచోట్ల సంభవమునకు ఉదాహరణము ఈ విధముగా చెప్పబడినది. ఖారి నుండి ద్రోణము సంభవించును (మానమునకు సంబంధించినది). పై మతమునకు ఈ ఉదాహరణము సమానము.

## అనుయోజ్యము

50. అథానుయోజ్యమ్-అనుయోజ్యం నామ-యద్వాక్యం వాక్యదోషయుక్తంతత్. సామాన్యతో వ్యాహృతేష్వర్థేషు వా విశేషగ్రహణార్థం యద్వాక్యం తదప్యనుయోజ్యమ్:యథా-సంశోధనసాధ్యోఽయం వ్యాధిరిత్యుక్తే కిం వమనసాధ్యోఽయం కింవా విరేచనసాధ్య ఇత్యనుయుజ్యతే.

**తాత్పర్యము :** అనుయోజ్యము- అనుయోజ్యమనగా వాక్యదోషయుక్తమైన్న వాక్యము. సామాన్యముగా చెప్పబడిన విషయము సందైనసూ, విశేషముగా అర్థమును గ్రహించుటకు అనుసరించి ఉపయోగించు వాక్యము అనుయోజ్యమనబడును. ఎట్లనగా - ఈ వ్యాధి సంశోధన సాధ్యమనునపుడు అది వమన సాధ్యమా లేక విరేచన సాధ్యమాయని అనుమానించుట అనుయోజ్యము.

ఆయుర్వేద దీపిక : సామాన్యత అను వాక్యము ద్వారా అనుయోజ్యమును వివరించడమైనది.

## అననుయోజ్యము

51. అథాననుయోజ్యమ్ః- అననుయోజ్యమ్ నామాతో విపర్యేణ యథా-అయమ-సాధ్యః.

**తాత్పర్యము :** అనుయోజ్యమునకు వ్యతిరేకమైనది అననుయోజ్యము. (వాక్యదోషము లేక విశేషార్థ గ్రాహకము కాక యుండునది). ఉదా : ఈ వ్యాధి యసాధ్యము.

ఆయుర్వేద దీపిక : దీనికి వ్యతిరేకమైనది అనగా అనుయోజ్యము నందు చెప్పబడిన రెండు లక్షణములును లేనిది అననుయోజ్యమని తెలియవలెను.

## అనుయోగము

52. అథానుయోగః అనుయోగో నామ స యత్తద్విద్యానాం తద్విద్యైరేవ సార్ధం తన్త్రే తన్త్రైకదేశే వా ప్రశ్నః ప్రశ్నైకదేశో వా జ్ఞానవిజ్ఞాన-వచనప్రతివచన పరీక్షార్థమాదిశ్యతే. యథా-నిత్యః పురుష ఇతి ప్రతిజ్ఞాతే యత్పరః కో హేతురిత్యాహ సోఽనుయోగః.

## ప్రత్యనుయోగము

53. అథ ప్రత్యనుయోగః-ప్రత్యనుయోగో నామ అనుయోగస్యానుయోగః యథా అస్యానుయోగస్యే పునః కో హేతురితి.

**తాత్పర్యము :** అనుయోగము - అనుయోగమనగా ఆయా విద్యలను నేర్చినవారు ఆయా విద్యలను నేర్చిన వారితో ఆయా తంత్రము లన్నిటియందుగానీ, తంత్రమునందలి ఒక భాగమునగానీ ప్రశ్నమును లేదా ప్రశ్న భాగమును వాది యొక్క జ్ఞానవిజ్ఞానాది గుణములను తెలిసికొనుటకు ప్రయోగించుట. యెట్లనగా పురుషుడు నిత్యుడని వాది ప్రతిజ్ఞ చేసినపుడు ఇతరుడు దానికి కారణమేమి యని ప్రశ్నించుట.

ప్రత్యనుయోగము - ప్రత్యనుయోగమనునది అనుయోగమునకు అనుయోగము. ఉదా : అనుయోగమునకు (ప్రశ్నకు) తిరిగి ప్రశ్న వేయుట. ప్రశ్న వేయుటకు కారణమేమి యని యడుగుట.

ఆయుర్వేద దీపిక : ప్రశ్న అను శబ్దము వలన యథోక్త శాస్త్రమునందలి సంపూర్ణ ప్రశ్నమును గ్రహింపవలెను. ఇచటనే ఒకానొక వైద్యుడు మరియొక వైద్యుని ప్రశ్నింపవలెను. అనుటచే ఇది చెప్పబడినది. ఇది సంపూర్ణము అని తెలియవలెను. ప్రశ్నయొక్క ఏకదేశత్వము (భాగమును కూడా గ్రహింపనగును).

## వాక్యదోషము

54. అథ వాక్యదోషః-వాక్యదోషో నామ యథాఖల్వస్మిన్నర్థే న్యూనమధికమనర్థకమపార్థకం విరుద్ధం చేతి.తత్ర న్యూనం ప్రతిజ్ఞాహేతూదాహరణోపనయనిగమనానామన్యతమేనాపి న్యూనం న్యూనం భవతీతి.యద్వా బహూపదిష్ట హేతుకమ్ కేన సాధ్యతే హేతునా తచ్చ న్యూనమ్.ఏతాని హ్యన్తరేణ ప్రకృతోఽప్యర్థః ప్రణశ్యేత్; అథాధికమ్-అధికం నామ యన్న్యూనవిపరీతమ్;యద్వాఽఽయుర్వేదే భాష్యమాణే బార్హస్పత్యమౌశనస మన్యద్వా యత్కించిదప్రతిసంబంధార్థముచ్యతే; యద్వాపునః ప్రతిసంబంధార్థమపి ద్విరభిధీయతే తత్పునరుక్తదోషత్వాదధికమ్; తచ్చ పునరుక్తమ్, ద్వివిధమ్-అర్థపునరుక్తమ్, శబ్దపునరుక్తం చ తథార్థపునరుక్తం నామ యథా-భేషజమౌషధం సాధనమితి. శబ్ద పునరుక్తం పునర్భేషజం భేషజమితి, అథానర్థకమ్-అనర్థకం నామ యద్వచనమక్షరగ్రామమాత్రమేవ స్యాత్ పఞ్చవర్గవన్నచార్థతో గృహ్యతే;అథాపార్థకమ్-అపార్థకం నామ యదర్థవచ్చ పరస్పరేణ చాయుజ్యమానార్థకమ్,యథా-చక్ర-నక్ర-వంశ-వజ్ర-నిశాకరా-ఇతి. అథవిరుద్ధమ్ విరుద్ధం నామ యద్ దృష్టాన్తసిద్ధాన్తసమయైర్విరుద్ధమ్,తత్ర పూర్వమ్ దృష్టాన్తసిద్ధాన్తావుక్తౌ.సమయః పునస్త్రిధా భవత్యాయుర్వైదికసమయో, యాజ్ఞికసమయో, మోక్షశాస్త్రికసమయఇతి తత్రాయుర్వైదికసమయఃచతుష్పాదం భేషజమితి.యాజ్ఞికసమయః-ఆలభ్యాః యజమానైః పశవఇతి, సర్వభూతేష్వహింసేతి మోక్షశాస్త్రికసమయః;తత్ర స్వసమయవిపరీతముచ్యమానం విరుద్ధం భవతి ఇతివాక్యదోషాః.

## వాక్య ప్రశంస

55. అథ వాక్యప్రశంసా-వాక్యప్రశంసా నామ-యథా ఖల్వస్మిన్నర్థే త్వన్యూన-మనధికమమనర్థకమనపార్థకమ్‌విరుద్ధమాధిగతపదార్థం చేతి యత్తద్వాక్యమ-ననుయోజ్యమితిప్రశస్యతే.

**తాత్పర్యము :** వాక్యదోషము-వాక్యదోషమనగా ఇచట న్యూనము (తక్కువ) అధికము (ఎక్కువ) అనర్థకము (అర్థము నివ్వకపోవుట) అపార్థకము (వేరు అర్థము నిచ్చుట) విరుద్ధము (వ్యతిరేకము). న్యూనమనగా అర్థమును (విషయమును) సాధించుటకు ఉండవలసిన ప్రతిజ్ఞ హేతు ఉదాహరణ ఉపనయ నిగమనము లలోనేయొక్కటి లోపించిననూ అది న్యూనమనబడును. లేదా అనేక హేతువులచే సాధింపవలసిన సాధ్యమును ఒక హేతువుచేత సాధింప జూచిననూ అది న్యూనమే. ఈ దోషముల వలన ప్రకృత విషయము నశించును. (తెలియబడదు). అధికమనగా న్యూనమునకు వ్యతిరేకమైనది. ఆయుర్వేదమును గూర్చి చెప్పునపుడు బార్హస్పత్యము, ఔశనసము లేదా ఆయుర్వేదమునకు సంబంధించని వేరొక విషయమును గానీ చెప్పుట. లేక సంబంధించిన విషయమైననూ రెండేసి పర్యాయములు చెప్పినచో పునరుక్తము అగుట వలన అధికదోషమగును. పునరుక్తము రెండు విధములు. అర్థ పునరుక్తము మరియు శబ్ద పునరుక్తము. అర్థపునరుక్తమనగా భేషజము, ఔషధము సాధనము అని ఒకే చోటున చెప్పుట. శబ్దపునరుక్తమనగా భేషజము భేషజమని ఒకే చోటున చెప్పుట. అనర్థకమనగా కేవలము అక్షరములు మాత్రమే కలిగియున్న వాక్యము. పంచవర్గములైన క-ఖ-గ-ఘ-ఙ మొదలైన వర్గములను అసంబద్ధముగా ఇచ్చినచో వాటివలన ఎట్టి అర్థమును కలుగదు. అపార్థకము—అపార్థకమనగా వేరు వేరు అర్థములు కలిగిన పదములను పరస్పరాకాంక్ష సంబంధము లేనివానిని ఒక వాక్యమున చేర్చినచోనది అపార్థకము. చక్ర నక్ర వంశ వజ్ర నిశాకరులు అని చెప్పినట్లు. విరుద్ధము దృష్టాంత సిద్ధాంత సమయములకు విరుద్ధమైనది. దృష్టాంత సిద్ధాంతములను గూర్చి ఇంతకు పూర్వము చెప్పుకొని యున్నాము. సమయము తిరిగి మూడు విధములు. ఆయుర్వేదిక సమయము-యాజ్ఞిక సమయము-మోక్షశాస్త్రిక సమయము. భేషజము చతుష్పాదమనుట ఆయుర్వేదిక సమయము. యజమానులచే పశువులు వధింపబడవలెననుట యాజ్ఞిక సమయమున సర్వభూతముల యందును అహింసను తలపవలెననుట మోక్షశాస్త్రిక సమయము. దీనికి వ్యతిరేకముగా చెప్పబడినది విరుద్ధము. ఇవి వాక్య దోషములు.

వాక్య ప్రశంస-వాక్య ప్రశంసయనగా ఇచట న్యూనము. అధికములు లేక అర్థమును కలిగి వేరు అర్థము నివ్వక, వ్యతిరేకము కాక విషయమును అవగతము చేయు వాక్యము. ఇది అననుయోజ్యమగును (దీనిపై సంశయములు ప్రశ్నలు వుండవు) ఇది చాల మంచి వాక్యము.

**ఆయుర్వేద దీపిక : వాక్య దోషములను ఉదహరించుచున్నాడు.** అస్మిన్నర్థే (ఇచట)అనువచనముచే ఛలము వ్యాఖ్యాఖాన మొదలైన పదముల చేతనూ వాక్య దోషత్వము కలదని చూపుచున్నాడు. ఛలాదులు వాక్యదోషము లేకాని వాటిని విడిగా చెప్పినందువలన ఇచట ఉల్లేఖింపలేదు. మరియు శాస్త్రాంతరములందు చెప్పినట్టియూ అపసిద్ధాంతాదులను వాక్యదోషములుగనే సూచించడమైనది. ప్రతిజ్ఞ చేయు సమయమున పురుషుడు నిత్యుడనుటకు చెప్పిన అనాదిత్వము అకృతకత్వము నిర్వికారత్వములను హేతువులను తిరిగి హేతువునందు ఉపనయమునందును అన్నింటిని చెప్పక ఒకే హేతువును ఉల్లేఖించుటవలన ప్రతిజ్ఞకు తక్కువ యగుటచే యది న్యూనమగును. హేతువును చెప్పవలసి వచ్చినపుడు సాధ్యసాధన సంబంధము కలిగిన ఒకే హేతువైననూ దానిని చెప్పుదురు (ఒకే హేతువును). అందువలన బహు హేతు కథనమే అధిక్యత వలన దోషమగునని తెలియునగును. ప్రకృతమనగా సాధ్యత్వము చేత ప్రతిజ్ఞాతమైన విషయము. బార్హస్పత్యము, ఔశనసములు, నీతి శాస్త్రములు. అప్రతి సంబంధార్థము అనుట వలన - బార్హస్పత్యాదుల నుండియును, ధనైషణమును ప్రసంగ వశమున చెప్పవలసి వచ్చినపుడు ఆయుర్వేదమునకుపయోగించు రీతిలో స్వల్పముగనే చెప్పవలయునుగాని అధికముగా చెప్పరాదని సూచించుచున్నాడు. పునరుక్త దోషము అనగా దోషవంతమైన పునరుక్తము. దోషయుక్తమైన పునరుక్తము ఎట్లుండునో యది చెప్పబడినది. పంచవర్గముల వలె అనగా క-ఖ-గ-ఘ-ఙ మొదలైన వర్గముల వలె. వీటివలన చెప్పకొనవలసిన అర్థము స్ఫురింపదు. అర్థము కలిగి అనగా ప్రతి పదమును ప్రసిద్ధమైన అర్థమును కలిగి, ఒకదానితో నొకటి కలువక అనగా వాక్యరూపముగా నిని అర్థము నివ్వలేనివి. చక్ర-నక్ర-వంశ-వజ్ర ఈ శబ్దములు క్రియలేకుండా వాక్య రూపముగా చెప్పబడలేవు అని అర్థము. విరుద్ధమునందు దృష్టాంత విరుద్ధమునకు ఉదాహరణ శీతజలము తాపకమైనట్లే జ్వరమును తాపకము. సిద్ధాంత విరుద్ధమున కుదాహరణ- వైద్యుడు చికిత్స వలన రోగము నశింపదని చెప్పుట. ఆయుర్వేదమున చతుష్పాదమే చికిత్స యను సిద్ధాంతమున్నప్పటికీ 'చతుష్పాద' సంజ్ఞ సమయమును బట్టి ఇచ్చినదని

తెలియవలెను. ఇట్లే యజ్ఞాదులకు 'అలభ్య' అను సంజ్ఞ సమయకృతమైనది. స్వసమయమునకు వ్యతిరేకముగా చెప్పినచో అది సమయ విరుద్ధమగును. అననుయోజ్యమనగా అనుయోగమునకు అర్హము కానిది.

## ఛలము

56. అథ ఛ్చలమ్-ఛలమ్ నామ పరిశఠమర్థాభాసమపార్థకం వాగ్వస్తుమాత్రమేవ, తద్ ద్వివిధమ్-వాక్ఛలమ్-సామాన్యచ్ఛలమ్ చ. తత్ర వాక్ఛలం నామ యథా-కశ్చిద్ బ్రూయాత్-నవతంత్రోఽయం భిషగితి,అథ భిషగ్ బ్రూయాత్-నాహం నవతంత్ర ఏకతంత్రోఽహమితి, పరో బ్రూయాత్-నాహం బ్రవీమి నవతన్త్రాణి తవేతి,అపి తు నవాభ్యస్తం తే తన్త్రమ్, అనేకధాభ్యస్తం మయా తన్త్రమితి! ఏతద్వాక్ఛలమ్;సామాన్యచ్ఛలమ్ నామ యథా, వ్యాధిప్రశమనాయౌషధమిత్యుక్తే, పరో బ్రూయాత్ సత్ సత్ప్రశమనాయేతి; కిం ను భవానాహ సన్ హి రోగః సదౌషధమ్; యది చ సత్ సత్ప్రశమనాయ భవతి, తత్ర సన్ హి కాసః సన్ క్షయః సత్సామాన్యాత్కాసస్తే క్షయప్రశమనాయ భవిష్యతీతి. ఏతత్సామాన్యచ్ఛలమ్.

**తాత్పర్యము :** ఛలము- ఛలమనగా ప్రవృత్తి గలది. (మోసగించునట్టిది.) అర్థమిచ్చు దానివలె కనబడునది. వేరు యర్థము నిచ్చునదియును అయిన కేవలము వాక్కు మాత్రమే. అది రెండు విధములు. వాక్ ఛలము, సామాన్య ఛలము. అందు వాక్ ఛలమనునది యెట్లనగా ఒకరు- "ఈ వైద్యుడు నవతంత్రుడ"ని అనగా. వైద్యుడు "నేను ఏకతంత్రుడనేగాని నవతంత్రుడను (తొమ్మిది తంత్రములను చదివినవాడను) కాదనను". పరుడు, "నీవు తొమ్మిది తంత్రములను చదివిన వాడవని నేను చెప్పుట లేదు కాని, క్రొత్తగా తంత్రమును అభ్యసించిన వాడవని చెప్పుచున్నాను" అనును. అపుడు వైద్యుడు "నేను క్రొత్తగా (మొదటి సారి) అభ్యసించిన వాడను కాను. అనేక పర్యాయములు అభ్యసించినాను" అనును. ఇది వాక్ఛలమగును. సామాన్య ఛలమున కుదాహరణ. ఔషధము వ్యాధి ప్రశమున కొరకివ్వబడును అని ఒకరనగా నింకొకరు "సత్ పదార్థము సత్ పదార్థమును శమింపజేయునని మీరు చెప్పుచున్నారు. ఎందువలననగా ఔషధము సత్ పదార్థము, రోగమునూ సత్ పదార్థమే. సత్పదార్థము సత్పదార్థమును ప్రశమింప జేయునెడ

సత్పదార్థమైన కాస - సత్పదార్థమే అయిన క్షయను సామాన్యత్వము వలన శమింప జేయుననుట మీ వాక్యమున కర్థమ"ని చెప్పుట సామాన్య ఛలమగును.

**ఆయుర్వేద దీపిక :** ఛలము - పరిశఠమనగా— వంచనాప్రవృత్తము - మోసగించువది. అర్థమున్నట్లుగా ఆ భాసను కలుగజేయునది అర్థాభాసము. సరియైన అర్థము లేకుండుట వలనది వాగ్వస్తు మాత్రమే. ఛలమనగా ఉండవలసిన అర్థమునకు వేరొక అర్థమును కల్పించి పరవచనమును ఖండించుటకు ఉపయోగించునది. (వచన విఘాతోఽర్థ వికల్పోపపత్యాచ్ఛలమ్-న్యాయదర్శనము 1-2-10) ఇచట చెప్పబడిన వాక్ఛలము న్యాయదర్శనము నందలి ఉపచార ఛలమగును. శబ్దమునకు సామాన్యముగానున్న వక్తయొక్క అభిప్రాయమైయున్న అర్థమునకు వేరు అర్థమును కల్పించుట వాక్ఛలము. అందువలన మంచములు అరచుచున్నవి అనుటయందు మంచ శబ్దమునకు ముఖ్యత్వము నిచ్చుట వలన ఉపచారముచే మంచముసందున్న పురుషులని ప్రయోగమైయున్నది. అట్టి తరి, అచేతనములైన మంచము లెట్లు అరచును అని ఆక్షేపించుట వాక్ఛలము. సామాన్య ఛలము యొక్క లక్షణ మిచట చెప్పబడలేదు. న్యాయదర్శనమున సంభవించు (ముఖ్యముగా కలుగు) అర్థమునకు అతిసామాన్యముగా (దగ్గరగా) నుండుటచేత అసంభూత అర్థమును కల్పించుట సామాన్యచ్ఛలము. (సంభవతోఽర్థస్యాతి సామాన్య యోగాదా సంభూతార్థకల్పనా సామాన్యచ్ఛలమ్ న్యాయదర్శనము 1-2-3.)

సత్సత్ప్రశమనాయ-అనగా సతపదార్థముచేత సత్పదార్థము యొక్క చికిత్స చేయుట యనునది మీ మతము అని ఛలవాది పూర్వ పక్షమున పల్కును. అందువలన వివక్ష (భేదము) లేని సత్త్వసమానము వలన ప్రతిషేధించుట సామాన్య ఛలమగును.

## అహేతువు

57. అథాహేతుః-అహేతుర్నామ ప్రకరణసమః, సంశయసమో, వర్ణ్యసమశ్చేతి. తత్ర ప్రకరణసమో నామాహేతుః యథా-అన్యః శరీరాదాత్మా నిత్య ఇతి; పరో బ్రూయాత్ యస్మాదన్యః శరీరాదాత్మా తస్మిన్నిత్యః;శరీరం హ్యనిత్య-మతో విధర్మిణా చాత్మనా భవితవ్యమిత్యేష చాహేతుః న హి య ఏవ పక్షః స ఏవ హేతురితి సంశయసమో నామాహేతుర్య ఏవ సంశయహేతుః. స ఏవ సంశయచ్ఛేదహేతుః, యథా-అయమాయుర్వేదైకదేశమాహ కిన్న్వయం చికిత్సకః స్యాన్న వేతి సంశయే పరో బ్రూయాత్-యస్మాదయమాయుర్వేదైక-

దేశమాహ తస్మాచ్చికిత్సకోఽయమితి,న చ సంశయచ్ఛేదహేతుం విశేషయతి; ఏష చాహేతుః న హి య ఏవ సంశయ హేతుః స ఏవ సంశయచ్ఛేద-హేతుర్భవతి.వర్ణ్యసమో నామాహేతుః-యో హేతుర్వర్ణ్యావిశిష్టః,యథా-పరో బ్రూయాదస్పర్శత్వాద్ బుద్ధిరనిత్యా శబ్దవదితి;అత్ర వర్ణ్యః శబ్దో బుద్ధిరపి వర్ణ్యా తదుభయవర్ణ్యావిశిష్టత్వాద్వర్ణ్యసమోఽప్యహేతుః.

**తాత్పర్యము :** అహేతువు- అహేతువనునది ప్రకరణ సమము, సంశయ సమము, వర్ణ్యసమము అని మూడు విధములు. అందు ప్రకరణ సమమనునది ఎట్లనగా ఒకరు శరీరమునుండి వేరైన ఆత్మ నిత్యమైయున్నది. ఇంకొకరు ఆత్మ శరీరమునుండి వేరైనది. (భిన్నమైనది) అగుట వలన నిత్యమైయున్నది. శరీరము అనిత్యము. దీనికి విరుద్ధ ధర్మమున్న ఆత్మ నిత్యమగును. ఇది అహేతువు. పక్షము నందు చెప్పబడినదానినే హేతువుగా తీసికొనరాదు. సంశయసమ అహేతువు అనునది సంశయము కలుగుటకే హేతువు కారణమగునో ఆ హేతువునే సంశయమును పోగొట్టుటకెత్తి చూపుట ఎట్లనగా ఇతడు ఆయుర్వేదమునందు కొద్ది భాగమే చెప్పు చున్నాడు. ఇతడు చికిత్సకూడా కాదా ? అను సందేహము వెలిబుచ్చినపుడు ఇంకొకరు- ఇతడు ఆయుర్వేదమునందలి కొంత భాగము చెప్పుచున్నాడు. అందు వలన ఇతడు చికిత్సకుడు అని చెప్పుట. అంతేగాని సంశయమును పోగొట్టు విశేష హేతువును చెప్పడు. ఇదియును అహేతువే. ఏది సంశయమునకు కారణమో అదియే సంశయమును పోగొట్టుటకు కారణమవదు. వర్ణ్యసమ అహేతువు అనునది— ఏ హేతువు వర్ణ సామాన్యమో అది ఎట్లనగా ఒకరు స్పర్శగుణము లేనందువలన బుద్ధి అనిత్యము. శబ్దమువలె అని చెప్పుట. ఇచట శబ్దము వర్ణ్యము (వర్ణింప దగినది) బుద్ధియును వర్ణ్యమే ఈ రెండును వర్ణ్యములై అవిశేషములై (సమా నములై) యున్నందువలన వర్ణ్యసమ అహేతువునగును.

**ఆయుర్వేద దీపిక :** అహేతువనగా అసాధక (సాధించని) హేతువని యర్థము. సాధ్యత్వముండుట వలన ఆధారముగా చేసికొని యుండుట అనువృత్త్పత్తిచే (ప్రక్రియతే సాధ్యత్వేన అధిక్రియత ఇతి) ప్రకరణము పక్షమగును. దానికి సమ మైనది ప్రకరణ సమము. ఆత్మ శరీరమునకు భిన్నమై నిత్యముగా నున్నది అను ప్రతిజ్ఞయందు శరీరము కంటె భిన్నత్వము నిత్యత్వము. ఇది ఆత్మయందు సాధ్య విషయము. దీనికి వ్యతిరేక ధర్మము అనగా అనిత్యమైన శరీరమునకు వ్యతిరేకమైన ధర్మము అనగా నిత్యత్వము. ఇందు రెండునూ సాధ్యములే. సాధ్యము సిద్ధము కాని

దగుట వలన సాధనము కాజాలదని భావము. ఇతడు ఆయుర్వేదమందలి కొంత భాగమునే చెప్పుచున్నాడు. అనగా ఆయుర్వేదమున కొంత భాగమునే చెప్పగలుగుట చికిత్సకుడా కాదా యను సంశయమునకు హేతువగును. కొంత భాగమునే చెప్పుట యనునది శాస్త్రమును చదువకుండ ఎక్కడైననూ వినియుండుట వలన కూడా జరుగును అని భావము. విశేషించి చెప్పుటలేదు అనగా సంశయమును పోగొట్టు విశిష్టమైన హేతువును చూపుటలేదు అని అర్థము. ఇదియును అహేతువే - అనగా ఇపుడు చెప్పినది సంశయచ్ఛేదనమునందు అహేతువు అని యర్థము. వర్ణ్యముచేత అనగా సాధ్యము చేత. దృష్టాంతము కూడా సిద్ధత్వము పొందవలసియుండుటచే సమముగా నున్నది. అందువలన అది వర్ణ్యసమము. వర్ణ్యము శబ్దము -అస్పర్శత్వము కలిగియుండుట వలన నిత్యత్వము అనుటకింకను సాధించవలసియుండుటచే శబ్దమున్నూ సాధ్యమే. సాధ్యము దృష్టాంతము కాజాలదు. రెండు వర్ణ్యములను అవిశేషములు (సమములు) అగుటచే ఉభయాత్ర (దృష్టాంతము, వర్ణ్యము ఈ రెండిటియందును) సాధ్యమింకను సాధించవలసి యున్నందున అవిశిష్టము (భేదము లేకుండుట) ఉండుటచేత ఇది అహేతువు.

## అతీత కాలము

58. అథాతీతకాలం-అతీతకాలం నామ యత్పూర్వం వాచ్యం తత్పశ్చాదుచ్యతే తత్కాలాతీతత్వాదగ్రాహ్యం భవతీతి.పూర్వం వా నిగ్రహప్రాప్తమనిగృహ్య పక్షాన్తరితం పరిగృహ్య పశ్చాన్నిగృహీతే తత్తస్యాతీతకాలత్వాన్నిగ్రహ-వచనమసమర్థం భవతీతి.

**తాత్పర్యము :** అతీతకాలము-అతీతకాలమనగా మొదట చెప్పవలసిన వానిని తరువాత చెప్పుట. అప్పటికి కాలాతీతమైనందున ఆ విషయము అగ్రాహ్యమగును. వాద సమయమున నిగ్రహింపవలసిన విషయము వచ్చినపుడు నిగ్రహింపక దానిని వదలి వేరు పక్షమును తీసికొని వాదించి తిరిగి నిగ్రహించినచో అట్టి నిగ్రహము అతీతకాలమగుటచే అగ్రాహ్యమగును.

**ఆయుర్వేద దీపిక :** మొదట చెప్పవలసినది తరువాత చెప్పుట. ఎట్లనగా నిగమనమును ముందు చెప్పి తరువాత ప్రతిజ్ఞను వచించుట. నిగ్రహ ప్రాప్తమనగా నిగ్రహించవలసినదని తెలిసినది.

## ఉపాలంభము

59. అథోపాలమ్భః—ఉపాలమ్భో నామ హేతోర్దోషవచనమ్;యథా-పూర్వం అహేతవో హేత్వాభాసా వ్యాఖ్యాతాః.

**తాత్పర్యము :** ఉపాలంభము-ఉపాలంభమనునది వాది లేక ప్రతివాది ప్రతిపాదించిన హేతువునందు దోషము నెత్తిచూపుట. ఇంతకు ముందు అహేతువులు హేత్వాభాసలు వ్యాఖ్యానింపబడినవి. (అట్టి వానియందలి దోషములను తెలియ జేయుట)

**ఆయుర్వేద దీపిక :** హేతువునందలి దోషము నెత్తి చూపుట అనుట వలన కాలాత్యాపదిష్టము అసిద్ధము అను ఈ రెండిటిని ఇక్కడ చెప్పలేదు. వానిని ఈ సందర్భమున (దోషములుగా) గ్రహింపవలెను. ఉదాహరణకై అహేతువులు చెప్పబడినవి. హేతువు వలె కన్పడునవి. (నిజముగా హేతువులు కానివి) హేత్వాభాసలు. (హేతువదాభాసంతే-ఇతి హేత్వాభాసాః)

## పరిహారము

60. అథ పరిహారః-పరిహారో నామ తస్యైవ దోషవచనస్య పరిహరణమ్.యథా-నిత్యమాత్మని శరీరస్థే జీవలిఙ్గాన్యుపలభ్యన్తే తస్య చాపగమాన్నోపలభ్యన్తే తస్మాదన్యః శరీరాదాత్మా నిత్యశ్చేతి.

## ప్రతిజ్ఞాహాని

61. అథ ప్రతిజ్ఞాహానిః-ప్రతిజ్ఞాహానిర్నామ సా పూర్వపరిగృహీతాం ప్రతిజ్ఞాం పర్యనుయుక్తో యత్ పరిత్యజతి;యథా-ప్రాక్ ప్రతిజ్ఞాంకృత్వా నిత్యం పురుష ఇతి పర్యనుయుక్తస్త్వాహ-అనిత్యఇతి.

**తాత్పర్యము :** పరిహారము-పరిహారము అనునది అదే దోష వచనమును పరిహరించుట. యెట్లనగా నిత్యమైన ఆత్మ శరీరమునందున్నపుడు జీవలక్షణములగ పడును. ఆయాత్మ లేనపుడు కన్పింపవు. అందుచేత ఆత్మ శరీరము నుండి భిన్నమై నిత్యమైయున్నది అని చెప్పుట.

ప్రతిజ్ఞా హాని-ప్రతిజ్ఞా హాని అనగా- మొదట తీసుకొన్న (చెప్పిన) ప్రతిజ్ఞను సాధించలేనందున వదలివేయుట. ఉదాహరణ : మొదట పురుషుడు నిత్యుడు అని చెప్పి దానిని సాధించలేక ఓడిపోవు సమయమున పురుషుడు అనిత్యుడు అని చెప్పుట.

ఆయుర్వేదదీపిక : నిత్యమైన ఆత్మ అనుటయందు ప్రకరణ సమమునందు చెప్పిన హేతువునందలి దోషమును పరిహరించుచున్నాడు. నిత్యమనగా ఎల్లప్పుడు ఉండునది. జీవలక్షణములనగా ప్రతిసంధానస్మరణాదులు. అది (ఆత్మ) పోయినందు వలన (జీవలక్షణములు) లభింపవు అనుటచే మృత శరీరమునందు చేతనాదులు లేనందున అది అన్యము (ఆత్మనుండి అన్యము). అను కారణమును చూపి ఆత్మ లేకపోవుటవలన మృతశరీరము చైతన్యములేకయుండును. అందువలన ఆత్మ యొక్క అన్యత్వము సిద్ధించినది. అందుచేతనే శరీరమునుండి భిన్నత్వము కలిగి యుండుటచే శరీరమునకు వ్యతిరేక ధర్మమును కలిగియుండుటచే మొదట చెప్ప బడిన నిత్యత్వమును సిద్ధించునని 'నిత్యశ్చ' అను శబ్దము ద్వారా సూచించడమైనది.

## అభ్యనుజ్ఞ

62. అథాభ్యనుజ్ఞా, అభ్యనుజ్ఞా నామ సా య యిష్టానిష్టాభ్యుపగమః.

## హేత్వంతరము

63. అథ హేత్వన్తరమ్-హేత్వన్తరమ్ నామ ప్రకృతహేతౌ వాచ్యే యద్ వికృతి హేతుమాహ.

## అర్థాంతరము

64. అథార్థాన్తరమ్-అర్థాన్తరమ్ నామ ఏకస్మిన్ వక్తవ్యేఽపరం యదాహ-యథా జ్వరలక్షణే వాచ్యే ప్రమేహలక్షణమాహ.

**తాత్పర్యము :** అభ్యనుజ్ఞ-అభ్యనుజ్ఞ యనగా ఇష్టమున్నదానిని లేని దానినియును స్వీకరించుట.

హేత్వన్తరము - హేత్వంతరమనునది ప్రకృతి హేతువును చెప్పవలసి యున్నపుడు వికృతి హేతువును చెప్పుట.

అర్థాంతరము-అర్థాంతరమనగా ఒక విషయమును చెప్పవలసినచోట చెప్పిన మరియొక విషయము. ఉదా : జ్వరలక్షణములు చెప్పవలసినచోట ప్రమేహ లక్షణ ములు చెప్పుట.

**ఆయుర్వేద దీపిక :** 'ఇష్టానిష్టాభ్యుపగమః'-ఇష్టానిష్టములైన వాటిని స్వీకరించుట—మీరు దొంగ అని చెప్పినచోట ప్రతివాది తాను దొంగ ఎట్లు కాడో నిరూపించుకొనక (వాది చెప్పినది అసత్యమని నిరూపింపక) మీరును దొంగయే ననుట. ఇట్టి వచనమున చోరత్వము తన కిష్టములేనిదై యితరులకు ఇష్టమైనదై యుండునని భావించుట. ఇదియే న్యాయదర్శనమున మతానుజ్ఞ అనబడును.

## నిగ్రహస్థానము

65. అథ నిగ్రహస్థానమ్-నిగ్రహస్థానం నామ పరాజయప్రాప్తిః. తచ్చ త్రిరభిహితస్య వాక్యస్యాపరిజ్ఞానం పరిషది విజ్ఞానవత్యాం యద్వా అననుయోజ్యస్యాను యోగోఽనుయోజ్యస్యచానను యోగః, ప్రతిజ్ఞాహానిరభ్యనుజ్ఞాకాలాతీతవచనమహేతవో న్యూనమతిరిక్తం వ్యర్థమపార్థకం పునరుక్తం విరుద్ధం హేత్వన్తరమర్థాన్తరం చ నిగ్రహస్థానమ్.

66. ఇతి వాదమార్గపదాని యథోద్దేశమభినిర్దిష్టాని భవన్తి.

**తాత్పర్యము :** నిగ్రహస్థానము- నిగ్రహస్థానమనగా పరాజయప్రాప్తి. జ్ఞానవతీ పరిషత్తునందు మూడు పర్యాయములు చెప్పిన వాక్యమును గ్రహించలేక పోవుట. లేక అననుయోజ్యమైన దానికి అనుయోగమును చెప్పుట, అనుయోజ్యమైన దానికి చెప్పకుండుట, ప్రతిజ్ఞాహాని, అభ్యనుజ్ఞా, కాలాతీత వచనము, అహేతువులను చెప్పుట, న్యూన, అధిక, వ్యర్థ, అపార్థక, పునరుక్త, విరుద్ధ, హేత్వంతర, అర్థాంతరములు నిగ్రహ స్థానములని చెప్పబడును.

ఈ విధముగా వాదమార్గ పదములు యథోద్దేశ్యముగా చెప్పబడినవి.

**ఆయుర్వేద దీపిక :** పరాజయమునకు కారణము నిగ్రహస్థానము- (నిగ్రహస్య అభిభావస్య పరాజయస్య స్థానమివ-స్థానం కారణమితి నిగ్రహస్థానమ్). జ్ఞానవతీ పరిషత్తునందు సభ్యులు మూడు పర్యాయములు చెప్పిన దానిని గ్రహించి, ప్రతివాది గ్రహించనపుడు అతడు పరాజయమును పొందినట్లగును. అనను యోజ్యమును అనుయోగించుట ఈ మొదలగునవియునూ నిగ్రహ స్థానములే. వీటిని గురించి ఇదివరకే చెప్పబడినది. ఇచ్చట అప్రతిభ (ప్రతిభ లేకుండుట) మొదలైనవి కూడా అంతర్భావములని గ్రహింపవలెను. ఇవి న్యాయదర్శనమున చెప్పబడినవి.

ఆయుర్వేదమునందు అవి ఎక్కువ ఉపయోగపడక పోవుటవలన ఇది వివరింప వలసినదైననూ వివరింపబడలేదు. న్యాయదర్శన వేత్తలకు యిది తెలిసియేయుండును. అది తెలియని వారికి (న్యాయదర్శనము తెలియనివారికి)ని కొంచెముగా వివరించి నప్పటికినీ జ్ఞానమునకు అంతము లేదని ఇంతవరకే చెప్పబడినది.

## వాదవిధానము

67. వాదస్తు ఖలు భిషజాం ప్రవర్తమానో వర్తేతాయుర్వేద ఏవ నాన్యత్ర. అత్ర హి వాక్యప్రతివాక్యవిస్తరాః కేవలాశ్చోపపత్తయః సర్వాధికరణేషు.తాః సర్వాః సమవేక్ష్యావేక్ష్య సర్వం వాక్యం బ్రూయాత్ నాప్రకృతకమశాస్త్రమపరీక్షిత-మసాధ్యకమాకులమవ్యాపకం వా, సర్వం చ హేతుమద్ బ్రూయాత్ హేతుమంతో హ్యకలుషాః సర్వ ఏవ వాదవిగ్రహాః చికిత్సితే కారణభూతాః, ప్రశస్తబుద్ధివర్ధకత్వాత్, సర్వారమ్భసిద్ధిం హ్యావహత్యనుపహతా బుద్ధిః.

**తాత్పర్యము :** వైద్యులు వాదమును చేయవలసి వచ్చినపుడు ఇతర విషయములను గూర్చికాక ఆయుర్వేద విషయము నాధారముగా జేసికొనియే వాదమును చేయవలెను. ఇచట (ఆయుర్వేదమున) వాక్య ప్రతివాక్య విస్తారములు ముఖ్యమైన కారణములు అన్ని అధికరణముల యందును వున్నవి. వాటినన్నిటిని చూచి ఆకళింపు జేసికొని వాద సమయమున పూర్తి వాక్యము పలుకవలెను. సందర్భమునకు పనికిరానిది (కారణము లేనిది). శాస్త్ర సమ్మతము కానిది పరీక్ష చేయబడనిది. అర్థమును సాధించలేనిది, గందరగోళముగా నున్నది (ఆకులము) వ్యాపకము (విస్తారము) కానిదియునునైన వాక్యమును చెప్పరాదు. పూర్తి కారణములతోనే చెప్పవలెను. కారణములతో కూడిన వాక్యములే గొప్ప జ్ఞాన వర్ధకములై తప్పులు లేక చికిత్సా శాస్త్రమునకు అన్నియును కారణ భూతములైయుండును. అనుపహతమైన (మొక్కవోని) జ్ఞానము సర్వకార్యసిద్ధికి తోడ్పడును.

**ఆయుర్వేద దీపిక :** ఇపుడు చెప్పబడుచున్న వాదమునే ఆయుర్వేదాధ్యాయులు చేయవలెను. ఇటువంటి వాదము సరియైన జ్ఞానమును కల్గించునదగుటచే మంచిదిగా గుర్తించబడినది. ఆయుర్వేదమున వాద విషయములెందుకు చెప్పబడినవో వివరించుచున్నాడు. అన్ని అధికరణములయందును అన్నిచోట్ల వున్నవియని అన్వయము. విస్తారము కానిదియైననూ అనుట, చెప్పవలెను అనుదానికి సంబంధము. వాదము-విగ్రహము వాదము ముఖ్యాంశముగా గలవి వాద విగ్రహములు—జల్ప

భేదములు మరియు వితండా భేదములు. మంచి జ్ఞానము కలుగజేయుట వలన వాదము చికిత్సయందెట్లు తోడ్పడునో 'సర్వకార్యసిద్ధి' అనుటద్వారా చెప్పుచున్నాడు. అనుప హతమైన జ్ఞానము కేవలము చికిత్సా సిద్ధినేకాక సర్వ కార్యసిద్ధిని గూడా కల్గించునని యర్థము.

## దశవిధ ప్రకరణములు (పరీక్ష్య విషయములు)

68. ఇమాని ఖలు తావదిహ కానిచిత్ ప్రకరణాని బ్రూమో-భిషజాం జ్ఞానార్థమ్; జ్ఞానపూర్వకం హి కర్మణాం సమారంభం ప్రశంసన్తి కుశలాః;జ్ఞాత్వా హి కారణకరణకార్యయోనికార్యకార్యఫలానుబంధదేశకాలప్రవృత్త్యుపాయాన్ సమ్యగభినిర్వర్తమానః కార్యాభినిర్వృత్తావిష్టఫలానుబంధం కార్యమభినిర్వర్త-యత్యనతిమహతా యత్నేన కర్తా.

**తాత్పర్యము :** వైద్యుల జ్ఞానము కొరకు కొన్ని ప్రకరణలిప్పుడు చెప్ప బడుచున్నవి. జ్ఞాన పూర్వకముగా పనులను చేయబూనుటను విజ్ఞులు మెచ్చుకొందురు. కారణ-కరణ- కార్యయోని-కార్యఫల-అనుబంధ- దేశ-కాల- ప్రవృత్తి-ఉపాయము వీటిని బాగుగా తెలిసికొనిన కర్త (చేయువాడు) కార్యమును చేయుటయందు తన కిష్టమైన ఫలమును అనుబంధమును పొందుటకు పెద్ద ప్రయత్నము లేకయే కార్య మును సాధించును.

**చక్రపాణి :** జ్ఞానవర్ధకమైన తద్విద్య సంభాషా విధిని పేర్కొను సందర్భమున ఆయుర్వేదోపయుక్తములై బుద్ధివర్ధకములైయునూ అగు కారణ కర ణములను పేర్కొనుచున్నాడు. జ్ఞానపూర్వకమనగా చేయవలసిన పనియొక్క విషయమున సంపూర్ణ జ్ఞాన పూర్వకముగా అని అర్థము. తెలిసికొని అనగా వేనిని తెలిసికొని పనులను చేయుటవలన ఆ పనులు బాగుగా అగునో వానిని తెలిసికొని అని అర్థము. ఇష్టమనగా కోరినది. ఫలము అనుబంధమును రాబోవు ఫలమున్నూ అది ఇష్ట ఫలానుబంధము.

### కారణము - వైద్యుడు.

69. తత్ర కారణం నామ తద్యత్కరోతి స ఏవ హేతుః,స కర్తా.

**తాత్పర్యము :** కారణమనగా ఏది చేయవలెనో అది, అదియే కారణము. అది కర్తయును.

ఆయుర్వేద దీపిక : పై చెప్పిన కారణాదులను వివరించుచున్నాడు. యత్ అనుటచే ప్రత్యవమర్శచే కారణము నపుంసకము. చేయును అనగా స్వతంత్ర ముగా చేయును. అందువలన ఇచట కారణ శబ్దముచేత స్వతంత్ర కారణమగు కర్తృ లక్షణము చెప్పబడినది.

కరణము - instrument - ...

70. కరణం పున స్తద్యదుపకరణాయోపపకల్పతే కర్తుః కార్యాభినిర్వృత్తౌ ప్రయత-మానస్య.

తాత్పర్యము : కరణము—కార్యమును చేయు ప్రయత్నమునందు నిమగ్నమైయున్న కర్త దేనిని సాధనముగా జేసికొనునో యది కరణమనబడును.

ఆయుర్వేద దీపిక : కరణమును వివరించుచున్నాడు. ఉపకరణము (సాధనము) కొరకు అనగా కర్త తాను చేయు పనియందు సహాయము కొరకు దేనిని ముఖ్యముగా ఉపయోగించునో యది. కార్యమును చేయుటయందు అనగా కార్యమును పూర్తి చేయు ఉద్దేశ్యమున. యత్నము చేయు అనగా ప్రయత్నము చేయుచున్న దీని వలన ఏది కార్యమున కారణాంతరముచే ప్రేరకమగునో అదియును ఇచట కర్తృత్వము కలిగి కారణ శబ్దమున పిలువబడుచున్నది. ఏది కర్తయొక్క అధీనమున నుండి కార్యసాధనయందు ముఖ్యముగా తోడ్పడునో అది కరణము. కర్తృత్వమునకు ఏది బుద్ధి ప్రయత్నములతో కూడియుండుటచే ఇతర కారణ ప్రేరకమగునో అదియే ముఖ్యము. అచేతనములైన వాటియందు కర్తృత్వ నామధేయము స్వతంత్ర వివక్ష కలిగియుండుటచే ద్యోతకమగును.

కార్యయోని - working point.

71. కార్యయోనిస్తు సా యా వి్క్రియమాణా కార్యత్వమేవాపద్యతే.

తాత్పర్యము : కార్యయోని యనగా వికారములను చెంది కార్య రూపము పొందునది.

చక్రపాణి : కార్యస్యయోని : సమవాయికారణం - కార్యస్యయోనిః- కార్యస్థానము. ఏ స్థానము కారణత్వమున రూపాంతరము చెంది కార్యరూపమును

చెందునో అది కార్యయోని-కార్యస్థానము. ఘటమునకు కార్యయోని మృత్తిక యగును. మృత్తికయే అవస్థాంతరము (రూపాంతరము) చెంది ఘటమగును.

## కార్యము

72. కార్యం తు తద్యస్యాభినిర్వృత్తి మభిసంధాయ ప్రవర్తతే కర్తా.

**తాత్పర్యము :** కర్త దేనిని స్థిరమైన బుద్ధితో చేయునో అది కార్యము.

**ఆయుర్వేద దీపిక :** అభినిర్వృత్తి మభిసంధాయ అనగా కర్తవ్యతా బుద్ధిని స్థిరముగా చేసికొని (పని చేయవలెననెడి దృఢ దీక్షతో).... అని అర్థము.

## కార్యఫలము

73. కార్యఫలం పునస్తత్ యత్ప్రయోజనా కార్యాభినిర్వృత్తిరిష్యతే.

**తాత్పర్యము :** కార్యమును చేయుటయందు ఆశించిన ప్రయోజనము కార్యఫలమగును.

**ఆయుర్వేద దీపిక :** కార్య ఫలమను శబ్దము వలన ఇచట అప్పటి కప్పుడు లభించు ఫలితము అని తెలియవలెను. కుమ్మరివాడు కుండను చేయుటవలన కలుగు కార్యఫలము దానియొక్క మూల్యము ప్రాప్తించుట. అనుబంధము అనునది మున్ముందు రాబోవు ఫలితము-ఈ మూల్యముతో కుటుంబ పోషణము మొదలగునవి జరుగుట.

## అనుబంధము

74. అనుబంధః ఖలు సః యః కర్తారవశ్యమనుబధ్నాతి కార్యాదుత్తరకాలం కార్య నిమిత్తః శుభో వాఽప్యశుభో వా భావః.

**తాత్పర్యము :** కర్తకు అవశ్యముగా అనుబంధించి కార్యము జరిగి కొంత కాలమునకు కలుగు శుభము లేదా అశుభమైన భావము అనుబంధమనబడును.

**ఆయుర్వేద దీపిక :** అనుబంధించి అనగా కొంత కాలము గడచిన పిమ్మట కర్తకు అనుబంధించి జరుగునది. శుభము లేదా అశుభము అనుటవలన

కార్యము శుభమైనపుడు అనుబంధమును శుభమగును. కార్యము శుభమైన యెడల అనుబంధము కూడా అశుభముగా నుండును.

## దేశము

75. దేశ స్త్వధిష్ఠానమ్.

**తాత్పర్యము :** దేశమనగా యధిష్ఠానము (చోటు)

**ఆయుర్వేద దీపిక :** దేశము అధిష్ఠానమనగా-కార్యమునకు అనుగుణ మైనది గానీ అనుగుణము కానిది గానీ యగు ఆధార రూపమైన (కార్యమునకు ఆధారరూపమైన) దేశము.

## కాలము

76. కాలః పునః పరిణామః.,

**తాత్పర్యము :** కాలమనగా పరిణామము.

**ఆయుర్వేద దీపిక :** పరిణామమనగా పరిణామము చెందు ఋతువు మొదలైన రూపములు గల కాలము. ఇందువలన నిత్యగతమైన కాలము. సర్వసాధారణముగా కార్యమునకు అపేక్షణీయము కానందు వలన ఇక్కడ ఉద్దేశింపబడలేదు.

## ప్రవృత్తి

77. ప్రవృత్తిస్తు ఖలు చేష్టా కార్యార్థా సైవ క్రియా, కర్మ, యత్నః, కార్యసమారమ్భశ్చ.

**తాత్పర్యము :** కార్యార్థమునకై చేయు చేష్ట ప్రవృత్తియనబడును. ఇదియే క్రియ, కర్మము, యత్నము, కార్యసమారంభము.

**ఆయుర్వేద దీపిక :** ప్రవృత్తి చేష్టా మొదలైన శబ్దము లొకదానికొకటి పర్యాయపదములే.

## ఉపాయము

78. 'ఉపాయః పునస్త్రయాణాం కారణాదీనాం సౌష్ఠవమభివిధానం చ సమ్యక్, కార్యకార్యఫలానుబంధవర్జ్యానామ్ కార్యాణామభినిర్వర్తకః ఇత్యతస్తూపాయః; కృతే నోపయార్థోఽస్తి న చ విద్యతే తదాత్వే, కృతాశ్చోత్తరకాలమ్ ఫలమ్ ఫలశ్చానుబంధశ్చ ఇతి.

79. ఏతద్దశవిధమగ్రే పరీక్ష్యమ్; తతోఽనన్తరమ్ కార్యార్థా ప్రవృత్తిరిష్టా. తస్మాద్భిషక్కార్యమ్ చికీర్షుః ప్రాక్కార్యసమారమ్భాత్పరీక్షయా కేవలం పరీక్ష్యం పరీక్ష్య కర్మసమారభేత కర్తుమ్.

**తాత్పర్యము :** కారణ కరణ కార్యయోని అను ఈ మూడింటిని సరియైన పద్ధతిలో కావలసినట్లు వినియోగించుటకు చేయునది ఉపాయము. కార్యము, కార్యఫలము, అనుబంధములను వదలి పై మూడు (కారణ, కరణ, కార్యయోని) భావములే కార్యమును చేయునట్టివి. పూర్తియైన కార్యమునకుపాయము అవసరము లేదు. అప్పటికప్పుడు కూడ అది పనికిరాదు. పూర్తియైన పనికి తరువాత కొంత కాలమునకు కలుగు ఫలితమును అనుబంధమందురు. దీనియందును ఉపాయముండదు. ఈ పది విధములైన భావములను మొదట పరీక్షింపవలెను. అటు పైననే ఇష్టమైన కార్యములను చేయ తలపెట్టవలెను. కావున వైద్యమును చేయదలచినవారు మొదట పరీక్ష ద్వారా పరీక్షింపవలెను. పరీక్షించిన తరువాతనే చికిత్సా కర్మలను చేయనారంభింపవలెను....

**ఆయుర్వేద దీపిక :** ఉపాయమును గురించి చెప్పుచున్నాడు. సౌష్ఠవము అనగా కర్త మొదలైనవారు కార్యమును చేయుటకు సరిపడి యుండుట అని అర్థము. అభివిధానము కారణాదులను కార్యాను గుణముగా కావలసిన స్థితిలో నుంచుట. యెట్లనగా శిరోవిరేచనమును చేయు ఔషధము నుపయోగించిన విధముగా కొందరికి చూర్ణరూపమున, ఇంకొందరికి స్వరస రూపమున ఇచ్చుట - ఇదంతయును బట్టలను నేయువాడు దారమును బట్టి సరిగా వచ్చునట్లు అమర్చుకొన్నట్లుండవలెను. ఇట్టిసరిగా అమర్చునుపాయము కార్య కార్యఫల అనుబంధములకు కాక కరణ, కారణ, కార్య యోనులకు మాత్రమే వర్తించునని తెలియవలెను. ఉపాయము లేకుండా కారణాదులు కార్యమును నిర్వర్తింపజాలవు. అటుపైన కార్యాదుల యందు ఉపాయము సంభవింపకుండుటను గూర్చి వివరించుచున్నాడు. ఉపాయము కారణమును చేయునది. ఉత్పన్నమైన కార్యమునందు ఉపాయము వుండదు. జరిగిపోయిన కార్యము తిరిగి చేయబడుటయూ జరుగదు. అందువలన కార్యోత్పత్తియైన పిదప ఉపాయమును స్వీకరించుట జరుగదు. ఉత్పన్నము కాని కార్యము ఉపాయ రూపము వుండదు అని చెప్పుచున్నాడు. అప్పటికప్పుడు అనగా కార్యము జరుగుటకు ముందు కార్యమే వుండదు. అందువలన అపుడును ఉపాయముండదని భావము. ఉపాయముతో కూడిన కార్యము లేనందున కార్యోత్పత్తియైన పిదప తజ్జన్యములైన కార్య

ఫలము అనుబంధములకును ఆ ఉపాయము వర్తించదు అని "కృతాత్ప్రోత్తర కాలమ్...." అను వాక్యము ద్వారా చెప్పుచున్నాడు. తరువాతి సూత్రమున పరీక్షా విధి విషయమును ఉపసంహరించుచున్నాడు.

## ప్రశ్నించు విధానము

80. తత్ర చేద్భిషగభిషగ్వా భిషజం కశ్చిదేవం ఖలు పృచ్ఛేత్. వమన విరేచనా-స్థాపనానువాసనశిరోవిరేచనాని ప్రయోక్తుకామేన భిషజా కతి విధయా పరీక్షయా కతివిధమేవ పరీక్ష్యమ్, కశ్చాత్ర పరీక్ష్యవిశేషః,కథం చ పరీక్షితవ్యః,కిం ప్రయోజనా చ, పరీక్షా, క్వ చ వమనాదీనాం ప్రవృత్తిః,క్వ చ నివృత్తిఃప్రవృత్తినివృత్తిలక్షణసంయోగే చ కిం నైష్ఠికమ్ కాని చ వమనాదీనాం భేషజద్రవ్యాణి ఉపయోగం గచ్ఛంతీతి.

**తాత్పర్యము :** వైద్యుడుగానీ, అవైద్యుడు గానీ ఒక వైద్యునితో ఈ క్రింది విషయములను గూర్చి ప్రశ్నింప వలయును. వమన విరేచన ఆస్థాపన అనువాసన శిరో విరేచన (నస్య)ములను ప్రయోగింపదలచిన వైద్యుడు ఎన్ని విధములైన పరీక్ష్య విషయములను ఎన్ని విధములుగా పరీక్షింపవలయును? ఆ స్థితుల యందు పరీక్షింపవలసిన విషయమేమై యుండును? దానిని ఎట్లు పరీక్షింప వలయును? పరీక్ష వలన కలుగు ప్రయోజనమేమి? వమనాదుల ప్రవృత్తి నివృత్తి లక్షణములున్నపుడే నిశ్చయమును చేయవలెను? ఏ ఏ ఔషధములు వమనాది కర్మలకు పనికి వచ్చును?

**ఆయుర్వేద దీపిక :** పై చెప్పిన కారణాది పది పరీక్ష్యాంశములను వైద్యునకుపయుక్తముగా నుండుటకై దృష్టాంతము ద్వారా చూపుటకు ఈ ప్రకరణము ఆరంభింపబడినది. అవైద్యుడుగానీ అనగా కొంచెము వైద్య శాస్త్రము తెలిసినవాడని యర్థము. పరీక్ష్యము ఎన్ని విధములు అనగా పరీక్షింపవలసిన విషయములు ఎన్ని విధములు? ప్రవృత్తి నివృత్తి లక్షణ సంయోగమనగా ప్రవృత్తికి అనుగుణములైన నివృత్తికి అనుగుణములైన లక్షణము ఒక్కచోట కలిసియుండు సమయము నైష్ఠికమనగా-నిష్ఠ-నిశ్చయము దానివలన కలుగునది నైష్ఠికము. నిశ్చయముగా చేయవలసినదియని అర్థము.

## సమాధానమిచ్చు విధానము

81. స ఏవం పృష్టో యది మోహయితుమిచ్ఛేత్-బ్రూయాదేనమ్ బహువిధా పరీక్షా తథా పరీక్షవిధిభేదః, కతమేన విధిభేదప్రకృత్యన్తరేణ భిన్నయా పరీక్షయా కేన వా విధిభేదప్రకృత్యన్తరేణ పరీక్ష్యస భిన్నస్య భేదాగ్రం భవాన్ పృచ్ఛత్యాఖ్యాయమానమ్,నేదానీం భవతోఽన్యేన విధి భేద ప్రకృత్యన్తరేణ భిన్నయా పరీక్షయాఽన్యేన వా విధిభేదప్రకృత్యంతరేణ పరీక్ష్యస్య భిన్నస్యాభిలషితమర్థం శ్రోతుమహామన్యేన పరీక్షా విధి భేదాన్యేన వా విధిభేదప్రకృత్యన్తరేణ పరీక్ష్యం భిత్వాఽన్యథాఽఽచక్షాణ ఇచ్ఛాం పూర యేయమితి.

**తాత్పర్యము :** ఈ విధముగా ప్రశ్నించినపుడు అతనిని భ్రమింప జేయు (మోహింపజేయు) ఉద్దేశ్యమున్నచో అతనితో నిట్లనవలెను. పరీక్షలు అనేక విధ ములు. అట్లే పరీక్షించు విధులును అనేకములు. ఇందు మీరు ఎటువంటి విధి భేద కారణాంతరముల వలన భిన్నమైన పరీక్ష చేత ఎటువంటి విధి భేధ కారణాంత రముల వలన భిన్నమైన పరీక్ష్య అంశము యొక్క భేద పరిమాణమును తెలుసు కొనగోరుచున్నారో చెప్పవలసినది. ఇపుడు మీరు అన్యమైన విధి భేధ కారణాంత రములచే భిన్నమైన పరీక్ష ద్వారా అన్య భేద కారణాంతరములచే భిన్నమైన విషయ మును నేనూహించుచున్న వేరు పరీక్షా విధి చేత విధి భేద కారణాంతరములచే పరీక్ష్య విషయమును భేదించి వేరుగా చెప్పలేక మీ ఇచ్ఛను పూర్తి చేయలేను.

**ఆయుర్వేద దీపిక :** మోహింపచేయదలచినచో అనగా విగృహ్య సంభాషణము చేత మోహింప భ్రమింప జేయదలచినచో అని యర్థము. అట్లే అనగా బహువిధమైన అని అర్థము. విధి రూపమైన భేదము విధి భేదము. దాని ప్రకృత్యం తరమనగా కారణాంతరము భేదాగ్య మనగా భేధ పరిమాణము. ఇక్కడ భేద పరిమాణ మనగా భేద సంఖ్యా పరిచ్ఛేదమే యని గ్రహింపవలెను. ఇప్పుడు కాదు అనుట వలన మీరెందు కిట్లనుచున్నారో తెలిసి కొనగోరుచున్నానని యర్థము. మీరు వేరొక రకముగా వినగోరు అర్థమును ఇంకొక రకముగా చెప్పుచున్న నేను మీ కోర్కెను పూర్తి చేయ లేను. అందువలన మీరే కావలసిన విషయమును విశేషించి యడుగవలసినదని వాఖ్యార్థము. నేదానీం న 'పూరయేయమ్' అనియు పాఠము. అట్టి సందర్భమున 'నేదానీం' అనుదానికి కోరుచున్న కోర్కెను పూరించలేననుట యోజ్యము. లేదా న

(లేదు) అనునది ముందుగా కలుపవలసి యుండును. అందువలన ఎటువంటి విధి భేద కారణాంతములచే భిన్నమైన వానిని మీరు కోరుచున్నారు. లేదా ఎటువంటి విధి భేద కారణాంతరములచే భిన్నమైన దానిని కోరుట లేదు ? అని అన్వయించు కొన వలెను. శంకతో కూడిన వాక్యమును విశేషముగా ప్రశ్నించినపుడు ప్రుచ్ఛకుడు వ్యాకులమగునని భావము. పరీక్ష్య విషయమును మీరు వినగోరి వేరుగా చెప్పవలె నని భావము (దేనిని వినగోరుచున్నారో దానిని ఖచ్చితముగా చెప్పవలెను.)

82. స యదుత్తరం బ్రూయాత్తత్సమీక్ష్యోత్తరం వాచ్యం, స్యాద్యథోక్తంచ ప్రతి వచనవిధిమవేక్ష్య, సమ్యగ్యది తు బ్రూయాత్,న చైనం మోహయితు మిచ్ఛేత్, ప్రాప్తం తు వచన కాలం మన్యేత కామమస్మై బ్రూయాదాప్తమేవ నిఖిలేన.

**తాత్పర్యము :** ప్రతివాది ఈ విషయమున సమాధానమును చెప్పినచో దానిని చక్కగా పరిశీలించి ప్రతివచన విధి ననుసరించి జవాబు చెప్పవలెను. అతడు సరిగా చెప్పినపుడు వానిని మోహింపజేయ తలపరాదు. సమాధానము చెప్పు సమయ మును చూచి అతడడిగిన దానికి అంతయును సత్యమే చెప్పవలయును.

**ఆయుర్వేద దీపిక :** దానిని సమీక్షించి అనగా అతడు చెప్పినది ఉప యుక్తమా కాదా అని సమీక్షించి (ఉపయుక్తమైనపుడు) ప్రతివచన విధి యనునది ఈ అధ్యాయమునందే విగృహ్య సంభాషయందు చెప్పబడినది. సరిగా అడిగినచో అనునది పక్షాంతరము. ఇది సంధాయ సంభాషకు సంబంధించినది. ప్రాప్తమనగా ఉచితము. అనుచిత వచన కాలము సంధ్యాదులు. అప్పుడు వాదమునకు పనికిరాదు. ఆప్తమేవ అనగా యథార్థమునేయని యర్థము.

## పరీక్ష రెండు విధములు-ప్రత్యక్షము, అనుమానము, ఆప్తోపదేశముతో కలసి మూడు విధములు

83. ద్వివిధా తు ఖలు పరీక్షా జ్ఞానవతాం ప్రత్యక్షమనుమానం చ;ఏతద్ద్వయ-ముపదేశశ్చ పరీక్షాస్యాత్;ఏవ మేషా ద్వివిధా పరీక్షా,త్రివిధా వా సహోప దేశేన.

**తాత్పర్యము :** జ్ఞానవంతులకు పరీక్ష యనునది రెండు విధములు. ప్రత్యక్షము మరియు అనుమానము. ఈ రెండింటితోనే పరీక్ష జరుగును. ఇట్లు పరీక్ష రెండు విధములు లేదా ఆప్తోపదేశముతో కూడి మూడు విధములు.

**ఆయుర్వేద దీపిక :** మొదట ప్రశ్నించినపుడు యథాక్రమముగా ప్రత్యక్షానుమానములతో సమాధానమివ్వవలెనని చెప్పుచున్నాడు. జ్ఞానవంతులనగా ఆప్తోపదేశ రూపశాస్త్ర జనితమైన జ్ఞానము కలవారు. ఇదియే అనుటచే పక్షాంతరమునుపరీక్షా త్రైవిధ్యమును చెప్పుచున్నాడు. ఈ పరీక్ష ద్వైవిధ్య-త్రైవిద్యములు త్రివిధరోగ విజ్ఞాన అధ్యాయమునందు చెప్పబడినవి.

84. దశవిధం తు పరీక్ష్యం కారణాది యదుక్తమగ్రే.తదిహ భిషగాదిషు సంసార్య సందర్శయిష్యామః-ఇహ కార్యప్రాప్తేః కారణం భిషక్,కారణం పునర్భేషజమ్, కార్యయోనిర్ధాతువైషమ్యం, కార్యఫలం సుఖావాప్తిః,అనుబంధస్తు ఖల్వాయుః దేశో భూమిరాతురశ్చ,కాలః పునఃసంవత్సరాశ్చాతురావస్థా చ ప్రవృత్తిః ప్రతికర్మసమారంభః ఉపాయస్తు భిషగాదీనాం సౌష్ఠవమభివిధానం చ సమ్యక్:ఇహోప్యస్యోపాయస్య విషయః పూర్వేణైవోపాయవిశేషేణ వ్యాఖ్యాతః:ఇతి కారణాదీని దశ దశసు భిషగాదిషుసంసార్య సందర్శితాని. తథైవానుపూర్వ్యేతద్దశవిధం పరీక్ష్యముక్తమ్.

**తాత్పర్యము :** పరీక్ష్య విషయము పదివిధములు (కారణాదులు) అని మొదట చెప్పబడినది. దానిని భిషగాదులయందు ఉపయుక్తములైన ఉదాహరణములను చూపి చెప్పుకొందము. కార్యప్రాప్తియందు కారణము-వైద్యుడు; కరణము-ఔషధము, కార్యయోని-ధాతువైషమ్యము; కార్యము ధాతుసామ్యము; కార్యఫలము-సుఖప్రాప్తి (ఆరోగ్యము), అనుబంధము-ఆయువు (దీర్ఘాయుపు) దేశము-భూమి మరియు రోగి, కాలము-సంవత్సర భేదము మరియు రోగి అవస్థ (వయస్సు-దోషావస్థ) ప్రవృత్తి-కర్మను చేయు ప్రయత్నము, ఉపాయమనునది-కారణాదిత్రయము సరిగా అమర్చుకొనుట, ఇచట చెప్పిన ఉపాయ విషయము ముందుగనే విశేషముగా చెప్పబడినది. ఇట్లు కారణాది పది విషయములను భిషగాది పది అంశములయందును ఉదాహరణముగా చూపడమైనది. ఈ విధముగా కారణాదులను భిషగాదులయందు అనుపూర్వీకరించి పరీక్ష్యముగా చెప్పడమైనది.

**ఆయుర్వేద దీపిక :** భిషగాదిషు సంసార్య అనగా భిషక్ మొదలైన వాటిని ఉపయుక్తములైన ఉదాహరణలను చేసి, ధాతువైషమ్యమనగా - విషమత్వము నొందిన ధాతువులు. ధాతువులే విషమావస్థను వదలి సమానావస్థను పొందుట ఆరోగ్యమను ధాతు సామ్యమునకు సమవాయి కారణమగుట వలన కార్యయోని యగు చున్నవి. సుఖవాప్తి యనగా ఆరోగ్య ప్రాప్తి, "సుఖసంజ్ఞకమారోగ్యమ"ని సూత్రస్థానము నందలి 9వ అధ్యాయమున చెప్పబడినది. ఆయువు అనుబంధ ఫల రూపము. అది రోగ గతమై వైద్యుని యందు లేక పోయినప్పటికీ వైద్యుడు దానిని కోరుటచేత (కార్య ఫల అనుబంధములు) వైద్యగతములుగనే గుర్తింపబడును. ఇందువలన కర్తను అభిప్రాయముగా జేసికొని చెప్పబడినది. జరిగినది. కర్తయనగా నిచట వైద్యుడు. అందుచేత ఆయువు ఆతురగతమైనదైననూ వైద్యుడు దానిని కోరుటచే వైద్యునకు కలుగు ఫలముగనే తెలియవలెను. ప్రతికర్మ - చికిత్స. ఇచటనూ కార్య ఫల అనుబంధములకు వ్యతిరేకములైన కారణముల యొక్క సరియగు అను రీక యథోక్త న్యాయముగా ఉపాయమగునని చూపుచున్నాడు.

85. తస్య యో యో విశేషో యథా యథా చ పరీక్షితవ్యః, స తథా తథా వ్యాఖ్యాస్యతే.

## వైద్య లక్షణము

86. కారణం భిషగిత్యుక్తమగ్రే—తస్య పరీక్షా—భిషఙ్నామ యో భిషజ్యతి యః సూత్రార్థప్రయోగకుశలః యస్య చాయుః సర్వథా విదితం యథావత్. స చ సర్వధాతుసామ్యం చికీర్షన్నాత్మానమేవాదితః పరీక్షేత గుణిషు గుణతః కార్యాభినిర్వృత్తిం పశ్యన్: కచ్చిదహమస్య కార్యస్యాభినిర్వర్తనే సమర్థో న వేతి; తత్రేమే భిషగ్గుణాః యైరుపపన్నో భిషగ్ధాతుసామ్యాభినిర్వర్తనే సమర్థో భవతి: తద్యథా-పర్యవదాతశ్రుతతా, పరిదృష్టకర్మతా, దాక్ష్యం, శౌచం, జితహస్తతా, ఉపకరణవత్తా, సర్వేంద్రియోపపన్నతా, ప్రకృతిజ్ఞతా ప్రతిపత్తిజ్ఞతా చేతి.

**తాత్పర్యము :** ఏ ఏ విశేషమును ఎట్లు పరీక్షింపవలసి యుండునో అది అట్లే (ఆ విధానము) వ్యాఖ్యానింపబడుచున్నది.

వైద్యుడే కారణమని మొదట చెప్పబడినది. వైద్య పరీక్ష ఇప్పుడు చెప్ప

బడుచున్నది. చికిత్స ద్వారా రోగము పోగొట్టు వానిని వైద్యుడందురు. (యో భిష జతి స భిషక్). ఎవడు చికిత్స చేయునో, ఎవరు ఆయుర్వేద సూత్రము నందలి విష యములను ప్రత్యక్షముగా ప్రయోగించుట యందు కుశలత గలవాడో, ఎవరు ఆయుష్షు అన్ని విధములుగను పున్నది పున్నట్లుగను తెలిసి యుండునో అతడు వైద్యుడు. అతడు రోగులందరి యందును, ధాతు సామ్యమును కోరియున్నచో ముందుగా తన్నుతాను పరీక్షించుకొనవలెను. తాను చేయు పనుల యందలి గుణములను తన గుణములతో కార్య సాధనను దృష్టిలో నుంచుకొని తానీ పనిని పూర్తి చేయుటకు సమర్థుడా కాదా యని పోల్చి తెలిసికొనవలెను. ఈ వైద్య గుణములున్న వైద్యుడు ధాతు సామ్యమును తెచ్చుటకు సమర్థుడగును. అవి - శాస్త్రమును బాగుగా విని (చదివి) యుండుట, చికిత్సా కర్మలను స్వయముగా చూచి యుండుట, ఓర్పు, పరి శుభ్రత, జితహస్తతా (తన మనస్సున కనుగుణముగా హస్తములు పనిచేయుట) చికిత్సా ప్రక్రియలకు కావలసిన ఉపకరణములు కలిగి యుండుట, అన్ని ఇంద్రియ ములు సరిగా పనిచేయుట, (రోగమునకు, ఆరోగ్యమునకును) కారణములను తెలిసి యుండుట, ఆపదల యందు సమయస్ఫూర్తితో మెలగుట అనునవి.

ఆయుర్వేద దీపిక : పరీక్ష్య విశేషమేది? ఎట్లుదానిని పరీక్షింపవల యును ? అను నీ రెండు ప్రశ్నలకును ఉత్తరము నిచ్చుచున్నాడు. ఏ ఏ విశేషము లనగా - కారణాదులకు ఏ ఏ చికిత్సా కర్మలను ప్రత్యక్షముగా చూచి యుండుట మొదలైన వైద్యుడు - రోగి వీరికి సజాతీయమగుట వలన మరియు ఔషధాదులకు విజాతీయమగుట వలన విశేషమని యర్థము. ఎట్లు పరీక్ష చేయవలెననునది దీనికి నేను సమర్థుడనా కాదా యను ఉదాహరణము ద్వారా తెలియపరచబడినది. భిషజ్యతి అనగా చికిత్సతి—చికిత్స చేయువాడు. అన్ని విధముల అనగా హితాయు—అహితాయు— సుఖాయు—దుఃఖాయువులనన్నింటినీ. ధాతుసామ్యమునకు కారణము ఇచట వైద్యుడు. ఇది ఇతరుల ద్వారా పరీక్షింపవలసిన భావముకాక తన్ను తానుగా పరీ క్షించు కొనవలసినదై యున్నది. గుణేషు—గుణేతః అను వాక్యముల ద్వారా తన్ను తానెట్లు పరీక్షించు కొనవలెనో చెప్పుచున్నాడు. తన్ను తాను గుణములు (వైద్యగుణ ములు) కలిగి యుండుటను పరీక్షించు కొనవలెను. గుణేతః అను శబ్దము "హేతువు నందు పంచమీ విభక్తి. కచ్చిత్ అనునది ఇచ్చను తెలియజేయుట యందు ప్రయో గించబడినది. ప్రవిభక్తముగా వచ్చిన ఆపత్తులయందు వెంటనే చేయవలసినది చేయుట.

## భేషజ లక్షణములు

87. కరణం పునర్భేషజమ్. భేషజం నామ తద్యదుపకరణాయోపకల్పతే భిషజో ధాతుసామ్యమభినిర్వృత్తౌ ప్రయతమానస్య విశేషతశ్చోపాయాన్తే-భ్యః తద్ ద్వివిధమ్ వ్యపాశ్రయ భేదాత్. దైవవ్యపాశ్రయం యుక్తివ్యపా-శ్రయం చేతి.తత్ర దైవవ్యపాశ్రయం మంత్రౌషధి మణిమంగళబల్యుపహార హోమనియమప్రాయశ్చిత్తోపవాసస్వస్త్యయనప్రణిపాతగమనాది, యుక్తి వ్యపాశ్రయం-సంశోధనోపశమనే చేష్టాశ్చదృష్టఫలాః ఏవచ్చైవ భేషజమఙ్గ భేదాదపి ద్వివిధం-ద్రవ్యభూత-మద్రవ్యభూతం చ.తత్ర యద ద్రవ్య భూతం తదుపాయాభిప్లుతమ్, ఉపాయో నామ భయదర్శనవిస్మాపనవిస్మారణ క్షోభణహర్షణభర్త్సనవధబన్ధ స్వప్నసంవహనాదిరమూర్తో భావవిశేషో యథోక్తాః సిద్ధ్యుపాయాశ్చోపాయాభిప్లుతా ఇతి. యత్తు ద్రవ్యభూతం తద్వమనాదిషు యోగముపైతి తస్యాపీయం పరీక్షా-ఇదమేవం ప్రకృత్యా ఏవం గుణమేవం ప్రభావమస్మిన్ దేశే జాతమస్మిన్నృతావేవం గృహీతమేవం నిహితమేవ ముపస్కృతమనయా చ మాత్రయా యుక్తమస్మిన్ వ్యాధావేవం విధస్య పురుషస్యైతావంతం దోషమపకర్షత్యుపశమయతి వా యదన్యదపి చైవం విధం భైషజమభూత్తచ్చానేన విశేషేణ యుక్తమితి.

**తాత్పర్యము :** కరణము (సాధనము) భేషజము (ఔషధము). భేషజ మనగా వైద్యుడు ధాతుసామ్యమునకై ముఖ్యముగా కార్యయోని, ప్రవృత్తి దేశ కాల ఉపాయములను సాధనములను తనకుపకరించునట్లు చేసికొనుట. వ్యపా శ్రయము భేదము వలననిది రెండు విధములు. దైవ వ్యపాశ్రయము మరియు యుక్తివ్యపాశ్రయము. దైవవ్యపాశ్రయమున - మంత్ర-ఔషధి - మణిధారణము - మంగళవాచనము - బలి - ఉపహారము - హోమము - నియమము - ప్రాయ శ్చిత్తము - ఉపవాసము - స్వస్తి వాచనము - ప్రణిపాతము (ప్రాణాయామము చేయుట) గమనము (తీర్థయాత్రలు) మొదలగునవి వుండును. యుక్తి వ్యపాశ్రయములు. సంశో ధనము (వమన విరేచనాదులు) ఉపశమనము(దీపన పాచనాది ఔషధముల నిచ్చుట) మరియు ఫలితము నిచ్చు ఇతర క్రియలు. ఇదే భేషజము మరల అంగభేదము చేత రెండు విధములై యున్నది. అద్రవ్యభూతమనునది ఉపాయములచే (ద్రవ్యములు లేకుండా) చేయునది. ఉపాయములనగా భయపెట్టుట, మరపింపచేయుట, ఆశ్చర్య పరచుట, కోపపెట్టుట, సంతోషింపచేయుట, నిందించుట, వధింతునని భయపెట్టుట

(లేదా రోగిముందు జంతువులను వధించుట) కట్టివేయుట, నిద్రపుచ్చుట, సంవహనము (నెమ్మదిగా కాళ్ళను వత్తుట) మొదలైన అమూర్త భావ విశేషములు (అమూర్తములనగా ద్రవ్యత్వము లేనివి రోగికి త్రాగించుటకుగానీ, తినిపించుటకు గానీ ఏమియును ఇవ్వబడవు) మరియు ఇతరములైన సిద్ధని కలిగించు ఉపాయములు, ఉపాయముతో కూడిన పనులు. ద్రవ్యభూతమనునది వమనాదుల యందు ఇవ్వబడుచున్నది. దానికిన్నీ పరీక్ష గలదు. యెట్లనగా ఈ ఔషధము ఈ కారణము చేత, ఈ గుణమును కలిగి, ఈ విధమైన ప్రభావముతో నున్నది. ఫలానా దేశము నందు ఉద్భవించినది. ఫలానా ఋతువునందు ఈ విధముగా ఇది గ్రహింపబడినది. ఈ విధముగా ఇది ఉంచబడినది. ఈ ప్రకారముగా ఇది సంస్కరింపబడినది. దీనిని ఈ ప్రమాణమునందు ఇవ్వవలెను. ఫలానా వ్యాధియందు ఇటువంటి పురుషునికి ఇంత సమయమున దోషమును పోగొట్టును లేదా శమింపజేయును అను వివరమును తెలియుట. వేరేదైనసూ ఇటువంటి కార్యమును చేయునెడ దానిని కూడా పై పరీక్షకు పెట్టి వివరమును తెలియవలెను.

ఆయుర్వేద దీపిక : విశేషముగా ఉపాయాంతములకు అనుటచే కార్యయోని ప్రవృత్తి దేశ కాల ఉపాయములకు భిన్నమై కర్తకు సాధనమగునది అది కరణము అని చూపుచున్నాడు. కార్యయోనియే లోకమున విశిష్టముగా కార్యమును చేయుటవలన సాధకతమై కరణముకంటె వేరుగా చెప్పబడినది. ప్రవృత్తి ఉపాయములు కర్తయే. చేయదగిన ధర్మమును కలిగి యుండుటచే వీనికి కరణ సంజ్ఞను ఇవ్వలేదు. దేశకాలములు సాధకతమములు కావు. అందువలన ఉపాయాంతములకు, (కార్యయోని, ప్రవృత్తి, దేశ, కాల, ఉపాయములకు) చెప్పబడిన విశేషత్వము వలన ఏది కర్తకు ఉపకరణమగునో అది కరణము. దైవవ్యపాశ్రయ యుక్తి వ్యపాశ్రయ మను భేషజ ద్వైవిధ్యమున సత్వావజయముగూడ గ్రాహ్యము. సత్వావజయమే యుక్తి వ్యపాశ్రయమున దృష్టముగను, దైవవ్యపాశ్రయమున అదృష్టముగను ఉపకరించును. అందువలననే యుక్తి వ్యపాశ్రయమును విశదీకరించునపుడు 'ఫలితముల నిష్పు చేష్టలును' అని చెప్పబడినది. చేష్టా శబ్దముచేత మనోచేష్టయును సత్వావ జయ లక్షణమని తెలియవలెను. ప్రకారాంతరమున అంగ భేదముచేత తిరిగి ఔషధ ద్వైవిధ్యమును తెల్పుచున్నాడు. అంగమనగా శరీరరూపమైన స్వరూపము (ఆకారము). అందుచే అంగభేదము వలన అనగా స్వరూప భేదమువలన అని అర్థము. ద్రవ్యభూతమనగా ద్రవ్యరూపము. ఇట్లే అద్రవ్యరూపము ఉపాయాభిప్లుతమనగా ఉపాయ

వ్యాప్తము లేదా ఉపాయ గ్రహణము వలన తీసికొనబడినదని అర్థము. అమూర్తములైన (ఆకారము లేని) భయాదులు సాక్షాత్తూ ఆరోగ్యమునకు కారణము కాదని అనుకొనుట కద్దు. అట్లయినచో శరీరమునందే ఉన్న వాతాదులను ఆరోగ్య మిచ్చునట్లు సమత్వమునకు తెచ్చునది యేది? అమూర్తములైనవి మూర్తములైన ధాతువుల ఉత్పత్తియందు సమవాయి కారణములు కావు. ద్రవ్యభూతమైన భేషజము ద్రవ్యభూతమైన శరీరోత్పత్తియందు సమవాయి కారణమే యగును. అందువలన ఆరోగ్యసాధనకు సాధక తమము అనునది బాగుగా నున్నది. అమూర్తములైన భయాదుల ఉపాయత్వము స్థూలబుద్ధిచేత భేషజము కూడ అని భయాదుల యందు కూడ భేషజవ్యవహారము ఆచార్యుల అభిమతమును ద్వివిధ భేషజార్థమున అద్రవ్యభూతమైన భయాదులను గ్రహించుటచే తెలియవచ్చును. కేవలము అద్రవ్య భూత భేషజమే ఉపాయముతో కూడుకొన్నట్టిదికాదు. కాని ఇతరములైన ఉపాయ గ్రహణ గృహీతములైన పరిచారకాదులుకూడా అని- యథోక్త సిద్ధ్యుపాయములుగా చెప్పుచున్నాడు. యథోక్త సిద్ధ్యుపాయములైన పరిచారకాదులు ఇచట దశవిధ పరీక్ష యందు సాక్షాత్తూ చెప్పకపోయినప్పటికీ ఇవియును ఉపాయమునందు అంతర్లీనములే యని యర్థము. లేదా ఉపాయాభిప్లుతమనగా ఉపాయముతో కలసియున్న అచట భయాది అమూర్త భేషజములే యథోక్త ఉపాయములు, కారణాదులు సరియైన అమరికను తెలుపునట్టివి, అద్రవ్యభూత భేషజ పక్షమున గ్రహింపబడినవి అని యర్థము. అందువలన భయాదులయందును ఉపాయ శబ్దమును పేర్కొనుట యందు అద్రవ్యభూత భేషజ శబ్ద ప్రయోగముగునని చూపుచున్నాడు. "ఉపాయాన్త్వభిప్లుతమ్" అను పాఠమును ఒప్పుకొనువారు "దేశకాలములే అద్రవ్య భూత భేషజమని" చెప్పుదురు. ఇంకను ద్రవ్య శబ్దముచే క్వాథ కల్కాది ఉపయోజ్య ద్రవ్యము 'ద్రవ్యము' అనబడును అనియు చెప్పుదురు. ఇది అంతగా బాగుండలేదు. అనేన అనగా సాధనభూతమైన దానితో "ఈ విధమైన పురుషునికి" ఈ వాక్యము ద్వారా చెప్పబడిన విశేషముతో కలిసి యుండును అని అర్థము.

## కార్యయోని-ధాతు వైషమ్య లక్షణము

88. కార్యయోనిర్ధాతు వైషమ్యం, తస్య లక్షణం వికారాగమః పరీక్షాత్వస్య వికార ప్రకృతేశ్చైవోనాతిరిక్తలిఙ్గ విశేషావేక్షణం వికారస్య చ సాధ్యాసాధ్య మృదుదారుణలిఙ్గ విశేషావేక్షణ మితి.

**తాత్పర్యము :** కార్యయోని ధాతువైషమ్యము. దాని లక్షణము వికారము కల్గుట. దీని పరీక్ష రోగ ప్రకృతులందు అధికమైన హీనమైన లక్షణము లుండుట. మరియు రోగముల సాధ్యసాధ్యత్వము మృదు దారుణత్వము ఈ లక్షణము లుండుట.

**ఆయుర్వేద దీపిక :** ధాతువైషమ్యము యొక్క ప్రత్యాత్మ రూపము లక్షణమని చెప్పబడినది. వికార ప్రకృతి యొక్క అనగా వికార కారణములైన దోషములయొక్క అని అర్థము.

## కార్యము - ధాతుసామ్య లక్షణము

89. కార్యం ధాతుసామ్యం, తస్య లక్షణం వికారోపశమః. పరీక్షా త్వస్య రుగుపశమనం, స్వరవర్ణయోగః. శరీరోపచయో, బలవృద్ధిః, అభ్యవహార్యాభిలాషో, రుచిరాహారకాలే, అభ్యవహృతస్య చాహారస్య కాలే సమ్యగ్జరణం నిద్రాలాభో యథాకాలం వైకారికాణాం చ స్వప్నానామదర్శనం సుఖేన చ ప్రతిబోధనం వాతమూత్రపురీషరేతసాంముక్తిశ్చ సర్వాకారైర్మనోబుద్ధీన్ద్రియాణాం చావ్యాపత్తిరితి.

## కార్య ఫలము - సుఖావాప్తి లక్షణము

90. కార్యఫలం సుఖావాప్తిః, తస్య లక్షణం మనోబుద్ధీంద్రియశరీరతుష్టిః.

## అనుబంధము - ఆయువు యొక్క లక్షణము

91. అనుబంధస్తు ఖల్వాయుః తస్య లక్షణం ప్రాణైః సహ సంయోగః....

**తాత్పర్యము :** కార్యము - ధాతు సామ్యము (ఆరోగ్యము) దాని లక్షణము వికారోప శమనము. దాని పరీక్ష - రోగము తీసివేయబడుట. స్వరము-శరీర వర్ణము బాగుగా నుండుట, శరీర వృద్ధి, బలవృద్ధి, తినుట యందు అభిలాష, ఆహారమును తినునప్పుడు రుచి కల్గుట (తెలియుట). తినిన ఆహారము తగిన సమయమున జీర్ణమగుట, కాలము ననుసరించి నిద్ర కలుగుట, వికృతమైన స్వప్నములను చూడకుండుట, సుఖముగా నిద్రనుండి మేల్కొనుట, వాత మూత్ర పురీష రేతస్సులు యథా కాలమున వెలువడుట మరియు మనో బుద్ధీంద్రియములు శుభ లక్షణములతో కూడి వ్యాపత్తు చెందకుండుట అనునవి. (ఇవి స్వస్థ లక్షణములు). కార్య ఫలము -

సుఖప్రాప్తి (ఆరోగ్య ప్రాప్తి) దాని లక్షణము మనో బుద్ధీంద్రియ శరీరములకు సంతోషము కలుగుట.

అనుబంధమనగా ఆయుపు (దీర్ఘాయువు). దాని లక్షణము ప్రాణములతో నుండుట.

ఆయుర్వేద దీపిక : సర్వాకారైః అనగా సర్వ శుభ లక్షణములతో - సుఖ ప్రాప్తియనగా ఆత్మ గుణమైన సుఖప్రాప్తి. ప్రాణములతో సంయోగము అనగా ప్రాణ వాయువు శరీరము నందుండుట. అందువలన ప్రాణ శబ్దము ఆయుష్షునకు భిన్నమైనదగుటచే వీటికి లక్ష్య లక్షణ సంబంధమైన భేదము గలదు

## దేశ ద్వైవిధ్యము

92. దేశస్తు భూమిరాతురశ్చ.

93. తత్ర భూమిపరీక్షా ఆతురపరిజ్ఞానహేతోర్వా స్యాదౌషధపరిజ్ఞానహేతోర్వా తత్ర తావదియమాతురపరిజ్ఞానహేతోః, తద్యథా-కస్మిన్నయం భూమిదేశే జాతః సంవృద్ధో వ్యాధితో వేతి.తస్మింశ్చభూమిదేశే మనుష్యాణామిదమాహార-జాతమిదం విహారజాతమిదమాచారజాతమేతావచ్చబలమేవం విధం సత్త్వ-మేవం విధం సాత్మ్యమ్ ఏవం విధోదోషః భక్తిరియమిమే వ్యాధయో హిత-మిదమహితమిదమితి ప్రాయోగ్రహణేన. ఔషధపరిజ్ఞానహేతోస్తు కల్పేషు భూమిపరీక్షా వక్ష్యతే.

**తాత్పర్యము** : దేశము భూమి మరియు రోగి శరీరము.

అందు భూమి పరీక్ష రోగిని గురించిన జ్ఞానము కొరకుగానీ, ఔషధమును గురించిన జ్ఞానము కొరకుగానీ చేయబడుతుంది. రోగిని గురించిన జ్ఞానము కొరకు గానీ చేయబడును. రోగిని గురించిన జ్ఞానము కొరకు చేయు భూమి పరీక్ష ఇట్లుండును—ఇతడే దేశమున పుట్టినవాడు, ఎక్కడ పెరిగినవాడు లేదా ఎక్కడ వ్యాధితుడైనాడు, ఆ భూమి దేశమున మనుష్యులకు ఇటువంటి ఆహారపుటలవాట్లుండును. ఇట్టి విహారముండును, వారి ఆహారములివి. బల మీ విధముగా నుండును. సత్త్వ సాత్మ్యము లిట్లుండును. దోషము లీవిధముగా ప్రకోపించును, వారికి ఇట్టి ఇచ్ఛ యుండును. ఇవి అచట కల్గు వ్యాధులు. ఇది హితము, ఇది అహితము అనునవి పరీక్ష్య విషయములు. ఔషధ విషయ పరిజ్ఞానము కొరకు కల్పస్థానమున భూమి పరీక్ష చెప్పబడును.

**ఆయుర్వేద దీపిక :** కారణాది క్రమమునందు దేశమును గురించి చెప్పు చున్నాడు. ఇచట ఆతుర (రోగి) శబ్దము చేత అనుమానించవలసిన రోగిత్వము వలన స్వస్థవృత్తములో చూపదగిన స్వస్థుడును (రోగిగనే) గ్రహింపదగును. అత డును స్వస్థవృత్త ప్రయోగము కొరకు పరీక్షింప దగినవాడే. పరిజ్ఞానమునందు 'పరి' శబ్దము విశేషార్థ వాచకము. అందుచే రోగి యొక్క దేశ సంబంధమైన అన్ని విష యముల యొక్క జ్ఞానము రోగి పరిజ్ఞానము. ఇట్లే ఔషధ పరిజ్ఞానము నందును దేశ సంబంధమైన పరిజ్ఞానమును గ్రహింపవలెను. సమృద్ధుడనగా పెరిగినవాడు. 'ప్రాయోగ్రహణేన' అనుటచే ఒక విషయమునే కాక అన్నివిషయములనూ పరీక్షింప వలెననుట యోజన. ప్రాయః శబ్దమువలన దేశము చేత ఆహారాదులను అనుమా నించుట. నిశ్చయముగా జరుగదనియూ, కాని సర్వసాధారణముగా జరుగును అని చూపుచున్నాడు. కల్పముల యందు అనగా మదనాది కల్పముల యందు. అచట కల్పస్థానము నందు భూమి పరీక్ష మొదటనే చెప్పవలసి యున్నప్పటికీ ఇతర కల్పము లందును (కల్పస్థానమునందలి ఇతర అధ్యాయము లందును) ఈ విషయము చెప్పబడినందున (అతిదేశము వలన) కల్పేషు అను బహువచన మిచట ప్రయో గింపబడినది. కల్పము చివర చెప్పవలసి యున్నప్పటికీ ద్రవ్యములను యథోక్త దేశము నుండియే గ్రహింపవలసి యుండునని చూపుటకట్లు ప్రయోగింపబడినది.

## రోగి పరీక్ష

94. ఆతురస్తు ఖలు కార్యదేశః, తస్య పరీక్షా ఆయుషః ప్రమాణజ్ఞాన హేతోర్వా స్యాద్బలదోషప్రమాణజ్ఞాన హేతోర్వా, తత్రతావదియం బలదోషప్రమాణ జ్ఞానహేతోః, దోషప్రమాణానురూపో హి భేషజప్రమాణవికల్పో బల ప్రమాణవిశేషాపేక్షో భవతి.సహసా హ్యతిబలమౌషధమపరీక్షక ప్రయుక్త మల్పబలమాతురమపిపాతయేత్. న హ్యతిబలాన్యాగ్నేయ వాయవీయా న్యౌషధాన్యగ్నిక్షారశస్త్రకర్మాణి వా శక్యన్తేఽల్పబలైః సోఢుమ్. అసహ్యాతి తీక్ష్ణవేగత్వాద్ధితాని సద్యః ప్రాణహరాణి స్యుః ఏతచ్చైవ కారణమపేక్ష మాణాహీనబలమాతురమవిషాదుకరైర్మృదుసుకుమారప్రాయైరుత్తరోత్తర గురుభిరవిభ్రమైరనాత్యయికైశ్చోపచరన్త్యౌషధైః విశేషతశ్చ నారీః, తా హ్యన వస్థితమృదు వివృత విక్లవ హృదయాః ప్రాయః సుకుమార్యోఽ బలాః పరిసంస్తమభ్యాశ్చ.

తస్మాదాతురం పరీక్షేత-ప్రకృతితశ్చ, వికృతితశ్చ,సారతశ్చ,సంహనన తశ్చ,ప్రమాణతశ్చ,సాత్మ్యతశ్చ,సత్వతశ్చ,ఆహారశక్తితశ్చ,వ్యాయామశక్తితశ్చ వయ - తశ్చ,|బలప్రమాణ విశేషణ గ్రహణహేతోః.

**తాత్పర్యము :** రోగి కార్యదేశమగును. (రోగి శరీరము చికిత్సా రూప మైన కార్యమునకు స్థానము) ఆయుః ప్రమాణ విజ్ఞానము కొరకుగాని రోగియొక్క బల-దోష ప్రమాణ జ్ఞానము కొరకు గానీ రోగిని పరీక్షింపవలెను. బలము, దోష ముల ప్రమాణములను తెలుసుకొనుట కొరకు చేయబడు పరీక్ష వలన ఈ ఉపయోగ ముండును. దోష ప్రమాణాను రూపమైన ఔషధ ప్రమాణము దాని వికల్పము రోగియొక్క బల ప్రమాణము నపేక్షించి యుండును. ఒక్కసారిగా ఎక్కువ బలము కలిగిన ఔషధమును పరీక్ష చేయక ప్రయోగించినచో అది తక్కువ బలము కలిగిన రోగిని పడవేయును. అతిబలవంతములైన ఆగ్నేయ వాయవీయ ఔషధము లను అగ్ని-క్షార-శస్త్ర కర్మలనైనను అల్పబలము గల రోగి సహింపజాలడు. అతి తీక్ష్ణవేగమును కలిగియుండుటచేత ఔషధములను రోగి సహింపజాలక అతనికి వెంటనే ప్రాణములు పోవు ప్రమాదము గలదు. ఇట్టి కారణముచేతనే వైద్యులు అల్పబలముగల రోగులకు విషాదము కలిగించని మృదుసుకుమారములైనవి ముందు ముందు గురుత్వమును కలిగించు (మొదట లఘువుగా నుండు) భయమును కలి గించనట్టి అత్యయికతను కలిగించనట్టియు ఔషధములచే చికిత్స చేయుదురు. విశే షించి స్త్రీలకు ఇట్లు చేయవలెను. ఎందువలననగా స్త్రీలు స్థిరత్వము లేని మృదువైన విశాలమైన క్లేశములను సహింపలేని హృదయమును కలిగియుందురు. సాధారణముగా సుకుమారులై అల్పబలము కలవారై ఇతరులపై నాధారపడియుందురు.

అట్లే బలవంతుడైన రోగికి బలమైన వ్యాధి కలిగినపుడు పరీక్ష చేయక స్వల్ప బలము కలిగిన ఔషధమును ప్రయోగించిన యది అసాధకమగును. (నిరర్థక మగును).

అందుచేత రోగిని ప్రకృతిచేత, వికృతిచేత, సారముచేత, సంహననము చేత, ప్రమాణముచేత, సాత్మ్యముచేత, సత్త్వముచేత, ఆహారశక్తిచేత, వ్యాయామ శక్తిచేత మరియూ వయస్సు చేతనూ, బల ప్రమాణ విశేషమును గ్రహించుట కొరకు పరీక్షించవలెను.

**ఆయుర్వేద దీపిక :** భూమి రూప దేశమును పేర్కొని ఆతుర రూపమగు దేశమును గురించి చెప్పుచున్నాడు. కార్య దేశమనగా ధాతు సామ్యము చేయవలసిన

దానికి ఆధారమని యర్థము. బలము యొక్కయు దోషము యొక్కయును ప్రమాణము బలదోష ప్రమాణము. ఇయం అనగా రోగిని, "దోష ప్రమాణాను రూపతయా...." అను వాక్యమున బలదోష ప్రమాణము పరీక్ష నెందులకు చేయవలెనో తెల్పుచున్నాడు. దోష ప్రమాణము నపేక్షించి భేషజ ప్రమాణమును కల్పించుట చేతనే సాధ్యము. (ఫలితము-ఆరోగ్యము) సరిగా సిద్ధించును. ఈ కారణముగనే శరీర బల ప్రమాణ పరీక్షను చేయవలెనని ప్రకటనార్ధము. బల ప్రమాణ విశేషము నపేక్షించి అనగా శరీరము బలమైనదైనపుడు దోష ప్రమాణమును ఎక్కువగా నుండి గొప్ప (బలవంతమైన ఔషధమును ప్రయోగింపవలసి యుండును. తద్వ్యతిరేక స్థితియందు ఔషధ ప్రమాణము (బలము) తక్కువగా నుండును. అల్పబలము కల రోగిని పరీక్షింపకయే ప్రయోగించిన ఔషధము అధిక ప్రమాణమున నుంగునని చెప్పబడినది. పరీక్ష చేసి ప్రయోగించినది అతిమాత్ర కాదు. వెంటనే ప్రాణములను హరించునదగును అనునది అల్ప బలము గలవారికి అని అర్థమున గ్రహింపనగును. అతి విషాదకరమనగా శరీర మనస్సునకు గ్లానిని కలిగింపనివి. మున్ముందు లక్షణ ప్రమాణము నధికము జేయునవి ఏవి కలవో వాటితో చికిత్సింపవలెనని అర్థము. అందువలన దుర్బలునికి ఎక్కువ దోషమున్నచో అట్టివాడు ఎక్కువ మోతాదులో ఔషధము నిచ్చుటచేత ఆరోగ్యమును పొందునప్పటికీ అప్పటికప్పుడు కలుగు వ్యాపత్తి భయముచే (అధిక ప్రమాణములో ఔషధము నిచ్చుటచే కలుగు వ్యాపత్తి భయముచే) ఒకేసారిగా ఎక్కువ ఔషధము నివ్వరాదు. కానీ ముందు ముందు అభ్యాస వశమున బలము ననుసరించి భేషజమును ఎక్కువగా నివ్వవచ్చునని చూపుచున్నాడు. అవిభ్రమైః అనగా జీర్ణమగునపుడు విభ్రమమును కలిగించనట్టి ఔషధములతో అనాత్యయికైః అనగా పెద్ద విపత్తును కలిగింపనట్టి అని అర్థము. విశేషించి స్త్రీలకు అనుటచే అట్టి ఔషధములను స్త్రీలకును ఇవ్వవలెనని చెప్పుచున్నాడు. హృదయ శబ్దము వలన హృదయమందున్న మనస్సును గ్రహింపవలెను. మృదు వివృతమనగా గాంభీర్యత లేనట్టిది. విక్లవమనగా కొంచెము బాధనే ఓర్చుకొనగలిగినట్టి, ఇందువలన దుర్బల చేతనను కల్గియుందురని చెప్పబడినది. ఇతరులపై నాధారపడువారు అనగా సత్వబలము చేత తమను తాము నిలుపుకొనలేరు (రక్షించుకొనలేరు). అటుపై స్వల్ప ప్రమాణమునందు ఔషధము నివ్వవలసిన దోషమును గురించి (దోష స్థితిని గురించి) చెప్పుచున్నాడు. బలవంతమైన వ్యాధి యున్నవానికి - అను వాక్యము వలన బలవంతునకు బలవంతమైన వ్యాధి కలిగినపుడు అది స్వల్ప బలము కలిగిన ఔషధమునకు సాధ్యపడదు. బలవంతునకు అల్ప బలము కల వ్యాధి

యున్నచో అది అల్ప బలము కల ఔషధముననే సాధ్యపడును. పరీక్షా హేతువును వివరించి అపైన శరీరమునెట్లు పరీక్షింపవలెనో ఆ వివరమును చెప్పుచున్నాడు. బల ప్రమాణ విశేషమును గ్రహించుట కొరకు అనుగోట దేహ బలమును దోష బలమును సామాన్యముగా గ్రహింతురు. దేనివలన దోష బలజ్ఞానము కొరకు శరీర జ్ఞానము కలుగునో దానినే వికృతిలేని ప్రకృత్యాదుల యొక్క మొదలగువానిచే చెప్పుచున్నాడు. లేదా బలము అనగా శరీర బలమే అయినప్పుడు వికృతి బలముతోనైననూ శరీర బలమును తెలిసికొని యుండుటచేసి ఇచట సామాన్యముగా చెప్పబడినది. ముందు ముందు వికృతి ద్వారా ప్రాయముగా దోష ప్రమాణమును తెలిసికొనవచ్చుననుటం జేసి వికృతి బల త్రైవిధ్యము వలన దోష బల త్రైవిధ్యమనుమానింపబడును అని చెప్పబడినది.

## ప్రకృతి పరీక్ష

95. తత్ర ప్రకృత్యాదీన్ భావానాను వ్యాఖ్యాస్యామః. తద్యథా-శుక్ర-శోణిత ప్రకృతిమ్ కాలగర్భాశయప్రకృతిమ్ మాతురాహారవిహారప్రకృతిమ్, మహాభూతవికారప్రకృతిం చ గర్భశరీరమపేక్ష్యతే. ఏతాని హి యేన యేన దోషేణాధికతమ్నైతేనానేన వా సమనుబధ్యన్తే: తేన తేన దోషేణ గర్భోஉనుబధ్యతే. తతః సా సా దోషప్రకృతిరుచ్యతే మనుష్యాణాం గర్భాది-ప్రవృత్తా. తస్మాచ్ శ్లేష్మలాః ప్రకృత్యా కేచిత్, పిత్తలాః కేచిత్. వాతలాః కేచిత్ సంసృష్టాః కేచిత్, సమధాతవః ప్రకృత్యా కేచిద్ భవన్తి తేషాం హి లక్షణాని వ్యాఖ్యాస్యామః

**తాత్పర్యము** : అందు ప్రకృతి మొదలైన భావములను వివరింతుము. గర్భశరీరము, శుక్రశోణిత ప్రకృతిని, కాలగర్భాశయ ప్రకృతిని మాతృ ఆహార విహార ప్రకృతిని, మహాభూత ప్రకృతిని అపేక్షించి యుండును. (అనగా ఆయా భావములు గర్భస్థ శరీరమునందు ప్రకృతి యేర్పడుటకు తోడ్పడును అని భావము). ఇవియే ఒకటిగాని, ఎక్కువగానీ దోషముల ఆధిక్యతతో గూడియుండునో ఆయా దోషము లేదా దోషములతో గర్భము అనుబంధించి యుండును. అందుచే ఆయా దోష ప్రకృతి గర్భమునందు మొదట మనుష్యుల కుండునని చెప్పబడును. కావున వారు శ్లేష్మ మెక్కువగానున్న ప్రకృతి గలవారు కొందరు, పిత్తమెక్కువగా నున్నవారు కొందరు, వాతమెక్కువగా నున్నవారు కొందరు రెండేసి దోషములు ఎక్కు-

వగా నున్నవారు కొందరు సమధాతువులు (మూడును సమముగా) ఉన్నవారు కొందరు ఉందురు. వారి లక్షణములను చెప్పుకొందుము.

**ఆయుర్వేద దీపిక :** ప్రకృతి యనగా స్వభావము. ఇవియే అనగా శుక్రాదులు. ఇచట శుక్రమునందు గాని, శోణితమునందు గానీ ఎటువంటి దోషావస్థ యుండునో అటువంటి ప్రకృతియే గర్భమునందు కలుగును. మరియు శుక్రశోణిత ములు కలియు కాలమున (ఋత్వాది రూపకాలమున) యే దోషమధికముగా నుండునో అది గర్భమును ప్రభావితము చేయును. అట్లే గర్భాశయమునందున్న దోషము తల్లి ఆహార విహారములయందు ఆ కాలమున ఏ దోషమును కలిగించు స్వభావ ముండునో అదియును గర్భ శరీరమున ప్రకృతి యగును. ప్రకృతిని నిశ్చయించు ఈ కారణములయందు ఏది కారణాంతరములచే బలపడి బలవంతముగా నుండునో అదియే ప్రకృతిని చేయునది (ముఖ్యముగా కలుగజేయునది) అగును. కాలాదులు శుక్ర శోణితములనే ప్రభావితము చేసి ప్రకృతిని కల్గించునని తంత్రాంతరమున శుక్రశోణితముల వలననే ప్రకృతియొక్క ఉత్పత్తి చూబడినది. గర్భాది ప్రవృత్తా అనగా గర్భము మొదట కలసినపుడు (గర్భోత్పత్తి సమయమున) ప్రవృత్తములు అని అర్థము. ఇచటను సమముగా మూడు దోషములు వృద్ధి చెందినపుడు గర్భో త్పత్తియే జరుగదని వికృత దోష ప్రకృతిని పేర్కొనక పోవుటవలన తెలియ వలెను. ప్రకృతి వికారములు సూత్ర స్థానముననే చెప్పబడినవి.

## శ్లేష్మ ప్రకృతికల మనుజుని లక్షణములు

96. శ్లేష్మా హి స్నిగ్ధశ్లక్ష్ణమృదుమధురసారసాన్ద్రమంద స్తిమితగురుశీతవిజ్జలాచ్ఛః తస్య స్నేహాచ్ఛ్లేష్మలాః స్నిగ్ధాఙ్గాః శ్లక్ష్ణత్వాత్ శ్లక్ష్ణాఙ్గాః, మృదుత్వాద్ దృష్టిసుఖసుకుమారావదాతగాత్రాః, మాధుర్యాత్ ప్రభూతశుక్రవ్యవాయా-పత్యాః,సారత్వాత్ సారసంహతస్థిరశరీరాః, సాన్ద్రత్వాదుపచితపరిపూర్ణ - సర్వాగాత్రాః,మన్దత్వాన్మన్దచేష్టాహారవ్యవహారాః, స్తైమిత్యాదశీఘ్రారమ్భక్షోభ-వికారాః,గురుత్వాత్ సారాధిష్ఠితావస్థితగతయః,శైత్యాదల్పక్షుత్తృష్ణాసన్తాప-స్వేదదోషాః,విజ్జలత్వాత్ సుశ్లిష్టసారసన్ధిబన్ధనా.తథాఽచ్ఛత్వాత్ ప్రసన్న-దర్శనాననాః ప్రసన్నస్నిగ్ధవర్ణ స్వరాశ్చభవన్తి. త ఏవం గుణయోగాచ్ఛ్లేష్మలా బలవన్తో వసుమన్తో విద్యావన్త ఓజస్వినః శాంతా ఆయుష్మన్తశ్చ భవన్తి.

తాత్పర్యము : శ్లేష్మము స్నిగ్ధ - శ్లక్ష్ణ - మృదు - మధుర - సార - సాంద్ర - మంద - స్తిమిత - గురు - శీత - విజ్జల - అచ్ఛ గుణములను కలిగి యుండును. శ్లేష్మాధిక్యము కలవారు శ్లేష్మము యొక్క స్నేహ గుణమువలన స్నిగ్ధమైన అంగములు కలిగియుందురు. శ్లక్ష్ణత్వము వలన శ్లక్ష్ణాంగములు- మృదుత్వము వలన చూచుటకు సుకుమారమై అందమైన శరీరము గలిగి, మాధుర్యత వలన అధిక శుక్రము కలిగి సంభోగ శక్తితోనూ ఎక్కువ సంతానము కలిగి, సారగుణము వలన సారముచే నిండిన స్థిరమైన శరీరము కలిగి, సాంద్రత్వము వలన మందమైన చేష్టలు, అహార విహారములు కలిగి స్తైమిత్యము వలన మెల్లగా కార్యములు చేయువారుతక్కువగా క్షోభపడువారు, తక్కువగా వికారములను పొందువారు గురుత్వము వలన సార అధిష్ఠితస్థిరమైన గతి కలిగి శీతగుణమువలన అల్పమైన ఆకలి, దప్పి, సంతాపము, స్వేదము, దోషములు కలిగి (వీనిచే బాధపడక) విజ్జలత్వమువలన బాగుగా కలసియున్న సంధి బంధనములు కలవారు మరియు అచ్ఛత్వము (మంచి తనము) వలన ప్రసన్నముగా కనిపించు ముఖము ప్రసన్నము, స్నిగ్ధము అయిన వర్ణము స్వరములను కలిగియు ఉందురు. శ్లేష్మాధిక్యము గలవారు, ఈ గుణము లను కలిగియుండుటచేత బలవంతులు, ధనవంతులు, విద్యావంతులు, ఓజస్వులు శాంత స్వభావులు, ఆయుష్మంతులునూ అయి ఉందురు.

ఆయుర్వేద దీపిక : మృదుత్వము జలముచే వచ్చినది. అందమైన శరీరము, మృదుత్వము వలననే వచ్చునది. అభిష్యందము, ఆరంభ, క్షోభ, వికారము లన్నింటికీ వర్తించును. సారగతి కలవారు నడుచునపుడు జారిపడరు. అధిష్ఠిత గతి కలవారు పూర్తిగా నేలపై మోపి నడుచుదురు. అవస్థితగతి గలిగియుండుటచే నడచుట యందు చపలత్వము లేకపోవును. మాటపడు ప్రసన్నమైన ముఖము కలవారు ప్రసన్న దర్శనానను. ధనవంతులుగా నుండుట యను స్వభావము ప్రకృతి స్వభావముచేతనే కలుగునని తెలియనగును.

## పిత్త ప్రకృతి గల మనుజుని లక్షణము

97. పిత్తముష్ణం తీక్ష్ణం ద్రవం విస్రమమ్లం కటుకం చ. తస్యౌష్ణ్యాత్ పిత్తలా భవన్త్యుష్ణాసహాః, ఉష్ణముఖాః సుకుమారావదాత గాత్రాః, ప్రభూత పిప్లువ్యఙ్గ తిలపిడకాః క్షుత్పిపాసావన్తః క్షిప్రవలీ పలిత ఖాలిత్య దోషాః ప్రాయో మృద్వల్పకపిలశ్మశ్రులోమకేశాః తైక్ష్ణ్యాత్ తీక్ష్ణపరాక్రమాః తీక్ష్ణాగ్నయః ప్రభూ

తాశస పానాః క్లేశాసహిష్ణవో,దన్దశూకాః; ద్రవత్వాత్ శిథిలమృదు సంధి మాంసాః ప్రభూత సృష్టస్వేద మూత్ర పురీషాశ్చ విస్రత్వాత్ ప్రభూత పూతి వక్షః కక్షాస్యశిరఃశరీరగంధాఃకట్వమ్లత్వాదల్పశుక్రవ్యవాయాపత్యాః. త ఏవగుణంయోగాత్ పిత్తలాః - మధ్యబలా, మధ్యాయుషో, మధ్యజ్ఞాన విజ్ఞాన విత్తోపకరణ వంతశ్చ భవన్తి.

**తాత్పర్యము :** పిత్తము ఉష్ణ తీక్ష్ణ ద్రవ విస్రగుణములు అమ్ల కటు రసములు కలిగియుండును. పిత్తాధిక్యత కలవారు పిత్తము యొక్క ఉష్ణగుణము వలన ఉష్ణమును సహింపలేరు. ఉష్ణముఖమును కలిగి సుకుమారమైన సుందర శరీరము కలిగి, ఎక్కువ విప్లవ్యంగ తిల పిడకలు (మొటిమలు, పులిపిరికాయలు, మచ్చలు) కలిగి ఆకలిదప్పులు ఎక్కువగానుండి, త్వరగా జుట్టునెరయుట, బట్టతల(ఖాలిత్యము) దోషములు పెరుగుట కలిగి సాధారణముగా మృదువైన పలుచని కపిలవర్ణముగల మీసము, గడ్డములు, నీచరోమములు, తలవెంట్రుకలుగలవారై తీక్ష్ణగుణమువలన తీక్ష్ణపరాక్రమము, తీక్ష్ణమైన జఠరాగ్ని, ఎక్కువగా అన్న పానములను సేవించువారై, బాధలను సహించలేక, మాటిమాటికి ఆహారమును సేవించుచూ, ద్రవత్వమువలన శిథిలమైన మృదువైన సంధులు మాంసము కలిగి, మూత్రపురీష స్వేదము లెక్కువగా ఉత్పత్తి యగుచున్నవారై విస్రత్వమువలన ఎక్కువగా దుర్వాసనతో కూడి యున్న కక్ష (చంకలు), నోరు, శిరస్సు, శరీరము గలవారై కట్వమ్లత్వమువలన అల్ప శుక్రము అల్పమైన సంభోగశక్తి అల్ప సంతానములు కలిగియుందురు. పిత్తాధిక్యత గలవారు ఈ గుణములతో నుండుటచే మధ్య బలము, మధ్య ఆయుష్య మధ్య జ్ఞాన విజ్ఞాన ధన ఉపకరణములను కలిగియుందురు.

**ఆయుర్వేద దీపిక :** దంద శూకాః అనగా మాటిమాటికిని భక్షించు అలవాటు గలవారు. బహు (అధికము)గా తినుట ప్రభూత అశనత్వము అనబడును. ఎవరికి ఎక్కువ దుర్గంధము కక్ష మొదలగుచోట్ల నుండునో వారును (పిత్త ప్రకృతి గలవారు).

## వాత ప్రకృతి గల మనుజుని లక్షణము

98. వాతస్తు రూక్షలఘుచలబహుశీఘ్రశీతపరుషవిశదః తస్య రౌక్ష్యాద్వాతలా రూక్ష- పచితాల్పశరీరాః ప్రతతరూక్షక్షామభిన్నసక్తజర్జరస్వరాః జాగరూకాశ్చ భవన్తి.

లఘుత్వాచ్చ లఘుచపలగతిచేష్టాహారావ్యాహారాః చలత్వాదనవస్థితసన్ధ్యక్షి-భ్రూహన్వోష్ఠజిహ్వాశిరస్కన్ధపాణిపాదాః బహుత్వాత్బహుప్రలాపకణ్డరాశిరా-ప్రతానాః శీఘ్రత్వాత్శీఘ్రసమారంభక్షోభవికారాః శీఘ్రత్రాసరాగవిరాగాః శ్రుతగ్రాహిణోఽల్పస్మృతయశ్చ, శైత్యాచ్ఛీతాసహిష్ణవః, ప్రతతశీతకోద్వే-పకస్తమ్భాః-పారుష్యాత్పరుషకేశశ్మశ్రురోమనఖదశనవదనపాణిపాదాఙ్గాః, వైశద్యాత్స్ఫుటితాఙ్గావయవాః,సతతసంధిశబ్దగామినశ్చ భవన్తి.త ఏవం గుణయోగాద్వాతలాః ప్రాయేణాల్పబలాశ్చాల్పాయుషశ్చాల్పాపత్యాశ్చాల్ప-సాధనాశ్చాల్పధనాశ్చ భవన్తి.

99. సంసర్గాత్ సంసృష్టలక్షణాః

**తాత్పర్యము :** వాతము రూక్ష-లఘు-చల-బహు-శీఘ్ర-శీత-పరుష-విశద గుణములను కలిగియుండును. వాతాధిక్యము గలవారు వాతము యొక్క రూక్ష గుణము వలన రూక్షము, కృశము, అల్పము అయిన శరీరముతో అత్యంత రూక్షము హీనము, సక్తము, జర్జరము అయిన కంఠస్వరము కలిగి యుందురు. ఎల్లప్పుడూ మేలుకొనియే యుందురు. లఘు గుణము వలన లఘు చపల గతి అట్టియే పనులు ఆ దేవిధమైన ఆహార విహారములను కలిగియుందురు. చలత్వము వలన సంధులు-కన్నులు-భ్రూస్థానము (కనుబొమలు) దవడలు-పెదవులు-నాలుక-శిరస్సు-భుజములు-చేతులు-కాళ్ళు-ఇవి స్థిరముగా లేకయూ, బహుత్వము వలన కండరములు, సిరలు, ప్రతానములు ఇవి అధికముగా అధురుచును, శీఘ్రత్వము వలన శీఘ్రముగా పనులు చేయుట, శీఘ్రముగా క్షోభపడుట, శీఘ్రముగా వ్యాధితులగుట ఈ లక్షణముల కలిగి అకస్మాత్తుగా భయమును, రాగమును, ద్వేషమును కనబరచుచూ వినిన వెంటనే గ్రహించి దానిని ఎక్కువగా స్మరించు శక్తి లేకయూ, శైత్యము వలన శీతత్వమును సహించలేక ఎక్కువ శీతజన్య రోగములు, కంపము, స్తంభనము (బిగుసుకొని పోవుట) కలిగియూ పారుష్యము వలన కేశ శ్మశ్రు రోమ నఖ దంత వదన పాణి పాదములు-పరుషముగా నుండియూ విశదత్వము వలన నడుచునపుడు శరీరాంగములయందు స్ఫుటనము కలిగియుందురు. మరియు వారు నడుచునపుడు సంధులయందు శబ్దము వచ్చుచుండును. ఈ గుణములు కలిగియున్నందున వాతాధిక్యము గలవారు సాధారణముగా అల్పములైన బల-ఆయు-సంతాన-సాధన-ధనములను కలిగియుందురు. ఈ దోషములు రెండేసి కలసియున్నచో ఆయా దోషముల లక్షణములు కలిగియుండును.

**ఆయుర్వేద దీపిక :** ప్రతత అనగా ప్రసృత (అత్యంత): సన్నమనగా హీనము, సక్తమనగా ఆగి ఆగి వచ్చునది. జర్జరమనగా పగిలిన పాత్రచేయు ధ్వనితో సమానమైన ధ్వని - ఎప్పుడును నడుచునపుడు సంధులయందు శబ్దము వచ్చువారనగా సంధులు విరుగుచున్నట్లు శబ్దము వచ్చువారు.

100. సర్వగుణ సముదితాస్తు సమధాతవః ఇత్యేవం ప్రకృతితః పరీక్షేత.

**తాత్పర్యము :** ఈ చెప్పబడిన గుణము లన్నియు కలిగియున్నవారు సమధాతు ప్రకృతికల వారగుదురు. ఇట్లు ప్రకృతిద్వారా పరీక్ష చేయవలెను.

**ఆయుర్వేద దీపిక :** సర్వగుణ సముదితః అనగా అన్ని ప్రకృతుల యందును చెప్పబడిన ప్రశస్త గుణములు కలిగియున్నవారు. వాగ్భటమున సమధాతు ప్రకృతి అన్నింటి యందును శ్రేష్ఠమని చెప్పబడినది. (సమధాతుః సమస్తాసు శ్రేష్ఠా- వాగ్భట సూత్రస్థానము 1వ అధ్యాయము). ప్రశస్త గుణవంతుడు లేనట్లయినచో శ్రేష్ఠత్వమును ఉండదు. సమస్థితిలోనున్న దోషములు సమ ప్రభావము వలననే మంచి గుణములను కలుగజేయును. దోషములను (చెడు గుణములను) కలుగ జేయ వని తెలిసికొనవలెను.

## వికృతి పరీక్ష

101. వికృతితశ్చేతి - విక్రృతిరుచ్యతే వికారః, తత్ర వికారం హేతుదోష- దూష్యప్రకృతి దేశకాలబలవిశేషైర్లింగతశ్చ పరీక్షేత, న హ్యంతరేణ హేత్వా దీనాం బలవిశేషం వ్యాధిబలవిశేషోపలబ్ధిః యస్య హి వ్యాధేర్దోషదూష్య ప్రకృతి దేశకాల బలసామ్యం భవతి తద్విపర్యయాచ్చాల్పబలః మధ్యబలస్తు దోషదూష్యాదీనామన్యతమ సామాన్యాద్వై తు లింగ మధ్యబలత్వాచ్చోపలభ్యతే.

**తాత్పర్యము :** వికృతి మూలముగా అనగా వికృతి వికారమనబడును. అందు వికారమును హేతు- దోష- దూష్య- ప్రకృతి - దేశ-కాల - బల విశేష లక్షణ ములతో పరీక్షింపవలెను. హేత్వాదులలో నేదోయొకటి బలముగా నున్నపుడు వ్యాధి బలముగా నుండదు. ఏ వ్యాధియొక్క దోష దూష్య ప్రకృతి దేశకాల బలములు సమానముగా నుండునో హేతులక్షణ బలమును ఎక్కువగా నుండునో అది బలవంత మైన వ్యాధి యగును.

**ఆయుర్వేద దీపిక :** సామ్యముగా నుండు ననగా పరస్పరము సమాన గుణములు కలిగియుండును. మహచ్చ హేతు లింగమనగా హేతువులు - లక్షణము లను బలవంతములై ఎక్కువగను ఉండును. అన్యతమసామాన్యాత్ అనగా దోషాదులకు కొన్ని సామాన్యముగానుండి యుండుట అని అర్థము.

## సార పరీక్ష

102. సారతశ్చేతి సారాణ్యష్టౌ పురుషాణాం బలమానవిశేషజ్ఞానార్థముపదిశ్యంతే తద్యథా త్వగ్రక్తమాంస మేదోఽస్థి మజ్జ శుక్రసత్వానీతి.

**తాత్పర్యము :** సారముద్వారా పరీక్షించుట యనునది – పురుషులకు ఎనిమిది విధములైన సారములు చెప్పబడినవి. ఆ ఎనిమిది విధములుగా పరీక్షించుట సార పరీక్షయగును. అవి ఏవనగా త్వక్సారము, రక్తసారము, మాంససారము, మేదోసారము, అస్థిసారము, మజ్జాసారము, శుక్రసారము మరియు సత్వసారము.

## త్వక్సారము

103. తత్ర స్నిగ్ధశ్లక్ష్ణమృదుసూక్ష్మాల్పగంభీర సుకుమారలోమా స ప్రభేవ చ త్వక్ త్వక్సారాణామ్ సా సారతా సుఖ సౌభాగ్యైశ్వర్యోపభోగ బుద్ధి విద్యాఽరోగ్య ప్రహర్షణాన్యాయుష్యత్వం చాచష్టే.

**తాత్పర్యము :** అందు త్వక్సార పురుషులకు చర్మము స్నిగ్ధ - శ్లక్ష్ణ - మృదు - ప్రసన్న - సూక్ష్మ - అల్ప గంభీరమై సుకుమారమైన వెంట్రుకలు కలిగి కాంతితో కూడియుండును. ఈ సారము ఉండుట సుఖము, సౌభాగ్యము, ఐశ్వర్యము, సంభోగము (స్త్రీ సంభోగము), బుద్ధి, విద్య, ఆరోగ్యము, సంతోషము మరియు దీర్ఘాయువులకు సూచకము.

## రక్తసారము

104. కర్ణాక్షిముఖ జిహ్వానాసౌష్ఠపాణిపాదతలనఖలలాటమేహనం చ స్నిగ్ధ రక్తవర్ణం శ్రీమద్భ్రాజిష్ణు రక్తసారాణామ్. సా సారతా సుఖముద్ధతాం మేధాం మనస్విత్వం సౌకుమార్య మనతిబలమక్లేశసహిష్ణుత్వ ముష్ణాసహిష్ణుత్వం చాచష్టే.

**తాత్పర్యము :** రక్తసార పురుషులకు చెవులు, కండ్లు, నోరు, నాలుక, ముక్కు, పెదవులు, అరచేతులు, అరికాళ్ళు, గోళ్ళు, నుదురు, మేఢ్రము - ఇవి స్నిగ్ధముగా రక్త వర్ణయుక్తమై శోభతోనూ, కాంతితోనూ కలిగి యుండురు. రక్త సారము, సుఖము, గొప్పతనము, మేధస్సు, మనోశక్తి (మనస్వీత్వము) సుకుమార త్వము, ఎక్కువ బలము లేకుండుట, క్లేశములను సహించలేకపోవుట, ఉష్ణత్వ మును సహించలేకపోవుట - వీనికి సూచకము.

## మాంససారము

105. శంఖలలాటకృకాటికాక్షిగండహనుగ్రీవాస్కంధోదరకక్షవక్షఃపాణిపాద సన్ధయః స్థిరగురుశుభమాంసోపచితాః మాంససారాణాం. సా సారతా క్షమాం ధృతిం అలౌల్యం విత్తం విద్యాం సుఖమార్జవమారోగ్యం బలమాయుశ్చ దీర్ఘమా చష్టే.

**తాత్పర్యము :** మాంస సార పురుషులకు కణతలు, నుదురు, కృకాటికా, కన్నులు, చెక్కిళ్ళు, గవదలు, మెడ, భుజములు, ఉదరము, చంకలు, ఎదురురొమ్ము, చేతులు, కాళ్ళు, సంధులు - ఇవి పెద్దవియై స్థిరముగా, చూచుటకు శుభకరముగ మాంసముతో బలిసినవై యుండును. ఈ మాంససారము ఓర్పు, ధైర్యము, నీచమైన కోర్కెలు లేకుండుట, ధన సంపత్తి, విద్య, సుఖము, సరళత్వము, ఆరోగ్యము మరియు దీర్ఘాయువునకు సూచకము.

## మేదోసారము

106. వర్ణస్వరనేత్రకేశలోమనఖదన్తౌష్ఠమూత్రపురీషేషు విశేషతః స్నేహో మేదఃసారాణామ్. సా సారతా విత్తైశ్వర్య సుఖోపభోగ ప్రదానాన్యార్జవం సుకుమారోపచారతాం చాచష్టే.

**తాత్పర్యము :** మేదోసార పురుషులకు వర్ణము, కంఠస్వరము, నేత్ర ములు, కేశములు, రోమములు, నఖములు, దంతములు, పెదవులు, మూత్ర పురీష ములు వీనియందు స్నిగ్ధత్వము విశేషముగా నుండును. ఈ మేదో సారము ధనము, ఐశ్వర్యము, సుఖము, స్త్రీ భోగము, దానగుణము, సరళత్వము, సుకుమారత్వము మరియు సేవాభావము వీనికి సూచకము.

## అస్థిసారము

107. పార్ష్ణిగుల్ఫజాన్వరత్నిజత్రుచిబుకశిరఃపర్వస్థూలాః స్థూలాస్థినఖదన్తాశ్చ అస్థిసారాః, తే మహోత్సాహాః క్రియావన్తః క్లేశసహాః సారస్థిరశరీరా భవన్త్యాయుష్మన్తశ్చ.

**తాత్పర్యము :** అస్థిసార పురుషులకు మడమలు, చీలమండలు, మోకాళ్లు, మోచేతులు, కంఠము, గడ్డము, శిరస్సు, అస్థిపర్వములు (వేళ్ళ కణుపులు) ఇవి స్థూలముగా నుండును. వీరికి ఎముకలు, నఖములు, దంతములునూ స్థూలముగా నుండును. వారు మహోత్సాహము కలిగి క్లేశములను సహింపగలిగి దృఢమైన స్థిర శరీరమును కలిగియుందురు.

## మజ్జాసారము

108. మృద్వఙ్గా బలవన్తః స్నిగ్ధవర్ణస్వరాః స్థూలదీర్ఘవృత్తసంధయశ్చ మజ్జసారాః, తే దీర్ఘాయుషో బలవన్తః శ్రుతవిత్తవిజ్ఞానాపత్యసంమానభాజశ్చ భవన్తి.

**తాత్పర్యము :** మజ్జాసార పురుషులకు మృదువైన అంగములు, స్నిగ్ధమైన శరీరవర్ణము కంఠస్వరము, స్థూలము దీర్ఘములైన గుండ్రముగానూ వున్న సంధులను గలిగియుందురు. వారు దీర్ఘాయువును కలిగినవారై బలవంతులు, శాస్త్ర జ్ఞానము కలవారు, ధనవంతులు, విజ్ఞానవంతులు, సంతానవంతులు, గౌరవనీయులునైయుందురు.

## శుక్రసారము

109. సౌమ్యాః సౌమ్యప్రేక్షిణశ్చ క్షీరపూర్ణలోచనా ఇవ ప్రహర్షబహులాః స్నిగ్ధవృత్తసారసమసంహతశిఖరదశనాః ప్రసన్నస్నిగ్ధవర్ణస్వరాః భ్రాజిష్ణవో మహాస్ఫిచశ్చ శుక్రసారాః, తే స్త్రీప్రియభోగాః బలవన్తః సుఖైశ్వర్యారోగ్యవిత్తసంమానాపత్యభాజశ్చ భవన్తి.

**తాత్పర్యము :** శుక్రసారము గల పురుషులు-సౌమ్యులు సౌమ్యదృష్టి కలవారు పాలవంటి తెల్లని కన్నులు గలవారు, అతి సంతోషము గలవారు, స్నిగ్ధముగా గుండ్రనైన వంకరలు లేక సరిగా అమర్చబడిన (నిర్మించబడిన) అందమైన

పలువరుస గలవారు, ప్రసన్నమును స్నిగ్ధమును అయిన శరీర వర్ణము కంఠ స్వర ములు గలవారు, కాంతిమంతులు, పెద్ద పెద్ద పిరుదులు గలవారు అయివుందురు. వారు స్త్రీలను ఇష్టముతో సంభోగించువారు, బలవంతులు సుఖ ఐశ్వర్య ఆరోగ్య ధనగౌరవ సంతానములను బడయు వారును అయివుందురు.

## సత్వసారము

110. శ్రుతిమన్తో భక్తిమన్తః కృతజ్ఞాః ప్రాజ్ఞాః శుచయః మహోత్సాహాః దక్షాః సమరవిక్రా న్తయోధినః త్యక్తవిషాదాః సువ్యవస్థితగమ్భీరబుద్ధిచేష్టాః కళ్యాణా- భినివేశినశ్చ సత్త్వసారాస్త్వేషాం స్వలక్షణై రేవగుణాః వ్యాఖ్యాతాః.

**తాత్పర్యము :** సత్వసార పురుషులు - స్మరణ శక్తి గలవారు, భక్తి గలవారు, కృతజ్ఞులు, తెలిసినవారు, శుచి గలవారు, గొప్ప ఉత్సాహము గలవారు, నేర్పు గలవారు, ధైర్యవంతులు, సమరమున గొప్ప పరాక్రమముతో యుద్ధము చేయు వారు, విషాదము వదలినవారు, బాగుగా పద్ధతి ననుసరించి నడుచువారు, గంభీర మైన ఆలోచనలు, క్రియలు గలవారు. మంచికార్యములందే నిమగ్నమైనవారును అయి యుందురు. వారికి లక్షణముల వలెనే గుణములును వ్యాఖ్యానింపబడినవి.

## సర్వ సార పురుష లక్షణము

111. తత్రసర్వైస్సారైరుపేతాః పురుషాః భవ న్త్యతిబలాః పరమగౌరవయుక్తాః క్లేశసహాః సర్వారమ్భేష్వాత్మనిజాతప్రత్యయాః కళ్యాణాభినివేశినః స్థిరసమా హితశరీరాః సుసమాహితగతయః సానునాదస్నిగ్ధగంభీరమహాస్వరాః సుఖై శ్వర్యవిత్తోపభోగసంమానభాజో మన్దజరసో మన్దవికారాః ప్రాయస్తుల్యగుణ వి స్తీర్ణాపత్యాశ్చిరజీవినశ్చ.

**తాత్పర్యము :** అన్నిసారములతోనూ కూడియున్న పురుషులు - అతి బలవంతులు, పరమ సుఖజీవనులు, క్లేశములను సహించువారు, అన్ని కార్యముల యందునూ, ఆత్మవిశ్వాసము కల్గియున్నవారు, మంచి పనుల యందు నిమగ్నమైన వారు, స్థిరమై సమముగా నిర్మింపబడిన శరీరము గలవారు బాగుగా పద్ధతి ప్రకారము నడచువారు, ప్రతిధ్వనితో కూడి స్నిగ్ధము గంభీరము గొప్పది అయిన కంఠస్వరము గలవారు, సుఖము, ఐశ్వర్యము, ధనము, ఉపభోగము, గౌరవములు గలవారు, నెమ్మదిగా ముసలితనము వచ్చువారు, తక్కువ రోగములు గలవారు (స్వల్పమైన

రోగములు గలవారు) సాధారణముగా తమ వంటి సంతానమునే పొందువారును, ఎక్కువ కాలము జీవించు వారును అయియుందురు.

112. అతో విపరీతా స్త్వసారాః.

**తాత్పర్యము :** ఈ గుణములకు (అన్ని సారములకును చెప్పిన గుణములకు) వ్యతిరేక గుణములున్నవారు అసార పురుషులు. (సారహీన పురుషులు).

113. మధ్యానాం మధ్యైః సారవిశేషైః గుణవిశేషాః వ్యాఖ్యాతా భవన్తి.

**తాత్పర్యము :** మధ్యములకు మధ్యములైన సార విశేషములతో కూడిన గుణవిశేషములు చెప్పబడినవి.

114. ఇతి సారాణ్యష్టౌపురుషాణాం బలప్రమాణవిశేషజ్ఞానార్థాన్యుపదిష్టాని భవన్తి.

**తాత్పర్యము :** ఈ విధముగా పురుషులకుండు ఎనిమిది విధములైన సారములు, బలప్రమాణ విశేషమును తెలిసికొనుటకు ఉపదేశింపబడినవి.

## సార పరీక్ష యొక్క ఆవశ్యకత

115. కథం ను శరీరమాత్రదర్శనాదేవ భిషక్ ముష్యేదయముపచితత్వాద్బలవానయమల్పబలః కృశత్వాదయం మహాబలవాన్ మహాశరీరత్వాదయమల్పశరీరత్వాదల్పబల యితి. దృశ్యన్తే హ్యల్పశరీరః కృశాశ్చైకే బలవన్తః తత్ర పిపీలికాభారహరణవత్ సిద్ధః అతశ్చ సారతః పరీక్షేత ఇత్యుక్తమ్.

**తాత్పర్యము :** శరీరమునే చూచుట వలన మాత్రమే వైద్యుడు—ఇతడు బలిసియుండుటచే బలవంతుడు. ఇతడు కృశించి యుండుటచే తక్కువ బలము కలవాడు. పెద్ద శరీరము కలిగి యుండుటచే తక్కువ బలము కలిగినవాడు - అని మోసపోవు నవకాశము గలదు. అల్ప శరీరము, కృశత్వము కలిగిన కొందరు బలవంతులను చూచుచున్నాముగదా ! అని చీమలు బరువును తీసికొనిపోవుట వలన తెలియుచున్నది. అందువలననూ సారము ద్వారా పరీక్ష చేయవలెనని చెప్పబడినది.

**ఆయుర్వేద దీపిక :** సారమనగా విశుద్ధతరమైన ధాతువు అని యర్థము. సప్రభా ఇవ అనగా కాంతియుక్తమైన చర్మము. ఇది త్వక్సార పురుషులకని యర్థము. సా సారతా-అనుటచే ఈ లక్షణములున్న సారము ఏమి చేయునో చెప్పుచున్నాడు. ఇటులనే సాసారతాయను శబ్దమున్న చోట్ల అన్వయించుకొనవలెను. శ్రీమత్ - అనగా శోభతో కూడినది. అరత్ని యనగా కఫోణికా - మోచేయి, శిఖర

దశనము లనగా అందమైన పలువరుస. స్త్రీప్రియ ఉపభోగులు అనగా ప్రియమైన స్త్రీలతో సంభోగించువారు. సమరమున పరాక్రమించి యుద్ధము చేయువారు- సమర క్రాంతవియోధులు. స్వస్థితులనగా పరులపై నాధారపడనివారు. తుల్యగుణ వి స్తీర్ణాపత్య లనగా తమవంటి సంతానమును పొందువారు. ప్రాయ శబ్దము నుపయోగించుటచే నిది నియమము కాదని గ్రహింపవలెను. మధ్యములకు అనగా స్వల్పసారము గల వారికి. మధ్యమములైన సార విశేషములచే అనగా అక్కడ సంభవించు సారము లతో కూడియున్న సారగుణములతో అని యర్థము. ఉపచితత్వము వలన అనగా స్థూలముగా (లావుగా) నుండుట వలన. మహా శరీరత్వాత్ అనగా అతి ప్రమాణ ములోనున్న శరీరము కలిగి యుండుట వలన. చీమలు భారమును తీసికొని పోవు నట్లు అనగా అతి చిన్నదియైన చీమలెట్లు సారయుక్తమైన శరీరమును కలిగియుండి తమకంటె ఎక్కువ భారమును తీసుకొని వెళ్ళుచున్నదో అట్లే (కొందరు) అల్పము, కృశమూ అయిన శరీరము గలవారును అని అర్థము.

## సంహనన పరీక్ష

116. సంహననతశ్చేతి, సంహననం సంఘాతః సంయోజనమిత్యేకోఽర్థః. తత్ర సమసువిభక్తాస్థిసుబద్ధసన్ధిసునివిష్టమాంసశోణితం సుసంహతం శరీర-మిత్యుచ్యతే తత్ర సుసంహతశరీరాః పురుషాః బలవన్తో విపర్యయేణాల్ప-బలాః మధ్యత్వాత్ సంహననస్య మధ్యబలా భవన్తి.

**తాత్పర్యము :** సంహననము-ద్వారా కూడా (పరీక్షింపవలెను) అనుట-సంహననము, సంహతి, సంయోజనము అనునవి ఒకే అర్థము నిచ్చునవి సమముగా బాగుగా విభజింపబడిన అస్థులు, సంధులు, బాగుగా అమర్చబడిన మాంస రక్తములు గల శరీరము బాగా సంహతమైన (నిర్మింపబడిన) శరీరమనబడును. అందు బాగుగా నిర్మింపబడిన శరీరము కలవారు బలవంతముగా నుందురు. తద్వ్యతిరేకముగా నిర్మిత మైన శరీరము గలవారు అల్ప బలము కలిగి యుందురు. మధ్య సంహననము గల వారు మధ్యమ బలురై యుందురు.

**ఆయుర్వేద దీపిక :** సంహతి అనగా గట్టిగా (దగ్గరగా) బంధింపబడిన అని యర్థము.

## ప్రమాణ పరీక్ష

117. ప్రమాణతశ్చేతి శరీరప్రమాణం పునర్యథాస్వేనాఙ్గులిప్రమాణేనోపదేక్ష్యతే,
ఉత్సేదవిస్తారాయామైర్యథాక్రమమ్. తత్ర పాదౌ చత్వారిషట్ చతుర్దశాఙ్గులాని,
జఙ్ఘే త్వష్టాదశాఙ్గులే, షోడశాఙ్గులపరిక్షేపే చ, జానునీ చతురఙ్గులే, షోడ-
శాఙ్గులపరిక్షేపే త్రింశదఙ్గులపరిక్షేపావష్టదశాంఙ్గులాపూరూ, షడఙ్గులదీర్ఘౌ
వృషణావష్టాఙ్గులపరిణాహౌ, శేఫః షడంఙ్గులదీర్ఘం పఞ్చాఙ్గులపరిణాహం
ద్వాదశాఙ్గులపరిణాహోభగః, షోడశాఙ్గులవిస్తారా కటీ,దశాఙ్గులం బస్తిశిరః,
దశాఙ్గుల విస్తారం ద్వాదశాఙ్గులముదరమ్, దశాఙ్గుల విస్తీర్ణే ద్వాదశాఙ్గులా-
యామే పార్శ్వే, ద్వాదశాఙ్గులం స్తనాన్తరమ్, ద్వ్యఙ్గులం స్తనపర్యంతమ్,
చతుర్వింశత్యఙ్గులవిశాలం ద్వాదశాఙ్గులముత్సేథమురః, ద్వ్యఙ్గులంహృద-
యం, అష్టాంగులౌ స్కంధౌ,షడఙ్గులౌఅంసౌ,షోడశాఙ్గులౌప్రబాహూ,పఞ్చ-
దశాంఙ్గులౌప్రపాణి,హస్తౌ ద్వాదశాఙ్గులౌ, కక్షావష్టాఙ్గులౌ,త్రికం ద్వాదశా-
ఙ్గులో త్సేధమ్, అష్టాదశాఙ్గులోత్సేధమ్పృష్టం, చతురఙ్గులోత్సేధా, ద్వావింశ-
త్యఙ్గులపరిణాహాశిరోధారా, ద్వాదశాఙ్గులోత్సేధం చతుర్వింశత్యఙ్గులపరిణా-
హమాననమ్,పఞ్చాఙ్గులమాస్యమ్. చిబుకౌష్ఠకర్ణాక్షిమధ్యనాసికాలలాటం-
చతురఙ్గులమ్., షోడశాఙ్గులోత్సేధంద్వాత్రింశదఙ్గుల పరిణాహంశిరః:ఇతిపృథ-
క్త్వేనాఙ్గావయవానాం మానముక్తమ్. కేవలా పునః శరీరమఙ్గులీపర్వాణిచతుర-
శీతిః తదాయమీవిస్తారసమం సముచ్యతే.తత్రాయుర్బలమోజః సుఖమైశ్వర్యం
విత్తమిష్టాశ్చాపరే భావా భవన్త్యాయత్తాః ప్రమాణవతి శరీరే: విపర్యస్తాతో
హీనేఽధికే వా.

**తాత్పర్యము :** ప్రమాణము ద్వారానూ (పరీక్షింపవలెను) అనుట శరీర ప్రమాణమును వ్యక్తియొక్క తన అంగుళి ప్రమాణమున ఎత్తు, పెడల్పు, మట్టు కొలతలను యథాక్రమముగా ఉపదేశింపబడనున్నది.

| అవయవము | ఎత్తు (పొడవు) | వెడల్పు | చుట్టుకొలత |
|---|---|---|---|
| పాదము | 4 అంగుళములు | 6 అంగుళములు | 14 అంగుళములు |
| జంఘ (కింది కాలు) | 18 " | — | 16 " |
| జాను (మోకాలు) | 4 " | — | 16 " |
| ఊరు (తొడ) | 18 " | — | 30 " |
| వృషణములు | 6 " | — | 8 " |
| మేఢ్రము | 6 " | — | 5 " |
| భగము | — | 12 " | — |
| కటీ ప్రదేశము (నడుము) | — | 16 " | — |
| వస్తిశిరస్సు | — | 10 " | — |
| ఉదరము (పొట్ట) | — | 10 " | 12 " |
| ప్రక్కలు | | 10 " | 12 " |
| స్తనముల మధ్యభాగము | — | 10 " | 12 " |
| స్తన పర్యంతము (నల్లని భాగము) | — | — | 2 " |
| రొమ్ము | 12 " | 24 " | — |
| హృదయము | — | 2 " | — |
| భుజములు | — | — | 8 " |
| అంస ఫలకము | 6 " | — | — |
| ప్రబాహువులు (భుజముల నుండి మోచేతి వరకు) | 16 " | — | — |
| ప్రపాణి (మోచేతి నుండి మణికట్టు వరకు) | 15 " | — | — |
| చేయి | 12 " | — | — |
| చంకలు | — | 8 " | — |
| త్రికము | 12 " | — | — |
| వీపు | 18 " | — | — |
| మెడ | 4 " | — | 22 " |
| ముఖము | 12 " | — | 24 " |
| నోరు | — | 5 " | — |
| శిరస్సు | 16 " | — | 32 " |

ఈ విధముగా విడివిడిగా శరీరావయవముల ప్రమాణము చెప్పబడినది. శరీర మొత్తము అంగుళీ పర్వముల లెక్కన 84 (ఎనుబది నాలుగు) అంగుళముల ఎత్తు వుండును. పై చెప్పబడినట్లు వెడల్పు, చుట్టు కొలతలు వున్న శరీరము సమశరీరము అనబడును. సమ శరీరులకు ఆయుష్షు, బలము, ఓజస్సు, సుఖము, ఐశ్వర్యము, ధనము మరియు ఇతరమైన భావములన్నియు ఇష్టమైనవి కలుగును. ఇంతకంటె తక్కువ లేదా ఎక్కువ ప్రమాణమున్న వారికి తద్వ్యతిరేక ఫలితములు కలుగును.

**ఆయుర్వేద దీపిక :** అంగావయవములకు ఉండవలసిన ప్రశస్తమైన ప్రమాణము చెప్పబడినది. పాదముల ఎత్తు నాలుగు అంగుళములు, వెడల్పు 6 అంగుళములు, పొడవు 14 అంగుళములు అనునది యథాక్రమము. జంఘ యనగా మోకాలి క్రింద నుండునది. పరిక్షేపమనగా చుట్టుకొలత. జానువనగా జంఘకు ఊరువునకు సంధి భాగము. దాని చుట్టు కొలతయూ చెప్పబడినది. ఈ కొలత జాను మధ్యభాగమున నుండును. అందుచేత సమ పరిణాహమనునది జంఘ మొదలైన వానికి మధ్య భాగముననే యుండును. కటి యొక్క ఎత్తు చెప్పబడలేదు. దాని యొక్క ఎత్తు ఊరు అంతరాధి సంధి భాగము అగుటవలన విడిగా కనిపించదు. ప్రబాహు వనగా అంసము నుండి వెనుక మోచేయి (కఫోణము) వరకు ఉన్న భాగము. ప్రపాణి కఫోణమునకు క్రిందది. త్రికమనగా గుదాస్థినుండి కటీ కపాలము పైభాగము వరకు. గడ్డము, పెదవి, చెవులు, కన్ను మధ్యభాగము, ముక్కు, లలాటము ఇవి ఒక్కొక్కటి నాలుగేసి అంగుళములుండును. శిరస్సు ఆరు అంగుళములు. శిరస్సు ఎత్తు అనునది మెడ వెనుక పై భాగము పైన అని తెలియవలెను. కేవలము అనగా పాదతలము నుండి శిరస్సువరకు ఎనుబది నాలుగు అంగుళముల ఎత్తు వుండునని తెలియవలెను. ఇట్లు శరీరము యొక్క పొడవు ప్రతి వ్యక్తికి తన హస్తముతో మూడున్నర హస్తములు వుండును. ఈ సందర్భమున ప్రతి యొక్క అవయవము యొక్క ఎత్తును కలిపిన అది ఎనుబది నాలుగు అంగుళముల కంటె అధికముగా నున్నచో అది అవయవములు ఒకదానితో నొకటి ప్రవేశించి యుండుట వలన అని తెలియవలెను. అందుచే ప్రతి అవయవము యొక్క ఎత్తును కలుపగా వచ్చినది ఎనుబది నాలుగు అంగుళములు కాదు కాని మొత్తము శరీరము (పాదతలము నుండి శిరస్సు పై భాగము వరకు) ఈ కొలత యుండును. అందు పాదములు నాలుగు అంగుళములు, జంఘములు పదునెనిమిది జానువులు నాలుగు, ఊరువులు పదునెని మిది, పృష్ఠము పదునెనిమిది, మెడ నాలుగు, శిరస్సు ఆరు ఈ విధముగా అన్నియును

కలిపి (4+18+4+18+18+4+6=72) ఎనుబదినాలుగు అంగుళములగును (ఇక్కడ లెక్కసరిగా లేదు). సుశ్రుతుని ప్రమాణమునకు ఇక్కడ విరుద్ధముగా నున్నది. ఈ పై రుధ్యము అంగుళ ప్రమాణ భేదమున అని సరిపెట్టుకొనవలెను. సుశ్రుతమున నూట ఇరువది అంగుళములుగా పురుషుని ప్రమాణము చెప్పబడినది. అందుచే ఆ గ్రంథమున ఉద్దేశించిన అంగుళిమానమే తక్కువయని తెలియవలెను. ఆయామ విస్తార సమమనగా ప్రతి అవయవమునకు యథోక్త ఆయామ విస్తార ప్రమాణము ఉండుట లేదా ఆయామమునను్న ఎనుబదినాలుగంగుళముల కొలత విస్తరింపజేసిన బాహువులంత పొడవు వున్నచో అప్పుడది ఆయామ విస్తార సమ మగును. తత్రాయుర్బల.... అనుటలో తత్రయనగా యథోక్త ప్రమాణములోనున్న శరీరము అని తెలియనగును. హీనమనగా హీనప్రమాణమున. ఇట్లే అధికమనగా అధిక ప్రమాణమున అని అర్థము.

## సాత్మ్య పరీక్ష

118. సాత్మ్యతశ్చేతి-సాత్మ్యం నామ తద్యత్సాత్మ్యత్వేనోపసేవ్యమానముపశేతే, తత్ర యే ఘృతక్షీరతైలమాంసరససాత్మ్యాః సర్వరససాత్మ్యాశ్చ తే బలవన్తః క్లేశసహాః చిరజీవినశ్చభవన్తి; రూక్షసాత్మ్యాః—పునరేకరససాత్మ్యాశ్చ యే, తే ప్రాయేణాల్పబలాః,క్లేశాసహాః అల్పాయుషోఽల్పసాధనాశ్చ భవన్తి. వ్యామిశ్రసాత్మ్యాస్తు యే తే మధ్యబలాః సాత్మ్యనిమిత్తతో భవన్తి.

**తాత్పర్యము :** సాత్మ్యము ద్వారాకూడా (పరీక్షింపవలెను) అనుట— సాత్మ్యమనగా ఏ పదార్థమును ఎల్లప్పుడూ సేవించుట వలన (అలవాటుగా తీసు కొనుట వలన) అనుకూలముగ నుండుట. అందు ఎవరు ఘృత క్షీర మాంస రస ములు సాత్మ్యముగా కలిగియుందురో, అన్ని రసములను సాత్మ్యములుగనూ కలిగి యుందురో వారు బలవంతులు. క్లేశములను సహించువారు ఎక్కువ కాలము జీవించు వారును అగుదురు. రూక్ష పదార్థములు సాత్మ్యముగా కలవారు, ఒకే రసము సాత్మ్యముగా కలవారూ సాధారణముగా అల్పబలము కలిగి అల్ప క్లేశ సహత్వము కలిగి అల్పమైన ఆయుష్షు అల్పమైన సాధనములను కలిగి యుందురు. మిశ్రమ సాత్మ్యము గలవారు మధ్యమ బలులై యుందురు.

**ఆయుర్వేద దీపిక :** ఇచట సాత్మ్య శబ్దముచే ఓకసాత్మ్యము (అల వాటు)ను తీసికొనవలెను- ప్రకృతి సాత్మ్యాదులను భేషజ పరీక్ష ద్వారానే పరీక్షించుట

వలన. అల్పసాధనము అనగా అల్ప భేషజము. ఒకే రసము సాత్మ్యముగా నున్న వారికి మిగిలిన ఐదురసములు అసాత్మ్యములగుటచే అపథ్యములని భావము.

## సత్త్వ పరీక్ష

119. సత్త్వతశ్చేతి-సత్త్వముచ్యతే మనః.తచ్ఛరీరస్య తన్త్రికమాత్మసంయోగాత్, తత్త్రివిధం బలభేదేన ప్రవరం మధ్యమం అవరంచేతి.అతశ్చ ప్రవరమధ్యా-వరసత్వా భవన్తి పురుషాః;తత్ర ప్రవరసత్వాఃసత్వసారాస్తే సారేషూపదిష్టాః; స్వల్పశరీరాహ్యపి తే నిజాగన్తునిమిత్తాసు మహతీష్వపి పీడాస్వవ్యథా దృశ్యన్తే సత్వగుణవైశేష్యాత్;మధ్యసత్వాస్త్వపరానాత్మన్యుపనిధాయ సంస్తమ్భ-యన్త్యాత్మనాత్మానం పరైర్వాఽపిసంస్తభ్యన్తే.హీనసత్వాస్తు నాత్మనాపి పరైః సత్వబలం ప్రతిశక్యన్తే ఉపస్తమ్భయితుమ్ మహాశరీరాహ్యపి తే స్వల్పానా-మపి వేదనానామసహా దృశ్యన్తే,సన్నిహితభయశోకలోభమోహమానా,రౌద్ర-భైరవద్విష్టబీభత్సవికృతసంకథాస్వపి చ పశుపురుషమాంసశోణితాని చావేక్ష్య విషాదవైవర్ణ్యమూర్ఛోన్మాదభ్రమప్రపతనానామన్యతమమాప్నువన్త్యథవా మరణ మితి.

తాత్పర్యము : సత్వము ద్వారానూ (పరీక్షింపవలెను) అనుట-మనస్సు సత్త్వ మనబడును. అది ఆత్మ సంయోగము వలన శరీర తంత్రకమగును. సత్వము బలభేదము వలన మూడు విధములు— ప్రవరము-మధ్యము-అవరము. అందువలననే ప్రవర మధ్య అవరసత్త్వములు గల పురుషులుందురు.. అందు ప్రవర సత్త్వము గలవారు సారములందు చెప్పబడిన సత్త్వసారము కలవారూ స్వల్ప శరీరులై యుండియు వారు నిజాగంతు కారణములచే కల్గిన పెద్ద పెద్ద బాధలయందు కూడ సత్త్వ గుణ విశేషము వలన బాధను కనపరచరు. మధ్యసత్త్వము గలవారు ఇతరులను ఆసరాగా చేసికొని తమనుతాము ఆధారముగా చేసుకొని యుందురు. లేదా ఇతరుల నుండి అభయమును పొంది ఆపై ప్రవర్తింతురు. హీనసత్త్వము గలవారు మాత్రము తమనుతాము అవలంబనము చేసికొనక ఇతరుల నాధారముగా దీసుకొనకయూ ప్రవర్తింతురు. వీరు గొప్ప శరీరము కలిగియుండియూ చిన్న చిన్న బాధలను కూడా ఓర్వలేరు. ఎప్పుడునూ భయ శోక లోభముతోకూడి రౌద్ర భైరవ ద్వేషపూరిత బీభత్స వికృత కథలను వినుటయందును, పశు పురుష మాంస రక్తములను జూచి విషాదము, పాలిపోవుట, మూర్ఛ, ఉన్మాద, భ్రమ (కండ్లు

తిరుగుట), క్రిందపడుట, పనిలో నేదోయొక దానికి గురియగుదురు లేదా మరణింతురు.

ఆయుర్వేద దీపిక : తంత్రకము అనగా ప్రేరేపించునది, ఆధారభూత మైనదియును వారిని గురించి సారములందు చెప్పబడినది. అనగా ఎవ్వరైతే సత్త్వ సార పురుష లక్షణములను కలిగియుందురో వారే ప్రవరసత్త్వులు అని తెలిసికొన వలెను. సత్త్వగుణ విశేషము వలన అనగా సత్త్వగుణముచే అణచబడిన వేదనా వికారము వలన వ్యధితులు కానివారుగా అగుపింతురు (బాధపడుచున్నట్లు కన్పింపరు) అని యర్థము. ఇతరులను తమయందుంచుకొని అనగా వేదనను భరించు ఇతరులను చూచి "ఇతడు వేదనలను సహించువాడైనచో నేనునూ వేదనలను సహింపగలను" అని తలచి వేదనలను సహించును అని అర్థము.

## ఆహారశక్తి పరీక్ష

120. ఆహారశక్తితశ్చేతి-ఆహారశక్తి రభ్యవహరణశక్త్యాజరణశక్త్యా చ పరీక్ష్య,-బలాయుషీహ్యాహారాయత్తే.

**తాత్పర్యము :** ఆహార శక్తిని కూడ పరీక్షింపవలెను. ఆహారశక్తిని భుజించు శక్తివలన, జీర్ణింప జేసుకొను శక్తివలననూ పరీక్షింపవలెను. బలము, ఆయుష్షు అనునవి ఆహారము పైననే ఆధారపడియున్నవి (బలము, ఆయుష్షులకు ఆహారమే కారణము).

ఆయుర్వేద దీపిక : జీర్ణింపజేసుకొను శక్తివలననూ అను వచనము చేత ఎవడు ఎక్కువగా తినియూ జీర్ణింప జేసుకొనగలుగునో అతడు ఆహార శక్తి మంతుడని చెప్పబడును. ఎక్కువగా తిని జీర్ణింపజేసుకొనలేని వాడు ఆహార శక్తి యుతుడు కాడు.

## వ్యాయామ శక్తి పరీక్ష

121. వ్యాయామశక్తితశ్చేతి. వ్యాయామశక్తిరపి కర్మశక్త్యా పరీక్ష్యా. కర్మశక్త్యా హ్యనుమీయతే బలత్రైవిధ్యమ్.

**తాత్పర్యము :** వ్యాయామ శక్తి ద్వారా కూడ పరీక్షించుట—వ్యాయామ శక్తిని కూడా కర్మశక్తి (పనులు చేయు శక్తి) వలన పరీక్షింపవలెను. కర్మశక్తి

వలననే మూడు విధములైన బలమును (ప్రవర, మధ్య, అవరబలమును) తెలిసికొనవలెను.

**ఆయుర్వేద దీపిక :** కర్మ (పని) అనగా భారమును మోయుట మొదలైనవి పనిచేయుటయందు శక్తి కర్మశక్తి.

## వయఃపరీక్ష

122. వయస్తశ్చేతి కాలప్రమాణవిశేషాపేక్షిణీ హి శరీరావస్థా వయోఽభిధీయతే. తద్వయో యథాస్థూలభేదేన త్రివిధమ్ బాలం, మధ్యం, జీర్ణమితి. తత్ర బాలమపరిపక్వధాతుమజాతవ్యంజనం సుకుమారమక్లేశసహమసంపూర్ణబలం శ్లేష్మధాతుప్రాయమాషోడశవర్షం, వివర్ధమానధాతుగుణం పునః ప్రాయేణానవస్థితసత్త్వమాత్రింశద్వర్షముపదిష్టమ్: మధ్యం పునః సమత్వాగత-బలవీర్యపౌరుషపరాక్రమగ్రహణధారణస్మరణ వచనవిజ్ఞానసర్వధాతుగుణం బలస్థితమవస్థితసత్త్వమవిశీర్యమాణధాతుగుణం పిత్తధాతుప్రాయమాషష్టివర్షముపదిష్టం: అతః పరం హీయమానధాత్విన్ద్రియబలవీర్యపౌరుషపరా-క్రమగ్రహణధారణస్మరణవచనవిజ్ఞానం భ్రశ్యమానధాతుగుణం వాయుధాతు-ప్రాయం క్రమేణ జీర్ణముచ్యతే వర్షశతమ్. వర్షశతం ఖల్వాయుషః ప్రమాణమస్మిన్ కాలే; సన్తి చ పునరధికోనవర్షశతజీవినోఽపి మనుష్యాః; తేషాంవికృతివర్జ్యైః ప్రకృత్యాదిబలవిశేషైః ఆయుషో లక్షణతశ్చ ప్రమాణముపలభ్య వయసః త్రిత్వంవిభజేత్.

**తాత్పర్యము :** వయస్సు ద్వారానూ పరీక్షింపవలెను. కాలప్రమాణ విశేషమునపేక్షించియుండు శరీరావస్థను వయస్సు అని పేర్కొందురు. ఆ వయస్సు స్థూలముగా బాల్యము, మధ్యము, జీర్ణము (వృద్ధాప్యము) అను మూడు అవస్థలుగా విభజింపబడినది. అందు అపరిపక్వమైన ధాతువులు. పురుష/స్త్రీ లక్షణములు పూర్తిగా బయల్పడకుండుట, క్లేశములను తట్టుకొనలేక యుండుట, బలము సంపూర్ణముగా లేకుండుట, శ్లేష్మధాతువధికముగా నుండుట వలన పదునారు సంవత్సరముల వరకు ఉన్న వయస్సు బాల్యావస్థ యనబడును. ధాతువు లింకనూ పెరుగుచునే యుండుట చేసి సాధారణముగా అస్థిరమైనసత్త్వము కలిగి యుండుట వలననూ ముప్పది సంవత్సరముల వరకు ఉన్న వయస్సును కూడా బాల్యావస్థయనియే చెప్పనైనది. సమముగా ఏర్పడిన బలము, వీర్యము, పౌరుషము, పరాక్రమము,

గ్రహణశక్తి, ధారణాశక్తి, స్మరణశక్తి, వచనశక్తి, విజ్ఞానము, అన్ని ధాతువుల గుణములు స్థిరత్వము పొందిన సత్త్వము, క్షీణింపని ధాతుగుణము, పిత్త ధాతువు ఎక్కువగా నుండుట – ఈ లక్షణముల వలన అరువది సంవత్సరముల వరకును (ముప్పదినుండి అరువది సంవత్సరముల వరకును) ఉన్న వయస్సు మధ్య వయస్సు (మధ్యమావస్థ) యనబడును. ఆ పైన క్షీణించుచున్న ధాతువులు, ఇంద్రియములు, బలము, వీర్యము, పౌరుషము, పరాక్రమము, గ్రహణశక్తి, ధారణశక్తి, స్మరణ శక్తి, వచనశక్తి, విజ్ఞానము, తప్పిపోవుచున్న ధాతుగుణములు, వాయు ధాతువు ఎక్కువగా నుండుట — ఈ లక్షణముల వలన క్రమముగా నూరు సంవత్సరముల వరకును జీర్ణావస్థ యనబడును. ఆ కాలమున ఆయుః ప్రమాణము నూరు సంవత్సరములు. కొందరు వారల నూరు సంవత్సరముల కంటె ఎక్కువ లేదా తక్కువ సంవత్సములు జీవించువారును ఉన్నారు. అట్టి మనుజులకు విహారము లేక ప్రకృతి మొదలైన బల విశేషములచే నుండు ఆయుష్షు యొక్క లక్షణముల ద్వారా దాని ప్రమాణమును తీసికొని వయస్సును మూడు భాగములుగా విభజింప వలెను.

**ఆయుర్వేద దీపిక :** వయస్సు యొక్క స్వరూపము చెప్పబడినది. కాలప్రమాణ విశేషము అపేక్షించునది అనగా కాలము యొక్క ప్రమాణ (కొలత) విశేషము చేత కలసి యుండుటచే కలుగును అని అర్థము. స్థూలముగా అనుట వలన బాల్యావస్థయందు బాల, బాలతర మొదలైన అవస్థా భేదము వలన మూడు కంటె ఎక్కువ అవస్థలుండునని చూపుచున్నాడు. బాల్యము రెండు విధములు- పదునారు సంవత్సరముల వరకును అపరిపక్వ ధాతు స్థితి. రెండవది వృద్ధి నొందు స్థితి. ఇది ముప్పది సంవత్సరముల వరకును ఉండును. ఈ రెండు బాల్యావస్థ భేదములు ఉపయుక్తములే యని తత్ర....అనుట ద్వారా చెప్పుచున్నాడు. పదునారు సంవత్సరముల బాలుని, అల్పములు, మృదువులు అయిన భేషజములచే ఉపచరింపవలెనని శాస్త్రమున చెప్పబడి యున్నది. అటుపైన (ముప్పది సంవత్సరముల వరకు) బాలుడైననూ అల్ప భేషజముచే ఉపచారము చేయనక్కరలేదు. క్రమముగా అనగా ఒక్కసారిగా కాకుండా అరువది సంవత్సరములకు పైన ధాతువులకు హాని కలుగునని చూపుచున్నాడు. ఈ కాలమున అనగా కలియుగమందు నూరు సంవత్సరముల కంటె ఎక్కువ జీవించు వారికి వయస్సు మూడు విధములుగా నెట్లు విభజింపవలెనో "శేషాం వికృతి వర్జైః" అనుట ద్వారా చెప్పబడినది.

వికృతి వర్జ్యైః (వర్జ్యమ్) అనగా వికృతి (వికారము) వదలిన. ప్రకృతి మొదలైన దశవిధ పరీక్ష్య విషయములు ఇచటనే చెప్పబడినవి. అందువలన ప్రకృతిసారమే మొదలైనవాని బల విశేషములచేత ప్రవర అవర మధ్యమని మూడుగా భేదింప బడినవైన ఆ ప్రకృత్యాదులవలన మరల ప్రవర అవర మధ్యమముగా విభజింపబడిన ఆయుష్షు యొక్క ప్రమాణమును గ్రహించి, బాల్య, మధ్య, జీర్ణావస్థలుగా విభజింప వలెను. వీనివలన ఎవరికి ఉత్తమమైన బలము కల శ్లేష్మ ప్రకృతి లేదా సమప్రకృతి గలవానికి దీర్ఘాయుపు కలుగును. హీన బలమనునది ప్రకృతి బల హీనముగా నుండుటవలన జరుగును. ఇట్లే సారము మొదలగు వానియందును తెలిసికొనవలెను. ఇట్లు వయస్సు ప్రకృతి మొదలైనవి సర్వోత్తమముగా నున్న వారు (బలవంతముగా నున్నవారు) నూరు సంవత్సరములకంటె ఎక్కువగా జీవింతురు. అందుచే వారికి నూరకంటె ఇరువది సంవత్సరములు ఎక్కువ ఆయుష్షు కలిగినపుడు పూర్వము చెప్పబడిన విభజన విధి ననుసరించి ముప్పది ఆరు సంవత్సరముల వరకు బాలురనియు, డెబ్బది రెండు సంవత్సరముల వరకు మధ్య వయస్కులనియు, ఆ పైన వృద్ధులనియు. పిలువబడుదురు. ఎవరికి ప్రకృత్యాదులు మధ్యమ బలము కలిగియుండునో వారికి ఆయుః ప్రమాణము ఎనుబది సంవత్సర ముండును. అట్టివారు ఇరువదిమైమి సంవత్సరములవరకు బాలురు అనియు, ఏబది సంవత్సరములవారు మధ్య వయస్కులనియు, అటుపైన వృద్ధులుగాను విభజింప వలెను. ఆయుష్షు యొక్క లక్షణముల చేత అనుటవలన ఆయుష్షు కేవలము ప్రకృత్యాదుల బలముచేతనే గాకుండా శరీరమునందున్న ఆయుర్లక్షణముచేత కూడా వయస్సును నిర్ణయించి, అందు బాల్యావస్థలను విభజించవలెను. ఎవరికి ఇరువది సంవత్సరములు మొదలైన తక్కువ ఆయుష్షు ఉండునని అనుమానిం పబడుదురో వారికి వయోవిభజన యుండదు. వారు మధ్యావస్థ ప్రాప్తించకముందే మరణింతురు.

123. ఏవం ప్రకృత్యాదీనాం వికృతి వర్జ్యానాం భావానాం ప్రవరమధ్యావరవిభాగేన బలవిశేషం విభజేత్. వికృతిబలత్రైవిధ్యేన తు దోషబలం త్రివిధమను మీయతే. తతో భైషజ్యస్య తీక్ష్ణమృదుమధ్యవిభాగేన త్రైవిధ్యం విభాజ్య యథాదోషం భైషజ్యముపచారయేదితి.

తాత్పర్యము : ఈ విధముగా వికారములులేని ప్రకృత్యాదులకు వాటి బలమును ప్రవరమధ్య అవర విభాగముచే విభజించవలెను. వికృతిబల త్రైవిధ్యము

వలన త్రివిధదోషబలమును అనుమానించుట జరుగును. అందుచే ఔషధముయొక్క తీక్ష్ణ మృదుమధ్య యను త్రివిధ విభాగముచేత దోషముననుసరించి ఔషధమును ఇవ్వవలెను. (ప్రవర వికృతిగలవానికి తీక్ష్ణఔషధము మధ్య వికృతిగలవానికి మధ్యౌషధము, అవర వికృతి గలవానికి మృదుఔషధము యివ్వవలెను.)

ఆయుర్వేద దీపిక : ప్రకృత్యాది విభాగము వలన చెప్పబడిన శరీర బల పరీక్ష విషయమును ఉపసంహరించుచున్నాడు. దోషబలము శరీర రోగమైన దోషమును పరీక్షించుటచే తెలియును.

124. ఆయుషః ప్రమాణజ్ఞానహేతోః పునరింద్రియేషు జాతి సూత్రీయే చ లక్షణానుపదేక్ష్యస్తే.

**తాత్పర్యము :** ఆయుః ప్రమాణమును తెలిసికొనుటకు హేతువైన లక్షణములు ఇంద్రియ స్థానమునందును, శరీర స్థానమునందలి జాతి సూత్రీయాధ్యాయము నందును, ఉపదేశింపబడును.

ఆయుర్వేద దీపిక : శరీర - దోష బలములను పరీక్షించుటకు మొదట ప్రతిజ్ఞ చేసిన శరీరపరీక్షను పేర్కొని మరల ఆయుః ప్రమాణమును తెలిసికొనుటకు శరీరపరీక్షను చూపుచున్నాడు. ఇంద్రియేషు అనగా ఇంద్రియస్థానము నందలి అధ్యాయముల యందు. అచట ఇంద్రియ స్థానమున వర్ణము మొదలైన వికృతిచేత, రిష్ట లక్షణములచేతను ఆయువు తగ్గిపోవుటను తెలియవచ్చును. శరీర స్థానములోని జాతిసూత్రీయ శారీరమునందు పుట్టుక నుండియు అనుబంధముగా (అంటిపెట్టుకొని) యున్న లక్షణములచే పురుషునియొక్క దీర్ఘాయువు లేదా అల్పాయువులను నిర్ణయింప వచ్చునని తెలియపరుపబడినది.

## కాలము

125. కాలః పునః సంవత్సరశ్చాతురావస్థా చ; తత్ర సంవత్సరో ద్విధా, త్రిధా,- షోఢా, ద్వాదశధా భూయశ్చాప్యతః ప్రవిభజ్యతే తత్తత్కార్యమభిసమీక్ష్య. అత్ర ఖలు తావత్ షోఢా ప్రవిభజ్య కార్యముపదేక్ష్యతే హేమన్తోగ్రీష్మో- వర్షాశ్చేతి శీతోష్ణవర్షలక్షణాస్త్రయః ఋతవో భవన్తి, తేషామన్తరేష్వితరే సాధారణలక్షణాస్త్రయ ఋతవః-ప్రావృట్ శరద్వసంతా ఇతి. ప్రావృడితి ప్రథమః ప్రవృష్టః కాలః తస్యానుబంధో హి వర్షాః. ఏవమేతే సంశోధనమధికృత్య షట్ విభజ్యన్తే ఋతవః

VENKATESWARA AYU... COLLEGE

**తాత్పర్యము :** కాలమనునది సంవత్సర రూపకాలము మరియు ఆతురావస్థా రూపకాలము. అందు సంవత్సర రూపకాలము రెండు, మూడు, ఆరు, పండ్రెండు మరియు అనేకములైన విధములుగా ఆయా కార్యమును సమీక్షించి విభజింపబడును. ఇందు ఆరు విధములుగా విభజించి దాని కార్యము ఉపదేశింపబడుచున్నది— హేమంత గ్రీష్మ వర్షములు మూడును క్రమముగా శీత ఉష్ణ వర్ష లక్షణములను కలిగియుండును. దానిమధ్యలో సాధారణ లక్షణములు కల్గిన మూడు ఋతువులుండును. అవి ప్రావృట్-శరత్-వసంతములు. ప్రావృడృతువనగా వర్ష ఋతువునకు ముందున్న కాలము. వర్షములు దాని ననుసరించియే వచ్చును. ఈ విధముగా ఋతువులు దోషముల సంశోధనము నాధారముగా జేసికొని విభజింపబడినవి.

**ఆయుర్వేద దీపిక :** దేశ పరీక్షను పూర్తిజేసి కాలపరీక్షను గురించి చెప్పబడినది. సంవత్సర అయన భేదము వలన రెండు విధములు. శీత ఉష్ణ వర్ష భేదము వలన మూడు విధములు. ఋతు భేదముచే ఆరు విధములు. మాస భేదముచే పండ్రెండు విధములు. పక్ష భేదము వలన ఇరువది నాలుగు విధములు. ప్రహరాదుల వలన అనేక విధములుగను విభజింప వచ్చునని తెలియనగును. ఆయా కార్యమును అనగా అయనాది భేదమును తెలియుటచే చేయవలసిన కార్యమును అని అర్థము. సాధారణము అనగా ఎక్కువగాలేని శీతోష్ణ వర్షములుండు ఋతువులు. వర్షమునకు ముందు అనుటచేత ఆషాఢ శ్రావణములను గ్రహింపవలెను. ఈ రెండు మాసములను ద్విమాస ఋతు భాగమునకు ముందు చెప్పి అపైన రెండేసి మాసములను వర్షాది ఋతువులకు అన్వయించి యథాక్రమముగా తెలియవలెను. ఈ ఋతుక్రమము ఔషధమునకు రసోత్పత్తి జరుగుట మొదలైన వాని నాధారముగా జేసికొని చెప్పబడలేదుకానీ శరీర శోధన క్రియలను అనుసరించియే అని చూపుటకు "సంశోధన మధికృత్య" అని చెప్పబడినది. ఇదియేక్రమము సిద్ధి స్థానమునందు చెప్పబడినది. "ప్రావృట్ శుచినభౌ జ్ఞేయో శరదూర్జసహౌ పునః. తపస్యశ్చ మధుశ్చైవ వసన్తః శోధనం ప్రతి"— సిద్ధి స్థానము- 6వ అధ్యాయము. (అనగా ప్రావృట్ ఋతువు ఆషాఢ శ్రావణ మాసములు; కార్తీక మార్గశిర మాసములు శరదృతువు, ఫాల్గుణ-చైత్రమాసములు వసంతఋతువు. ఇది శోధనకు అనుకూలమైన వర్గీకరణము.) గంగానదికి దక్షిణమున ఎక్కువ వర్షము ఉంగుట వలన అచట ప్రావృట్ మొదలగు క్రమము. గంగకు ఉత్తరమున చలి ఎక్కువగా నుండుటంచేసి అచట హేమంత శిశిరములు మొదలుగా నుండును. కాశ్యపుని వచన వచన ప్రకారము గూడ—

"భూయో వర్షతి పర్జన్యో గంగాయా దక్షిణే జలమ్, తేన ప్రావృట్ వర్షాఖ్యౌ ఋతూ తేషాం ప్రకల్పితౌ. గంగాయా ఉత్తర కూలే హిమవదంబు సంకులే భూయః శీతమత స్తేషాం హేమంత శిశరవృతూ...." ఈ విషయమును కొందరు ఒప్పుకొందురు. ఇచట "సంశోధనము నాధారముగా చేసికొని" అనుటచే ఈ క్రమము సరికాదు. ఈ సందర్భమున చెప్పబడిన విభజన క్రమము దేశము ననుసరించి చెప్పబడినచో అట్లే ఉండి యుండును. శోధన విషయముండదు. అందువలన కాశ్యపునిచే చెప్పబడిన దేశ భేదముచే కలుగు ఋతు విభజన ఇచట సమ్మతము గాదు.

## ఋతుచర్య

126. తత్ర సాధారణలక్షణేష్వృతుషు వమనాదీనాం ప్రవృత్తిర్విధీయతే, నివృత్తిరితరేషు.సాధారణలక్షణా హి మందశీతోష్ణవర్షత్వాత్ సుఖతమాశ్చ భవంత్యవికల్పకాశ్చ శరీరౌషధానామ్.ఇతరే పునరత్యర్థశీతోష్ణవర్షత్వాద్దుఃఖతమాశ్చ భవన్తి వికల్పకాశ్చ శరీరౌషధానామ్.

**తాత్పర్యము :** అందు సాధారణ లక్షణములు గల ఋతువులందు (ప్రావృట్, శరత్, వసంత) వమనాదుల ప్రవృత్తి చేయబడును (సంశోధనము చేయబడును). ఇతర ఋతువులందు అవి చేయబడవు. సాధారణ లక్షణములు గల ఋతువులు అల్పమైన శీత, ఉష్ణ, వర్షముండుటచే సుఖతమములై శరీర ఔషధము లకు వికల్పమును కలుగజేయునవి కావు. ఇతర ఋతువులు అతిగానున్న శీత ఉష్ణ వర్షముల వలన దుఃఖతమములై శరీర ఔషధములకు వికల్పమును కలిగించు నవగును.

**ఆయుర్వేద దీపిక :** శరీర ఔషధములకు వికల్పమును కలిగించునవి కావు అనగా శరీరమునకు కృత్రిమముగా తాపమును కల్గించుట మొదలగు గుణము లచే భేదకములు గావు. మరియు ఔషధమునకునూ ప్రమాణమును పెంచుట తగ్గించుటయను భేదమును కలుగజేయునవిగా నుండవు. శరీరౌషధములకు వికల్పమును కల్గించునవి అనగా అత్యయిక పరిస్థితిలో వమనాదులు అవశ్యముగా చేయవలసి వచ్చినపుడు ఔషధమునకు యథోక్తమగు (తరువాతి సూత్రమున చెప్పబడు) కృత్రిమ గుణమునిచ్చుట. అటులనే శరీరమునకును వికల్పములగును. (అనగా ఈ ఋతువు లందు సాధారణముగాచేయు సంశోధన విధియందు శరీర ఔషధములను సిద్ధము చేసుకొను విధానము సరిపడక అంతకు ఎక్కువగానీ, వేరు విధముగా గానీ ఈ రెంటిని సిద్ధపరచవలసి వచ్చును.

127. తత్ర హేమన్తే హ్యతిమాత్రశీతోపహతత్వాత్ శరీరమసుఖోపపన్నం భవన్త్యతిశీతవాతాధ్మాతమతిదారుణీభూతమవబద్ధదోషం చ.భేషజం పునః సంశోధనార్థముష్ణస్వభావం శీతోపహతత్వాన్మందవీర్యత్వమాపద్యతే,-తస్మాత్తయోః సంయోగే సంశోధన మయోగాయోపపద్యతే.శరీరమపి చ వాతోపద్రవాయ.

గ్రీష్మే పునర్భృశోష్ణోపహత్వాత్ శరీరమసుఖోపపన్నం. భవతి.ఉష్ణవాతా-ధ్మాతమతిశిథిలమత్యన్తప్రవిలీనదోషమ్,భేషజం పునః సంశోధనార్థముష్ణ-స్వభావముష్ణానుగమనాత్ తీక్ష్ణతరత్వమాపద్యతే తస్మాత్తయోః సంయోగే సంశోధనమతియోగాయోపపద్యతే శరీరమపి పిపాసోపద్రవాయ.

వర్షాసు తు మేఘజలావతతే గూఢార్కచన్ద్రతారే ధారాకులే వియతి భూమౌ పఙ్కజలపటలసంవృతాయామత్యర్థోప్రక్లిన్నశరీరేషు భూతేషు విహతస్వభా-వేషు కేవలేష్వౌషధగ్రామేషు తోయతోయదానుగతమారుతసంసర్గాద్ గురు-ప్రవృత్తీని వమనాదీని భవన్తి,గురుసముత్థానాని చ శరీరాణి. తస్మాద్వమనా-దీనాం నివృత్తిర్విధీయతే వర్షాస్తేష్వృతుషు న చేదాత్యయికం కర్మ. అత్యయికే పునః కర్మణి కామమృతువికల్పకృత్రిమగుణోపధానేనయథర్తు గుణ విపరీతేనభేషజం సంయోగసంస్కారప్రమాణవికల్పేనోపపాద్య ప్రమాణవీర్యసమం కృత్వా తతః ప్రయోజయేదుత్తమేన యత్నేనా-వహితః.

తాత్పర్యము : అందు హేమంత ఋతుపున ఎక్కువగా నున్న చలిచే శీతముచే ఉపహతమైన శరీరము కష్టమును పొందును. చలిగాలిచే ప్రభావితమై దారుణముగా నుండి శరీరమున దోషములు బద్ధములగును. ఇట్టి సమయమున సంశోధనము చేయు ఔషధము ఉష్ణ స్వభావము కలిగియుండి అతిశీతాపహతమై మంద వీర్యత్వమును పొందును. కాపున ఈ రెండింటి సంయోగము వలన (శీతోపహత బద్ధ దోషయుక్తమైన శరీరము మరియు శీతోపహతమైన సంశోధనౌషధము ఈ రెండును కలియుట వలన) సంశోధనము అయోగమునకై చేసినదగును (సరియగు ఫలితముల నివ్వదని భావము). శరీరమునకును వాతోపద్రవమును కల్గించునదగును. గ్రీష్మమున మరల అతి ఉష్ణముచే పీడింపబడిన శరీరము కష్టమును పొందును. ఉష్ణ వాత ఆతపములచే పీడింపబడియు అతి శిథిలము అతిగా విలీనమైన దోషములను కలిగి యుండును. ఇచట సంశోధనమునకు ఇవ్వవలసిన ఉష్ణస్వభావముగల

ఔషధము ఉష్ణము (కాల సంబంధమైన ఉష్ణము)చే ప్రభావితమై తీక్ష్ణతరమగును. వీని సంయోగము వలన సంశోధనము అతి యోగమై శరీరమునకు పిపాసాది ఉప ద్రవములు కలుగును. వర్షములయందు (వర్ష ఋతువునందు) సూర్య చంద్ర నక్ష త్రములు- మేఘములు, వర్షపు నీరుతో ఎల్లప్పుడును కప్పబడి యుండును. ఆకాశము ధారలతో నిండి యుండును. భూమి యందు బురద నీటి పొరలచే కప్పబడి యుండుటచేత ప్రాణులన్నియు క్లేదముచే ప్రభావితమైన శరీరము గలవారగుదురు. ఔషధ సముదాయమునందును నీరు, మేఘములను వెంబడించు గాలి, వీని సంసర్గము వలన వమనాది ఔషధములు గురుత్వమును పొందును. శరీరములును గురుగుణము కలిగి యుండును. (అపుడును వమనాది సంశోధన క్రియలు సరిగా సంపన్నము కావు) కావున వర్షాంత (హేమంత గ్రీష్మ వర్ష) ఋతువులందు వమనాదులు నిషే ధింపబడును. అత్యయికముగా చేయవలసి వచ్చినప్పుడు కృత్రిమ గుణములను కల్పిం చుటచే ఆ యా ఋతువు యొక్క గుణమునకు వ్యతిరేక గుణములచే కావలసిన ఋతువును కల్పించుకొని ఔషధమును సంయోగ, సంస్కార ప్రమాణముల యందు కావలసిన వికల్పములను చేసుకొని ప్రమాణమునకు వీర్యముండునట్లుగా జేసి అటు పైన అన్నింటిని తెలిసికొని ఉత్తమముగా ఉపయోగింపవలెను.

**ఆయుర్వేద దీపిక :** హేమంతాదుల యందు శరీరమునకెట్లు దుఃఖము కలుగునో చెప్పబడినది. అతిబద్ధ దోషమనగా అతిగా బద్ధమైన (బంధింపబడిన దోషము) ఆ రెండును అనగా శరీరము ఔషధమును, వర్షమునకు మేఘమును వెంబడించు గాలికిని సంసర్గము కలుగును. గురు ప్రవృత్తిని కలిగి యుండునవి యనగా సాధారణముగా గురు గుణముగల ఔషధములవలె సుఖకరమైన ప్రవృత్తి లేనివిగా నుండునని యర్థము. లేదా ఎక్కువ ప్రవృత్తిని చేయవలసినవి. (శుద్ధ్యాదు లను చేయవలసినవి) అగుననియు అర్థము. గురు సముత్థానములనగా శరీరములు సంశోధనకు కష్టతరములై పెద్ద ప్రయత్నముతో ఎక్కువ కాలమునకు ప్రకృతావ స్థకు వచ్చునని అర్థము. వర్షాంతములందు అనగా హేమంత గ్రీష్మ వర్ష ఋతువుల యందు. హేమంతాదుల యందును అత్యయిక వ్యాధుల యందు చేయవలసిన సంశో ధన విధిని చెప్పుచున్నాడు. వికల్ప అనగా అల్పగుణ యుక్తములుగా జేసి కృత్రిమ ముగా గుణములను కల్పించుట యెట్లనగా శీతాకాలమున శీతమును నివారించుటకు ఇంటిని వేడిగా నుండునట్లు చేయుట. 'శీతే శీత ప్రతీకార ముష్ణే చోష్ణ నివారణమ్', కృత్వా కుర్యాత్ క్రియాం ప్రాప్తం క్రియాకాలం న హాపయేత్" అని సుశ్రుత వచ

నము క్రియా కాలములను ప్రాప్తము నొందిన దోషములకు దానిని దాటి శీతాకాలమున శీత ప్రతీకారమును ఉష్ణ కాలమున ఉష్ణ నివారమును చేసి క్రియలను (సంశోధన క్రియలను) చేయవలెను. (సు. సూ. 35. అ) ఋతువునకు చేయవలసిన ప్రతీకారమును చూపి భేషజమునకు ప్రతీకారము చెప్పబడినది. సంయోగ వికల్పమెట్లనగా శీతాకాలమున త్రివృత్ (తెగడ)తోనూ, ఉష్ణకాలమున గోమూత్రముతోనూ కలిపి సంశోధ నౌషధమునిచ్చుట. ప్రమాణ వికల్పమెట్లనగా అయోగమును పోగొట్టుటకు ఎక్కువ మోతాదులో త్రివృత్‌ను ఇచ్చుట మొదలైనవి. ఇచట ప్రమాణ వికల్పము అనునది ప్రాణాప్రాయము కలుగ కుండునట్లుండ వలెను. మరియు సంయోగ వికల్పమును విరుద్ధ వీర్య మిశ్రణము కాకుండునట్లు చేయవలెను. ఈ విషయమును తెలియజేయుటకు ప్రమాణ వీర్య సమమును చేసి అని చెప్పబడినది.

## రోగి యొక్క వివిధ అవస్థలు

128. ఆతురావస్థాస్వపి.తు కార్యాకార్యంప్రతి కాలాకాలసంజ్ఞా,తద్యథా అస్యామవస్థాయామస్య భేషజస్య కాలః పునరస్యాస్యేతి.ఏతదపి హి భవత్యవస్థావిశేషేణ తస్మాదాతురావస్థాస్వపి హి కాలాకాల సంజ్ఞా.తస్య పరీక్షా ముహుర్ముహురాతురస్య సర్వావస్థావిశేషావేక్షణం యథావద్భేషజప్రయోగార్థమ్.న హ్యతిపతి తకాలమప్రాప్తకాలం వా భేషజముపయుజ్యమానం యోగికం భవతి, కాలో హి భైషజ్యప్రయోగపర్యాప్తిమభినిర్వర్తయతి.

**తాత్పర్యము :** రోగి అవస్థయందును కార్యా కార్యములకు కాల అకాల సంజ్ఞ గలదు. అది యెట్లనగా - ఈ అవస్థ ఈ భేషజముయొక్క కాలము (ఈ పరిస్థితులలో ఈ ఔషధము నివ్వవచ్చును) ఈ అవస్థ ఈ ఔషధమునకు కాలము కాదు (ఇవ్వరాదు). ఇట్టిది అవస్థావిశేషమువలననే కలుగును. కావున రోగియొక్క వివిధ ములైన అవస్థలు కాలము (ఔషధ ప్రయోగమునకు తగిన కాలము) అకాలము (ఔషధము నివ్వకూడని కాలము) గా గుర్తింపబడినవి. దాని పరీక్ష యెట్లనగా (దానిని గుర్తించుట) మాటిమాటికిని రోగియొక్క అవస్థా విశేషములను అన్నింటిని చూచి సమయమునుబట్టి యథావిధిగా ఔషధమును ప్రయోగించవలెను. కాలము (ఔషధము ప్రయోగింపవలసిన కాలము) దాటిన తరువాతనూ కాలము రాకముందునూ ప్రయోగింపబడిన భైషజ్యము సరియైన ఫలితము నివ్వదు. సరియైన కాలమునందు ప్రయోగించిన ఔషధము సత్ఫలితముల నిచ్చును.

**ఆయుర్వేద దీపిక :** రోగియొక్క అవస్థావిశేషమును గురించి చెప్ప బడినది. దీనికి ఉదారహరణ నవజ్వరము (క్రొత్తగా వచ్చిన జ్వరము) కషాయ కాలము కాదు. (ఇచట కషాయము నివ్వరాదు), జ్వరము వచ్చిన తరువాత ఆరు దినములు దాటిన పిదప కషాయకాలమగును. (కషాయము నివ్వ వచ్చును.) భైషజ్య ప్రయోగ పర్యాప్తిని - ఔషధమును ప్రయోగించుటచే సాధింపదగిన సిద్ధిని (ఫలిత మును) ఔషధము నిచ్చుట కార్యము, ఇవ్వకుండుట అకార్యము. ఔషధము నివ్వ వలసిన రోగావస్థ కాలము. ఔషధము నివ్వకూడని రోగావస్థ అకాలము అని గ్రహింపవలెను.

## ప్రవృత్తి - co-ordinative movement

129. ప్రవృత్తిస్తు ప్రతికర్మ సమారంభః. తస్య లక్షణం భిషగౌషధాతురపరిచార- కాణాం క్రియాసమాయోగః.

**తాత్పర్యము :** ప్రవృత్తి యనగా చికిత్సను ప్రారంభించుట. దాని లక్ష ణము - వైద్యుడు, ఔషధము, రోగి, పరిచారకుడు - ఈ భావములు తమ తమ పనులతో ఒకచోట కూడి యుండుట.

## ఉపాయము

130. ఉపాయః పునర్భిషగాదీనాం సౌష్ఠవమభివిధానం చ సమ్యక్.తస్యలక్షణం - భిషగాదీనాం యథోక్త గుణ సంపత్ దేశకాల ప్రమాణ సాత్మ్యక్రియాదిభిశ్చ సిద్ధికారణైః సమ్యగుపాదితస్యౌషధస్యావచారణ మితి.

**తాత్పర్యము :** ఉపాయమనగా వైద్యుడు మొదలైన అంశములన్నియు మంచి లక్షణములతో కూడి సరిగా అమరియుండుట. దాని లక్షణము యథోక్త లక్షణములతో కూడియున్న వైద్యుడు మొదలైన నాలుగు అంశములు మరియు దేశము, కాలము, ప్రమాణము, సాత్మ్యము, క్రియ. ఈ మొదలైన సిద్ధకారణములచే సరిగా తయారింపబడిన ఔషధమును ప్రయోగించుట.

**ఆయుర్వేద దీపిక :** చివరనుమిగిలిన ఉపాయమును గురించి చెప్పడమై నది. యథోక్త గుణములతోకూడి యుండుటను సూచించుటకు సౌష్ఠవ శబ్దము ఉప యోగింపబడినది.

131. ఏవమేతే దశపరీక్ష్య విశేషాః పృథక్ పృథక్ పరీక్షితవ్యా భవన్తి.

తాత్పర్యము : ఈ విధముగా పరీక్షింపవలసియున్న పది అంశములను విడివిడిగా పరీక్షింపవలెను.

ఆయుర్వేద దీపిక : పరీక్ష్య విశేషములను క్రమముగా పరీక్షింపవలసిన పద్ధతిని వివరించడమైనది.

## పరీక్షవలన ప్రయోజనము

132. పరీక్షాయాస్తు ఖలు ప్రయోజనం ప్రతిపత్తి జ్ఞానమ్. ప్రతిపత్తిర్నామ యో వికారో యథా ప్రతిపత్తవ్య స్తథాఽనుష్ఠానజ్ఞానమ్.

తాత్పర్యము : పరీక్ష వలన కలుగు అసలైన ప్రయోజనము ప్రతిపత్తి జ్ఞానము. ప్రతిపత్తి యనునది ఏ వికారమును ఏ విధముగా అనుసరించవలెనో (ఎదుర్కొనవలెనో) ఆ విధముగా అనుసరించు జ్ఞానము.

ఆయుర్వేద దీపిక : పరీక్షయొక్క ప్రయోజనమేమియను ప్రశ్నకు ఉత్తరమును చెప్పడమైనది. ప్రతిపత్తి శబ్దముయొక్క అర్థమును విడదీసి చెప్పు చున్నాడు. ప్రతిపత్తవ్య మనగా అనుష్టానముతో (నిష్ఠతో) చేయవలసినది.

133. యత్ర చ వమనాదీనాం ప్రవృత్తిః, యత్ర చ నివృత్తిః తద్వ్యాసతః సిద్ధిషూత్తర ముపదేక్ష్యామః.

తాత్పర్యము : వమనాదులు ఎచట జరుగునో (ప్రవర్తించునో) ఎచట ఆగిపోవునో అను విషయమును సిద్ధిస్థానమునందలి అధ్యాయములలో విశదముగా ఉపదేశింతుము.

ఆయుర్వేద దీపిక : వమనాదులు ఎచట ప్రవర్తించును, ఎచట ఆగిపోవును అను ప్రశ్నకు సమాధానమును అతి దేశముగా చెప్పుచున్నాడు.

134. ప్రవృత్తి నివృత్తి లక్షణ సంయోగే తు గురు లాఘవం సంప్రధార్య సమ్యగధ్యవస్యేదన్యతర నిష్ఠాయామ్. సంతి హి వ్యాధయః శాస్త్రేషూత్సర్గాపవాదైరుపక్రమం ప్రతినిర్దిష్టాః. తస్మాద్గురు లాఘవం సాంప్రదాయం సమ్యగధ్యవస్యేదిత్యుక్తమ్.

**తాత్పర్యము :** ప్రవృత్తి మరియు నివృత్తి లక్షణములు ఒకదానితో నొకటి కలసియున్నపుడు ఆ రెండింటిలో ఏ లక్షణము లెక్కువగానున్నవో ఏవి తక్కువగా నున్నవో చూచి సరియైన (అధికముగా నున్న) స్థితిని నిర్ణయింప వలెను. శాస్త్రములయందు చికిత్స చేయవలసినవి చేయకూడనివి అయిన వ్యాధులను గూర్చి చెప్పబడినది. అందువలన గురుత్వ లఘుత్వములను చూచి సరియైన నిర్ణయ మును చేయవలెనని చెప్పబడినది.

**ఆయుర్వేద దీపిక :** ప్రవృత్తి నివృత్తి లక్షణము లొకచోట కలసి యున్నపుడు చేయవలసిన కర్తవ్యమేమి ? అను ప్రశ్నకు సమాధానము చెప్పబడి నది. అధ్యవస్యేత్ అనగా నిర్ణయమును చేయవలెనని అర్థము. అన్యతర నిష్ఠా యామ్ అనగా అన్యతర పరీక్ష్య వ్యవస్థయందు (ఒక దానిని ఇంకొక దానితో పోల్చి వానిని ఇది ఇంత బలమైనది ఇది ఇట్లున్నది అని విభజించి తెలియుట ఇచట గురు లఘుత్వములను తెలుసుకొనుట ద్వారా గురు ప్రతి క్రియ ఎక్కువగా నున్న దానికి చికిత్స చేయుట- దాని ననుసరించి చికిత్స చేయుట) నిశ్చయింపవలెనని చెప్ప కున్ననూ తెలిసికొనవలసిన విషయము. అందువలన గురు వ్యాధి ప్రతీకార క్రియనే నిర్ణయింపవలెనని శాస్త్రకారుడు సాక్షాత్తూ చెప్పలేదు. దీనినే భంగ్యంతరముగా గురు వ్యాధికి చికిత్స చేయుట లఘు వ్యాధికి చేయకుండుట శాస్త్రములందు చెప్పబడినవని ఉటంకించడమైనది. సరిగా నిర్ణయింపవలెననుటచే ఉత్సర్గముగా నున్న లఘు వ్యాధిని వదలి అపవాదముగా నున్న గురువ్యాధిని చికిత్సింపవలెనని నిర్ణయము చేయవలెను. బలవంతముగా నున్న ఉప ద్రవమును చికిత్సింపవలెననుటచే దుర్బలమైన దానిని వదలి బలవంతమైనదానికి చికిత్సను పేర్కొనుట జరిగినది. (ప్రవృత్త లక్షణ ములు, నివృత్త లక్షణములు ఒకదానితో నొకటి కలసియున్న సమయమున రెంటినీ సమీక్షించి ప్రవృత్తి లక్షణము లెక్కువగా నున్నచో వమనాదులను ప్రవర్తింపజేయ వలెను. నివృత్తి లక్షణము లున్నపుడు వానిని ఆపివేయవలెనని సారాంశము).

## వమన ద్రవ్యములు - వాని కల్పనములు

135. యాని తు ఖలు వమనాదిషు భేషజద్రవ్యాణ్యుపయోగం గచ్ఛంతి తాన్యను- వాఖ్యాస్యామః, తద్యథా - ఫలజీమూతకేక్ష్వాకుధామార్గవకుటజకృతవేధన- ఫలాని, ఫలజీమూతకేక్ష్వాకుధామార్గవపత్రపుష్పాణి, ఆరగ్వధవృక్షకమదన- స్వాదుకణ్టకపాఠాపాటలాశార్ఙ్గేష్టామూర్వాసప్తపర్ణనక్తమాలపిచుమర్దపటోల - సుషవీగుడూచీచిత్రక సోమవల్కశతావరీద్వీపిశిగ్రుమూలకషాయైః, మధుక-

మధూకకోవిదారకర్బుదారనీపవిదులబిమ్బీశణపుష్పీసదాపుష్పీప్రత్యక్పుష్పీకషాయైశ్చ, ఏలాహరేణుప్రియఙ్గుపృథ్వీకాకుస్తుమ్బురుతగరనలదహ్రీబేరతాలీశోశీరకషాయైశ్చ, వాలగోపకషాయైశ్చ, ఇక్షుకాణ్డేక్షుక్ష్వేక్షువాలికాదర్భపోటగళకాలఙ్కృతకషాయైశ్చ, సుమనాసౌమనస్యాయనీహరిద్రాదారుహరిద్రావృశ్చీరపునర్నవామహాసహాక్షుద్రసహాకషాయైశ్చ, శాల్మలీశాల్మలికభద్రపర్ణ్యేలాపర్ణ్యుపోదికోద్దాలకధన్వనరాజాదనోపచిత్రాగోపీశృఙ్గాటికాకషాయైశ్చ, పిప్పలీపిప్పలీమూలచవ్యచిత్రకశృఙ్గబేరసర్షపఫాణితక్షీరక్షారలవణోదకైశ్చ, యథాలాభం యథేష్టం చాఽపి ఉపసంస్కృత్య వర్తిక్రియాచూర్ణావలేహస్నేహకషాయమాంసరసయవాగూయూషకామ్బలికాక్షీరోపదేయాన్ మోదకాన్ అన్యాంశ్చ భక్ష్యప్రకారాన్ వివిధానువిధాయ యథార్హం వమనార్హాయ దద్యాత్ విధివద్వమనం, ఇతి కల్పసఙ్గ్రహో వమనద్రవ్యాణాం, కల్పమేషాంవిస్తరేణోత్తరకాలముపదేక్ష్యామః.

తాత్పర్యము : వమనాది క్రియలకు యే భేషజ ద్రవ్యము ఉపయోగ పడునో వానిని గురించి చెప్పుకొందము. వమన ద్రవ్యములు— మంగకాయ, దేవదాళి, చేదుసొర, పెద్ద చేదుబీర, కొడిశపాల, చిన్నచేదుబీర - వీని విత్తులను, మంగకాయ, దేవదాళి, చేదుసొర, చేదు బీర - వీని ఆకులు మరియు పువ్వులును, రేల, కొడిశపాల, మంగకాయ, పల్లేరు, చిరుబొద్ది, కలిగొట్టు, గురువింద, చాగ, ఏదాకుల అరటి, కానుగ, వేప, చేదు పొట్ల, కాకర, తిప్పతీగె, తెల్ల చంద్ర, చిత్రమూలము, పిల్లిపీచర, వాకుడు మునగవేళ్ళు వీని కషాయములతో: అతి మధురము, యిప్ప, ఎఱ్ఱ దేవ కాంచనము, తెల్ల దేవకాంచనము, కడిమి, ప్రబ్బలి, దొండ, శణపుష్పి, సదా పుష్పి, (ఎఱ్ఱపత్తి) ఉత్తరేణి. వీని కషాయములు: ఏలకులు, రేణుకలు, ప్రేంఖణము, పెద్ద జీలకర్ర, తుంబురులు (ఎర్ర ధనియాలు) గ్రంధి తగరము, వట్టివేళ్ళు, కురువేరు, తాళీసపత్రి, సుగంధిపాల, వీని కషాయములు: చెఱకు, తెల్ల చెఱకు, వెల్లి దర్భలు, కిక్కిసగడ్డి. కసివెంద వీని కషాయములు: జాపత్రి, మాలతి, పసుపు, మాని పసుపు, గలిజేరు, తెల్ల గలిజేరు, అడవి మినుము, అడవి పెసర వీటి కషాయములు: బూరుగ, దాసెన, పెద్ద గుమ్ముడు, సన్న రాష్ట్రము, బిచ్చలి, యిరుగుడు, తడ, పాల, నేపాళ, సుగంధిపాల, మనుబాల— వీని కషాయముల తోడను: పిప్పళ్ళు, మోడి, చవ్యము, చిత్రమూలము, శొంఠి, ఆవాలు, వీటిచే పాటితము గావింపబడిన క్షీరోదకము, క్షారోదకము, లవణోదకములు, వీనిలో దొరికినంతవరకు కొన్నింటిని

గానీ అన్నింటినిగానీ, తీసికొని సంస్కారము చేసి వర్తులు, చూర్ణములు, అవలేహములు, ఘృత తైలములు, కషాయములు, మాంస రసములు, యవాగూ, యూష, కాంబలిక, క్షీరపాక, మోదక- ఇంకను ఇతరములైన కల్పములను తయారించి వమనమునకు అర్హుడైన వానికి తగినట్లు విధి ననుసరించి వమనమునకు యివ్వవలెను. ఇది వమన ద్రవ్యముల కల్ప సంగ్రహము, వీని ప్రయోగమును విస్తారముగా మున్ముందు చెప్పుకొందము.

**ఆయుర్వేద దీపిక :** ప్రస్తుతము వమనాదులయందు యే ఔషధ ద్రవ్యములు పనికి వచ్చునను ప్రశ్నకు సమాధాన మివ్వబడినది. శార్ఙ్గేష్టా- గురువింద: సోమవల్క-ఖదిర (చంద్ర): సుషవీ-కాకర: ద్వీపీ-వాకుడు: ద్వీపి శత్రువనగా పిల్లి పీచర అని తెలియవలెను. విదుల-ప్రబ్బలి: శతపుష్పా-తేలుమణి: సదాపుష్పము-ఎఱ్ఱ వతి: పోటగల-కిక్కిస: సుమనా-జాతి: సౌమన శ్యాయనీ-మాలతి: శాల్మలికము-దాసిన (రోహితకము) లేదా చిన్న బూరుగ: ఖద్రపర్ణీ-పెద్దగుమ్ముడు: ఏలాపర్ణీ-సన్నరాష్ట్రిము: ఉద్దాలక-బిచ్చలి: గోపీ-సుగంధిపాల: వర్తిక్రియ యనగా వర్తివలె దీర్ఘముగ నుండు తిను బండారము, ఇచట అరగ్వధాది, మధ్వాది వర్గములను విడిగా చెప్పుట బహుశా సమాన గుణత్వమును విభేదించునను అర్థమును చూపుటకై చేసినది. కల్పమనగా కల్పము-ప్రయోగము అని అర్థము- మున్ముందు అనగా కల్పస్థానమునందు-

## విరేచన ద్రవ్యములు - వాని వివిధ కల్పనములు

136. విరేచనద్రవ్యాణి తు -శ్యామాత్రివృత్ చతురఙ్గులతిల్వకమహావృక్షసప్తలా-శంఖినీద న్తీద్రవ న్తీనాం క్షీరమూలత్వక్పత్రపుష్పఫలాని యథాసంయోగ త్తైసై: క్షీరమూలత్వక్పత్రపుష్పఫలై: విక్లిప్తావిక్లిప్తై: అజగన్ధఅశ్వగన్ధఅజశృఙ్గీ క్షీరిణీనీలినీక్లీతకకషాయైశ్చ ప్రకీర్యోదకీర్యామసూరవిదలాకమ్పిల్లవిడఙ్గ-వాక్షీకషాయైశ్చ, పీలుప్రియాలమృద్వీకాకాశ్మర్యపరూషకబదరదాడిమామలక-హరీతకీవిభీతకీవృశ్చీరపునర్నవావిదారిగన్ధాదికషాయైశ్చ, శీధుసురాసౌవీరకతు-షోదక మైరేయమేదకమదిరామధుమధూలకధినామ్లకువలబదరఖర్జూరకర్కం-ధుభిశ్చ, దధిదధిమణ్డోదశ్విద్భిశ్చ, గోమహిష్యజావీనాం చ క్షీరమూత్రై: యథాలాభం యథేష్టం వాపి ఉపసంస్కృత్య వర్తిక్రియా చూర్ణాసవలేహ-

స్నేహకషాయమాంసరసయూషకామ్బలికాయవాగూక్షీరోపధేయాన్ మోద-కాన్ అన్యాంశ్చ భక్ష్య ప్రకారాన్(వికారాన్) వివిధాంశ్చ యోగానను విధాయ-యథాస్వం విరేచనార్హాయ దద్యాద్విరేచనం, ఇతి కల్పసంగ్రహో విరేచన ద్రవ్యాణాం కల్పమేషాం విస్తరేణ యథావదుత్తరకాలముపదేక్ష్యతే.

**తాత్పర్యము :** విరేచన ద్రవ్యములు- నల్లతెగడ, తెల్లతెగడ, రేల, లొద్దుగ, జెముడు, సంబరేణు, ఈశ్వరీ, నేపాళము, పెద్దనేపాళము- వీని యొక్క-పాలు, వేళ్ళు, పట్ట, పత్రములు, పుష్పములలో ఒకదాని పాలు, వేళ్ళు, పట్ట, పత్రములు పుష్పములను, ఇంకొకదాని పాలు, వేళ్ళు, పట్ట, పత్రములు, పుష్పములతో కలిపిగానీ, కలుపకగానీ గ్రహించి- వావింట, పెన్నేరు, దుష్టపుతీగ, పాలచెట్టు, నీలిచెట్టు, అతిమధురము. వీని కషాయములతో కలుత్రానుగ, త్రానుగ, నల్లతెగడ, కంపిల్లము, వాయు విడంగములు, ఖరణిక వీని యొక్క-కషాయములతోడను, కొండగోగు, సారచెట్టు, పెగ్గుమ్మడు, చిట్టీత, రేగు, దానిమ్మ, ఉసిరికాయ, కరక్కాయ, తానికాయ, గలిజేరు, తెల్లగలిజేరు, విదారిగంధాది గణము వీని యొక్క- కషాయములతోను శీధు, సుర, సౌవీరకము, తుషోదకము, మైరేయకము, మదిర, తేనె, ధాన్యామ్లము వీని తోడను: పెద్దరేగు, చిన్నరేగు, ఖర్జూర, పులరేగు- వీనితో తయారింపబడిన శీధువుతోడను, పెరుగు, పెరుగు మీద తేటనీరు, మజ్జిగ వీని తోడను: ఆవు, మేక, గెదె, గొఱ్ఱె- వీని పాలు మరియు మూత్రములతోడను సంస్కరించి వర్తులు, చూర్ణములు, ఆసవములు, లేహములు, ఘృతతైలములు, కషాయములు, మాంసరసములు యూష, కాంబలిక, యవాగు క్షీరపాక మోదకాదులైన అనేక విధములైన భక్ష్య విశేషములను తయారించి విరేచనము చేయింపతగినవానికి తగినట్లు విధి ప్రకారము యివ్వవలెను. పై చెప్పబడిన ద్రవ్యములను అన్నింటివిగానీ, కొన్నింటివిగానీ దొరికినంత వరకు లేదా కావలసినన్ని గ్రహింపవలెను. ఈ విధముగా విరేచన ద్రవ్యముల కల్పమును సంగ్రహముగా చెప్పడమైనది. వీటిని గురించి విస్తారముగా ముందుముందు చెప్పుకొందము.

**ఆయుర్వేద దీపిక :** విక్లిప్త అనగా ద్రవ్యముల నొకదానితో నొకటి కలుపుట: అవిక్లిప్త యనగా కలుపకుండా కేవలముగా (ఒక్కొ-క్కదానినే) ప్రయోగించుట: విక్లిప్తావిక్లిప్తా అనగా సంయోగము చేసినవి చేయకున్నవి అని యర్థము. క్షీరిణీ అనగా దుగ్ధికా- (దుష్టపాలు) క్లీతకమ్-అతిమధురము: మసూరవిదల- శ్యామలతా. మొదటనిది శ్యామ, శ్యామమూలా త్రివృత్ అనియే చెప్పబడినది.

## ఆస్థాపన ద్రవ్య స్కంధము

137. ఆస్థాపనేషు తు భూయిష్టకల్పాని ద్రవ్యాణి యాని యోగముపయాన్తి తేషు తేష్వవస్థాన్తరేష్వాతురాణామ్ తాని ద్రవ్యాణి నామతో విస్తరేణోపదిశ్యమానాన్య పరిసంఖ్యేయాని స్యురతిబహుత్వాత్.ఇష్టశ్చానతిసంక్షేపావిస్తరోపదేశస్తన్త్రే, ఇష్టం చ కేవలమ్ జ్ఞానమ్.తస్మాద్రసత ఏవ తాన్యత్ర వ్యాఖ్యాస్యన్తే.రస సంసర్గవికల్పవిస్తరో హ్యేషామపరిసంఖ్యేయః సమవేతానాం రసానామంశాం శబలవికల్పాతిబహుత్వాత్.తస్మాద్ ద్రవ్యాణాం చైకదేశముదహరణార్థం రసేష్వనుభవిభజ్య రసైకైకశ్యేన చ నామలక్షణార్థం షడాస్థాపనస్కంధాః రసతోఽనువిభజ్య వ్యాఖ్యాస్యన్తే.

**తాత్పర్యము :** రోగుల యొక్క వివిధ అవస్థలను బట్టి ఆస్థాపనమునకు పయోగింపబడునట్టి అనేక కల్పములుగా కల్పించదగినట్టియు, ద్రవ్యములను అన్నింటిని పేర్కొన వలెనన్నచో యవి అపరి సంఖ్యేయములగుట వలన ఇచ్చట గ్రంథ విస్తరమగును. కావలసినవి మాత్రమే అతి సంక్షేపమును, అతి విస్తారమును కాకుండా కేవలము కావలసిన జ్ఞానమును మాత్రమే ఏ తంత్రము నందైనను పొందుపరచ వలెను. కావున ఆస్థాపన ద్రవ్యములను రసమును బట్టియే ఇచట చెప్పుకొందము. వీనియందు రసము యొక్క పరస్పర సంసర్గ వికల్పములచే యివి ఎక్కువగా నుండి లెక్కకు మించినవగును. కావున ద్రవ్యములను (ముఖ్యమైనవాటిని) కొన్నింటిని మాత్రమే చెప్పుటకు రసము నాధారము చేసుకొని వీటిని విభజించి ఒక్కొక్క రసమునకు సంబంధించిన ద్రవ్యములుగా ఆరు విధములైన ఆస్థాపన స్కంధములను చెప్పుట జరుగనున్నది.

**ఆయుర్వేద దీపిక :** భూయిష్ట కల్పాని అనగా ఎక్కువ ప్రయోగములు కలిగినవి. ఎక్కువగా ప్రయోగింప దగినవియును. ఇష్టమైన దానిని అతి సంక్షేపము గాకుండా అతి విస్తరము గాకుండనూ ఉపదేశించుట అనగా నాతిసంక్షేప విస్తర ముగా శాస్త్రమునందు చెప్పుట ఇష్టమైన విషయము. ఇష్టమైనదియును అయిన జ్ఞాన మును మాత్రమే అనగా నాతి సంక్షేప విస్తరముగా విషయము పేర్కొనుట ద్వారా ఒక్కొక్కటి చెప్పకపోయిననూ సామాన్యముగా గ్రహింపబడును. అట్టి జ్ఞానము గ్రంథకర్తకు శ్రోతకును ఇష్టమైనదని అర్థము. కాబట్టి రసమును బట్టియే అనగా రసమును ప్రధానముగా జేసికొని ఆ రసమును కలిగియుండు ద్రవ్యములను నాతి సంక్షేప విస్తరముగా ఉపదేశించుట వలన అని అర్థము. వాటిని అనగా ఆస్థాపనకు

ఉపయోగించు ద్రవ్యములను. ఇచట రసమును ప్రధానముగా చేసుకొని నిర్దేశము చేయునప్పటికీ రస సంసర్గము చాలా ఎక్కువగా నుండుట చేసి ఆరు రసములకు సంబంధించిన వాటినే పేర్కొనుట జరుగుచున్నది. ఉదాహరణార్థమ్ అనగా మధురాది రసములు ఆధారముగా కలిగిన ద్రవ్యములను దహరించుటకు. రసములయందు విభజించి అనగా మధురాది రసముల యందు ద్రవ్యములు కొన్నింటిని రసాధారముగా చెప్పి అని అర్థము. ఒక్కొక్క రసము యొక్క అనగా రస సంసర్గము కాకుండా. నామ లక్షణార్థము ఆరు ఆస్థాపన స్కంధములను అనగా ఇచట చెప్పబడిన జీవకము మొదలైన వాని పేర్లు తెలియుటకు మరియు చెప్పబడునటువంటి మధురాది ద్రవ్యములు అదే జాతికి చెంది యుండుట వలన వాని లక్షణములను తెలియుటకును ఆస్థాపనము నందుపయోగించు ద్రవ్య సమూహములను వ్యాఖ్యానించుట జరుగుచున్నది. లేదా నామ లక్షణార్థ మనగా పేర్లను తెలిసికొనుట కొరకు స్థాపించునది గావున ఆస్థాపనము. (ఆస్థాప్యతే అనేన ఇతి ఆస్థానపమ్)- జీవకాది ద్రవ్యములు. స్కంధమనగా సమూహము. రసము వలన విభజించి మధురాది రసముల వలన (ఒక్కొక్క రసమునకు సంబంధించిన ద్రవ్యములివి యని) విడివిడిగా నిర్దేశించి యని యర్థము.

138. యత్తు షడ్విధమాస్థాపనమేకరసమిత్యాచక్షతే భిషజః, తద్దుర్లభతమం సంసృష్ట రసభూయిష్ఠత్వాద్ద్రవ్యాణాం, తస్మాన్మధురాణి మధురప్రాయాణి, మధురవిపాకాని, మధురప్రభావాని మధురస్కంధే మధురాణ్యేవ కృత్వోపదేక్ష్యన్తే తథేతరాణి ద్రవ్యాణ్యపి.

**తాత్పర్యము :** ఆస్థాపనము ఒకే రస ప్రధానముగా ఆరు విధములని వైద్యులు చెప్పునది ద్రవ్యము లెక్కువగా సంసృష్ట రసములను కలిగి యుండుట వలన దుర్లభమగును. కావున మధుర ద్రవ్యములు, మధుర రసమెక్కువగా నున్న ద్రవ్యములు, మధుర విపాకము గల ద్రవ్యములు, మధుర ప్రభావము కల ద్రవ్యములునూ (ఇట్లు అన్నివిధముల) మధురమైన వగుట చేసి మధుర స్కంధమునందు చేర్చి చెప్పబడుచున్నవి. ఇట్లే ఇతర ద్రవ్యములను కూడా ఆయా రస సంబంధముగా వర్గీకరించి చెప్పబడును.

**ఆయుర్వేద దీపిక :** ఈ మధురాది రసములచే చేయబడిన ద్రవ్య సమూహము యొక్క నిర్దేశమును ఇతరులు చెప్పునట్లుగా మేమును మధురాది ఏక రస ద్రవ్యములను విభజించి చెప్పుటను ఇష్టపడము. కాని ఎచట (ఏ ద్రవ్యము

నందు) ఇతర రసములతో బాటు మధుర రస ప్రధానముగా నున్నదో లేదా మధుర విపాకాదుల వలన మధుర ద్రవ్యము చేయు పనిని చేయునో ఆ ద్రవ్యము కూడ మధురాది గణము నందే చేర్చి చదువవలెననెడిది మా యభిప్రాయము అనుటకు యత్తు షడ్విధ మాస్థాపన....అను వాక్యము ఉల్లేఖింపబడినది. అమ్లే ఇతర ద్రవ్యములు అనగా అమ్ల రసద్రవ్యములు, అమ్లరస ప్రధానముగా గల ద్రవ్యములు, అమ్ల విపాకము కల్గినవి. అమ్ల ప్రభావము కలివియును అమ్లములే యగుటజేసి అమ్ల స్కంధమున చెప్పబడును. మరియు లవణాది రస ద్రవ్యముల యందును ఇటులనే అని తెలియబరచుటకు 'అమ్లే ఇతర ద్రవ్యములును' అను పదమును ఉపయోగించ బడినది.

## ఆస్థాపనమునకుపయోగపడు మధుర స్కంధము

139. తద్యథా-జీవకర్షభకౌ జీవన్తీ వీరా తామలకీ కాకోలీ క్షీరకాకోలీ ముద్గపర్ణీ మాషపర్ణీ శాలపర్ణీ పృశ్నిపర్ణీ అసనపర్ణీ మధుపర్ణీ మేదా మహామేదా కర్కటశృఙ్గీ శృఙ్గాటికా ఛిన్నరుహా ఛత్రా అతిచ్ఛత్రా శ్రావణీ మహాశ్రావణీ సహదేవా విశ్వదేవా శుక్లా క్షీరశుక్లా బలా అతిబలా విదారీ క్షీరవిదారీ క్షుద్రసహా మహాసహా ఋష్యగన్ధా అశ్వగన్ధా వృశ్చీరః పునర్నవా బృహతీ కణ్టకారికా ఉరుబూకః మోరటః శ్వదంష్ట్రా సంహర్షా శతావరీ శతపుష్పా మధూకపుష్పీ యష్టిమధు మధూలికా మృద్వీకా ఖర్జూరం పరూషకం ఆత్మగుప్తా పుష్కర బీజం కశేరుకం రాజకశేరుకం రాజాదనం కతకం కాశ్మర్యం శీతపాకీ ఓదనపాకీ తాలఖర్జూరమస్తకం ఇక్షురిక్షువాలికా దర్భః కుశః కాశః శాలిః గున్ద్రా ఇత్కటక శరమూలం రాజక్షవకః ఋష్యప్రోక్తా ద్వారదా భారద్వాజీ వనత్రపుషీ అభీరుపత్రీ హంసపాదీ కాకనాసికా కులిఙ్గాక్షీ క్షీరవల్లీ కపోతవల్లీ సోమవల్లీ గోపవల్లీ మధువల్లీ చేతి: ఏషామేవం విధానామన్యేషాం చ మధురవర్గపరిసంఖ్యాతానాం ఔషధద్రవ్యాణాం ఛేద్యాని ఖండశశ్ఛేదయిత్వా భేద్యాని అణుశో భేదయిత్వా ప్రక్షాల్య పానీయేన సుప్రక్షాలితాయాం స్థాల్యాం సమావాప్య పయసార్ధోదకేనాభ్యాసిచ్య సాధయేద్దర్వ్యా సతతమవఘట్టయన్.

తదుపయుక్త భూయిష్ఠేఽమ్భసి గతరసేష్వౌషధేషు పయసిచానుపదగ్ధే స్థాలీముపహృత్య సుపరిపూతం పయః సుఖోష్ణం ఘృతతైలవసామజ్జలవణఫాణితోపహితం వస్తిం వాతవికారిణే విధిజ్ఞో విధివద్దద్యాత్

శీతం తు మధుసర్పిర్భ్యాముపసంసృజ్య పిత్తవికారిణే విధి వద్దద్యాత్. ఇతి మధుర స్కంధః.

**తాత్పర్యము :** జీవకము, ఋషభకము, మినుబాల, పాలమీర (జాలంధర శాకము) నేల ఉశిరిక, కాకోళీ, క్షీరకాకోలీ, అడవి పెసర, అడవి మినుము, కోలపొన్న, ముయ్యాకుపొన్న, దింటెన, మధుపర్ణి (వికంకతము-కాంద్రేగు), మేద, మహామేద, కర్కాటకశృంగి, శృంగాటికా, తిప్పతీగె, సిరుగొబ్బి, ఎర్రసిరుగొబ్బి, బోడతరము, పెద్దబోడతరము, సహదేవ, విశ్వదేవ, శుక్లా, క్షీరశుక్లా, ముత్తవ పులగము, ముద్రపెండ, నేలగుమ్మడు, పాలగుమ్మడు, కలబంద, పెద్దకలబంద, బిలాభేదము, పెన్నేరు, అటిక మామిడి, గలిజేరు, పెద్దములక, వాకుడు, ఉరుబూక, చాగ, పల్లేరు, బదనిక, పిల్లిపీచర, సదాప, నీటి అతిమధురము, అతిమధురము, నల్లద్రాక్ష, ద్రాక్ష, ఖర్జూరము, పాల్స (చిట్టీత) దూలగొండి, మెట్టతామర, నమ్మదుంప, పెద్ద నమ్మదుంప (తుంగసంబంధము) పాలచెట్టు, చిల్లగింజ, పెగ్గుమ్మడు, గురువింద, నల్లములుగోరింట, పెద్ద తాడి, పెద్ద ఖర్జూర, చెరకు, రెల్లు, దర్భ, కుశ, తిప్పరెల్లు, కిక్కిస గడ్డి, ఇత్కటమను రెల్లు, కాకిరెల్లు, చిలుకమీర, తెల్లముత్తవపులగము, చేకు, అడవిప్రత్తి, అడవిదోస, పిల్లిపీచరభేదము, హంసపాది, కాకిదొండ, నీరుల్లి, పాలతీగ, కపోతవల్లి, చిన్న యేబికలు, సోమలత, సుగంధిపాల, అతిమధుర భేదము. ఇవి మధురస్కంధ ద్రవ్యములు. ఇట్లే మధుర వర్గమునందు చెప్పబడిన ఇతర ద్రవ్యములు - వీటిలో ఛేదింపవలసిన వాటిని ముక్కలు ఛేదించి, పగులగొట్ట వలసిన వానిని సూక్ష్మముగా పగులగొట్టి బాగా కడిగిన పాత్రయందుంచి సమముగా పాలను వానిలో సగము నీరును (లేదా సగము నీరు కలిపిన పాలు) చేర్చి పొయ్యిపై నుంచి బాగుగా నొక్కి కలియబెట్టి ద్రవమునకు ఔషధ ద్రవ్యములందలి రసములు సంక్రమించునపుడు అడుగు మాడకుండ పొయ్యిపైనుండి దింపి వస్త్రగాలనము చేసి పుంచవలెను. గోరు వెచ్చగానున్న ఈ పాలలో ఘృతతైల వసా మజ్జా లవణము లను ఫాణితము చేసి వాత వికారము గలవారికి విధిననుసరించి వస్తిని ఇవ్వవలెను. పిత్త వికారులకు ఈ పాలను చల్లబరచి తేనె, నెయ్యిలను చేర్చి వస్తిగా నివ్వవలెను. ఇది మధురస్కంధము.

ఆయుర్వేద దీపిక : వీరా - జలంధరహాకము (పాలమీర), అనసపర్ణీ - దింటెన, మధుపర్ణి- కాంద్రేగు: ఛత్ర- గొబ్బి: అతిచ్ఛత్రా- ఎర్రగొబ్బి: మహాశ్రావణీ- అలంబుష (పెద్ద బోడతరము): శుక్లా- శర్కర: క్షీరశుక్లా- పెద్ద శృంగాటి

కము: క్షుద్రసహా-కుమారి: ఋష్యగందా-బలాభేదము: మోరట-వాగ: సంహర్షా-బదనిక: మధుకపర్ణి- ఇప్పభేదము: మధూలికా- మర్కటహస్తతృణము: రాజాదనము- పాల (వేంమలిక్కి): కశేరు-నమ్మ: రాజకశేరు- పెద్దనమ్మ (తుంగభేదము): శీతపాకీగురువింద (శీతలా): ఓదనపాకీ- నల్లములుగోరింట: ఋష్యప్రోక్తా- బలా భేదము: ద్వారదా-టేకు: భరద్వాజీ- అడవిప్రత్తి: వనత్రపుషీ- అడవిదోస: కులింగాక్షీ పేటిక (సీరుల్లి)— కులింగమనగా ఉచ్చట: క్షీరవల్లీ- పాలతీగె: కపోలవల్లి- కవడ వేందువ: కపోతవల్లీ - చిన్న ఏలకులు: సోమవల్లీ - సోమలతా: గోపవల్లీ - సుగంధ పాల: మధువల్లీ -అతిమధుర భేదము.

## అమ్ల స్కంధము

140. ఆమ్రామ్రాతకలకుచకరమర్దవృక్షామ్లామ్లవేతసకువలబదరదాడిమమాతులుఙ్గ-గణ్డీరామలకనన్దీతకశీతకతిన్తిడీకదన్తశఠైరావతకకోశామ్రధన్వానాం ఫలాని. పత్రాణి చామ్రాతకాశ్మన్తకచాఙ్గేరీణాం చతుర్విధానాం చామ్లికానాం ద్వయోశ్చ కోలయోశ్చ ఆమశుష్కయోర్ద్వయోశ్చైవ శుష్కామ్లికయోః గ్రామ్యారణ్యయోః ఆసవద్రవ్యాణి చ సురాసౌవీరకతుషోదకమైరేయమేదకమదిరామధుశుక్తశీధుదధిమణ్డోదశ్విద్ధాన్యామ్లాదీని చ ఏషామేవంవిధానామన్యేషాం చ అమ్లవర్గపరిసంఖ్యాతానాం ఔషధద్రవ్యాణాం ఛేద్యాని ఖణ్డశశ్ఛేదయిత్వా, భేద్యాని చ అణుశోభేదయిత్వా ద్రవైః స్థాల్యామభ్యాసిచ్య సాధయిత్వోపసంస్కృత్య యథావత్ తైలవసామజ్జాలవణఫాణితోపహితం సుఖోష్ణం వస్తి వాతవికారిణే విధిజ్ఞో విధివద్దద్యాత్.ఇత్యమ్లస్కన్ధః.

**తాత్పర్యము** : మామిడి, రాచమామిడి, నిమ్మ, ఓక, పుల్లపావిలి, పుల్ల ప్రబ్బలి, పెద్దరేగు, దానిమ్మ, మాదీఫలము, గురిజకూర, ఉశిరిక, నందీతక, చింత, వెలగ, నారింజ, పుల్లమామిడి, తడ - వీనికాయలను: రాచమామిడి, అశ్మంతక, పులిచింత, పుల్ల ప్రబ్బలి అనువాని ఆకులను, రెండు రకములైన రేగు, వీనియొక్క పచ్చివి ఎండువియైన ఆకులను, చింత, అడవిచింత వీని ఎండుటాకులను, ఆసవ ద్రవ్యములగు సుర, సౌవీర, తుషోదక, మైరేయ, మేదక, మదిరా, మధు, శీధు, శుక్త, పెరుగు, దధిమండము, పులిమజ్జిగ, ధాన్యామ్లములను: ఈ విధమైన ఇతర అమ్ల

వర్గమునందు చేర్చబడిన ద్రవ్యములను యథావశ్యకముగా ఛేదించి, నరికి, పగుల గొట్టి ద్రవభాగమును తీసికొని గట్టివానిని కషాయము కాచి, పై ద్రవముతో కలిపి తైలము, వస, మజ్జ, లవణముతో పాణితము చేసి సుఖోష్ణముగా నున్నపుడు వాత వికారములు గలవారికి విధి ప్రకారము వస్తిగా నివ్వవలెను. ఇది అమ్ల స్కంధము.

ఆయుర్వేద దీపిక : అమ్ల స్కంధమును వివరించుచున్నాడు. నందీతక- కర్పరనంది: శీతక- అమ్లలోటము (చింత): ఐరావతః— నారింజః అమ్లికా యను నది కంద ప్రధానమైనది. ఇది కామరూప దేశమున ప్రసిద్ధము. ఇది సాధారణ అమ్లికా భేదమనియే చెప్పుదురు. ద్రవైః స్థిరాణి అనగా ద్రవమునందు కలియబెట్టి నను కరుగక స్థిరముగా నుండునవి.

## లవణ స్కంధము

141. సైన్ధవసౌవర్చలకాలవిడపాక్యానూపకూప్యవాలుకైలమౌలకసాముద్రరోమ- కౌద్భిదౌషర పాపేయకపాంసుజాని అన్యేవం ప్రకారాణి చాన్యాని లవణవర్గ- పరిసంఖ్యాతాని:ఏతాన్యమ్లోపహితాని ఉష్ణోదకోపహితాని సస్నేహవన్తి సుఖోష్ణం వస్తిం వాతవికారిణే విధిజ్ఞో విధివద్దద్యాత్ ఇతి లవణస్కన్ధః.

తాత్పర్యము : సైన్ధవ, సౌవర్చల, కాలవిడ, పాక్య, అనూప, కూప్య, వాలుక, ఐలమౌలక సాముద్ర, రోమక, ఔద్భిద, ఔషర, పాపేయక, పాంసుజము— అను లవణములను లవణ వర్గమున జేరు ఇతరములైన లవణములను అమ్లద్రవము నందుగానీ, ఉష్ణోదకమునందు గానీ చేర్చి స్నేహములను కలిపి సుఖోష్ణముగా నున్నపుడు వాత వికారము గలవారికి విధి ప్రకారము వస్తిగా నీయవలెను. ఇది లవణస్కన్ధము.

ఆయుర్వేద దీపిక : కూప్యాది లవణ భేదములు ఇతర దేశములందు ప్రసిద్ధములు. కావున నివి దేశాంతరమునకు చెందినవని తెలియవలెను. రోమకమను లవణము రూమానదియందు పుట్టును.

## కటు స్కంధము

142. పిప్పలీపిప్పలీమూలహస్తిపిప్పలీచవ్యచిత్రకశృఙ్గవేరమరిచాజమోదార్ద్రకవిడఙ్గ- కుస్తుమ్బురపీలుతేజోవత్యేలాకుష్ఠభల్లాతకాస్థిహిఙ్గునిర్యాసకిలిమమూలకసర్షప-

లశునకరఞ్జశిగ్రుకమధుశిగ్రుకఖరపుష్పభూస్తృణసుముఖసురసకుఠేరకార్జక-
గణ్డీరకాలమాలకపర్ణాసక్షవకఫణిజ్ఝకక్షారమూత్రపిత్తానీతి.ఏషామేవంవిధానాం
చాన్యేషాం కటుకవర్గపరిసంఖ్యాతానాం ఔషధద్రవ్యాణాం ఛేద్యాని ఖణ్డశః
ఛేదయిత్వా భేద్యాని చాణుశో భేదయిత్వా గోమూత్రేణ సహ సాధయిత్వా
ఉపసంస్కృత్య యథావత్ మధుతైలలవణోపహితం సుఖోష్ణం వస్తిం శ్లేష్మ
వికారిణే విధిజ్ఞో విధివద్దద్యాత్,ఇతికటుకస్కన్ధః

**తాత్పర్యము :** పిప్పళ్ళు, మోడి, గజపిప్పలి, చవ్యము, చిత్రమూలము, శొంఠి, మిరియాలు, వాము, అల్లము, వాయు విడంగము, తుంబురులు, కొండగోగు, పెక్కుడు, ఏలకులు, చెంగల్వకోష్టు, నల్లజీడిగింజలు, ఇంగువ, దేవదారు, ముల్లంగి, ఆవాలు, వెల్లుల్లి, క్రానుగ, కారుమునగ, మునగ, కారుతులసి, బోదకసవు, ఎఱ్ఱ ఆవాలు, తులసి, తెల్లగెగ్గెర, కారుతులసి భేదము, కాకర, నల్లగెగ్గెర, గెగ్గెర, నల్ల ఆవాలు, మరువము, క్షారములు, మూత్రములు, పిత్తములు - వీనిని, ఇంకను కటుక వర్గమున పేర్కొన్న ఇతర ద్రవ్యములను యథావశ్యముగా ఛేద భేదము చేసి గోమూత్రముతో కలిపికాచి, సంస్కరించి, తేనె, తైలము, సైంధవ లవణము వీనిని తగురీతిన కలిపి సుఖోష్ణముగ నున్నపుడు శ్లేష్మ వ్యాధితునకు విధి ప్రకారము వస్తిగా నివ్వవలెను. ఇది కటుక స్కంధము.

**ఆయుర్వేద దీపిక :** తేజోవతి - తేజస్విని (పెక్కుడు): కిలిమం - దేవదారు.

## తిక్త స్కంధము

143. చన్దననలదకృతమాలనక్తమాలనిమ్బతుమ్బురుకుటజహరిద్రాదారుహరిద్రా-
ముస్తమూర్వాకిరాతతిక్తకటుకరోహిణీత్రాయమాణాకారవేల్లికాకరీరకరవీర-
కేబుకకటిల్లకవృషమణ్డూకపర్ణీకర్కోటకవార్తాకుకర్కశకాకమాచీకాకో-
దుమ్బరికాసుషవ్యతివిషాపటోలకుళకపాఠాగుడూచీవేత్రాగ్రవేతసవికఙ్కతవ-
కుళసోమవల్కసప్తపర్ణసుమనార్కావల్గుజవచా(వరా)తగరాగురువాల-
కోశీరాణీతి.ఏషామేవంవిధానాం చాన్యేషాం తిక్తవర్గపరిసంఖ్యాతానాం ఔషధ-
ద్రవ్యాణాం ఛేదాని ఖండశః ఛేదయిత్వా భేద్యాని చాణుశో భేదయిత్వా,-
ప్రక్షాళ్య పానీయేన అభ్యాసిచ్య సాధయిత్వా ఉపసంస్కృత్యో యథావన్మధు-

తైలలవణోపహితం సుఖోష్ణం వస్తిం శ్లేష్మవికారిణే విధిజ్ఞో విధివద్దద్యాత్. శీతం తు మధుసర్పిర్భ్యాం ఉపసంసృజ్య పిత్త వికారిణే విధిజ్ఞో విధి-వద్దద్యాత్. ఇతి తిక్తస్కన్ధః.

**తాత్పర్యము :** చందనము, వట్టివేళ్ళు, రేల, క్రానుగ (లతాకరంజ), వేప, తూబురులు, కొడిశపాల, పసుపు, మాని పసుపు, తుంగముస్తలు, వాగ, నేల వేము, కటుక రోహిణి, కలుక్రానుగ, కాకర, కరీర, గన్నేరు, దోశచ్ఛిక దుంప, పెద్దకాకర, అడ్డసరము, మండూకపర్ణి, చేదు దోస, వంగ, చేదు పొట్ల, కామంచి, మేడి, పొట్టి కాకర, అతివస, చేదుపొట్ల భేదము, చిరు బొద్ది, తిప్పతీగె, పేము, పుల్లప్రబ్బలి, కాంద్రేగు, పొగడ, వెలిచంద్ర, ఏకాకుల అరటి, మాలతి జిల్లేడు, బావంచాలు, వస, గ్రంథితగరము, నల్ల అగరు, కురువేరు, నల్లవట్టి వేళ్ళు - ఈ ద్రవ్యములను ఇంకనూ తిక్త వర్గమున చేర్చబడిన ఇతరములైన వాటిని కలిపి యథావశ్యముగా ఛేద భేదములు చేసి నీటితో కడిగి నీటిని పోసి, కషాయము తయారు చేసి సుఖోష్ణముగ నున్నపుడు దానియందు తేనె, తైలము, సైంధవ లవణము వీనిని యథావిధిగ చేర్చి శ్లేష్మ వ్యాధితునకు వస్తిగా నీయవలెను. పిత్త వ్యాధి వారికి దీనిని చల్లార్చి విధిననుసరించి వస్తిగా నివ్వవలెను. ఇది తిక్త స్కంధము.

**ఆయుర్వేద దీపిక :** తిక్త వర్గమున కర్కశము పటోల భేదము.

## కషాయ స్కంధము

144. ప్రియఙ్గ్వనన్తామ్రాస్థ్యంబష్ఠకీకట్వఙ్గలోధ్రమోచరస సమఙ్గాధాతకీ పుష్పపద్మా-
పద్మకేసర జమ్బ్వామ్రప్లక్షవటకపీతనోదుంబరాశ్వత్థభల్లాతకాస్థ్యశ్మన్తకశిరీష
శింశపాసోమవల్కతిన్దుక ప్రియాలబదరఖదిర సప్తపర్ణాశ్వకర్ణ స్యన్దనార్జు-
నారిమేదైలవాలుక పరిపేలవకదమ్బ శల్లకీ జిఙ్గినీకాశ కశేరుకరాజకశేరుక-
ట్ఫలవంశపద్మకాశోకశాలధవసర్జభూర్జశణఖరపుష్పాపురశమీమాచీ కవర-
కతుఙ్గాజకర్ణస్ఫూర్జకవిభీతకకుమ్భీపుష్కరబీజబిసమృణాలతాలఖర్జూర-
తరుణానీతి.ఏషామేవంవిధానాం చ అన్యేషాం కషాయవర్గపరిసంఖ్యాతానాం
ఔషధద్రవ్యాణాం ఛేద్యాని ఖణ్డశశ్ఛేదయిత్వా భేద్యాని చ అణుశో భేద-
యిత్వా ప్రక్షాల్య పానీయేనఅభ్యాసిచ్య సాధయిత్వా ఉపసంస్కృత్య యథా-

వత్ మధు తైలలవణోపహితం సుఖోష్ణం వస్తిం శ్లేష్మవికారిణే విధిజ్ఞో విధివద్దద్యాత్. శీతం తు మధుసర్పిర్భ్యా ముపసంసృజ్య పిత్తవికారిణే దద్యాత్. ఇతి కషాయస్కన్ధః.

**తాత్పర్యము :** ప్రేంఖణము, సుగంధపాల, మామిడిటెంకలోని జీడి, చిరుబొద్ది, తుమికి, లొద్దుగ, బూరుగ బంక, మంజిష్ఠ, ఆరెపువ్వు, పద్మము, పద్మకేశరములు, నేరేడు, మామిడి, జువ్వి, మర్రి, బోక, మేడి, రావి, నల్లచీడి, ఇరుగుడు, దిరిశెన, విరిగి, వెలిచంద్ర, ఈఁద, సారమామిడి, రేగు, చంద్ర, ఏపి, తెల్లమద్ది, నెమ్మి, మద్ది, వేగిశ, తుమ్మ, రూతురు బురమ, తుంగ ముస్తలు, కడిమి, అందుగు, గిలిగింత రెల్లు, నాగర ముస్తలు, భద్రముస్తలు, పెగ్గుమ్మడు, వెదురు, పద్మ కాష్ఠము, అశోక, చిన్నపనస, ధవ, సర్జ, భూర్జ, జనుము, జమ్మి, దేవదారు, వర గలు, చిన్నజమ్మి, పెద్దఏపి, పెద్దమాను, తాని, పొన్న, పుష్కరమూలము, తామర దుంప, తామర తూడులు, తాడి తేగలు. ఖర్జూరతేగలు, వీనిని కషాయ వర్గమున చేరు ఇతర కషాయరస ద్రవ్యములను గ్రహించి యథావిధిగా కషాయముగా కాచి సుఖోష్ణముగా నున్నపుడు తేనె, సైంధవ లవణములను చేర్చి శ్లేష్మ వ్యాధి కలవానికి, సుఖోష్ణముగా నున్నపుడును, పిత్తవ్యాధి గలవారికి తేనె నెయ్యిలను చేర్చి చల్లార్చియు విధి ననుసరించి వస్తిగా నివ్వవలెను. ఇది కషాయ స్కంధము.

**ఆయుర్వేద దీపిక :** కషాయ వర్గమున - అశ్వకర్ణము - ప్రియాల శాలము - పరిపేలవమనగా గుండ్రముగానుండు తుంగ ముస్తలు, జింగిని యనునది ఆ పేరుతోనే పిలువబడును (గిలిగింతరెల్లు). మాదీకః - దేవదారు: అజకర్ణ - శాలభేదము: కుంభీ యనునది ఆ పేరుతోనే పిలువబడును (పొన్న). దానినే హాల మని కూడ అందురు. మృణాలము - తామర తూడు: తాల ఖర్జూర తరుణములనగా తాటి తేగెలు, ఖర్జూర తేగలు. ఇక్కడ చెప్పబడిన స్కంధములలో ఒకే ద్రవ్యము రెండు స్కంధములలో చెప్పినచో అది ఆ రెండు గుణములను (రసములను) కలిగి యున్నందు వలన రెండు చోట్లనూ ఉపయుక్తమని తెలియనగును.

తత్రశ్లోకాః

145. షడ్వర్గాః పరిసంఖ్యాతా య ఏతే రసభేదతః,
ఆస్థాపనమభిప్రేత్య తాన్విద్యాత్సార్వయౌగికాన్.

146. సర్వశో హి ప్రాణిహితాః సర్వరోగేషు జానతా
సర్వాన్రోగాన్నియచ్ఛన్తి యేభ్యః అస్థాపనం హితమ్.

**తాత్పర్యము :** అస్థాపన వస్తి నుద్దేశించి రసభేదమును బట్టి ఆరుగా వర్గీకరింపబడిన ద్రవ్యములు అన్ని రోగములందును ఉపయోగించునని తెలియవలెను. ఎవరికి అస్థాపన వస్తిని ఇవ్వవచ్చునో అట్టివారికి తెలిసినవారు ప్రయోగించుటచే (అన్నింటిని లేదా సగము, లేదా దొరికినంతవరకు) అన్ని రోగములను శమింప జేయవచ్చును.

**ఆయుర్వేద దీపిక :** సార్వ యౌగికాన్ అనగా అస్థాపన వస్తిచే చికిత్సింపదగిన వాతవ్యాధి, జ్వరము, గుల్మము మొదలైన అన్ని రోగముల యందు ఆ యా దోష సంబంధమున్నపుడు ఇవి యోగించును (ఉపయోగపడును) అని అర్థము. దీనినే సర్వశోహి....అనుట ద్వారా వివరించుచున్నారు. సర్వశః అనగా వర్గమునందలి అన్ని ద్రవ్యములతో, సగము ద్రవ్యములతో లేదా దొరికినంత వరకు.

147. యేషాం యేషాం ప్రశాన్త్యర్థమ్ యే యే న పరికీర్తితాః
ద్రవ్యవర్గా వికారాణాం తేషాం తే పరికోపకాః.

148. ఇత్యేతే షడాస్థాపనస్కన్ధా రసతోఒను విభజ్య వ్యాఖ్యాతాః.

**తాత్పర్యము :** యే యే ద్రవ్య స్కంధములు యే యే దోషముల ప్రశమింప జేయునని చెప్పబడలేదో అవి ఆ యా దోషముల వికారములను ప్రకోపింప జేయును. (మధుర స్కంధము వాతపిత్త దోష జన్య రోగములు శమించుటకు చెప్పబడినది కఫజ రోగమును శమింప జేయునని చెప్పబడలేదు. అందుచే కఫ రోగమున్న వారికి మధుర స్కంధము యొక్క ప్రయోగముచే ఆ రోగము ప్రకోపించును అని అర్థము. అందువలన కఫ రోగమున్నవారికి మధురస్కంధ ద్రవ్య అస్థాపన వస్తి నిషిద్ధమని తెలియుచున్నది.) ఇట్లు ఆరు అస్థాపన స్కంధములను రసము చేత విభజింపబడి వివరింపబడినవి.

**ఆయుర్వేద దీపిక :** ఇపుడు అన్ని వర్గములు అస్థాపన సాధ్యములైన అన్ని రోగములందును ఉపయోగపడునని చెప్పబడి యున్నది. అపుడు పిత్త జ్వరమునందు కటు వర్గముతో అస్థాపన వస్తిని చేయుట పిత్తమును కలిగించుట వలన

జ్వరమును పెంచునదగును. అందువలన దోష విశేషముచే అన్ని గుణముల ఉపయోగము చెప్పబడలేదు. కాని సామాన్యముగా ఆస్థాపనవస్తిచే సాధ్యమగు రోగములందు ఉపయోజ్యముగను, దోష భేదములందు మాత్రము అక్కడక్కడ వ్యతిరేకమైన వర్గము ఉపయోజ్యము కానేకాదు అని చూపుచున్నాడు. అందు మధుర స్కంధము కఫ శాంతి కొరకు చెప్పబడలేదు. అందువలననది కఫ వర్ధకమగును. ఇట్లే అమ్లాది వర్గములకును తెలియవలెను. లేదా అన్ని రోగములందును ఉపయోగించునని చెప్పబడిన ద్రవ్య వర్గము సమానవ్యాన యోగముచేత అన్ని ఆస్థాపన సాధ్యరోగములందును లాభము నిచ్చునని తెలియవలెను. ప్రత్యేకముగా ఏ ఒక్క రోగశాంతి కొరకు కాదు. ప్రత్యేకముగా ఫలానా దోషము వలన కలిగిన వ్యాధులకు పయోగించునని చెప్పబడిన ద్రవ్యవర్గములు ఇతర దోష వ్యాధులకు నిషిద్ధములని చూపుటకు "యేషాం యేషాం"....అను శ్లోకము పుల్లేఖింపబడినది.

## పైచెప్పిన షడ్వర్గములందలి ద్రవ్యములకు అవసరమును బట్టి మార్పు చేర్పులను చేయుట

149. తేభ్యో భిషగ్బుద్ధిమాన్ పరిసంఖ్యాతమపి యద్యద్ద్రవ్యమయౌగికం మన్యేత తత్తదపకర్షయేత్ యద్యచ్చానుక్తమపి యౌగికం వా మన్యేతత తత్తద్విదధ్యాత్. వర్గమపి వర్గేణోపసంసృజేదేకమేకేనానేకేన వా యుక్తిం ప్రమాణీకృత్య: ప్రచరణమివ భిక్షుకస్య బీజమివ కర్షకస్యసూత్రం బుద్ధిమతామల్పమప్యనల్పజ్ఞానాయతనం భవతి.తస్మాద్బుద్ధిమతామూహాపోహవితర్కాః మన్దబుద్ధేస్తు యథోక్తానుగమనమేవ శ్రేయః.యథోక్తం హి మార్గమనుగచ్ఛన్భిషక్ సంసాధయతి వా కార్యమనతిమహత్త్వాద్వా వినిపాతయత్యనతిహ్రస్వత్వాదుదాహరణస్యేతి.

**తాత్పర్యము :** వీనియందు బుద్ధిమంతుడైన వైద్యుడు ఈ వర్గములలో చేర్చబడినప్పటికీ సరిపడని (ఆయా వర్గములకు చెందని లేదా ఆయా వ్యాధులకు సరిపడని) ద్రవ్యములను తీసి వేయవలెను. ఆయా వర్గములందు చేర్చబడకున్నను యౌగిక మనుకున్న (యోగ్యత కలిగియున్న) ద్రవ్యమును చేర్చుకొని ప్రయోగింపవచ్చును. ఒక వర్గము (ఇది ఒక ప్రత్యేక సముదాయమైనప్పటికీ) ఇతర వర్గముతోగానీ, వర్గములతోగానీ అవశ్యకతానుసారము కలిపి ప్రయోగింపవలెను. ఇందు

యుక్తిని ప్రమాణముగా చేసుకొని ప్రవర్తింపవలెను. భిక్షుకునకు పిడికిలి మాత్రమే వేసిన భిక్షవలె, రైతుకు స్వల్పముగానున్న బీజములవలెనూ, అల్పముగానున్ననూ సూత్రము బుద్ధిమంతునకు అనల్పజ్ఞాన మిచ్చునదగును. అందువలన బుద్ధిమంతులకు ఊహాపోహ వితర్క శక్తులుండును. అల్పబుద్ధిగలవారు మాత్రము చెప్పినంత వరకే (గ్రంథములో చెప్పినంతవరకే) అనుసరించి పోవుట మంచిది. వైద్యుడు శాస్త్రోక్త ఉదాహరణములనే అనుసరించినపుడు అవి విస్తృతముగా నున్నపుడే కార్యమును సాధింపగలడు. తక్కువగా నున్నపుడు వానిద్వారా కార్యములను సాధింపలేడు.

ఆయుర్వేద దీపిక : ఇచ్చట చెప్పబడిన వర్గములందు వ్యాధుల దృష్ట్యా యౌగికత్వమును (సరిపడుటను) దృష్టిలో నుంచుకొని, యౌగికమగుదానిని కలుపుట, అయౌగిక మగుదానిని తీసివేయుట చేయవలెనని చెప్పుచున్నాడు. బుద్ధిమంతుడు అను పదమును ఉపయోగించుటచే కలుపుట తీసివేయుట యనునది బుద్ధిమంతుడే చేయవలెనని సూచించుచున్నాడు. ఊహాపోహాదులను సాధనములు లేని అల్పబుద్ధిగల వైద్యుడీపనిని చేయలేడని గ్రహింపవలెను. ఒక వర్గమును వేరొక వర్గములోగాని అనేక వర్గములతోగాని సంయోగము చేయవలెనని తెలియనగును. యుక్తిని ప్రమాణముగా చేసికొని అనగా ఇది ఇచట యౌగికము, ఇది అయౌగికము అను ఊహను ప్రమాణముగా జేసికొని మందబుద్ధి గలవాడెట్లు అర్థము చేసుకొనును. యథోక్తమైన ఒక వర్గమునందు చేర్చబడిన ద్రవ్యమును బుద్ధిమంతుడు అయౌగికముగా (ఊహాదులచే) ఎంచి తీసి వేయునపుడు మందబుద్ధి గలవాడు దానినుపయోగించుచూ అనర్థము నెట్లు పొందకుండునని వివరించుటకు "యథోక్తం హి...." అను వాక్యము చెప్పబడినది. "అనతి మహత్త్వాద్వా వినిపాతయతి...." అనుటచేత అల్పబుద్ధి గలవాడు ఊహాదులు లేకుండా శాస్త్రోక్తముగా అనుసరించిన యెడల ఎక్కువ వ్యాపత్తు కలుగదని చూపుచున్నాడు. శాస్త్రము నందు చెప్పబడినవి బహుశః యౌగికమే యగును. ఏదో ఒకచోట శరీరము మొదలగువాని (దోషముల యొక్క అంశాంశ కల్పనా) భేదములచే అయౌగికమగును. అచటనూ స్వల్పముగా యౌగికమగునని అర్థము. "అనతి ప్రహృత్వాదుదాహరణస్య" అనగా శాస్త్రము నందు ఉదాహరణముగా చెప్పబడినవి. ఎక్కువగా (అనతి సంక్షేపముగా) నుండుట వలన. ఇందువలన రోగసాధనకు ఉదాహరణము అల్పముగా నున్నచో ఊహించవలసినదియే అధికముగా నుండును. అపుడు మందబుద్ధిగలవాడు సాక్షాత్తూ ఉదహరించిన విషయమును తెలియలేక మరియూ ఊహాశక్తి లేకయూ రోగమును శాంతింప

జేయు క్రియలను చేయజాలదు. ఎచట ఉదాహరణము లెక్కువగా నుండునో వాటి వలన ఉదాహరణము నందు చెప్పిన ప్రయోగములచేతనే అచట చెప్పబడిన వ్యాధులను సాధించును.(చికిత్సించి ఫలమును పొందునవి అనుట యుక్తము). ఈ కలుపుట తీసివేయుట అను రెండు పద్ధతులు బహుశః గణములందు చెప్పబడిన ద్రవ్యములందనియే తెలియవలెను. సుశ్రుతునిచే చెప్పబడినట్లు - ఫలానా వర్గమునందు చేర్చబడి నప్పటికినీ ఒకానొక ద్రవ్యము దానిని ప్రయోగింపవలసిన వ్యాధికి సరిపడనిదైనచో అట్టి ద్రవ్యమును తీసివేయవలెను. సరిపడునవి ఎంచిన దానిని చేర్చవలెను. (గణోక్తమపి యద్ద్రవ్యం భవేద్వ్యాధావయౌగికమ్, తదుద్ధరేత్ ప్రక్షిపేత్తు యన్మన్యేద్యౌగికం తు తత్-సుశ్రుత చికిత్సా స్థానము - 1వ అధ్యాయము) సంయోగ మహిమ చేత కార్యమును చేయు అగస్త్య హరీతకీ మొదలైన వారి యందు అపోద్ధారములు (కలుపుట, తీసివేయుట) చేయరాదు. ఈ అర్థమునే ఉద్దేశించి సుశ్రుతుడు చెప్పినట్లు ఇది ఆగమసిద్ధి కలిగియుండుట వలన అట్లే ఫలితమిచ్చుచున్నందువలననూ మంత్రము వలెనే దీనిని అనుసరించి ప్రయోగింపవలెను. ఎట్టి విధమైన మీమాంసనూ చేయరాదు. (ఏష భాగమ సిద్ధత్వాత్తథైవ ఫలదర్శనాత్. మంత్రవత్ సంప్రయోక్తవ్యో న మీమాంస్యః కథంచన- సుశ్రుత చికిత్సా స్థానము. 1 వ అధ్యాయము).

## అనువాసన ద్రవ్యములు

150. అతః పరమనువాసనద్రవ్యాణ్యనువ్యాఖ్యాస్యన్తే-అనువాసనం తు స్నేహ ఏవ. స్నేహస్తు ద్వివిధః స్థావరాత్మకో జఙ్గమాత్మకశ్చ తత్ర స్థావరాత్మకః స్నేహః తైలమతైలం చ. తద్ద్వయం తైలమేవ కృత్వోపదిశ్యతే సర్వత-స్తైలప్రాధాన్యాత్. జఙ్గమాత్మకస్తు-వసామజ్జా సర్పిరితి. తేషాం తు తైలవ-సామజ్జాసర్పిషాం యథాపూర్వం శ్రేష్ఠం. వాతశ్లేష్మవికారేష్వనువాసనీ యేషు యథోత్తరం తు పిత్త వికారేషు సర్వ ఏవ వా సర్వవికారేష్వపి చ యోగము పయాన్తి సంస్కారవిధివిశేషాదితి.

**తాత్పర్యము :** అటు తరువాత అనువాసన ద్రవ్యములను గూర్చి చెప్పు కొందము. అనువాసనము స్నేహమే. స్నేహము రెండు విధములు. స్థావరాత్మకము మరియు జంగమాత్మకము. అందు స్థావరాత్మకము తైలము అతైలము అని రెండు విధములు. ఆ రెంటినీ తైలముగానే చెప్పుకొందము. ఎందువలననగా ఎల్లెడలా తైలమే

ప్రధానముగా నుండుట జేసి.... వసమజ్జ నెయ్యి అనునవి జంగమాత్మకము. వీనిలో తైలము, వస అనునవి క్రమముగా అనువాసన వస్తి నివ్వదగిన వాత కఫ వ్యాధులందు శ్రేష్టములు. మజ్జ, ఘృతము అనునవి అనువాసన వస్తి నివ్వదగిన పిత్తవికారములందు శ్రేష్టము. అన్ని స్నేహములను, అన్ని వికారములయందును సంస్కార విధి విశేషము చేత ఉపయోగింపవచ్చును.

**ఆయుర్వేద దీపిక :** క్రమమున అనువాసన ద్రవ్యమును చెప్పబడినది తైలమనగా తైలము వంటి సర్షప స్నేహము. తైల ప్రాధాన్యత వలన అనగా స్థావర స్నేహములయందు తిల తైలమే ప్రధానమగుట జేసి అని అర్థము. ఇందువలన తిల తైలము తీయుటకే విధి యున్నదో అది సర్షము తైలము మున్నగు వాటి యందును గలదని తెలియవలెను. తైల శబ్దముచే సర్షపాదులను గూడా గ్రహించుట తిలల నుండి వచ్చు స్నేహము యొక్క ప్రాధాన్యమును ముఖ్యముగా తెలియజేయుటకు, తైల శబ్దముచే సర్షపాది స్నేహములను కూడా గ్రహించుట వాడుకయే. సుశృతునిచే చెప్పబడినట్లు—ఇతర తైలము లందును ఆ గుణములు లభించుటచే (వానిని గూడ తైలముగా గుర్తింపవలెను) (నిష్పత్తేస్తద్గుణ త్వాచ్చ తైలత్వమితరేష్వపి— సుశృత సూత్రస్థానము - 45వ అధ్యాయము).

## శిరో విరేచన ద్రవ్యములు

151. శిరోవిరేచనద్రవ్యాణి పునః— అపామార్గపిప్పలీమరిచవిడఙ్గశిగ్రుశిరీషతుం-బురుపీల్వజాజ్యజమోదవార్తాకీపృథ్వీకైలాహరేణుకఫలాని చ. సుముఖసుర-సకుఠేరకగణ్డీరకాలామాలకపర్ణాసక్షవకఫణిజ్ఝకహరిద్రాశృఙ్గవేరమూలకలశున-తర్కారీసర్షపపత్రాణి చ. అర్కాలర్కకుష్ఠనాగదన్తీవచాపామార్గశ్వేతాజ్యో-తిష్మతీగవాక్షీగణ్డీరపుష్ప్యవాక్పుష్పీవృశ్చికాలీవయస్థాతివిషామూలాని చ. హరి-ద్రాశృఙ్గవేరమూలకలశునకన్దాః, లోధ్రమదనసప్తపర్ణనిమ్బార్కపుష్పాణి చ, దేవదార్వగురుసరలశల్లకీజిఙ్గిన్యసనహిఙ్గునిర్యాసాశ్చ తేజోవతీవరాఙ్గేఙ్గుదీ-శోభాఞ్జనకబృహతీకణ్టకారికాత్వచశ్చేతి. శిరోవిరేచనం సప్తవిధం ఫలపత్ర-

మూలకన్దపుష్పనిర్యాసత్వగాశ్రయభేదాత్, లవణకటుతిక్తకషాయాణి చేన్ద్రి-యోపశయాని తథాఽపరాణ్యనుక్తాన్యపి ద్రవ్యాణి యథాయోగవాహితాని శిరో-విరేచనార్థ ముపదిశ్యన్త ఇతి.

**తాత్పర్యము :** శిరో విరేచన (నస్య) ద్రవ్యములు- ఉత్తరేణు, పిప్పలి, మిరియము, విడంగము, మునగ, మోదుగ, తుంబురులు (ధనియముల వలె ఎట్టిగా నుండునవి), వరగోగు, జీరకము, వాము, వంగ, వృద్వీక, ఏలా, రేణుకలు— వీని యొక్క ఫలములు: సముఖ (ఎఱ్ఱ ఆవాలు), తులసి, కాకర, గగ్గెర, నల్లగగ్గెర, ఆవాలు, మరువము, పసుపు, అల్లము, ముల్లంగి, వెల్లుల్లి, నెల్లి, ఆవాలు వీని ఆకులు: జిల్లేడు, తెల్ల జిల్లేడు, చెంగల్వకోష్ఠు, వస, తెల్ల గురువింద, జోతిష్మతి, ఖరణిక, కాకర, బ్రహ్మదండి, తేలుమణి, సరస్వతి, అతివస— వీనియొక్క వేళ్ళు: పసుపు, అల్లము, ముల్లంగి, వెల్లుల్లి వీనియొక్క దుంపలు: లొద్దుగ, మంగ, ఏడాకుల అరటి, వేప, జిల్లేడు— వీటి పువ్వులు: దేవదారు, అగరు, సరళ దేవదారు, అందుగు, నల్ల బూరుగ, వేగిస, ఇంగువ చెట్టు— వీని నిర్యాసములు: వెక్కుడు, లవంగము, గార, మునగ, పెద్ద ములక, చిన్న ములక— వీని పట్టలు. ఇవన్నియు శిరో విరేచన ద్రవ్యములు. శిరో విరేచన ద్రవ్యము లీవిధముగా ఆశ్రయ భేదమున ఏడు విధములు— ఫల, పత్ర, మూల, కంద, పుష్ప, నిర్యాస, త్వక్కులు. లవణ కటుతిక్త కషాయరసములను కలిగి ఇంద్రియముల కనుకూలమైనవియు ఇంకను చెప్పబడ కున్ననూ యోగత్వమున్న వనుకొన్నవియూ ద్రవ్యములను శిరో విరేచనమునకు ఉప యోగింపవచ్చును.

**ఆయుర్వేద దీపిక :** చివరగా శిరో విరేచన ద్రవ్యములు చెప్పబడినవి. ఫలములను కూడ అని "చ" కార (కూడా) ప్రయోగముచే ఫలగ్రాహ్య ద్రవ్యముల ఇతర అంశములను కూడా గ్రహింపవచ్చునని చూపబడినది. అందువలన మునగ చెట్టు గింజలే కాకుండా పట్టకూడా ఉపయోజ్యమే. (పట్టలను చెప్పు సందర్భము నందును మునగచెట్టును కూడా ఉదహరించడమైనది). సుముఖాదులు - పర్ణాసభేద ములు: తర్కారీ-నెల్లి (జయన్తీ): గంధీర పుష్పి-శమతము (కాకర), వయస్థా -

బ్రాహ్మీ: వరాంగం-గుడత్వక్-దాల్చిన చెక్క: ఇంద్రియములకు సుఖమును కలిగించునవి అనగా- ఏ ద్రవ్యములు ఇంద్రియములకు విఘాతము కల్గింపవో (లవణాదులు) వాటినే శిరో విరేచనముగా నుపయోగింపవలెను. ఇంకను ఇతరములను అనగా మధురామ్ల కషాయ రసములున్న ద్రవ్యములను కూడా నశ్యకర్మ (శిరో విరేచనము) నందు యౌగికములని యెంచినచో వాటిని గూడా (ప్రయోగింపవలెను).

## అధ్యాయ సంగ్రహము

తత్రశ్లోకాః —

152. లక్షణాచార్యశిష్యాణాం పరీక్షా కారణం చ యత్,
అధ్యేయాఽధ్యాపనవిధీ సంభాషావిధిరేవ చ.

153. షడ్భిరూనాని పంచాశద్వాదమార్గపదాని చ,
పదానిదశ చాన్యాని కారణాదీని తత్త్వతః.

154. సంప్రశ్నశ్చ పరీక్షాదేర్నవకో వమనాదిషు
త్రివిధరోగవిశేషవిజ్ఞానీయే రోగాణాం విమానే సంప్రకాశితః.

**తాత్పర్యము :** శాస్త్ర ఆచార్య శిష్యులయొక్క పరీక్ష, తత్కారణము, అధ్యయన అధ్యాపన విధులు, మరియు సంభాషా విధి, నలుబది నాలుగు (అరు తక్కువ ఏబది) వాదమార్గ పదములు, వాని తత్త్వములతోబాటు (లక్షణములతో బాటు) కారణాది పది సంజ్ఞలు, వమనాదుల విషయమున తొమ్మిది ప్రశ్నలు- వీట న్నింటి రోగ భిషగ్జితీయ విమానాధ్యాయమున తేటతెల్లముగా వివరించుట జరిగినది.

**ఆయుర్వేద దీపిక :** లక్షణాచార్య శిష్యుల యొక్క అనగా శాస్త్ర, ఆచార్య, శిష్యుల యొక్క లక్షణమే శాస్త్రమనబడును. దాని కారణమునూ అనగా శాస్త్రాదులను పరీక్షించుటకు కారణమేదియో దానిని కూడా అని యర్థము. "ఇటు వంటి గుణములున్న శాస్త్రము నిర్మలముగనున్న ఆకాశములోని సూర్యునివలె ...". ఈ మొదలైనది శాస్త్ర పరీక్షా కారణము. ఆచార్య పరీక్షా కారణము "ఇటువంటి

ఆచార్యదే" మొదలగు వాక్యమున చెప్పబడినది. శిష్య పరీక్ష కారణము 'నేర్ప వలసినది నేర్పుటకు ఆచార్యుడు' ఈ మొదలైన వాక్యములందు గలదు. (ఇవి ఈ అధ్యాయముననే మొదట ఉల్లేఖింపబడినవి) అధ్యేయము అనగా చదువవలసినది. దాని విధానము అధ్యయన విధి యనబడును.

155. బహువిధమిదముక్తమర్థజాతం బహువిధవాక్యవిచిత్రమర్థకాంతం
బహువిధశుభశబ్దసంధియుక్తం బహువిధవాదనిసూదనంపరేషామ్.

156. ఇమాం మతిం బహువిధహేతుసంశ్రయాం విజజ్ఞివాన్ పరమతవాదసూదనీమ్.
న సజ్జతే పరవచనవమర్దనైర్న శక్యతే పరవచనైశ్చ మర్దితుమ్.

157. దోషాదీనాం తు భావానాం సర్వేషామేవ హేతుమత్,
మానాత్ సమ్యగ్విమానాని నిరుక్తాని విభాగశః.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే విమానస్థానే రోగభిషగ్జితీయ విమానం నామాష్టమోఽధ్యాయః (అగ్నివేశకృతే తంత్రే చరకప్రతిసంస్కృతే అనే నావధిస్థానం విమానాంసమర్థితమ్.)

**తాత్పర్యము :** ఇచట బహు విధములుగా అర్థముల నిచ్చునట్టి వాక్యము లును, విచిత్ర అర్థముల నిచ్చునటువంటి అనేక శుభ శబ్దములతో సంధులతోనూ కూడుకొన్నట్టియూ, అనేకములైన ఇతరుల వాదములను ఖండించునట్టియూ విషయములు చెప్పబడినవి. అనేక హేతువుల నాధారముగా చేసికొన్నట్టియూ ఇతరుల వాదనలను ఖండించి జయించుటకు అనుకూలమైన ఈ విషయములను తెలిసికొన్న వాడు పరవచనములను ఖండించుటయందు వెనుకాడడు. పరవచనములచే ఓడింప బడలేడు. (వీనిని ఓడించుట కష్టము) దోషాది భావములనన్నింటినీ సహేతుకముగా విశిష్టమైన ప్రమాణములను కొలత వేసి సరియైన విభాగములుగా విభజించి వివరించడ మైనది.

ఇది అగ్నివేశునిచే రచింపబడి చరకునిచే ప్రతిసంస్కరింపబడిన తంత్రమున ఇప్పటివరకు విమానముల (విశిష్ట మానముల) స్థానమును అర్థవంతముగా చెప్పడ మైనది.

ఆయుర్వేద దీపిక : ఇచట అర్థవంతములైనవి చెప్పబడినవి అనగా- శాస్త్ర, ఆచార్య, శిష్య పరీక్షాది రూపమును పేర్కొనుట వలన కలిగిన అర్థము. అర్థకాంతమనగా-సంబద్ధమైన అర్థమును కలిగియుండుట మొదలగువానిచే కమనీయమైన అర్థము కలుగును. అది చెప్పబడినది. శబ్దమును వాక్యమునందు సరిగా ఉపయోగించుట శబ్ద సంధి. దోషాదీనాం....అను వాక్యము ద్వారా విమాన స్థానమును సంగ్రహము చేయుచున్నాడు. సహేతుకముగా అనగా సకారణముగా ఎట్లు అగునో అట్లు దోషాదిమానములను సకారణముగా అని అర్థము. నిరుక్తాని అనగా నిరుక్తి చేసి చెప్పబడినవి. విమాన శబ్ద నిరుక్తి-దోషాదులు వేనివలన విశేషముగా తెలియబడునో అవి విమానములు.

ఇది శ్రీ చక్రపాణిచే రచింపబడిన ఆయుర్వేద దీపికయను చరక తాత్పర్య టీకయందలి విమాన స్థానమున రోగభిషగ్జితీయ విమానమను ఎనిమిదవ అధ్యాయము. ఇట్లు విమానస్థానము ముగిసినది.

ఇది పావులూరి హిమసాగర చంద్రమూర్తిచే చేయబడిన చరక విమాన స్థానమునందలి మూలము మరియు చక్రపాణి వ్యాఖ్యలకు తెలుగు అనువాదము.